SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

సుబ్బరాయ్య, పోతుకూచి.

ఆంధ్రవాణీసామ్రాజ్యము అను
శ్రీకృష్ణదేవరాయులు

రాయవరము, 1936.

Record no. 48

Subbarāya, Pōtukūci.

Āṃdhravāṇīsāmrājyamu anu Śrīkṛṣṇadēvarāyalu

Rāyavaramu, 1936.

Record no. 48

Bibliographic Record Target

సుబ్బయ్య, పోతుకూచి.

ఆంధ్రవాణీసామ్రాజ్యము అను శ్రీకృష్ణదేవరాయలు :: అయిదంకముల తెలుగు నాటకము / గ్రంథకర్త పోతుకూచి సుబ్బయ్య. - రాయవరము : శ్రీ మేరీ ముద్రాక్షరశాల, 1936.

79 p. ;19 cm.

Record no. 48

Subbayya, Pōtukūci.

Āṃdhravāṇīsāmrājyamu anu Śrīkṛṣṇadēvarāyalu :: ayidaṅkamula telugu nāṭakamu / granthakarta Pōtukūci Subbayya. Rāyavaramu : Śrī Mērī Mudrākṣaraśāla, 1936.

79 p. ;19 cm.

Record no. 48

శ్రీ

ఆంధ్రవాణీసామ్రాజ్యము

అను

శ్రీకృష్ణదేవరాయలు



BY

HI SUBBAIAH, M. A., L. T.

॥ శ్రీ ॥

ఆంధ్రవాణీ సామ్రాజ్యము

శ్రీకృష్ణదేవరాయలు

[అయిదంకముల తెలుఁగు నాటకము]

గ్రంథకర్త

[illegible] సుబ్బయ్య, ఎం. ఏ. ఎల్. టి.



తృతీయ ముద్రణము 1000 ప్రతులు

రాయవరమున

ముల్లిడి సత్తిరెడ్డిగారి శ్రీ మేరీ ముద్రాక్షరశాల యందు

పునర్ముద్రితము,

1936

[illegible]] [వెల రు 1-12-0

ప్రకాశకుని విజ్ఞప్తి

ఈ నాటకరాజమును గ్రంథకర్తలగు శ్రీ పో[illegible] పంతులుగారు చాలకాలము క్రిందటనే నాకందఁజేసినను బ్రథమ ప్రచురణమునకు నేను గావించిన యాలస్యమునకు మన్నించి శీఘ్రమే ద్వితీయ తృతీయ ముద్రణముల కవకాశము కలిగించినందుల కాంధ్ర పాఠకులకుఁ గృతజ్ఞుఁడను.

ఇట్లు

చేబియ్యం వెంకట్రామయ్య

పబ్లిషరు

శ్రీకృష్ణదేవరాయలు నాటకమునందు వచ్చు పాత్రలు

పురుషులు

శ్రీకృష్ణదేవరాయలు:— కథానాయకుడు
తిమ్మరుసు:— మంత్రి
ప్రతాపరుద్రగజపతి:— కళింగచక్రవర్తి; జగన్మోహిని తండ్రి
వీరసింహుడు:— గజపతి మేనల్లుడు

అల్లసాని పెద్దన్న:— }
తెనాలి రామలింగడు:— } కవీశ్వరులు

తాతాచార్యులు:— రాయలవారి గురువు
రామలింగప్ప నాయకుడు:— సేనానాయకుడు

కవులును, సైనికులును, సేవకులును సందర్భానుసారముగా వత్తురు.

స్త్రీలు

భద్రాన్నపూర్ణ (జగన్మోహిని):— కథానాయకురాలు
సరళ:— చెలికత్తె
[illegible]:— సేవకురాలు

నాంది

[సూత్రధారుండును నటుండును ప్రవేశింతురు]

సూత్ర:—



శ్రీవిద్యానిలయేశ్వరుండగు హరిగిన్
జేపట్టి సారోదయ
ప్రావంబున్ నరసింహభూతుడయి
యుగ్రద్విడ్గజాధీశులం
దా వేగన్ గురుశక్తితో గెలిచి భద్రం
బొంది శ్రీకృష్ణదే
వాభిఖ్యానముఁగొన్న రాఘవుడు
లోకాళిన్ సదా బ్రోచుతన్.

నటు:— బావా! తిరిగి యొకసారి చదువుము.

సూత్ర:—(తిరిగి చదువును)

నటుడు:— నేఁ డెంతసుదినము! శ్రీకృష్ణదేవరాయలవారి కథ జ్ఞప్తికి వచ్చుచున్నది. ఆంధ్రభోజుండైన యా మహాచక్రవర్తి పవిత్ర చరిత్రము లోకవిస్మృతమయ్యెనుగదా!

సూ:— విస్మృతంబైన యా మహామహుని చరితంబును పునరుద్ధరణముచేసి యొక భాషాసేవకుఁడు నాటకరూపముగా రచించెను.

నటు:— ఆంధ్రుల కానందదాయకంబగు నా నాటకరాజమును రచించిన భాషాసేవకుఁ డెవరోగదా!

సూ: సీ. ఆంగ్లికాంధ్రభాషా విద్యాపీఠ
బిరుదాంకితంబుల వెలయు నతఁడు
రాజును మెప్పించి వరపురనివాసుఁడు
నాంధ్ర భాషా సేవ నలుపునతఁడు
నాంధ్ర దేశంబున ఖ్యాతిఁగొన్నట్టి శ్రీ
కృష్ణతులాభారి కృతికిఁ గర్త
వర పోతుకూచి శ్రీనివాసార్యుఁడు
సుబ్రహ్మణ్యుఁడతఁడు వర ప్రసూతి

తే. గీ. విప్రకులదీపకులగు సూర్యప్రకాశ
సుబ్బమాంబలకును జ్యేష్ఠసుతుఁ డతండు
సుబ్బలక్ష్మికిఁ బెనిమిటి సుజనహితుఁడు
ననిశమును రామభక్తుఁడై యలరునతఁడు.

నటు:—ఓహో! యాయనను గుఱించి వేఱె చెప్పనక్కరలేదు. ఆ నాటకముపే రేమి?

సూ:—శ్రీకృష్ణదేవరాయలవారి యాంధ్రవాణీ సామ్రాజ్యోత్సవము సాక్షిప్తముగా శ్రీకృష్ణదేవరాయ లని పిలువఁబడుచున్నది.

నటు:—అదిగో రాజకీయాహ్వానము వినఁబడుచున్నది. శీఘ్రమే పోయి యాలకింతము.

(నిష్క్రమింతురు)

శ్రీ

శ్రీకృష్ణదేవరాయలు

[మంగళవాద్యములతో బ్రాహ్మణుఁడు ప్రవేశించును]

బ్రా:—శ్రీకృష్ణదేవరాయలవారి యాహ్వాన మేమనఁగా:—

సీ. రాజరాజనరేంద్ర రాజమహేంద్రవరమున
బాలనై గంతులునై చెనవతె
దక్షిణాధీశు ముత్యాలమండపమున
స్వర్ణాభిషేకంబు వడసెనవతె
బమ్మెరపోతరాజమ్మ నేమోయని
కాటుకకన్నీరు కార్చెనవతె
స్వేచ్ఛమై నలసాని పెద్దనార్యునియింట
ముద్దులగుమ్మనై మురిసెనవతె

తే. గీ. యట్టి యాంధ్రవాణికి రాయలాంధ్రభోజుఁ
డమరఁజేయు సామ్రాజ్యోత్సవములఁ జూడఁ
గవివరులుఁ బండితులును ప్రేక్షకులుఁ గూడి
రండహో! స్వాగతంబిదే! రండు! రండు!

(మేళము వాయింతురు)

సీ. నన్నయాదికవిపుంగవ సముత్పన్నమా
భారత మధుర పర్వములఁ దఱచి
పోతనామాత్యుఁడు ప్రోదిచేసిన కృష్ణ
లీలామృతము సమ్మిళితముఁ జేసి
భాస్కరాదికవి ప్రవరనుత శ్రీరామ
మహితకల్పలతాంత మధువుఁ జేర్చి
శ్రీనాథకవిసమార్జిత సౌరభోపేత
వివిధపుష్ప మధురాసవముఁ గలిపి

తే. గీ. యాంధ్రవాణీ ప్రసాదంబు నాంధ్రభోజుఁ
డాంధ్రుల కొసంగుచున్నవాఁ డాదరమునఁ
గవి నరులుఁ బండితులును ప్రేక్షకులుఁ గూడ
రండహో! స్వాగతంబిదే! రండు రండు.

(నిష్క్రమింతురు)

రెండవ రంగము—రాజవీథి

తిమ్మ:—[ప్రవేశించి] అహో! ప్రథమయామ మతిక్రమించుచున్నది. సభామంటపము పండితులచేతను, గవీశ్వరులచేతను నిండి యున్నది. రాయలవారేలకో యింతవరకును సభామండపమునకు వేంచేసియుండలేదు. కారణంబరయఁజాల. (అటు నిటుఁ జూచి) అల్లదే యుద్ధచారుండొకఁడు నావైపునకే పరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు. ఈతఁడు రామలింగప్పనాయకుఁడుగఁ దోఁచుచున్నయది.

రామ:—[ప్రవేశించి] తిమ్మరుసు మహామంత్రి శిఖామణులకు జయము! జయము!

తిమ్మ:—రామలింగప్పనాయకా! నీయుదంతముకొఱకు మేమందఱమును వేచియున్నాము.

రామ:—దేవా! ఏమని విన్నవింతును. ఉత్కలేశ్వరుండగు ప్రతాపరుద్రగజపతి యాంధ్రదేశమును రూపుమాపఁదలఁచి బీజపూరు, గోల్కొండ సుల్తానుల సాహాయ్యముగోరి వారితో సంధి జేసికొనెనఁట. యుద్ధసన్నాహములు మిక్కిలి శ్రద్ధగా జరుగుచున్నవి. ఉభయపక్షములవారును కృష్ణాతీరమునఁ గలియుటకు నక్కడనుండి యాంధ్రదేశమును గొల్లగొట్టుటకును స్థిరపరచుకొని యున్నారఁట.

తిమ్మ:—(కోపముతో) ఏమి! చూచెదనుగాక. గజపతి యాంధ్రదేశమును రూపుమాపనై యున్నాఁడుగా! ఆంధ్రులే యంతటి పౌరుషహీనులా? దేశాభిమాన మిసుమంతయు లేక గజపతి బీజపూరు, గోల్కొండ సుల్తానులతో సంధిజేసికొనియున్నాఁడుగా! చిరకాలమునుండి యాంధ్రుల మనముల రగులుచున్న యా పరిభవానలంబునకు గోల్కొండ సంధి యింధనమై యా కారు

చిచ్చు గజరాజుపై వెడలుఁగాఁత! ఈ తిమ్మరుసు బొందెలోఁ
బ్రాణంబులున్నంతవరకు రాయలవారి కపజయంబు రానిత్తునే!
ఆంధ్రుల ప్రతాప మెఱుఁగఁడుగాఁబోలుఁ బ్రతాపరుద్రగజపతి.

సీ. మఱచెనుగాఁబోలు మదపుటేనుఁగువోలె
నాంధ్రులు రణసింహు లనెడుమాట
యెఱుఁగఁడుగాఁబోలు నీ తిమ్మరుసు ప్రాణ
మాంధ్రుల కర్పించు ననెడుమాట
తెలియఁడుగాఁబోలుఁ గలలనైనను రాయ
లపజయంబును బొందఁ డనెడుమాట
తలఁపఁడుగాఁబోలుఁ దన మోసమున కాంధ్ర
జనని కుందుచునున్న దనెడుమాట

తే. గీ. భండనంబునఁ జాడప్రచండ కాండ
ఖండితాఖిల శత్రుప్రకాండముగను
దండులను కరితండముల్ చెండుచుండ
నాంధ్రుల బలంబుఁ జూపెద నవనిలోన॥

(నిష్క్రమింతురు)

మూఁడవ రంగము—రాయల శయనాగారము

[రాయలు పటము లిఖించుచు నగపడును]

శ్రీకృష్ణ:—స్వప్నదృష్టయైన యీ జగన్మోహిని సౌందర్య మేమని వర్ణింతును.

సీ. చక్కని పూఁబోణి చెక్కుటద్దములపైఁ
బాడువెన్నెలనవ్వు ప్రతిఫలింపఁ
బూర్ణచంద్రునిఁబోలు పొలతుక మోముపై
నిందీవరసమాక్షు లినుమడింప

నలఁతియౌ కౌఁదీఁగె నలయించు నురముపై
జవ్వనంపు మెఱుంగు సందడింప
మేలిమిబంగారు మించు మైఁగాంతిపై
నవరత్నముల ప్రభల్ నాట్యమాడ

తే. గీ. పలుకుపలుకునకును దేనె లొలుకునట్లు
ముద్దుపలుకుల మురిపించె మోహనాంగి
కలదె యిట్టిసుందరి త్రిలోకములనైన
నెట్లు సృజియించెనో బ్రహ్మ యిట్టిదాన.

(ఘంటానాదము విని) ఓహో! ఎంతజాగు చేసితిని! ఈ వచ్చుచున్న వార లప్పాజియై యుండనోపు.

శ్రీకృష్ణ:—(లేచి నమస్కరించును)

తిమ్మ:—[ప్రవేశించి] దిగ్విజయమస్తు.

శ్రీకృష్ణ:—ఏల మీరీపాతాళమార్గమున నరుదెంచితిరి?

తిమ్మ:—మహారాజా! ఆంధ్రవాణీ సామ్రాజ్యోత్సవమునకై సామంత రాజులును, సచివులును, పండితులును, కవీశ్వరులును వేంచేసి దేవర దర్శనార్థమై నిరీక్షించుచున్నారు. దేవర యింత వరకు దర్శన మీయకుండుట కేమికారణమో తెలియక తొట్రుపడుచుంటిమి.

శ్రీకృష్ణ:—అప్పాజీ! యాంధ్రవాణీసామ్రాజ్యోత్సవము ప్రస్తుత మాపవలసి వచ్చునేమో?

తిమ్మ:—ఏల?

శ్రీకృష్ణ:—కడచినరాత్రి నేనొక యద్భుతస్వప్నంబు గాంచితిని. ఒక దివ్యాంగన నాకుఁ గాన్పించి "వత్సా! నే నాంధ్రమాతను, ఉత్కలాధీశుని దాసినైయున్న నాకు సామ్రాజ్యోత్సవమేటికి? నా దాస్యమును మాన్పవా!" యని యేడ్వసాగెను. నేనభయ

మొసంగి "తల్లీ! నీదాస్యంబుమాన్పి నాజన్మసాఫల్యంబు జేసి కొనెద" నని విన్నవించినంతనే యాతల్లియానందించి "శుభం బగుఁగాత" యని దీవించి యొక సర్వాంగసుందరిని దీసికొని వచ్చి నాకుఁ బాణిగ్రహణము గావించెను. ఆరమణీలలామయు నత్యంతానురాగమున నామెడలో నొక పూలదండ వైచెను. పైనుండి పుష్పవర్షము గురిసె. నేను మేల్కాంచి యాకన్య నిందు లిఖించితి. (పటమును జూపి) జగన్మోహినియైన యీ కన్య యెవరై యుండనోపును?

తిమ్మ:—స్వప్నకాంతను గూర్చియేనా రాయలవారింత మోహపడు చున్నవారు? (పటమును బరిశీలించి) సందియమేల? ఈమె వైఖరిఁజూడ కళింగరాజతనయమైయుండునని నాకుఁ దోఁచు చున్నది. పాటకునివేషమున మన చారాధిపతిని బంపి యామె యుదంతమును దేవరకు నివేదించెదనుగాక.

శ్రీకృష్ణ:—అప్పాజీ! గజపతులతో మైత్రి యసంభవముగదా!

తిమ్మ:—దైవసంఘటనమున్నచో నసంభవ మేమున్నది. ఆంధ్ర వాణియే మీకుఁ బాణిగ్రహణంబు గావించియుండెనుగదా!

శ్రీకృష్ణ:- నేనాజననికి దాస్యవిమోచనఁజేయుటకుఁ బ్రతినజేసియుంటిని.

తిమ్మ:—దేవరవారాంధ్ర దేశమును గజపతులనుండి జయింతురేని నాంధ్ర వాణీదాస్యమును మాన్పుటయేగాక సాళువనర్సరాయల కాత్మశాంతిని గావించిన వారలగుదురు. ఈ విజయనగరాధీశు లలో నెవ్వ రుదయగిరి, ముద్గల్లు, రాయచూరు దుర్గములను సాధింతురో వారు తనకాత్మశాంతి గావింతురని సాళువ నర్స రాయలు శాసనము లిఖించియుండెను.

శ్రీకృష్ణ:—బలే! ఆ శాసనముగూడ నాంధ్రవాణీదాస్యవిమోచనము నకుఁ బ్రోత్సహించుచున్నది. అప్పాజీ! బీజపూరు గోల్కొండ యుదంతమేమైనఁ దెలియవచ్చినదా?

తిమ్మ:—మనము బీజపూరు పంపిన రామలింగప్ప నాయకుఁ డిప్పుడే యుదంతమును దెచ్చియున్నాఁడు. బీజపూరుసుల్తానుతో సంధిఁ జేసికొని గజపతి యాంధ్రదేశముపై దండెత్తి రావుమాపనై యున్నాఁడఁట.

శ్రీకృష్ణ:—అప్పాజీ! గజపతి యెంతదేశద్రోహి! సాటివారిపై దండ త్తుటకై యన్యుల సాయముఁ గోరుచున్నాఁడుగా!

తే. గీ. ఐకమత్యంబులేక పోరాడువార
లొండొరులను సాధింప నన్యులనుగోరి
చిట్టచివరకు శత్రులచేతఁజిక్కి
యందఱును హతులౌట తథ్యంబుగాదె.

మన సేన లన్నియు యుద్ధసన్నద్ధములై యున్నవిగదా!

తిమ్మ:—సంసిద్ధములుగనే యున్నవి. గోల్కొండ, బీజపుర సైన్యం బులు గజపతిని జేరకమునుపే మన మీ యుత్కలదేశము నాక్రమింపవలయును.

శ్రీకృష్ణ:—అప్పాజీ! సర్వసైన్యాధిపత్యము వహించుటకు మీ కంటె యోగ్యులెవ్వరు!

సీ. అఖిలదేశంబుల కాదర్శకంబుగా
నీ యాంధ్రదేశంబు వృద్ధిపఱచి
యడుగంటియున్న యీ యాంధ్రప్రతాపంబు
నెల్లదిక్కులయందు వెల్లడించి
కంటకంబులువోలె క్ష్మాతలి నలమిన
శత్రుభాధవుల నాశనముజేసి
ప్రజలకందఱకును భాగ్యంబువెదజల్లి
యనురంజకముగ రాజ్యంబుదిద్ది

తే. గీ. ఆంధ్రదేశోద్ధరణ మహోద్యమమునకొఱకు
నవతరించితివో సచివావతంస
సర్వ సైన్యాధిపత్యంబు నిర్వహింపఁ
బాత్రులెవ్వరు మీకంటె బ్రహ్మతేజ!

తిమ్మ:—అంతభారము వహించుటకు నే నెంతవాఁడను. క్షత్రియ వీర శిఖామణు లనేకులు గలరు.

శ్రీకృష్ణ:—అది నాకుమాత్రము తెలియదా! ద్రోణాచార్యులఁబోలె సామ, దాన, భేద, దండోపాయంబులందుఁ జతురమతులైన మీరే యీ పదవి నలంకరింప నర్హులరు.

తిమ్మ:—దేవర యాజ్ఞ యనుల్లంఘనీయము. భోజరాజు ముఖముఁ జూచినతోడనే కవిత్వమబ్బినట్లు దేవర సాన్నిధ్యమున విజయోత్సాహములు జనింపక మానవు.

శ్రీకృష్ణ:—(నక్షత్రాంకితమగు హారమును తిమ్మరుసు మెడలో వైచి చిరునవ్వుతో) ఇదిగో! మీకు సర్వసైన్యాధిపత్యము నొసంగినాఁడను. ఇంతటినుండి రణరంగమున నేనును మీ యాజ్ఞకు బద్ధుఁడనే.

తిమ్మ:—ఇదియాతయు దేవర క్రీగంటి ప్రసాదమే.

శ్రీకృష్ణ:—భవిష్యత్కార్యక్రమ మాజ్ఞాపింపుఁడు.

తిమ్మ:—తొలుదొల్త నుదయాద్రిని స్వాధీనముచేసికొని క్రమముగా మన ముత్కలేశ్వరుని దుర్గమును జయింపవలయును. ప్రస్తుతము పదునాల్గువేల కాల్బలము నెనిమిదివందల యేనుఁగులును మనల ననుగమింపఁగలవు.

శ్రీకృష్ణ:—అప్పాజీ! యటు చూడుము. మన తాతాచార్యులవారిపై నెవ్వఁడో యెక్కి స్వారిచేయుచున్నాఁడు.

తిమ్మ:—భటులను బంపి యా దుష్టుని శిక్షింతము.

నాల్గవ రంగము—కృష్ణరాయల ప్రాసాద బహిరంగప్రదేశము

(తాతాచార్యుల భుజములపై తెనాలిరామలింగఁ డధిరోహించి స్వారిచేయుచుండును)

తెనాలిరామలింగఁడు:—చల్ చల్. బలే వహ్వా! (వేపరెమ్మతో తాతాచార్యుని బాదుచుండును)

తాతాచార్యులు:—నీకు దండమురా, రామలింగమూ! నడుఁలొక్కొని పోతోందిరా బుజాలు పీక్కుపోతున్నవిరా! ఒక్కసారిదిగుదూ.

తె॥ రా:—ఊఁ. చల్. (కొట్టుచు) మాటలెఱిగిన వాహనము అయినందువల్ల కవిచీకట్టు అనవసరము. ఇదీ సదుపాయమే. చలో! [కొట్టుచు] కుడి. ఎడమ. కుడి. ఎడమ.

తాతా:—నీ కోరిక తీర్చెదనురా, రామలింగమూ ఒక్కసారిదిగుదూ.

తె॥ రా:—రాయలవారి దర్శనం చేయించమని నిన్నాఱుమాసాల నించి ప్రార్థిస్తావుంటే కొంచెమూ లక్ష్యపెట్టినావుకాదుగదా. అంతకింతా యనుభవించవలసిందే ఊరికేపోతుందా? (పైకి జూచి తనలో) అల్లదే రాయలవారు యిదంతయుఁ జూచుచున్నారు. సేవకుల కేదియో యాజ్ఞాపించుచున్నారు. నేను తాతాచార్యులమీఁద నెక్కుట రాయలవారికి కోపకారణము. అందున నాకు దండన నిశ్చయము. [ప్రకాశముగ] చల్. చక్రపొంగలి పులిహోరా! బాగా అరుగుతోందా, చల్. చల్. [కొట్టును]

తాతా:—రేపు తప్పక రాయలదర్శనం చేయిస్తానురా రామలింగమూ! ఒక్కసారి దిగరా మోయలేకుండా ఉన్నాను.

తె॥ రా:—(తనలో) "యేన కేనా ప్యుపాయేన ప్రసిద్ధః పురుషో భవేత్" అనునట్లు రాయలవారి కేదియోవిధమున నన్నుగుఱించి తెలి

యకమానదు. ఆలసించిన లాభములేదు. [దిగి తాతాచార్యులకు ముమ్మారు ప్రదక్షిణము చేసి ప్రకాశముగా] తాతా! నీ సత్తువచూడాలని యిల్లాచేశానుగాని నరవాహనం ఏమిసౌఖ్యము? చిన్నప్పుడు మా తాత బుజాలమీఁద ఎక్కినప్పు డెల్లావున్నానో యిప్పుడీ తాత బుజాలమీఁద ఎల్లావుంటానో చూద్దామని ఇల్లాచేశాను. పెద్దాళ్ళు పిల్లలకోరిక తీర్చవద్దామఱి? తాతా యీ చిన్నతనపు చేష్టలు మన్నించు. నేను మిమ్మల్ని కష్టపెట్టినందుకు పాపపరిహారంగా మీ పాద సేవ చేయాలి. మీరు నన్నెంతసేపు మోశారో అంతకు మఱింతసేపు నేను మిమ్మల్ని మోయాలి. దయచేసి నా బుజాల మీఁద ఎక్కు తాతా!

తాతా:—ఒరే రామలింగమూ! నేటి ఉదయం మొదలు నన్ను దెయ్యంలాగ పీక్కుతింటున్నావురా. నన్ను విడిచిపెడ్తే చాలున్రా. మొయ్యనక్కర్లేదు.

తె॥ రా:—అల్లాకాదు. తాతా! నా పాపమెట్లాపోతుంది. నీకు సర్దా యెల్లాతీర్తుంది. (బలవంతముగాఁ దాతాచార్యులవారిని బుజములపయి నెక్కించుకొని ఓం ఓం ఓం. [పరిక్రమించును]

రాజభటులు:—[ప్రవేశించి తాతాచార్యునిఁ గ్రిందికిలాగి దెబ్బలు కొట్టి] రా! మాతో రా!

తాతా:—ఒరే! నేనుకాదురా! వాఁడ్రా.

తె॥ రా:—నేనా? ఊఁ.

రా॥ భ:—మీఁదెక్కిన దెవరయ్యా!

తాతా:—వాఁడు (రామలింగమును జూపును)

తె॥ రా:—తాతా! అబద్ధంకూడానా? (భటులతో) మీరుచూడనం లేదఁటయ్యా యెవరెక్కినారో?

రా॥ భ:—అదంతా యెందుకయ్యా మాకు? మీఁద ఉన్నవాణ్ణి రాయలవారీడ్చుకురమ్మన్నారు. వస్తావా? తన్ని యీడ్చుకొని పొమ్మన్నావా?

(తాతాచార్యులవారిని తన్ని లాగుకొని పోవుదురు)

తె॥ రా:—న్యాయమంటేయిల్లావుండాలి. రాజభటులే న్యాయవంతులు గాని మరెవరయ్యా? (తనలో) నాపన్నుగడ యింతవరకు జయప్రదముగ నెరవేరినది. రాయలవారు కళింగరాజుపై దండయాత్ర సాగింతురఁట. కవీశ్వరులుగూడ వెంట బోవుదురఁట. రాయలవారు బయలుదేరకమునుపే నేనాయన యాస్థానమునఁ బ్రవేశింపవలసియున్నది. ఈ తాత నేఁడు జరిగినదంతయుఁ జెప్పకమానఁడు. వారు నన్నుఁబిలిపింపకమానరు. ఈవిధముననైనను రాయలవారికి నాసంగతి తెలియకమానదు. బలే! (అటుచూచి) ఆభటులు తిరిగి నావైపే వచ్చుచున్నారు. కొంపమునిగినది. చల్లగ నిటు జారెదను.

రాజభటులు:—(రామలింగని లాగుకొనివచ్చి) ఎక్కడకుబోతావు? రాయలవారి గురువుగారిమీఁదెక్కేవుగా, ఇప్పుడు దిగుదు గానిలే గోతిలోనికి.

రెండవవాఁడు:—(మొదటివానితో) గోయితీయించరా త్వరగా!

మొ॥ భ:—(గోతిని ద్రవ్వుచు) ఇదిగో! గోయి పూర్తియైనది.

తె॥ రా:—ఇప్పుడే ఓంటేలుకెళ్లివస్తానయ్యా! (పరుగెత్తును)

రెం॥ భ:—(ఈడ్చుకొనివచ్చి) కదలకు. నీవు కొంటెవాడవని మాకు తెల్సింది నిన్ను కదలనియ్యము.

మొ॥ భ:—(రెండవవానితో) వానినిదీసికొనిరా! [రామలింగనితో] ఇందులో దిగవయ్యా!

తె॥ రా:—నేనెప్పుడూ దిగలేదు. మీరు ముందు దిగండి.

రా॥ భ:—మేము దిగవలెనుగా! ఎంతపొగరు! అణుస్తుందిలే రాయల వారి యేనుగు (గోతిలోనికి రామలింగమునుద్రోసి కంఠము వరకు మంటినిపూడ్తురు)

మొ॥ భ:—మనముపోయి యేనుగును దీసికొనివత్తమురా.

(ఇద్దరును నిష్క్రమింతురు)

తె॥ రా:—ఓకాళీ! తల్లీ! నీవే నాకుదిక్కు. ఈసమయమున నీవు కాపాడవలెను. తప్పించుకొనిపోవు సాధనము కానరాదు.

గూనిచాకలి:—[ప్రవేశించి] చాకలోడంటె అందరికీలోకువే. అన్నిటికీ చాకలోడేకావాలి. కాని చాకలోడ్ని చూసేవాడెవడు లేడు. రాయలోర్తోయుద్ధానికి పోవాలంటే గూనోడు పనికి రాడంట్ట. పెళ్ళాంతసంబరం జరుగుతుందంట్ట. (అటునిటుచూచి) ఇదేంటి యిక్కడెవర్నో కప్పెట్టేసు. తలకాయమాత్రం పైకుంది. (సమీపించును) దండాలండి దండాలండి సామీ!

(నమస్కరించును)

తె॥ రా:—నావంటివాడవు నీవొకడ వున్నావుట్రా చాకలీ!

చాకలి:—ఏమి సామీ! మీరెవ్వరిట్లావున్నారు.

తె॥ రా:—నీకెందుకురా యీవైద్యం?

చాకలి:—సామీ! యిదేం వైద్దెముండి.

తె॥ రా:—ఒరేచాకలి. యిదేరా గూనులుబాగుచేసేగొయ్యి. ఒక యోగి నాకిదిచెప్పేడ్రా. నాగూనుచాలవరకు పోయేవుంటుంది. అంతా పోయిందేమో పైకితీసిచూస్తావూ?

చాకలి:—(రామలింగమును బైకితీయును) సామీ! గూనేలేదండి.

తె॥ రా:—ఓరీ వెఱ్ఱిచాకలీ! ఇందులో ప్రవేశిస్తే యింకా గూనుంటుందిట్రా!

చాకలి:—సామీ! నన్నుకూడాయిందులో దింపి నాగూనుతప్పించేస్తురూ!

తె॥ రా:—అదెంతపనిరా! యిందులో దిగరా?

చాకలి:—(గోతిలో దిగును. రామలింగము మట్టిత్రోసి వానినిబూడ్చి తనలో) ఆకాళికాదేవి నాకుదోడ్పడినది. ఈ గూనుచాకలి రానియెడల నాపని యేమగునో! ఈసంగతికూడ రాయల వారికిం దెలియకమానదు. బలే. బలే.

(ఎగిరి గంతులువేయుచు నిష్క్రమించును)

తెరపడును.

ఐదవ రంగము—కటకపురియందలి యుద్యానవనము

[జగన్మోహినియు, సరళయు నగపడుదురు]

పాట్లకుడు:—[ప్రవేశించి జగన్మోహినినిజూచి తనలో] నేనెంతయు ధన్యుడను నాకుంబటమునందు రాయలవారుచూపిన యన్నుల మిన్నయే యీకన్నియ. ఈమెను జూచుటకెన్నియో వేషములనుదాల్చి నాప్రతిజ్ఞం జెల్లించుకొంటిని. ఈమె యెదుట మారాయలవారి నుగ్గడించి యాంతరంగమును గ్రహించెదను గాక. (ప్రకాశముగా)

పాట:—శ్రీలసంపదల విద్యానగరము చెలగుచుండు నెపుడు
పోలికగలదే యాపురమునకీ భూలోకమునందు
భళా! భళీ! యావైభోగంబును వర్ణింప దరంబే
నలుమోములుగల నలువకైనను చిలువ ఱేనికైన॥
విరజాజులును, గులాబీలు మరి వింతవింత పూలు
పరిమళంబుల నంతఃపురమున పరవశ మొనరించు
జలయంత్రము లాయాంతఃపురమున జలముల దెప్పించు
పలువిధంబుల ఫలములు కన్నులపండువు జేయుంచు॥ భళీ॥

శృగారంబుగ బరిపాలించును గృష్ణభూవరుండు
గంగ భూపతి యెదురుతిరిగెను గర్వపూరితుండై
రాయలప్పుడు గంగరాజుపై బ్రయాణమగుచుండె
భళీ! భళీ! వేయికన్నుల జూడగవలయును రాయలయందంబు
పట్టువస్త్రములు, పట్టుతురాయి గట్టిగ బిగియించి
చుట్టునుబంగరు జలతారంగీ చొక్కా ధరియించి
ఉరమున రత్నప్రభలమాలికలు ఊగులాడుచుండ
శిరమున సార్వభౌముని బంగరు తురాయాడుచుండ
భళా! భళీ!! యావైభోగంబుల వర్ణింపదరంబే!
వనజాకారపు పుట్టుమచ్చ యావామపాదమందు
మినుకుమినుకుమని నక్షత్రమువలె మెఱయుచుండు నెపుడు
భళీ! భళీ!! యావైభోగంబులు వర్ణింపదరంబే॥

జగ:—సరళా! యాభాగమును మరలఁ బాడింపుము.

సర:—రాయలవారి వర్ణన మొకసారిపాడుము.

పాట:—రాయలవారియందము నెన్నిమారులుపాడినను తనివిదీఱునా?
మాశిష్యునియొద్ద రాయలవారి పటమేగలదు.

జగ:—సరళా! యాపటమును మెలకువతోఁ గైకొనుము?

సర:—ఆపటము వెల యెంతమ్మా?

పాట:—ఇట్టిపటములకు వెలయుండునమ్మా!
(అనుచుఁ బటమునిచ్చును)

సర:—(పటమును జగన్మోహినికిచ్చును)

జగ:—(పటమును జూచుచుండును)

పాట:—"వేయికన్నుల జూడగవలయును రాయలయందంబు
పట్టువస్త్రములు, పట్టుతురాయి గట్టిగబిగియించి
చుట్టునుబంగరు జల్తారంగీ చొక్కాయి ధరించి

ఉరమున రత్నప్రభలమాలికలు ఊగులాడుచుండ
శిరమున సార్వభౌముని బంగరుతురాయాడుచుండ
భళా! భళీ!! యావైభోగంబును వర్ణింపదరంబే॥
వనజాకారపు పుట్టుమచ్చ యా వామపాదమందు
మినుకు మినుకుమని నక్షత్రమువలె మెరయుచుండు నెపుడు॥ భ॥

జగ:—(రహస్యముగా) సరళా! నాయనగారు వత్తురేమో! పాటకుని
బాగుగ సత్కరించి పంపివేయుము.

సర:—(పాటకునకు హారము నిచ్చును)

పాట:—(తనలో) నే నెంతయు ధన్యుఁడను. సత్వరమేపోయి రాయల
వారి కీయుదంతమును విన్నవించెదనుగాక. (ప్రకా) అమ్మా
సెలవు. (నిష్క్రమించును)

జగ:—సరళా! ఆ వచ్చునది నాయనగారుకాదా! ఏమది? బావ
యేదో ప్రగల్భములు కొట్టుచున్నాఁడు. మనమీ పూవుతీవి
యల చాటుననుండి యాలకింతము. (నిష్క్రమింతురు)

[ప్రతాపరుద్రగజపతి వీరసింహునితోఁ బ్రవేశించును]

వీర:—రాయలను జయించుటకు నీయంతటివాఁడు గావలయునా
మామా!

చ. పొడిచెద వానిదేహ మొక పోటున వాని తురాయి నేలకుం
బడునటులన్ మదీయ కరవాలముఁ ద్రిప్పెద లోకమెల్లనన్
గడు నుతిసేయ రాయలను నాదు పదంబుల మట్టగించెదన్
విడుతునె? నేను వాని పదివేలవిధంబుల నేడ్చి మొత్తుదన్.

జగ:—(నవ్వుచు ప్రవేశించి) బావా! ఏమనుచున్నావు. ఉత్తప్రజ్ఞలా!
లేక ఉత్తరప్రజ్ఞలా?

వీర:—నావియా యుత్తరకుమార ప్రజ్ఞలు? చూడుము నా పౌరుషము.

ఉ. చిందరవందరల్గఁ బొడిఁ జేసెద రాయలసైన్యమెల్ల మీ
రందరు చూచుచుండ నణఁగార్చెదఁ జీల్చెద నాంధ్రవీరులన్
వందనముల్ప్రవర్చనను వారల వీఁకను నేరణాన, నా
ముందర రాయలెంత సరిపోలును నా పదు కాలిగోటికిన్.

జగ:—నాయనగారూ! నేను కొండవీటిలో నున్నప్పుడు రాయలవారి శౌర్యప్రతాపములను వినియుంటిని. ఆతఁడు సామాన్య పురుషుఁడని యెంచుచున్నారు గాఁబోలు. బావ ప్రగల్భములు కొట్టినంత సులభసాధ్యుఁడు గాఁడు. భండనమునఁ జండప్రచండ మార్తాండుఁడుంబోలె దుర్నిరీక్ష్యుండై యుండునని చెప్పుకొందురు.

వీర:—(తనలో) ఈ జగన్మోహిని రాయల నెంతగా బొగడుచున్నది? ఈమె రాయలను వరించెనాయేమి? (పైకి) శత్రువులను తిరస్కరించుటకు మారుగాఁ బురస్కరించుకొని వచ్చుచున్నావు?

ప్ర॥ గ:—అమ్మాయీ! ధైర్యశాలియైన మీ యన్న వీరభద్రుఁ డప్రమత్తుఁడై కొండవీడు దుర్గమును రక్షించుచున్నాఁడుగదా! (తెర వైపు జూచి) ఆ! అదియేమి! ఆ యాశ్వికుఁ డట్లు రొజుచుఁ బరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు. వీరసింహా! నీవుపోయి యావృత్తాంత మరయుము?

వీర:—(పోయివచ్చి) మామా! రాయ లుదయగిరి దుర్గమును స్వాధీనము జేసికొని కొండవీటిమీఁదికి వచ్చుచున్నాఁడఁట. మన కటకపురముమీఁదికిఁ గూడ రాగలఁడఁట.

గజపతి:—ఏమి! ఆంధ్రుల పొగరు?

మ. ఇపుడీయాంధ్రులు గర్వముల్ బలిసి తామే వీరులంచున్ మద
ద్విపులై యుత్కల రాజసింహునిపయిన్ వీతెంచుచున్నారు మున్
గపిలేశుండు తెలుంగుదేశమున భూకంపంబుఁ గావించుచో
నపుడేమాయెనో వీరిదర్పములు వీరాహంకృతుల్ ఝంకృతుల్.

సీ. మా తాత కపిలసామ్రాజ్యాధిపతి యాంధ్ర
రాజుల నేఁ టరాచినపుడు
మా తండ్రి పురుషోత్తమ ధరాధినాథుడు
కాంచి కన్యలఁ జెఱను చినపుడు
మన వీరభద్రుండు తెనుఁగు పతాకంబు
తుత్తునియలు గాఁగఁ ద్రుంచినపుడు
మన తిరుమలరాయ మండలాధీశ్వరుం
డుదయాచలముఁ బట్టి యూపినపుడు

తే. గీ. నిట్టి యాంధ్రప్రతాప మేమేటఁగలిసె
నాంధ్రులిప్పుడు రాయల నాశ్రయించి
వేయుచున్నారు ఆఁకెలు విఱ్ఱవీగి
యుత్కలబలంబుఁ జూపెద నొక్కసారి॥

జగ:—నాయనగారూ! నేను జెప్పితిని గాదా! రాయలవారి శౌర్యప్రతాపము లద్వితీయములని. మీరే స్వయముగాఁ బోయి యెదురుసన్నాహములు గావింతురుగాక.

వీర:—ఎదురుసన్నాహములు చేయుటకిది వివాహసమయము కాదు. మావంటి శూరులు పరాక్రమము జూపుటకే సమయము. సన్నా రాయలమీఁదికిఁ బాపుఁడు. చూపెదఁగాక నామగతనము. అందులో నాంధ్రులా నన్ను జయింపఁగలవారు? ఆరంభశూరత్వమేగాని యాంధ్రులకుఁ గార్యదీక్ష యెక్కడిది?

చ. కరికుంభాంతర రక్తపాన విచలత్కంఠీరవంబట్లు సం
గర రంగస్థలికేఁగి వేగము విపక్షక్షోణి భృచ్ఛీర్షముల్
నఱకంజాలక శత్రుభీతహతులై నానాదిగంతంబులన్
బఱుగుల్వారరె! తెల్గువారలన దంభాచార శూరుల్ గదా

శా. శూరత్వంబున మాఁకుసాటి యెవరంచున్ మీసముల్ ద్రిప్పుచున్
బ్రారంభించెద రాంధ్రులన్నియును దర్పార్భాటపారీణులై
బీరంబుల్ ఘన మైకమత్యమనఁగాఁ బేరైన శూన్యంబు వ్య
ర్థారావంబులెగాని యీ ధ్రులన సంభాచార శుంఠల్ గదా.

జగ:—చాలు చాలు! బావా నీ ప్రతాప మాఁడువారియెద్దఁ బ్రగ
ల్భములు గొట్టుటకేగాని యుద్ధరంగమునందుఁ జొరదు.

సీ. భీరులయ్యును గండుబిల్లులవలె మీస
లెగఁబెంచుటలుగాదు మగతనంబు
కడిమిలేకయును మేకలఁబోలె గడ్డముల్
దిగదువ్వుటలుగాదు మగతనంబు
తెగువలేకున్నను సొగసైనచేలముల్
బిగియించుటలుగాదు మగతనంబు
చేతఁగాకున్నను వాతనార్భాటముల్
సగిలించుటలుగాదు మగతనంబు
తే. గీ. కులసతుల మానధనములఁ దలచియైన
భరతవీరుల బౌరుషం బరసియైన
నని మొనను నిల్చుటయె మగతనముగాని
మగువతో బీరములు బల్క మగతనంబె.

వీర:—నా శౌర్య మెఱుఁగక యెంతమాటంటివి.

ఉ. ఏమనివచ్చె రాయలిట కెంతటి పౌరుషవంతుడైనఁ దా
నే మగవాఁడె? గెల్వఁగలఁడే రణసింహుని వీరసింహునిన్
దోమకు హస్తికిం గలుగు దూరము వానికి నాకు నయ్యెడున్
నా మహిమం జూపెద రణంబున రాయలు దల్లడిల్లఁగన్.

ప్ర॥ గ:—వీరసింహా! మన సేనాధ్యక్షునితో సర్వసైన్యములును రాయ
లమీఁదికిఁ బోవుటకు సిద్ధపరుపుమని చెప్పుము. మన మొక

పన్నుగడచేసి యీ కృష్ణరాయలను బంధింతము. మన పాత్రులు
మనకుఁ గుడిభుజంబు వంటివారుగదా! మనము ముందు
ప్రక్కను, పాత్రులు వెనుక ప్రక్కను ముట్టడించితిమేని
రాయలు వంటయింటి కుందేలగును. వీరసింహా! ఎదిరిపక్షమున
సర్వసైన్యాధిపత్య మెవరు వహించిరో విచారించితివా?

వీర:—మామయ్యా! వేరే చెప్పనేల! ఆముసలిబ్రాహ్మణుఁడు తిమ్మరుసుం
ధప్పళాలకు లోపములేదు బ్రాహ్మణులు కులవృత్తిమాని
సేవకవృత్తి నవలంభించుటధర్మమా!

ఉ. కుండలముల్ ధరించుకొని గొప్పమనీషులమంచు రాట్సభా
మండలిఁ జేరి పెద్దబహుమానములందఁగవచ్చు భూసురుల్
భండనమందు బ్రాహ్మణుల ప్రాభవమేటికి చండశత్రుదో
ర్దండవిఖండనక్రియకు రాజులు గావలెఁగాని భూవరా!

మ. అనయంబున్ నియమంబులో తపములో యజ్ఞాది కృత్యంబులో
వినుతామ్నాయ పవిత్ర వాచక ఫలాన్వేషంబో భూదేవశా
సనధర్మంబగుఁగాని యొండుచితమే? స్వచ్ఛందమైనట్టి బ్రా
హ్మణవృత్తిన్ విడనాడి భూసురులు దాస్యంబూనుటల్ పాడియే.

ప్ర॥ గ:—వీరసింహా! శీఘ్రమే యుద్ధమున కరుగుదముగాక.

వీర:—అవును. అరుగుటయేగాదు. అగుల శిరంబులు నరుకుటయుఁ
గూడఁ జరుగవలసియున్నది.

ఆరవ రంగము—రాయల ప్రాసాద బహిరంగ ప్రదేశము

[రాత్రి తాతాచార్యులవారు పురాణము చెప్పుచుందురు
శ్రోతలు వినుచున్నారు]

తాతాచార్యులు:—

"సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁడే

పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోద్ధిత శ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజ ప్రాణావనోత్సాహియై.

ఆగజేంద్రుడు మొసలిచేతఁ బట్టువడి భగవంతునిఁ బ్రార్థింపఁగా నా శ్రీమన్నారాయణమూర్తి కేవలము భక్తాగ్రగణ్యుండగు గజేంద్రుని రక్షించుటకై బయలుదేరిన సమయాన భక్తపరాధీనుండగుటచేతఁ బ్రియురాలైన లక్ష్మీదేవితోనైనను జెప్పక తన సామగ్రి శంఖము చక్రమునైనఁ దీసికొనక గరుత్మంతునైన నధిరోహింపక హఠాత్తుగా భూమిమీఁదికి వ్రాలినాఁడఁట.

(రాగము దీయును)

[పైనుండి రాలవర్షము కురియును. తాతగారు పుస్తకము సర్దుకొనులోపల వినవచ్చినవారు—]

ఒకఁడు—ఓయీ! ఇదేమో దయ్యమండోయీ! రాళ్ళురువ్వుచున్నది.

తాతా:—ఆగండి. ఆగండి. భయము లేదయ్యా!

(మరల రాలవర్షము కురియఁగా శ్రోతలు పారిపోవుదురు)

రామలింగడు—(పైనుండి తాతాచార్యులపై దుముకును) హుం.

తాతా:—(గద్గదస్వరముతో) దండము. దండము.

తె॥ రా:—హుం. (ఎడమచేతిని క్రిందికివాల్చి కుడిచేతిని పైకెత్తి) నేనెవరనో యెఱుఁగుదువా?

తాతా:—(పుస్తకములట పాఱవైచి పాఱిపోవును)

తె॥ రా:—(వెంబడించి జుట్టుపట్టుకొని లాగుకొనివచ్చి) ఊఁ. ఎక్కడికు పోవుదువురా?

తాతా:—(మోఁకరించును)

తె॥ రా:—నాసంగతి తెలియునా? నీవు చూపించిన తెనాలిరామలింగాన్నిరా?

తాతా:—(నమస్కరించి) మహాప్రభూ! మహాపరాధము.

తె॥ రా:—రెండు చెంపలును వేసుకో. ఊఁ.

తాతా:—(చెంపలు వాయించుకొనుచు)

తె॥ రా:—గట్టిగ వినఁబడాలి.

తాతా:—(గట్టిగ వాయించుకొనును)

తె॥ రా:—ఎంతపని చేశావురా!

తాతా:—మహాప్రభూ! కాపాడవేఁడెద. ఎన్నఁడు నిట్టియపరాధముఁ జేయను.

తె॥ రా:—ఇప్పటికైనా బుద్ధివచ్చినదా!

తాతా:—స్వామీ! నీవిగ్రహము పెరుమాళ్ళవలెఁ బూజింతును.

తె॥ రా:—నీవు రేపుదయమే రాయలవారికడకరిగి నాసంగతి విన్నవించి నాకుఁ బ్రవేశము కలిగింపనియెడల హుం.

తాతా:—తప్పక చేసెద. చంపకుమోయి రామలింగా!

తె॥ రా:—నేను మరల భూలోకములో నవతారమెత్తి రాయలయాస్థానమునకు వస్తాను.

తాతా:—అంతకంటెనున్నదా? తప్పక నీయాజ్ఞ నెఱవేర్చెదను.

తె॥ రా:—జాగ్రత్త. పో. (తాతాచార్యులు పాఱిపోవును)

(తెరపడును)

ఏడవ రంగము

కృష్ణదేవరాయలు [ప్రవేశించి]

ఎలకో సైన్యంబులిచట పురోగమనంబుమాని స్తంభీకృతంబులగుచున్నవి. యోధవీరులందరు నిర్వ్యాపారపడుచున్నారు. వీరి

యలజడులు చూడ నేదియో యుపద్రవము రానైయున్నది. రామలింగప్ప నాయకుఁ డేలకో యిటు పరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు.

రామలింగప్పనాయకుఁడు:—[ప్రవేశించి తలవంచుకొని యేడ్వసాగెను]

కృష్ణ:—రామలింగప్పా! ఏలనీవిట్లు విలపించుచున్నావు. భీకరశత్రువీరదుర్గమంబగు నుదయగిరి దుర్గము నధిరోహించు నపుడైనను నీవు విచారమెఱుఁగవు. భయమెఱుఁగవు. చండప్రచండ మార్తాండోపమ శత్రుదోర్దండ మండితంబైన కొండవీడు దుర్గంబును ముట్టడించినపుడైనను నీవు జంకియెఱుఁగవు విజయవాడ యుద్ధంబున కృష్ణవేణీ మహానదిను త్తరించి మనసైన్యంబు లన్నియు నుత్తరతటంబున విడియించునపుడైనను నీవధైర్యమెఱుంగవు. ఏలయిట్లు బాష్పంబులు విడిచెదవు?

రామ:—దేవరవారి కేమని విన్నవింతును. సర్వసైన్యాధిపతి తిమ్మరుసయ్యవారేలినవారితో శత్రుమధ్యంబునకుఁ బోవలదనియుఁ మనసైన్యంబులను ముందునకుఁ గొంపోవలదనియుఁ బట్టుపట్టినప్పటికి నేలినవారు విజయోత్సాహంబునఁగటకపురివరకును సైన్యంబులను రప్పించుటవలన వంటింటి కుందేళ్ళమైతిమి. మనకు ముందు ప్రక్కను గజపతియును, వెనుక ప్రక్కను బదునార్గురు పాత్రులును, మనలను వలగొని యున్నారు. అందులో భీకరపాత్రుఁ డేలినవారి పటకుటీరము ప్రవేశించి దేవరవారి శిరంబును—ఏమని విన్నవింతును—బల్లెముపై నూరేగింతునని శపథంబుగొనియున్నాఁడఁట. దేవరవారిని బ్రాణంబులు గాచుకొమ్మని స్థానాపతి కమల నాభయ్య జాబులిఖించి యిదే పంపియున్నాఁడు. (జాబును చేతికి నందించును)

కృష్ణ:—(జాబును చదువుకొని) ఛీ! యెంతపని. ఆంధ్రదేశంబును,

సైన్యంబులను శత్రువుల కొప్పగించి పిరికిపందవలె యుద్ధరంగంబునుండి రాయ లెట్లు పారిపోఁగలఁడు?

చం. జలజహితుండు పశ్చిమదిశన్ బ్రభవింపఁగవచ్చుఁగాక తా
రలు దివినుండి తాళ్ళవలె వ్రాలఁగ వచ్చునుగాక భూమిపై
జ్వలనుఁడు వేడిమిన్ విడిచి శైత్యమునందఁగ వచ్చుఁగాక రా
యలు రణరంగమందున భయంపడి పోవఁగలాఁడె యెన్నఁడున్

చం. తొలఁగుదునే రణస్థలిని దోర్బలమున్ బ్రకటింతుఁగాని నన్
వలగొనవచ్చుఁగాక రిపువర్గము లాయభిమన్యునట్టు లాం
ధ్రుల యశమెల్ల దేశములమ్రోగి దిగంతములందుఁ బర్వ, శ
త్రులఁ దునుమాడెదన్ విజయదుందుభిమ్రోయ రణాంతరంబునన్

తే. గీ. ఆంధ్రుడని పిల్చినంతనే యంకురించు
నాత్మగౌరవ శౌర్యసాహసము లెపుడు
పిరికిపందలవలెఁ బోర వెనుకదీసి
యాంధ్రు లపయశం బొంద నేఁ నరుగఁగలనె.

సీ. ఆంధ్రమహీజాని యాశాతకర్ణి
మున్నరి తండములను జెండాడునాఁడు
నాంధ్రమహారాజ్ఞియైన రుద్రమదేవి
యొరుగంటి బురుజెక్కి యోమున్నాఁడు
నాంధ్రమహావీరుఁడౌ బాలచంద్రుండు
తెలుఁగు మగంటిమిం దెలుపునాఁడు
ఆంధ్ర మహీసురుండౌ ఖడ్గతిక్కన
చెలరేగి యరుల భంజించునాఁడు

తే. గీ. నాంధ్రశౌర్య ప్రతాపోదయంబుఁజూచి
హర్ష మెంతెంత బొందెనో యాంధ్రమాత

ఆంధ్రులిప్పుడు పందలై యాజిఁ దొలఁగ
నపయశంబుఁ గుందదే యాంధ్రమాత.

ఉ. మోసముచేసి యా కపిలభూపతి యాంధ్రులఁ గెల్చెఁ దొల్లి యా
రోసముచే ననుక్షణము రోజుచునున్నది యాంధ్రమాత యా
చేసిన దారుణంబునకు శిక్షయొనర్పక యున్నఁ దల్లి కా
రోసము తీఱునే ప్రళయరుద్రుఁడు పోలె వధింతు శత్రులన్.

(ఖడ్గము తీసికొని యుద్ధభూమిలోనికిఁ బరుగెత్తును)

తిమ్మ:—(ఎదురుగా వచ్చి) రాయలవా రేల యిట్లేకతంబున వెడలుచున్నారు.

కృష్ణ:—(తనలో) నే నేమొగము పెట్టుకొని యీ మహాత్ముని దర్శింపఁగలను (సమీపించి) అప్పాజీ!

తే. గీ. వగచియెఱుఁగ శాత్రవకోటి పగలకైన
వగచియెఱుఁగ నన్ను వధించు వధకునైన
వగచియెఱుఁగ మహోపద్రవములనైన
వగచుచున్నాఁడ నాంధ్రులవంతకిపుడు.

ఉ. రాయలు మంత్రివాక్యము నిరాకరణంబొనరించి దారుణా
పాయము దెచ్చి యమ్మడవిపాలొనరించెనటంచు నయ్యయో! మొ
ఱ్ఱోయని యాంధ్రులాపదలఁ గ్రుంగఁగ రాజ్యము సేయఁజాలఁ దం
డ్రీ! యిదె చేకొనుండిపుడె యీరల సంగిన యీ కిరీటమున్॥

(మోకరించి కిరీటమును దీయఁబోవును)

తిమ్మ:—(వారించి) మహారాజా! రాజ్యభారమును వహింపఁ దమవంటి మహారాజులకే తగునుగాని యితరులెట్లు వలంతురు? నే నొక యుపదేశమును జేయవలసియున్నది. మన్నింపవేఁడెద.

ఉ. నీ జనకుండు పోవుతరి నీ వెలఁబ్రాయపుఁ గుఱ్ఱవాఁడవ
వ్యాజపుఁ బ్రేమఁ బెంచితిని భ్రాతవధింపఁడలంచు నిన్నుఁ దం

డ్రీ! జనియించి తాంధ్రపరివృద్ధికి శాస్త్రములెల్ల నేర్చితి
వాజిని రాజుమూఁదుఁజన న్యాయమె చెప్పుము రాజపుంగవా.

ఉ. తేనివధింపఁజూచెడి నరిప్రకరంబులు సర్వభంగులన్
మేనిశిరంబు పోలెఁ బుడమిన్ నరపాలునిఁ బట్టుకొన్న స్వా
ధీనముగాదె సర్వమును ధీరుఁడవయ్యును మున్నుదూఁకఁగాఁ
బూనుట న్యాయమా నెఱిఁ రిపుపుంగవుఁ గూల్చెదు సేనలుండఁగాన్.

కడచినదానికి వగవనేల? ఈ యుపద్రవమునుండి యెట్లు తప్పించుకొనఁగలమా యని యోజించుచున్నాఁడను.

కృష్ణ:—(జాబును తిమ్మరుసు చేతికిచ్చి) అప్పాజీ! నేనీ జన్మంబున మీ ఋణముఁ దీర్చుకొనఁగలనా? మా యన్న నన్ను వధింపఁబూనినపుడు నా ప్రాణంబులు రక్షించిన పితృసమానులు మీరుగారా? నా కృతజ్ఞతాసూచకంబుగ మీకు సాష్టాంగనమస్కారంబులు చేసి యాంధ్రదేశంబునకై నా ప్రాణంబు లర్పింతునుగాక.

ఉ. రాయలఁబోలు నద్భుత పరాక్రమశాలియు ధర్మశీలుఁ డెం
దేయుగమందునైనఁ గలఁడే యని లోకులు మెచ్చ నాంధ్రు లో
హో! యనినన్ స్మరించి ముదమొందఁగ శాత్రవకోటి యయ్యయో!
మొఱ్ఱో! యని సాగిలం బ్రళయరుద్రుఁడు పోలె రణంబు చేసెదన్.

తిమ్మ:—(వారించి) దేవరవారు శౌర్యమును జూపుటకిది సమయము గాదు. ప్రత్యక్షయుద్ధమునఁగాక సాధనాంతరమున శత్రువులను వశపరచుకొనవలసినట్లున్నది. సామ, దాన, దండోపాయంబులుపకరింపవు. భేదమే యుపాయము. గజపతికిని బాత్రులకు నంతఃకలహములు కలవని వినియున్నాను.

కృష్ణ:—బృహస్పతివంటి బుద్ధిసామర్థ్యముగల మీకు నేను జెప్పవలసినదేమున్నది. రాజ్యము లాపినను, మాపినను బ్రాహ్మణులేగదా!

సీ. చండమహాసేను చండిమ వోనాడి
వత్సరాజును బ్రోచి వరలెనెవఁడు?
నందసామ్రాజ్యంబు డింపఁ బరచి చంద్ర
గుప్తుఁ గయ్యాది గూర్చెనెవఁడు?
ఢిల్లీశు బంధించి యల్లప్రతాపుని
నోరుగంటిగద్దెపై నుంచెనెవఁడు?
హరిహరదేవ బుక్కాధీశ్వరులఁ బ్రోచి
విద్యానగరము స్థాపించెనెవఁడు?

తే. గీ. బ్రాహ్మణులెగాని యన్యు లీ వసుధయందు
శక్తిమంతులె రాజ్యరక్షణము సేయ
వచ్చె సామ్రాజ్యరక్షణావసరమిపుడు
ప్రతిభ వెలయంగఁ బ్రోవు మప్పాజి! మీరు.

తిమ్మ:—మేధాజనని నాకొక యుపాయము నుదయింపఁజేయుచున్నది.

కృష్ణ:—యెట్టియుపాయము చేసైనను యీ యపాయము నుండి గాచెడి సాయము మీయదే.

తిమ్మ:—మనము శత్రులతో సంధిచేసికొన్నట్లు కానుక పెట్టెలను బంపి గజపతికి నమ్మిక పుట్టించి కార్యసానుకూల మొనరించెదను గాక. నా దొక విన్నపము. దేవరవారు నేడు నాపటకుటీరము ననే వసించి యీ మేధాజనని ప్రసాదంబు గైకొందురుగాక.

శ్రీ కృష్ణదేవరాయలు

ద్వితీయాంకము—మొదటి రంగము

[ప్రతాపరుద్రగజపతియు వీరసింహుండును ప్రవేశింతురు]

గజ:—వీరసింహా! ఏలకో పాత్రులు చేయఁదగినంత సాయము మనకుఁ జేసియుండలేదు.

వీర:—మామా! స్వాతంత్ర్యాభిలాష చేత వారు సాయముచేయుటకు వెనుదీయుదురేమో!

గజ:—వీరసింహా! అటు చూడుము. మన భటులెవ్వరినో లాగుకొని వచ్చుచున్నారు.

[భటులు పెట్టెలు మోసికొనివచ్చు సేవకులతోఁ బ్రవేశింతురు]

వీర:—ఎవరయ్యా! మీరు?

సేవ:—మా జోలి మీ కెందుకయ్యా!

వీర:—ఆ పెట్టెలేమిటి?

సేవ:—మా రాజుగారంపుచున్నారు.

వీర:—ఎవరికి?

సేవ:—మీరు గజపతివైపువారా? కానిచోఁ జెప్పెదము.

వీర:—మామా! ఇది యనుమానాస్పదముగాఁ గన్పట్టుచున్నది. ఆ పెట్టెలోనిదేమి?

సేవ:—నీ కెందుకయ్యా మా జోలి?

వీర:—మీరీ పెట్టెలఁ దెరచెదరా? మమ్ములఁ దెలుపమనెదరా?

సేవ:—మమ్ముఁగాని మా పెట్టెలనుగాని ముట్టఁగూడదయ్యా!

వీర:—మీ వైఖరిఁ జూడఁగ మీ రేదో మాయవేషముతోఁ బోవుచున్నట్లు తోఁచుచున్నది. (మీఁదఁబడి పెట్టెలనులాగుకొనఁబోవును)

సేవ:—ఒరీ! మా పెట్టెలజోలి నీ కేల?

(ఉత్తరములను దాఁచుకొందురు)

వీర:—ఆ దాఁచుచున్న వేమి?

సేవ:—ఏమియు లేవయ్యా! మిఠాయిపొట్లములు.

వీర:—(పట్టుకొని గుడ్డలు విప్పఁబోవును)

సేవ:—మా యుత్తరములు తీసితివా నిన్నుత్తరించి వేయుదుము

వీర:—(పోరాడి యుత్తరములు లాగుకొనును)

సేవ:—(ఆ సమయమునఁ బెట్టెలను బారవైచి పరుగెత్తుకొని పోవుదురు)

వీర:—(బెదరి) మామయ్యో! కొంప మునిఁగినది.

గజ:—ఏమిరా యది?

వీర:—శత్రుభటులు కపటవేషములతోఁ బెట్టెలను మోసికొనిపోవుచున్నారు. ఈ యుత్తరము వారినుండి బలాత్కారముగ లాగుకొని వచ్చితిని.

గజ:—ఏదా యుత్తరము? చదువుము.

వీర:—మామా! వింటివా? ఈ యుత్తరములోని సంగతులు.

"శ్రీకృష్ణదేవరాయలు సామంతరాజులైన 16 గురు పాత్రులకు వ్రాయునది యేమనఁగా:—

లోఁగడ మీతో సంధిచేసికొన్న ప్రకారము మీ పదునాల్గురు పాత్రులకు మాత్రము రాజకీయాభరణములతో 16 పెట్టెలను బంపుచున్నాము. ఈ కానుకలు స్వీకరించి మీరు మాతో వాగ్దానముచేసినట్లు నేటి సాయంకాలములోఁగా గజపతిని జీవగ్రాహిగాఁ బట్టుకొని మా కొప్పఁజెప్పవలసినది.

ఇట్లు మీ మిత్రుఁడు

శ్రీకృష్ణదేవరాయ సార్వభౌముఁడు"

గజ:—ఏమి యీ విపరీతము. పెట్టెలలో నేమున్నదో చూడుము.

వీర:—మామా! ఇవి తప్పక కృష్ణదేవరాయల యాభరణములే!

గజ:—ఎంతపనిచేసినారు పాత్రులు? వారిట్లు మోసగింతురని కలలోనైన ననుకొనియుండలేదు. ఇఁకఁ జేయున దేమున్నది.

వీర:—(గద్గదస్వరముతో) మామా! బ్రతికియున్న బలుసాకైనఁ దినవచ్చును. ఒక నిమిషమైన నిక్కడ నుండరాదు. నిన్ను సజీవులుగా రాయల కొప్పగింతురఁట.

గజ:—ద్వంద్వయుద్ధమునకు వార్తనంపెదను; ఈ మాయోపాయంబు లేల?

వీర:—మామా! ఎంతపిచ్చివాఁడవు? మొదటినుండియు మాయలలోఁ బుట్టి మాయలలో జీవించు కృష్ణరాయలా నీకు ద్వంద్వయుద్ధమిచ్చువాఁడు? (తెరలోనికిఁజూచి) యేదో యలజడయగుచున్నది.

గజ:—వీరసింహా! శీఘ్రమే పోయి చూడుము.

వీర:—(పోయి చూచి తిరిగి వచ్చును) ఎంతఘోరము! రాయల పతాకమును శాత్రుల పతాకమును గలసి మనమీఁదికి వచ్చుచున్నవి. భేరివాద్యములాకాశమును బ్రద్దలుగొట్టుచున్నవి. గుండె లెగిరిపోవుచున్నవి. నే నొక నిమిషమైనను దాళఁజాలను. (తెరలోఁ జప్పుడు విని)

శా. శుండాదండవిఖండితాహితశిరస్తోమాహవోద్దండ వే
దండంబున్ క్షితిమండలోద్దళనపిస్తాద్రాశ్వకాండంబు, మా
ర్తాండస్యందనరోధనక్షమభటోద్దామంబునౌ కృష్ణరాట్
చండోద్దండచమూ ప్రకాండముగనన్ స్వాంతంబు భీతిల్లెడున్.

ఉ. మేను చెమర్చుచున్నయది మిక్కిలి కంపమునొందె నంఘ్రులున్
మానసముల్లలాడెడిని నాలుకపై తడియూరె దిక్కులుం

గానఁగ రావు కన్నులకు గాఢభయంబు జనించుచున్న ది
ల్లీనడుమంగఁజాలనిక శత్రుచమూనిచయంబు డీకొనన్.

గజ:—ఇప్పుడు మన మేమిచేయునది?

వీర:—మన యాదువారి నందరను వింధ్యపర్వతములకుఁ బంపియుంటిమిగదా! మనము గూడ యచటికే పోయి ప్రస్తుత మీ యాపదనుండి తప్పించుకొందము.

(తెరలో)

[గజపతి యెచ్చట]

(గజపతియు, వీరసింహుఁడును పరుగెత్తి పోవుదురు)

రెండవ రంగము

[కృష్ణదేవరాయలు, తిమ్మరుసు, రామలింగఁడు, బ్రాహ్మణ వేషములతోఁ బనసలు చదువుచుఁ బ్రవేశింతురు]

కృష్ణ:—అప్పాజీ! నేను గూడ బ్రాహ్మణుఁడ నైతినిగదా! నా బ్రాహ్మణవేష మెట్లున్నది?

రామ:—మహారాజులు గూడ బ్రాహ్మణార్థములకుఁ బాలుపడినచో మా గతి యేమికావలయును?

తిమ్మ:—రామలింగా! ఎగతాళిచేయుట కిది సమయముగాదు.

రామ:—ఉదయగిరిలో గోడలుదూఁకుట నేర్చుకొన్నాము. ఇప్పుడు పిల్లలను జూచుట నేర్చుకొనుచున్నాము.

తిమ్మ:—రామలింగా బిగ్గరగా మాటలాడవలదు. ఇదే గజపతిగుహను సమీపించుచున్నాము. మన సైనికులందరు నాటవిక వేషములతో మనలను గాంచుచున్నారు. ఏదియైన నుపద్రవము తటస్థంబగుచో శంఖానాదము వినఁబడును. గమనించి చూడుము.

మూఁడవ రంగము

[ప్రతాపరుద్ర గజపతి శిలావేదికపైఁ గూర్చుండియుండును]

గజ:—ఈశ్వరాజ్ఞ తప్పింప నెవరితరము? ఇరుదెసలను మహారాజులు నన్ను సేవింప నేకచ్ఛత్రాధిపత్యముగ నుత్కలసామ్రాజ్యము నేలిన నేను బగలకంటఁబడకుండఁగ గాజులు దొడిగించుకొన్న యాఁడుదాని బోలె నొక కొండగుహలో దాఁగి యుండవలసివచ్చెఁగదా! దైవమా! బ్రతికిచెడినవానికంటెఁ జెడి బ్రతికినవారే మేలు. ముందుభాగ్యమును దరువాత లేమియు ననుభవించుట యెంతకష్టము.

సీ. ఉదయభానుఁడువోలె నుర్వి నేలిన నేను
బర్వతంబుల దాఁగవలసివచ్చె
షడ్రసోపేత భోజనము నొల్లని నేను
వనమూలములఁ దినవలసివచ్చెఁ
బూలబాన్పుల నిద్రఁబోవఁజాలని నేను
శిలలపై శయనింప వలసివచ్చెఁ
జీనాంబరంబులనైన నొల్లని నేను
వల్కలంబులఁ గట్టవలసివచ్చె

తే. గీ. నిరుదెసలయందు సామంత నృపులుగొలువ
వందిమాగధులు సదా స్తవంబుసేయ
నడుగుల మడుగులొత్తంగ నడువనేర్చి
యెట్లు జీవింపఁగల్గుదు నీవనమున.

బాగుగా నాలోచించినచో నీవనవాసముగూడ నా మేలు కొఱకే గదా యని తోఁచుచున్నది. భటులును, సామంతరాజులును నిత్యమును స్తోత్రపాఠములు చేయుటవలన విఱ్ఱవీఁగుచుండెడి వాఁడను. మాయోపాయంబులు రాజకీయ వ్యాపారములం దెల్లెడలను గన్పట్టుచుండును.

సీ. రాజకీయోద్యోగ రచనముచే గర్వించి
మొదలుగానక త్రుళ్ళిపడెడువారుఁ
బొరుగింటి సిరిఁజూచి భరియింపఁజాలక
తప్పుడు సాక్ష్యముల్ జెప్పువారుఁ
జెలికాండ్ర స్నేహంబుఁ జెరుపంగఁదలపెట్టి
వారిపై నిందలు బలుకువారు
నభిమానములచేత నర్థవాంఛలచేత
న్యాయమార్గముఁ దప్పి నడచువారు
తే. గీ. నీర్ష్యచే నితరులను గర్హించువారు
స్వార్థపరులయి హత్యలు సలుపువారుఁ
గానరారీగుహాలంబోనఁ గలలనైనఁ
బావనంబీ గుహాంతర జీవనంబు.

అకటా! ఎట్టి వట్టి వేదాంతములతోఁ గాలము గడుపుచున్న వాఁడను. నారాజ్యమేమయ్యెనో! నా ప్రజలేమైరోగదా!

[సేవకుఁడు ప్రవేశించి]

మహారాజా! ఎవరో పండితులువచ్చి గుహావాకిటనిలిచియున్నారు.

గజ:—ఇట్టియవస్థలో నేను వారినేమి సత్కరింపఁగలను? అయినను విద్వాంసులు పూజనీయులుగదా? లోనికిఁ బ్రవేశపెట్టుము. అయ్యో! ఎట్టిదురవస్థ! విద్వాంసులను సత్కరించెడి పుణ్యమైనను నాకు దక్కనదిగాదు.

[బ్రాహ్మణులు ప్రవేశింతురు] పనసలు.

గజ:—(నమస్కరించును)

గురు:—ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధిరస్తు! మీరూపరేఖావిలాసములనుబట్టి మహానుభావులుగఁదోఁచుచున్నారు. మేముజ్యోతిషశాస్త్రప్రవీణులము. కాశీనగరమునుండి యీమార్గమునఁ

బోవుచు నిచ్చట నెవరో కాపురమున్నారనివిని దర్శింప వచ్చినారము

గజ:—విప్రోత్తమా! కొండొకకారణంబున సంపదలను బాసి యిట నుంటిని. మాకెప్పటికి మంచికళ వచ్చునో సెలవీడు.

గురు:—(రామలింగనిఁజూపి) ఈమాశిష్యుఁడు జాతక భాగమునందు నేర్పరి. (రాయలనుఁజూపి) ఈతఁడు సాముద్రికమునం దద్వితీయుఁడు. నేను విశేషించి ప్రశ్న భాగమును జెప్పుచుందును. తమ రేదైనఁ బుష్పమును బేర్కొనుఁడు.

ప్ర॥ గ:—సంపెంగ.

గురు:—ఒకఫలము?

ప్ర॥ గ:—మామిడిపండు.

గురు:—ఒకఅంకె?

ప్ర॥ గ:—9.

గురు:—(వేళ్ళులెక్కించి) అయ్యా! మీరచిరకాలములోనే తొల్లింటి సంపదలను బొందఁగలరు. ఈసమయము శుభసూచకముగఁ గన్పట్టుచున్నది. తమ జాతకపత్రిక నిప్పింపుఁడు. ఈమా శిష్యుఁడు నిమిషఫలమునుగూడఁ జెప్పఁగలఁడు.

ప్ర॥ గ:—పండితోత్తమా! మాజాతకము లిచటలేవు.

గురు:—జాతకములేనిచోఁబోనిండు. (రాయలవైపుచూచి) వత్సా! యీమహాశయుని చేతినిజూచి ఫలమును జెప్పుము.

కృష్ణ:—(గజపతిచేతిని పరిశీలించి) మహాయోగలక్షణము లిందుఁ గన్పట్టుచున్నవి. కొలఁదిదినములలోనే మీకు మహదైశ్వర్యమబ్బఁగలదు. ఇద్దరు కుమారులు, నిద్దరు కుమార్తెలును గన్పట్టుచున్నారు. (పరిశీలించి) ఒకపుత్రిక చక్రవర్తిని యయ్యెడు లక్షణములు గన్పట్టుచున్నవి.

గురు:—మీబిడ్డలజాతకములైన నిచ్చట నున్నయెడల నిప్పింపుఁడు

గజ:—జాతకములిట లేవుగాని మా కొడవకొమార్తె యిచటనున్నది

ఆమె హస్తంబుఁ దిలకించి ఫలంబులఁజెప్పుఁడు

[తెరలోనికిఁజూచి]

అమ్మాయీ! ఒకసారి యిటురమ్ము.

జగన్మోహిని:—[ప్రవేశించి బ్రాహ్మణులకు నమస్కరించును]

గురు:—శీఘ్రమే శుభశోభనపరంపరాప్రాప్తిరస్తు!

కృష్ణ:—(జగన్మోహినినిజూచి)

తే. గీ. భామనిన్నంటియున్నది భాగ్యరేఖ
రమణి నినుఁజేరుచున్నది రాజ్యలక్ష్మి
మగువ నిన్నాశ్రయించెను మన్మథుండు
అతివ నీకు వేకల్యాణమగునుగాక.

గురు:—(రాయలవైపు జూచి) వత్సా! ఈమె పాణిగ్రహణంబు గావించి ఫలంబులఁ గనుము.

కృష్ణ:—(లేచి) భద్రహస్తమును గ్రహించును.

గురు:—(లేవఁబోవును)

కృష్ణ:—గురువరేణ్యా! తమరు లేవనక్కర లేదు. నేనే చూచి చెప్పెదను.

గురు:—(రామలింగనిఁజూచి) వత్సా! ఈమహాశయుని జన్మనక్షత్రమునుబట్టి గోచారఫలమును నిరూపింపుము

రామ:— చిత్తము. (గజపతిచేయి పట్టుకొనును)

కృష్ణ:—(తనలో) ఆహా! ఈమోహనాంగి సౌందర్యమేమని వర్ణింతును. ఈమెచేయి తగిలినతోడనే నాశరీరమంతయు గగుర్పాటు చెందుచున్నది. ఇట్టి సర్వాంగసుందరి త్రిభువనంబుల నెందైనఁ గానవచ్చునే.

ఉ. ఈ నవయౌవనోల్లసితహేమశరీరమనోజ్ఞకాంతియున్
మేని మనోహరాకృతియు మేచకవర్ణమనోజ్ఞవేణియున్
గానఁగవచ్చునే త్రిభువనంబులయందలి పూవుఁబోణులం
దీ నలినాక్షిఁ గూడి సుఖియింపఁగ నెవ్వఁడు పూజచేసెనో.

గురు:—వత్సా! ఏమి యోజించుచున్నావు?

కృష్ణ:—రేఖావిలాసములను జూచుచున్నాను.

జగ:—(తనలో) ఈ నా పాణిగ్రహణంబు సేసిన శిష్యుని రూపరేఖావిలాసము లద్భుతంబులుగాఁ గన్పట్టుచున్నవి. ఇట్టి నవయౌవన సౌందర్య మెందును గానరాదు. ఈతని వైఖరినిజూడ బ్రాహ్మణుఁడని తోఁపదు. (పరికించి) చక్రవర్తిలక్షణము లీతనియందుఁ గన్పట్టుచున్నవి. ఈతఁ డెవరైయుండనోపు?

ఉ. చారు శరీరకాంతియును శత్రుభయంకరచండగండపెం
డేరము, మూఁడులోకముల డీకొనఁజాలిన సాహసంబు, శృం
గారమయోరువక్షమును గాంచఁగ నీతఁడు విప్రుఁ డెట్లగున్
ఈ రమణీయమూర్తి జగమేలెడు క్షత్రియ చక్రవర్తియే.

రామ:—శని వక్రించినాఁడు. గురుఁడు పదునొకండవ రాశికి వచ్చుచున్నాఁడు.

గజ:—చిత్తము.

కృష్ణ:—గురువరేణ్యా! భవ్యరాశి. ఇది కేవలము సప్తమిలేని షష్ఠి.

జగ:—ఆహా! వీరు సామాన్యులు కారు. సప్తమిలేని షష్ఠియన్న రాసులను బట్టి చూడఁగా (మేషము, వృషభము, మిథునము, కర్కటకము, సింహము, కన్య, తుల) తులలేని కన్య, యని కాఁబోలు. వీ రెవరైయుందురు!

కృష్ణ:—నడుమైదు.

జగ:—నా నడుమును సింహమనుచున్నారు. ఈ మాటలు చమత్కారముగా నున్నవి.

కృష్ణ:—దృష్టిపథము ద్వాదశము.

జగ:—నా కన్నులను మీనరాశికిఁ బోల్చుచున్నారు.

గురు:—ఔను, మూఁడును జేగును. నాకుఁ బదునొకండువలెఁ గన్పట్టుచున్నవి.

జగ:—(సిగ్గు నభినయించి) నాకు శుభంబగుననుచున్నారు. కుంభరాశి తనకుఁ బ్రాప్తించునట్లు చెప్పుటవలన నీతండు బ్రాహ్మణుఁడై యుండనోపు. ఈ శిష్యుఁడు తప్పక క్షత్రియుఁడే. నేను గటకపురిలో నున్నప్పుడు విన్న పాటలో రాయలవారి యెడమ పాదమున వనజాకారపుఁ బుట్టుమచ్చ కలదని వర్ణింపఁబడినది. అల్లదే యీ శిష్యుని వామపాదమున నక్షత్రమువలె మెరయుచున్నది. నేనపుడు విన్నదానికి నిపుడు కన్నదానికిని సరిపోయినది. నా పాణిగ్రహణంబు చేసిన యీ యువకుఁడు తప్పక నా ప్రాణవల్లభుండే! ఇది కలయా! నిజమా!!

ప్ర॥ గ:—అమ్మా! ఈ మహాత్ములను సత్కరించుటకుఁ దాంబూలములను దీసికొనిరమ్మా.

జగ:—(తనలో) నా కిచటినుండి పోవుటకుఁ గాళ్ళు రాకున్నవి. సరళా! నీవు తాంబూలము లందుకొనుము.

ప్ర॥ గ:—అమ్మా! నీవే తీసికొనిరారాదా?

జగ:—(వెడలును)

కృష్ణ:—ఈ సరోజనేత్రి మెఱపుఁదీగవలె నా కండ్లకు మిరుమిట్లుగొల్పి తన యౌవన లావణ్యముల వలన నన్ను బానిసనుగాఁ జేసి లోనికిఁ బోవుచున్నది.

తే గీ. కారుత్రాచును గనుకట్టు కట్టినట్లు
భంజితాఖిల రణవీరవరుని నన్ను
వాలుచూపుల బంధించి కూలనేసి
పోవుచున్నది యిప్పుడీ మోహనాంగి.

చం. గెలిచితి నెల్లదేశములఁ గీటడగించితి సాటిలేని దో
ర్బలమదగర్వితాంధపరిపంథుల నేని నసాధ్యమైన య
గ్గలికపుఁ గోటలైనఁ జటికం బడద్రోసితిఁగాని సుంతయున్
గెలువఁగజాల నీపడఁతి నెయ్యపుఁగూర్చెడు వాలుచూపులన్

వీరసింహుఁడు:—[ప్రవేశించి] మామయ్యా! ఏమని చెప్పుదును. ఈ దినమున మన గుహచుట్టు నెవరో యాటవికులు తమ దేవతలకు సంబరము చేయుచున్నారు. వారి చప్పుళ్లకు బెదరి యొక పెద్దపులి మన వంటగుహలోఁ జేరినది. అత్తయ్య యెవరినైన మగవాండ్రను బిలువుమని నన్నుఁ బంపినది.

ప్ర॥ గ:—నీవు మగవాఁడవు గావా వీరసింహా!

వీర:—నాకుఁ బెద్దపులియంటే మాత్రము భయము మామయ్యా!

ప్ర॥ గ:—వీరసింహా! ఇదే వచ్చుచున్నాను. నా పెద్దకత్తిని దీసికొని రమ్మా. (వెడలును)

[భద్ర తాంబూలములతోఁ బ్రవేశించును]

తిమ్మ:—మేము కూడ వచ్చి యా పెద్దపులిని మా మంత్రబలము వలన బంధించెదము. (వెడలును)

రామ:—అంగవస్త్రము దాని మెడకాయకుఁ దగిలించినచో నది కదలఁగలదా? మెదలఁగలదా?

కృష్ణ:—నన్నొంటరిగా విడచిపోవుచున్నారా?

రామ:—ఒంటరిగాఁగాదు. జంటతోవిడిచిపోవుచున్నాము. (వెడలును)

భద్ర:—మహాశయా! తమకుఁ దాంబూలము లీయుమని నాన్నగారు సెలవిచ్చియున్నారు. అందుకొని యనుగ్రహింపుఁడు.

కృష్ణ:—రమణీమణీ! ఇదివరకే యందుకొనియున్నాము. నీ మృదుహస్తపల్లవగ్రహణంబువలన మాకుఁ దమలపాకు లిదివరకే ముట్టినవి. పూగీఫలములును ముక్తాచూర్ణమును బునస్సంధానకాలమునందే.

భద్ర:—సరసవైదుష్యనిధులైన మీకు నేను బ్రత్యుత్తరముఁ జెప్పఁగలనా? ఒక సందియము నా డెందమును గొందల పఱచుచున్నది.

కృష్ణ:—ఏమది?

భద్ర:—చంద్రునకును సూర్యునకును మైత్రి యెట్లొనగూడును?

కృష్ణ:—సంధికాలమునందు.

భద్ర:—అది యెట్లు సంభవమగును?

కృష్ణ:—సుందరి ముఖంబున సూర్యచంద్రులకు మైత్రి సంభవమగును. సుందరి ముఖమును—చంద్రబింబముతోడను, సూర్యుని భార్యయైన కమలముతోను బోల్చుదురు.

భద్ర:—చంద్రుఁడు మిత్రరాశిలో నెప్పుడు ప్రవేశించును?

కృష్ణ:—చంద్రుఁడా! ప్రస్తుతము కన్యను జూచుచున్నాఁడు. మిథునకాలమునందుఁ గన్యతోఁ గలియును. (చేరఁబోవును)

భద్ర:—(సిగ్గుతో) మీరు బ్రాహ్మణులుగదా!

కృష్ణ:—పాణిగ్రహణ మిదివరకే యయ్యెనుగదా! పునస్సంధానము కొఱకే నిరీక్షించుచున్నాను. (కౌఁగలించుకొనును) ప్రేయసీ!

ఉ. అడియాసల్ గొని ఘోరయుద్ధముల ధైర్యంబూని పోరాడుటల్
నడువన్ రాని మహోగ్రకాననములన్ సైన్యంబులన్ నిల్పుటల్
నుడువన్ రాని మహావిపజ్జలధికల్లోలంబులన్ దాటుటల్
కడునాయాసము లోర్వఁజాలుటలు నీకైగాదె ప్రాణేశ్వరీ!

[తెరలో ఘంటానాదము వినఁబడును]

ప్రేయసీ! ఇది ప్రమాదసమయము. తిరిగి కలియుదము.

భద్ర:—మీ కా భయ మక్కఱలేదు. ఈ పెరటిత్రోవను బోయిన యెడల నొక కొండగుహ కనఁబడును. అచ్చటఁ గొంచెము విశ్రమించి క్షేమముగా నింటికిఁ బోవచ్చును.

కృష్ణ:—(వెడలును)

భద్ర:—ఇది కలయా? నిజమా! నాకుఁ బాణిగ్రహణంబయ్యెనా?

సరళ:—[ప్రవేశించి] పాణిగ్రహణం బొకటియేనా? పునస్సంధానము గూడ నయ్యెనేమో!

భద్ర:—నాన్నగారిచటికి వచ్చుచున్నారు గాఁబోలు. మన మీ యుద్యానవనంబున దాఁగుదము.

(వెడలుదురు)

మూఁడవరంగము

[ప్రవేశము మంధర]

మంధర:—ఏమి యీ పందిళ్లు! ఏమి యీ తోరణాలు! ఎప్పుడైనా యీలాంటి యిచిత్రం గజపతిరాజులింటిలో జరిగిందా! తీసుకబోయి తీసుకబోయి బంగారువంటిపిల్లను, అందులో బంగారువంటి ఓఢ్రులపిల్లను తెలుగోళ్లకిత్తారంట. అయ్యో! ఓఢ్రపోళ్లచెయ్యి క్రిందాను—తెలుగోళ్ల చెయ్యి పైనానా? ఏలాంటిరోజు లొచ్చాయండీ! ఎప్పుడైనా గజపతివంశంలోవాళ్లు తెలుగోళ్లకి లొంగిపోయారా! నా కీ తెలుగోళ్లంటే మంట. వాండ్లకట్టేమి? వాండ్లబొట్టేమి? వాండ్లతిట్టేమి? ఛీ! ఛీ! ఆడోళ్లు బట్ట కట్టుకుంటే ఒల్లంతా కనబడతాది పైగా ఓఢ్రపోళ్లగుడ్డలు యెగతాళి. ఇప్పుడీ జగన్మోహనమ్మకూడా తెలుగోండ్లలో కలసి

పోవాలి గాఁబోలు. అయ్యో! ఏందారి. మన యీరసింహ రాజుగారి గతి యేమైపోతుందో. ఇప్పుడీ పీటలమీద పెండ్లి చెడగొట్టకుంటే నేను ఘంధరనుగాను. అదిగో యీరసింహ రాజుగారు యీలాగే వత్తున్నారు. పాపము! ఈయనికి ఆ పిల్లను కట్టించాలి. సాచ్చాత్తు దేముణ్ణేపంపించిందా మందర. దానికితీసిపోతుందా యీ మందర. ఒకవేళ పెండ్లినాడు తప్పించుకుంటే గర్భాదానమునాడేమవుతుంది?

వీరసింహుఁడు:—[ప్రవేశించి] మంధరా! ఎక్కడికే?

మంధ:—అక్కడకేనండి.

వీర:—ఎక్కడకు?

మంధ:—విజానగరానికి.

వీర:—ఎందులకు?

మంధ:—యీరసింహరాజుగారినోట్లో కరకాయకొట్టిన జగన్మోహనమ్మగారితోనండీ.

వీర:—జగన్మోహిని యక్కడకెందులకు?

మంధ:—ఎందుకా!—అందుకే.

వీర:—ఎందుకు?

మంధ:—మగనిదగ్గఱకు.

వీర:—మామయ్య యీ వివాహమున కొప్పుకొనెనా!

మంధ:—ఆయన వప్పుకోకపోతే ఆయన వప్పగించుకొంటాడు.

వీర:—అందులకు జగన్మోహిని సమ్మతించెనా?

మంధ:—మీ దగ్గఱ తెలివితేటలులేనప్పుడేమిచేస్తుంది. చిన్నప్పటి నుండి ఒక్కచోట తిరిగి ఒకచోట మెలఁగిన మీరే స్వాధీనము చేసికొనలేకపోయినారే. మీలో మజాలేనప్పుడేమి చేస్తుందాడుది.

వీర:—నే నేమి తక్కువచేసితిని?

మంధ:—మీ తక్కువాలేదు ఆవిడకు మక్కువా లేదు. ఆడపిల్లని అందులో మేనమామకూతుర్ని స్వాధీనముచేసికోలేని తెలివి లేనివాండ్లు మీరేను నాల్గుమాటలుచెపుతే ఆడోళ్లు స్వాధీన మౌతారు.

వీర:—మంధరా! ఏదైన నొక యుపాయముచేసి నీవా జగన్మోహినిని నాకుఁ గూర్చితివా నీవు కోరిన బహుమాన మిచ్చెదను. అట్లు స్వాధీనముకాదేని జగన్మోహినికి రాయలకు నెడబాటు గావించుటయే నా కభిమతము.

మంధ:—నేను మంచిసమయముచూసి మీతో చెప్తాను. మీరు వెళ్లి గట్టిగా పట్టుకుంటే యెక్కడకుపోతుందండీ.

వీర:—ఏమియుఁ బట్టుకొననీయదే? దగ్గఱకుఁ జేరనియ్యనైనను జేరనియ్యదు

మంధ:—ఈమూ టేపొరపాటుపనులు చేయక చెయ్యిపట్టుకొని తర్వాత గ్రంథం నడపండి. అదిగో ఆ వుద్యానవనములోనుంది.

నాలుగవరంగము

[భద్ర యుద్యానవనములో రాయలపటమును జూచుచుండును. సరళ విసరుచుండును]

భద్ర:—సరళా! ఈ మదనమోహనమూర్తి సౌందర్యమేమనివర్ణింతును?

సీ. చక్కనిబంగారు చెక్కుటద్దములపై
నర్మిలిఁ బ్రకటించు నవ్వుమోము
ముదిత నేత్రచకోరములకు వెన్నెలగాయు
శృంగారమయమగు శరీరకాంతి
నాదిశేషుఁడుపోలె నవనిభారంబెల్ల
మోయఁజాలినయట్టి భుజబలంబు

నద్భుతంబైన శౌర్యప్రతాపంబుల
మెరపించు చక్కని మీసములును

తే. గీ. బలుకుపలుకనకును దేనె లొలుకునట్టి
ముద్దుపలుకులుఁ గల జగన్మోహనుండు
పురుషులైన మోహింతు రా పురుషుఁజూచి
యేమగువ నోమునోచెనో యితనికొఱకు.

సర:—అమ్మా! నీ నోములే ఫలించినవి. ఆ రాయలవారిదివరలోనే నీ పాణిగ్రహణంబుఁ గావించినారుగదా. నీ వొక చక్రవర్తిని వగుదువని కూడఁ జెప్పినారఁట.

భద్ర:—శత్రురాజకన్య నని నన్ను నిరాకరింతురేమో.

సర:—అమ్మా! అనుమానపడకుము. నీ యందలి యనురాగము చేతనేకదా ప్రాణములనైనఁ దెగించి యీ మహారణ్యములకు వచ్చియుండెను.

భద్ర:—సరళా! ఆ దైవము నా పాలిట నున్నాడుసుమా! కలలోనైన సాధ్యముగాదనుకొన్నది ఎంత సులభసాధ్యమైనది!

సర:—అమ్మా! నీవు విజయనగర సామ్రాజ్యాధీశ్వరివై మమ్ము మరతువేమొ.

భద్ర:—ఎంతమాటంటివే సరళా! నీవు మాత్రము నాతో రావా?

సర:—అమ్మా! నిన్ను వదలి నేను మాత్రము నిలువఁగలనా? ఆ విజయనగరమును జూడవలయు నని నేను నువ్విళ్ళూరుచున్నాను. వింత వింత జలయంత్రములఁట. పాతాళభవనములఁట. చిత్ర చిత్ర సౌధములఁట. స్తంభములు సరిగమలు పాడునఁట. చూడవలయునని యున్నదమ్మా!

భద్ర:—సరళా! ఇట్టి యనుకూలములగు సంధియేర్పాటులకు నాయనగా రామోదించినందులకు వందనము లర్పింతును. ఆయన

యెచటనున్నారో చూచివత్తువా? మన కటకపురి ప్రయాణ మెప్పుడో కనుగొనివత్తువా (సరళ పోఁబోయి వెనుకకునిలచి) మన విజయనగర ప్రయాణ మెప్పుడో గూడ— (రాయల పటమును చూచుచుండును) సరళ పోవును.

వీరసింహుఁడు:—(ప్రవేశించి) ఆహా! నా యదృష్ట మేమనుకొందును. అల్లదే యా పూలపాన్పుపైఁ గుసుమకోమలి యగు నా మనోహారిణి శయనించి యేదియో తలపోయుచున్నది. అట్టి నవలావణ్యవిలాసిని యగు మా మామ కూతును రాయ లెత్తుకొనిపోవుచుండ నేను జూచుచు నూరకుందునా! ఆ సుకుమారసౌందర్యము నంతను నేనే తనివిదీరఁ గ్రోలెదను. ఈ జగన్మోహినిని జూచుచున్నకొలఁది నా యొడలు పరవశమొందుచున్నది.

ఉ. ఈ యువతీలలామ సొగ సెంతయు నా హృదయంబుఁగాసిలన్
జేయును దీనిసోయగము నెయ్యముఁగూర్చెడు వాలుచూపులున్
రాయలవశ్యమాటఁ గని రాజుచునున్నది మత్సరాగ్ని నే
బాయఁగఁజాల దీని బలవంతముచే నయినన్ గ్రహించెదన్.

[భద్ర వెనుకకుఁ జేరి కనులుమూయును]

భద్ర:—(నివ్వెరపడి) బావా! నీవా! ఏమిది చిన్నతనపుఁజేష్టలు చేయుచున్నావా? (రాయలపటమును దాఁచును)

వీర:—భద్రా! ఇటు చూడుము. మనము చిన్నతనమునం దిట్టియాటల నాడుకొనలేదా?

భద్ర:—ఇంకను నీకును నాకును జిన్నతనమేనా?

వీర:—చిన్నతనముగాకేమి? దాని కేమిగాని భద్రా! నానాఁటి కెంత యందము వచ్చుచున్నదే నీకు!

భద్ర:—ఏమి నీ మాటలు నా కర్థముగుటలేదు.

వీర:—విదుషీమణివి నీ కర్థముగాకపోవుటేమి? సరియే కాని మామ రాయలతో సంధి చేసికొనెనఁట గాదా!

భద్ర:—అవునఁట. అయిన నేమి?

వీర:—సంధియేర్పాట్లు వినియుంటివా?

భద్ర:—వినుట కేమున్నది?

వీర:—అంతయు నందులోనే యున్నది.

భద్ర:—ఎందులో?

వీర:—అందులోనే.

భద్ర:—ఏమది?

వీర:—ఏమందువా? నిన్ను—ఉత్తమ క్షత్రియకులసంజాతవగు నిన్ను—ఏమని చెప్పుదును—హీనకులసంజాతుఁడగు—చెప్పుటకు నోరు రాకున్నది—దాసీపుత్త్రుఁడగు రాయల కిచ్చి వివాహము చేయునఁట—నీ వంగీకరించితివా?

భద్ర:—ఛీ! అట్టితరులను నిందించుట తగునా?

వీర:—భద్రా! నా ముద్దులభద్రా! ఆతనిని వరించితివా? నా కంటె రాయ లేమిగొప్పవాఁడు. నా మీసములు చూడుము—నా ముఖారవిందము చూడుము.

భద్ర:—బావా! సరస మొలికిపోవుచున్నదేమో యని భయపడుచున్నాను.

వీర:—సౌందర్యమునఁ గాని, గాంభీర్యమునఁ గాని, శౌర్యమునఁగాని నాకా రాయలు సాటియా?

భద్ర:—ఆయనకును నీకును బోలికలేనిమాట వాస్తవమే. నీ శౌర్యప్రతాపాది విశేషంబు లన్నియు మొన్నటి యుద్ధమున వెల్లడియైనవి.

వీర:—నాకు మేనమామ కూతురవై యుండియు నిట్లాడవచ్చునా?

భద్ర:—మేనమామకూతురైన?

వీర:—

చం. అతివరో నామమానసమునంతయు నీకిదె వెల్లడింతు; న
ద్భుతమగు నీవయోయగము మోహావశంబొనరించె నన్ను నా
మతి యలరారుచున్నయది మానిని నిన్గవయంగ నన్ను నీ
పతిగఁ దలంచి ప్రేమమెయిఁ బాలనసేయకయుంట పాడియే.

భద్ర:—ఛీ! ఏమని ప్రేలుచున్నావు? మద్యపానము గావించితివా? మేనత్తకుమారుఁడవని యూరకుంటినిగాని నీ కిప్పుడు తగిన శాస్తి చేసియుందును. ఇప్పటికైనను బుద్ధితెచ్చుకొని పొమ్ము.

వీర:—భద్రా! జగన్మోహినివగు నిన్ను వదలి నే నెట్లు పోనేర్తును?

భద్ర:—నాయనగారు నన్ను రాయల కిచ్చినారని యెఱుంగుము. నేను రాయల భార్యనైతిని. నీవు చెలరేగితి వేని—

వీర:—నీ వెన్నిమాటలు చెప్పినను నాకుఁ దృప్తిగాదు. తప్పక నిన్నే పెండ్లియాడెదను. చిన్నతనమునుండియు వలచియున్న నిన్ను పెండ్లియాడక విడువఁగలనా? బలవంతముగానైన—

భద్ర:—(కోపముతో) హూం హూం ఏమి బలవంతమా? చండప్రచండ మార్తాండతేజోరాశిని గన్నెత్తి జూడఁగలవా?

సరళ:—[ప్రవేశించి] అమ్మా! ఏమిది! బలాత్కరించుచున్నాఁడా? (కత్తిదీసి) ఇదే నా కత్తి కెఱఁజేసెదను.

భద్ర:—(వారించి) సరళా! వీనిని వారించుటకుఁ గత్తికూడఁ గావలయునా? (వీరసింహునిఁ జూచి) ఇపుడైనను దొలఁగిపొమ్ము.

వీర:—నన్నిట్లు తిరస్కరించినందులకుఁ దగినశాస్తి చేయించనియెడల నేను వీరసింహుఁడనుగాను.

శా. కండంబుట్టిన కావరంబున వివేకంబెల్ల వర్జించి తు
ద్రుండై రాయల స్నేహమున్మరగి బంధువ్రాతమున్వీడి వే

దండాధీశులకెల్ల యీ కులట నిందం దెచ్చెని పాపికిన
నిండారందగు శాస్తి చేయనియెడన్ నే వీరసింహుండనే!

(తనలో) ఏదియో పన్నుగడ పన్ని దీనికిని రాయలకు నెడబాటు
చేయనియెడల నేను వీరసింహుడనుగాను (వెడలును)

భద్ర:—సాధ్వీమణులను బలాత్కరింపఁగలఁడా?

సీ. మహితపతివ్రతామణిని సీతనుగోరి
రావణుండేపాటి చేవఁజూపె
నతులిత గుణశీలయైన ద్రౌపదిఁగోరి
సింహబలుండేమి చేయఁగలిగె
సదమలసాధ్వీమణి దమయంతినిఁగోరి
బోయవాఁడేపాటి డాయఁగలిగె
తులలేని యా సతీతిలకఁ బద్మినిఁగోరి
ఖిలిజీప్రభుండెట్టి బలిమిఁజూపె

తే. గీ. అగ్నికీలోద్ధతుల నెవండంటఁగలఁడు
సూర్యబింబము నెవ్వఁడు చూడఁగలఁడు
ఘనసతీత్వబలాఢ్యయౌ గరితమిన్న
బలిమిడాయఁగలఁడె యెట్టితులువయైన.

సరళా! మనము శీఘ్రమేపోయి నాయనగారిని దర్శించివత్తము.

(నిష్క్రమింతురు)

శ్రీ కృష్ణ దేవ రాయలు

తృతీయాంకము—మొదటి రంగము

రాయల శయనాగారము

[మాధర యొడ్డాణమును దగిలించుచు భద్రను లోనికిఁబంపును]

శ్రీకృష్ణ:—నేటికిగదా నా జన్మ ధన్యమైనది.

చ. కలనువరించినట్టి కలకంఠిసమాగమ మెప్పుడోయటం
చలగుచునుండె నాహృదయమబ్ధితరంగమువోలె నిప్పుడా
కలికినిరీక్షణన్ ద్రుటి యుగంబుగఁదోఁచుచునుండె నెప్డునా
వలపులు దీర స్వప్నగత భామినిఁగూడి సుఖించువాఁడనో.

అల్లదే నావలపులమిన్న వచ్చుచున్నట్లున్నది. నేను నిద్రనటించి
యీమె శృంగారచాతుర్యమును గమనించెదనుగాక—

భద్ర:—(శృంగారకృత్యములొనర్చి వీణ వాయించును)

(రాయలు వెనుకనుండి కన్నులు మూయును. భద్ర లేచును)

శ్రీకృష్ణ:—

సీ. పదములూరువులను భరియింపఁజాలవు
పైన నీమంజీర భారమేల?
ఊరువులు నితంబమోపఁజాలవొకింత
పైనబంగారు టొడ్డాణమేల?
సన్ననిమధ్యంబు సైపఁజాలదురంబు
నాపైన వజ్రాలహారమేల?
శిరమునీకురులను భరియింపఁజాలదు
పైనఁ గాంచనజటా బంధమేల?

తే. గీ. మోవి భరియింపఁజాలను కావిరంగు
పైన విసిమూపుటగుణ లావణ్యమేల?
నీకు మృదులాంగకములె నన్నియలుదెచ్చు
సహజలావణ్యవతికి భూషణములేల?

భద్ర:—ప్రాణేశ్వరా! ఎల్లవిధంబుల మీకు సాటిరానిదైనను నాయం దిట్టి ప్రేమవహించి నన్నుఁబరిణయంబగుట కేవలము నాపూర్వ జన్మ సుకృతమేగదా!

సీ. మాతండ్రి దేశాభిమానమెంతయు లేక
మిమ్ముఁబెట్టినట్టి యాశ్రమలసైఁచి
మాయన్న తండ్రి యాజ్ఞాయత్తచిత్తుఁడై
కొండవీటను నిదుర్గోనుటసైఁచి
సరసవిహీనులౌ సామంతరాజులు
పాత్రులుపెట్టిన బాధసైఁచి
నగగుహాంతరమున నన్నుఁజూడఁగవచ్చి
యొంటిప్రాణముతోడ నుంటసైఁచి

తే. గీ. నన్నునర్ధాంగిగాఁగొంట నాకు పూర్వ
జన్మ సుకృతఫలముగాదె సదయహృదయ!
మిగుల సుకుమారమైన మీమేనినిటుల
నెంత యాయాసపెట్టెనో యీవెలంది.

శ్రీకృష్ణ:—ఆయాసమేల? ఆనందమేకదా యిట్లు చేయించినది.

మ. అడియాసల్గొని ఘోరయుద్ధముల ధైర్యంబూని పోరాడుటల్
నడువన్రాని మహోగ్రకాననములన్ సైన్యంబులన్ నిల్పుటల్
నుడువన్రాని మహావిషజ్జలధికల్లోలంబులన్ దాటుటల్
కథునాయాసము లోర్వఁజాలుటలు నీకైగాదె ప్రాణేశ్వరీ!

భద్ర:—

మ. అడియాసల్గొని యద్వితీయుఁడవు లోకాతీత శౌర్యాగ్రగ
ణ్యుఁడవౌ నిన్వరియించి కన్యనగుటన్ లోలోనఁగార్శ్యంబునన్
గడు నాయాసమునొంది తుట్టతుదకున్ దైవప్రసాదాన నిన్
బడయన్జాలుట నాదు పూర్వసుకృతానన్గాదె ప్రాణేశ్వరా.

(శృంగారచేష్టలలో భద్ర యొడ్డాణమునుండి కత్తి క్రిందఁబడను,
భద్ర నివ్వెరపడును)

శ్రీకృష్ణ:—ఏమి యీ విపరీతము! ప్రదేశమా! నానావిధ శృంగార రసపిపాసాప్రేరితహృదయవికాసమున కాలవాలమైనది. సమయమా! అనంగ కేళీవిలాస విభ్రమమున కాస్పదమైనది— నేనో! తనకు సమస్తైహికాముష్మిక సౌఖ్య సంధానకర్తనైన భర్తను—తానో!—నిరంతరభర్తృజీవోపజీవని.—కృత్యమా! ఘోరశత్రుకంఠలుంఠనావసర ప్రయోగయోగ్యంబైన కృపాణ ధారణము—ఇంక దీనిని మన్నించుటయా? (కత్తితీయును) ఛీ! స్త్రీహత్య మహాపాతకము. బహిష్కారమే యిపుడు తగిన శిక్ష

భద్ర:—(లేచి) మంధరా! ఎంతపని జేసితివే! నాథా! నేను నిరపరాధిని.

శ్రీకృష్ణ:—ఛీ! పయోముఖవిషకుంభమా! నీ ముఖదర్శనము మహాపాతకహేతువు. నీవు నా సాన్నిధ్యమున నుండఁదగవు లేచి పొమ్ము. (తనలో) ఎంత సౌందర్యమున్న నేమి! ప్రేమయే లేనిచో సంసారము నిస్సారముగాదా?

ఉ. అందములేల? పూరుషుల యాతనపెట్టెడు స్త్రీల మోహపుం
జందములేల? మన్మథవశంబొనరించెడు స్త్రీలగాన ని
ష్యంద మరందమేల? మధుసాయకచోదితపూరుషుండు తాఁ
బొందఁదలంచినట్టి విరిబోణికి సుంతయుఁ బ్రేమలేనిచోన్.

స్త్రీలను మాత్రము నమ్మరాదు. చెప్పునది యొకటి, చేయునది మఱియొకటి. జగతియందలి తగవులకు జగడములకు నవగడములకు దుండగములకును మగువలే తగుదురు.

చం. వెలఁదులపల్కు తేనెఁ గురిపించును గుండె హాలాహలంబు పె
న్వలపు నటించి పూరుషుని బానిసఁ జేయును భర్తకేనియున్
దెలుపదు స్వాంతమందున జనించు రహస్యము లించుకేనియున్
జెలువలస్వాంతమారయ సృజించిన బ్రహ్మకునైన శక్యమే.

(వెడలును)

ద్వితీయరంగము

[కంబపురీ ప్రాంతారణ్యము]

భద్ర:—(తనలో) హా! దైవమా! ఏజన్మంబున నెట్టి ఘోరపాప మొనర్చితినో, ఏ సతీ సతుల కెట్టి యెడబాటు గావించియుంటినో, ఆ పాపఫల మిప్పు డనుభవించుచున్నాను. పతి బహిష్కృతయైన సతికి వేరొండుగతియేది? ఎట్టి యతివకైన నిహపరసౌఖ్యంబులకును, భాగ్యభోగ్యంబులకును వేయేల జీవితమునకే యాధారభూతుండు జీవితేశుండేగదా! అట్టి జీవితేశ్వరుఁడే నన్ను విడనాడినప్పు డింక నన్నాదరించువా రెవ్వరు? భార్యకు భర్తయొక్క యనురాగమేకదా నిత్యకల్యాణము, పచ్చతోరణము. అటు పుట్టినయింటికిని; యిటు మెట్టినయింటికిని దూరమైతినిగదా! పతిని విడనాడిన సతిని జూచినచో లోకులు కూడ లోకువసేయరా! భర్తృవియోగముచేఁ గుందుచున్న నేనీ పరిహాసము లెట్లు సహింపఁగలను. పిన్ననాఁటనుండియు నతి సుకుమారముగా నంతఃపురమున వర్తింప నేర్చిన నేనీ కంబపురీ ఘోరవిపినంబుల నెట్లు కాలము గడుపఁ

గలను? ఈ జీవితమునకుఁ బరమావధియెద్ది? అక్కటా! మంథరా! ఎంతపని జేసితివే! నా కాపురము చెడఁగొట్టుట వలన నీ కేమి కలిసివచ్చినది. ఛీ! నిన్ననన్న ఫలమేమి? ఓ ప్రాణేశ్వరా! న్యాయాన్యాయ విచారణదక్షుండవే! ఈ పాటి న్యాయము నీకుఁ దోఁచలేదా? నిరంతర త్వదీయపాదసేవైకతత్పరురాలనైన నన్నీ యడవిపాలుసేయుట ధర్మమనితోఁచెనా? నాథా! సమస్తబంధువ్రాతంబును విడనాడి మిమ్మే మనసార ప్రేమించి వలచివచ్చిన మీ ప్రేయసినిగానా? ఛీ! మిమ్మిట్లు దూషించుటయు నాకుఁ బాపమే. శత్రురాజకన్యనై ఖడ్గధారిణినైన యీ మహాపాతకినగు నన్నుఁ జూచినతోడనే తత్క్షణము వధింపక కరుణార్ద్రహృదయుఁడ వగుటవలననే యిట్లు ప్రాణములతో విడిచిపెట్టితివి. నీదాక్షిణ్య మపారము-నీయౌదార్య మతీతము-ఈ వియోగము భరింపఁజాల. ఈ జన్మమునఁ గాకపోయినను ముందుజన్మములనైనను మీరు నన్నాదరింపక తప్పదు. మీ సరసవచోమృతప్రవాహ మప్పు డాస్వాదింతును. మీ మదనమోహన సౌందర్యము కన్నులారఁ గ్రోలి యానందింతును. ఓ గోపాలకృష్ణా! నన్నేల దయఁజూడవు. నే నేమి యపరాధ మొనరించితిని. నీవే నిర్దయుండవై యిట్లు రాకయుంటివా లేక యెవరైన నిన్ను బంధించిరా?

సీ. దేవదేవుండని తెలియలేక యశోద
నిన్ను గోటికిఁ గట్టియున్నదేమొ?
సతులలో మెప్పొంద సత్యభామాదేవి
నిను దానమిచ్చి బాధించెనేమొ?
భక్తిచేఁ దన్మయత్వమునొంది యా రాధ
యెదలోన నిన్ బిగియించెనేమొ?
అత్తకోశంత్రికం బాపఁజాలక సక్కు
తనకు మాఱుగ నిన్ను దాఁచెనేమొ?

తే. గీ. ఏల పాలింపరావు గోపాలబాల
భక్తపరిపాల! నిరుపమ భవ్యశీల!
దీన కరుణాలవాల! నే దీనురాల
ధవుని నెడబాసి నేనింక తాళఁజాల.

ఓ దేవదేవ! ఈ పాపిష్టజన్మ మింతటితోఁ జాలించుచున్నాను. ఈ వియోగము భరింపఁజాల. సహింపఁజాల. ఓ గుండ్లకమ్మామ తల్లీ! నా కష్టముల గట్టెక్కింపుము. ఓ తలిదండ్రులారా! నేను జేసిన మహాపరాధములను క్షమింపుఁడు. చిన్ననాటినుండియు గారాబముగాఁ బెంచిన యీమీ బిడ్డ యపనిందభరింపఁజాలదు. ఓ ప్రాణనాథా! ఇవియే మీకు నా కడసారి వందనములు. నిష్కళంకమైన ప్రేమతో మిమ్ము వరించినదాననైనచోఁ దప్పక యుత్తరజన్మంబులందు మీ భార్యనగుటయేసాక్షి. దేవదేవుఁడు మీకు సర్వశుభంబులొసంగుఁగాక. ఓ నదీమతల్లీ! నన్ను నీలోఁ జేర్చుకొనుము. ఈ భద్ర నీ గర్భంబున నిద్రపోదలంచి వచ్చుచున్నది— (నడుముకట్టుకొని నదిలోఁ బడఁబోవును)

సరళ:—(వెంబడించి వెనుకకు లాగి) అమ్మా! ఎట్టి దారుణకృత్యము చేయుచున్నావు. ఆత్మహత్య మహాపాపముగదా! ఇట్లు నీవొనర్చుట వలన జనులు నిందారోపణచేయరా? ఏనాటికైనను ఆ మహారాజునకు నిజము తెలియకపోవునా? సత్యమే జయింపనిచో ప్రపంచము నిలువఁగలదా? ఆ గోపాలకృష్ణుఁడే నీ పాతివ్రత్యమునకు మెచ్చి నిన్ను నీ భర్తతోఁ గలుపకపోఁడు. అధైర్యము మాత్రము వలదమ్మా! ఈ కంబపురియందే నిలిచి నిరంతరము ధర్మకార్యనిమగ్నులమై యా విఠలనాథుని భజించి జన్మసాఫల్యము జేసికొందము. ఎవరైన నీ పేరడిగినచో వరదరాజమ్మ యని చెప్పుకొందము.

శ్రీకృష్ణదేవరాయలు

చతుర్థాంకము—మొదటిరంగము

రాయల యాస్థానమండపము

తిమ్మ:—[ప్రవేశించి] సభాసదులారా! ఏలకో మహారా జింతకాలమునుండియు రాజ్యాంగవిషయములందేమి, మృగయావినోదములందేమి, యిసుమంతయు నాసక్తిలేనివాఁడై నిరంతరము చింతాక్రాంతుఁడై కనుపట్టుచున్నాఁడు. ఆ జగన్మోహినీదేవిని విడనాడుటయే యీ యవస్థకుఁ గారణమై యుండనోపు. ఆ విచారము మరపించుటకై వినోదార్థముగ నీ పండితసభ నేర్పాటుచేసితిని. మీ పాండిత్య చాతుర్యము వలనను గవిత్వ మాధుర్యమువలనను మహారాజునకు వినోద మొనగూర్పుఁడు.

కృష్ణ:—[ప్రవేశించి] కవివరేణ్యులారా! ఈ వరాలపళ్లెరమును, నవరత్నఖచితమైన యీ కవిగండపెండేరమును సరసమైన కవిత్వము నెవరు చెప్పుదురో వారల కొసంగెదను. ఆంధ్రభాషామాత కాటపట్టైన మన యాస్థానమునందుఁ బోటీపరీక్షలలో నెవరు బహుమతులఁ బడయుదురో వారి కీర్తి యీ లోకమం దెల్లెడల వ్యాపించును. వారి జన్మము పావనమగును. ఆంధ్రభాషామాత నిట్లు సేవించి నేనును ధన్యుఁడనయ్యెదను.

తె॥ రా:—రాయలవారు తనాలివారి పాకముకంటె అల్లసానివారి పాకమే మెచ్చుకొందురుగదా! ముందు పెద్దన్నయే యుపక్రమించును గాక.

కృష్ణ:—ఇష్టానిష్టములతో నేమిపని? సరసమైన కవిత్వ మందఱకును బూజనీయమేగదా!

పెద్దన్న:—

మ. శరసంధాన బలక్షమాదివివిధైశ్వర్యంబులం గల్గి
దుర్భరషండత్వ బిలప్రవేశ చలన బ్రహ్మఘ్నతల్మానినన్
నరసింహక్షితి మండలేశ్వరుల నెన్నన్వచ్చు నీసాటిఁగా
నరసింహక్షితి మండలేశ్వరుని కృష్ణా రాజకంఠీరవా!

తె॥ రా:—తాతా! చాలు చాలు. అక్కడనే యాఁగుము. బిలప్రవేశము చేసినను రాజకంఠీరవా రమ్మని తోఁక పట్టుకొని పైకి లాగితివా? ఇది దోషమేగదా! నేఁ జెప్పెదను వినుము.

మ. కలనన్ దావక ఖడ్గ ఖండిత రిపుక్ష్మాభర్త మార్తాండ మం
డల భేదంబొనరించి యేగు నెడ దన్మధ్యంబునన్ హారకుం
డల కేయూర కిరీట భూషితుని శ్రీ నారాయణుంగాంచి తోఁ
గలగం బారుచు నేగె నీవ యను శంకం గృష్ణ రాయాధిపా.

కృష్ణ:—సెబాస్!

పెద్ద:—మహాప్రభూ! ఈతనికి వరాలపళ్లెర మీఁదగును

[రాయలు పళ్లెరమిచ్చును—రామలింగఁ డందుకొనును]

కృష్ణ:—కవివరులారా! సంస్కృతాంధ్రములయం దసమానముగాఁ గవిత్వపటిమను జూపి యెవరైన నీ కవిగండ పెండేరమును గైకొనవచ్చును (కొంతతడ వాగి) ఏమది? ఎవరును రాకయున్నారు?

ఉ. ముద్దుగ గండపెండియరముం గొనుఁడంచు బహూకరింపఁగా
నొద్దిక నా కొసంగుమని యొక్కరుగానఁగరారు లేరొకో?—

పెద్ద:—(లేచి)

పెద్దనబోలు పండితులు పృథ్విని లేరని నీ వెఱుంగవే
పెద్దన కీఁదలంచినను బేర్మిడి నాకిడు కృష్ణరాణ్ణృపా!

మహారాజా! ఆంధ్రవాణీపోషకులగు మీ యభిమతము వ్యర్థము గాఁజాలదు. కవితాలక్షణములు సమన్వితముగా నిదే వర్ణించుచున్నాను.

ఉత్పలమాలిక

పూఁతమెఱుంగులున్ బసరుపూప బెడంగులుఁ జూపునట్టి వా
కైతలు జగ్గు నిగ్గు నెనగావలెఁ గమ్మనఁ గమ్మనన్ వలెన్
రాతిరియుం బవల్ మఱపురాని హొయల్ చెలియారజంపు ని
ద్దాతరి తీపులుంబలెను దారసిలన్ వలె లోఁ దలంచినన్
బాఁతిగఁ బైకొనన్వలెను బైదలి గుత్తుకలోని పల్లటీ
కూఁత లనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్
డాతొడనున్న మిన్నులమిటారపు ముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱ దొండపండువలె వాచవిగావలెఁ బంటనూఁదినన్
గాతలఁ దమ్మిచూలిదొర కైవసపుంజవరాలి సిబ్బెపు
న్మే తెలియబ్బురంపుజిగి నిబ్బరపుబ్బగు గబ్బిగుబ్బ పొం
బూఁతలనున్న కాయసరి పోఁడిమి కిన్నెరమెట్లబాతి సం
గాతపు సన్నతంతి బయకారపుఁగన్నడి గౌళపంతుకా
సాతతతానతానల పసం దివుటాడెడుగోట మీటు బల్
మ్రోఁతలునుం బలెన్ హరువు మొల్లముగావలె నచ్చతెన్గు లీ
రీతిగ సంస్కృతంబు పచరించినపట్టున భారతీవధూ
టీ తపనీయగర్భనికటీ భవదానన పర్వసాహితీ
భాతిక నాటకప్రకర భారత భారత సమ్మతప్రభా
శీతనగాత్మజాగిరిశ శేఖర శీతమయూఖ రేఖికా
పాత సుధాప్రపూర బహుభంగ ఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతక తాళయుగ్మలయ సంచితచుంచు విపంచికామృదం

గాతతదేహిత త్తహిత హాధిత దంధణుఘాణుఘింధిమి
వ్రాతనయానుకూల పదవార కుహూద్వహాహరి కింకిణీ
నూతనఘల్గలాచరణ నూపుర ఝూళఝుళీమరంద సం
ఘాత వియద్ధునీ చకచకద్వికచోత్పల సారసగ్రహా
యాతకుమార గంధవహాహరి సుగంధవిలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లునఁ జల్లవలెన్ మనోహర
ద్యోతకగోస్తనీఫల మధుద్రవ గోఘృతపాయసప్రసా
రాతిరసప్రసార రుచిరప్రతిమంబుగ సారెసారెకున్.

కృష్ణ:—సెబాస్! ఏమి! ఈ కవిత్వము! ఏమి! ఈ తన్మయత్వము! ఆంధ్రవాణి యవతారమెత్తి యీ కవిత్వముఁ జెప్పెనా? ఈ యవతారమూర్తిని సేవించి ధన్యుఁడనయ్యెదను. (పెద్దన వైపుఁ జూచి) కవివరేణ్యా! తమ వామపాద మొసంగుఁడు. నేనే చేతులార నీ గండపెండేరమును మీ పాదమునకుఁ దొడఁగెదను.

(పెద్దన వామపాదమునకుఁ దొడఁగును)

ప్రెగ్గడరాజు నరసన్న:—[ప్రవేశించి] మహారాజా! ఆంధ్రవాణీ సామ్రాజ్యోత్సవమునకై యాంధ్రదేశము నందలి పండితుల నెల్లరను రప్పించి మీ యాస్థానమునందలి పండితులకే బహుమతులన్నియు నొసంగుట కేవల మధర్మము. ఇట్టి యధర్మము రాయలవారి యాస్థానమునందు జరుగునని యనుకొనలేదు. ఆశుకవిత్వమునందేమి, బంధకవిత్వమునందేమి, భావకవిత్వమునందేమి మమ్ము గెలిచినవారీ ప్రపంచమునందుఁ గానరారు. ముక్త్యాలసంస్థానమున మాకీ కవిగండపెండేర మొసంగఁబడినది. గద్వాలసంస్థానమున నీ బంగారు పతక మీయఁబడినది. మీ యాస్థానమున మమ్ము గెలిచినవారున్న యెడల మా బహుమతులు తీసియిచ్చెదము. మేమే గెలిచిన యెడల మీ యర్ధరాజ్యము మా కొసంగునది.

కృష్ణ:—(పెద్దనవైపు జూచును)

పెద్ద:—(రామలింగనివైపు జూచును)

తె॥ రా:—అయ్యా! మీ రెవరు?

పె॥ న:—మేము సహస్రఘంటకవీశ్వరులము.

తె॥ రా:—మీ నామం బెయ్యది?

పె॥ న:—మమ్ము ప్రెగ్గడరాజు నరసమహాకవి యందురు.

తె॥ రా:—మీరు సహస్రఘంట కవీశ్వరులైనచో నేను లక్షఘంట కవీశ్వరుఁడను. (రాయలవైపు చూచి) మహారాజా! ఈ మహామహుని ముఖముఁ జూచినతోడనే యొక్కసారి యీతనితో వాదము చేయుటకుఁ గుతూహలము పొడముచున్నది. ఏలినవారి యనుమతికొఱకై నిరీక్షించుచున్నాను.

కృష్ణ:—రెండు దిగ్గజంబులు పోరుచోఁ జూడ వేడుకగదా! మీ మీ సామర్థ్యములఁ జూపి నన్నానందింపఁజేయుఁడు.

తె॥ రా:—(లేచి) ఓ కవిజనోత్తముండా! ఉక్తలేఖనమునందును, దప్పులుదిద్దుటయందును, జాతుర్యముగలవారింతవరకును మాకెవ్వరును గానరాలేదు. మీ కేమైన సామర్థ్య మున్నచోఁ దెలుపుఁడు. ఇదిగో! ఈ యాకును ఘంటమును బుచ్చుకొనుఁడు ఒకచిన్న పద్యమును జెప్పెదను. లిఖింపుఁడు.

కం. త్ర్యవ్వాఁట బాబా తలపైఁ
బువ్వాఁట జాబిల్లివల్వబూచాఁట చేదుం
బువ్వాఁట చూడఁగ నళుఖు
క్కవ్వాఁట యరయుంగ నిట్టి హారునకు జేజే.

పె॥ న:—మొదటియక్షరము నొకసారి సెలవింపు.

తె॥ రా:—త్రి

పె॥ న:—మరియొకసారి చెప్పుఁడు

తె॥ రా:—త్రి. చాలు చాలు నీ ప్రజ్ఞ వెల్లడియైనది. నీవు కవిజనులలో నుత్తముండవని స్పష్టమైనది. నీ వా మొదటియక్షరమే వ్రాయలేనపుడు పద్య మెట్లు పూర్తిచేయఁగలవు. ఇఁకఁ దప్పులు దిద్దుటలో నేమాత్రపు ప్రజ్ఞయున్నదో చూచెదను.

మ. గననీహారగు రామ పద్మదళ రంగత్కీర్తి చాణూరమ
ద్ధన శుక్రాక్షి కళేభరాణ్ణ్రగపతీ త్రైలోక్య ధామోదరా
యనఁగా శంకర వాంఛితార్థ దగదాద్యస్త్రైకపాణీ జనా
ర్దన వానేకపవైరి విగ్రహముకుందా మిత్రవిందాధిపా!

పె॥ న:—చాణూరమద్ధన యనునది చాణూరమర్దనయని యుండవలెను.

తె॥ రా:—(నవ్వి) ఓహో! ఏమి యీ తెలివితేటలు. చాణూర మత్ + హన = కలిపిన యెడల చాణూరమద్ధన యగును. చాణూరమర్దన యన్నచో నిట్టి యర్థ మెట్లువచ్చును.

పె॥ న:—అయ్యా! మా బోట్టి కవీశ్వరులను బరీక్షించు నెడల నుత్తలేఖనమును, దప్పులు దిద్దుటయునా? కవిత్వము చెప్పుమనవలె. లేదా యొక పద్యము నన్వయింపుమనవలె. మా పాండిత్యమునకుఁ దగిన పరీక్షఁ జేయవలెఁగాని యిది యేమిపరీక్ష!

తె॥ రా:—ఓహో! పద్యము నన్వయించుటకుఁ మీకు ప్రజ్ఞ గలదా? ఏదీ! చూతము. ఈ పద్యము నన్వయింపుఁడు?

సీ. మేకతోఁకకు మేక తోఁక మేకకు తోఁక
మేకతోఁకా మేకతోఁక మేక

పె॥ న:—నాకు సెలవిండు! పోయెదను.

తె॥ రా:—ఓహో! ఎట్టి ప్రగల్భములు కొట్టితివి. ఇది రాయలవారి యాస్థానమనుకొంటివా? లేక నీవట్టి వెట్టివెంగళరాయులకు స్థానమనుకొంటివా? నీ బంగారుపతకము లక్కడఁ బెట్టుము.

సీ. మేకతోఁకకు మేక తోఁక మేకకుతోఁక
మేక తోఁకా మేకతోఁక మేక.

పె॥ న:—నన్ను వదలి వేయుఁడు.

తె॥ రా:—రెండుచెంపలు వేసికొనుము.

సీ. మేకతోఁకకు మేక తోఁక మేకకుతోఁక
మేకతోఁకా మేకతోఁక మేక

పె॥ న:—బుద్ధివచ్చినది.

తె॥ రా:—రాయలవారికి మ్రొక్కరింపుము.

సీ. మేకతోఁకకు మేక తోఁక మేకకుతోఁక
మేకతోఁకా మేకతోఁక మేక

[సేవకుఁడు ప్రవేసించి] జయము జయము మహారాజా! మన పురపాలకులు గోవిందరాజులుగారు మన యంతఃపుర దక్షిణ ద్వారమున జరిగిన చౌర్యమునకై బంధింపఁబడిన యీ దాసిని విచారించి విచిత్రాయుధము లీమెయొద్దఁ గన్పట్టుటంజేసి యీ యాయుధములతో నీ దాసి నిక్కడకుఁ బంపినారు.

[మంధరను బ్రవేశపెట్టును]

తిమ్మ:—నేటికీ సభ చాలింతము. (సభాసదులు వెడలుదురు) (పరిశీలించి) ఈ కత్తి మిక్కిలి విచిత్రముగానున్నది. గజపతుల యాయుధమువలెఁ గన్పట్టుచున్నది. ఈ యాయుధ మెక్కడిది?

మంధ:—మాదేనండి.

తిమ్మ:—నీ వెవ్వ తెవు?

మంధ:—నేను గజపతివారి దాసీనండి.

తిమ్మ:—నీ విట కేలవచ్చితివి?

మంధ:—మా యమ్మాయిగారితో వచ్చి యిక్కడనే నిలిచిపోయినానండి.

తిమ్మ:—ఆమెతో నీవేల పోలేదు.

మంథ:—నేనా (ఆలోచించును)

తిమ్మ:—నిజము చెప్పుము లేదా నీ తల వేరై పోవును.

మంథ:—బాబూ నిజము బయటబడక పోతుందా! చేసిన పాపము చెపుతే పోతుంది. నిజమే చెపుతానండి.

తిమ్మ:—నిజము చెప్పిన నిన్ను రక్షించెదను.

మంథ:—తప్పక నిజం చెపుతానండి, రక్షించినా సరే శిక్షించినా సరే బాబూ! గజపతిరాజులుంగారి మేనల్లుడు యీరసింహరాజు గారు నన్ను యిక్కడకు పంపించారండి. అమ్మాయిగారిని పెండ్లాడమంటే ఆమె వప్పుకోలేదండి. రాయలోర్ని తప్ప యెవర్ని పెండ్లాడనంటే ఆయీరసింహరాజుగారికి కోపంవచ్చి-- (ఆగును)

తిమ్మ:—ఆ! ఏమి? తర్వాత—

మంథ:—బాబూ! చావుకు సిద్ధపడి చెపుతున్నానండి. ఆ యమ్మ కాపరం చెడగొట్టానని యేడుస్తున్నానండి! ఇంకా అబద్ధం చెబుతానా—ఆ యీరసింహరాజుగారికి కోపం వచ్చి యెలాగైనా ఆవిడ కాపరం చెడగొట్టి మా కటకం వచ్చేలాగు చేయమన్నారండి. అందుకోసం ఆ గర్భాదానంరోజున ఆవిడకు తెలియకుండ బొడ్డాణంలో కత్తి కట్టానండి కట్టింది యీ కత్తేనండి. ఈ కత్తితో నన్నొక దెబ్బ వేస్తే ఆ పాపం పోతుందండి.

తిమ్మ:—ఎంతపనిఁ జేసితివి? ఇప్పు డామె యెక్కడనున్నది?

మంథ:—నా కేం తెలుస్తుందండి. రాయలోరు ఆవిడను వదిలేసేరంట. పుట్టింటికి పంపారంటండి. నే నింటికి పోదామంటే యీర

సింహరాజుగారున్నూ, పెద్దరాజుగారున్నూ నన్ను సంపుతారండి. ఇంతపని చేసి అమ్మాయిగారితో పోగలనాండి! కుళ్ళి కుళ్ళి యేడుస్తున్నానండి.

కృష్ణ:—ఎంత ఘోరము! ఎంత ఘోరము!! (లేచిపోవును)

తిమ్మ:—ఎట్టియుపద్రవము! మహారాజుగారి కెట్టి పరితాపము తటస్థమయ్యెను! జగన్మోహిని వియోగము చేతఁ గుందుచున్న యీ మహారాజు శోకానలమునకు పాపభారం బింధనంబై మహారాజును దహింపఁ జేయుచున్నది. ఈ పరితాపము చేత మహారాజున కెట్టి యుపద్రవము గల్గునో యని మనంబు భీతిల్లుచున్నది. సేవకు లా జగన్మోహినిని గర్భిణిలు వనమధ్యమునఁ గంబపురీప్రాంతమున వదలివచ్చినట్లు తెలియవచ్చినది. మహారాజును వేటనెపంబున నచటికిఁ బంపి పునస్సమావేశమునకై యత్నించెదనుగాక.

మూఁడవ రంగము—అంతఃపురము

శ్రీకృ:—ఎట్టి యుపద్రవ మొనర్చితిని. అవ్యాజమై, యకళంకమై, యసాధారణమై, యపారమైన నీ ప్రేమనైనఁ బరిగణింపక నిన్నెట్టి బాధల పాలుచేసితిని. నా న్యాయం బేమయ్యె! నా మోహా మెక్కడ నడుగంటెను! నా వివేక మేమంటమడిసెను! నా దాక్షిణ్య మేయేటఁ గలిసెను-ఛీ! విజయనగర సామ్రాజ్యాధీశ్వరులలో-నిట్టి కిరాతుఁడు-ఇట్టి దురాత్ముఁడు-ఇట్టి యవివేకి-ఇట్టి స్త్రీహంతకుఁడు-ఇట్టి మహాపాపి-యెప్పుడైన నెచ్చటనైనను-జన్మించియుండెనే? "దశపూర్వేషాం-దశాపరేషాం"-అనునట్లు పది తరములు ముందునకును-బది తరములు వెనుకకును వ్యాపించు ఘోరపాతక మొనర్చితినే? భద్రా! భద్రా!!

నా ముద్దుంభద్రా!!! నీ వెచటనుంటివి? ఈ కఠినాత్ముని యవివేకశాసనఫల మనుభవించుచు నే యడవులపాలైతివో? ఎట్టి పడరాని యిడుములం బడుచుంటివో? ఎంత ఘోరముగ విలపించుచుంటివో? నీయట్టి మహాసాధ్వి నేత్రంబుల బాష్పంబు లొలికిన రాజ్యంబులు—రాజ్యము లేమి? సామ్రాజ్యములైనను సమసిపోవె? ఈ పాపఫలం బెట్లు భరింతును? శాత్రవకోటి దారుణకృపాణ బాణ ధురీణ రణప్రవీణ సైన్యోద్దామ మహాసంగ్రామములనైనను నిలిచి యసహాయశూరుడనై పోరి జయించితినిగాని యీ యవివేక కర్మఫలంబును మాత్ర ముపశ యింపజాలను. సమస్త కంటకావృత ధరణీ సామ్రాజ్యభార మునేని భరించితినిగాని యీ పాపభారంబును వహింపజాల. శత్రునిర్భేద్య దారుణకుడ్యాసాధ్య మహాదుర్గంబులను సహిత మొక్క త్రుటిలో భేదించితిని గాని యీ పాతకపర్వతమును ఛేదింపజాల. అక్కటా! ఎట్టి దారుణకృత్యం బొనర్చితిని? యమలోకం బంతయు నిచటనే నా కన్నులయెదుటనే ప్రత్యక్షంబైనట్లు నా పాపఫలం బంతయు నాలోచనములకు గోచరం బగుచున్నది. కులకాంతలను హింసించువారిని యముం డెట్లు శాసించుచున్నాడు! ఎంతఘోరము! భద్రా! భద్రా!! నా ముద్దులభద్రా!!! ఏమట్లు కృశించినట్లు కన్పట్టుచున్నావు? ఈ పాపాత్ముని జూచి దూరదూరములకుం దొలంగిపోవుచున్నావా? వలదు. వలదు. నీవు దుఃఖింపవలదు. నీవు లేని యీ సామ్రాజ్య భాగ్యభోగ్యములు నా కేల? నేనును నినుం జేరువరకును నిద్రాహారంబులొల్ల. ఈ వియోగబాధ దుర్భరము—ఈ పాపము దుస్సహము—ఈ తాపము దుర్వహము—భద్రా! భద్రా!! (మూర్ఛిల్లును)

శ్రీ కృష్ణ దేవ రా య లు

పంచమాంకము—మొదటి రంగము

(కంబము సత్రము)

[భద్ర పాండురంగని సేవ చేయుచుండును]

సరళ:—[ప్రవేశించి] అమ్మా! శ్రీకృష్ణదేవరాయలవారీ వనమధ్యంబునకు వేటకై వచ్చి మన వెనుకగుహలలో నొక పులిని వేటాడుచుండ వేరొకపులి వెనుకవైపున వచ్చి యాయన యవనాశ్వముపై దుమికెనట. రాయలవారా యశ్వమును డిగ్గి తన ఖడ్గధారణ కౌశలంబున నా రెండు పులులను గదలనీయక పోరాడుచుండిరట. మన ముసలిగాడా వింతం జూచి రొజ్జుచుం బరుగెత్తికొనివచ్చి యీ యుదంతము నిప్పుడే చెప్పియున్నాడు.

భద్ర:—సరళా! ప్రాణేశ్వరుని కేమి యపాయము వాటిల్లునో యని నా మన స్సాందోళపడుచున్నది. నా హృదయేశ్వరునిం జూడ నా మనస్సెంతయు నుప్పొంగుచున్నది! శీఘ్రమే యా పులులను వధించి ప్రాణేశ్వరు నింటకుం దోడ్కొనివచ్చెద.

సరళ:—అమ్మా! నిన్ను గుర్తించు నేమొ?

భద్ర:—సరళా! పురుషవేషము దాల్చిన నన్నెవరు గుర్తింపంగలరు? శీఘ్రమే పోయివచ్చెద. ప్రాణనాథుం డెంత యాతురపడుచుండెనో కదా! (వెడలును)

రెండవ రంగము

(కంబము సత్రము)

[ప్రవేశము శ్రీకృష్ణదేవరాయలు—పురుషవేషధారిణియైన భద్రయు]

కృష్ణ:—ఓ వీరశిఖామణీ! నన్నీ యాపదనుండి రక్షించిన నీవు కేవలము భగవత్స్వరూపుండవై యుండనోపు నీ వొనర్చిన మహోపకారము నే నెన్నిజన్మములనైన మరువఁగలనా? నీ ఋణ మెట్లు తీర్చుకొందును?

భద్ర:—మహాశయా! మిమ్మా యాపత్తునుండి రక్షించినదానన్ భగవంతుఁడ నే యనుకొనుఁడు. ప్రతిఫలము కోరి వచ్చినవాఁడను గాను.

కృష్ణ:—ఆపద్బాంధవా! మీ రెవ్వరు? మీ నామధేయం బెయ్యది?

భద్ర:—మేము పాంథులము. నన్ను జగన్మోహనుఁడందురు.

కృష్ణ:—నీ పేరు జగన్మోహనుఁడా? (తనలో) ఆ పేరు స్మరించిన తోడనే నా ప్రాణేశ్వరి జ్ఞప్తికి వచ్చుచున్నది. నా హృదయము విలపించుచున్నది.

భద్ర:—అయ్యా! ఏలకో మీ చిత్త మట్లు వ్యాకులాయత్తమైనట్లు కన్పట్టుచున్నది. మీ రెవ్వరో యడుగవచ్చునా?

కృష్ణ:—మేమును బాంధులమగుటచే మీ కనుబంధులమే!

భద్ర:—మహాశయా! మీ శరీరము మిగుల నాయాసపడియున్నది. ఈ యాశ్రమమున నేటికి విశ్రమింతురుగాక.

కృష్ణ:—ప్రాణమిత్రమా! ఈ యాశ్రమము నాశ్రమల నన్నింటిని దమియించుచున్నయది. ఆహా! ఇది బహు విచిత్రముగా నున్నది.

సీ. వ్యాఘ్రకిశోరముల్ వనమృగంబులతోడ
గుమిగూడె నిచట వైరములుమాని
సింగంపుఁ గొదమలు చిఱుతయేనుఁగులతోఁ
జెలగాడు నిచ్చోటఁ జెలిమిమీఱ
వేటకుక్కలును గుందేటిపిల్లలుఁ జేరి
విహరించు నిచ్చోట బెదరులేక
పావురంబులు కేతుపక్షుల వెనువెంట
నెగయుచున్నవి మింటఁ బగలువీడి

తే. గీ. యఖిలప్రాణులు నిచట సఖ్యంబు నెఱపి
కలియు నన్యోన్యరాగ సంగతులచేత
నేతపోధను మహిమయో యెఱుఁగఁజాల
శాంతి నొదవించు నీ వనాశ్రమము నాకు.

నా మనస్సంక్షోభము నంతయు నిచట శమనయించుచున్నది. రాజ్యంబు లేలెడి మహారాజులకంటె నాత్మసామ్రాజ్యముఁ బాలించుకొను పరివ్రాజకు లెంత ధన్యులో కదా! మిత్రమా! ఈ యాశ్రమం బెవ్వరిది?

భద్ర:—వరదరాజమ్మగారిది. శ్రీకృష్ణదేవరాయలవారి పేరఁ గట్టింపఁబడినది.

కృష్ణ:—ఈమె యెవ్వరు? రాయలవారిపేరఁ గట్టించుట కేమికారణము?

భద్ర:—ఈమె యొక తపస్విని. ఈమె చరిత్రం బిచట నెవ్వారికిని తెలియదు.

కృష్ణ:—మేమా తటాకమధ్యమునుండి వచ్చుచుండఁగా ధ్వజస్తంభము మీఁద రాయలవారి పాదసేవకురాలు వరదరాజమ్మ యని వ్రాయఁబడియున్నది. ఆ వరదరాజమ్మ యీమెయేనా?

భద్ర:—అది చూచినవారు తమకే తెలియవలెను గాని మాకేమి తెలియును?

కృష్ణ:—ఆమె నొక్కసారి దర్శింపవచ్చునా?

భద్ర:—ఆమె నిరంతరము తపోనిష్ఠలోనుండుటవలన నెరికిని దర్శన మియ్యదు కాని యీ యాశ్రమము సమస్తప్రాణికోటికి నాశ్రయమే ఇచటఁ గొంచెముసేపు విశ్రమించి తమరు సేద తీర్చుకొనుఁడు.

(రాయల వెనుకకుఁజేరి గాయము నొత్తుచుండును)

కృష్ణ:— ప్రాణమిత్రమా! నీ మృదుహస్తస్పర్శమువలన నా శ్రమ లన్నియుఁ దీరినవి.

భద్ర:—(విచారముతో) అయ్యో! ఎంతగాయము తగిలినది.

(బాష్పములు గాయముమీఁదఁ బడును)

కృష్ణ:—మిత్రమా! ఏల బాష్పముల విడుచుచున్నావు?

భద్ర:—మీగాయములఁజూచి భరింపఁజాలనైతిని.

కృష్ణ:—ఈదీనునిపై నెంతసానుభూతిఁజూపుచున్నావు? నీయనురాగము నే నెట్లు మరువఁగలను. ఒక్కసారి మనసార నిన్నాలింగనము జేసి నాకృతజ్ఞతను వెల్లడించుకొందును.

భద్ర:—(తనలో) అయ్యో! నాగుట్టు బయటబడు నేమో! (ప్రకాశముగ) మహాశయా! ఆలింగనమున కేమి? మీయనురాగ మున్నచో నదియేచాలును. ఈ యాశ్రమమునందుఁ గొన్ని మృదుపల్లవములు గలవు. వానిని దెచ్చి కట్టినచో మీ గాయములు శీఘ్రమే మానిపోవును.

కృష్ణ:—మిత్రమా! వేరే మృదుపల్లవంబు లేల? నీ హస్తపల్లవంబులు తాకినతోడనే శ్రమయంతయు యుపశమించినది. నీవుమాత్రము

నన్నిచట విడిచిపోవలదు. ఏలకో ఒక్క నిమిషమైనను నిన్ను వదలియుండజాల. నిన్నుఁ జూచినతోడనే నా ప్రాణేశ్వరి జ్ఞప్తికి వచ్చుచున్నది.

భద్ర:—ఆర్యా! నేను పాంథుఁడనైనను నన్నీ యాశ్రమంబునఁ బూజలు సల్పుటకు నిల్పియున్నారు. ఇప్పుడే పోయివచ్చెద.

కృష్ణ:—మిత్రమా! నేనును నీ తోడనే వచ్చెదను.

భద్ర:—అయ్యా! మీరు కూడఁ బూజావిధానం బెఱుగుదురా?

కృష్ణ:—సమస్తకామితార్థప్రదాయకుండైన దేవుని పూజ నీవు చేసినచో నా పాలిట భగవంతుడవైన నీ పూజను నేను జేసెదను.

భద్ర:—(ఘంటానాదము విని) మహాశయా! అదిగో ఘంటానాదము వినఁబడుచున్నది. నే నిప్పుడే పోయివచ్చెద. అంతదనుక మీ రిచ్చట నే విశ్రమింపుఁడు.

కృష్ణ:—మిత్రమా! నీ రాక కనుక్షణమును నిరీక్షించుచుందును సుమా!

భద్ర:—ఆర్యా! తప్పక వచ్చెదను.

(వెడలును)

కృష్ణ:—ఈ యువకునిపై నా కీ మోహమేల?

ఉ. ఎక్కడిబాంధవంబో? యిది యెక్కడిస్నేహలతానుబంధమో?
ఎక్కడఁ బూర్వజన్మముల నే సహవాసమొనర్చియుంటిమో?
చక్కని వీనిఁజూడఁగనె శాంతినిబొందును నా మనంబు నే
నొక్కనిమేషమున్ విడువనోపను వీని నిదేమిచిత్రమో!

ఆ యువకుం డెవ్వఁడై యుండనోపు? (అటునిటు జూచి పటంబులు చూచి, ఆశ్చర్యముతో) ఈ యాశ్రమంబున నా పటం

బులు కట్టుట కేమికారణము? ఎంత చిత్రముగా లిఖింపఁ బడిన దీ పటము? ఈ పుష్పమాలికలు చూడ నీ పటమునకు నిత్యపూటలు జరుగుచున్నట్లు తోఁచుచున్నది. ఈ పటము క్రింద నేదియో వ్రాయఁబడియున్నది.

శ్లో. చరన్వనాంతే నవమంజరీషు
నషట్పదో గంధఫలీమజిఘ్రత్
సా కింనరమ్యా? సచ కింనరంతా?
బలీయసీ కేవలమీశ్వరాజ్ఞా.

భర్తృవియోగముచేఁ గుందుచున్న యొక సాధ్వీలలామ యన్యాపదేశంబుగా నిద్దానిని రచియించి యుండనోపు. నా చిత్రపటము క్రిందనే యీ శ్లోకము వ్రాయఁబడి యుండుట వలన నీ పతివియోగ వృత్తాంతము తప్పక నాకు సంబంధించి యుండును. ఈమె నా జగన్మోహిని కాదుగదా! అకటా! ఈ దురాత్ముని కఠిన శాసన ఫల మనుభవించుచు నీ వనమధ్యంబున దీనురాలై యిట్టి దారుణకృత్య మొనర్చిన నా కొఱకు విలపించుచున్నది గాఁబోలు.

సరళ:—(ఫలాహారములతోఁ బ్రవేశించి) మహాశయా! ఈ ఫలాహారంబులు స్వీకరింపుఁడు.

కృష్ణ:—నిరాహారవ్రతంబు పూనిన మా కీ ఫలాహారంబులేల?

సర:—ఆర్యా! మీ నిరాహారదీక్షకుఁ గారణం బడుగవచ్చునా?

కృష్ణ:—సతీవియోగమే.

సర:—మీకట్టి సతీవియోగ మేలకలిగెను?

కృష్ణ:—మే మవివేకముచే నొనర్చిన మహాపాపకృత్యమే సతి బహిష్కారము.

సర:—అయ్యా! మీ రెవ్వరో తెలిసికొనవచ్చునా?

కృష్ణ:—మేము పాంథులము.

సర:—మీ దేశం బెయ్యది?

కృష్ణ:—విజయనగరము.

సర:—ఆఁ! ఏమి? విజయనగరమా! అట్లయినచో సతీబహిష్కారముల కేమిలోపము.

కృష్ణ:—ఏమట్లనుచున్నావు?

సర:—ఏమియును లేదు. "యథారాజా తథాప్రజా" ఆ రాజుగారెంతో ప్రజలంతే.

కృష్ణ:—ఆయన చేసిన తప్పేమి?

సర:—తప్పేమని యడుగుచున్నారా? అవును. రాజుగారు చేసినది తప్పని చెప్పుట కెవ్వరు సాహసింతురు?

కృష్ణ:—పడతీ నన్నేల బాధించెదవు?

సర:—భార్యనువదలిన యా రాజునకే లేని బాధ మీ కేల?

కృష్ణ:—పశ్చాత్తప్తుఁడై యా మహారాజామె వృత్తాంతం బరయుటకు నన్నుఁ బంపియున్నాఁడు.

సర:—అయ్యా! ఆమె వృత్తాంతం బింకను మీకుఁ దెలియదా?

కృష్ణ:—బోటీ! ఆమె యెచ్చటనున్నదో తెలిపినయెడల నీవు కోరిన యర్థంబిచ్చెదను. నా సర్వస్వము నిప్పుడే నీకు ధారఁబోసెదను.

సర:—అయ్యా! మీ యర్థంబులన్నియు వ్యర్థంబులే!

కృష్ణ:—వ్యర్థంబు లెట్లగును? మహారాజునకు దెలిసినచోఁ దన మహాపరాధంబున కామెను క్షమార్పణముగోరి రాజ్యంబునకుఁ దీసికొనిపోవునుగదా!

సర:—క్షమార్పణముగోరుట కామె యెచ్చటనున్నది?

కృష్ణ:—ఎచ్చట నున్నను గాలించి యీ మహాసాధ్విని దీసికొని రానా?

సర:—తీసికొనివచ్చుట యెక్కడ. ఆమె రాయలవారి స్మరణ చేయుచు నిచ్చటనే యంతరించినదని వినుచున్నాము.

కృష్ణ:—ఏమీ! అంతరించెనా? జగన్మోహిని యంతరించెనా? ప్రేయసీ! పరమసాధ్వీ! ఎట్టి దారుణకృత్యం బొనర్చితివి? ఈ పాపాత్మునికతంబున నెట్టి యిడుములఁ గుందితివి? ఈ పాప భారము భరింపఁగలనా? ఈ వియోగతాపము సహింపఁ గలనా?

ఉ. ఇట్టిదురాత్ముఁడీ జగతి నెందుచు గానఁగరాఁడు ధాత్రిలోఁ
పుట్టఁగలేఁడు ముందికను బుట్టఁగబోఁడు వరించివచ్చి చే
పట్టిన సాధ్వినిట్లమిత బాధలఁ బెట్టి వధించినట్టి యీ
కట్టడి కృష్ణరాయలు జగంబున నిల్వఁగలాఁడె కీర్తితోన్.

ప్రాణేశ్వరీ! నీవు లేని యీ జీవితము నా కేల? నిన్ను వదలి యుండఁజాలను. ఇదే నీ వెనువెంటనే వచ్చుచున్నాను. ఇంక నా జీవితము దుర్భరము—దుస్సహము—ఓ పరాత్పరా! నా జగన్మోహినితోఁ నన్నుఁ గూర్పుము. ఓ ఖడ్గరాజమా! సమస్త శత్రుకంఠ లుంఠనము జేసి యాంధ్రుల ప్రతాపము జగంబున జాటినదానవు నీవే! ఆంధ్రసామ్రాజ్యము నుద్ధరించినది నీవే! ఇపుడు మాత్ర మీ యాంధ్రసమ్రాట్ శిరంబు నుత్తరించుటకు వెనుదీయకు. హా! పరాత్పరా!!

(ఖడ్గముతోఁ బొడుచుకొనఁబోవును)

భద్ర:—[శీఘ్రముగా వచ్చి వారించి] దేవా! మిమ్మింత యాయాస పెట్టిన పాపాత్మురాలు జగన్మోహిని యిదియే!

కృష్ణ:—ఇది కలయా! నిజమా!! భూలోకమా!!! స్వర్గమా!!!

చం. అనుపమసాధ్వివీవయిని వ్యర్థముగా ననుమాన మొంది శో
ధన యిసుమంతసేయక యధర్మముగా నిను బాధపెట్టి నం
దునకయి పెక్కుభంగుల మనోవ్యథఁ జెంది వినమ్రదేహుఁడై
ప్రణమిలుచున్న వాఁడిదిగో రాయలు నీకు క్షమింపు దాసునిన్.

భద్ర:—(లేవనెత్తి) మీ పాదసేవకురాలను. మీ రిట్లు ప్రణమిల్లుట న్యాయమా! సమస్తశృంగారాభరణములను ద్యజించి యోగినినై యున్న నన్ను మరల సంసారములోనికి దింపకుఁడు.

కృష్ణ:—ప్రాణేశ్వరీ! సహజసుందరి వగు నీ కొండాభరణములేల? నీవు యోగినివగుచో నేనును రాజ్యత్యాగము చేసి జోగి నయ్యెదను.

భద్ర:—ప్రాణేశ్వరా! ఇదివరకా వియోగబాధ నెట్లో యొకటి ప్రాణముతో భరించితినిగాని మీ సాన్నిధ్యము దొఱకిన తరువాత నే నింక వియోగము భరింపఁగలనా? మిమ్ము విడిచి యొక్క నిమిషమైనను బ్రదుకఁగలనా?

(దంపతులు కలియుదురు)

తిమ్మరుసు:—[దూరమున ప్రవేశించి] మహారాజుగా రెక్కడ?

కృష్ణ:—దేవీ! ఆ తిమ్మరుసయ్యవారే పెక్కాపదలనుండి నన్ను రక్షించిన పితృసమానులు.

(దంపతులు నమస్కరింతురు)

తిమ్మ:—శుభమస్తు! అన్యోన్యానురాగప్రాప్తిరస్తు. అమ్మా! సీతా దేవివలె నీవును వనవాసము జేసి పతివ్రతాశిరోమణివై పూజ నీయురాలవైతివి.

శా. తల్లీ నిన్విడనాఁటాదిగను నిద్రాహారముల్ లేక క్షో
భిల్లెన్ నీ ప్రియవల్లభుండు ప్రజలున్ భీతిల్లుచున్నారు వా
నల్లేవించుకయున్ నశించె నవనిన్ భాగ్యంబులున్ బంటలున్
గల్లోలంబులు మాన్పి బ్రోవఁగదవే కల్యాణి నీ నాథునిన్.

కృష్ణ:—ఓ ఆంధ్రవాణీ! ఎట్టి కృపాకటాక్షములం జూపితివి.

ఆంధ్రవాణి:—[ప్రత్యక్షమై] వత్సా! నా దాస్యంబు మాన్పి గరుత్మంతునివలె తల్లి ఋణ మిదివరకే తీర్చుకొంటివి. నీయట్టి వాణీసేవకుం డెపుడుదయించెనో యప్పుడే ధన్యురాలనైతిని. ఆంధ్రదేశము నేడు ధన్యమయ్యె.

సీ. అఖిలదేశంబుల కాదర్శకంబుగా
నాంధ్రదేశంబు ధన్యతనుబొందె
శ్రీరాముడిప్పుడు నీరూపమున నిట్టు
లాంధ్రులకొఱకునై యవతరించె
జానకియాశచే జన్మించె నీ భద్ర
కేవలమిదియె కిష్కింధసుమ్మి
యాంధ్రభాషాయోష నాదరించిన నీదు
జన్మ మీరీతిని సఫలమయ్యె

తే. గీ. ఉత్కలేంద్రుని సంబంధ ముద్వహించి
యాంధ్రులకు నోఢ్రులకు మైత్రి హత్తినావు
ధరణి నెల్లరు నా చంద్రతారకముగఁ
దలచుకొందురు నిన్నవతారమూర్తి.

[శ్రీకృష్ణ—భద్ర—తిమ్మ—ఆంధ్రమాత]

కం. నిత్య శుభమంగళము స
త్కృత్యుఁడు సీతాయుతుండు శ్రీరామునకున్
నిత్య జయమంగళము శుభ
కృత్యుఁడు భద్రాయుతుండు శ్రీకృష్ణునకున్.

మంగళమ్—మంగళమ్—మంగళమ్.

సమాప్తము.

END OF
TITLE

"శ్లో. శ్రీమత్ప్రోత్తపినన్నెచోడతనయః శ్రీవేఙ్క-భూపాలకః
తత్పుత్త్రోరిపదాచలాపహాపవిః కామక్షితీనాయకః
సూనుఃసూర్యకులాన్వయామ్బుధిశశీ శ్రీబల్లిభూపాలకః
గౌరీనాథపదాబ్జవన్దితగుణః సౌజన్యరత్నాకరః."

అను శ్లోక మాశాసనముల మొదట వ్రాయఁబడి యున్నది. దీనింబట్టి పొత్తపినన్నెచోడునకు వేంకభూపాలుఁడును, వానికి కామక్షితినాయకుఁడును, వానికి బల్లిభూపాలకుఁడును జనించినట్లుగాఁ దెలియుచున్నది. ఇందొకటి శా. శ. ౧౦౬౭ వ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. **1145-46** వ సంవత్సరమునను, మఱియొకటి శా. శ. ౧౦౮౮ దవ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. **1166-67** వ సంవత్సరమునను, శ్రీమన్మహామండలేశ్వరబల్లిచోడమహారాజుచే వ్రాయింపఁబడినవి. ఈశాసనములలో నన్నెచోడుఁడు చోడబల్లికిఁ బ్రపితామహుఁ డైయుండఁగా, కొణిదెనశాసనములలో నన్నెచోడుఁడు చోడబల్లికి మునిమనుమఁ డైయున్నట్లుగాఁ జెప్పఁబడి యున్నది. మన్నెపల్లిశాసనములలోని చోడులును, కొణిదెనశాసనములలోని చోడులు నొకవంశములోనివారై యొక్క ప్రదేశమునే పరిపాలించుచున్నవా రనుటకు ననేకనిదర్శనములు గానంబడుచున్నవి. కొణిదెనశాసనములలో మొదట గన్పట్టెడి "స్వస్తిచరణసరోరుహవిహితవిలోచనప్రముఖాఖిలపృథివీశ్వరకారిత కావేరీతీరకరికాలకులరత్నప్రదీపాహితకమారాంకుశ" యనెడి సంస్కృతవాక్యము, మన్నెపల్లిశాసనములందును గానంబడుచున్నది. మన్నెపల్లిశాసనములలోని వంశమును చోడబల్లికిఁ బూర్వమందును, కొణిదెనశాసనములలోని వంశమును బరమందును బెట్టి వంశమును సమన్వయింపఁ బ్రయత్నించుట కైన నాశాసనములలో నుదాహరింపఁబడిన సంవత్సరములు బాధించుచున్నవి. ఆసంవత్సరములు సరియైనవి కావని సహేతుకముగ ఋజువుచేసినఁగాని సమన్వయము సాధ్యము గాదు. 1

1. Nellore Incriptions D. Nos. 48.49

నన్నెచోడకవిరాజశిఖామణి.

ఇతఁడు కుమారసంభవ మను ప్రౌఢకావ్యమును రచించిన కవిరాజశిఖామణి. ఇతఁడు తనకుమారసంభవములోఁ దనతల్లిదండ్రులనుగూర్చి చెప్పిన పద్యమును మీఁద నుదాహరించి యున్నాఁడను. మఱియు నితఁడు సగరసుతులను, భగీరథుని, రాఘవుని, కరికాలచోడుని సూర్యవంశాధిపతులనుగాఁ జేర్కొని వారి కెనవచ్చు సుశ్లాఘధనుఁడ నని యీక్రింది సీసపద్యములోఁ జెప్పికొని యున్నాఁడు.

" సీ. కుతలంబునడుకొనఁ గొలగొండఁగా నిల్పి
శరనిధిఁ గ్రొచ్చిరి సగరసుతులు,
మిన్నులపైఁ బాఱుచున్న యేఱిలఁ దెచ్చి
వారాశినించె భగీరథుండు,
గోత్రాచలము లెత్తికొనివచ్చి కడచన్న
రత్నాకరముఁగట్టె రాఘవుండు,
జలధిమహీసతి మొలనూలుగా జుట్టి
పాలించెఁ గరి గరికాలచోడు,
వరుస నిట్లు సూర్యవంశాధిపతు లంబు
నిధియ మేరగాఁగ నిఖిలజగము
నేలిచనినవారి కెనవచ్చు సుశ్లాఘ
ధనుఁడ నన్నెచోడజనవిభుండ."

ఈ నన్నెచోడునిగూర్చి కుమారసంభవములోని పీఠికయం దిట్లు వ్రాయఁబడి యున్నది. 1

1. ఈగ్రంథమును శ్రీయుత మానవల్లి రామకృష్ణయ్యపంతులు ఎమ్. ఏ గారు నూతనముగాఁ బ్రకటించి యొకపీఠికను వ్రాసియున్నారు.

"ఇతఁడు కావేరీతీరమున నొరయూరనుపురము రాజధానిగాఁ జోళమండలము నేలినవాఁడు. ఇతనికి దిగ్విజయమునుబట్టి టెంకణాదిత్యుఁ డనియుఁ, గవిత్వకౌశలమువలనఁ గవిరాజశిఖామణి యనియు, బిరుదములు గలిగెను. ఇతఁడు క్రీ. శ. ౯౪౦ వ సంవత్సరమునఁ బాశ్చాత్యచాళుక్యులతో నెదిర్చి రణరంగమున నిహతుఁ డయ్యెను."

ఈ పైనిజెప్పఁబడిన నన్నెచోడునికాలమును స్థలమును సరియైనవి కావని చరిత్రపరిశోధనమువలనఁ దెలియుచున్నది. ఆకాలమున నొరయూరు రాజధానిగఁ జోళమండలమును బరిపాలించుచున్నవాఁడు మొదటిపరాంతకునికుమారుఁ డగు రాజాదిత్యుఁడేగాని నన్నెచోడుఁడు గాఁడు.[1]

ఈరాజాదిత్యుఁడు రాష్ట్రకూటరా జయిన మూఁడవకృష్ణరాజుతో తక్కోలమనుప్రదేశమున యుద్ధముచేసి రణనిహతుఁ డయ్యెను. కాఁబట్టి నన్నెచోడుఁ డాకాలమున నొరయూరును బరిపాలించుచున్నవాఁ డనుమాట నిరాధారమైనది. నన్నెచోడనామము గలవారు పెక్కండ్రు పాకనాటి కమ్మనాటి తెలుఁగుచోడులలోఁ గాన్పించుచుండుటచేతను, తనగ్రంథమునందు నన్నెచోడుఁడు పాకనాటిపేరు నుదాహరించి యుండుటచేతను, శ్రీశైలమునం దుండెడు తన గురు వయిన మల్లికార్జునయోగి నభివర్ణించి తన కావ్యము నంకితము చేసియుండుటచేతను, తప్పక నన్నెచోడుఁడు తెలుఁగుచోడులలోనివాఁడుగాని యన్యుఁడు గాఁడని స్పష్టమగుచున్నది. ఇంతియగాక, పాకనాటి కధీశుఁ డైనచోడబల్లియొక్కయు, శ్రీసతియొక్కయుఁ దనూజుఁడ నని చెప్పికొనియుండుటచేత నితఁడు తప్పక కొణిదెనచోడవంశములోనివాఁ డని చెప్పవలయును. పొత్తపినాటిని, పాకనాటిని, కమ్మనాటిని, బరిపాలించిన తెలుఁగుచోడు లెల్లరు నొరయూరుపురవరాధీశ్వరుల మని తమశాసనములం దుఁ జేర్కొనియున్నారు. "అవశ్యం పితు రాచార" మ్మనునటులఁ బెద్దలయాచారము నవలంబించి ఘనతకొఱకు నొరయూరుపురవరాధీశ్వరుల మను బిరుదమును వాడుకొనుచుండిరేకాని వా రెన్నఁడు నొరయూరును బాలించినవారు కాకపోవుటమాత్రమే గాక, కన్నులతోఁ జూచినవారుగాఁగూడ నుండరు. కావున నన్నెచోడుఁడు తనకుమారసంభవములో,—

"క. కలుపొన్నవిరులఁ బెరుగం
గలుకోడిరవంబు దిశలఁ గలయఁగఁ జెలఁగన్
బొలుచు నొరయూరికధిపతి
నలఘుపరాక్రముఁడఁ టెంకణాదిత్యుండన్."

అని చెప్పికొన్నది పితరులయాచారమునుబట్టిగాని నిజముగ నొరయూరును బరిపాలించుచున్న హేతువుచేత నని యెంతమాత్రమును దలఁపరాదు. ఇంకనాకాలమున నీతఁడు పాకనాటినిగాని, కమ్మనాటినిగాని, బరిపాలించుచున్నవాఁ డేమో కొంచెము విచారించి చూతము. ఆకాలమున రెండవచాళుక్యభీమవిష్ణువర్ధనమహారాజు వేంగీదేశమును బరిపాలించుచుండెను. ఇతఁడు క్రీ. శ. ౯౩౪ మొదలు ౯౪౫ వఱకు రాజ్యపరిపాలనము చేసెను. ఇతనికొడుకు అమ్మరాజవిజయాదిత్యుఁడు క్రీస్తుశకము ౯౪౫ వ సంవత్సరము డిసెంబరు నెల ౫ వ తేదికి సరియైనశాలివాహనశకము ౮౬౭ వ సంవత్సరము మార్గశీర్ష బహుళ త్రయోదశీ శుక్రవారమునాఁడు పట్టాభిషిక్తుఁ డయ్యెను. ఇతఁడు తన సైన్యాధ్యక్షుఁ డైనదుగ్గరాజుచేత కమ్మనాటిలో ధర్మపురికి సామీప్యమున నిర్మింపఁబడిన కటకాభరణ మనియెడి జినాలయమునకు క్రీ. శ. ౯౪౫ దవ సంవత్సరమున మల్లిపూడి యనుగ్రామమును దానముచేసి యుండెను. ఈగ్రామ మిప్పుడు పేరుమాసియున్నను, శాసనములోనుండు పొలిమేర గ్రామములు వంగవోలుతాలూకాలోఁ గానిపించుచున్నవి. ఇంతియగాక, గుంటూరుమండలములోని కారెంచేడుగ్రామవాసి యగు మాసన్న యనుబ్రాహ్మణునకు సైన్యాధ్యక్షుఁ డైన దుగ్గరాజుయొక్క ప్రేరణచేత అన్మనంగనూరు, అందెకి గ్రామములలో భూదానములను జేసియుండెను. కాబట్టి యాకాలమున నాదేశమును బరిపాలించుచుండినవారు రెండవచాళుక్యభీమవిష్ణువర్ధనుఁడును, అతని

1. The Early History of India by V. A. Smith. p.419.

చిన్నకొడుకగు అమ్మరాజవిజయాదిత్యుఁడును, అగు పూర్వచాళుక్యు లని పై శాసనములను బట్టి స్పష్ట మగుచున్నది. 1

మఱియు నాశాసనములలో అమ్మరాజవిజయాదిత్యునితండ్రి యగు రెండవచాళుక్యభీమవిష్ణువర్ధనుఁడు తన దాయాదు లయిన యుద్ధమల్లుఁడు, రాజమార్తాండుఁడు, కంఠికవిజయాదిత్యుఁడు మొదలగువారితో యుద్ధముచేసి రాజమార్తాండుని సంహరించి తక్కినవారిని దేశమునుండి తఱిమఁగొట్టె నని చెప్పఁబడినది. పై నుదాహరింపఁబడినవారిలో కంఠికవిజయాదిత్యుఁడే బేటవిజయాదిత్యుఁ డనువాఁడు. ఈ బేటవిజయాదిత్యుఁడు తన తండ్రి యైనఅమ్మరాజవిష్ణువర్ధనునకు వెనుక క్రీ. శ. ౯౪౫ దవసంవత్సరమున రాజ్యభారమును వహించియు, యుద్ధమల్లునికొడు కయిన తాళరాజుచేఁ బదభ్రష్టుఁ డయ్యెను. ఇతనికొడుకు సత్యాశ్రయుఁడు. ఇతఁడు చక్రవర్తిపదముఁ బడయకపోయినను, మహామండలేశ్వరుఁడుగ నుండి వేంగిదేశములోఁ గొంతభాగమును బరిపాలించుచుండెను. ౯౪౫-౮౦ సంవత్సరముల ప్రాంతమున నున్న యీసత్యాశ్రయుని నన్నెచోడమహాకవి తన కుమారసంభవకావ్యమున నీక్రిందిపద్యములోఁ బేర్కొనియున్నాఁడు.

“క. మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గు నిలిపి రంధ్రవిషయమునఁ
జన సత్యాశ్రయునిఁ దొట్టిచాళుక్యనృపుల్.”

దీనింబట్టి నన్నయభట్టారకునకు నూఱేండ్లకుఁబూర్వమే యాంధ్రకవితాసతి వర్ధిల్లుచున్న దని స్పష్టమగుచున్నది. ఈ వైపద్యమునందుఁ జెప్పఁ

1. Ep. Ind. Vol ix., pp. 47 to 56; Copper-Plate No-19, Nellore. Inscriptions Part I. p. 164; Annual Report on Epigraply No. 655, Public, 28th July 1910, para 10.

బడిన సత్యాశ్రయునకుఁ దరువాతనే నన్నెచోడుఁ డున్నవాఁ డని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. అమ్మరాజవిజయాదిత్యుఁడు క్రీ. శ. ౯౭౦ దవసంవత్సరమువఱకుఁ బరిపాలించిన తరువాత నతని సవతియన్నయు రెండవచాళుక్యభీముని జ్యేష్ఠపుత్త్రుఁడు నగు దానార్ణవుఁడు ౯౭౦ దవ సంవత్సరమున రాజ్యభారమును వహించి ౯౭౩ వఱకు మూఁడుసంవత్సరములు రాజ్యపాలనము చేసెను. తరువాత వేంగిదేశ మరాజక మైనట్టు అనేకశాసనములవలనఁ దెలియుచున్నది. దీనికి పూర్వచాళుక్యరాజకుటుంబములో సంభవించిన పరస్పరకలహములు గొంతవఱకుఁ గారణములుగా నున్నను, వేఱొక గొప్ప కారణముగూడ గానంబడుచున్నది. దక్షిణహిందూస్థానమునందు వేఁగి రాజ్యమునకుఁ బడమర రెండుశతాబ్దములనుండి వర్ధిలుచుండిన రాష్ట్రకూటసామ్రాజ్యము నిర్మూలము గావింపఁబడి మఱలఁ బశ్చిమచాళుక్యసామ్రాజ్యము నెలకొల్పఁబడియెను. రాష్ట్రకూటచక్రవర్తి యైనరెండవకర్కలుని జయించి, పశ్చిమచాళుక్యవంశమున జనించిన యొకానొకవిక్రమాదిత్యునికొడు కగు తైలపదేవుఁడు క్రీ. శ. ౯౭౩ వసంవత్సరమున సింహాసనమెక్కి, అదివఱకు రాష్ట్రకూటచక్రవర్తులకు లోఁబడియుండిన మహామండలేశ్వరు లయిన రాజులను వశపఱుచుకొనుటకుఁ బ్రారంభించెను. ఆకాలమునందు రాష్ట్రకూటులకు సామంతులుగ నుండిన వైదుంబులు, బాణులు, నలంబులు, చోడులు మొదలగువా రాధిపత్యములకై తమలోఁ దాము పోరాడుచుఁ, గొందఱు స్వదేశములను విడిచి వేంగిదేశములోని దక్షిణభూము లాక్రమించుకొనసాగిరి. మహాబలివంశమునందు జనించిన అగ్గపరాజను బాణుఁడు అన్నగూరి అగస్త్యేశ్వరభట్టారకునకు పదియవశతాబ్దమధ్యమున భూదానము చేసినటులఁ దెలిపెడి శాసన మొకటి కమ్మనాటిలోని పొదిలిసీమలోఁ జేరిన నన్నూరుగ్రామమునఁ గనబట్టుటచేత నాప్రాంతము బాణులస్వాధీన మాయె నని యూహింపవచ్చును. ఆశాసనమునం దాతఁడు పరివీపురాధిపతి యని చెప్పఁబడినది. రాయవేలూరునకు దక్షిణభాగమునం దుండు ‘పడైవీడు’ అనునదే పరివీపుర మని కొందఱిచే నిర్ధారింపఁబడినది. ఈబాణరాజులు మొదట గాంగపల్లవులకును;

పిమ్మట ద్రావిడచోడులకును, ఆటుపిమ్మట రాష్ట్రకూటులకును సామంతులుగ నుండినటులఁదోఁచుచున్నది. ఏది యెటులున్నను బాణులు, వైదుంబులు, రాష్ట్రకూటులు, పశ్చిమచాళుక్యులు, పల్లవులు, తెలుఁగుచోడులు, మొదలగువారు వేంగీదేశముయొక్క దక్షిణభాగమును, పూర్వచాళుక్యరాజకుమారులు వేంగీదేశముయొక్క యుత్తరభాగమును కల్లోలపెట్టుచుండుటచేత దానార్ణవుని కాలమున వేంగీదేశ మరాజకముగ నుండె ననుట కొంతమాత్రమును సందియము లేదు.

క్రీ. శ. ౯౮౫ దవ సంవత్సరమున రాజరాజరాజకేసరివర్మ చోడసామ్రాజ్యమున కభిషిక్తుఁడై, వేంగీదేశ మరాజకముగ నుండుటయు తత్కారణముచేఁ దనరాజ్యముయొక్క యుత్తరభాగమున నల్లరులు రేఁగుటయుఁ గాంచి, యుపేక్షించినచోఁ దనసామ్రాజ్యమునకును భంగముసంభవించు నని యూహించి క్రీ. శ. ౯౯౯ దవ సంవత్సరమున బహుసైన్యములం గూర్చుకొని వేంగీదేశముపై దండెత్తివచ్చి కలహకారుల నెల్ల నడంచి దానార్ణవుని జ్యేష్ఠపుత్త్రుఁడగు శక్తివర్మను వేంగీరాజ్యమున కభిషిక్తునిఁ గావించి, పిమ్మట స్వదేశమునకు వెడలిపోయెను. నాటనుండియుఁ జోడులకును బూర్వచాళుక్యులకును మైత్త్రి యొప్పుచుండెను. శక్తివర్మకు తరువాత వేంగీదేశమును బరిపాలించిన విమలాదిత్యుఁడును, రాజరాజనరేంద్రుఁడును, చోడచక్రవర్తులపుత్త్రికలనే వివాహ మాడినవా రగుటచేత రాజనరేంద్రుని పుత్త్రుఁ డగు మొదటి కులోత్తుంగుని కాలమున రెండురాజ్యము లైక్యమగుట సంభవించెను. రాజనరేంద్రుని మరణానంతరమున వీరరాజేంద్రచోడచక్రవర్తి వేంగీ కళింగదేశములపై దండెత్తివచ్చి చాళుక్యసైన్యాధిపతు లగు జననాథుని, రాజమయ్యను, ముప్పరాజును, విజయవాటిక (బెజవాడ) యొద్ద నెదుర్కొని యుద్ధముచేసి జయించి రాజనరేంద్రునితమ్ముఁడగు విజయాదిత్యుని వేంగీరాజ్యమున కభిషిక్తునిఁ గావించెను. కాని క్రీ. శ. ౧౦౭౦ దవ సంవత్సరమున కులోత్తుంగచోడుఁడు చోడసామ్రాజ్యమున కభిషిక్తుఁడై పినతండ్రి యగువిజయాదిత్యుని క్షమించి యాతని వేంగీదేశమునకు రాజప్రతినిధిగ నియమించెను. ఆకాలముననే కాఁబోలుఁ

గరికాలచోడవంశజుఁడును, తెలుఁగుచోడుఁడు నైన దాసవర్మ పాకనాటిని జయించి పొత్తపిరాజధానిగఁ బాకనాటిని బాలించుచుండెను. ఈదాసవర్మ సంతతివారే తరువాత కమ్మనాటిలోని కొట్యదొనను (కొణిదెన) రాజధానిగఁ జేసికొనిరి. మొదటివారు స్వతంత్రులుగ నున్నను, తరువాతివారు కులోత్తుంగచోడునికి సామంతులుగ నుండిరి. ఈవంశములోనివాఁడే యగు చోడబల్లి క్రీ. శ. ౧౧౦౬ వ సంవత్సరప్రాంతమున నున్నట్లు దెలియుచున్నది. కాఁబట్టి మన కుమారసంభవకావ్యమును రచించిన నన్నెచోడకవి యితని కుమారుఁడే యైనయెడలఁ బండ్రెండవశతాబ్దారంభమునం దనఁగా నన్నయభట్టారకునకు నలువదిడెబ్బదిసంవత్సరములకుఁ దరువాతివాఁడుగా నుండవలయును. ఇది వాస్తవముగాక యితఁడు పైని నేనుదాహరించిన చోడబల్లయమహారాజునకు ముత్తాత యగుపొత్తపినన్నెచోడుఁడే యైనపక్షమున నన్నయభట్టారకునితో సమకాలికుఁ డైయుండవలయును.

మల్లికార్జున యోగి.

నన్నెచోడకవి తనకుమారసంభవమును మల్లికార్జునయోగి కంకితము చేయుచున్నాఁడ నని యీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

"ఉ. పూనిమహాగ్రహారపుర పుత్త్రిసమున్నతి దేవతాలయో
ద్యానతటాకసత్కృతినిధానములాశశి తారకంబు సు
స్థానములై మహింబరఁగు జంగమ మల్లయపేర సత్తసం
తానములొప్పసల్పుదుముదంబునఁదత్ప్రభునాజ్ఞ పెంపుసన్."

మల్లికార్జునయోగియే తనకుఁ గవిత్వమును బ్రసాదించినవాఁ డని యీక్రిందిపద్యములో మనోహరముగాఁ జెప్పి యున్నాఁడు.

" సీ. శరధినీరులు పయోధరములు కొనివచ్చి
కురిసి వారిధియందుఁ గూర్చునట్లు,

చేనఁబండినవిత్తు చేనికిఫలకాంక్షఁ
 బేర్మిఁగ్రమ్మఱఁ బెదవెట్టునట్లు,
రోహిణాచలపతి కూహించివరరత్న
 సంచయంబున విభూషించునట్లు,
తీర్థాళి కర్థిఁ దత్తీర్థోదకంబుల
 నెసకంబుగా నర్ఘ్యమిచ్చినట్లు,
నింగిముట్టియున్న జంగమమల్లయ
 వరమునందుఁ గనిన వస్తుకవిత
దగిలి వారియంద నెగడింతు రవికి దీ
 పమున నర్చ లిచ్చుపగిది వోలె."

ఈమహాకవి యాశ్వాసాద్యంతపద్యములలోఁ గృతిపతి యగుమల్లికార్జునయోగికిని శివునకు నభేదమును గల్పించి యభివర్ణించి యపూర్వంబైన గురుభక్తిని వెల్లడించి యున్నాఁడు.

శివయోగి యైన యీమల్లికార్జునదేవుఁడు బసవేశ్వరుని తండ్రియని చెప్పఁబడిన మండంగిమాదిరాజు కాలమున శ్రీశైలమున నివసించి యుండె నని బసవపురాణాదులవలనం దెలియుచున్నది. ఇతనింగూర్చి బసవపురాణము ౧౯, ౨౦ అధ్యాయములలో వ్రాయఁబడి యున్నది. వీరశైవమతోద్ధారకుఁడయిన బసవేశ్వరుని తండ్రి యగు మండంగిమాదిరాజు ఇతనితోఁ బ్రసంగించినటుల బసవపురాణమునం జేర్కొనఁబడినవి. అందితఁడు యోగియగుటకుఁ బూర్వము మల్లరాజ ధరణీవల్లభుఁడుగ నున్నటుల వర్ణింపఁబడి యున్నది. ఈ జంగమ మల్లికార్జునదేవుని బ్రహ్మర్షి యనియు, భూసురకులతిలకుఁడనియు, నన్నెచోడుఁడభినందించియుండుటచేత నితఁడు బ్రాహ్మణుఁ డని స్పష్టమగుచున్నది. బసవపురాణమునందుఁ జెప్పినది వాస్తవ మగు నేని యితఁడు మొదట సైన్యాధిపతిగనో మంత్రిగనో యుండి తరువాత సన్న్యసించియుండిన శైవయోగికారాధ్య

బ్రాహ్మణుఁడై యుండవలయును. ఇతరాధారము లేవియును లేక కేవలము బసవపురాణములోని వాక్యముల నమ్ముటకు సాధ్యముకాదు. ఏలయనఁ, బండ్రెండవ శతాబ్దమధ్యమునందు జరిగినవృత్తాంతము పదునాల్గవశతాబ్దప్రారంభమున రచింపఁబడియుండుటచే నిందలి విషయము లనేకములు సత్యములయినచరిత్రాంశములుగ నుండఁజాలవు. కుమారసంభవ పీఠికయందు "ఇతని గురువును కృతికర్తయు నగు మల్లికార్జునఋషి ద్రవిడమండలమున శైవసమయాచార్యత్రయములో మేలిమిగన్న మాణిక్యవాచకునితో వాదించినట్లు తెలియుచున్న" దని వ్రాయఁబడి యున్న విషయము సత్య మగు నేని మాణిక్యవాచకుఁడు వరగుణపాండ్యభూమండలాధిపతితో సమకాలికుఁడు గావున, మన నన్నెచోడుఁడును మల్లికార్జునయోగియు తొమ్మిదవశతాబ్దమధ్యమున నున్నవా రని యూహింపవలసివచ్చును. ఇది విశ్వసింపఁదగినదిగాఁ గన్పట్టదు. అయిన ననేకహేతువులచేత నితఁడు క్రీ-శ, ౧౧౨౦-౪౦ సంవత్సరముల మధ్యనున్నవాఁ డని చెప్పవచ్చును. ఈకుమారసంభవకావ్యమును బఠించితిమేని తప్పక యిది నన్నయభట్టారకునికిఁ బూర్వమున రచింపఁబడినకావ్య మని బోధపడఁగలదు. ఇతరములయినప్రమాణములు గాన్పించువఱకు నన్నెచోడకవి నన్నయభట్టునకు నలువదిడెబ్బదిసంవత్సరములకుఁ దరువాత నున్నవాఁడనియే నిశ్చయింతము. నన్నెచోడుఁడు పాశ్చాత్యచాళుక్యులతో యుద్ధముచేసి రణనిహతుఁ డయ్యె నని పీఠికయందు వ్రాసినది నిక్కమగు నేని నేను చెప్పినకాలము తప్పక సరిపోవును. ఆకాలమునందు కమ్మనాటికిఁ బైనున్న పల్నాడు మొదలగు వానిని పశ్చిమచాళుక్యులకుఁ గప్పముగట్టుచు సైన్యాధిపతులుగ నున్న హైహయవంశజులు పరిపాలనము సేయుచుండిరి. వారలతోడ నైన యుద్ధమున నీతఁడు మరణము నొంది యుండవచ్చును. ఇతఁడు యుద్ధములోఁ జనిపోవుటకుఁ గారణము కృతిముఖంబున మగణము తరువాత రగణము నిలుపుటయే యని అథర్వణాచార్యుఁడు తనఛందస్సునం దీ క్రిందిపద్యమునఁ దెలిపియున్నవాఁడు.

"క. మగణమ్ముఁ గదియ రగణము
 వగవక కృతిమొదట నిలుపువానికి మరణం

బగు నిక్కమండ్రు, మడియఁడె
యగు నని యిడి తొల్లి వెంకణాదిత్యుఁ డనిన్."

ఇది కారణ మైనను గాకపోయినను ఇతఁడు యుద్ధములో మరణము గాంచె ననుమాట వాస్తవమనుటకు సందియములేదు. ఇతఁడొకప్పుడు రాజ్యముచేసె నని చెప్పుదురు. అందుచేతనే కాఁబోలుఁ దనకుమారసంభవమున నీకవి:—

"క. పురుషుఁడు పురుషున కని న
స్థిరజీవిత లోభయుతమతిని వినమితుఁడై,
స్మరకలహకుపితుఁ బ్రాణే
శ్వరి నాయుధసమితిఁ దెలచువాఁడటు మీఁదన్."

"ఉ. మంచిగఁ బ్రీతిఁబాయక సమస్తజనంబులు దన్నుఁగొల్వఁ జీ
వించిన ధన్యుఁ డౌమహిమ వీడిన జీవము మేననిల్ప నా
సించి విభుండు దానొకట సేవకుఁడై మనుకంటె ముందఱా
ర్జించినకీర్తి నిల్వ గతిసేకుఱఁగా ననిచావు సేగియే."

అని వ్రాసికొని యున్నాఁడు. ఇతఁడు రచించిన కుమారసంభవము పదిరెండాశ్వాసముల గ్రంథము. ఇది కాళిదాసుకావ్యమునకుఁ దెలుగు గాదని చెప్పఁబడినది. దీనిలో గణపతిజననము, సతీదహనము, మదనదహనము, పార్వతీవివాహము, కుమారోదయము, తారకాసురయుద్ధము, తత్పరాజయమును వర్ణింపఁబడినవి. ఈ కవిరాజశిఖామణి కావ్యములో వర్ణన లత్యద్భుతములై నూతనములై యున్నవనియు, ఏతత్కృతి చాలఁ బ్రాచీనమైనను సకలకావ్యలక్షణములకుఁ బుట్టినిల్లగుటచేత నప్పుడె మెఱుఁగిచ్చితీర్చిన చిత్రమువలె మనోరంజకముగా నున్నదనియు, రాజకవులలోను గవిరాజులలోను నిట్టివాఁడు లేఁడనుట యంత యతిశయోక్తి గాదనియుఁ దద్గ్రంథమును సంపాదించి ప్రక

టించిన బ్రహ్మశ్రీ రామకృష్ణయ్య ఎం, ఏ గారి యభినుతోక్తు లొప్పిదము లనుటకు సందియములేదు. 1

---

1. ఈ కవియొక్క శైలి తెలియుటకై కుమారసంభవము నుండి యీ క్రిందిపద్యము లుదాహరించుచున్నాఁడను. మదనదహన సమయమున:—

"క. కనికోపించెనొ, కానక
మునుగోపించెనొ మహోగ్రముగ నుగ్రుఁడు సూ
చినఁగాలెనొ చూడక యటు
మునుగాలెనొ నాఁగ నిమిషమున నఱగాలెన్.

క. గిరిసుత మైఁ గామాగ్నియు
హరు మై రోషాగ్నియుం దదంగజు మైను
ద్ధురకాలాగ్నియు రతి మై
యురుశోకాగ్నియును దగిలి యొక్కట సెగసెన్"

రతి సహగమనోద్యుక్తయైచితిఁ జొరఁజనునప్పు డాకాశవాణి యాత్మహత్య వారించిన శోకాగ్నితప్త యగుచు:—

క. కరువునఁ బూరితమై లో
హరసములోఁ గాలునట్టు లంగజు శోకో
ద్ధురశిఖి రతి తను విమ్ముగ,
గరఁగియుఁ బొడవఱక లోనఁ గాలుచునుండెన్.

సీ. అలమట సెడి యుండె నిలువదు చిత్తంబు
మూర్ఛిల్లి వెడఁ బాసి పోవ దొండె,
నూఱట గొని యుండె నాఱదు శోకాగ్ని
వొరిమాలగొని కాలిపోవ దొండె,
ఘర్మాశ్రుజలము లొక్కటఁ గట్టుకొన వొండె
బొడ వంతయుఁ గరంగి పోవ దొండె,

కామచోడదేవమహారాజు.

ఇతని పేరిటనే కొట్యదోనయందు కామేశ్వరాలయము నిర్మింపఁబడి యదిగాని యదియు నిపుడు గానఁబడదు. ఇతఁడు శా. శ. ౧౦౫౯ దవ సంవత్సరమునకు సరియైన క్రీ-శ. ౧౧౩౭ దవ సంవత్సరమున కొట్యదోనలోని బల్లేశ్వరాలయమునకు భూదానము చేసినట్లుగ నాపట్టణములోని శంకరస్వామి యాలయమండపముమీఁది యొక స్తంభము పై దానశాసనము గనబడుచున్నది. శా. శ. ౧౦౮౩-దవ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౧౬౧-వ సంవత్సరమున శ్రీయదేవి పైదేవాలయమునకు భూదానము చేసినట్లుగఁ గనబడుచున్న శాసనములో శ్రీయదేవి కామచోడమహారాజుయొక్క పట్టమహిషి యని చెప్పఁబడి యున్నది. ఆసంవత్సరముననే చేయఁబడిన మఱియొక భూదానశాసనములో శ్రీయదేవి బల్లయచోడదేవమహారాజునకుఁ గోడ లని చెప్పఁబడి

బర్వునిట్టూర్పులు పట్టుసఁ బడవొండె,
    బొం దిమ్ముగాఁ బాసి పోవ దొండె,
నిట్టి కడలేని దుఃఖాబ్ధిఁబెట్టి ముంపఁ
    దలఁచియో కాక పోనీక బలిమి నాదు
ప్రాణ మొడలిలో నాకాశవాణి దెచ్చిఁ
    మగఁడఁ జెఱఁ బెట్టె నని రతి మఱఁగుచుండె."

వీరపురుషులు యుద్ధమునకు వెలువడుచుండ నొక వీరపత్ని పచ్చవలువయుఁ, గంధమాల్యములును, వీరమద్దియలును ధరించి నిశ్చితహృదయుం డగుపతిం గనుంగొని చెప్పుచున్నది.

ఉ. ఓలము లేదు కూర్చు నని యోడి యుండితిఁ గూర్మియెల్ల నేఁ
డాలము చేసి నన్ను బెడయాకులఁబెట్టె మనఃప్రియుండు త
న్నాలములోనఁ బెట్టి దివిజాంగనలం గలయంగనెత్తె నే
నాలనె బేల గాక చెలియా యని నెచ్చెలిమీఁద వ్రాలుచున్."

యున్నది. వీనింబట్టి యితఁడు బల్లయచోడదేవమహారాజునకుఁ బుత్త్రుఁ డని స్పష్టపడుచున్నది. ఈ కామచోడదేవమహారాజునకు భీమన ప్రెగ్గడగ నున్న ట్లొకశిలాశాసనమువలనను, గుండయదండనాయకునిపుత్త్రుఁడు రామన్న దండనాయకుఁడు సైన్యాధ్యక్షుఁడుగ నున్నట్లు మఱియొక శాసనమువలనను, శ్రీధరభట్టు పురోహితుఁడుగ నున్నట్లు వేఱొకశిలాశాసనమువలనను దెలియ వచ్చుచున్నది. ఇతనికొడుకు త్రిభువనమల్ల దేవుఁడు.

త్రిభువనమల్ల దేవచోడమహారాజు.

ఈతఁడు శా.శ. ౧౦౭౦-వ సంవత్సరమునకు సరియైన క్రీ.శ. ౧౧౪౮ వ సంవత్సరమునఁ దనతండ్రి పాత్తపికామచోడదేవమహారాజునకును, తల్లి శ్రీయదేవికిని, పుణ్యముకలుగుటకొఱకు కొట్యదోనలోని భీమేశ్వరాలయమునకు భూదానము చేసియుండెను. ఈ భీమేశ్వరాలయమును ఇతని సేవకులలో నొకరు గట్టించి రని మఱియొక శిలాశాసనమువలనఁ గనబడుచున్నది. శంకరమహాదేవాలయములోని మఱియొక శిలాశాసనమును బట్టి శ్రీయదేవి, పాత్తపికామచోడదేవుఁడు, నితనికిఁ దల్లిదండ్రు లని యుదాహరింపఁబడి యున్నది. కాఁబట్టి యీతఁడు బల్లయచోడదేవమహారాజునకు మనుమఁ డగుచున్నాఁడు. ఈతఁడు కొట్యదోనలోని కొండపై త్రిభువనమల్ల శ్రీకేశవదేవాలయమును నిర్మించెను. ఆదేవాలయములోని శాసనములలో నాకొండకు "అభినవరైవతకాద్రి" యనుపేరు గలిగియున్నట్లుగాఁ జెప్పఁబడినది. కమ్మనాటిని బరిపాలించిన కొణిదెనచోడులలో నీత్రిభువనమల్లచోడదేవుఁడు మిక్కిలి పరాక్రమవంతుఁడుగఁ గనబడుచున్నాఁడు. ఇతని పట్టమహిషి మాబలమహాదేవి. కేతన యనువాతఁ డీతనికిఁ బ్రెగ్గడగ నుండె నని యొకశిలాశాసనమువలనఁ దెలియ వచ్చుచున్నది ఇతనిశాసనములు కమ్మనాటిలోని వంగవోలుసీమలోను దర్శిసీమలోను గానవచ్చుచున్నవి. ఇతని పరిపాలనము క్రీ.శ. ౧౧౫౪-౫౯ దవ సంవత్సరము వఱకు జరుగుచుండె నని శాసనములవలనఁ దెలియుచున్నది. ఇత

నికి నన్నెచోడుఁడు, కన్నరదేవచోడుఁడు, శ్రీచోడదేవుఁడు నను ముగ్గురు కొడుకులు గలరు.

నన్నెచోడ మహారాజు.

ఈ నన్నెచోడమహారాజు తనతండ్రి యైన త్రిభువనమల్ల దేవచోడమహారాజునకును, తల్లి యైన మాబలమహాదేవికిని, పుణ్యముకలుగుటకొఱకు అభినవ రైవతకాద్రిపై నున్న కేశవస్వామి యాలయమునకు శా.శ. ౧౦౭౦ దవ సంవత్సరము, అనఁగా క్రీ.శ. ౧౧౪౮ దవ సంవత్సరమున భూదానము చేసెను. క్రీ.శ. ౧౧౫౧-వ సంవత్సరమున మఱల నాదేవునికే మఱియొకభూదానము చేసెను. బొప్పూడిగ్రామములోని శివాలయమునకు సమీపమున నున్న స్తంభముపై నన్నెచోడునియొక్కయు, నతని యిర్వురసోదరులయొక్కయు, నామములను దెలిపెడి శాసనము మఱియొకటి గలదు. ఈ శాసనము క్రీ.శ. ౧౧౫౭-వ సంవత్సరములోనిది. ఈ శాసనము శిథిల మయినదిగ నున్నది. ఈ నన్నెచోడునకు అన్నమంత్రి మహాప్రధానిగ నుండె నని యొకటిరెండుశాసనములవలనఁ దెలియుచున్నది. కాఁబట్టి యీనన్నెచోడుఁడు క్రీ-శ, ౧౧౬౦-వ సంవత్సరకాలమున నున్నవాఁ డని స్పష్టముగఁ దెలియుచున్నది.

సామంత మండలేశ్వరులు.

ఈ కోనిదెనచోడులలో ప్రాచీనులు చోడచక్రవర్తి యగు కులోత్తుంగ రాజేంద్రచోడునకు సామంతులుగనున్నను, జాలవఱకు స్వతంత్రపరిపాలనము నే చేయుచుండిరి గాని, తరువాతివారు రాను రాను స్వాతంత్ర్యమును గోల్పోయి చోడచక్రవర్తులకు ప్రతినిధులుగా నున్న మహామండలేశ్వరు లయిన వెలనాటి చోడులకు లోఁబడి పరిపాలనము చేయవలసిన వారయిరి. కడపటివారు, కాకతీయచక్రవర్తుల యధికారము విజృంభించినతరువాత తమకుంగల యల్పస్వాతంత్ర్యమునుగూడఁ గోల్పోయి కేవలము సేవకులై వార్గల్లను గొలువవలసిన వారలైరి. ఈ సామంతచోడులు శైవమతావలంబకులుగ నుండి రని వేఱుగ నొక్క

చెప్ప నక్కఱలేదు. వీరు దేశాభిమానము, భాషాభిమానము, దేవతాభక్తి గల వారలు. కమ్మనాటిలోఁ బెక్కు శివాలయములను నిర్మించిరి. ఈ శివాలయములకుఁ బెక్కు భూదానములను గావించిరి. వీరు కీర్తినారాయణు లనియు, వెంకణాదిత్యులనియు, జగనొబ్బగండలనియు, ఒరయూరుపురవరాధీశ్వరులనియు, బిరుదములను వహించుచు వచ్చిరి. ఈ కొట్టిదొనచోడులలోఁ గడపటివారి చరిత్రము కాకతీయులఁగూర్చిన ప్రకరణములో వివరింపఁబడును.

నెల్లూరు తెలుఁగుచోడులు.

కొంతకాలము చాళుక్య చోడచక్రవర్తులకును మఱికొంతకాలము కాకతీయాంధ్రచక్రవర్తులకును లోఁబడి నెల్లూరు మొదలుకొని ద్రావిడదేశము నందలి కాంచీపురము వఱకును గల దేశమును బరిపాలించి మండలేశ్వరు లని ప్రసిద్ధి గాంచిన విక్రమసింహపురి తెలుఁగుచోడులను గూర్చిన చరిత్రమును సంగ్రహముగా వివరింతును. ఇప్పటి నెల్లూరు, పూర్వ మీచోడుల పరిపాలన కాలమున విక్రమసింహపుర మని పేర్కొనంబడుచుండెను. ఈ తెలుఁగుచోడులు తాము సూర్యవంశజు లనియు, కశ్యపగోత్రు లనియు, కరికాలాన్వయు లనియు, తమ శాసనములయందుఁ జెప్పుకొని యుండి రని యిదివఱకే చెప్పియుంటిని. ఈచోడవంశము నభివర్ణించుచు తిక్కనసోమయాజి తన నిర్వచనోత్తరరామాయణమునఁ బైసంగతినే యీ క్రిందిపద్యములోఁ దెలిపియున్నాఁడు.

"ఉ. అంబుజనాభునాభి నుదయంబయి వేధ మరీచిఁగాంచె, లో
కంబులకెల్లఁ బూజ్యుఁ డగుకశ్యపుఁ డాతనికిన్ జనించె, వి
శ్వంబు వెలుంగఁ జేయఁగ దివాకరుఁ డమ్మునికుద్భవించె, వా
నిం బొగడం జతుశ్శ్రుతులు నేరకయున్నవి నాకు శక్యమే."

ఇంతియగాక కరికాలుఁడు త్రిలోచనపల్లవుని జయించె ననియు,

కావేరినది కానకట్ట కట్టించె ననియుఁ గూడ నీక్రింది పద్యములో సూచించి యున్నాఁడు.

"శా. చేసేతం బృథివీశు లందుకొనఁ గాశీసింధుతోయంబులన్
జేసెన్ మజ్జన, ముంగుటంబున హరించెం బల్లవోర్వీశు ను
ల్లాసంబొందఁగ, ఫాలలోచనము, లీలంగట్టెఁ గావేరి, హే
లాసాధ్యాఖిలదిఙ్ముఖుండు కలికాలక్ష్మావిభుం డల్పుఁడే."

ఇతని వంశమునందు మధురాంతకపొత్తపిచోడుఁడును, తెలుంగు బిజ్జనయు జనించిరి. వీరిలో మొదటివానిని తిక్కన తన నిర్వచనోత్తరరామాయణమునం జేర్కొనియుండలేదు. ఈచోడభూమీశుఁడు మధురాపట్టణమును జయించుటచేతను, ఆంధ్రదేశమునఁ బొత్తపి యను పట్టణమును నిర్మించుటచేతను, మధురాంతక పొత్తపిచోడుఁ డని వ్యవహరింబడియె నఁట. విక్రమసింహపురిచోడులలోఁ బెక్కండ్రు మధురాంతకపొత్తపిచోడుఁ డనుటను బిరుదునామముగాఁ దమనామములకు ముందుఁ జేర్చుకొని శాసనములలో వ్రాయుచుండిరి. కవిబ్రహ్మ యగు తిక్కనసోమయాజి మధురాంతక పొత్తపిచోడునిఁ బ్రశంసింపకపోయినను బిజ్జనను మాత్రము,

"చ. పరుషపరాక్రముం డగుచుఁ బల్లవుపీట నుదగ్రు లైనప
న్నిరువుర నాతనిం గలయ నెన్ని యనర్గళమత్సరంబు మై
మురరిపుసన్నిభుండు పదుమువ్వురగం డడగంగఁ బెట్టెఁ దా
భిరుదు వెలుంగ బిజ్జఁ డరిభీకరభూరిభుజాబలంబునన్."

అని యభివర్ణించి యున్నాఁడు. ఈబిజ్జన ఉజ్యపురియందు, శిఖరమున గరుడ విగ్రహము గలిగియుండునట్టి విజయస్తంభము నొకదాని నిర్మించె నని చెప్పఁబడియెను. 1

మధురాంతక పొత్తపిచోడుఁడును, తెలుంగు బిజ్జనయు నున్నకాలము మనకుఁ దెలియరాదు. బిజ్జన మొదటివాని వంశమున జనించె నని శాసనములలోఁ జెప్పఁబడియుండుటంజేసి యా యిరువురకు నడుమఁ గల కాలము దీర్ఘమైయుండవలయును. ఈ నెల్లూరు తెలుఁగు చోడులనుగూర్చిన చరిత్రమును దెలిసికొనుటకుఁ బూర్వ మీ దేశభాగము (నెల్లూరునకు దక్షిణభాగము) యొక్క పూర్వచరిత్రమును గొంత దెలిసికొన వలయును.

నెల్లూరు పూర్వచరిత్రము

తొమ్మిదవ శతాబ్దాంతమున దక్షిణహిందూస్థానమునఁ బాండ్యుల బలపరాక్రమములు క్రమక్రమముగా క్షీణించుచుండినవి. ఆదిత్యచోడుఁడు గాంగపల్లవరాజయిన అపరాజితుని నోడించి వానిరాజ్య మాక్రమించుకొన్నందునను,[1] మొదటి పరాంతకుని శాసనములు నెల్లూరు సరిహద్దునకు విశేషదూరముగాని కాళహస్తికి సామీప్యమునఁ గనిపట్టఁబడినందునను, చోడులు తమ రాజ్యమును నెల్లూరు మండలములోని దక్షిణభాగమునకు వ్యాపింపఁజేసి వేంగీదేశపాలకులగు తూర్పుచాళుక్యులకుఁ బొరుగువారయి రని యూహింపవచ్చును. చోడుఁ డైన మొదటి పరాంతకుఁడు గాంగపల్లవులకు సామంతులయిన బాణులను జయించినట్లుగఁ జెప్పుకొనియెను. బాణరాజుల శాసనములు గొన్ని కాళహస్తికి సామీప్యమున నున్న గుడిమల్లము కడఁ గానిపించినవి. 2 ఈభాగము పేరంబాణప్పాడి యను పేరం బరఁగుచుండెను. పదియవశతాబ్దమధ్యమున రాష్ట్రకూటులు చోడరాజ్యములో నొకకొంతభాగము నాక్రమించుకొనుటచేత కొంతకాలము చోడులప్రభ కొంచెము తగ్గినంతమాత్రమున చో

1 కోయంబుత్తూరు మండలములో కొల్లేగాలము అను స్థలమునకు ౧౨ మైళ్ల దూరమున నున్న ఉజ్జపురమే ఉజ్యపుర మని డాక్టరు లూడర్సు గారు నిర్ధారణము చేసినారు. అయినను నెల్లూరు మండలములో సూళూరుపేట డివిజనులో ఉమ్మూర్చరు అనెడి గ్రామ మొకటి కలదు. ఇచ్చటి యఱవశాసనములలో నీ గ్రామము ఉచ్చియూరని వాడఁబడి యున్నది.

1. Annual Report on Epigraphy for 1905-06. p.10.
2. Annual Reprt on Epigraphy for 1903-04. p. 26.

డుల యధికారము నెల్లూరు మండలములోని దిగువభాగమునకు వ్యాపించుట కభ్యంతరము గలిగినదని యెంతమాత్రమును దలంపరాదు. కాఁబట్టి నెల్లూరు మండలములోని యుత్తరభాగము వేంగీదేశములోను దక్షిణభాగము జయంగొండ చోళమండలములోను జేరియుండె నని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. అయినను నెల్లూరునకు దిగువభాగమునందలి దేశమున మొదటిపరాంతకుఁడు మొదలుకొని మొదటికులోత్తుంగచోడునివఱకు శాసనము లేవియు నంతగాఁ గానంబడకుండుటచేత నాభాగము చాలవఱకు నిర్జనారణ్యముగా నుండె నని యూహింపఁబడుచున్నది. మొదటిపరాంతకుని నాఁటనుండియు ద్రావిడదేశమునందుఁ బెక్కు దేవాలయములు స్థాపింపఁబడి పెక్కు శిలాశాసనములు లిఖియింపఁబడి యున్నవి. ఈభాగము చోడులవశమై యున్నను మొదటికులోత్తుంగుని కాలమువఱకు నొక్క శాసనమైన గానరాదు. శాసనములు మాత్రమే గాక వీరు కట్టించిన పురాతనదేవాలయము లయిన నాప్రదేశమునఁ గానరావు. ఆ ప్రదేశమున శైవులకుఁగాని వైష్ణవులకుఁగాని పవిత్రములైనపుణ్యక్షేత్రము లేవియును గానరావు. ఈ ప్రదేశము అనంతపురము, బళ్లారి, కడప, కందనోలు మండలములవలెనే దండకారణ్యములో నొకభాగముగానుండి చాలకాలము నిర్జనప్రదేశముగానే యుండినది. ఆహేతువుచేతనే యీ ప్రదేశమునందు పురాతనదేవాలయములుగాని, పురాతనబ్రాహ్మణాగ్రహారములుగాని లేకపోయెను. మొదటి కులోత్తుంగచోడచక్రవర్తి కాలమున వేంగీ చోడరాష్ట్రములు కలసిపోయినప్పుడు రామానుజుని కాలమున నుద్ధరింపఁబడిన వైష్ణవమతతరంగ మొకటి కాంచీపురమునుండి యుత్తరభాగమున కెగఁబ్రాకెను. కులోత్తుంగుని పరిపాలనావసానసమయమునను, దరువాతను, సామంతమాండలికరాజకుటుంబములవారు తెలుఁగు దేశములో నందందుఁ గుదురుకొనుటచేత నిస్సారమైన యీ భూప్రదేశము జనాకీర్ణమై వర్ధిల్ల మొదలుపెట్టెను. తరువాత దేవాలయములు నిర్మింపఁబడుచు వచ్చినవి. ప్రస్తుతకాలమునందుఁ గన్పట్టెడి దేవాలయములు మొదలగునవి మొదటి కులో

త్తుంగచోడచక్రవర్తికాలమునకుఁ దరువాత నిర్మింపఁబడినవి కాని, వానికిఁ బూర్వము నిర్మింపఁబడినవి కావు.

నెల్లూరు మండలములోని శిలాశాసనము లనేకములు మొదటికులోత్తుంగచోడుని తరువాత లిఖియింపఁబడినవే. కులోత్తుంగచోడచక్రవర్తియొక్క ముప్పదిరెండవ పరిపాలనసంవత్సరమున గూడూరు తాలూకాలోని రెడ్డిపాలెమునందలి పాండురంగేశ్వరునకును, పావనవినాయకదేవునకును, భూదానములు మొదలగునవి చేయఁబడి శాసనము లిఖింపఁబడినది. అందీభాగము రాజేంద్రచోడమండలములోని కడలగొండ ‘పవ్వత్తిరికొట్ట మ’ని వ్యవహరింపబడియెను. పైఁజెప్పిన దేవతలు కాకండి యను మహానగరమున వేంచేసియున్నటులఁ జెప్పఁబడియున్నది. ఈ శాసనమున నడవులును బొలములును బావులును నానావిధ ఫలవృక్షములును దానము చేయఁబడినటులఁ జెప్పఁబడియున్నది. ఇది దేవదాన మనియు, దీనికి పన్ను తీయఁబడదనియు, నందుఁ జెప్పఁబడి యున్నది.[1] ఇతనికి లోఁబడి యీ భాగమును బరిపాలనము సేయుచుండిన మహామండలేశ్వరు లగు తెలుఁగుచోడు లెవ్వరో దెలియరాదు. ఇతని కొడుకగు విక్రమచోడుని కాలమున నున్న సామంతు లయిన తెలుఁగుచోడులనామములు గొన్ని వినంబడుచున్నవి.

మధురాంతకపొత్తపిచోడ బేటరాజు ౧౧౨౧

ఇతఁడు తెలుఁగు బిజ్జనవంశమున జనించిన మొదటికులోత్తుంగచోడచక్రవర్తి కుమారుఁడును, పరకేసరివర్మ బిరుదాంకితుఁడు నగు విక్రమచోడుని కాలమున నాతనికి లోఁబడిన మాండలికుఁడుగ నుండి పొత్తపినాటిని బరిపాలించుచుండెను. ఇతఁడు విక్రమచోడుని విజయమునకై క్రీ. శ. ౧౧౨౦-౨౧ వ సంవత్సరమున నొకదానశాసనమును వ్రాయించుటయే పైయంశమును స్థాపించుచున్నది. ఇతని శాసనము పొత్తపినాటిలోని నందలూరు గ్రామమునఁ గన్పట్టుచున్నది. ఈ బేటరాజును, మఱియొక తెలుఁగుచోడుని శాసనము

1. Nellore Instriptions. Vol. 1. p. 443, G. 87.

లోఁ గన్పడుచున్న బేటభూపాలుఁడును, ఒక్కఁడే యని నిర్ధారించుటకు బేట భూపాలుని మనుమఁ డగు నల్లసిద్ధిరాజు క్రీ. శ. ౧౨౦౨ వ సంవత్సరమునఁ బరిపాలనము సేయుచున్నందున తాత మనుమలకు నడిమికాలము మిక్కిలి దీర్ఘ మైనది గనుక నిద్దఱు నొక్కరే యని చెప్పుటకుఁ గొంచెము సంశయము గలుగుచున్నది. విక్రమచోడ చక్రవర్తికాలమునఁ బొత్తపినాటికిఁ బరిపాలకుఁడుగ నుండిన మఱియొక తెలుఁగుచోడుని నామము గానంబడుచున్నది. అతఁడు మధురాంతక పొత్తపిచోడవిమలాదిత్యుఁడు. ఇతనికిని పైఁజెప్పిన మధురాంతక పొత్తపిచోడ బేటరాజునకు నెట్టి సంబంధము గలదో విచారింప వలయును.

మధురాంతక పొత్తపిచోడ విమలాదిత్యుఁడు
౧౧౨౪-౧౧౨౬.

ఇతఁడు సిద్ధిరాజునకుఁ గుమారుఁ డనియు, పొత్తపినాటికి ప్రభువనియు నందలూరు శాసనములవలనఁ దేటతెల్లమగుచున్నది. ఈ విమలాదిత్యునితండ్రి యగుసిద్ధిరాజు శాసన మొకటి నందలూరునఁ గానంబడుచున్నది. విక్రమచోడుని విజయముకొఱకు విమలాదిత్యుఁడు క్రీ. శ. ౧౧౨౪-౨౬ వ సంవత్సరమున నొక గ్రామమును దానము చేసెను. ఈ మధురాంతకపొత్తపిచోడ విమలాదిత్యుని కుమారుఁ డగు సోమేశ్వరుఁడు నందలూరులోని సౌమ్యనాథస్వామి దేవాలయముయొక్క వెలుపలిగోపురమును నిర్మింపించె నని మఱియొక శాసనము వలనఁ దెలియుచున్నది. ఈ సిద్ధిరాజును, విమలాదిత్యుఁడును, సోమేశ్వరుఁడును నిర్వచనోత్తరరామాయణ కృతిపతి యగు మనుమసిద్ధిరాజు పూర్వికులతోడ నెట్టిసంబంధము గలవారో స్పష్టముగా బోధ కాలేదు. అయినను నిర్వచనోత్తరరామాయణకృతిపతి యగు మనుమసిద్ధిరాజు తాత యగు సిద్ధిరాజుయొక్క చిన్నతమ్ముఁ డగు తమ్ముసిద్ధిరాజుయొక్క శాసనములలో నొక

1 Annual Report on Epigraphy, for 1937. Nos. 579, 584.

దానియందు బేటరాజునకు సిద్ధిరాజను జ్యేష్ఠసోదరుఁడు కలఁ డని చెప్పఁబడినది గావున, విమలాదిత్యుఁ డాసిద్ధిరాజునకు కొడు కని చెప్పవచ్చును.

మధురాంతక పొత్తపిచోడ నల్లసిద్ధిరాజు.

మధురాంతక పొత్తపిచోడ బేటరాజునకు "దయభీమరాజు, నల్లసిద్ధిరాజు, ఎఱ్ఱసిద్ధిరాజు" అను ముగ్గురు కొమారులు గలరు. వీరిలో నల్లసిద్ధిరాజు కాంచీపురమును జయించి గైకొనియె నని చెప్పఁబడి యున్నది. ఇం దెంత మాత్రమయిన సత్య ముండు నేని చోడచక్రవర్తి యైన మూఁడవ కులోత్తుంగ చోడునికిఁ బరాభవము జరిగియుండును. ఎందులకన, నల్లసిద్ధిరాజు తమ్ముఁడైన యెఱ్ఱసిద్ధిరాజు పుత్త్రు లయిన మనుమసిద్ధిరాజు, తమ్ముసిద్ధిరాజు మూఁడవ కులోత్తుంగచోడదేవునకు సామంతమాండలిక రాజులుగ నుండి కప్పముగట్టువారుగ నుండిరి. త్రిభువనచక్రవర్తి యైన మూఁడవకులోత్తుంగ చోడదేవుని శాసనములలోఁ గొన్నిట నాతఁడు కాంచీపురమును వశపఱుచు కొనుటయు, జయవిజృంభణముతో నగరము సొత్తెంచుటయుఁ, జేర్కొనఁబడుట చూడ, నల్లసిద్ధిరాజునుండి గైకొనియె నని యూహింప నవకాశము గలిగించుచున్నది.

మధురాంతక పొత్తపిచోడ మనుమసిద్ధిరాజు.

మూఁడవ త్రిభువనచక్రవర్తి కులోత్తుంగచోడదేవుని పరిపాలన కాలమున శా. శ. ౧౧౧౨ వ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౧౯౦ వ సంవత్సరమున నొక సిద్ధిరాజు కోవూరు గ్రామమును నెల్లూ రనియెడు విక్రమసింహపురములోని యొక విష్ణ్వాలయమునకు దానముచేసినట్లు దెలిపెడి శాసన మొకటి ప్రాచీనమైనదిగఁ గన్పట్టుచున్నది. ఇందు సంస్కృతభాగములో సిద్ధిరాజుపేరు గలదు గాని, ద్రావిడభాగములో ఆనామము చాలభాగము శిథిలమై పోయినందున స్పష్టముగఁ దెలియరాకున్నది. ఇంతియగాక జయంకొండచోడమండలములోని యొక భాగ మగు చేదికుల వలనాటిలోని నెల్లూ రనెడు విక్రమసింహపురములోని నాగరీశ్వరదేవునకు పూగినాటి లోని యెఱ్ఱంపల్లి గ్రామములోఁ గొన్ని భూములను దానము చేసినట్లు తెలిపెడు

నెల్లూరుశాసనమున మనుమసిద్ధిరాజు పేరు గానంబడుచున్నది. కాఁబట్టి పై రెండుశాసనములలోని సిద్ధిరాజు మధురాంతకపొత్తపిచోడమనుమసిద్ధిరాజని యూహింప వచ్చును. ఇతఁడు తమ్ముసిద్ధిరాజుయొక్క జ్యేష్ఠ సోదరుఁడనియు, చోడతిక్కనృపాలుని తండ్రి యగు మనుమసిద్ధిరాజుయొక్క తమ్ముఁడును తన పినతమ్ముఁడు నైన తమ్ముసిద్ధిరాజునిమిత్తమై తాను రాజ్యపాలనము వహించినటులఁ జెప్పఁబడిన రెండవబేటరాజుయొక్క శాసనము లేవియు నెల్లూరునఁ గనఁబట్టవు. 1

మధురాంతక పొత్తపిచోడ తమ్ముసిద్ధిరాజు.

ఇతని శాసనములు తెలుఁగుదేశమునందును, అఱవదేశమునందును గూడ గానవచ్చుచున్నవి. ఈ తమ్ముసిద్ధిరాజుయొక్క కావలి శాసనములలో నతని వంశావళి పేర్కొనఁబడినది గాని, తక్కిన శాసనములలోనివానితోఁ గొంచెము భేదించి యున్నది.

కరికాలుని వంశమున బేటరాజు జనించె ననియు, నతనికి ఎఱ్ఱసిద్ధిరాజు పుట్టె ననియు, నతనికి శ్రీదేవిగర్భమున తమ్ముసిద్ధి మొదలుగాఁ గొందఱు కొమారులు పుట్టిరనియు, వారిలో నల్లసిద్ధి తమ్ముసిద్ధికి జ్యేష్ఠసోదరుఁడనియుఁ బేర్కొనఁబడి యున్నది. 'మన్మ' యనుటకు 'నల్ల' యని నెల్లూరు శాసనసంపాదకులు పొరఁబాటున భావించియుందురేమో యని సంశయము కలుగుచున్నది. ఇందు నల్లసిద్ధిరాజు పట్టాభిషిక్తుఁడయ్యెననియు, నతని యనుమతినంది యతని చినతమ్ముఁడు తమ్ముసిద్ధిరాజు రాజ్యపాలనము చేయుచున్నాఁడనియు చెప్పఁబడినది. శా. శ. ౧౧౨౯ దవ సంవత్సరమున(క్రీ.1207-8) తన తల్లిపేరిటఁ బరంగు శ్రీపురమును బండారు త్రిపురార్యుఁడు మొదలగు వేదవేత్తలయిన బ్రాహ్మణులకు నగ్రహారముగా నొసంగినటుల వ్రాయఁబడినది. మఱియు నితఁడు పల్లికొండపెరుమాళ్లకు ముండనాటిలోని తామరమడువుచెఱువను గ్రామమును దానము చేసినటుల నెల్లూరిలోని యొక యఱవ

1. Ep. Ind. Vol. Vii-p. 122.

శాసనమునఁ బేర్కొనఁబడినది. త్రిభువనచక్రవర్తి యైన కులోత్తుంగ చోడదేవుని ౩౬ వ పరిపాలన సంవత్సరమున నీదానశాసనము వ్రాయఁబడినటులఁ జెప్పఁబడినందున, నీతఁడు మూఁడవకులోత్తుంగచోడ దేవునికి లోఁబడి పరిపాలనము సేయుచుండిన యొక మండలేశ్వరుఁడని తేటపడుచున్నది.

మఱియును, ఇతని శాసనములు చెంగల్పట్టు మండలములోని కాంచీపురము, తిరువొత్తియూరు, తిరుప్పాసూరు గ్రామములలోను, ఉత్తరార్కాడు మండలములోని తిరువాలంగాడు గ్రామములోను, గానంబడుచున్నవి. కాంచీపురశాసనములో నితఁడు గండగోపాలునికి శ్రీదేవిగర్భమున జనించిన పుత్త్రుఁడనియు, మనుమసిద్ధిరాజునకుఁ గడగొట్టుతమ్ముఁడనియు, వ్రాయఁబడియున్నది. గండగోపాలుఁడనునది యెఱ్ఱసిద్ధిరాజుయొక్క నామాంతరము. తమ్ముసిద్ధిరాజుయొక్క శాసనములు ద్రావిడదేశమునందు క్రీ. శ. ౧౨౦౯ మొదలుకొని ౧౨౦౭ వఱకుఁ గానంబడుచున్నవి.

భుజబలవీర నల్లసిద్ధనచోడదేవ మహారాజు.

మధురాంతక పొత్తపిచోడ నల్లసిద్ధిరాజను నామము గల మఱియొక సిద్ధిరాజు త్రిభువనచక్రవర్తి మూఁడవకులోత్తుంగునకు సామంతుఁడుగ నుండినటుల గూడూరు, నెల్లూరు, ఆత్మకూరు శాసనములవలనఁ దెలియుచున్నది. ఇతనికి బేటరాజను కుమారుఁ డుండెను. క్రీ. 1218-14 సంవత్సర ప్రాంతమున నున్న మధురాంతక పొత్తపి బేటరాజు పైఁజెప్పినతఁడే యై యుండవచ్చును. ఈబేటరాజు తండ్రి యగు నల్లసిద్ధిరాజు పేరు మఱికొన్ని శాసనములందుఁ గన్పట్టెడి. భుజబలవీరనల్లసిద్ధనచోడదేవమహారాజు నొకఁడే యని కొందఱు తలంచుచున్నారు. ఈ భుజబలవీరనల్లసిద్ధనచోడదేవమహారాజు వల్లూరుపురము రాజధానిగఁ జేసికొనియె నని చెప్పఁబడినది. ఈ వల్లూరుపురము మార్జవాడి లేక మహారాజపది యను ఏడువేలు గల దేశమునకు రాజధానిగ నుండెను. కడపకు వాయువ్యమూల ౮ మైళ్లదూరమున నున్న వల్లూరు పూర్వము గొప్పపట్టణమై వల్లూరుపుర మను పేరఁ బరఁగుచుండెను.

ఇతఁడు క్రీ. శ. ౧౧౯౨-౯౩ సంవత్సరమున వ్రాయఁబడినట్టి చాడూరుశాసనమునుబట్టి కాంచీపురమునుండి కప్పము గైకొనినటులఁ దెలియుచున్నది. ఈ నల్లసిద్ధిరాజు కాంచీపురమునుండి కప్పము గైకొనినమాట సత్యమే యైనయెడల రెండవరాజాధిరాజునకుఁ దరువాత కాంచీపురమునఁ బుట్టిన సంక్షోభములో నీతఁడు కొంత జోక్యము కలుగఁజేసికొని యుండవలయు నని యూహింపవలసి యున్నది. 1 అప్పుడు స్వల్పకాలము కాంచీపురము చోడులవశమునుండి తొలఁగి పోయినది. క్రీ. శ. ౧౧౯౬ వ సంవత్సరమునకుఁ బూర్వమునఁగాని, పరమునఁగాని, త్రిభువనవీరదేవుఁ డగు మూఁడవకులోత్తుంగుఁడు కాంచీపురమును మఱల వశముచేసికొని యుండును. ఇతఁ డసమానము లయిన గజబలంబులతోడఁ గాంచీపురముపై దండెత్తి అనేకము లయిన వీరకృత్యములను గావించి విరోధు లయిన రాజుల నెల్ల జయించి కాంచీపురమునుజొచ్చి క్రోధాగ్ని చల్లాఱినవెనుకఁ గాంచీపురము మొదలుగ నుత్తరభాగము నంతటఁ గప్పమును విధించి గైకొనియె నని చెప్పఁబడినది. 2 ఈభుజబలవీర నల్లసిద్ధచోడదేవమహారాజునకును, ఎఱ్ఱసిద్ధిరాజుకొడుకగు తమ్ముసిద్ధిరాజునకు నెట్టి సంబంధముగలదో శాసనములంబట్టి యేమియుం దెలియరాదు. తెలుఁగుచోడులు, పల్లవులు, నాగవంశజులు మొదలగు వారిలో నల్లసిద్ధిరాజు, మనుమసిద్ధిరాజు నను పేరులుగలవారు పెక్కండ్రు కానంబడుచుండుటచేత వీరికిం గల సంబంధము దెలిసికొనుట బహుకష్టసాధ్య మనుటకు సందియము లేదు.

భుజబలవీర ఎఱ్ఱసిద్ధనదేవచోడ మహారాజు.

ఇతఁడు త్రిభువనచక్రవర్తి మూఁడవరాజరాజునకు సమకాలికుఁడుగఁ గనబట్టుచున్నాఁడు. తమ్ముసిద్ధిరాజు తండ్రి యగు ఎఱ్ఱసిద్ధిరాజును ఈసిద్ధిరాజును నొక్కరుగారని తోఁచుచున్నది. ఇతఁడును కాంచీపురాధిపతి వలనఁ

(1) A. R. 1904-05, para 19.

(2) S. I. I. Vol III. p. 218.

గప్పము గైకొనినటుల మహిమలూరు శాసనమునం బేర్కొనఁబడినది. ఇతని రాజ్యప్రతిపాలకుఁడు గొల్లపెడి బయ్యపనాయకుని కడగొట్టుతమ్ముఁ డగు బమ్మినాయకుఁ డని(భీమనాయకుఁడు)పై మహిమలూరు శాసనమునందే పేర్కొనఁబడియున్నది. ఈశాసనము శాలివాహనశకము ౧౧౩౯ వ సంవత్సరమునకు సరియైన క్రీ.శ. ౧౨౧౭-౧౮ దవ సంవత్సరమున వ్రాయఁబడినది. భీమనాయకుఁడీతనికి మహాప్రధానిగను, సైన్యాధ్యక్షుఁడుగ నుండెను. ఈ యెఱ్ఱసిద్ధిరాజునకు కీర్తినారాయణుఁ డనియు, అయ్యనసింగనియు, ఒరయూరుపురవరాధీశ్వరుండనియు, భుజబలవీరుఁ డనియు, సాహసోత్తుంగుఁ డనియు, నీ మొదలగు బిరుదము లెన్నియో చెప్పఁబడినవి. భావి పరిశోధనముల వలనఁ గాని యీ తెలుఁగు చోడులలో నీపేరులుగల వారికిం గల పరస్పరసంబంధబాంధవ్యములను విస్పష్టముగాఁ జెప్పుట సాధ్యము గాదు. తెలియని వానిని గూర్చి గ్రంథబాహుళ్యముచేసి వ్రాయుటయు నంత మనోహరముగాఁ గనబట్టదు.

తిక్కభూపతి.

ఇతఁడు మనుమసిద్ధిరాజుయొక్క కొడుకని తిక్కనసోమయాజి విరచితంబైన నిర్వచనోత్తరరామాయణంబునఁ దెలుపంబడినది. అందు:—

"క. తద్వంశంబునఁ బోషిత
విద్వజ్జనుఁ డహితభుజగవిహగేంద్రుఁడు ధ
ర్మాద్వైతమూర్తి వరయో
షిద్వర్గస్మరుఁడు మన్మసిద్ధి జనించెన్.

సీ. భూరిప్రతాపంబు వైరిమదాంధకా
రమున కఖండదీపముగఁ జేసి,
చరితంబు నిఖిలభూజననిత్యశోభన
లతకును నాలవాలముగఁ జేసి,

కరుణ దీనానాథ కవిబంధుజనచకో
రములకుఁ జంద్రాతపముగఁ జేసి,
కీర్తిజాలముఁ ద్రిలోకీశారికకు నభి
రామరాజిత పంజరముగఁ జేసి,
గీ. సుందరీజనంబు డెందంబునకుఁ దన
నిరుపమాన మైన నేర్పుకలిమి,
నతిప్రసిద్ధిచేసి యసదృశలీలమైఁ
బరఁగె మనుమసిద్ధి ధరణివిభుఁడు."

అని తిక్కభూపాలుని తండ్రి యగు మనుమసిద్ధిరాజు వర్ణింపఁబడియున్నాఁడు. తెలుఁగుచోడులలోఁ దిక్కనృపతి సుప్రసిద్ధుఁడును, పరాక్రమవంతుఁడు నైయున్నాఁడు. ఇతఁడు బాల్యముననే అసహాయశూరుఁడై యుద్ధములను జేసి విజయములను గాంచుచు వచ్చె ననుటకు దృష్టాంతములు గలవు.

తిక్కరాజు పృథ్వీశ్వరరాజును జంపుట.

ఈతిక్కభూపతి శైశవమునం దనఁగా బదునెనిమిదేండ్ల ప్రాయమునకు లోపలనే పృథ్వీశ్వరరాజుతో యుద్ధముచేసి రణరంగమున వాని మస్తకమును ద్రుంచి దానితోఁ గందుకక్రీడ గావించినాఁ డని నిర్వచనోత్తరరామాయణమునం దీక్రిందిపద్యమువలనఁ దేటపడుచున్నది.

" ఉ. కేశవసన్నిభుండు పరిగీతయశోనిధి చోళతిక్కధా
త్రీశుఁడు కేవలుండె, నృపు లెవ్వరికాచరితంబు గల్గునే,
శైశవలీలనాఁడు పటుశౌర్యధురంధరబాహుఁడైన పృ
థ్వీశనరేంద్రుమస్తకము నేర్తెఱఁ గందుకకేళి సల్పఁడే."

ఈపద్యములోఁ జెప్పఁబడిన పృథ్వీశ్వరరాజు వెలనాటిచోడులలోనివాఁడై రాజరాజచోడచక్రవర్తికి సామంతుఁడై పండ్రెండవశతాబ్దాంతమున నున్నవాఁడు. ఇతఁడు వెలనాటి మనుమగొంకరాజునకును జయాంబికకును దనయుండు. ఇతని శాసనములు క్రీ. శ. ౧౧౬౩ మొదలుకొని ౧౧౮౦ వఱకును గానిపించుచున్నవి. ఇతఁడు బ్రదికియున్నకాలముననే క్రీ.శ. ౧౧౭౬-౭౭ వ సంవత్సరమున నితనితల్లి యగుజయాంబిక తాను గట్టించిన పిఠాపురములోని కుంతీమాధవస్వామి యాలయమునకు గంగైకొండచోడవలనాటిలోని యంతర్భాగ మగు ప్రోలనాటిలో నున్న నవఖండవాడ యను గ్రామమును దానముచేసెను. కాఁబట్టి పృథ్వీశ్వరరాజు పండ్రెండవశతాబ్దాంతమున నుండెననుటకు సందియము లేదు.

దానశాసనములు.

ఈతిక్కభూపాలుని దానశాసనము లనేకములు చెంగల్పట్టుమండలములోను, నెల్లూరుమండలములోను గానంబడుచున్నవి. ఇతఁడు జయంగొండచోళమండలములోఁ జేరిన పేరూరునాటిలోని యంతర్భాగ మైన చేదికులమాణిక్యవలనాటిలోని విక్రమసింహపుర మనియెడు నెల్లూరులో నొకపేట యగు మనుమకేశ్వరపురములో నిర్మింపఁబడిన మనుమకేశ్వర పెరుమాళ్లకు మండనాటిలోని ఈడపూర్వారు గ్రామమును పన్నుచెల్లింపకుండు పద్ధతిని దానము చేసె నని రామతీర్థ దేవాలయములోని యొక యఱవశాసనముఁబట్టి దెలియుచున్నది. ఇందు తిరుక్కాళత్తిదేవుఁడని తిక్కనృపతి పిలువంబడుచున్నాఁడు. ఇయ్యది త్రిభువనచక్రవర్తి యగు మూఁడవకులోత్తుంగచోడుని ౩౧ వ పరిపాలన సంవత్సరమున నీశాసనము లిఖియింపఁబడినది. మూఁడవకులోత్తుంగచోడచక్రవర్తియొక్క ౩౨ వ పరిపాలన సంవత్సరమున తిరుక్కాళత్తిదేవుఁడు పరిపాలనము చేయుచున్నటుల ఊటుకూరు శాసనమువలనను దెలియుచున్నది. కావున నీతఁడు పేరికిమాత్రము కులోత్తుంగచోడునకు లోఁబడినవాఁడై యతనికడపటికాలమున నుండెను. ఇతని దానశాసనములు రాపూరు

కందుకూరు, తాలూకాలలోఁ బెక్కులు గలవు. ఇతఁడు శాసనములలో చోడతిక్కనృపతి యనియు, తిరుక్కాళత్తిదేవచోడమహారాజనియు, భుజబలవీరతిరుక్కాళదేవచోడమహారాజనియు,వ్యవహరింపఁబడుచు వచ్చెను. మూఁడవకులోత్తుంగునికిఁ దరువాత నితఁడు మిక్కిలి బలవంతుఁడై స్వతంత్రుఁడై పరిపాలనము చేసెను.

తిక్కరాజు విజయములు.

తిక్కనకవి తన నిర్వచనోత్తరరామాయణమునఁ దిక్కభూపాలుని వర్ణించు వర్ణనాసందర్భమున మఱికొన్ని చరిత్రాంశములనుగూడ వక్కాణించి యున్నాఁడు. వాని నీక్రింద నుదాహరించెదను.

సీ. లకుమయ గురుములూరికి నెత్తివచ్చిన
గొనఁడె యాహవమున ఘోటకముల,
దర్పదుర్జయు లగు దాయాదనృపతుల
ననిలోనఁ బఱపఁడే యాగ్రహమున,
శంభురాజాది ప్రశస్తారిమండలి
కముఁ జేర్చి యేలఁడే కంచిపురముఁ
జేదిమండలము గాసిగఁ జేసి కాళవ
పతి నియ్యకొలుపఁడే పలచమునకు
గీ. రాయగండగోపాలు నరాతిభయద
రాయపెండార బిరుదాభిరాము నుభయ
రాయగండాంకు ఖండియరాయుఁ దిక్క
ధరణివిభుఁ బోల రాజుల కరిది గాదె."

"మ. కమలాప్తప్రతిమానమూర్తి యగునాకర్ణాటసోమేశు దు
ర్దమదోర్వర్గము రూపుమాపి నిజదర్పంబుం బ్రతిష్ఠించి లీ

లమెయిం జోళుని భూమిపై నిలిపి చోళస్థాపనాచార్యనా
మము దక్కంగొనితిక్కభూవిభుఁడుసామర్థ్యంబు చెల్లింపఁడే?"

ఈపైపద్యములలో నితఁడు శంభురాజాది శత్రువులను జయించి కాంచీపురమును బాలించె ననియు, చోడుని సింహాసనముపైనుంచి చోడస్థాపనాచార్యబిరుదమును గైకొనియె ననియుఁ జెప్పఁబడి యున్నది. ఈపద్యములలోఁ జెప్పఁబడిన విషయము లన్నియు సత్యము లనుటకు సందియము లేదు. మూఁడవకులోత్తుంగచోడచక్రవర్తికి వెనుక రాజ్యపదవిని వహించిన మూఁడవ రాజరాజచోడుఁడు సమర్థుఁడుగాక మిక్కిలి బలహీనుఁ డగుటవలనను, గృహకలహములవలనను, మధ్యఁ గొంతకాలము రాజ్యమును బోఁగొట్టుకొనవలసినవాఁ డయ్యెను. ఇతనికాలమున మారవర్మ సుందరపాండ్యమహారాజు వలనను, కర్ణాటకవీరసోమేశ్వరునివలనను, పల్లవుండైన కొప్పరింజింగదేవుఁడనుమహామండలేశ్వరునివలనను, రాజ్యమున కుపద్రవము సంభవించెను. మహామండలేశ్వరుఁ డైన యీతిక్కభూపాలుఁడు పాండ్యులను, కర్ణాటకవీరసోమేశ్వరుని జయించి, రాజరాజచోడుని సింహాసనమున నిలిపి చోళస్థాపనాచార్యుఁ డనుబిరుదమును వహించెను. గాంగవాడిదేశమును బరిపాలించుచుండిన హొసలరా జయిన వీరసోమేశ్వరుని శాసనములు క్రీ. శ. ౧౨౩౪ మొదలుకొని ౧౨౬౩ వఱకును గానంబడుచుండుటచేతను, ఆతనితోఁ దిక్కభూపతి సమకాలికుం డని చెప్పఁబడి యుండుటచేతను, తిక్కరాజుకాలము మనకు స్పష్టముగాఁ దెలియుచున్నది. వీరసోమేశ్వరుఁడు గూడ చోళుని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టె ననియు, అతఁడును తిక్కభూపాలుఁడు నొండొరులతోఁ బోరాడుచుండి రనియును, దెలియుచుండుటచేత, నిరువురును చోళసింహాసనమునకై పోరాడువారిలోఁ జెఱియొకప్రక్కను జేరి యుద్ధము చేసి రని యూహింప నగు. కాంచీపురములోని అరుళాళప్పెరుమాళ్లయాలయములో క్రీ. శ. ౧౨౩౩-౩౪ గవ సంవత్సరమున నీతిక్కనృపతిపేరిట నొకదానశాసనము గానంబడుచున్నది.

తిక్కరాజు వైష్ణవమతస్థుఁడు.

తిక్కభూపతి వైష్ణవమతావలంబకుఁ డని యొకశాసనమునుబట్టి స్పష్టముగాఁ దెలియుచున్నది. అరుళాళప్పెరుమాళ్ల దేవాలయములోని యొక శాసనమునఁ దన మత మిట్టిదని ప్రకటించినాఁడు. "ఎవ్వఁడు శ్రీవరదరాజస్వామి చరణసరోరుహములను బూజించుచున్నాఁడో అతఁడే నాకు తల్లియు, తండ్రియు, గురువును, ధనమును, పుత్త్రుఁడును, మిత్త్రుఁడును అగుచున్నాఁడ"ని చెప్పియుండుటచేత, నితఁడు వైష్ణవభక్తాగ్రేసరుఁ డని స్పష్టముగా బోధపడుచున్నది. కాంచీపురములోని శ్రీవరదరాజస్వామి దేవాలయము సుప్రసిద్ధమైనది. ఇతఁడు వైష్ణవమతమునకుఁ బోషకుం డగుటవలననే యితనికాలమునను, ఇతని సంతతివారికాలమునను, వైష్ణవమతము పాకనాడు, కమ్మనాడులలో విశేషముగా వ్యాపించినది. అనేక విష్ణ్వాలయములు నెలకొల్పఁబడినవి. వానికి వసతు లేర్పఱుపఁబడినవి. ఇతఁడు వైష్ణవమతావలంబకుఁ డయినను పరమతసహనము గలిగియుండినట్లే గానంబడుచున్నాఁడు.

తిక్కరాజు కవిసార్వభౌముఁడు.

ఇతనికిఁ గలికాలభూవిభుఁ డను నామాంతర ముండినటులను, ఇతఁడు విద్వాంసుఁడై, కవిసార్వభౌమబిరుదాంకము గలిగియుండినటులను, నిర్వచనోత్తరరామాయణములోని యీక్రిందిపద్యమువలనఁ జక్కఁగాఁ దెలియుచున్నది.

సీ. భృత్యానురాగంబు పెంపుఁజెప్పఁగ నేల
పరివారసన్నాహబిరుదు గలుగ,
వందిప్రియత్వంబు వర్ణింపఁగా నేల
పాఠకపుత్త్రాఖ్య పరఁగుచుండ,
సకలవిద్యాపరిశ్రమముఁ దెల్పఁగ నేల
కవిసార్వభౌమాంక మవనిఁ జెల్ల,
సుభగతామహిమఁ బ్రస్తుతిసేయఁగా నేల
మన్మథనామంబు మహిమ నెగడ,
గీ. నుభయబలవీరుఁ డనుపేరు త్రిభువనములఁ
బ్రచురముగ ఘోరబహుసంగరముల విజయ
లక్ష్మిఁ జేకొను బాహుబలంబు సొంపు
పొగడనేటికిఁ గలికాలభూవిభునకు.

తిక్కనకవి యితనిని సకలవిద్యాపరిశ్రమము గలవాఁ డనియు, కవిసార్వభౌమబిరుదము గలవాఁ డనియు వర్ణించియున్నాఁడే కాని యీతఁడు రచించిన గ్రంథము లెవ్వియో పేర్కొన్నవాఁడు కాఁడు. విక్రమార్కచరిత్రమును రచించిన జక్కయాకవిప్రపితామహుఁ డగు పెద్దయామాత్యసుకవి తిక్కభూపాలుని యాస్థానకవి యైనటుల విక్రమార్కచరిత్రములోని యీక్రిందిపద్యము వలన ధ్రువపడుచున్నది.

"గీ అనుచు నెల్లూరి తిరుకాళమనుజవిభుని,
సమ్ముఖంబున సాహిత్యసరణి మెరసి,
మహిమ గాంచిన పెద్దయామాత్యసుకవి
మనుమఁడవు నీవు నీవంశమహిమ యొప్ప."

మంత్రి భాస్కరుఁడు - సిద్ధనామాత్యుఁడు.

ఈతిక్కభూపాలునకు సిద్ధనామాత్యుండు మంత్రిగ నుండెనని కేతనకవికృతమైన దశకుమారచరిత్రములోని యీక్రిందిపద్యములోఁ జెప్పఁబడినది.

" ఉ. స్థాపితసూర్యవంశవసుధాపతి నాఁ బరతత్త్వధూత వా
ణీపతి నా నుదాత్తనృపనీతిబృహస్పతి నా గృహస్థ గౌ
రీపతి నాఁ గృపారససరిత్పతి నాఁ బొగడొందె సిద్ధిసే
నాపతిప్రోఢ తిక్కజననాథశిఖామణి కాప్తమంత్రియై."

ఈసిద్ధనామాత్యుఁ డాప్తమంత్రిగ నుండుటమాత్రమే గాక సేనాపతిగఁ గూడ నుండె నని పైపద్యమునుబట్టియే తెల్లమగుచున్నది. ఇతని యింటిపేరు కొట్టరువువారు. ఇతఁడు సుప్రసిద్ధుఁ డైన మంత్రిభాస్కరునితృతీయపుత్త్రుఁడు. శూరవరాగ్రణి యగు ఖడ్గతిక్కనకుఁ దండ్రి. కవిబ్రహ్మ యైన తిక్కన సోమయాజికిఁ బెదతండ్రి. ఈ కొట్టరువు వంశమువారిలోఁ బెక్కండ్రు తెలుఁగుచోడరాజులకడఁ బ్రధానమంత్రులుగను, సేనాపతులుగను, ఆస్థాన కవీశ్వరులుగను ఉండి యాంధ్రప్రపంచమునం దంతట విఖ్యాతిఁగాంచి యున్నారు. వీరిలో మంత్రిభాస్కరుఁడు గుంటూరుసీమకుఁ బాలకుఁడుగ నియమింపఁబడి యుండెను. ఇతఁడు రామాయణమును మొదట రచింపఁగా నది యేకారణముచేతనో ఆరణ్యకాండము తక్క తక్కినకాండము లన్నియు శిథిలములయి పోవుటచేత హుళక్కిభాస్కరాదికవులు వానిం బూరించి రని యు, ఆరామాయణమే భాస్కరరామాయణ మను పేరఁ బరఁగుచున్న దని యు నాంధ్రులచే విశ్వసింపఁబడుచున్నది. గాని మంత్రిభాస్కరునిఁబట్టి గాక హుళక్కిభాస్కరుని బట్టియే యాగ్రంథమున కానామము వచ్చిన దని యే నా యభిప్రాయము. ఇది చర్చాంశము గనుక గ్రంథవిస్తర భీతిచేతను, మఱియొక తావున నీవిషయమునుగూర్చి చెప్పవలసి యుండుటచేతను, ప్రస్తుతము నే నాచర్చ నిట వివరింపం బూనుకొనలేదు.

మంత్రిభాస్కరుఁడు రామాయణమును రచించినను, రచించి యుండక పోయినను, ఆతఁడు ప్రసిద్ధకవి యనుటకు సందియము లేదు. తిక్కనసోమయాజి తన నిర్వచనోత్తరరామాయణమునందు:—

“ సారకవితాభిరాము గుంటూరివిభుని
మంత్రిభాస్కరు మత్పితామహునిఁ దలఁచి
యైన మన్ననమెయి లోక మాదరించు
వేఱ నాకృతిగుణములు వేయు నేల? ”

అని తన కావ్యము స్వగుణముచేతఁ గాకపోయినను, తన పితామహుఁ డైన మంత్రిభాస్కరుని సారకవిత్వమహిమచేత నైనను, లోకాదరణమునకుఁ

బాత్ర మగు నని స్పష్టముగఁ జెప్పుకొని యున్నాఁడు. తన తాత యైన మంత్రిభాస్కరుఁ డాకాలమునం దంతటి ప్రసిద్ధకవి కాక యుండినయెడల తిక్కనవంటి కవిరాజశిఖామణి యట్లు చెప్పుకొని యుండునా? కేతనకవి తన దశకుమారచరిత్రమునందు తిక్కనసోమయాజి తాత యైనమంత్రిభాస్కరుని నిట్లభివర్ణించి యున్నాఁడు.

“ శా. శాపానుగ్రహశక్తియుక్తుఁ డమలాచారుండు సాహిత్యవి
ద్యాపారీణుఁడు ధర్మమార్గపథికుం డర్థార్థిలోకావన
వ్యాపారవ్రతుఁ డంచుఁ జెప్ప సుజనవ్రాతంబు గౌరీపతి
శ్రీపాదప్రవణాంతరంగు విబుధశ్రేయస్కరున్ భాస్కరున్.”

కేతనకవి యీభాస్కరమంత్రి గ్రంథరచన చేసినటులఁ జెప్పకపోయినను “శాపానుగ్రహశక్తియుక్తుఁడు’ అనియు, ‘సాహిత్యవిద్యాపారీణుఁడు’ అనియు, చెప్పుటచేతనే యతఁడు కవియైనటుల నూహింప వచ్చును. ఇంక గుంటూరివిభుత్వమును గూర్చి కొంచెము చెప్పవలసి యున్నది. “ఏకాలము నందు మంత్రిభాస్కరుఁ డుండె నని ప్రతిపక్షులు తలంచుచున్నారో యాకాలమున గుంటూరును బరిపాలించుచున్న ప్రభుఁ డొకఁడు కలఁ డని శాసనములవలనఁ దెలియవచ్చుచున్నది. ఆకాలమున గుంటూరు రాజ్యమునకుఁ బాలకుఁడు శ్రీమన్మహామండలీక గుంటూరి యుదయరాజు, అతని మంత్రి బొల్లన, సేనాని రాయనప్రెగ్గడయు, నైనట్లుగా బెజవాడ మల్లేశ్వరస్వామి వారి యాలయస్తంభమునఁ గల శాసనమువలనఁ దెలియవచ్చుచున్నది. ఈశాసనమునుబట్టి చూడఁగా గుంటూరుపాలకుఁడుగాని, మంత్రికాని, సేనానిగాని, మంత్రిభాస్కరుఁడు కాఁడని తోఁచుచున్నది” అని యొక విమర్శగ్రంథమున వ్రాయఁబడినది. ఈశాసనము క్రీ. శ. ౧౨౧౬ వ సంవత్సరమున వ్రాయఁబడినది. ఈశాసనము వ్రాయఁబడినకాలమునఁ దిక్కభూపాలుఁడు నెల్లూరు మండలమును బరిపాలించుచున్నవాఁడు. మంత్రిభాస్కరుని మూఁడవకుమారుఁ డగు సిద్ధనామాత్యుఁ డాతని కాప్తమంత్రిగ నుండె నని దెలిసికొనియుంటిమి. కాఁబట్టి మంత్రిభాస్కరుఁ డింతకుఁబూర్వము నలువది యేఁబది సంవత్సరముల

క్రిందట నుండియుండును. అప్పుడీతఁడు గుంటూరునకుఁ బాలకుఁడుగ నుండె నని నమ్ముట కేవిధమయిన యాభ్యంతర ముండును? ఉదయరాజునకుఁగాని, అతని పూర్వులకుఁగాని, బొల్లనమంత్రికిఁ బూర్వము భాస్కరుఁడు మంత్రిగ నుండియుండు నని యేల తలంపరాదు? ఇంతకును శాసనములో నుదాహరింపఁబడిన మండలేశ్వరుఁడు "గొంటూరియుదయరాజు" అని పేర్కొనఁబడినంతమాత్రమున నాతఁడు గుంటూరిసీమకుఁ బరిపాలకుఁ డని యెట్లు సిద్ధాంతము చేయవచ్చును? కానిండు. సిద్ధాంత మైనదనుకొందము. బొల్లనయేకాని యితరమంత్రు లెవ్వరు లేరని యెట్లు నిర్ధారణము సేయవచ్చును? వట్టి కుతర్కములవలనఁ బ్రయోజనము లేదు. భాస్కరునితండ్రి కేతన కమ్మనాటిని బరిపాలించుచుండిన త్రిభువనమల్లదేవచోడరాజునకు మంత్రిగ నుండెను. భాస్కరుని మూఁడవకొడుకు సిద్ధనామాత్యుఁడు తిక్కజననాథశిఖామణికి నాప్తమంత్రియు, సేనాపతియు నై యుండెను. నాలుగవ కొమారుఁడు కొమ్మనామాత్యుఁడు గుంటూరునకు దండనాథుఁడుగ నుండెను. కొమ్మనామాత్యుని పుత్త్రుఁడు తిక్కనసోమయాజి మనుమసిద్ధిరాజునకు మంత్రిగ నుండెను. సిద్ధనామాత్యునికొడుకు ఖడ్గతిక్కన మనుమసిద్ధిరాజునకు సేనాధిపతిగ నుండెను. తండ్రులును, తమ్ములును, కొడుకులును, మనుమలును, మంత్రిత్వాదిపదవులను వహించియుండఁగా మంత్రిభాస్కరుఁడు సామాన్యగృహస్థుఁడని నమ్మించుటకై ప్రయత్నపడుట మిక్కిలి శోచనీయము. ఇంతియగాక కేతనకవి తన దశకుమారచరిత్రమున విక్రమసింహపురవర్ణనమును, తత్పురాధీశ్వరుం డగు మనుమసిద్ధిమహీవల్లభునకుఁ గరుణారసపాత్రం బైన కొట్టరువు తిక్కనామాత్యుండు నిజకులక్రమాగతం బగు మంత్రిపదంబున వర్తిల్లుచు,

"గీ. అందలంబు గొడుగు లడపంబు మేల్కట్టు
చామరములు జమిలిశంఖములును
గంబగట్లు భూమి కానికఁ గాఁగఁ బెం
పెసఁగ రాచపదవు లెల్లఁ బడసె."

అని మంత్రిపదంబు నిజకులక్రమాగతం బయిన దని నుడివి యున్నాఁడు.

తిక్కనామాత్యుని కంకితము చేయఁబడిన దశకుమార చరిత్రములోని వాక్యములకంటెఁ బరమప్రమాణము లయినవి మఱి యెవ్వి కలవు? ఈ తిక్కరాజు మంత్రియైన సిద్ధనామాత్యునకుఁ బ్రోలాంబికయందు నేడుగురు పుత్త్రులు జనించి రని దశకుమారచరిత్రములోని యీ క్రింది సీసపద్యమువలనఁ దెలియుచున్నది.

సీ. విపులనిర్మలయశోవిసరగర్భీకృత
దిక్కుండు నాఁ దగు తిక్కనయును,
దర్పితక్రూరశాత్రవసముత్కరతమో
భాస్కరుం డనఁ దగు భాస్కరుండు,
నప్రతిమానరూపాధరీకృతమీన
కేతనుం డనఁ దగు కేతనయును,
నిజభుజాబలగర్వనిర్జితోగ్రప్రతి
మల్లుండు నాఁ దగు మల్లనయును,
శ్రీయుతుండు చౌహత్తనారాయణుండు,
మల్లనయు నీతివిక్రమమండనుండు,
పిన్నభాస్కరుండును బుధప్రీతికరుఁడు,
పెమ్మనయు నుదయించిరి పెంపు వెలయ."

మనుమక్షమావల్లభుండు.

తిక్కభూపాలుని కొడుకు మనుమక్షమావల్లభుండు. ఇతనినే మనుమసిద్ధి యని చెప్పుదురు. ఇతఁడు మొదట చోడచక్రవర్తి యగు మూఁడవ రాజరాజచోడునకు సామంతుఁడుగ నుండి తరువాత మూఁడవరాజేంద్రచోడచక్రవర్తికాలమున స్వతంత్రుఁడై కడపట కాకతీయాంధ్రచక్రవర్తి యగు గణపతిదేవునకు సామంతుఁడుగ నుండెను. ఇతఁడు తనకాలమున మహావీరుఁడై శత్రురాజుల నెదుర్కొని పోరాడుచు జయాపజయములను గాంచుచు వచ్చెను గాని, తనతండ్రి యైన తిక్కభూపతివలె నదృష్టశాలిమాత్రుఁడు గాఁడు.

ఈతనికిఁ గవిబ్రహ్మ యగు తిక్కనసోమయాజి మంత్రిగ నాస్థానకవిగ నుండి తన నిర్వచనోత్తరరామాయణము నంకితముచేసి యుండుటచేత, ఇతనికీర్తి యాంధ్రప్రపంచమున నాటుకొని శాశ్వతమై నిలిచియున్నది. ఇతఁడు విక్రమసింహపురము రాజధానిగఁ బాకనాటిని బరిపాలించెను. ఇతఁడు క్రీస్తుశకము పదుమూఁడవశతాబ్దమధ్యమున నున్నవాఁడు.

బ్రాహ్మణులకు వెలమలకు వివాదము.

పూర్వము ముక్కంటికాడువెట్టి యను పల్లవరాజు శ్రీశైలమునకుఁ దూర్పున నుండు దేశమున డెబ్బదియగ్రహారములను గల్పించి బ్రాహ్మణులకు దానముచేసియుండెను. అధిరాజేంద్రచోళమండల మనియెడు పశ్చిమపాకనాటిలోని పేరంగండూరుగ్రామము వానిలో నొక్కటిగా నుండెను. ఈగ్రామము నేఁబదిరెండు భాగములుగా విభాగించి ముక్కంటికాడువెట్టి బ్రాహ్మణులకు దానముచేసి యుండెను. అప్పటినుండియు నాబ్రాహ్మణులు పుత్త్రపౌత్త్రపారంపర్యము నిరాతంకముగా ననుభవించుచుండిరి. ఇట్లుండ సకలికోడూరులోనుండు వ్యవసాయదారులు తమదేశమునందు గొప్పకలహము జనించుటచేత తమదేశమును విడిచి వలస వచ్చి, యీగ్రామములోని చెఱువున కుత్తరభాగమున వసతు లేర్పఱుచుకొని నివసించుచుండిరి. మఱియు ఇనంబ్రోలుగ్రామవాసు లయిన వెలమలు కొందఱు తమగ్రామమున మహామారిజ్వర మంకురించి ప్రజానాశనము గలిగించుచుండుటచేత నాగ్రామమును విడిచి యీబ్రాహ్మణాగ్రహారమునకుఁ జనుదెంచి తామాక్రమించుకొనెడు పొలములలో నెంతపంటపండునో యంత మొత్తమును పన్నుగాఁ జెల్లించుపద్ధతిపై నొడంబడికచేసికొని గుడిసెలుకట్టుకొని కాపురముండుచువచ్చిరి. తరువాత మీనరాశియందు శని ప్రవేశించుటచేత దేశమునఁ గాటకము సంభవించెను. ఆకారణముచేత బ్రాహ్మణులు గ్రామమును విడిచిపెట్టి పోయిరి. కాటకము వదలిపోయిన తరువాత మఱికొంతకాలమునకు బ్రాహ్మణులు మరల స్వగ్రామమునకు వచ్చిరి. వెలమలు తమ యొడంబడికప్రకారము బ్రాహ్మణులకు కట్టుబడి చెల్లింపరైరి. ఇంతియగాక యాయగ్రహారము పరిపాలనము చేయునట్టి

ప్రభువుపా లయ్యెను. అందుపైని బ్రాహ్మణులు పరిపాలనము చేయునట్టి ప్రభువగు మనుమసిద్ధిరాజుకడకుఁ బోయి తమ కష్టములనుగూర్చి మొఱపెట్టుకొనిరి. మనుమసిద్ధి సదయహృదయుఁడై ఇనంబ్రోలువాసు లయిన వెలమలకు వర్తమాన మంపి పాకనాటిలోని ప్రజల సాహాయ్యమును బడసి వారి వివాదమును గూర్చి విమర్శ జరిపెను. ఆవిమర్శలో సాక్ష్యములు బ్రాహ్మణుల పైనటులఁ దేలినందున వీరరాజేంద్రచోడచక్రవర్తియొక్క పదుమూఁడవసంవత్సర పరిపాలనకాలమున అనఁగా శా. శ. ౧౧౭౯ (క్రీ. శ. ౧౨౫౭-౫౮) దవసంవత్సరమునఁ దనతండ్రి తిరుకాళదేవ మహారాజు పుణ్యముకొఱకు మనుమసిద్ధిరాజు కోడూరుగ్రామమును బ్రాహ్మణులకు దానము చేసెను. ఈవిషయములు కడపమండలములోని నందలూరి యాఱుశాసనములలో నొకదానివలనఁ దేటపడుచున్నవి.[1] దీనింబట్టి పదుమూఁడవశతాబ్దమునకుఁ బూర్వము కడపమండలములో మహామారిజ్వరము (ప్లేగు) గాని, అటువంటిదే మఱియొక యంటువ్యాధిగాని వ్యాపించి యుండెననియు, అట్టి సమయములయందు స్వగృహములను విడిచిపెట్టి పొలములలో గుడిసెలువైచికొని కాపురముండుట క్షేమకర మని ప్రజలు తెలిసికొని యున్నారనియుఁ బైశాసనములోని విషయములు స్పష్టముగఁ దెలుపుచున్నవి. ఈశాసనములోఁ జెప్పఁబడిన కోడూరుగ్రామము కడపమండలములోని పుల్లంపేటతాలూకాలో నున్నది. పేరంగండూరుగ్రామ మిప్పుడు గానరాదు. పైశాసనమునుబట్టి మనుమసిద్ధిరాజు పేరికిమాత్రము వీరరాజేంద్రచోడచక్రవర్తికి సామంతుఁడుగ నున్నటు లగపడుచున్నను, స్వతంత్రుఁడై పరిపాలనము చేయుచుండె నని తేటపడుచున్నది. ఈ మనుమసిద్ధిరాజుయొక్క వీర్యవితరణరూపవివేకమహిమాదులు నిర్వచనోత్తరరామాయణమునఁ గవిబ్రహ్మచేఁ జక్కఁగా వర్ణింపఁబడినవి.

మనుమసిద్ధి శత్రురాజులను జయించుట.

ద్రావిడోర్వీపతి గర్వంబు దునిమి కర్ణాటదర్ప విఘాతంబు గావించిన

---

1 Annual Report on Eepigraphy of 1907. No. 580.

విజయస్కంధేశ్వరుని, రక్కసగంగని, మహారాష్ట్రసామంతుఁ డైన సారంగుని జయించె నని నిర్వచనోత్తరరామాయణములోని యీక్రింద నుదాహరింపఁ బడిన పద్యములం బట్టి గ్రహింప నగు.

"మ. ద్రవిడోర్వీపతిగర్వముం దునిమి శౌర్యంబొప్పఁ గర్ణాటద
ర్పవిఘాతంబు నొనర్చి వైరిమనుజేంద్రశ్రేణికిన్ గొంగనా
నవనిం బేర్కొనియున్న యట్టి విజయస్కంధేశ్వరుం గాసిగా
నెవిచెం జోళవమన్మసిద్ధి యనిఁ బ్రాయేటం బ్రగాఢోద్ధతిన్.

* * *

ఉ. రంగదుదారకీర్తి యగురక్కసగంగనిఁ బెంజలంబు మై
భంగ మొనర్చి మన్మజనపాలుఁడు బల్విడి నాఁచికొన్న రా
జ్యాంగము లెల్లనిచ్చి తన యాశ్రితవత్సలవృత్తి యేర్పడన్
గంగయసాహిణిం బదము గైకొనఁబంచెఁ బరాక్రమోన్నతిన్.

* * *

శా. శృంగారంబు నలంగ దేమియును బ్రస్వేదాంకురశ్రేణి లే
దంగంబుల్ మెఱుఁ గేద వించుకయు మాహారాష్ట్రసామంతు సా
రంగుం దోలి తురంగముం గొనిన సంగ్రామంబునం దృప్తస
ప్తాంగస్ఫారయశుండు మన్మవిభు పంపై చన్న సైన్యంబునన్.

ఇందలి మొదటిపద్యమున ద్రవిడోర్వీపతిగర్వమును దునిమి కర్ణాటదర్పవిఘాతంబు గావించి శత్రురాజమండలికి గొంగ యై యున్న విజయస్కంధేశ్వరునిఁ బ్రాయేటనే మన్మసిద్ధి సమరంబునఁ బ్రగాఢోద్ధతిఁ గాసిగా నెవిచె నని చెప్పఁబడి యున్నది. ఇందుఁ బేర్కొనఁబడిన విజయస్కంధేశ్వరుండు త్రిభువనచక్రవర్తిబిరుదాంకితుఁ డగు విజయగండగోపాలదేవుఁ డని తోఁచుచున్నది. ఈవిజయగండగోపాలదేవుని శాసనములు గాంచీపురమునం గానంబడుచున్నవి గాన, నీతఁడు ద్రావిడమండలమును జయించి పాలించినవాఁ డని చెప్పుటకు సందియము లేదు. ఇంతియగాక యితఁడు పాండ్యమండలాధీశ్వరుఁ డయిన జటవర్మసుందరపాండ్యదేవుని యుద్ధమున నోడించి తఱిమినట్లుగఁ

గానంబడుచున్నది. పైవానిలో విజయస్కంధేశ్వరునికిఁ జెప్పఁబడిన విశేషణములు విజయగండగోపాలునకు మాత్రమే వర్తించుచున్నవి గాని, మఱియొకనికి వర్తింపఁ జాలవు. ఇతఁడు క్రీ. శ. ౧౨౫౦ మొదలుకొని ౧౨౮౮ వఱకును బరిపాలనము చేసినట్లుగఁ గానంబడుచున్నది. ఇతని శాసనములు కాంచీపురమునందు మాత్రమే గాక, నెల్లూరుమండలములోని గూడూరు, నెల్లూరు, సూళూరుపేట తాలూకాలలోఁ గానిపించుచున్నవి. మనుమసిద్ధి తండ్రి యగు తిక్కరాజుకాలమునఁ బాండ్యులు కాంచీపురముపై దండెత్తివచ్చి యారాజ్యమాక్రమింపఁగాఁ దిక్కరాజు పాండ్యులతో యుద్ధముచేసి వారలను దఱిమి మఱల చోడుని సింహాసనమునఁ గూరుచుండఁ బెట్టి చోళస్థాపనాచార్యబిరుదమును వహించె నని తెలిసికొనియుంటిమి కదా. తిక్కరాజు మరణానంతరము పాండ్యరాజులు తమ తొంటిపూనికను విడనాడక కాంచీపురము మొదలుకొని యుత్తరభూమిని జయింపఁగోరి పలుమాఱు దాడి వెడలివచ్చి నెల్లూరునకు దిగువనున్న దేశమును గల్లోలపెట్టుచుండిరి. వారిలో జటవర్మసుందరపాండ్యమహారాజు ప్రముఖుఁడుగా నుండెను. క్రీ. శ. ౧౨౪౯దవ సంవత్సరమునఁ గాకతీయగణపతిదేవచక్రవర్తి యాంధ్రదేశమునుండి పాండ్యరాజులను బాఱఁద్రోలి కాంచీపురమున నొకదేవాలయములో నొకదానశాసనమును వ్రాయించెను. 1.

అయినను, జటవర్మసుందరపాండ్యమహారాజు మఱుసటి సంవత్సరమునం దనఁగా ౧౨౫౦ వద సంవత్సరమునఁ గాంచీపురమార్గమున నాంధ్రదేశముపై దండెత్తివచ్చి తెలుఁగుచోడులను జయించి మనుమసిద్ధిరాజును నెల్లూరినుండి పాఱఁద్రోలి సిద్ధిరాజునకు శత్రువు లయిన వీరులను పట్టాభిషిక్తులను గావించి నెల్లూరులోని పల్లికొండపెరుమాళ్లదేవునకు మండనాడులోని మావడికుండగ్రామమును దానముచేసె నని తెలిపెడి శాసనము

1. Ind. Ant. Vol XXI. p. 202; Ep- Ind. Vol VII. No. 588, Kielhorn's List of Inscriptions of Southern India.

నొకదాని రంగనాయకస్వామి దేవాలయములోని యొక స్తంభముపై వ్రాయించెను. 1. ఆసంవత్సరముననే విజయగండగోపాలదేవుఁడు కాకతీయులసాహాయ్యమునుబడసికాని, పడయకకాని జటవర్మ సుందరపాండ్యదేవుని, వానిసైన్యములను నెల్లూరుమండలమునుండి పాఱఁద్రోలి యుండవలయును. ఈవిజయగండగోపాలునినే తరువాత మనుమసిద్ధి యెదిరించి పోరాడి విజయమును గాంచి యుండవచ్చును. విజయత్మాధీశ్వరుండు జయించిన ద్రవిడోర్వీపతి సుందరపాండ్యుఁడుగాక కాంచీపురాధిపతియైనవీరరాజేంద్రచోడచక్రవర్తియే యైనయెడల ౧౨౫౦ దవ సంవత్సరమునకుఁ బూర్వముననే మనుమసిద్ధి వానిని జయించి యుండవలయును. పైఁజెప్పినదే వాస్తవమైనయెడల ౧౨౫౦దవ సంవత్సరము తరువాతనే నిర్వచనోత్తరరామాయణము రచింపఁబడి యుండవలయును. ఈత్రిభువనచక్రవర్తి విజయగండగోపాలుఁడు, మనుమసిద్ధిరాజునకు సమకాలికుఁడు. ఇతఁడును తెలుఁగుచోడులలోనివాఁడుగానే కనఁబడుచున్నాఁడుగాని, సిద్ధిరాజుకుటుంబమునకు నీతని కెట్టిసంబంధము గలదో తెలియరాదు.

ఇంక రెండవపద్యమునందుఁ బేర్కొనంబడిన గంగయసాహిణింగూర్చి విచారింతము. ఈ గంగయసాహిణి, కాకతీయగణపతిదేవుని సైన్యమున కధ్యక్షుఁడును, రాజప్రతినిధియై నిజామురాష్ట్రములో నిప్పుడు చేరియుండిన నల్లగొండసీమలోని పానగల్లు మొదలుకొని మార్జవాడిదేశము (కడపమండలములోని వల్లూరురాజధాని) వఱకుఁగల దేశమునంతయుఁ బరిపాలించుచుండిన యొక యున్నత రాజకీయాధికారిగాని సామాన్యుఁడు గాఁడు. ఇతనికి బ్రహ్మరాక్షసుఁ డని బిరుదుండుటచేతనే రక్కసగంగ ని పేర్కొనంబడియున్నాఁడు. ఇతనిచరిత్రము గణపతిదేవునిఁగూర్చి వ్రాయుచరిత్రమున సవిస్తరముగాఁ దెలుపఁబడును గావున, నిచ్చట విస్తరించి వ్రాయలేదు. ఇట్టి మహాపరాక్రమవంతుఁడైన గంగయసాహిణి నొకమండలాధిపతిగ నున్న మనుమసిద్ధి యెట్లు జయించి యతని రాజ్యాంగములెల్ల నాఁచికొనియెనో, ఎట్లాతఁ

1 Nellore Inscriptions, Vol II. No. 61.

డాశ్రితుఁడై యితనిం బ్రార్థించెనో, ఎట్లీతఁ డాశ్రితవత్సలవృత్తి యేర్పడునట్లుగా నాఁచికొన్న రాజ్యాంగములనెల్ల నిచ్చి పదవుఁ గైకొనఁ బంచెనో, యెంతమాత్రమును బోధపడకున్నది. ఇదియే వాస్తవ మగునేని సిద్ధేశ్వరచరిత్రమునందును, సోమదేవరాజీయమునందును, జెప్పఁబడిన విషయములయొక్క సత్యతనుగూర్చి ప్రశ్నింపవలసి యుండును. ఏతద్విషయమై మఱియొకతావున విపరింపఁ దలంచితిని.

ఇంక మూఁడవపద్యమున నీతఁడు మహారాష్ట్రసామంతుఁడైన సారంగుని జయించె నని చెప్పఁబడినది. ఇందుఁ బేర్కొనఁబడిన సారంగుఁడు, అతివిషమహయారూఢ ప్రౌఢరేఖావంతుఁడును, పరబలకృతాంతుఁడును; శరణాగతవజ్రపంజరుఁడును, మండలీకరవందోళియు, జీవరక్షుచక్రనారాయణుఁడును, అగు శ్రీమన్మహామండలేశ్వరశ్రీసారంగపాణిదేవరాజేగాని, యన్యుఁడు గాఁ డని తోఁచుచున్నది. ఇతఁడు కాకతీయగణపతిదేవునకు సామంతుఁడుగ నుండి అద్దంకిసీమకుఁ బరిపాలకుఁడుగ నుండెను. ఇతని తండ్రి మాధవదేవరాజు. ఇతఁడు మనుమసిద్ధికి సమకాలికుఁడైయుండెను. గోవిందనాయకుఁ డీతనికి మంత్రిగ నుండెను. ఇతనివంశమువారు మహారాష్ట్రములోని శోణదేశమునుండి వచ్చినటులఁ దెలియుచున్నది. కాఁబట్టి నిర్వచనోత్తరరామాయణమునఁ బేర్కొనంబడిన సారంగుఁ డితఁడే యనుటకు సందియము లేదు. ఇట్లు మనుమసిద్ధి కాకతీయసైన్యాధిపతులతోడఁ బోరాడి విజయములను గాంచినటులఁ గవితిక్కన వ్రాసియున్నాఁడుకాని, సిద్ధేశ్వరచరిత్రమునందును, సోమదేవరాజీయమునందును, దెలుపఁబడిన చరిత్రాంశములిందలి చరిత్రాంశములకు మిక్కిలి విరుద్ధములుగాఁ గానిపించుచున్నవి.

అక్కన బయ్యనలు.

అక్కన బయ్యన లనువారు మనుమసిద్ధిరాజుయొక్క దాయాదు లని సిద్ధేశ్వరచరిత్ర మను శైవగ్రంథమునందు వ్రాయఁబడినది. సిద్ధేశ్వరచరిత్రమునకుఁ బ్రతాపచరిత్ర మను నామాంతరము గలదు. దీనిని కాసె సర్వప్ప యను

నాతఁడు ద్విపదకావ్యముగా రచియించెను. ఈకవికాల మెప్పుడో మనకు నిశ్చయముగాఁ దెలియరాదుగాని, యితఁడు ప్రతాపరుద్రునికి తరువాత నుండినవాఁ డని చెప్పవచ్చును. అందువలన సిద్ధేశ్వరచరిత్రములోని విషయము లన్నియు యథార్థము లని విశ్వసింపరాదు. ఈసిద్ధేశ్వరచరిత్రమును బట్టియే కూచిమంచి తిమ్మకవిసార్వభౌముని తమ్ముఁడును, ఆధునికుఁడు నగు జగ్గకవి సోమదేవరాజీయ మను పద్యకావ్యమును రచియించెను. అక్కన బయ్యన లను దాయాదులు మనుమసిద్ధిరాజును నెల్లూరునుండి పాఱఁద్రోలి రాజ్యమా క్రమించుకొని పరిపాలించుచుండ, మనుమసిద్ధిరాజుపక్షమున నతనిమంత్రియు నాస్థానకవియు నగు తిక్కనసోమయాజి కాకతీయుల రాజధాని యైన యేకశిలానగర మను నామాంతరముగల యోరుఁగంటికిఁబోయి, గణపతిదేవ చక్రవర్తికి భారతాఖ్యానమును వినిపించి, యతనివలన బహుమానములనుబడసి, యతనితో మనుమసిద్ధి దురవస్థను జెప్పఁగా, నాతఁడు సదయహృదయుఁడై సోమయాజులసాయబారమును మన్నించి, బహుసైన్యములతో దండెత్తివచ్చి అక్కన బయ్యనలను నెల్లూరునుండి పాఱఁద్రోలి, మనుమసిద్ధినిఁ బునరభిషిక్తునిఁగావించి, వెడలిపోయె నని సిద్ధేశ్వరచరిత్రములోని యీక్రిందిచరణముల వలన బోధపడఁ గలదు.

"తగుమాట విను మొక్కధర్మకార్యంబు
సూర్యవంశంబున సొబగొందునట్టి
యార్యపూజితవర్యుఁ డామన్మసిద్ధి
రాజు దా నెల్లూరు రమణతో నేల
* * *
అక్కన బయ్యన లధిక బలిష్ఠు
లక్కట సిద్ధిరాయనిఁ బాఱఁద్రోలి
దక్కినరాజ్యంబు తామె యేలుచును
నొక్కకాసైనను జక్కఁగ నీరు
వారల దండించి వారి నెల్లూరు

వారికిప్పింపు మవారణఁ బ్రీతి
ననిన, గణపతిరా జట్లకా కనుచు
* * *
వెషలి గణపతియు విజయంబునకును
గుడిరెడమల సేన గొలిచి యేతేర
వెలనాడు చేరియు వీడెల్ల గాల్చి
వెలనాటిరాజును వెసగొల్చి వాని
యప్పనంబులుగొని యటుచని రాజు
గుప్పున నెల్లూరు కూడనేతెంచి
యక్కన బయ్యన నచట సాధించి
* * *
నెల్లూరు ప్రజలకు నేర్పవాటిల్లఁ
జెల్లించె మన్మనసిద్ధిరాజునకు
నెల్లూరిపట్టంబు నేర్పుతోఁ గట్టి
పల్లలితాద్వృతి సముదుగ్గములను
నలువదెనిమిదియు నగుపట్టణముల
నరువొందసాధించి యామన్మసిద్ధి
రాజుకిచ్చియుఁ దనతేజంబు దిశలఁ
బూజకెక్కఁగ ఘనరాజితయశుఁడు
ఘనతటాకంబు దాఁ గట్టించె నచటఁ
గొనకొని నెల్లూరఁ గొన్నెలలుండి
మనుమసిద్ధికి రాజ్యమహిమలు దెల్పె."

ఈ పైగ్రంథమునఁ బేర్కొనంబడిన యక్కన బయ్యన లనువారినామము లేశాసనములందును వినంబడకున్నవి. మనుమసిద్ధిరాజుయొక్క శాసనములు కందుకూరుసీమలోని పెంట్రాలలోఁ గాన్పించుచున్నవి. అయ్యవి ౧౨౪౮ మొదలుకొని ౧౨౬౨ వఱకుఁ గానిపించుచున్నవి. కడపమండలములోని

నందలూరుశాసనములలో నొకదానియందు మనుమసిద్ధి కోడూరుగ్రామమును ౧౨౫౭ - వ సంవత్సరమున బ్రాహ్మణులకు దానముచేసినట్లుగ వ్రాయఁబడినట్లు చెప్పియున్నాను. ఆశాసనములోనే మనుమసిద్ధిరాజు కాకతీయ గణపతిదేవునితో స్నేహము సంపాదింపవలయు నని కోరికగలిగియున్నట్టుగఁ దెలుపఁబడి యున్నది. కాఁబట్టి ౧౨౫౭ వఱకును మనుమసిద్ధికి గణపతిదేవ చక్రవర్తితో మైత్రి లేనటుల స్పష్టమగుచున్నది. మఱియు నాతఁడా సంవత్సరముననే గణపతిదేవుని సామంతుఁడైన మహారాష్ట్రిసారంగునితో యుద్ధముచేసి జయించుటకూడ నైయాంశమును బలపఱుచుచున్నది. కనుక ౧౨౫౭ వ సంవత్సరమునకుఁ దరువాతనే వారిరువురకు మైత్రి యేర్పడి యుండవలయును. క్రీ. శ. ౧౨౬౦ దవ సంవత్సరమున రుద్రమదేవి కాకతీయసింహాసన మధిష్ఠించినటులఁ ద్రిపురాంతకములోని యొకశాసనమునఁ జెప్పఁబడియున్నందున, గణపతిదేవుఁడు ౧౨౬౦ దవ సంవత్సరముననే కీర్తిశేషుఁడై యుండుననుటకు సందియము లేదు. కనుక సిద్ధేశ్వరచరిత్రమునందుఁ జెప్పినట్లు అక్కన బయ్యనలు సిద్ధిరాజును బాఱఁద్రోలి రాజ్య మాక్రమించుకొనుట ౧౨౫౮, ౧౨౫౯ సంవత్సరములలో జరుగవలసియుండునుగదా. ఆసంవత్సరములలో మనుమసిద్ధిరాజు రాజ్యాభివృద్ధికై సిద్ధిరాజుచేతను, నతనికి సామంతులుగ నున్న పల్లవరాజులచేతను, కందుకూరుసీమలోని పెంట్రాలలోఁ జేయఁబడిన దానశాసనములు గనంబడుటచేత నాకాలమునందు సిద్ధిరాజు రాజ్యపదభ్రష్టుఁ డయ్యె నని విశ్వసింపరాదు. కాఁబట్టి సిద్ధేశ్వరచరిత్రమునందలి అక్కనబయ్యనలచరిత్రము కల్పిత మని చెప్పవలసివచ్చుచున్నది. తిక్కనసోమయాజి నిర్వచనోత్తరరామాయణము రచించునప్పటికి మహాభారతమును తెనిఁగించియుండలే దని యాగ్రంథములలోని గద్యలనుబట్టియే మనము సులభముగా గ్రహింప వచ్చును. నిర్వచనోత్తరరామాయణము ౧౨౫౮ దవ సంవత్సరమున రచింపఁబడియుండవచ్చును. అట్లయినయెడల నాసంవత్సరము గాని, మఱుసటిసంవత్సరము గాని, సిద్ధిరాజు రాజ్యపదభ్రష్టుఁ డైయున్న కాలమున తిక్కనమంత్రి యజ్ఞమును జేసి, తెనుఁగు భారతమును రచించి గణ

పతిదేవుని కొలువుకూటమున విన్పించినాఁ డని విశ్వసించుటకంటె వింతవిషయము మఱియొక్కటి యుండఁబోదు. కాఁబట్టి సిద్ధేశ్వరచరిత్రములోని విషయములను సమన్వయింపవలసినపక్షమున నిట్లు సమన్వయింప వచ్చును. అక్కన బయ్యనలు నెల్లూరునుండి సిద్ధిరాజును బాఱఁద్రోలఁగా సిద్ధిరాజు కందుకూరుసీమలోని పెంట్రాలకోటలోఁ జేరి యందు నివసించి యుండును. ఆకాలమునఁ దిక్కనసోమయాజి గణపతిదేవునికడకుఁబోయి యాతనివలన మన్ననలను గాంచి, తన వచ్చినపని తెలుపఁగా నాతఁడు తనసైన్యమును బంపి అక్కన బయ్యనలను నెల్లూరునుండి పాఱఁద్రోలి మనుమభూపతిని బునరభిషిక్తునిఁ గావించి యుండును. తిక్కనభారతాఖ్యానమును విన్పించినాఁడనియు, తిక్కన బౌద్ధులను వాదమునఁ గెలిచినాఁడనియు, బౌద్ధులక్రూర మారణకర్మకుఁ దిక్కన యొడంబడినాఁడనియుఁ జెప్పుట కవికల్పితములని స్పష్టముగఁ జెప్పఁదగును. భావిపరిశోధనములవలనఁగాని, మన కీవిషయము చక్కఁగా బోధపడఁజాలదు. మనుమసిద్ధిరాజు బ్రదికియున్నంతవఱకు స్వతంత్రుఁడై స్వల్పరాజ్యముతోనే తృప్తిఁగాంచి కాకతీయసైన్యాధిపతులతోఁ బోరాడుచు జయాపజయములను గాంచుచుండె నని నాయభిప్రాయము.

కాటమరాజ మనునుమసిద్ధిరాజుల యుద్ధము.

ఖడ్గతిక్కన పౌరుషపరాక్రమములు.

పసులమేపు బీళ్లనిమిత్తమై కాటమరాజునకును మనుమసిద్ధిరాజునకును వివాదము పొసఁగి మహాయుద్ధము జరిగినటులఁ గాటమరాజుకథవలనఁ దెలియుచున్నది. ఈయుద్ధకథనము ద్విపదలో రామరావణయుద్ధముగ వర్ణింపఁబడినది. మనుమసిద్ధి రావణుఁడుగఁ బోల్పఁబడియెను. కాటమరాజుతండ్రి పెద్దిరాజు. పెద్దిరాజుతండ్రి వల్లురాజు. ఇతఁ డాత్రేయగోత్రోద్భవు లయిన యాదవులసంతతిలోనివాఁడుగఁ జెప్పఁబడియెను. ఇతఁడు కనిగిరిసీమలోని ఆలవలపాడున కధిపతిగ నుండెను. కాటమరాజు కనిగిరిసీమలోని యెఱ్ఱగడ్డపాడున కధిపతిగ నుండెను. దేశమున ననావృష్టి సంభవింప యాదవు లనం

బడు గొల్లవాండ్రెల్లను తమతమ పసులమందలను దోలుకొని దక్షిణమునకు వచ్చి మనుమసిద్ధిరాజుయొక్క పసులబీళ్లను గొన్నిటిని పుల్లరికిం గైకొని పసులను మేపుకొని పుల్లరి చెల్లింపకయే వెడలిపోయిరి. అందుపై సిద్ధిరాజునకుం గోపమువచ్చి అన్నంభట్టను బ్రాహ్మణుని రాయబారిగాం గాటమరాజుకడకుం బంపించెను. కాటమరాజు పుల్లరిచెల్లింపక తగవు పెట్టెను. అంతట మనుమసిద్ధిరాజు కాటమరాజును శిక్షించుటకై బహుసైన్యములంగూర్చుకొని దండెత్తి వచ్చెను. కాటమరాజుకూడ బంధుజనులను మిత్త్రులను గూర్చుకొని యుద్ధసన్నద్ధుం డయ్యెను.

అప్పుడు తిరునామాలతిప్పరాజు, శ్రీకంఠరాజు, పెదవేంగిచొక్కరాజు, పెదవరదరాజు, అర్లకొండ అచ్చిరాజు, ఆదివన్నె మాదిరాజు, గయికొండ గంగరాజు, ఉర్లకొండ సోమన్న, ఉదయాద్రి ఉప్మయ్య, చెన్నపట్టణము చంద్రశేఖరుఁడు, దేవముని వెంగళయ్య, పట్టుకోట బసవరాజు, కాళహస్తి పాపతిమ్మరాజు, వెలకంచి వెంగళపతి రాజు, ప్రభగిరిపట్టణము పద్మశేఖరుఁడు మొదలగు యోధులు మనుమసిద్ధికిం దోడ్పడ వచ్చిరి. ఈయోధుల కందఱకు నాయకుండై ఖడ్గతిక్కన సిద్ధిరాజుసేనల నడిపించుకొని వచ్చెను.

పల్నాటిప్రభు వయిన పద్మనాయఁడును, పల్లికొండప్రభు వయిన చల్లపిన్నమనాయఁడు, దొనకొండ అయితమరాజు, ఎఱ్ఱయ్య, భట్టావులరాజు, కరియావులరాజు, వల్లభన్న, నాచకూళ్లనాయఁడు, నేతిముద్దయ్యనాయఁడు, పాచయ్యనాయఁడు, ముమ్మయ్యనాయఁడు, పుత్తమరాజు, మొదలగుయాదవవీరులును, కాటమరాజునకుం దోడ్పడ వచ్చిరి. ఈసైన్యముల కంతకుం బిన్నమనాయనిమంత్రియు నారాధ్యబ్రాహ్మణుఁడు నగు బ్రహ్మరుద్రయ్య నాయకుండై నడిపించెనఁట. ఉభయసైన్యములును పాలేటియొడ్డున నున్న పంచలింగాలకొండకడ నెదుర్కొన్నవి.

సిద్ధిరాజు సేనాపతి యగుఖడ్గతిక్కన, తిక్కరాజుమంత్రియును తిక్కనసోమయాజి పెద్దతండ్రియు నగు సిద్ధనామాత్యుని నేద్వురుకొడుకులలోను బెద్దవాఁ డని యిదివఱకే దెలిపియుంటిని. ఇతఁ డప్రతిమాన మైన ప్రతిభ కల

వాఁడు. దశకుమారచరిత్రమునందు కేతనకవి యీతని నీక్రిందివిధమున వర్ణించి యున్నాఁడు.

"సీ. వేఁడినయర్థార్థి వృథపుచ్చ నేరని
దానంబు తనకు బాంధవుఁడు గాఁగ,
నెదిరినజము నైన బ్రదికిపోవఁగనీని
శౌర్యంబు తన కిష్టసఖుఁడు గాఁగ,
శరణుచొచ్చిన శత్రువరు నైనరక్షించు
కరుణయె తనకు సంగాతి గాఁగఁ,
బలికినఁ బాండవప్రభు నైన మెచ్చని
సత్యంబు తనకు రక్షకుఁడు గాఁగఁ,
గీ. జగతి నుతికెక్కె రాయవేశ్యాభుజంగ
రాజ్యరత్నాకరస్ఫూర్తి రాజమూర్తి
గంధవారణబిరుద విఖ్యాతకీర్తి
దినపతేజుండు సిద్ధయ తిక్కశౌరి."

మరియుఁ దిక్కనసేనానిగృహం బీవిధంబుగా నుండు నని మిక్కిలి మనోహరంబుగా వర్ణింపఁ బడినది.

"సీ. వీరనికాయంబు వేదనినాదంబుఁ
బాయక యేప్రొద్దు మ్రోయుచుండు,
భూసురప్రకరంబు సేసలుచల్లంగఁ
బాయ కెన్నియొకుటుంబములు బ్రదుకు,
బ్రాహ్మణావళికి ధారలుపోసినజలంబు
సతతంబు ముంగిట జాలువాఱు,
రిపులకొసఁగినపత్త్రికల పుత్త్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుంద్రు,
గీ. మానఘనుఁడైన తిక్కనమంత్రియింట,
మదనసముఁడైన తిక్కనమంత్రియింట,

మహితయశుఁ డైన తిక్కనమంత్రియింట,
మంత్రిమణి యైన తిక్కనమంత్రియింట."

ఆహా! ఇమ్మహానుభావుఁడు పరశురామునివలెను, ద్రోణాచార్యునివలెను, కృపాచార్యునివలెను, అశ్వత్థామవలెను, బ్రహ్మతేజము దాల్చుట మాత్రమే గాక, మహాక్షాత్త్రమునుబూని వారలవలెఁ గ్రూరచిత్తుఁడై దుష్కర్మముల కొడిగట్టక మానియై ధర్మయుద్ధంబునఁ బ్రాణంబు లర్పించుటకు నైన సిద్ధపడియెంగాని, అపయశంబు పాలఁబడుటకొల్లఁడయ్యెను గదా! అభినవదండి యైనకేతనకవి పొగడ్తలు పొల్లులుగాక తిక్కనసేనానిపట్టున సత్యంబులై సార్థకంబు లగుచున్నవి. తిక్కనసేనాని, సిద్ధిరాజు సమ్మతి గైకొని తానొక్కఁడనే యాదవులను జయించివత్తు నని తనసైన్యములతో ముందుగాఁ బోయి, శత్రువులను మార్కొనియెను. అప్పు డుభయసైన్యములకును ఘోరమైన యుద్ధము జరిగెను. తుదకు తిక్కనసైన్యమంతయు హత మయ్యెను. తిక్కన యుద్ధభూమిని నొక్కఁడు మిగిలియుండుటను ప్రతిపక్షయోధుఁడైన పిన్నమనాయఁడు చూచి—

"పోరునిలుపుమోయి భూసురోత్తముఁడ
సరిగాదు మాతోడ సమరంబుఁ జేయ
అగ్రజుల్ మీరు యాదవులము మేము
ఉగ్రము మామీఁద నుంపంగరాదు."

అని పలికెనట. అందుపైని తిక్కన, సైన్యమంతయు హత మగుటకుఁ జింతించి మఱల సైన్యమును గొనివచ్చి తలపడియెదంగాక యని గుఱ్ఱమును ద్రిప్పుకొని పురంబునకు వచ్చెనఁట. పౌరజనంబులు పరాజితుఁడై పాఱివచ్చిన తిక్కయోధునిఁగాంచి నవ్వువారును, కేరడము లాడువారును, నై యనేకవిధంబుల మనస్సునకుఁ జింత గలిగించిరి. పౌరజనంబులు మాత్రమే గాక, యింటికిఁబోయి నతోడనే వృద్ధుఁ డైనతండ్రి సహితము "యుద్ధమున నైనంజావక యిటులేల పాఱివచ్చితివి, కడుపుచెఱుపఁబుట్టితి వ"ని నిందించెనఁట! ఈ రణతిక్కన స్నానమునకు వచ్చినపుడు భార్య స్త్రీల కుంచినట్లుగా రహస్యస్థలంబున నీళ్ల

బిందెనుంచి దానికి నులకమంచమును చాటుపెట్టి దానిమీఁదఁ బసుపుముద్ద యుంచెనఁట? దానింజూచి సిగ్గుపడి ఖేదపడుచుండఁగా, భార్య—

"క. పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపునాయకులందుఱ్
మగురాఁడువార మైతిమి
వగపేటికి జలకమాడవచ్చినచోటన్."

అని యొకసక్కెము లాడెనఁట!

అన్నములోఁ బోయునప్పుడు పాలు విఱిగిపోఁగా తల్లిసైతము పరిహాసముగా—

"కం. అసదృశముగ నరివీరులఁ
బసమీఱఁగ గెలువలేక పందక్రియ నీ
వసివైచి విఱిగివచ్చినఁ
బసులు న్విఱిగినవి, తిక్క! పాలున్విఱిగెఱ్."

అని పలికెనఁట! ఇంకఁ జెప్పవలసిన దేమున్నది? ఇట్టిపలుకు లెల్లను శూలములైనాట మానాభిమాని యైన యమ్మహాయోధుఁడు చేసినపనికిఁ బశ్చాత్తప్తుఁడై, "ఈసారి మఱలఁబోయి శాత్రవులను మార్కొని జయంబుఁగొందు. అయ్యది సంప్రాప్తంబు గాదేని ప్రాణం బుండుదనుకఁ బోరాడి వీరస్వర్గంబు నైనఁ జూఱఁగొందు. మానాభిమానములు గల శూరుఁ డిట్టి రోఁతబ్రదుకు బ్రదుకఁడు." అని తలపోసి, యెవ్వ రెన్నివిధముల వారించినను వినక, సిద్ధిరాజు నొడంబఱిచి మఱల సైన్యముం గొనిపోయి శత్రువులను మార్కొని భీమసంగ్రామంబు గావించెను. చరిత్రకారుఁడు యుద్ధభూమిని నాతండు చేయుచున్న యుద్ధక్రమము నిట్లభివర్ణించుచున్నాఁడు.

"చ. పదటున వాజి రాహుతులపైదుమికించుచుఁ దిక్కఁడార్చినన్
బెదరి పరిభ్రమించి కడుఁబిమ్మట వీరులు భీతచిత్తులై
యదియదె డాలు వాల్మెఱుఁగు లల్లవె యల్లదె యాతఁడంచనన్
గాదుకక యాజిఁజేసె రిపుకోటులకందఱ కన్నిరూపులై."

ఇట్లే బ్రాహ్మణుఁ డగు నండూరి కొమ్మనామాత్యుఁడు క్రొత్తచర్లపరిసరభూములందుఁ గటకరాజుతోఁ బోరాడి చూపిన యుద్ధనైపుణ్యమును మంచనకవి కేయూరబాహుచరిత్రమునందు,

"సీ. నెలకట్టెవాటునఁ జెలఁగి రెంటెని మోఁటెఁ
గూడ గుఱ్ఱంబులు గుదులుగ్రుచ్చు,
బ్రతిమొగం బగునరపతుల కత్తళమునఁ
గడిమమై వీఁపులు వెడలఁ బొడుచుఁ,
బందంపుగొఱియల పగిది నేనుంగుల
ధారశుద్ధిగ నసిధార దునుముఁ,
జిదియించుఁ బగిలించుఁ జేతులతీటవో
వడిఁగాండమేసి మావతుల తలలు,
గీ. తల పుడికి వ్రేసి మావంతుతలలు శత్రు
రాజశిరములు ద్రొక్కించు రాఁగఁదిరుగ
వాగె నుబ్బెడు తన వారువంబుచేత
మహితశౌర్యుండు కొమ్మనామాత్యవరుఁడు."

అని మిక్కిలి మనోహరముగా వర్ణించి యున్నాఁడు. ఆకాలమునం దీబ్రాహ్మణమంత్రివరులు రాజ్యతంత్రమునందు మాత్రమే గాక యుద్ధతంత్రమునందును బ్రవీణులై యుండి రనుట కిట్టివృత్తాంతము లెన్నియైన నాంధ్రసారస్వతమునం గనుంగొనఁ గలము.

ఇట్లు ప్రచండవిక్రమార్కుఁడై ఘోరసంగ్రామంబున శత్రుసేనను మార్కొని పీనుంగుపెంటలు గావించుచు రణకేళి సల్పుచుండ, యాదవవీరులును వెనుదీయక మహోదగ్రులై తిక్కనసైన్యముపైఁ బడి కత్తులఁ గటారుల నీఁటెలం బొడిచి చక్కాడుచుఁ బెద్దకాలంబు పోరాడ నుభయసైన్యంబులం బెక్కండ్రు వీరభటులు నేలంగూలిరి. అంతటఁ బిన్నమనాయఁడు ఖడ్గతిక్కనను సమీపించి "ఓ విప్రోత్తమా! యుద్ధము చేయుట బ్రాహ్మణునకుఁ బాడిగాదు. మిమ్ముం జంపిన మాకు బ్రహ్మహత్యా దోషంబు వాటిల్లు నని నా

మనంబు తల్లడిల్లుచున్నది. తొలంగుట నీకును మాకును గూడ శ్రేయస్కరంబని యూహింతు" నని గొంతెత్తి గంభీరవాక్యంబులు పలుకఁ దిక్కనయు "ఓ నాయఁడా! రణశూరుఁడవై యుద్ధము సేయఁజాలక పందక్రియ ధర్మపన్నంబు లేల చదివెదవు? వానిం గొన్ని నేనెఱుంగుదునుగాని, వీరుండ వౌదువేని కదలక నిలుచుండి యుద్ధంబుచేసి చేతనయ్యెనేని నా ప్రాణంబులు గొని విజయపతాక మెత్తుము. కాదేని శరణుచొచ్చి మాపుల్లరి మాకుఁ బెట్టుము," అని హెచ్చరింపఁ బిన్నమనాయఁడు బ్రహ్మహత్యాదోషమునకు వెఱచి యేమి చేయుటకును జేతులును గాళ్లు నాడక నిశ్చేష్టితుఁడై చూచుచుండ, వాని మంత్రి బ్రహ్మరుద్రయ యచటికి నేతెంచి "తిక్కన నేఁదలంపడి పోకార్చెద నీవటుండు" మని తన ప్రతివీరునిపై హయంబును బఱపి యుద్ధము చేయఁగా నిరువురగుఱ్ఱంబులు నీటెపోటుల నేలంగూల, నిరువురును గత్తులుదూసి "హరహరా" యని యభిమన్యు లక్ష్మణకుమారులవలె ద్వంద్వయుద్ధంబునకుఁ గలియంబడి యుభయసైన్యంబులవారును నివ్వెఱపడి చూచుచుండఁ బెద్దయుం బ్రొద్దు పోరాడి తుదకు నేలకొఱిగిరి. ఆపాటుంగని తిక్కన సైనికులలో హతశేషు లయిన వార లీక్రిందివిధముగాఁ జెప్పుకొని యాక్రందించి రని యొకకవి చెప్పియున్నాఁడు.

"సీ. ధైర్యంబు నీమేనఁ దగిలియుండుటఁ జేసి
చలియించి మందరాచలము తిరిగె,
గాంభీర్యమెల్ల నీకడన యుండుటఁ జేసి
కాకుత్స్థుచే వార్ధి కట్టువడియె,
జయలక్ష్మి నీ యురఃస్థలినె యుండుటఁ జేసి
హరిపోయి బలి దానమడుగుకొనియె,
నాకారమెల్ల నీయందె యుండుటఁ జేసి
మరుఁడు చిచ్చునఁబడి మడిసిచనియె,
గీ. దిక్కదండనాథ దేవేంద్రపురికి నీ
వరుగ వెఱఁగి నగము తిరుగుటుడుగు

నద్ధికట్టువిడుచు నచ్యుతుకొదమాను
మరుఁడు మరలఁ గలుగు మగలరాజ."

అని తనసైనికులెల్ల హాహాకారంబులు సేయుచుండఁ బ్రాణంబులు దేహంబును విడిచినవిధం బాకవిశర్యుఁడే మరల నిట్లు చెప్పియున్నాఁడు.

"సీ. నందిని బుత్తెంచె నిందుశేఖరుఁడునీ
 వన్నయేతెమ్ము తారాద్రికడకు,
గరుడుని బుత్తెంచె నరహరిరావయ్య
 వడి సిద్ధతిక్క కైవల్యమునకు,
హంసనుబుత్తెంచె నజుఁడు నీకడకు ను
 భయకులమిత్త్రి రా బ్రహ్మసభకు,
నైరావతముఁబంపె నమరేంద్రుఁ డిప్పుడు
 దివమున కేతెమ్ము తిక్కయోధ,
గీ. యనుచు వేఱువేఱ నర్థితోఁ బిలువంగ
వారువీరు గూడ వచ్చివచ్చి
దివ్యయోగియైన తిక్కనామాత్యుఁడు
సూర్యమండలంబుఁ జొచ్చిపోయె."

తరువాత కాటమరాజునకును మనుమసిద్ధిరాజునకును యుద్ధము జరిగి యాయుద్ధమున నిరువురునుగూడ వీరస్వర్గమును జూఱఁగొన్నట్లుగాఁ గాటమరాజుచరిత్రమువలనఁ దెలియుచున్నది. ఈ యుద్ధము జరిగినది యేసంవత్సరమో సరిగాఁ జెప్పుట కేయాధారమును గానిపింపలేదు. కందుకూరుసీమలోని గుండ్లపాలెములో భ్రమరేశ్వరాలయములో నొకఱాతిపలకపై నీ విషయము సంగ్రహముగాఁ దెలుపఁబడియెను గాని, యందుఁ జెప్పఁబడిన కాలము వేఱుగను నాయకులు వేఱుగ నున్నారు.[1] అందసందర్భవిషయము లెన్నో గలవు. ప్రతాపరుద్రుని కాలమున ననఁగా శా. శ. ౧౧౬౦ కాళయుక్తి సం. కార్తీక శు ౫ మీ గురువారమున జరిగినటులఁ దెలుపఁబడినది. ఇందుఁ జెప్పఁబడిన

1. Nellore Inscriptions, Vol. II, Kandukur, 26.

సంవత్సరమునకును తిథివారంబులకును బొసఁగుపాటు గానరాదు. ఇది కాటమరాజునకును మనుమసిద్ధిరాజునకుఁ గాక, వల్లురాజునకు నల్లసిద్ధిరాజునకు జరిగిన యుద్ధముగాఁ జెప్పఁబడియెను. మనుమసిద్ధిరాజునుగూడ నల్లసిద్ధిరా జని పేర్కొనుచుండిరేమో. కాటమరాజుతాత వల్లురాజు. ఈశాసనమును ఎవ్వరో కొండయ్యకొడుకు రామయ్య యనునాతఁడు వ్రాయించినదిగాని, యొకరాజుగాని యతనిమంత్రులుగాని వ్రాయించినది కాదు. అది యెప్పుడు వ్రాయఁబడినదియుఁ దెలియరాదు. వీని నన్నిటిని బరిశీలించిచూడఁగా నది విశ్వాసపాత్రమైనదిగా గనుపట్టదు.

క్రీ. శ. ౧౨౬౦దవ సంవత్సరాంతమువఱకు మనుమసిద్ధిరాజు బ్రదికియున్నట్లుగా శాసనములు గానంబడియుండుటచేత నాసంవత్సరమునకుఁ దరువాతనే కాటమరాజుకథ నిజమైనయెడల మనుమసిద్ధిరాజు మరణము నొందియుండవలయును. కృష్ణామండలములోనందిగామసీమలోని అనమంచిపల్లెగ్రామమునందలి శివాలయముయొక్క గర్భాలయము ముందఱి ఱాతిపలకమీఁది శిలాశాసనములు నాలిగింటిలో నొకదానియందు శాలివాహనశకము ౧౧౮౨వసంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౨౬౦వ సంవత్సరమునందును; మఱియు, కృష్ణామండలములోని నూజివీడుసంస్థానములోఁజేరిన కొండనాయనివరగ్రామముయొక్క చెఱువుగట్టుమీఁద నున్న దేవాలయముసమీపమునందలి యొకఱాతిమీఁద చెక్కఁబడిన శాసనములో శాలివాహనశకము ౧౧౭౮వ సంవత్సరమునం దనఁగా క్రీస్తుశకము ౧౨౫౬వ సంవత్సరమునందును "మనుమరాజు" భూదానములు చేసినటులఁ జెప్పఁబడి యున్నదని స్యూయల్ దొరగారిగ్రంథమునుండి కాఁబోలు నెత్తి యాంధ్రకవులచరిత్రమునందు వ్రాయఁబడియున్నది.[1] ఆశాసనములందుఁ బేర్కొనంబడిన మనుమభూపతి నెల్లూరును బాలించిన యీమనుమసిద్ధిరాజు కాఁడని స్పష్టముగాఁ జెప్పవచ్చును.

1. Lists of the Antiquarian Remains In the Presidency of Madras by Robert Sewell, Vol. I. pp. 43, 51.

తిక్కనసోమయాజి.

తిక్కనసోమయాజి మంత్రిభాస్కరుని మనుమఁ డనియు, కొమ్మనామాత్యుని పుత్త్రుఁ డనియు, నిదివఱకుఁ దెలిపియుంటిని. ఆపస్తంబసూత్రుండును, గౌతమగోత్రుండు నగు కొమ్మనామాత్యుఁడు గుంటూరునకు దండనాథుఁడుగా నుండెను. గుంటూరివిభుఁ డనఁగా గుంటూరికరణ మని యొక విమర్శగ్రంథమునందు నవిచారపూర్వకముగా వ్రాయఁబడినది. కొమ్మన దండనాథుఁ డని తిక్కనసోమయాజియే విరాటపర్వములోని యీక్రిందిపద్యమునఁ జేర్కొనియున్నాఁడు.

“సీ. మజ్జనకుండు సన్మాన్యగౌతమగోత్ర
మహితుండు భాస్కరమంత్రితనయుఁ
డన్నమాంబాపతి యనఘులు కేతన
మల్లన సిద్ధనామాత్యవరుల
కూరిమితమ్ముండు గుంటూరివిభుఁడు కొ
మ్మనదండనాథుఁడు మధురకీర్తి
విస్తరస్ఫారుఁ డాపస్తంబసూత్రప
విత్రశీలుఁడు సాంగవేదవేది,
గీ. యర్థిఁ గలవచ్చి వాత్సల్య మతిశయిల్ల
నస్మదీయప్రణామంబు లాదరించి
తుష్టిదీవించి కరుణార్ద్రదృష్టిఁ జూచి
యెలమి నిట్లని యానతియిచ్చె నాకు.”

తిక్కనసోమయాజి యొకవేళఁ బక్షపాతబుద్ధితోఁ దనతండ్రి సామాన్యుఁడైయుండఁగా దండనాథుఁ డని పేర్కొనియుండవచ్చు నని చెప్పవత్తురేమో? తిక్కనసోమాయాజికిఁ దనకావ్యము నంకితముచేసిన కేతనకవియుఁ గొమ్మనామాత్యుని ధైర్యంబున హిమవంతునితోడను, శౌర్యంబున నర్జునునితోడను బోల్చి, సూర్యవంశకభూపాల సుచిరరాజ్యవనవసంతుఁ డని యీక్రిందిపద్యములో మనోహరముగా వర్ణించియున్నాఁడు.

“సీ. స్వారాజ్యపూజ్యుండొ కౌరవాధీశుండొ
నాఁగ భోగమున మానమున నెగడె,
రతినాథుఁడో దినరాజతనూజుఁడో
నాఁగ రూపమున దానమున నెగడె,
ధరణీధరేంద్రుఁడో ధర్మసంజాతుఁడో
యనఁగ ధైర్యమున సత్యమున నెగడె,
గంగాత్మజన్ముఁడో గాండీవధన్వుఁడో
యనఁగ శౌచమున శౌర్యమున నెగడె,
గీ. సూర్యవంశకభూపాల సుచిరరాజ్య
వనవసంతుండు బుధలోకవత్సలుండు
గౌతమాన్వయాంభోనిధి శీతకరుఁడు
కులనిధానంబు కొట్టరు కొమ్మశౌరి.”

కాఁబట్టి కొమ్మనామాత్యుఁ డొకసామాన్యకరణముగా నుండవచ్చు నని చేసిన ప్రశంస యప్రశస్తమైనదనియు, నిరాధారమైనదనియుఁ జెప్పుట కెంతమాత్రము సందియము లేదు. ఇట్టి కొమ్మనామాత్యునకును అన్నమాంబికకును జనియించినవాఁడు మన యీతిక్కనసోమయాజి. ఇతఁడు మనుమసిద్ధిరాజు కడ మంత్రియుఁ గవియునై విఖ్యాతిఁ గాంచెను. ఇతఁడు సిద్ధిరాజుకడ మిక్కిలి మన్ననగలవాఁడై యతనితోడ సమానప్రతిపత్తి గలవాఁడై వరుసచేఁ బిలువఁబడుచున్నట్టును నట్టివరుసలో మనుమక్ష్మావల్లభున కీకవి మామ వరుసగలిగియున్నట్టును నిర్వచనోత్తరరామాయణము మొదట తిక్కనకవిని గూర్చి మనుమభూపతి చెప్పినటు లున్న యీక్రింద పద్యమునుబట్టి విస్పష్టమగుచున్నది.

“క. ఏ నిన్ను మామ యనియెడు
దీనికిఁ దగనిమ్ము భారతీకన్యక నా
కీనర్హుఁడ వగు దనినను
భూనాయకుపలుకు చిత్తమున కింపగుడున్.”

ఇట్లు సిద్ధిరాజుచేఁ గోరఁబడి తిక్కన తాను రచించిన నిర్వచనోత్తరరామాయణకావ్యము నాతని కంకితము చేసెను. ఈ నిర్వచనోత్తరరామాయణము ప్రథమంబున రచింపఁబడిన దగుటంజేసి కాఁబోలు నిందుఁ దిక్కనార్యుఁడు తన పాండిత్యాతిశయమును దన కవిత్వనియమమును జెప్పుకొని కుకవినిందయుఁ జేసియున్నాఁడు. ఇట్టిది యాంధ్రీకృతభారతమునఁ గానరాదు. ఇతఁడు నిర్వచనోత్తరరామాయణము రచించునప్పటికి యజ్ఞము చేసియుండలేదనియు, వయస్సు మీఱినవాఁడు కాఁడనియు, నిర్వచనోత్తరరామాయణములోని "ఇది శ్రీమదుభయకవిమిత్త్రి కొమ్మనామాత్యపుత్త్రి బుధారాధనవిధేయ తిక్కననామధేయ ప్రణీతంబైన" అను గద్యమునుబట్టియే మనము సులభముగా గ్రహింపవచ్చును. భారతము రచించునప్పటి కితఁడు యజ్ఞముచేసినటులు భారతములోని "ఇది శ్రీమదుభయకవిమిత్త్రి కొమ్మనామాత్యపుత్త్రి బుధారాధన విరాజి తిక్కనసోమయాజి ప్రణీతంబైన" అను గద్యమునుబట్టియే విస్పష్ట మగుచున్నది. నిర్వచనోత్తరరామాయణమున 1258 వ సంవత్సరమువఱకు జరిగినవిషయములను జేర్కొనియుండుటచేతను, అప్పటికి యజ్ఞముచేసి యుండలేదు గనుకను, భారతము మనుమసిద్ధిరాజున కంకితముచేయఁబడక హరిహరనాథున కంకితము చేయఁబడియుండుటచేతను భారతము మనుమసిద్ధిరాజు మరణానంతరము కొన్ని సంవత్సరములకు రచియింపఁబడిన దని చెప్పవలసియున్నది. ఈ మంత్రిపుంగవుఁడు మనుమసిద్ధిరాజును నతనిసేనానియుఁ దనకు బెదతండ్రికొడుకు నగు తిక్కనమంత్రియు మరణము నొందినతరువాత విరక్తిభావము జనింప లౌకికాధికార ధూర్వహత్వమునుండి తొలఁగి వైదికమార్గనిష్ఠ మగువర్తనమునం బ్రీతిజనింప నగ్నిష్టోమ మనుక్రతువు నాచరించి సోమయాజియై మహాభారతమును రచించి జగద్విఖ్యాతిఁ గాంచెను. ఇతఁడు లౌకికాధికారధూర్వహుండై యున్నకాలముననే మహాభారతమును రచింపఁబూనుకొనె ననుట కేవలమును బొరఁబాటుగాని వేఱొండు కాదు. ఇతఁడుగణపతిదేవుని యాస్థానమునకుంబోయి భారతాఖ్యానమును విన్పించెననుటయు విశ్వాసపాత్ర మైనవిషయము గాదు. ఇమ్మహనీయుఁడు

మనుమసిద్ధిరాజు మరణము నొందినవెనుక బహుకాలమువఱకు జీవించియున్నట్టుగఁ గనంబడుచున్నది. తిక్కనసోమయాజి శిష్యుఁడైన మారనకవి 1295 వ సంవత్సరము మొదలుకొని 1323 వఱకుఁ బరిపాలనము చేసిన రెండవ ప్రతాపరుద్రుని సేనాధిపతులలో నొక్కఁడగు నాగయగన్నమంత్రికిఁ దన కావ్యము నంకితము చేసియుండుటచేత తిక్కనసోమయాజి 1290 వ సంవత్సరము వఱకు జీవించి యుండవచ్చును.

సరసకవితాసామ్రాజ్యవిలసితుఁడైన యిమ్మహాకవివరుండు—

"ఉ. ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబుగల్గి య
ష్టాదశపర్వనిర్వహణసంభృతమై పెనుపొందియుండు నం
దాదిదొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్."

అని నన్నయభట్టును ఆంధ్రకవిత్వ విశారదుండనియు, విద్యాదయితుండనియు మాత్రమే చెప్పియున్నాఁడుగాని, ప్రథమాంధ్రకవినిగాఁ జెప్పియుండలేదు. అదియునుంగాక, తిక్కన యాదికవీంద్రులను నూతనసత్కవీశ్వరులను నిర్వచనోత్తరరామాయణమునందు స్తుతించుటచేత నన్నయాదులకు బూర్వమునందుఁగూడ నాంధ్రకవీంద్రు లనేకు లున్నట్టు స్పష్టపడుచున్నది. [1]

కవిబ్రహ్మయనియు, కవిలోకచక్రవర్తి యనియు, నాంధ్రకవి ప్రపంచముచే నిరంతరము సంకీర్తనము సేయంబడుచున్న యిమ్మహానుభావుని గుణ

---

1. నన్నయభట్టారకునకుఁ బూర్వము అనేకశతాబ్దములనుండి యాంధ్రసారస్వతము వర్ధిల్లుచున్నటుల ననేక దృష్టాంతములవలనఁ దెలియుచున్నది. క్రీ. శ. 6 వ శతాబ్దమునుండి యాంధ్రకవిత్వము వర్ధిల్లుచున్న దనుటకు తెలుఁగుశాసనములలోని పద్యరచనయే సాక్ష్యముగ నున్నది. రాజరాజనరేంద్రునకు సమకాలికుఁ డగుభోజమహారాజునకు ముద్రామాత్య మనునొకయాంధ్రకావ్యము క్షేమేంద్రకవిచే నంకితము చేయఁబడినటుల దెలియుచున్నది. కవిభల్లటుఁ డనుకవి బేతాళపంచవింశతి యను తెలుఁగుప్రబంధమును చాళుక్యవిక్రమాదిత్యున కంకితముచేసె నని దెలియుచున్నది.

విశేషంబులను గూర్చియు, వీర్యవితరణ మహిమాదులనుగూర్చియు, మహాత్తరకవిత్వసంపత్తినిగూర్చియు, సారవిహీనంపుఁ బలుకులతో రసాభాసమును గావించుచు నేనిచట వర్ణించి చదువరులమనంబుల కొకింత శ్రమంబుగలిగింప నిష్టములేక, అభినవదండి నా వినుతిఁగాంచిన కేతనకవివర్యుండు మిగుల రసవత్తరంబుగా రచించి యమ్మహానీయునకే యంకితముగావించిన దశకుమారచరిత్రములోని పద్యములనే చదువరులకుఁ గర్ణరసాయనముగా నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

"సీ. సుకవీంద్రబృందరక్షకుఁ డెవ్వఁడనిన వీఁ
డనునాలుకకుఁ దొడవైనవాఁడు,
చిత్తనిత్యస్థిత శివుఁ డెవ్వఁ డనిన వీఁ
డనుశబ్దమున కర్థమైనవాఁడు,
దశదిశావిశ్రాంతయశుఁ డెవ్వఁడనిన వీఁ
డని చెప్పుటకుఁ బాత్రమైనవాఁడు
సకలవిద్యాకళాచణుఁ డెవ్వఁ డనిన వీఁ
డని చూపుటకు గుఱియైనవాఁడు,
గీ. మనుమసిద్ధిమహీశ సమస్తరాజ్య
భారధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువుకొమ్మనామాత్యు కూర్మిసుతుఁడు
దీనజనతా నిధానంబు తిక్కశౌరి.
క. అగు నని గొమ్మయ తిక్కఁడు
జగతి నపూర్వార్థశబ్దచారుకవిత్వమై
నెగడిన బాణోచ్ఛిష్టం
జగత్త్రయం బనినపలుకు సఫలం బయ్యెన్.
క. కృతులు రచియింప సుకవుల
కృతు లొప్పఁ గొనంగ నొరునికిం దీఱునె వా
కృతినిభుఁడు వితరణశ్రీ
యుతుఁ డన్నమసుతుఁడు తిక్కఁ డొకనికిఁ దక్కన్.

క. అభినుతుఁడు మనుమభూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుం డై తా
నుభయకవిమిత్త్రినామము
త్రిభువనముల నెగడ మంత్రి తిక్కఁడు దాల్చెన్.
సీ. సరసకవీంద్రుల సత్ప్రబంధములొప్పఁ
గొనునను టధికకీర్తనకుఁ దెరువు,
లలితనానాకావ్యములుచెప్ప నుభయభా
షలయందు ననుట ప్రశంస త్రోవ,
యర్థిమైఁ బెక్కండ్ల నగ్రహారంబులు
గా నిచ్చుననుట పొగడ్తపొలము,
మహితదక్షిణ లైనబహువిధయాగంబు
లొనరించుననుట వర్ణనము దారి,
గీ. పరునికొక్కని కిన్నియుఁ బ్రకటవృత్తి
నిజములై పెంపుసొంపారి నెగడునట్టి
కొమ్మనామాత్యు తిక్కన కొలది సచివు
లింక నొక్కరుఁ డెన్నంగ నెందుఁగలఁడు?"

ఈ పైపద్యములం బట్టి తిక్కనసోమయాజి విబుధజనవర సంస్తుత్యం బైన పాండిత్యమునను, గవిత్వమునను, చతురరాజనీతికార్యనిర్వహణ ధురంధరత్వమునను, కృతిపతిత్వ సామ్రాజ్యవైభవమునను, వైదికమార్గనిష్ఠాప్రారంభమునను, లోకప్రసిద్ధింగాంచి హరిహరనాథభక్తిభావనిర్మలచిత్తుండై యుత్తమంబైన గృహస్థధర్మంబును నిర్వహించుచుండె ననుటయే యీయన ప్రతిభావిశేషమును వేనోళ్లఁ జాటఁగలదు. ఈకవినిగూర్చి పైపద్యములలోఁ జెప్పఁబడిన మాటలు నిక్కంబులు. అందతిశయోక్తి యేమియు లేదని నొక్కి చెప్పఁగలను. తిక్కనకృతమైనమహాభారతకావ్యభాగ మాంధ్రభాషలో నద్వితీయమైన దనుటకు లేశమాత్రము సందియము లేదు. ఇంత చక్కని కావ్యము ప్రపంచములో మఱి యేభాషయందైన నుండునన్న విశ్వాసము

నాకు లేదు. వేయు నేల? ప్రపంచమునందలి సమస్తభాషలలోని యుత్తమోత్తమకావ్యములలో నిదియొక్కటి యని చెప్పవచ్చును. ఈ మహాకవిని గూర్చి రావుబహదరు వీరేశలింగముపంతులుగా రాంధ్రకవులచరిత్రమునం దిటుల వ్రాసియున్నారు.

"కాని తిక్కనసోమయాజిశైలితో సమానముగా వ్రాయుటమాత్ర మెవ్వరికిని సాధ్యము కాదు. తెలుఁగుభాషయం దెన్నోగ్రంథము లున్నను, తిక్కనసోమయాజికవిత్వముతో సమానముగాఁగాని, దానిని మించునట్లుగాఁగాని, కవిత్వము చెప్పఁగలిగినవారు నేఁటివఱ కొక్కరును గనఁబడ లేదు. తిక్కనకవిత్వము ద్రాక్షాపాకమై మిక్కిలి రసవంతముగా నుండును. ఈతనికవిత్వమునఁ బాదపూరణమునకయి తెచ్చిపెట్టుకొనెడు వ్యర్థపదము లంతగా నుండవు. పదములకూర్పుమాత్రమే గాక యర్థసందర్భమును మిక్కిలి పొందికగా నుండును. ఏవిషయము చెప్పినను, యుక్తియుక్తముగాను ప్రౌఢముగాను నుండును; ఎక్కడ నేవిశేషణము లుంచి యేరీతి నేపదములు ప్రయోగించి రసము పుట్టింపవలయునో యీకవికిఁ దెలిసినట్లు మఱియొకరికిఁ దెలియదు; ఈతనికవిత్వము లోకోక్తులతోఁగూడి జాతీయముగా నుండును; ఈయనపదలాలిత్యమును, యుక్తిబాహుళ్యమును, అర్థగౌరవమును, రచనాచమత్కృతియు, శయ్యావిశేషమును, సందర్భశుద్ధియు, కల్పనాకౌశలమును, అన్యులకు రావు."

శ్రీమదాంధ్రమహాభారతమునకుఁ టీక వ్రాసిన బ్రహ్మశ్రీ, శతఘంటము వేంకటరంగశాస్త్రులవా రీకవినిగూర్చి యిటుల వ్రాసియున్నారు.

"ఏవిషయమునంజూచినను నిమ్మహాకవికి సమానుఁడని చెప్పఁదగిన కవి యొక్కఁడు నిప్పటికి వినఁబడఁడు. ఇఁక నధికుఁడు లేఁడని చెప్ప నేల? ఈమహాకవి కవనముంగూర్చి యెంత సెప్పినం జెప్పవలసియేయుండునుగాని, యొకప్పటికైనం దనివిదీఱఁ జెప్పినట్లుండదు......ఈమహాకవి గ్రంథముం జూచి నేర్చుకొనవలసిన విషయములు నెన్నియేని గలవు. ఆంధ్రభాషాకవిత్వమర్మ మాతనికిఁ దెలిసినట్టులు మఱి యేయాంధ్రకవికి నిప్పటికిని తెలియదనియు, నిరాక్షేపముగఁ జెప్పవచ్చును."

విజ్ఞానచంద్రికాగ్రంథమాలా సంపాదకు లగు శ్రీయుత వేంకటలక్ష్మణరావుపంతులు. ఎమ్. ఏ. గా రిట్లు వ్రాసియున్నారు.

"తిక్కనకృతభారతము సంస్కృతమహాభారతమునకు భాషాంతరీకరణమని మనవా రంద ఱనుకొనుచున్నారు; కాని, అది గొప్పపొరబాటు. ఇట్లనుకొనుట మనము తిక్కనయెడ నొక యపరాధము సేయుటయే. సంస్కృతాంధ్రమహాభారతముల నొద్దఁ బెట్టుకొని సాంతముగఁ జదివిచూచినయెడల నాంధ్రమహాభారతము సంస్కృత మహాభారతములోనుండి కథమాత్రము గ్రహించి దానికంటె వేయిరెట్లధిక మనోహరముగా రచించిన స్వతంత్రమహాకావ్య మని చెప్పక తప్పదు. మూలములో లేని యర్థాలంకారములును, రసభావములును, మానవస్వభావవర్ణనలును, తెలుఁగుమహాభారతమునం దెచ్చటఁ జూచినను విచ్చలవిడిగాఁ గానవచ్చును. మూలములోని విసుగుఁబుట్టించెడి యనేకదీర్ఘకథానకములును, వర్ణనలును, వేదాంతఘట్టములును, తెలుఁగునందు లేనేలేవు. తిక్కన నిజమైనకవి యగుటచే నిరంకుశుఁడై మూలములోని ముఖ్యకథనుమాత్రము తీసికొని కడమభాగము నిష్టమువచ్చినటుల తగ్గించి పెంచి మార్చి వ్రాసెను. ఇట్లుచేయక సంస్కృతములోనున్న 'చ' కుఁ దెనుఁగున 'ను' పడ్డదా లేదా యని యిప్పటి కొందఱుకవులవలెఁ జూచుకొనుచుఁ దిక్కన తెనిఁగించియుండినచో నతనికావ్యము పృథివిలోని యుత్తమకావ్యములలో నొక్కటియై యుండదు. కావున తిక్కనకృతమహాభారతము స్వతంత్రకావ్య మనియే చెప్పవలసి యున్నది. ఇట్లనుటవలన సంస్కృతమహాభారతమునుండి తిక్కన యేమియుఁ గైకొనియుండలేదని కాని, యది మిక్కిలి తక్కువయోగ్యతకలదనిగాని, చెప్పుట మాయుద్దేశము కాదు. సంస్కృతమహాభారతము మా కత్యంతపూజనీయమే. కావ్యముగను, ఇతిహాసముగను, దానియోగ్యత గొప్పదని మే మెఱుంగుదుము. కాని, మూలములోని ప్రతిశబ్దమునకుఁ దూఁచినట్లు తెనుఁగున నొక్కొకశబ్దముండినగాని యది మంచికావ్యము గా నేరదని యనేకాంధ్రవిద్వాంసుల యభిప్రాయ మైనందున నది యసత్యమని చూపుటయే మాయుద్దేశము. సంస్కృతభారతము బంగారపు

ముద్దవంటిది ఆంధ్రభారత మాముద్దలోనుండి కావలయునంత బంగారమును దీసికొని స్వర్ణకారుని బుద్ధివైభవముతోఁ జేయఁబడిన చక్కని సువర్ణకమలము వంటిది. ఉభయభారతములలోని యీభేదముఁజూపిస్వర్ణకారుని బుద్ధివైభవము వెల్లడిచేయుటయే నాయుద్దేశము."

ఇట్లాధునికవిద్వాంసులు మాత్రముగాక యిట్టి యభిప్రాయములు పూర్వకవులుగూడ కలిగియున్నారు. కవిత్రయమువారిలో మూఁడవవాఁడును, ప్రబంధపరమేశ్వరపదప్రఖ్యాతుఁడు నైన యెఱ్ఱాప్రెగ్గడ తనరచియించిన హరివంశమునందు నన్నయభట్టును నీకవిచంద్రుం బ్రస్తుతించునప్పు డీక్రింది పద్యములను రచించి నన్నయభట్టారకునికంటెను నీతఁడు మహోన్నతుఁడని సూచించెను.

"ఉ. ఉన్నతగోత్రసంభవము నూర్జితసత్త్వము భద్రజాతి సం
పన్నము నుద్ధతాన్యపరిభావిమదోత్కటము న్నరేంద్ర పూ
జోన్నయనోచితంబు నయి యొప్పెడు నన్నయభట్టకుంజరం
బెన్న నిరంకుశోక్తిగతి నొందును గ్రాలుటఁ బ్రస్తుతించెదన్."

అనుపద్యమున విద్వత్కవికుంజరుం డయిన నన్నయభట్టారకుని వినుతిచేసి,

"మ. తన కావించినసృష్టి తక్కరులచేతం గాదు నా నేముఖం
బునఁ దాఁ బల్కినపల్కు లాగమములై పొల్పొందు నా వాణి న
త్తనునీతం డొకరుండు నాఁ జను మహాత్మవ్యాప్తిం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవితిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్."

అని తిక్కనసోమయాజిని కవిబ్రహ్మ యని చెప్పియున్నాఁడు.

ఈకవివతంసుఁడు నిర్వచనోత్తర రామాయణమును, మహాభారతమును మాత్రమేగాక, విజయసేన మను మఱియొకయసమాన ప్రౌఢకావ్యమును, కవివాగ్బంధన మనియెడు ఛందస్సును, కృష్ణశతకమును, రచించె నని చెప్పుదురు. విజయసేనము మిక్కిలి ప్రౌఢమైన యముద్రితగ్రంథము గావున శైలిదెలియుటకై దానినుండి కొన్ని పద్యము లిందుఁ బ్రకటించుచున్నాను.

సీ. ఘనసారకస్తూరికాగంధముల నన్య
గంధబాధంబులు గఱపికఱపి,
కుసుమితవల్లికాలసితవీథులఁ జొచ్చి
గని సరోగృహములఁ మునిఁగిమునిఁగి,
సమధికాహార్యాంగసంగీతములతోన
కన్నెతీఁగలకాట కఱపికఱపి,
కుముదకుట్మలకుటీకోరకంబులుదూఱి
యలిదంపతుల నిద్రఁ దెలిపిదెలిపి,

గీ. యనుదినమ్ము నప్పురాంతికమ్మున గట్టు
వాలువోలె విప్రవరుఁడు వోలె
నట్టువోలెఁ దాను నచ్చినచెలివోలె
మలయుచుండు మందమారుతంబు."

"సీ. మదనవశీకారమంత్రదేవత దృష్టి
గోచరమూర్తిగైకొనియె నొక్కొ,
సితకరబింబ నిస్రుతసుధాధారగని
తంబినీరూపంబు దాల్చె నొక్కొ,
విధికామినీశ్రేష్ఠవిజ్ఞానపరసీమ
విధి గండరంపంగ వెలసె నొక్కొ,
శృంగారనవరసశ్రీవిలాసోన్నతి
సుందరాకారంబు నొందె నొక్కొ,

గీ. కాక యొకవధూటి కడుపునఁబుట్టిన
భామకేల యిట్టి రామణీయ
కంబు గలుగు ననుచుఁ గన్నియపై మహీ
పాలసుతుఁడు దృష్టిపఱపె నర్థి."

ఉ. "పల్లవపుష్పసంపదలఁబంచి వసంతుఁడు కాపు రాకకై
యెల్లవనంబు సంకటము లేదఁగఁ దా రొడికంబుమీఱన

ట్లల్లన క్రోలిక్రోలి మలయానిలుఁ డందుఁ బురాణపత్త్రముల్
డుల్లఁగఁజేసె సత్క్రియఁ బటుత్వము కాముఁడు విచ్చలింపఁగన్".

కవివాగ్బంధన మనులక్షణగ్రంథము నొకదాని రచియించినటులఁ దిక్కనసోమయాజి యీక్రిందిపద్యములోఁ జెప్పుకొనియున్నాఁడు.

"క. తనరం గవివాగ్బంధన
మనుఛందం బవనివెలయ హర్షముతోఁ ది
క్కనసోమయాజి చెప్పెను
జనులెల్ల నుతింప బుధుల సమ్మతి గాఁగన్."

తిక్కనసోమయాజి కృష్ణశతక మొకటి చెప్పె నని వేంకటరంగకవి యీపద్యము నుదాహరించుచున్నాఁడు.

మ. "అరయన్ శంతనపుత్త్రుపై విదురుపై నక్రూరుపైఁ గుబ్జపై
నరుపై ద్రౌపదిపైఁ గుచేలునిపయిన్ నందవ్రజశ్రేణిపై
బరఁగం గల్గు భవత్కృపారసము నాపైఁ గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాఁడ జగదీశా కృష్ణ భక్తప్రియా."

ఇట్టి కృష్ణశతక మొకటియుండెనేని యది తిక్కనసోమయాజికృత మైనది గాదని నిశ్చయముగాఁ జెప్పవచ్చును.

తిక్కనసోమయాజి మతము.

ఇతఁడు నిర్వచనోత్తరరామాయణము రచించునప్పటికి శివభక్తుఁ డని యీక్రింది నిర్వచనోత్తరరామాయణములోని పద్యమువలనఁ దేటపడుచున్నది.

మ. "అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడఁ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్."

మఱియును భారతము రచించునప్పటికిఁ బరిపక్వస్థితిని గాంచి అద్వైతముయొక్క నిజతత్త్వమును దెలిసికొని పరతత్త్వమునే గొల్చుచుండె నని శ్రీమదాంధ్రమహాభారతములోని విరాటపర్వమున మొదటఁ జెప్పఁబడిన దేవతాస్తుతి,

పరతత్త్వస్తుతి యైనటుల నీక్రిందిపద్యము వేనోళ్లఁ జాటుచున్నది.

"ఉ. శ్రీయన గౌరినాఁ బెలఁగు చెల్వకుఁ జిత్తము పల్లవింప భ
ద్రాయితమూర్తియై హరిహరం బగు రూపముఁ దాల్చి విష్ణురూ
పాయ నమశ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చ మెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్."

ఇతఁ డద్వైతియనియు, నేకేశ్వరోపాసకుఁ డనియు, స్పష్టముగా బోధపడుచున్నది. గావున నీపరతత్త్వవేది కృష్ణభక్తుఁడై కృష్ణశతకమును జెప్పినాఁ డనుట యుక్తియుక్తముగ లేదు.

తిక్కనవంశమువారు.

తిక్కనకొమారుఁడైన కొమ్మనవంశమువారు నెల్లూరుమండలములోఁ బెక్కండ్రు గలరఁట. ఇదియే వాస్తవమైనయెడల దిక్కనవంశము తామరతంపరయై వర్ధిల్లుచున్నదిగాని యీవంశములం దిక్కన కేవల నొక్కకవియైనఁ బుట్టకుండుటమాత్రము మిక్కిలి వింతగాఁ దోఁపకమానదు. కొట్టరువువంశమువారు పాటూరువారయినారఁట.

అథర్వణాచార్యుఁడు.

ఇతఁడు త్రిలింగశబ్దానుశాసనమును, వికృతివివేక మను వ్యాకరణకారికావళిని, అథర్వణచ్ఛందమును, భారతమును వ్రాసి ప్రసిద్ధిగాంచిన యొకమహాకవి. పైవానిలోఁ ద్రిలింగశబ్దానుశాసనమును వ్రాసినది మఱియొక యథర్వణుఁడనియు, అతఁడు నన్నయభట్టారకునకు మిక్కిలి ప్రాచీనుఁడనియుఁ, గొందఱు పండితులు తలంచుచున్నారు. అయినను హేమచంద్రుని నామ మాగ్రంథమునఁ బేర్కొనంబడియుండుటవలన నది యంతవిశ్వాసపాత్రమైన వాదముగా దలంపరాదు. అయినను, హేమచంద్రులుగూడ నొకరిద్దఱకన్న నెక్కువగ నుండవచ్చును. త్రిలింగశబ్దానుశాసనము వ్రాసిన యథర్వణుఁడు వేఱయినను గాకపోయినను వికృతివివేక మను వ్యాకరణకారికావళిని వ్రాసినవాఁడు పండ్రెండవశతాబ్దాంతమునఁగాని, పదుమూఁడవ శతాబ్దాదినిగాని యున్నట్టు మనము నిశ్చయింపవచ్చును. అథర్వణకారికలలోఁ జెప్పఁబడిన తెలుఁగక్కరము

లనుగూర్చినమార్పులు పండ్రెండవ శతాబ్దాంతమువఱకు జరిగియుండలేదని దక్షిణహిందూస్థాన ప్రాచీనలిపిశాస్త్రమును రచియించిన బర్నెల్ దొరగారు వ్రాసియున్నారు. కాఁబట్టి యాకాలమునకుఁ దరువాతనే యథర్వణాచార్యుఁ డుండెనని మన మూహింపవచ్చును. అథర్వణాచార్యుఁడు కొంచెమించుమించుగాఁ దిక్కనసోమయాజి కాలమువాఁడై యుండవలయును. ఇతఁడు మహాభారతమును విరాటపర్వము మొదలుకొనియే ప్రారంభించినట్లుగఁ గానంబడుచున్నది. ఆంధ్రశబ్దచింతామణిలోఁ లేనిలక్షణములఁ బెక్కింటిని అథర్వణాచార్యుఁడు వికృతివివేకములోఁ జెప్పియున్నాఁడు. ఈకవి రచియించిన తెలుఁగుభారతమిప్పటికిఁ బ్రకటింపఁబడలేదుగాని యందలిపద్యము లనేకములు లక్షణగ్రంథములలోఁ బ్రకటింపఁబడియున్నవి. ఈకవివంశచరిత్రము దెలియరాదు. ఇతఁడు జైనుఁడని కొందఱు తలంచుచున్నారు. లక్షణగ్రంథములలో నుదాహరింపఁబడిన పద్యములనుబట్టి చూడఁగా నితఁడు విరాటోద్యోగభీష్మపర్వములను రచించినట్లును, కవిత్వము సంస్కృతపద బాహుళ్యము గానుండి రసవంతమైయుండుననియు రావుబహదరు వీరేశలింగముపంతులుగారు తమ కవులచరిత్రమునం దెలిపియున్నారు.

గీ. "ధర్మతనయా యుష్మదాజ్ఞానిగళవిని
బద్ధమగుచుఁ జిక్కువడియెఁ గాక
విజయుమత్తగజము విడివడ్డచో నడ్డ
పాటుగలదె విష్టపత్రయమున.

క. శ్రీకంఠుఁ డెదురునపుడు వ
నౌకోధ్వజ మింద్రమకుట మర్జునతురగా
నీకము దివ్యశతాంగము
నా కవ్వడికబ్బియున్న నతఁ డేమగునో.

క. ఆకర్ణ్ణదురాలాపము
లాకర్ణింపఁగ నసహ్యమై ద్రోణునితో

నాకనదీసుతుఁ డనియె వ
నౌకోధ్వజ మెఱుఁగవచ్చు నరుఁజూపి తగన్".

(విరాటపర్వము.)

శా. "తృష్ణాతంతునిబద్ధబుద్ధు లగు రాధేయాదులంగూడి శ్రీ
కృష్ణుం గేవలమర్త్యుఁగాఁ దలఁచి మర్దింపంగ నుత్సాహవ
ర్ధిష్ణుం డయ్యె సుయోధనుం డకట! ధాత్రీనాథ యూహింపుమా
యుష్ణీషంబునఁ గట్టవచ్చునె మదవ్యాఘోగ్రశుండాలమున్".

(ఉద్యోగపర్వము.)

క. పదిదినము లయిదుప్రొద్దులు
పదపడి రెణ్ణాళ్లు నొక్క పగలున్ రేయున్
గదనంబుఁజేసి మడిసిరి
నదిసుత గురు కర్ణ శల్య నాగపురీశుల్".

(భీష్మపర్వము.)

కేతనమహాకవి.

కేతనకవి తిక్కనసోమయాజి కాలమునందుండి యాతనికిఁ దన దశకుమారచరిత్రము నంకితముచేసి మెప్పుగాంచినవాఁడు. ఈతఁడు దండివిరచితమైన దశకుమారచరిత్రమును దెనిఁగించుటచేతఁ బండితు లీతని నభినవదండి యని పొగడిన ట్లీక్రింది యాంధ్రభాషాభూషణములోని పద్యములోఁ గవియే చెప్పుకొనుచున్నాఁడు.

"క. వివిధకళానిపుణుఁడు నభి
నవదండి యనంగ బుధజనంబులచేతన్
భువిఁ బేరుగొన్నవాఁడను
గవిజనమిత్త్రుఁడను మూలఘటికాన్వయుఁడన్."

ఈ కవి యింటిపేరు మూలఘటికవారని పైపద్యమును బట్టి దెలియుచున్నది. ఇతఁడు శివభక్తుఁడు, కవిత్వముచెప్పి తిక్కనసోమయాజిని మెప్పించుట

సాధ్యము గా దని సూచించుచు నాతనిచేత మెప్పు గాంచినప్రౌఢ నని ఘనతగా నీ క్రిందిపద్యమునఁ జెప్పుకొని యున్నాఁడు.

“గీ. కవిత చెప్పి యుభయకవిమిత్త్రి మెప్పింప
నరిది బ్రహ్మ కైన; నతఁడు మెచ్చఁ
బరఁగ దశకుమారచరితంబు చెప్పిన
ప్రౌఢ నన్ను వేఱె పొగడ నేల?”

ఇతఁడు వేఁగివిషయములోని వెల్లిరాల యనునగ్రహారమున కధిపతి, మ్రానయకును సంకమాంబకును జనించిన ద్వితీయపుత్త్రుఁడు, ప్రోలనార్యుని తమ్ముఁడు. బండారు కేతదండాధీశుని మఱఁది, సంస్కృతాది భాషాకావ్యకర్తృత్వమున నుతిగన్నవాఁడు. అట్టి విఖ్యాతయశుఁ డైనకేతనార్యుని రావించి యత్యాదరంబున నాసనార్ఘ్యపాద్యతాంబూలాంబరాభరణదానాద్యుపచారంబులఁ బరితుష్టహృదయుం జేసి ‘నీవు సంస్కృతాద్యనేకభాషాకావ్యరచనావిశారదుండ వగుట జగత్ప్రసిద్ధంబు గావున నొక్క కావ్యంబు రచియించి నన్నుఁ గృతిపతిం జేయవలయు’ నని తిక్కనసోమయాజి ప్రార్థింపఁగా, నతఁడు దశకుమారచరిత్రమును దెలిఁగించి యాతని కంకితము చేసినట్లుగా నవతారికయందు వ్రాసియున్నాఁడు. ఇతఁడు దశకుమారచరిత్రమును మాత్రమే గాక కాదంబరిని, విజ్ఞానేశ్వరీయ మను యాజ్ఞవల్క్యధర్మశాస్త్రమును, దెనిఁగించెను. ఆంధ్రభాషాభూషణమను శబ్దశాస్త్రమును రచియించెను. ఇతఁడు తన యాంధ్రభాషాభూషణము రచించుటకు ముందుఁ దెనుఁగున వ్యాకరణ మెద్దియు రచియింపఁబడియుండ లే దని,

“క. మున్ను తెలుఁగునకు లక్షణ
మెన్నఁడు నెవ్వరును జెప్ప రేఁ జెప్పెద వి
ద్వన్నికరము మది మెచ్చఁగ
నన్నయభట్టాది కవిజనంబుల కరుణన్.”

అని చెప్పియున్నంతమాత్రమున నదివఱకుఁ దెలుఁగులో వ్యాకరణము మొదలగునవి లే వని యెంతమాత్రమును దలఁప రాదు. నన్నయభట్టారకునికి

బహుశతాబ్దములకు ముందే యాంధ్రకవితాకన్య జనించి వర్ధిల్లుచుండఁగా వ్యాకరణాదిగ్రంథములు లే వని యెట్లు విశ్వసింపవచ్చును? ఆంధ్రభాషాచరిత్ర మను ప్రత్యేక గ్రంథమున నీ విషయమునుగూర్చి సవిస్తరముగాఁ జర్చింపఁ దలంచి గ్రంథవిస్తరభీతిచే నిచ్చటఁ జర్చింప మానుకొనుచున్నాను. ఈ తని కవిత్వము తాను జెప్పుకొన్నట్లుగాఁ దిక్కనసోమయాజి మెచ్చునంత రసవంతముగానే యున్నది. దశకుమారచరిత్రమునుండి యిం దనేక పద్యము లుదాహరింపఁబడి యున్నవి గావున శైలి దెలుపుటకై తెనుఁగుకాదంబరినుండి యొకపద్యము మాత్ర ముదాహరించుచున్నాఁడను.

“సీ. కడు వేడి వెల్లెండ పుడమి పేల్చినఁ బొద్దు
లాకాశగతియ మే లనితలంప,
వాత్యాభిహతి లగ్గ వాడి వియచ్చరు
లవనిపైఁ జనుట మే లని తలంప,
వడవడగా నీళు లుడికిన జలచరుల్
వనచరవృత్తి మే లని తలంప,
వనములఁ గార్చిచ్చు దనరిన వనచరు
లంబుసంచరణ మే లని తలంప,
గీ. వాడియెండగాసె వడిగొనె సురగాడ్పు
లెసఁగె వడయుగాలి నెగసి వీచె
దావదహన మడరె జీవుల కధికసం
తాపకారి యగు నిదాఘవేళ.”

బయ్యనామాత్య కవి.

మఱియుఁ దిక్కనసోమయాజి కాలమున భోజరాజీయము, రసాభరణము మొదలగుగ్రంథరాజములను రచించి విఖ్యాతిఁ గాంచిన యనంతామాత్యుని ముత్తాత యగు బయ్యనామాత్యుఁడు కవిత్వము చెప్పి తిక్కనసోమయాజిచే ‘భవ్యభారతి’ యని పొగడ్తఁ గాంచినటుల ననంతామాత్యుఁడు తన భోజరాజీయములోనిదైన—

"చ. క్షితిఁ గ్రతుకర్త నా వినుతి చేకొని పంచమవేద మైన భా
రతముఁ దెనుంగుబాస నభిరామముగా రచియించినట్టి యు
న్నతచరితుండు తిక్కకవినాయకుఁ డాదట మెచ్చి 'భవ్యభా
రతి' యనఁ బేరుగన్న కవిరత్నము బయ్యనమంత్రి యల్పుఁడే."

అను పద్యములోఁ దెలిపి యున్నాఁడు. ఈ బయ్యనామాత్యకవి రచించిన గ్రంథము లేవో తెలియరాకున్నది. ఇట్లే యనేకమహాకవులగ్రంథము లంతరించియున్నవి. ఆంధ్రదేశభాషాభిమాను లెల్లరును ప్రాచీనాంధ్రసారస్వతమునకై పరిశోధనలఁ గావించినఁ దప్పక యనేక గ్రంథము లిప్పటికిని బయల్పడక మానవు.

అనంతర రాజకీయస్థితి.

మనుమసిద్ధిరాజు మరణసంవత్సరము తెలియఁబడనందున నెప్పటివఱకాతఁడు పరిపాలనము చేసియుండెనో చెప్పఁజాలను. అయినను సిద్ధిరాజు మరణానంతరము విక్రమసింహపురమునకు దక్షిణభాగమునం దున్న దేశ మంతయు కాకతీయసేనాధిపతుల వశమయ్యె నని చెప్పవచ్చును. తెలుఁగుచోడులకును కాకతీయ సేనాధిపతులకు నప్పుడప్పుడు పోరాటములు జరుగుచుండుట స్పష్టమైనవిషయము. కాకతీయసైన్యాధ్యక్షులలోఁ బ్రముఖులయిన గంగయసాహిణి, త్రిపురారిదేవుఁడు, మొదలగువారు మిక్కిలి బలవంతులును, బరాక్రమవంతులు నైనందునఁ దెలుఁగుచోడులను జయించి సామంతులనుగఁ జేసికొనిరి. శా. శ. ౧౧౯౭వ సంవత్సర మనఁగా క్రీ. శ. ౧౨౭౫ దవ సంవత్సరప్రాంతమున శ్రీమన్మహామండలేశ్వర నాగదేవమహారాజు విక్రమసింహపురమునఁ బరిపాలనము చేయుచున్నటుల నాత్మకూరుసీమలోని కామిరెడ్డిపాడులో వెలసియున్న దుర్గాపరమేశ్వరి కైంకర్యమునకై అనుయూరుప్రభువు లగు ఇతమరెడ్డి మారతోయ లనువారు చేసినదానశాసనమును బట్టి తెలియుచున్నది. ఈశాసనమునం బేర్కొనంబడిన మాండలికుఁ డైన నాగదేవరాజు కాకతీయాంధ్రచక్రవర్తులయొక్క రాజకీయాధికారియు, సేనాపతియు నైనటుల మఱికొన్ని శాసనములంబట్టి తెలియుచున్నది. ఇతఁడు

క్రీ. శ. ౧౨౭౨-౭౩వ సంవత్సరమున విక్రమసింహపురాధిపతి యైయున్నటులను, అంగపళందవాడులోని భూములను గొన్నిటిని భీమనదేవునకు దానముచేసినటులను, ఈడూరులో వెలసియున్న చొక్కనాథస్వామి యాలయములో శాసనము వ్రాయించెను.

నెల్లూరు నాగరాజులు.

పైని జెప్పిన నాగదేవుఁడు నాగవంశమున జనించిన వాఁడుగఁ గనుపట్టుచున్నాఁడు. ఇతఁ డాంధ్రచక్రవర్తిని యగు రుద్రమదేవికాలము నుండి నెల్లూరుమండలములోని కొంతభాగమునకుఁ బరిపాలకుఁడుగ నియమింపఁబడి యుండెను. చోడచక్రవర్తులకును, కాకతీయాంధ్రచక్రవర్తులకును సామంతులుగ నుండిన నాగవంశజుల మని చెప్పుకొనిన రాజులు కొందఱు నెల్లూరుమండలమున నప్పుడప్పుడు పరిపాలనము చేయుచువచ్చిరి. రాజరాజదేవచోడచక్రవర్తియొక్క ౧౮దవ పాలన సంవత్సరమున నాత్రేయగోత్రజుఁడును, అహిక్షేత్రపురాధీశ్వరుండును, మధ్యదేశాధీశ్వరుండును, ఫణిమండలాధిపతియును, శివపాదశేఖరుం డనుబిరుదాంచితుఁడును, కులోత్తుంగచోడపట్టశేఖరదేవుని కుమారుఁడు నగు సిద్ధరాజుయొక్క దానశాసనము గూడూరుసీమలోని మల్లమనుగ్రామములోని సుబ్రహ్మణ్యేశ్వరుని యాలయములో వ్రాయఁబడియున్నది. మూఁడవకులోత్తుంగచోడచక్రవర్తికి సామంతుఁడుగ నుండి యాయాలయముననే వ్రాయించిన దానశాసనములోఁ దా నాత్రేయగోత్రజుఁడ ననియు, ఫణిమండలాధీశ్వరుఁడ ననియు, అహిక్షేత్రపురాధిపతి ననియు, శివపాదశేఖరుఁడ ననియు, రాజరాజపట్టవట్టియరాజు కొమరుఁడ ననియు, చెప్పుకొన్న పెద్దరాజుకూడ పైనుదాహరించిన సిద్ధరాజువంశములోనివాఁడే యనుట కెంతమాత్రమును సందియము లేదు. ఈపెద్దరాజుకొడుకు సిద్ధరాజు, తన జ్యేష్ఠసోదరి యగు పచ్చలదేవి మనుమసిద్ధిరాజుయొక్క భార్య యని గూడూరుసీమలోని రెడ్డిపాలెములో నున్న పాండురంగస్వామి యాలయములోఁ దాను వ్రాయించిన దానశాసనమునఁ బేర్కొనియున్నాఁడు. ఈ సిద్ధరాజుయొక్క భార్య ఒరయూరుచోడుఁ డనుశూరశ్వార కత్తిదేవరాజు

కొమార్తె యగు ఇమ్మడిశ్రీయాదేవి యని యచ్చటిదే మఱియొక శాసనమునుబట్టి దెలియుచున్నది. ఈశాసనములంబట్టి తెలుఁగుచోడరాజులకును తెలుఁగు నాగరాజులకును సంబంధబాంధవములు గలవని స్పష్టముగాఁ దెలియుచున్నది. దర్శిసీమలోఁ జేరిన దర్శిపట్టణములోని యొక దేవాలయములో నాగవంశోద్భవుఁ డైన ఆసనదేవమహారాజుయొక్క శాసనములో నాతని వంశవృక్షము దెలుపఁబడినది. ఆశాసనము క్రీ. శ. ౧౩౮౪-౮౫దవ సంవత్సరమున వ్రాయఁబడినది. ఆశాసనములోని వంశవృక్షమున ఆసనదేవరాజు తాతయగు వేములమలిదేవరాజునకుఁ దాత నాగరాజని యొక నాగరాజు పేరు గానంబడుచున్నది. పైనుదాహరింపఁబడిన నాగదేవరాజితఁడే యైయుండునేమో నిర్ధారించుటకుఁ బ్రస్తుతమున నొక్కయాధారమైన గానరాదు. దర్శి నాగరాజులు హరితగోత్రుల మని చెప్పుకొనియున్నారుగావున, వీరికిని పైగూడూరుశాసనములలోని యాత్రేయగోత్రజు లయిన నాగరాజులకు నేవిధమయిన సంబంధము లేదని యూహింప వలసినది. నాగరాజులనుగూర్చి మఱియొక ప్రకరణమునందు సవిస్తరముగా వివరింపఁబడును గావున, నిచ్చట వ్రాయుట విరమించుచున్నాఁడను.

ఇమ్మడి తిక్కరాజు.

మనుమసిద్ధిరాజునకుఁ బిమ్మట సిద్ధిరాజుకొడుకగు రెండవతిక్కరాజు గద్దెయెక్కినటులఁ గానిపించుచున్నది. ఈ యిమ్మడితిక్కరాజు శా. శ. ౧౨౦౦ (క్రీ శ. ౧౨౭౮) సంవత్సరమునఁ బట్టాభిషిక్తుఁ డైనటుల గూడూరు సీమలోని కృష్ణాపట్టణములోని శాసనముంబట్టి దెలియుచున్నది. ఇతఁడు సింహాసనమెక్కిన రెండవయేఁటనే అనఁగా శాలివాహన శకము ౧౨౦౧ వ సంవత్సరమున మీనమాసమున శుద్ధదశమీ గురువారమునాఁడు గండగోపాల పట్టణ మనియెడి కొల్లిత్తుఱై పట్టణమున నివసించునట్టి వర్తకులు తిరుక్కావనమునందు సమావేశులై తాము చేసికొన్న యొడంబడిక ప్రకారమా రేవుపట్టణములో వెగుమతిచేయఁబడునట్టియు, దిగుమతి చేయఁబడునట్టియు, బస్తాలయొక్క మదింపు విలువనుబట్టి నూటికి నాలుగువంతున కొల్లిత్తుఱై గ్రామములోని మనుమసిద్ధీశ్వరుని యాలయ నిర్మాణముకొఱకును, ధూప దీపనైవేద్యాలంకారముల కొఱకును, వినియోగించునటుల దానశాసనము వ్రాయించిరి. 1

కృష్ణాపట్టణము గొప్ప రేవు పట్టణము.

ఆకాలమునందు కొల్లిత్తుఱై యనియు, గండగోపాల పట్టణ మనియుఁ బేర్కొనంబడిన కృష్ణాపట్టణము గొప్ప రేవుపట్టణముగా నుండె నని పైశాసనమునుబట్టి విస్పష్టమగుచున్నది. పదునెనిమిది విదేశములనుండి యైదువందలమంది విదేశవర్తకులును,ఆయా నాడులనుండియు, పట్టణములనుండియు, పంచమండలములనుండియు వచ్చినట్టి వర్తకులును, ఆ రేవుపట్టణమున నివసించుచుండిరని యాశాసనమునందుఁ జెప్పఁబడియుండుటచేతనే యాకాలమునందు కృష్ణాపట్టణము (Kishnapatam)గొప్ప రేవు పట్టణముగా నుండెననియు, విదేశములతో విరివిగా వర్తక వ్యాపారము జరుగుచుండె ననియుఁ, జక్కఁగా బోధపడుచున్నది. ఇతఁడు విశేషకాలము రాజ్యపాలనము చేసినట్లు గానరాదు.

మనుమగండగోపాలుఁడు.

ఇమ్మడి తిక్కరాజునకు వెనుక మనుమగండగోపాలుఁడు రాజ్యపాలనము వహించెను. ఇతఁడు క్రీ. శ. ౧౨౮౨-౮౩ వ సంవత్సరమునఁ బట్టాభిషిక్తుఁ డైనటుల నెల్లూరుసీమలోని కొడవలూరు చెఱువులోని యొక ఱాతిమీఁద వ్రాయఁబడిన రెడ్లదానశాసనము వలనఁ దెలియుచున్నది. నెల్లూరు తెలుఁగుచోడులలో మనుమగండగోపాలనామము గలవా రిరువురు గనుపట్టుచున్నారు. ఒకమనుమగండగోపాలుఁడు నెల్లూరునకు దక్షిణభాగమునను, మఱియొక గండగోపాలుఁడు నెల్లూరున కుత్తరభాగమునను, పరిపాలనముచేసినట్లు శాసనములవలనఁ దేటపడుచున్నదిగాని, వీరిరువురకు నెట్టిసంబంధము గలదో బోధపడకున్నది. వీరిలో మొదటిమనుమగండగోపాలుఁడు, తిక్కరాజునకు వెనుక వెనువెంటనే రాజ్యపదవిని బొందక, కాకతీయ సైన్యాధిపతులలో నొక్కఁడగు అంబదేవమహారాజుయొక్కసాహాయ్యము

(1) Nellore Inscriptions. Vol I. p. 417, Gudur (45)

చేత రాజ్యపదవిని బొందినట్లు గనుపట్టుచున్నది. ఈ మొదటిమనుమగండ గోపాలుని విక్రమసింహపురంబునఁ దాను సింహాసన మెక్కించినట్లుఁద్రిపురాంతకుని సోదరుఁ డగు అంబదేవమహారాజు త్రిపురాంతకమునఁ దనచే లిఖింపఁబడిన యొకదానశాసనమునఁ జెప్పుకొనియున్నాఁడు. రెండవ మనుమగండగోపాలుఁడు కాకతీయచక్రవర్తిని రుద్రమదేవికి భృత్యుఁడై కాకతీయ సైన్యాధిపతులలో నొక్కఁడై యుండెను. ఇతఁడు నిర్వచనోత్తర రామాయణకృతిపతి యగు మనుమసిద్ధిరాజు యొక్క రెండవపుత్త్రుఁడును, రెండవ తిక్కరాజు సోదరుఁడు, నగు విజయాదిత్యదేవుని పుత్త్రుఁ డని తోఁచుచున్నది. ఒక కాకతీయసైన్యాధిపతి తాను యుద్ధరంగమున నొక మనుమగండగోపాలుని సంహరించితి నని చెప్పుకొనియున్నాఁడు. ఆ మనుమగండ గోపాలుఁడు మొదటివాఁడో, లేక మఱియొక వంశములోనివాఁడో, భావి పరిశోధనమునఁగాని, తెలియునది కాదు. మొదట రాజ్యమును బోఁగొట్టుకొని తరువాత కాకతీయసైన్యాధిపతి యగు అంబదేవునిచే సింహాసన మెక్కింపఁబడిన మనుమగండగోపాలుని చరిత్రమును బురస్కరించుకొని సిద్ధేశ్వరచరిత్రమునందును, సోమదేవరాజీయమునందును, వర్ణింపఁబడిన మనుమసిద్ధిరాజు యొక్కయు; అక్కనబయ్యనలయొక్కయు గాథ యిట్టి వలఁ గల్పింపఁబడినదేమో యని సందేహము గలుగుచున్నది.

రాజగండగోపాలదేవుఁడు.

మనుమగండగోపాలునికి వెనుక విక్రమసింహపురాధిపత్యమును వహించినవాఁడు మధురాంతక పొత్తపిచోడశ్రీరంగనాథుఁడు. ఇతనినే రాజగండగోపాలదేవుఁ డందురు. ఇతని కాలమునఁ గాంచీపురచోడులయొక్క యధికారము సంపూర్ణముగా నంతరించి పోయినందున నీతఁడు త్రిభువనచక్రవర్తి యను బిరుదమును వహించెను. ఇతనిశాసనములు గూడూరు నెల్లూరు సీమలలోఁ గానిపించుచున్నవి. ఇతఁడు క్రీ. శ. ౧౨౯౦-౯౧ండవ సంవత్సరమున సింహాసన మెక్కినట్టుల శాసనములలో నుదాహరింపఁబడిన పరిపాలన సంవత్సరములంబట్టి యూహింపఁ దగియున్నది. కాంచీపురచోడుల యధికారమంతరించినవెనుక నితఁడు స్వతంత్రుఁడై కాకతీయరుద్రమదేవికిని, కొంత కాలము కాకతీయప్రతాపరుద్రదేవచక్రవర్తికిని బ్రత్యర్థిగనుండి క్రీ.శ. ౧౩౧౮ గవ సంవత్సరమువఱకుఁ బరిపాలనముఁ జేసి తుదకుఁ, బ్రతాపరుద్రునిచే జయింపఁబడి రాజ్యము గోలుపోయినట్టులఁ గనంబడుచున్నది. ఇతనికిఁ బిమ్మట కాంచీపురమువఱకుఁ గల యావద్దేశమును ప్రతాపరుద్రుని సైన్యాధిపతి యగు ముప్పిడినాయకునిచే జయింపఁబడి కాకతీయసామ్రాజ్యమునఁ జేర్పఁబడినది. ఇతఁడు తాను గావించిన దానములన్నియును నెల్లూరులోని శ్రీరంగనాయకస్వామి యాలయమునకే చేయఁబడియుండుటచేత నితఁడు వైష్ణవమతావలంబకుఁ డని చెప్పఁదగును. ఇతనితో విక్రమసింహపురచోడుల చరిత్ర మంతరించినది.

తెలుఁగు పల్లవరాజులు.

చాళుక్యచోడసామ్రాజ్యము శిథిలమై దురవస్థలపా లగుచున్నకాలమునఁ దెలుఁగుచోడులవలెనే ప్రాచీనపల్లవరాజవంశములలో జనించిన నవీన పల్లవరాజులు కొందఱు తమ పూర్వులు గోల్పోయిన రాజపదవులను మఱల సంపాదింపవలయు నని ప్రయత్నపడినట్టులఁ గనుపట్టుచున్నది. ప్రాచీనాంధ్రపల్లవరాజుల చరిత్రమును నా యాంధ్రులచరిత్రములోని ప్రథమభాగమున విస్తరించి యున్నానుగదా. ఆపల్లవరాజులసంతతివారు పెక్కండ్రు పూర్వ చాళుక్యచక్రవర్తులకును, చాళుక్యచోడచక్రవర్తులకును లోఁబడిన సామంతులుగ నుండియుఁ, బిమ్మట చాళుక్యచోడసామ్రాజ్య మస్తమించుకాలమునఁ గొంతవఱకు స్వాతంత్ర్యమును వహించి తెలుఁగుచోడరాజులతోను, కాకతీయసైన్యాధిపతులతోడను బోరాడుచు వచ్చి, తుదకు తెలుఁగుచోడులకును, కాకతీయులకును వశులై, తమతమ రాజ్యభాగములను గోల్పోయిరి. ఈనవీన పల్లవరాజుల చరిత్రముగూడ తెలుఁగుచోడుల చరిత్రమువలెనే స్పష్టముగాఁ దెలియంబడక చరిత్రకారులకు వేసటఁబుట్టించునదియై యున్నది. అయినను దెలిసినంతవఱకు నిట సంగ్రహముగా వివరించుచున్నాఁడను. మొదటికులోత్తుంగ చోడదేవచక్రవర్తి బ్రదికియున్న కాలముననే అమ్మరాజను నామాంతరముగల

శ్రీమన్మహామండలేశ్వర నందివర్మమహారాజు కడపమండలములోని ప్రొద్దుటూరు రాజధానిగఁ గొంత యాంధ్రభూభాగమును బరిపాలించుచుండెను.

నందివర్మ మహారాజు.

ఇతఁడు ముక్కంటికాడువెట్టి వంశమున జనియించిన దారపరాజునకు దుర్గాదేవియందు జనించిన పరాక్రమశాలి యగుపుత్త్రుఁడు. ఇతనిరాజ్యము నెల్లూరుమండలములోని పూగినాడువఱకు వ్యాపించి యుండెను. ఇరుగరాజు సమస్తరాజు నితని కన్నలు. భీమరాజు బంధురాజు నితనికిఁ దమ్ములు. ఇతఁడు శాలివాహనశకము ౧౦౨౪ అగు చిత్రభానుసంవత్సర వృషభమాసమున (అనఁగా క్రీ. శ. ౧౧౦౨-౩వ సంవత్సరమున) చోడపురమునఁ బట్టాభిషిక్తుఁడయ్యెను. ఇతఁడు పెనుగోడు మాసురేవి సీమలను బాలించుచు తన సామంతులతోడ సఖ్యమును వహించియుండి యొకానొక చంద్రగ్రహణసమయమున పూగినాడులోని మిదికల్లు, గుడిమిట్ట, బద్దిమడువు, జోకూరు, ఉప్పలపురము, రావిపాడు, ఇద్దుకులపాడు, జద్దుపడియ, సంగము, గోనుగుంట, గుడిపాడు గ్రామములను బ్రాహ్మణుల కగ్రహారములుగా నిచ్చుటయేగాక, పాదటూరులోని యిరుగేశ్వరునకును, దారేశ్వరునకును, దేవళములను మండపములను గోపురప్రాకారములను నిర్మించెను, మఱియు వింధ్యవాసిని యను గుడిని కట్టించెను. పోడరసముద్రం బను చెఱువును త్రవ్వించెను. పంటకాల్వలను ద్రవ్వించి తూములను గట్టించెను. వృషభకేశ్వరునకును, దారేశ్వరునకును, భూదానములను జేసి పూలతోఁటలను వేయించెను. తల్లి దుర్గాదేవిపేర నొక మండపమును, తన యన్నయగు సమస్తరాజుపేర గోపుర ప్రాకారములను నిర్మించెను. మఱియు నింకెన్నెన్నో దేవస్థానములకును, బ్రాహ్మణులకును, భూదానములు మొదలగునవి చేసి విఖ్యాతయశుఁడయ్యెను. ఇతఁడు వహించిన బిరుదములనుబట్టి స్వతంత్రుఁ డని కనంబడుచున్నను, మొదటికులోత్తుంగచోడచక్రవర్తికి లోఁబడియున్న యొక మహాసామంత ప్రభువనియే యూహింపఁ దగియున్నది. తాను కాంచీపురములోని కామకోట్యంబిక యొక్క పాదభక్తుఁడ నని చెప్పుకొనియుండుటచేత శాక్తేయమత మవలంబించిన వాఁ

డని చెప్పవచ్చును. అయినను వేంగడము (తిరుపతి) లోనుండు వేంగడ నాథుని సందర్శించినాఁడ నని చెప్పుకొనియుండుటచేత మతసహనము వహించిన వాఁ డని వ్యక్తమగుచున్నది.

అల్లుం తిరుకాళత్తిదేవరాజు.

ఇతని శాసనములు కొన్ని నెల్లూరుసీమలోఁ గానిపించుచున్నవిగాని, యితఁడు స్వతంత్రుఁడుగాక తెలుఁగుచోడరాజులక్రింది సామంతుఁడుగనుండినటుల నూహింపఁదగి యున్నది. ఈ తిక్కరాజు పల్లవుఁడని గండవరము గ్రామములోని శాసనములవలనఁ దెలియుచున్నది గావున, నీతనికిని మనుమసిద్ధిరాజుతండ్రి యగుచోడతిక్కరాజునకు నేవిధమైన సంబంధమును లేదు. ఇతఁడును దేవస్థానములకును బ్రాహ్మణులకును, అగ్రహారములు భూదానములు మొదలగునవి చేసియుండెను. ఇతఁడు క్రీ. శ. ౧౧౫౨ వ సంవత్సరప్రాంతమున నున్నవాఁడు. ఆకాలముననే కడపమండలములో సిద్ధనదేవమహారాజు పరిపాలనము చేయుచుండె నని కడపమండలములోని చింతలపుత్తూరు శాసనములవలనఁ దెలియుచున్నది.

అభిదేవ మలిదేవమహారాజు.

ఈపల్లవరాజును దాను పల్లవుఁడ ననియు, భారద్వాజ గోత్రుఁడ ననియు, ముక్కంటికాడువెట్టివంశజుఁడ ననియు, కామకోట్యంబికభక్తుఁడ ననియుఁ జెప్పుకొని యుండుటచేత నితఁడును బైపల్లవరాజుల వంశములోనివాఁడనియే చెప్పఁదగును. ఇతఁడు క్రీ. శ. ౧౨౧౫-౧౬దవ సంవత్సరప్రాంతమున నున్నవాఁడు. ఇతఁడును దేవతాభక్తియుఁ బ్రాహ్మణభక్తియుఁ గలిగి యనేకాగ్రహారములను దానము చేసియున్నాఁడు.

ఇమ్మడిదేవమహారాజు.

ఇతఁడును శ్రీశైలమునకుఁ దూర్పుదేశమున డెబ్బదియగ్రహారములను నిర్మించిన ముక్కంటికాడువెట్టియొక్క వంశజుఁడ నని పైవారివలెనే పెక్కు బిరుదములను వహించియుండెను. తనతండ్రి భీమరాజునకును, తల్లి సిరియాదేవికిని, పుణ్యమునకై నాగలావరమునందు చెన్నకేశవపెరుమాళ్లను ప్రతిష్ఠచేసి

యీదేవర యగ్చకత్వమునకై శ్రీరంగభట్టుకొడుకు పెరుమాడినంబిని నియమించి, యతనికిని అనేకబ్రాహ్మణవర్యులకును భూదానములు మొదలగునవి చేసియున్నాఁడు. ఇతఁడును స్వతంత్రుఁడుగాక, మఱియొకనికి లోఁబడియుండె ననియే యూహింపఁదగి యున్నది. ఈపల్లవరాజు క్రీ. శ. ౧౨౬౮-౬౯ దవ సంవత్సర ప్రాంతమున నున్నవాఁడు.

మహారాజసింహుఁడు.

పల్లవుఁడైన యీమహారాజసింహుఁడు మిక్కిలి ప్రసిద్ధికెక్కినవాఁడుగఁ గానిపించుచున్నాఁడు. ఇతఁడు ద్రావిడభాషాశాసనములలో కొప్పెరింజింగదేవుఁ డని వ్యవహరింపఁ బడినవాఁడు. ఇతని దానశాసనములు క్రీ. శ. ౧౨౪౩ మొదలుకొని ౧౨౭౯ వఱకుఁ గానిపించుచున్నవి. ఇతని శాసనములు కందనోలి (కర్నూలు) మండలములోని త్రిపురాంతకము నందును, గోదావరి మండలములోని ద్రాక్షారామమునందును, గన్పట్టుచుండుటచేత నాకాలమునం దీతఁడు తెలుఁగుదేశమునందు స్వసైన్యముతో సంచరించుచున్నవాఁ డని తేటపడుచున్నదికాని, యేకారణముచేతఁ దెలుఁగుదేశమునకు వచ్చెనో, ఎంతకాలముండెనో, భావిపరిశోధనమువలనఁ దెలియఁదగినదేగాని, ప్రస్తుతసాధనములంబట్టి దెలియరాదు. ఇతఁడు కాకతీయగణపతిదేవునియొక్క యవసానకాలమునందును, రుద్రమదేవియొక్క పరిపాలనకాలమునందును, కాకతీయసైన్యాధిపతులతోఁ బోరాడుచు జయాపజయములను గాంచుచు వచ్చి తుదకు కాకతీయులకు వశ్యుఁడై యంతరించె నని తోఁచుచున్నది. ఇతఁ డొకచోటనుండి పరిపాలనము చేసినట్లు గానఁబడ లేదు. ఇతఁడు కాంచీపురమునం దున్నకాలమున మనుమసిద్ధిరాజు తండ్రియగు తిక్కరాజుచే జయింపఁబడినటుల నిర్వచనోత్తర రామాయణ కర్తయగు తిక్కన సోమయాజి మనుమసిద్ధిరాజు తండ్రియగు తిక్కరాజుచరిత్రమునఁ దెలిపియున్నాఁడను.

మఱికొందఱు పల్లవరాజులు.

త్రిపురాంతకశాసనములలోఁ గన్పట్టెడి అల్లాడ పెమ్మయదేవమహారాజు, విజయగండగోపాలదేవమహారాజు, పొడకనూరిసిద్ధిరాజు మనుమఁడు

అల్లాడనాథదేవమహారాజు, అండలూరి విజయాదిత్యదేవుని మనుమఁడు మధుసూదనదేవమహారాజు, భీమయదేవమహారాజు కొడుకు సిద్ధమదేవుల విజయదేవుఁడు, విజయాదిత్యదేవమహారాజు మొదలగు పల్లవరాజులు పదుమూఁడవశతాబ్దమధ్యమునఁ దెలుఁగుచోడరాజులకు సామంతులుగనుండి వర్ధిల్లుచుండిరి. పల్లవులలోఁ గొందఱును, తెలుఁగుచోడులలోఁ గొందఱును, దాము రాజ్యాధికారములనువహించినవారు గాకపోయినను రాజకుటుంబములయందు జనించినంతమాత్రముననే మహారాజబిరుదములను వహించి తమతమ దానశాసనములయందు వానిని వల్లెవైచి మనకీకాలమునఁ జరిత్రరచనకుఁ బెక్కుచిక్కులను గల్పించియున్నారు.

యాదవచాళుక్యరాజులు.

చాళుక్యచోడ చక్రవర్తు లగు మూఁడవకులోత్తుంగచోడదేవునకును, మూఁడవరాజరాజచోడదేవునకును, సామంతులుగ నుండిన కొందఱు తాము చాళుక్యవంశజుల మనియును, యాదవవంశజుల మనియును జెప్పుకొని యున్నారు. వీరిశాసనములు చిత్తూరుమండలములోని కాళహస్తిలోను, చెంగలుపట్టుమండలములోని రామగిరిలోను, దక్షిణార్కాడు మండలములోని తిరువణ్ణామలలోను గానిపించుచున్నవి. మఱికొన్ని శాసనములు వేంకటగిరిసీమలోని చాపలపల్లిగ్రామమునను గనుపట్టుచున్నవి. ఈశాసనములవలనఁ దెలియఁదగిన ముఖ్యాంశ మెద్దియన, నీవంశములోఁ జేరిన భుజబలసిద్ధరాజను నామాంతరముగల రాజమల్లదేవుఁడు పాకనాటిలో నాగపడోలనుప్రదేశమునకు బ్రాహ్మణుల ననేకులను రప్పించి యనేకనివేశనముల నిప్పించి యాపట్టణమునకు రాజమల్లచతుర్వేదిమంగళ మని నామంబిడుటయే. ఆకాలమునందే యాతఁ డాగ్రామమునందు విజయదేవి యను నామాంతరముగల కమలమహాదేవి యను తన దేవి పేరిటఁ గమలమహాదేవిపుత్తేరి యనుతటాకమును నిర్మించెను. వీరిశాసనము లున్నవిష్ణ్వాలయ మాకాలమున యాదవనారాయణపెరుమాళ్లకోవెల యని పేర్కొనంబడుచుండెను. అదియుఁగూడ నాకాలముననే కట్టఁబడియుండును. ఇప్పు డెచ్చటను గానరాని తిరునగరేశ్వర మొడయరుని [illegible]

దానికన్నను ప్రాచీనమైనదిగ నుండెను. రాజమల్లుఁ డనుసిద్ధరాజు కట్టిదేవ రాజుకొడుకు. ఇతఁడే కాళహస్తిలోని రెండుశాసనములలో ఘట్టిదేవుం డని పేర్కొనంబడియున్నాఁడు. ఈకడపటివాఁడు మూఁడవరాజరాజచోడచక్రవర్తికి సామంతుఁడుగ నుండి కప్పము గట్టుచుండెను. ఈకట్టిదేవరాజునకును, ఆవంశములోనివారే యగు తిరుకాళత్తిదేవునకును, నరసింహదేవునకు నెట్టి సంబంధము గలదో భావిపరిశోధనములనుబట్టియే నిర్ధారింప నగును. తెలుఁగు చోడవంశములోనివాఁ డగు మధురాంతకపొత్తపిచోడయెఱ్ఱసిద్ధిరాజు రాజమల్లునకు సామంతుఁడుగ నుండి కప్పము గట్టుచున్నటుల నూహింపఁదగి యున్నది.[1]

మత సాంఘిక రాజకీయార్థిక స్థితులు.

తెలుఁగుచోడరాజులపరిపాలనకాలమున దేశములోని మతసాంఘిక రాజకీయార్థికస్థితిగతు లెట్లుండెనో వానినిగూర్చి కొంచెము చెప్పవలసి యున్నది. ఆంధ్రదేశముయొక్క యాగ్నేయభాగమునం దనఁగా కాంచీపురము, కడప, నెల్లూరు పట్టణములకు నడుమనుండు దేశముయొక్క మతసాంఘిక రాజకీయార్థిక స్థితిగతులకు చాళుక్యచోడచక్రవర్తుల పరిపాలనమునుబట్టిగాక పేరికిమాత్రము వారికి సామంతులుగనుండి నిజమైన యధికారమునంతను వహించిన తెలుఁగుచోడరాజులయొక్కయు, వారిసామంతులయొక్కయుఁ, బరిపాలనమునుబట్టి తెలిసికొనవలసియున్నది. పండ్రెండవశతాబ్దము మొదలుకొని పదునాలుగవశతాబ్దమువఱకు నిన్నూఱుసంవత్సరములకాల మీతెలుఁగుచోడరాజులు పారతంత్ర్యమునంజిక్కి యైకమత్యములేక తమలోఁదాము పోరాడుచుండుటయు, పారతంత్ర్యమునుండి విడబడి స్వతంత్రులగుటకై చేసిన ప్రయత్నములన్నియు భగ్నములగుటయుఁ జూచినప్పుడు స్థూలదృష్టికి మతసాంఘికరాజకీయార్థికస్థితు లభివృద్ధిలేక హీనతయం దున్నవని పొడగట్ట వచ్చునుగాని కొంచెము పరిశీలనచేసి సూక్ష్మదృష్టితోఁ జూచినపక్షమున నయ్యభిప్రాయము సరియైనదికాదని తోఁపకపోదు. సామంతమాండలికరాజు

1 Nellore Inscriptions Vol III. P. 1407. V. II.

లైకమత్యములేక యొండొరులతోఁ గలహించి పోరాడుచున్నను, ఆకాలము నందలిపరిపాలనాపద్ధతులనుబట్టి మతసాంఘికస్థితుల కంతగా నలజడి కలిగి యుండునని తలంపరాదు. గ్రామపరిపాలనము ప్రజలస్వాధీనమునందుండుట చేత ప్రభుత్వముచేయు రాజులు మహారాజులు మాఱుచుండినను గ్రామపరిపాలనాపద్ధతులు మాఱకుండెను. అందువలన దేశమున రాజకీయపుఁగలవర మెంత యున్నను, మతసాంఘికస్థితులు చెక్కుచెదరక యుండెను. ప్రభుత్వముచేయు రాజులుగాని, రారాజులుగాని, ప్రజల మతసాంఘికస్థితులయందు జోక్యము కలుగఁజేసికొన్నప్పుడే గొప్పసంక్షోభము జనించును. ఈతెలుఁగుచోడరాజు లెన్నఁడు నట్టిజోక్యమును కలిగించుకొన్నట్టు దృష్టాంతములు గానరావు. ఈచోడరాజులలోఁ బెక్కండ్రు వైష్ణవమత మవలంబించి పెక్కువిష్ణ్వాలయములను నెలకొల్పి వసతులేర్పాటుచేసి నూతనవైష్ణవమతమును వ్యాపింపఁజేసిరి. అయినను, మతసహనబుద్ధిగలిగి శైవులతో వైరమును బెంచుకొనక కొందఱు శివాలయములకును వృత్తుల నేర్పఱుచుచువచ్చిరి. కమ్మనాటిచోడులు శైవులుగను, పాకనాటిచోడులు వైష్ణవులుగనుండిరి. ఈతెలుఁగుచోడరాజుల కాలముననే యీ యాంధ్రభూభాగమునకు దక్షిణమునుండి వైదికబ్రాహ్మణులును, ఉత్తరపశ్చిమములనుండి నైయోగికబ్రాహ్మణులునువచ్చి స్థిరనివాసులైరి.

చాళుక్యచోడచక్రవర్తులలోఁ గడపటివా రనఁగా రాజరాజనరేంద్రుని తరువాతివారు వేంగీదేశమునం దుండక ద్రావిడదేశమునం దున్నవా రగుటచేత వారి కాంధ్రభాషకంటె ద్రావిడభాషయే యభిమానపాత్ర మయ్యెను. అయినను వారికి సామంతులుగ నుండిన మన యీతెలుఁగుచోడరాజులకాలమున మనయీయాంధ్రభాష మహోత్కృష్టదశకువచ్చినదని చెప్పుటకు నొక్క తిక్కనసోమయాజి పేరుచెప్పినఁజాలును. వీరి పరిపాలనయందు దేశభాషాభివృద్ధిమాత్రమేగాక జనాభివృద్ధియు, వర్తకాభివృద్ధియు, సస్యసమృద్ధియు, లభించియుండెను. అరణ్యములు ఛేదింపఁబడి గ్రామములు పట్టణములు నిర్మింపఁబడినవి. చక్కనిబాట లేర్పఱుపఁబడినవి. బాటల కిరుప్రక్కల వృక్షములును, అచ్చటచ్చట బాటసారులకు విశ్రాంతిగృహము

లును నెలకొల్పఁబడుచు వచ్చినవి. సెలయేళ్ల కానకట్టలు కట్టి తటాకముల నిర్మించి వానింబట్టి పంటకాలువలు త్రవ్వించి వ్యవసాయదారులకు జలాధారములనుగల్పించుచు వచ్చిరి. వీరికాలమునందు కృష్ణాపట్టణము గొప్ప రేవుపట్టణముగనుండెను. ఈ రేవుగుండ విదేశములతోడ విస్తారముగా వర్తకవ్యాపారము జరుగుచుండెను. విదేశవర్తకు లెందఱో యీదేశమునకువచ్చి యిచ్చట నివసించుచుండిరి. విదేశవర్తకులు సహిత మిచ్చటివర్తకులతో మైత్రిఁబాటించి వీరుచేయు ధర్మకార్యములకుఁ దామును తోడ్పడుచు నుండిరి. తక్కువజాతులవారు నాగరికులై శైవులు వైష్ణవులు నగుచు నగ్రవర్ణములవారితో సాటిరాఁగలవార మని చెప్పుకొనుట ప్రారంభమయ్యెను. ఈవిషయము మఱియొకతావున విస్తరించి వ్రాయఁబడును.

మూఁడవ ప్రకరణము.

నాగవంశోద్భవు లైనమహారాజులు.

క్రీ. శ. ౧౦౩౦ మొదలుకొని క్రీ. శ. ౧౩౨౩ వఱకు.

ఆంధ్రులచరిత్రములోని ప్రథమభాగమున నాగులనుగూర్చియు, నాగకులస్థులనుగూర్చియుఁ గొంతవఱకుఁజర్చించి వారల యుదంతంబుఁ బాఠకులకుఁ దెలిపి యున్నాఁడను. వీరలచరిత్రం బామూలాగ్రముగాఁ దెలిసికొనఁగోరినయెడల సంస్కృతభాషలో వ్రాయఁబడిన పురాణేతిహాసకావ్యగ్రంథములు మొదలగువానిని బెక్కింటిని బరిశోధించి యొక ప్రత్యేకగ్రంథమును వ్రాయవలయునేగాని యీయాంధ్రులచరిత్రమున సవిస్తరముగాఁ దెలుపసాధ్యముకాదు. ఆర్యులీజంబూద్వీపమునం బ్రవేశించినకాలమున నీదేశమునందును దీని సమీపదేశములయందును సురాసురయక్షగంధర్వకిన్నరకింపురుషసిద్ధసాధ్యవిద్యాధరగరుడోరగాది జాతులవారు నివసించుచుండిరి. ఈజాతులలోని వీరనాయకు లనేకసహస్రవత్సరములు గడచిపోవఁగా దివ్యపురుషులై దేవతలై పురాణగాథలమూలమునఁ బ్రశంసింపఁబడుచుండిరి. వీరిలో గరుడోరగాదు లేకప్రదేశమున నన్యోన్యకలహంబులం బెంచుకొని తమలోఁదాము యుద్ధములుసేయుచు దాయాదులవలె నుండిరి. ఈగరుడోరగాదులు కశ్యపప్రజాపతియొక్కయు అతనిభార్యలగుకద్రూవినతలయొక్కయుసంతాన మైనట్లు మహాభారతమున వర్ణింపబడినచందమును ప్రథమభాగచరిత్రమునఁ దెలిపియున్నాను. కద్రూసంతాన మైననాగులు నాగధ్వజముగలవారు. వినతసంతాన మైనగరుడులు గరుడధ్వజము గలవారు. అనేకనాగరాజులు కద్రూసంతానముగా మహాభారతమునం బేర్కొనంబడిరి.[1] అనలతేజులుగను, దీర్ఘదేహులుగను, భుజవీర్యవంతులుగను, మహాభారతమున కద్రూతనయులగునాగరాజు లభివర్ణింపఁబడిరి. ఈనాగులను సంతోషపెట్టి స్వమతావలంబకులనుగాఁ జేసికొనుటకై ప్రాచీనకాలమున శైవులు శివుని నాగభూషణునిగాఁజేసి యుందురు. ఆకతమున నాగు లనేకులు శైవులు శాక్తేయులునై యుందురు. శైవులకన్న నాధిక్యము గనఁబడవలయు నన్నభావముతో మఱికొంతకాలమునకు వైష్ణవులు విష్ణువును శేషశయనునిగను, గరుడవాహనారూఢునిగను జేసియుందురు. ఈనాగజాతివారును, గరుడజాతివారును

1. కద్రూసంతానములో శేష వాసు క్యైరావత తక్షక కర్కోటక ధనంజయ కాళియ మణినా గాపూరణ పింజర కైలాపుత్ర వామన నీలానిల కల్మాష శబలార్యకోగ్రక కలశ పోతక సురాముఖ దధిముఖ విమలపిండకాప్త కరోటక శంఖ వాలి శిఖ నిష్ఠానక హేమగుహ నహుష పింగళ బాహ్యకర్ణ హస్తిపద ముద్గర పిండక కంబలాశ్వతర కాళీయక వృత్త సంవర్తక పద్మ శంఖముఖ కూశ్మాండక క్షేమక పిండారక కరవీర పుష్పదంష్ట్ర బిల్వక బిల్వ పాండర మూషకాద శంఖశిరః పూర్ణభద్ర హారిద్ర కాపరాజిత జ్యోతిక శ్రీవహ కౌరవ్య ధృతరాష్ట్ర శంఖపిండ పితరక సుముఖ కౌణపాశన కుఠర కుంజర ప్రభాకర కుముద కుముదాక్ష తిత్తిరి హాలిక కర్దమ బహుమూలక కర్కరాకర్కర కుండోదర మహోదరు లాదిగా ప్రాచీన నాగరాజు లనేకులు పేర్కొనంబడిరి.

ధనుర్విద్యయందుఁ గుశలు లగుటంజేసి ప్రాచీనకాలంబునఁ గొన్ని యస్త్రంబులకు వారిపేరట నాగాస్త్రం బనియు, గరుడాస్త్రం బనియుఁ బేరులు పెట్టఁబడినవి. ఇవ్విషయంబు లటుండనిండు. అయోధ్యానగరమునుండి శ్రీరామచంద్రుండు దండకారణ్యమార్గమునఁ బంచవటికి వచ్చి సీతను గోల్పోయి లక్ష్మణసమేతుండై కిష్కింధారాజ్యమునకుఁ బోయి సుగ్రీవునితో సఖ్యముచేసికొన్నప్పుడు సీతను వెదకుటకై సుగ్రీవుఁడు హనుమదాదుల నురగులపట్టణ మగుభోగవతీపురంబునకుఁ బంపె నని రామాయణమునందుఁ జెప్పఁబడినది. హనుమంతునికి సీతయున్నప్రదేశమును జెప్పిన సంపాతియు, సీతనుగొనిపోవునపుడు రావణున కడ్డుపడి యుద్ధముచేసి చనిపోయిన సంపాతితమ్ముఁడు జటాయువును, గరుడజాతిలోనివారె యైయున్నారు. ఆకాలమునందు వాసుకి యనునాగరాజుచేఁ బరిపాలింపఁబడుచున్న భోగవతీపుర మిప్పటి వస్తర(బస్తరు) రాజ్యములోని ప్రాగ్భాగమున నున్నట్లుగఁ గాన్పించుచున్నది. అట్టి వస్తరరాజ్యముయొక్క పదునొకండవ, పండ్రెండవ, పదుమూఁడవ శతాబ్దముల చరిత్రము నే సంగ్రహముగా నీప్రకరణమునఁ దెలుపఁ బోవుచున్నాఁడను. ఆకాలమునం దీప్రదేశము చక్రకోట్యమండల మను పేరఁ బరఁగుచుండెను. ఆంధ్రభారతకృతిపతి యైన రాజరాజనరేంద్రునకును, అతనికుమారుం డైనరాజేంద్రచోడుఁ డను నామాంతరముగల మొదటి కులోత్తుంగచోడచక్రవర్తికిని సమకాలికుఁ డైన ధారావర్షుఁ డనునాగరాజుకాలమున నీచక్రకోట్యమండలమును స్వతంత్రుఁడై పరిపాలనము సేయుచుండెను.

చక్రకోట్యమండలము

ఈచక్రకోట్యమండలమునకు రాజధాని చక్రకోట్యమే. ఈపట్టణమునుబట్టి దేశమునకు నీనామమే గలిగినది. చక్రకోట్యమే చక్రకూట మని శాసనములయందు వాడఁబడుచు వచ్చినది. చక్రకూట మనునది చిత్రకూటముయొక్క తప్పుపేరని తోఁచెడిని. చిత్రకూట మనుగ్రామ మొకటి యిప్పటి వస్తర (Bastar) రాజ్యములోని యింద్రావతి నదియొడ్డున నున్నది. ఇంద్రావతి

యనునది వస్తరరాజ్యముగుండ ప్రవహించి గోదావరిలోఁ గలియుచున్నది. ఇంద్రనది యనిగూడ దీనికిఁ బేరుగలదు. చిత్రకూటము రామాయణములోఁ జెప్పఁబడిన చిత్రకూటాద్రికాదు. ఈచిత్రకూటము పురాణప్రసిద్ధమయినదిగఁ గూడ గన్పట్టుచున్నది. శిశునాగవంశములో జనించిన నందరాజులలోఁ గడపటివాఁ డగు మహాపద్మనందుఁడు మగధదేశమును బరిపాలించుకాలమున నీచిత్రకూటరాజ్యమును మందనాథుఁ డనువాఁడును, ఆంధ్రరాజ్యమును కావలు డనువాఁడును పాలనము సేయుచుండిరనియు, వీరలును మఱికొందఱు రాజులును గలిసి మహాపద్మనందునితో యుద్ధము చేసి యోడిపోయి చెఱబెట్టఁబడి తరాదిగ నారాజులెల్లరును క్షత్త్రియోచితసంస్కారములకు నెల్ల వెలియై శూద్రప్రాయులై పోయిరనియు మార్కండేయాదిపురాణములయందుఁ జెప్పంబడియెను. అఱవశాసనములందు చక్రకోట్యము సక్కరకొట్ట మని వ్రాయఁబడినది. ఇప్పటి బస్తరరాజ్యము మధ్యమాగాణములలోనిది. గోదావరి జిల్లాకుఁ బశ్చిమోత్తరమునను విశాఖపట్టణములోని జయపురసంస్థానమునకుఁ బశ్చిమమునను నున్న గోండ్వానాదేశములో నున్నది. అనఁగఁ జిత్రకూటరాజ్యము దక్షిణకోసల చేదిరాష్ట్రములకును కళింగాంధ్రదేశములకును నడుమనున్నది. దీని కిప్పటి రాజధాని జగదళపురము. కాకతీయప్రతాపరుద్రుని తమ్ముఁడగు అన్నమదేవుని సంతతివా రిప్పు డీదేశమును బరిపాలించుచున్నారు.

జగదేకభూషణధారావర్షమహారాజు.

ఆంధ్రభారతకృతిపతియైన రాజరాజనరేంద్రుఁడు రాజమహేంద్రపురము రాజధానిగా వేంగీరాష్ట్రమును బరిపాలించుచుండినకాలమునఁ బదునొకండవశతాబ్దమధ్యమున జగదేకభూషణధారావర్షమహారాజు చక్రకోట్యమండలమును బాలించుచుండెను. రాజరాజనరేంద్రుని పుత్త్రుఁడును యువరాజును నగు రాజేంద్రచోడుఁడు చక్రకోట్యముపై దండెత్తివచ్చి యాపట్టణమును ముట్టడించి యాధారావర్షునితో యుద్ధముచేసి జయించి యితనివలనఁ గప్పము గైకొని దక్షిణకోసలములోని వాయిరానగరమును (వజ్రాకరము)

ముట్టడించి యాదేశములోని యనేకగజయూథములను బట్టికొనిపోయెనని రాజేంద్రచోడుని శాసనములయందుఁ జెప్పఁబడినది.[1] వజ్రపురము మిక్కిలి పురాతనమైనపట్టణముగఁ గానిపించుచున్నది. క్రీస్తుశకారంభమునఁ గావేరీతీరమున నొరయూరు రాజధానిగ ద్రావిడదేశమును బరిపాలించుచు సుప్రసిద్ధి గాంచియుండిన కరికాలచోడచక్రవర్తి పైని జెప్పఁబడిన వజ్రపురాధిపతితో సఖ్యము గలిగియుండె నని శిలప్పదికార మను ద్రావిడకావ్యమునందుఁ జెప్పఁబడి యున్నది.[2] జగదేకభూషణబిరుదాంచితుఁడగు ధారావర్షుని యొక్క పూర్వులచరిత్రము దెలియరాదు. ఇతనికుమారుఁడగు సోమేశ్వరుని కృష్ణపుర (Kuruspal) శాసనమున వంశావళి చెప్పఁబడియున్నదిగాని యాభాగమునందలి యక్షరములు శిథిలము లయిపోయినందున వంశావళి చక్కఁగా నవగాహముకాకున్నది. ఈధారావర్షునకుఁ బూర్వమున నొక ధారావర్షుఁడు పేర్కొనఁబడి వానివంశమునం దీధారావర్షుఁడు జనించినటులఁ జెప్పఁబడియెను. కన్నడమండలములలోని రాజవంశములనుగూర్చిన చరిత్రము వ్రాసిన డాక్టరు ఫ్లీటుదొరగారు సింధుకులులను (సైంధవులను) మూఁడు శాఖలవారిని బేర్కొనియున్నారు. అందు మొదటిరెండుశాఖలవారును పశ్చిమచాళుక్యచక్రవర్తులకు సామంతులై యుండిరి. మొదటిశాఖ యెలుబరగిశాఖయందురు. బొంబాయిరాజధానిలో బీజపురమండలములోని బాగలకోటపట్టణమునకుఁ బదిమైళ్లదూరమున నున్న భైరాన్మట్టి యనుగ్రామమున మహాసామంతమండలేశ్వరుఁడైన నాగాదిత్యునిచే వ్రాయింపఁబడిన యొక శాసనమున నీసింధువంశోత్పత్తినిగూర్చిన యొక చిన్న గాథ పేర్కొనఁబడినది. ఈసైంధవులు నాగజాతివారనియు, అనంతుఁడు వాసుకి తక్షకుఁడు మొదలగునాగరాజులయొక్క ప్రతిబింబములను ధ్వజమునందుఁగల నాగధ్వ

1. South. Ind Inscriptions Vol· III. PP. 132 and 140 and Vol, II. P. 235.

2 The Tamils 1800 Years ago P. 67; Silappathigaram. V. II. P. 104.

జులనియు, వ్యాఘ్రలాంఛనులనియు, భోగవతీపురాధీశ్వరులనియు స్పష్టముగ వక్కాణింపఁబడియున్నారు. ఈసింధువంశముయొక్క మూలపురుషుఁడు సింధునదీగర్భదేశము నందలి అహిక్షేత్రపురమునందు ధారణేంద్రుఁడను నాగరాజునకు మానవరూపమున జనించిన పుత్త్రుఁడైయుండెనఁట!

అతఁడు జనించినపిమ్మట నొకవ్యాఘ్రముచేఁ బెంపఁబడియెనఁట! అతఁడు కదంబరాజపుత్త్రికను బెండ్లాడఁగా వారలకు మూవురుపుత్త్రులు కలిగి సింధురాజవంశస్థాపకులైరి. తరువాత ముప్పదియొక్కరు రాజులు జనించి ప్రభుత్వము చేసిరి. తరువాత సైంధవుఁడు; అటుపిమ్మట కమ్రరాజు (కమ్మయరాజు) జనించెను. అతనికి సాగరాంబయందు పులికాలుఁడు జనించెను. పులికాలునకు రేవకాంబయందు నాగాదిత్యుఁడు జనించెను. నాగాదిత్యునకు పోలాంబయందు పోలయసింధువు పుట్టెను. వానికి ఖాండవమండలేశ్వరుని తనయ యగు బిజ్జలదేవియందు సేవ్యరాజు పుట్టెను.[1] ఈపైని పేర్కొనంబడినపోలయసింధురాజును వానికొడుకు సేవ్యరాజును చక్రకొట్యమండలేశ్వరుఁడైన జగదేకభూషణధారావర్షునకును సోమేశ్వరునకును సమకాలికులై యున్నారు. కాఁబట్టి ధారావర్షుఁడు పైనిజెప్పిన రాజవంశమునకు సంబంధించినవాఁడై యుండవచ్చునని తోఁచుచున్నది. మఱియును పల్లవులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, మొదలగువారివలెనే యీనాగవంశజులును ఉత్తరహిందూస్థానమునుండి దక్షిణహిందూస్థానమునకు వచ్చినవార మని చెప్పుకొనుచున్నటులఁ బైనుదాహరింపఁబడిన భైరాన్మట్టి శాసనమువలన బోధపడుచున్నదిగాని, యితరాధారము లేవియును బరిశోధింపకుండ నీశాసనములోని గాథలను విశ్వసింపరాదు.

ఈజగదేకభూషణధారావర్షమహారాజునకు చంద్రాదిత్యుఁడను నాతఁడు సామంతుఁడుగ నుండెను. ఇతఁడు తాను కరికాలచోడవంశజుఁడ ననియుఁ, కాశ్యపగోత్రుఁడ ననియుఁ జెప్పుకొనియుండుటచేతఁ దెనుఁగుచోడుల తెగలోనివాఁడుగఁ గనుబట్టుచున్నాఁడు. ఇతనిశాసనముపైని సింహలాంఛనము

1, Ep. Ind. Vol. III. P. 231.

గలదు. శాసనపరిశోధకులితనిశాసనములం బరిశీలించి యితఁడు రేనాటిచోడులలోనివాఁ డని సిద్ధాంతీకరించిరి.[1] ఇతఁడు మొదటికులోత్తుంగచోడ చక్రవర్తితో నీదేశమునకు దండెత్తివచ్చి ధారావర్షుఁడు కులోత్తుంగచోడ చక్రవర్తికిఁ గప్పముచెల్లించి యొడంబడికచేసికొన్న తరువాత నిచ్చటనే నిలిచిపోయి ధారావర్షునికి సైన్యాధిపతిగను, సామంతుఁడుగ నుండె నని తోఁచుచున్నది. చంద్రాదిత్యుఁడు తనరాజధాని యగు వరశూరపట్టణమునందు (Modern Barsur) చంద్రాదిత్యసముద్ర మనుపేరిట నొక ఘనతటాకమును నిర్మించెను. ధారావర్షునియొక్క యంగీకారమునుబొంది వడ్డనాడులోనియొక గ్రామమునుసయితము నాశివాలయమునకు దానముచేసెను. వడ్డనా డను నది విశాఖపట్టణమండలములోని వడ్డాదిప్రాంతప్రదేశమై యున్నది. జగదేకభూషణధారావర్షమహారాజునకు గుండమహాదేవియందు సోమేశ్వరుఁ డను కుమారుఁడు జనించెను.

రాజభూషణ సోమేశ్వర మహారాజు.

ధారావర్షునకు వెనుక చక్రకూటరాజ్యాధిపత్యమునకై వానికుమారుఁడగుసోమేశ్వరునకును వాని దాయాది యగు మధురాంతకదేవునకును వివాదము పొసఁగి యుద్ధము జరిగినటుల శాసనములందు గానంబడుచున్నది. ధారావర్షుఁడు చక్రకోట్యమండలమును బరిపాలించుకాలముననే వానికి లోఁబడిన సామంతుఁడుగనో లేక స్వతంత్రుఁడుగనో మధురాంతకదేవుఁ డను నాగరాజు భ్రమరకోట్యమండలమును బరిపాలనము సేయుచున్నటుల మధురాంతకదేవుని రాజపురశాసనము వలనఁ దెలియుచున్నది.[2] తదితరనాగవంశోద్భవులయిన చక్రకూటరాజులవలెనే మధురాంతకదేవుఁడును తాను నాగవంశోద్భవుఁడ ననియు, భోగవతీపురవరాధీశ్వరుఁడ ననియు, వ్యాఘ్రలాంఛనము గలవాఁడ ననియు, నాగధ్వజము గలవాఁడ ననియు, మహేశ్వరపాదారాధకుఁడ

1. ఆంధ్రులచరిత్రములోని ప్రథమభాగము పేజి ౩౫౧.
Annual Report on Epigraphy, 1909. Para 65.
2. Ep. Ind. Vol. IX. P P. 174-181.

ననియుఁ దనశాసనమునందుఁ జెప్పుకొనియున్నవాఁడు. భ్రమరకోట్యమండలమనునది చక్రకోట్యమండలములో నొకభాగముయొక్క నామమో, లేక చక్రకోట్యమండలమునకు నామాంతరమో బోధపడలేదు. ధారావర్షుఁడు చక్రకోట్యమండలమును బరిపాలించుచుండఁగా నామండలముననే మధురాంతకదేవుఁడు స్వతంత్రుఁడై పరిపాలనము సేయుచుండెననుట విశ్వాసపాత్రము గాదు. ధారావర్షునకు మధురాంతకదేవుఁడు సామంతుఁ డనియే యూహింపవలసి యున్నది. అయినను భావిపరిశోధనమువలననే యీవిషయ మిద మిత్థ మని నిర్ణయింపవలయును.

మధురాంతకదేవుఁడు శా. శ ౯౮౭ వది యగు ప్రభవసంవత్సర కార్తికశుద్ధ బుధవాసరానూరాధానక్షత్రయుక్త శుభలగ్నమునందు కన్నరదేవరాజకుమారునియొక్కయు, పట్టమహిషి నాగలమహాదేవియొక్కయు, నాయకకుమారునియొక్కయు, శూద్రకనాయకునియొక్కయు, తుంగరాజకుమారునియొక్కయు, పుల్లమసెట్టియొక్కయు సమ్మతినిఁగైకొని మేడిపాత్రుఁ డను బ్రాహ్మణునకు భ్రమరకోట్యమండలములోని రాజపురగ్రామమును ధారాపూర్వకముగ దానముచేసెను. ఈరాజశాసనము నతిక్రమించి యీదానమునకు భంగముకలిగించువారు కాశికానగరములో వేయిలింగములను బ్రద్దలుకొట్టినప్పుడును, వేయిమందిబ్రాహ్మణులను నాలుగువేలగోవులను జంపినప్పుడు నెట్టిపాపమును బొందుదురో అట్టిపాపమునే పొందుదు రనిగూడ శ్లోకములు రచింపఁబడినవి. శ్రీధరేశ్వరనాయకుఁడు, నాగహస్తి, కరణదరియా యనువారలు సాక్షులుగను, ధేనుకాకాయస్థుఁడు లేఖకుఁడుగను బేర్కొనఁబడిరి. కుమారతుంగరాజు, ధమదేవుఁడు, గోవర్ధనుఁడు, దనార్ధనుఁడు, గాగిరపాత్రుఁడు, సాధుసారంగుఁడు, వీరలచేతఁ గలముముట్టఁబడియె ననియు, ఇది మానవృద్ధియొక్క స్వహస్తలిఖిత మనియు, ఇయ్యది జనసామాన్యాభిప్రాయమును వెల్లడించుచున్న దనియు నాశాసనమునందు వ్రాయఁబడి యున్నది.

ఇట్టి మధురాంతకదేవుఁ డేకారణముచేతనో చక్రకోట్యమండలము నాక్రమించుకొని పరిపాలనము సేయుచుండఁగా ధారావర్షునిపుత్త్రుఁ డగు

సోమేశ్వరదేవుఁడు వానిని జయించి యుద్ధరంగమునఁ జంపి సింహాసన మెక్కినటుల సోమేశ్వరుని కృష్ణపుర (Kuruspal) శాసనముంబట్టి దెలియుచున్నది. ఇతఁడు వింధ్యవాసినీ దేవతయొక్క యనుగ్రహముచేతఁ దన కీచక్రకూటసామ్రాజ్యము లభించెనని తనశాసనమునందుఁ జెప్పికొనియుండుటకూడ నీతనికిఁ బూర్వ మీ రాజ్యము మధురాంతకదేవునిచే నాక్రమింపఁబడి పరిపాలింపఁబడుచుండె నని సూచనగఁ దెలుపుచున్నది. ఇతని కృష్ణపురశాసనములలో నొకదానియందు సమకాలికు లగు రాజుల పేరు లెన్నియో పేర్కొనఁబడినవి గాని, యాభాగ మంతయు శిథిలమైయుండుటచేత నంతగాఁ బ్రయోజనకారి గాకయున్నది. నారాయణపురము (Narayanapal) శాసనమునందుంబోలె నీకృష్ణపురశాసనమునందును నాగరాజుల బిరుదావళి పేర్కొనఁబడియున్నది గాని యంతకన్న విశేషాంశము లేవియుఁ గానరావు. తక్కిన శాసనములందుంబోలె నీశాసనమునందును సోమేశ్వరుఁడు నాగవంశజుఁ డనియు, కశ్యపగోత్రుఁ డనియుఁ బేర్కొనఁబడియెను. మఱియును మహారాజాధిరాజ పరమభట్టారక పరమమాహేశ్వర సోమేశ్వరదేవుఁ డని వక్కాణింపఁబడియుండుటచేత నాగరాజులలో నితఁడు మిక్కిలి పరాక్రమవంతుఁడయిన స్వతంత్రరాజని వేద్య మగుచున్నది.

మొదటిసోమేశ్వరుని విజయయాత్రలు.

రెండవధారావర్షునికొడు కగు నితఁడే చక్రకోట్యమండలమును బాలించిన సోమేశ్వరనాము లయిన నాగరాజులలో మొదటివాఁడుగ నున్నవాఁడు. ఇతఁడు విజృంభించి శత్రురాజమండలిపైఁ గవిసి వారల రాజధాను లగు కళింగనగరము, లంజిపురము, రత్నపురము, లవణపురి, వేంగీనగరము, భద్రపట్టణము, వజ్రపురము, మొదలగువానిని ముట్టడించి జయించినట్లుగఁ దెలియుచున్నది. నారాయణుఁడు మధురాతుసుని నిర్జించినవిధముగా మొదట సోమేశ్వరుఁడు మధురాంతకదేవుని సంహరించి పిన్న నారాయణుఁ డన్న బిరుదనామమును వహించి యటుపిమ్మట శత్రువర్గము వైపునకుఁ దిరిగెను. ఆకాలమునందు భూపరిపాలనము చేయు రాజులు మొదలగువారు మత్సరగ్రస్తులై యొండొరుల

రాజధానీనగరంబులను దహించుటయే యొక ఘనకార్యముగాఁ దలపోయుచుండిరి. అప్పటి యాచారమునుబట్టి చక్రకోట్యమండలాధిపతి యైనసోమేశ్వరుఁడు వేంగీదేశముపై దండెత్తివచ్చి వేంగీపురమును దహించినట్లు మిక్కిలి డంబముగాఁ దన కృష్ణపురశాసనమునందుఁ జెప్పుకొనియున్నాఁడు.[1] అయినను వేంగీరాజ్యమును బరిపాలించిన మహారాజులు సయితము చక్రకూటరాజధానిని దహించినట్లుగాఁ దమశాసనములందుఁ జెప్పుకొనియే యున్నారు. ఇట్లొండొరుల రాజధానులను దగులంబెట్టుట సత్యమే కావచ్చును. ఈ సోమేశ్వరునికాలమున మొదటికులోత్తుంగ చోడచక్రవర్తికుమారుఁ డైన వీరచోడమహారాజు తండ్రికిఁ బ్రతినిధిగానుండి వేంగీరాష్ట్రమును బరిపాలనము సేయుచుండెను. ఇతనినామముకూడ సోమేశ్వరుని శాసనమునం దుదాహరింపఁబడినది. వేంగీపుర మనునది ప్రాచీనవేంగీపురము కాదు. ఆకాలమునందు వేంగీపురమునకు రాజధానిగనుండిన రాజమహేంద్రపురమే వేంగీపురముగాఁ బరరాష్ట్రాధిపతులచేఁ బేర్కొనంబడుచుండె నని తోఁచుచున్నది. కాఁబట్టి వేంగీరాష్ట్రాధిపతు లైన చాళుక్యచోడులకును, చక్రకోట్యమండలాధిపతు లయిన నాగరాజులకును బలుమాఱు యుద్ధములు జరుగుచుండె ననుట వాస్తవము. ఇతఁడు వేంగీపురమును మాత్రమే గాక వజ్రపురప్రాంతదేశమునందలి యారణ్యముల నన్నిటిని దహింపించె నని చెప్పఁబడియెను. మఱియును దక్షిణకోసలముపై దండెత్తిపోయి ఆఱులక్షలతొంబదియాఱుగ్రామములను గైకొనియె నని సోమేశ్వరునిశాసనమున వ్రాయంబడినది. ఇది వట్టి యతిశయోక్తిగాని వేఱొండుగాదు. దక్షిణకోసలమునం దన్నిగ్రామములు కలవా యని సందేహింపవలసి యున్నది. ఒకవేళ నిజ మనుకొన్నను సోమేశ్వరుఁడు నిజముగా దక్షిణకోసలమును బరిపాలించె ననుమాటను సమర్థించుటకు సప్రమాణమైన యాధార మేమియును గానరాదు. ఇతఁడు దక్షిణకోసలదేశముపై దండెత్తిపోయి తిరిగి వెడలఁగొట్టఁబడువఱకుఁ గొంతభాగ మాక్రమించుకొని యుండవచ్చును. ఇయ్యది జజల్లదేవునిశాసనమునుబట్టి యూహింపఁబడుచున్నది. జజల్ల

---

1. Eqigraphia Indica Vol X. No. 4.

దేవుఁడు రత్నపురము రాజధానిగ దక్షిణకోసలమును బరిపాలనము సేయుచు క్రీ. శ. ౧౧౧౮ వ సంవత్సరమున నొక శాసనము వ్రాయించెను. అందతఁడు సోమేశ్వరునిం బట్టుకొని యసంఖ్యాకమైన శత్రుసైన్యము నురుమాడె నని గొప్పగా వ్రాయించుకొనియెను. సోమేశ్వరుఁ డెవ్వఁడో వివరమును దెలుపలేదుగాని సంగతి సందర్భములను విచారింపఁగా నాసోమేశ్వరుఁడే చక్రకోట్యమండలాధిపుఁ డయిన యీసోమేశ్వరుఁడే యని తేటపడుచున్నది. మఱియును క్రీ. శ. ౧౧౧౧ వ సంవత్సరమున వ్రాయఁబడిన నారాయణపుర శాసనములో సోమేశ్వరుని మరణానంతరమున కహ్లారదేవుఁడు సింహాసన మెక్కెనని స్పష్టముగఁ దెలియుచున్నది.[1] వరశూరపుర (Bursur) శాసనముంబట్టి క్రీ. శ. ౧౧౦౭ దవ సంవత్సరమున సోమేశ్వరుఁడు జీవించియుండె నని తెలిసికొనుచున్నారము 2. రత్నపురశాసనము క్రీ. శ. ౧౧౧౮ వ సంవత్సరమున వ్రాయఁబడినది. ఈసంవత్సరములయొక్క సామీప్యసంబంధమును బట్టి మన మీవిషయమున నంతఁగా సందేహింపవలసిన పనిలేదు. సోమేశ్వరునిశాసమునందుఁ జేర్కొనంబడిన లంజికప్రాంతదేశము బాలఘుట్టము మండలములోనిది. లవణపురప్రాంతదేశము రాయపురమండలములోని ప్రాగ్భాగమే కాని యన్యముకాదు. వజ్రపురము మిక్కిలి పురాతనమైనపట్టణ మనియు, ప్రాచీన ద్రావిడభాషా సారస్వతమునం జేర్కొనఁబడుచు వచ్చినదనియు, వాయిరాగర మనుపేరిట ద్రావిడశాసనముల వాడఁబడుచు నేనుఁగులకుఁ బ్రసిద్ధిఁజెందినటులఁ జెప్పఁబడినదనియు నిదివఱకే చెప్పియున్నాను. వజ్రపురము ప్రాచీనకాలమున నెట్టిప్రసిద్ధిని గాంచియుండినను ౧౦. ౧౧ వ శతాబ్దములయందంత పేరువహించియుండలేదు. వజ్రపురము వజ్రపుగనులకుఁ బ్రసిద్ధి కెక్కియున్నటులఁ జెప్పఁబడినది. వజ్రపుర మనునది చాందామండలములోని వైరఘుర్ (Wairagarb) లేక భైరవఘుడా యనునదియేగాని యన్యముగాదని తోఁచుచున్నది. ఇయ్యది పురాతనకాలమునుండి వజ్రపుగనులకుఁ బ్రసిద్ధి కెక్కినది. ఒకప్పుడు దంతావశములకును, బొమ్మలద్దినబట్టలకును, దున్నలకును గూడఁ

1. Ind. Ant Vol. IX. P. 161 2. Ibid P. 162.

బ్రసిద్ధి కెక్కినది. అక్బరుచక్రవర్తికాలమునందును, బహామనీరాజులకాలమునందును బ్రఖ్యాతివహించియుండిన దని మహమ్మదీయచరిత్రములవలన స్పష్టమగుచున్నది.[1] అక్బరుకాలమునం దీపట్టణమును చందుఁ డనుగోండురాజు పరిపాలనము సేయుచుండెను. అచ్చటి పురాతనములై శిథిలము లయిన శిలాప్రదేశములు మొదలగువానింజూచినను స్థానికచరిత్రములను విన్నను మానవంశజులయిన రాజు లచ్చట పరిపాలనము చేసియుండిరని తేటపడఁగలదు. ఈమానజాతిశాఖ వా రెవ్వరో స్పష్టపడదుగాని నాగజాతివారిలో నొకశాఖవా రని తోఁచుచున్నది. వారలు మాణిక్యదేవి పేరిట దుర్గను బూజించుచుండిరి. భద్రపట్టణము భద్రావతి యని చెప్పంబడుచుండెను. ఈ భద్రావతి యొకప్పుడు దక్షిణకోసలమునకు రాజధానిగ నుండెను. ఇయ్యది వజ్రపురమునకు (Wairagarh) 20 మైళ్లదూరమున నున్నది. దీనినే యిప్పుడు భాండక్ అని చెప్పుచున్నారు.

ఈ చక్రకూటరాజులశాసనములు కొన్ని నాగరలిపిలో సంస్కృతమునను, మఱికొన్ని తెలుఁగుననను వ్రాయఁబడినవి. చక్రకోట్యమండలమునడుమ నింద్రావతీనది ప్రవహించుచున్నది. దీని యుత్తరభాగమునఁ బుట్టిన శాసనము లన్నియు సంస్కృతమున నాగరలిపిలో నుండుటచేతను, ఇంద్రావతీనదికి దక్షిణభాగమునఁ బుట్టినశాసనములు తెలుఁగునం దుండుటచేతను, ఉత్తరభాగమున గోండుభాషయును, దక్షిణభాగమునఁ దెలుఁగుభాషయును వ్యవహరింపఁబడుచుండినట్లుగా నూహింపఁబడుచున్నవి. ఈనాగరాజుల తెలుఁగుశాసనము లింకను బెక్కులు ప్రకటింపఁబడియుండలేదు. ఈ మొదటిసోమేశ్వరుని కృష్ణపుర సంస్కృతశాసనములు మాత్రము ప్రకటింపఁబడినవి. ఈసోమేశ్వరునకు శాసనమహాదేవి, ధారణమహాదేవి యను నిరువురు రాణులు గలరు. ధారణమహాదేవి దానధర్మములనుగూర్చిన శాసనములు రెండు కృష్ణపురమునందుఁ (Kuruspal) గానంబడుచున్నవి. ఈగ్రామము ఇంద్రావతీనదికిఁ బైనొక మైలుదూరములో

1. Aini Akbari ; Garret's Edition Vol. III. PP. 229 Ind. Ant Vol. XXVIII. P. 286.

నున్నది. ఇప్పటి రాజధాని యగు జగదళపురమునకు ౨౨ మైళ్లదూరమున నున్నది. నారాయణపురమును తమిరపట్టణమును కృష్ణపురమునకు సామీప్య మునందే యున్నవి. సోమేశ్వరుని రెండవరాణి యగు ధారణమహాదేవి కృష్ణపురములోని శ్రీకామేశ్వరస్వామికిఁ బెక్కుభూదానములను జేసి శాసనములను వ్రాయించెను. అందు విశేష-చరిత్రాంశము లేవియును లేవుగాని, రైతులు మొదలగువారి నామములును సోమేశ్వరుని బిరుదావళులు పెక్కులును పేర్కొనఁబడినవి. ఇతఁడు మహేశ్వరపాదారాధకుఁడనియు, మాణిక్యదేవి పాదారాధకుఁడనియుఁ జెప్పఁబడియుండుటచేత నీతఁడు శైవుఁడు శాక్తేయుఁడునగుటకు లేశమాత్రమును సంశయము లేదు. ఇతనికిమసకిదేవి యను తోఁబుట్టువు కలదు.

కన్నరదేవమహారాజు.

మొదటిసోమేశ్వరునకుఁ బిమ్మట వాని పుత్త్రుఁడు కన్హారదేవుఁడు రాజ్యభారమును వహించెను. శా. శ. ౧౦౩౩ ఖరసంవత్సర మనఁగా క్రీ. శ. ౧౧౧౧-౧౨ వ సంవత్సరమున వ్రాయఁబడిన నారాయణపుర (Narayanapal) శాసనములోని వాక్యసముదాయమునుబట్టి యాసంవత్సరముననే మహారాజాధిరాజయిన సోమేశ్వరుఁడు మరణము నొందఁగా నాతని కొడుకు కన్హారదేవమహారాజు సింహాసన మెక్కెనని తేటపడుచున్నది. మఱి రెండు శిథిలములయిన శాసనములందు కన్నరదేవునినామము గానంబడుచున్నదిగాని యాశాసనములకాలము చెప్పఁబడనందున నాతనికి నీకన్నరదేవునకుఁ గల సంబంధము దెలియరాకున్నది. భావిపరిశోధనముల వలనఁగాని వారిరువు రొక్కరగుదురో కారో చెప్ప వలనుగాదు. ఈకన్నరదేవమహారాజునుగూర్చిన చరిత్రాంశము లేవియును దెలియరాకున్నవి.

జగదేకభూషణవీరసోమేశ్వరమహారాజు

కన్నరదేవమహారాజునకుఁ బిమ్మట నెవ్వరు సింహాసన మధిష్ఠించిరో చరిత్రమున గోచరము గాకయున్నది. అయినను జాలకాలమునకు జగదేకభూషణవీరసోమేశ్వరమహారాజు శాసనములు గానిపించుచున్నందున భావిపరి

శోధనమున సత్యము దెలియువఱకు కన్నరదేవమహారాజునకుఁదరువాత జగదేకభూషణవీరసోమేశ్వరమహారాజే రాజ్యభారమును వహించె నని యూహింపవచ్చును. సోమేశ్వరనామమును వహించిన వారిలో నీతఁడు రెండవవాఁడుగ నున్నాఁడు. కొందఱు మొదటిసోమేశ్వరుఁడు నీతఁడు నొక్కఁడే యని సమర్థించుటకుఁ బ్రయత్నించిరిగాని వారివాదము సరియైనది కాదు. ఈవిషయము రెండవసోమేశ్వరుని నాగపురశాసనమువలన స్పష్టపడుచున్నది. మొదటిసోమేశ్వరునకు రాజభూషణబిరుద ముండఁగా నీరెండవసోమేశ్వరునకు జగదేకభూషణ బిరుదము శాసనములందుఁ జెప్పఁబడినది. మొదటిసోమేశ్వరుని రాణులు శాసనమహాదేవియును, ధారణమహాదేవియు నైయుండఁగా నీరెండవసోమేశ్వరుని రాణి గంగామహాదేవి యని పేర్కొనంబడినది. అతఁడు పదునొకండవశతాబ్దాంతమునందును, పండ్రెండవశతాబ్దాదియందును నున్నవాఁడు. ఇతఁడో పండ్రెండవ శతాబ్దాంతమునందును, పదుమూఁడవ శతాబ్దాదియందు నున్నవాఁడు గనుక వీరిరువురును భిన్ను లని తలంపక తప్పదు. ఈ రెండవ సోమేశ్వరుని తెలుఁగుశాసన మొకటి నాగపురము మ్యూజియములో నున్నది[1]. ఈశాసనము మొదట సిరువంచనుండి నాగపురమునకుఁ బంపఁబడినది. ఇతరశాసనములఁ నాగరాజులకుం జెప్పఁబడినబిరుదులే యీతనికిని జెప్పఁబడినవి. ఈవీరసోమేశ్వరునకు రాణి యైన గంగామహాదేవి తన భర్తపేరిట వీరసోమేశ్వరాలయమును, తనపేరిట గంగాధరేశ్వరాలయమును, అను రెండుశివాలయములను ప్రతిష్ఠించి భర్త యంగీకారమును గైకొని మహాప్రధాని యైన మాండలికసోమరాజుయొక్కయు, కార్యకర్త లయిన దామోదరనాయకునియొక్కయు, మెంతమనాయకునియొక్కయు, చెంచనప్రెగడయొక్కయు, దౌవారికు లయినసోమినాయకునియొక్కయు, గడ్డపు ఈరపరెడ్డియొక్కయు,

1. Epigraphia Indica Vol. III. P. 314

విరుచుమ్లప్రభుయొక్కయు, పరకోట కొమ్మనాయకునియొక్కయు సమక్షమున కేరమరక యనుగ్రామముపై వచ్చునట్టి రాబడిని వైశివాలయములకు శా.శ. ౧౧౩౧ సంవత్సర ఫాల్గునశుద్ధ ౧౨ భానువారమునాఁడు (అనఁగా క్రీ. శ. ౧౨౧౦ దవ సంవత్సరము ఫిబ్రవరినెల ౭వ తేది) దానము చేసెను. కన్నరదేవ మహారాజుయొక్క నారాయణపురశాసనమునకును గంగామహాదేవియొక్కయీశాసనమునకు నడుమ నూఱేండ్ల వ్యవధి గానవచ్చుచున్నది. ఇద్దఱు మహారాజు లింతదీర్ఘకాలము పరిపాలించినారనుట కొంచెము సందేహాస్పదముగ నుండక మానదు. ప్రస్తుత మీశాసనములవలన నింతకన్న నధికము తెలియరాదు.

జగదేకభూషణనరసింహదేవమహారాజు.

జగదేకభూషణవీరసోమేశ్వరమహారాజునకుఁ బిమ్మట నాతని కుమారుఁడయిన జగదేకభూషణనరసింహదేవమహారాజు రాజ్యాధిపత్యము వహించినటుల నాతనికాలమునాఁటి రెండు తెలుఁగుశాసనములవలనఁ దెలియుచున్నది. ఇతనితల్లి గంగాదేవి యని చెప్పఁబడుటచేతను, గంగాదేవి జగదేకభూషణవీరసోమేశ్వరమహారాజునకుఁ బట్టమహిషియై యనేకదానధర్మములు చేసియుండుటచేతను, ఈనరసింహదేవమహారాజు వీరసోమేశ్వరమహారాజుయొక్క తనయుఁడే యనియు, అతని మరణమున కనంతరము రాజ్యమును వహించినాఁడనియు నూహింపఁబడుచున్నాఁడు. ఇతరనాగరాజులకుం గల బిరుదావళులే యితనింగూర్చి ప్రశంసించిన శాసనములయందును చేర్పఁబడినవి. ఒకశాసనము దంతివాడ (Dantewara) యందును, మఱియొకశాసనము యశఃపురము (Jasanpal)నందును వ్రాయఁబడినవి[1]. దంతివార లేక దంతివాడ(దంతీశ్వరము) ఇంద్రావతీనదికి దక్షిణమున నున్నది. యశఃపురము దంతివాడకు ౪౦ మైళ్లదూరమున నున్నది. ఈరెంటియందును నరసింహదేవునినామము గానంబడుచున్నది. యశఃపురశాసనము శా. శ. ౧౧౪౭ వ సంవత్సరమునను

1. Epigraphia Indica Vol. X. Ins. No. 9.

దంతీశ్వరశాసనము శా. శ. ౧౧౪౦ దవ సంవత్సరమునను వ్రాయఁబడినవి. అనఁగా క్రీ. శ. ౧౨౧౮ దవసంవత్సరమునకు క్రీ. శ. ౧౨౨౪వ సంవత్సరమునను జగదేకభూషణనరసింహదేవమహారాజు చక్రకూటరాష్ట్రమును బరిపాలించుచున్నవాఁడని పైశాసనములనుబట్టి మనకు బోధపడుచున్నది. వీరసోమేశ్వరునకు మహాప్రధానిగ నుండిన మాండలికసోమరాజు నరసింహదేవునకుఁగూడ మహాప్రధానిగ నుండె నని యాశాసనములలో నొకదానివలనఁ దెలియుచున్నది. ఇతఁ డెంతకాలము పరిపాలనము చేసెనో యది బోధపడకున్నది.

రాజాధిరాజ జయసింహదేవమహారాజు.

నరసింహదేవమహారాజునకుఁ బిమ్మట రాజాధిరాజ జయసింహదేవమహారాజు రాజ్యాధిపత్యము వహించె నని స్వర్ణపురశాసనమునుబట్టి తెలియుచున్నది. ఇయ్యది జయసింహునిభార్యలగు లోకమహాదేవియొక్కయు, శాసనమహాదేవియొక్కయు, దానశాసనమై యున్నది. పంచప్రధానుల సమక్షమున అధకాడ యనుగ్రామమును లోకమహాదేవి దానము చేసియుండెను. శాసనములందు కాలము చెప్పఁబడియుండలేదు. స్వర్ణపురము (Sunarpal) నారాయణపురమునకు (Narayanpal) పదిమైళ్లదూరమున నున్నది. జయసింహదేవునిచరిత్ర మెంతమాత్రమును దెలిసికొనుట కాధారములు గానరాకున్నవి.

రాజాధిరాజ హరిశ్చంద్రదేవమహారాజు.

ఇతఁడు క్రీ. శ. ౧౩౨౪ గవ సంవత్సరమునకుఁ బూర్వము చక్రకూటరాష్ట్రమును బాలనము సేయుచుండినటులఁ దమిరె శాసనముంబట్టి దెలియుచున్నది. ఆసంవత్సర మీహరిశ్చంద్రదేవుఁడు మృతినొందఁగా నతనిభార్య మాణిక్యదేవి భర్తతో సహగమనము గావించె నని యాశాసనమునఁ జెప్పఁబడినది. ఈనాగరాజులు క్రీ. శ. ౧౩౨౯ దవ సంవత్సరమువఱకును చక్రకూటరాష్ట్రమును బరిపాలనము సేయుచునే యుండిరి.

నాలుగవ ప్రకరణము.

అనుమకొండ రాజ్య ప్రాచీనగాథలు.

క్రీ. శ. ౨౩౦ మొదలు క్రీ. శ. ౧౦౭౬ వఱకు.

ఇప్పటి నైజామురాష్ట్రములో ఓరంగ లను పేరిటం బరఁగుచుండు ఓరుఁగంటికి సామీప్యమున నున్న హనుమకొండయే అనుమకొండ యని పూర్వకాలంబునఁ బేర్కొనంబడి ప్రసిద్ధచారిత్రము గలిగియున్నది. త్రిలింగ దేశ మనునామాంతరముగల యాంధ్రదేశమునకు నేకశిలానగరం బనియెడు నోరుఁగల్లు రాజధానిగ నుండుటకుఁ బూర్వ మొకప్పు డీయనుమకొండ రాజధానిగ నుండెను. క్రీస్తుశకారంభమున నీభాగ మాంధ్రసామ్రాజ్యమునఁ జేరియుండి శాతవాహనవంశజు లయిన యాంధ్రచక్రవర్తులచే మూఁడవశతాబ్ద మధ్యమువఱకును బరిపాలింపఁబడియెను. ఆశాతవాహనచక్రవర్తులయొక్క చరిత్ర మాంధ్రులచరిత్రములోని ప్రథమభాగంబున సవిస్తరముగాఁ దెలుపం బడియున్నది. క్రీస్తుశకము ౨౩౦ దవసంవత్సరము మొదలుకొని పదునొకండ వశతాబ్దాంతమువఱకు నీయనుమకొండరాజ్యముయొక్క చరిత్రము విశ్వసింపఁ దగని గాథలతోఁ గూడుకొని యున్నది. ఆంధ్రచక్రవర్తులలోఁ గడపటివాఁ డగు మూఁడవపులమావి క్రీస్తుశకము మూఁడవశతాబ్దప్రారంభమున నీదేశమును బరిపాలించుచుండెను. అతనికాలంబుననే యనేకశతాబ్దములనుండి వర్ధిల్లుచుండిన యాంధ్రసామ్రాజ్యము విచ్ఛిన్నమై అనేకభాగములుగ నేర్పడినప్పుడు పశ్చిమభాగములు రాష్ట్రకూటులకును కదంబులకును, ఉత్తరభాగము లాభీరులకును కాలచుర్యులకును, ప్రాగ్దక్షిణభాగములు పల్లవులకును వశంబులై వేర్వేఱు రాజ్యములుగఁ బరిపాలింపఁబడుచు వచ్చినవి. కృష్ణామండలములోని బేతవోలు (జగ్గయపేట) స్తూపమునందలి యొకశాసనములో “ప్రసిద్ధికెక్కిన యిక్ష్వాకువీరుఁడును మాఠరయొక్క పుత్త్రుఁడు నగు శ్రీ వీరపురుషదత్తునియొక్క ౨౧

వ పరిపాలన సంవత్సరమున వర్షఋతువులోని యెనిమిదవపక్షమున దశమి నాఁడు మహాకాండూరుగ్రామనివాసియును కమ్మకరాఠవిషయమున నడతూరు గ్రామవాసి యగు నాగచంద్రునియొక్క కుమారుఁడును, ఆవేశనియు నగు సిద్ధార్థుఁడు తనతల్లి నాగలానితోడను, తనభార్య సముద్రాణితోడను, కుమారుఁడు మూలశ్రీతోడను, కుమారిక నాగబంధునికతోడను, సోదరుఁడు బుద్ధనికునితోడను, వానిభార్యతోడను, సిద్ధార్థునియొక్క కొమారితతోడను, వేలగిరి గ్రామమునం దుండిన రక్తబంధువులతోడను, మిత్త్రులతోడను, గలిసి బుద్ధుని చైత్యముయొక్క ప్రాగ్ద్వారము సామీప్యమున ప్రాణికోటియొక్క క్షేమము నిమిత్తము ఆయకస్తంభముల నైదింటిని నియమించి దానముచేసె” నని చెప్పఁ బడి యున్నది.[1] ఈశాసనమునందుఁ బేర్కొనంబడిన యిక్ష్వాకువీరుఁడైన శ్రీపురుషదత్తుఁడు ఆంధ్రచక్రవర్తి యైనమూఁడవపులమావి యనంతర నీదేశ మాక్రమించుకొని పరిపాలించిన పల్లవరాజని యూహింపవచ్చును.

అనుమకొండ నామోత్పత్తివివరణము.

ప్రాచీనకాలంబున శ్రీశైలప్రాంతారణ్యప్రదేశంబుల మహాశూరుఁడై స్వేచ్ఛావిహారము సలుపుచుండిన కిరాతకుఁ డొకండు తన యనుచరులతోఁ గూడి యచటికి నిరువదియోజనములదూరమునఁ గృష్ణాగోదావరీమధ్యప్రదేశమున హిడింబాశ్రమం బని ప్రఖ్యాతిఁ గాంచిన ముదిగొండకు నీశానభాగమునఁ గ్రోశత్రయదూరంబున నుండెడి హనుమాద్రికడకు నేతెంచి యచట నొకగ్రామమును నిర్మించి నివసించుచుండెను. అటుపిమ్మట హనుమాద్రిపై నొకదుర్గమును నిర్మాణముచేసి గ్రామమును విస్తరింపఁజేసి ‘ఎఱుకదేవరాజు’ అను పేరితోఁ బ్రజాపాలనము సేయుచుండెను. అతనికి ‘అనుముఁడు, కొండఁడు,’ అను నిరువురు కొడుకులు జనించిరి. ఆయిరువురపేరిట నారాజధానీనగరమునకు ‘అనుమకొండ’ అను నభిధానము గలిగినది. అనుమకొండకు దక్షిణమున నాలుగుపర్వులదూరమున కొండఁడు తనపేరిటఁ గొండపర్తి యనుగ్రామమును గట్టించెనఁట! ఎఱుకదేవరాజు పిమ్మట వానికొడుకు లిరువురును, తరువాత

1. Burgess Amaravaty & Jaggayyapeta Stupas P. 11.

'నాగఁడు, గార్గేయుఁడు' ననువార లిరువురు నాదేశమును ౧౨౬ సంవత్సరములు పరిపాలనము చేసిరని స్థానికచరిత్రమునఁ జెప్పఁబడినది. ఈ కిరాతకుల పరిపాలనకాలముననే జైను లనేకు లిచ్చటికివచ్చి నివాసములు కుదుర్చుకొనిరి. పద్మాక్షీదేవియాలయమున్న కొండపై జైనశిలావిగ్రహముల నెలకొల్పిరి. సిద్ధులకుఁ బార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమైనస్థలము గనుక సిద్ధాశ్రమంబని ప్రసిద్ధిగాంచిన యాశైవక్షేత్రమును జైనక్షేత్రముగ మార్చిరని చెప్పఁబడినదిగాని, దీనిని విశ్వసింపరాదు. మొట్టమొదట నీప్రదేశము జైనక్షేత్రముగనే యుండి తరువాత శైవక్షేత్రముగ మార్పఁబడినట్లుఁ గాకతిప్రోలరాజుశాసనముంబట్టి తెలియుచున్నది.[1]

సోమదేవరాజు.

ఈకిరాతకులకుఁ బిమ్మటను జంద్రవంశపు రాజు లీయనుముకొండ రాజ్యమును బరిపాలించినట్లుఁ జెప్పఁబడినది. చంద్రవంశమునఁ బాండవులు జనించిరి. వారివంశమున జనమేజయుఁడు జనించెను. అతనివంశమున విజయార్కుఁడు, సోమేంద్రుఁడు నను నిరువురు భూపాలురు పుట్టిరి. వారిలో విజయార్కునకు విష్ణువర్ధనుఁడును, సోమేంద్రునకు ఉత్తుంగభుజుఁడును జనియించిరి. వీర లుభయులును దేశమును విభాగించుకొని పరిపాలించిరి. విష్ణువర్ధనుఁడు గోదావరికి దక్షిణమున నున్న ధర్మపురిని రాజధానిగఁ జేసికొని యనేకరాజులను జయించి రాజరాజబిరుదును బడసి కీర్తిప్రతిష్ఠలను గాంచెను. విష్ణువర్ధనునకు నందుఁ డనుకుమారుఁడు పుట్టి నందగిరి యను దుర్గము నొకదాని నిర్మించి దానిని రాజధానిగఁ జేసికొని భూపరిపాలనము చేసెను. వీనికి సూరయాదిత్యుఁడు ప్రధానిగానుండి రాజనీతులను దెలుపుచుండెను. నందుని భార్య భానుమతీదేవి. ఇతఁడు రాజ్యభారమంతయును మంత్రివరునకు నొప్పగించి శ్రీశైలక్షేత్రమునకుఁబోయి శ్రీమల్లికార్జునదేవుని సేవించి సిద్ధోపదేశమును బొంది యొకబిలములోఁ బ్రవేశించెను. అచ్చట తపస్సుచేయుచుండిన యొక యోగిని వాని ధైర్యసాహసములకు మెచ్చి వానికి ఖడ్గఖేటక

1. Epigraphia Indica. Vol. IX. Page 256.

ములను యోగవాగములను బ్రసాదించెనఁట! అంతట నందుఁడు యోగవాగములచే జనార్దనస్వామిని సందర్శింపఁ గలిగెనఁట! ఆస్వామి నందునిఁ బోనీక నిలిపి నృసింహస్వరూపంబుదాల్చి ప్రత్యక్షంబైనంత నందుఁడును జెక్కుచెదరక నిలిచియుండ స్వామి సంతోషించి శస్త్రములొసంగి పొమ్మనఁగా సెలవుగైకొని యతండు కాంచీపురమున కేఁగి చోళేంద్రునికొమార్తను వివాహముచేసికొని యటనుండి రామేశ్వరమున కేఁగి ధనుష్కోటిలో స్నానముచేసి నందపురమునకు విచ్చేసి యథావిధిగా జనమనోరంజకం బగునట్టుల రాజ్యపరిపాలనము సేయుచుండెనఁట! ఈనందమహారాజునకు విజయపాలుఁ డను రాజు జనియించెనఁట! విజయపాలునకు యశస్కాముం డయిన సోమదేవుఁడు పుట్టెను. ఇతఁడు శత్రుజనభయంకరుఁడై పరాక్రమవంతుఁడై దేవబ్రాహ్మణభక్తిపరుఁడై కందార మను పట్టణమును రాజధానిగఁ జేసికొని బ్రాహ్మణుల కనేకాగ్రహారములొసంగి ప్రఖ్యాతుఁ డయ్యెను. ఇంతియగాక మంత్రకూటము, భద్రాచలము, మొదలగు ప్రదేశములలో అసంఖ్యాకములయిన యావులమందలను జేర్చి వానిపోషకత్వమునకై అధికారులను గొందఱను నియమించి విశేషభక్తిశ్రద్ధలతోఁ బోషించుచుండెను.

కటకరాజు దండెత్తివచ్చుట.

ఈ సోమదేవభూపాలుని వైభవము నంతయుఁ జారులవలన విని కటకపురాధీశ్వరుం డయిన బల్లహుఁడు వాని యైశ్వర్యమును జూఱఁ గొనవలయునని బహుళసైన్యసమేతుఁడై కందారముపై దండెత్తివచ్చి గోదావరీప్రాంతప్రదేశంబున సోమదేవుని పశుగణంబులంబొదివి గోపాలుర వదలించి మందలను దోలుకొనిపోవు సమయంబున గోసంరక్షణార్థము నిలుపఁబడిన వీరభటవర్గమునకును బల్లహుని సైన్యములకును ఘోరయుద్ధము జరిగెను. ఆయుద్ధమున సోమదేవుని సైన్యంబున హతశేషులు కందారంబునకుం జని "ఓ రాజదేవేంద్రా! కటకపురాధీశ్వరుం డయిన బల్లహుని సైన్యంబులు ధరణీచక్రము సంచరించునట్లుగా సముద్రాంతంబులై గ్రక్కున నేతెంచి మన

పశుగణంబుల ముట్టికొని రక్షకభటవర్గమును నుగ్గాడి పోవుచున్నవి.” అని బల్లహుని దుర్నయమును గూర్చి మొఱ్ఱపెట్టుకోఁగా నతఁడు కోపోద్దీపితుఁడై సైన్యంబులం గూర్చుకొని సమరోన్ముఖుఁడై కటకపురీమార్గముంబట్టి కొనిపోయి శత్రుపురదుర్గమును ముట్టడించి బల్లహునితో నాలుగు నెలలవఱకుఁ బోరాడుచునే యుండెను. తుదకు సోమదేవుని సైన్యంబులు శత్రుశరపరంపరల ముంగట నిలువంజాలక పలాయనము లగుడు బల్లహుని సైన్యంబులు దుర్గమును విడిచి వానిని దఱిమి కొట్టెను. ఇట్లెడతెగక కొంతకాలము వఱకు సోమదేవుఁడును బల్లహుఁడును బోరాడుచుండ నొకప్పుడు బల్లహుఁడును, మఱి యొకప్పుడు సోమదేవుఁడును విజయము గాంచుచుండిరి. కడపట బల్లహునితోఁ బోరాడుటను విడిచిపెట్టి సోమదేవరాజు కందారంబునుండి వెడలక యుండెను. ఒకనాఁడు సోమదేవరాజు తన శత్రువయిన బల్లహుఁడు ప్రబలుఁడై యుండుటయు, తనకుఁ బురుషసంతానము లేకుండుటయుఁ దలపోసి అమాత్యపురోహితబంధువర్గమును రావించి తనదుఃఖమునకుఁ గారణమును దెలిపి సంతానము గలుగుమార్గ మెట్లని వారల నడిగెను. అంతటఁ బురోహితులు పుత్త్రికామేష్టియాగము నాచరింపవలయు నని బోధించిరి. పిమ్మట సోమదేవరాజు తనభార్య యయిన సిరియాలదేవి సమ్మతిని గైకొని ద్విజవర్యులతోడ్పాటుతో యథావిధిగఁ బుత్త్రికామేష్టి యాగమును జేసి భూరిదక్షిణలతోను సంతర్పణములతోను బ్రాహ్మణోత్తములను బూజించెను. మఱికొంతకాలమునకు సిరియాలదేవి గర్భమును దాల్చెను. శత్రుసంహారము కొఱకుఁ బుత్త్రికామేష్టిని యొనరించి సోమదేవుఁడు పుత్త్రునిఁ బడయునున్నాఁడని బల్లహుఁడు విని భయకంపితుఁడై రాణితోఁగూడ రాజును బట్టుకొనవలయునని బహుసైన్యములం గూర్చుకొని ప్రస్థానభేరి మ్రోగించి గజఘటాహయపదాతివర్గములతో వెడలివచ్చి కందారంబును ముట్టడించెను. మహావీరుఁడైన సోమదేవరాజును వెనుదీయక శత్రువులను మార్కొని యిరువది దినములు ఘోరమైన యుద్ధమును జేసెను. ఆ యుద్ధమున సోమదేవరాజు వీరస్వర్గమును గాంచెను. ఈదుఃఖకరమైన వృత్తాంతమును సిరియాలదేవి విని

శోకసంతప్తచిత్తయై ధనకనకవస్తువాహనాదుల నన్నిటిని విప్రవరులకు దానము చేసి శాత్రవు లంతఃపురము నాక్రమించుకొనకముందే కోటవిడిచి యనుమకొండకుఁ బోయి యెఱుకదేవరాజు వంశమున జనించిన మఱియొక యెఱుకదేవరాజును శరణు చొచ్చెను. ఇచ్చట కందారంబున సోమదేవుని సైన్యము నెల రోజులు బల్లహునితోఁ బోరాడి హతమై పోవ నాతఁడు కందారము నాక్రమించుకొనెను. బల్లహుఁడు బలవంతుఁడు గనుక బలవంతునితో విరోధమువలనఁ దనకు హాని సంభవించు నని సిరియాలదేవిని తన పట్టణమును విడిచి పొమ్మని యెఱుకదేవరాజు చెప్పినందున నక్కడ సిరియాలదేవి మిగుల దుఃఖించుచు నేమి గతి యని విచారించుచు బ్రాహ్మణోత్తముఁడును, షట్కర్మ నిరతుఁడును, దయాదాక్షిణ్యశీలుఁడు నైన మాధవశర్మ కడకుం బోయి రక్షింపు మని యతని పాదములపైఁ బడియెను. ఆబ్రాహ్మణోత్తముఁ డామెను లేవనెత్తి యామెవలన వృత్తాంతమును విని జాలినొంది ‘ఓసాధ్వీ! నీకు భయం బావంతయును లేదు. సిద్ధేశ్వరుండు నిన్ను రక్షించును గాక! మద్గృహంబున నివసించి యుండుము.’ అని అభయహస్త మొసంగెను. అంతట సిరియాలదేవి ప్రచ్ఛన్నవేషముతో మాధవశర్మ యింట సురక్షితముగా నుండెను. మాధవశర్మ చేసిన కార్యమునకు బ్రాహ్మణు లందఱును సంతోషించి యాతని కనుకూలురై యీవృత్తాంతము నంతయు నితరు లెఱుంగ రాకుండఁ బరమగోప్యముగా నుంచిరి. అట కందారంబున నున్న సామంతు లందఱును బల్లహునితోఁ బోరాడఁజాలక పట్టణమును విడిచి విదేశగతులైరి. కటకవల్లభుఁడు తన పంతంబు సాగె నని విజృంభించి దయాధర్మశూన్యుఁడై కోటలు ద్రవ్వి కవాటములు విఱిచి మేడలు గూల్చి యంతఃపురమును నేలమట్టముగావించి సిరియాలదేవికై యిల్లిల్లు వెదకి సందుగొందులఁ బరికించి యెందు నుంగానకఁ బరితపించుచు జాడలు దీయఁగా నామె యనుమకొండకుఁ బాఱిపోవుట దెలియవచ్చెను. అంతట నతఁడు మంత్రిసేనాసమేతుఁడై పోయి అనుమకొండను ముట్టడించెను. ఎఱుకదేవరాజు తనపట్టణమును సంరక్షింపఁ దనసేనాధిపతుల నియోగించి మంత్రివర్గముతోడ నాలోచించుచుండెను.

బల్లహుని రాయబారులు వచ్చి "నీకు బలవద్విరోధంబు క్షేమకరంబు గాదు; సిరియాలదేవి నొసంగి నీపట్టణమును గాపాడుకొమ్ము." అని తెలియఁ జెప్పిరి. అందునకు నెఱుకుదేవరాజు వారలతో నిట్లనియె. "అయ్యా! మాకు బలవద్విరోధంబుతోఁ బనిలేదు. సిరియాలదేవి యీపట్టణమున నున్నదని మీకు నమ్మిక యున్నయెడల మీరు స్వేచ్ఛగా వచ్చి యిల్లిల్లు వెదకి తెలిసికొనవచ్చును; మా యభ్యంతర మెంతమాత్రమును లేదుగాని, మీరు మాత్రము నిరాయుధులై పట్టణమును బ్రవేశింపవలయునే గాని యాయుధపాణులై రారాదు; మీ రాకపోకల కెవ్వరు నడ్డము రారు; మఱియు సిరియాలదేవి గాన్పించినయెడల మీరు గొనిపోవుటకు మే మడ్డుపడువారము గాము" అని విస్పష్టముగాఁ దెలుప, వారలు పోయి యీవృత్తాంతమును బల్లహునికి నివేదింపఁగా నతఁడు విస్మితుఁడై వర్ణాశ్రమవిధంబునకు భంగము కలుగకుండఁ జాతుర్వర్ణ్యము వారిని వెదుకఁ బంపెను. సిరియాలదేవినిఁ గనుఁగొని తెచ్చినవారికి గొప్ప బహుమానము లిచ్చెద నని వాగ్దానము చేసెను. వార లెల్లరును బోయి వేయికన్నులతోడఁ బట్టణమంతయుఁ బరిశోధించి చూచిరిగాని యెక్కడను వారలకు సిరియాలదేవి గానిపింపదయ్యెను. అప్పు డొకధూర్త బ్రాహ్మణుఁడు రాజువలనఁ దనకు విశేష బహుమానములు లభించు నని మిక్కిలి శ్రద్ధవహించి యేడవనాఁడు మాధవశర్మ గృహంబుఁ బ్రవేశించి ప్రచ్ఛన్నవేషముతో నున్న సిరియాలదేవిని గాంచి యామె సుందరాకారమును బట్టి రాజపత్ని యని భావించి యీమెయే సిరియాలదేవి యని మాధవశర్మతోఁ జెప్పఁగా నతఁడు "సరి సరి, యీమె నాపుత్త్రిక; నా యల్లుఁడు కాశికింబోవుచు నీమె నిచ్చట నుంచిపోయె" నని యెంత చెప్పినను నాతఁడు వినక తనవారినిం గూర్చుకొని యామెను బట్టుకొని యెఱుకుదేవరాజు కడకుఁ గొనిపోయెను. అంతటఁ బట్టణములోని బ్రాహ్మణు లంద ఱేకమై "అయ్యో? ఇది ఏమి యాగడము? రాజపత్ని యని చెప్పి బ్రాహ్మణకాంత నెత్తికొనిపోవుటకంటెఁ బాపకృత్యంబు వేఱొండు గలదే? లోకములో సౌందర్యంబు క్షత్త్రియకాంతలకే గాని పెఱవారికి లేదా?

ఈసుందరి మాపుత్త్రిక యాటచే నీమెం గొనిపోవువారికి దుర్గతులు గల్గుట సత్యము" అని గొల్లున గోలపెట్టిరి. అంతట నెఱుకుదేవరాజు బ్రాహ్మణులం గని యిట్లనియెను. "బ్రాహ్మణులారా! ఈమె క్షత్త్రియకాంత యని వారు చెప్పుచున్నారు; ఈమె యంగసౌష్ఠవమును గాంచినప్పుడు నాకుఁ గూడ నట్లే తోఁచుచున్నది" అని చెప్పఁగా వారలు రోషమును జెంది యీమెను గొనిపోయినయెడల మేమందఱమును పుత్త్రపుత్త్రికళత్ర బంధువర్గముతోడ ననలప్రవేశమును గాంచి ముక్తిఁ జెందెదము. మాకీర్తి త్రైలోక్యంబునందును వ్యాపించును. ఈబ్రహ్మహత్యల పాపమును మూటకట్టుకొనుటకై బల్లహుఁడు వచ్చినవాఁడు గనుక నతని వంశంబును సామ్రాజ్యంబును గూలిపోవు నని శపింప నుద్యుక్తులు కాఁగా బల్లహుని మంత్రి విని గడగడ వడంకుచు వచ్చి వారలతో నిట్లనియె. "అయ్యా! బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఇది యేమి సాహసము? మీయిష్టమైనరీతిని వర్తింతుముగాక; ఈమాధవశర్మ మహీమాన్యుఁడు; ఇతని వంటివారి ధాత్రిలోఁ గానరారు; మేము వ్యర్థముగా నీమె రాజపత్ని యని రవ్వచేసినమాట వాస్తవము; ఇప్పుడు మీపంతము చెల్లెను. మీరు సంతోషముతో నుండవలసినది; అయిన నొక్కపరీక్ష చేయవలసియున్నది; మీరు సిద్ధేశ్వరుని సమ్ముఖమునకుఁ బోయి యచట నామె చేతియన్నమును భుజింపవలయును; ఆమె యెవ్వరైనను జంపు నుద్దేశ్యము మాకు లేదు; ఆమె మాధవశర్మ కొమార్తయైన మాకు చింతయే లేదు. ఒకవేళ నామె రాజపత్నియే యైనయెడల నామె గర్భమున నున్న శిశువును రక్షించి కందారంబునకుఁ బట్టాభిషేకము గావింతుము. మీకెల్లరకు నగ్రహారము లిప్పింతుము" అని చెప్పినంతట విప్రవరులు తమకు ధన కనక వస్తు వాహనాదులతో నిమిత్తము లేదనియును, బల్లహునిమంత్రి కోరినప్రకారము సిద్ధేశ్వరుని సమ్ముఖంబున తమకొమార్త వడ్డించిన యన్నమును భుజించుటకుఁ దమ కేయభ్యంతరమును లేదనియును, గర్భిణిచేతి యన్నము భుజింపరా దని శాస్త్రము చెప్పుచున్నది గనుక నట్లు బ్రాహ్మణు లాచరింపరాదనియును జెప్పి యతని నొప్పించి తుదకు వారు సిద్ధేశ్వరుని ముంగటఁ గటక

వల్లభుఁడు చూచుచుండఁగా సిరియాలదేవిచే ఘృతమును లవణమును గ్రహించి భుజియించిరి. అందునకు కటకరాజు సంతసించి సిరియాలదేవిని బ్రాహ్మణులకు విడిచిపెట్టి నిజసైన్యంబులతోఁ గంధారంబునుండి వెలువడి స్వదేశమునకుఁ బోయెను.

మాధవ వర్మ.

ఇక్కడ అనుమకొండలో నొక్కనాఁడు సిరియాలదేవి యొకశుభ ముహూర్తమున నొకపురుషశిశువును బ్రసవించెను. అప్పుడు దైవజ్ఞశిఖామణు లయిన బ్రాహ్మణోత్తములు పెక్కండ్రు మాధవశర్మగృహంబున కేతెంచి ముహూర్తమును బరీక్షించి గ్రహస్థితులం బరికించి జాతకమును వ్రాసి యీ పురుషశిశువు సర్వంసహాచక్రంబునిర్వక్రలీలఁ బరిపాలించు రాజశ్రేష్ఠుండగు నని మాధవశర్మతోఁ బలుక నతండు సన్తోషించి నాశీర్వదించెను. పిమ్మట మాధవశర్మ యాశిశువునకు జాతకర్మసంస్కారంబు నాచరించెను. ఆచిన్నవానికిఁ దండ్రియు, గురువును, దైవమును మాధవశర్మయేగనుక నతనినామమే తన తనయునకును బెట్టవలసిన దని సిరియాలదేవి కోరినందున నట్లే మాధవవర్మ యని నామకరణము చేయఁబడియెను. ఇట్లాచిన్నవాఁడు మాధవశర్మగృహంబున దినక్రమప్రవర్ధమానుఁడై పెరుఁగుచుండఁగా నైదవయేఁట నక్షరాభ్యాసమును విధ్యుక్తముగాఁ గావించిరి. తరువాత నుపనయనాదిసంస్కారములుజరిగినవఁట! మఱియుఁ బెరిఁగి పెద్దవాఁడై సద్గురుముఖంబున పెక్కువిద్యలను గ్రహించి విఖ్యాతుఁ డగుచువచ్చెను. అతఁడు ప్రతిదినంబును అనుమకొండ పద్మాక్షీదేవియాలయంబునకుం జని మిక్కిలి శ్రద్ధాభక్తులతో నామెను సేవించుచు వరప్రసాదమునుబొంది నిర్వక్రపరాక్రముండు నజయ్యుండునై వన్నెకెక్కుచుండెను. అతఁ డొక్కనాఁడు తనతండ్రి కటకరాజుతో జరిగిన యుద్ధమునఁ జంపఁబడియె నని విని క్రుద్ధుఁడై పగసాధింప దీక్షవహించెను. అంతటఁ గ్రమక్రమముగా నీరాజపుత్త్రిని నవమన్మథాకారమునుగూర్చియు, వివిధ విద్యాప్రౌఢిని గూర్చియు, పరాక్రమమునుగూర్చియు, విచిత్రములయిన కథ

లును వొగడ్తలును దేశమునందంతట వ్యాపింపఁగా దేశములోని శూరులందఱు నాతనికడ కేఁగి కటకరాజుతోడి యుద్ధమునకుఁ బురికొల్పి సమరోన్ముఖునిఁ గావించిరి. అప్పుడు మాధవవర్మ తల్లియొక్కయు, మాధవశర్మయొక్కయు, ఇతర బ్రాహ్మణులయొక్కయు ననుజ్ఞంగైకొని బహుసైన్యములం గూర్చుకొని మొట్టమొదట నాపట్టణమేలుచున్నట్టి యెఱుకదేవరాజును మఱియొకప్రదేశమునకుఁబంపి యనుమకొండను స్వాధీనపఱుచుకొని దోర్దర్పమున నుద్దవిడి నుత్కలముపై దండెత్తిపోయి కటకపురిని ముట్టడించెను. కటకపురాధీశ్వరుండును మేటిపరాక్రమవంతుఁడే గావున జంకులేక ధైర్యసాహసములతో యుద్ధసన్నద్ధుఁడై మాధవవర్మ నెదుర్కొనియెను. మాధవవర్మ కటకదుర్గమును ముప్పదిదినములు ముట్టడించి కోటలనుద్రవ్వి, కవాటంబులనువిఱిచి, కుడ్యంబులిడియఁగొట్టి, పట్టణంబుఁజొచ్చి సౌధంబులనుగూల్చి, సకలసైన్యంబును సమయించి, వీరరసంబు పొంపిరివోయి పోరలిపొల్చు సంకులసమరంబునఁ జంద్రాయుధముచేఁ గటకవల్లభుని తలఁ[illegible]ంచి, పట్టణంబంతయు వశముచేసికొని, కటకపురాధీశ్వరుని కుమారునకుఁ బట్టముగట్టి, హతశేషమయిన సైన్యముతో ననుమకొండకు మహావైభవముతో విచ్చేసి, తల్లికిని మాధవశర్మకును నమస్కరించి, యాశీర్వాదములను గాంచెను. పిమ్మట మాధవవర్మ దుర్మార్గులను శిక్షించుచు సన్మార్గులను రక్షించుచు బ్రాహ్మణుల కనేకాగ్రహారంబులొసంగి ప్రజానురంజకముగాఁ బరిపాలనము సేయుచుండెను. అతనికి బట్టమహిషియందు బద్మాక్షీదేవి వరప్రసాదంబునఁ గొంతకాలంబునకు సుతుండు కలుగఁగా నా బాలునకుఁ బద్మసేనుం డని నామముంచెను. ఈమాధవశర్మ శాలివాహనశకము ౨౩౦ దవ సంవత్సరము మొదలుకొని ౧౬౦ వది సంవత్సరము లనఁగా శాలివాహనశకము ౩౯౦ దవ సంవత్సరము వఱకును బరిపాలనముచేసె నని స్థానిక చరిత్రమునం జెప్పఁబడినది. పండ్రెండవ శతాబ్దమునందు వేంగిదేశాధీశ్వరునకు సామంతుఁడుగనుండిన మహామండలేశ్వర పల్లకేతభూపాలుఁడు బెజవాడ మల్లేశ్వరస్వామివారి యాలయములో నొకఱాతిపలకమీఁద వ్రాయించిన శాసనములో నుదాహరింపఁబడిన గాథలలో శాలివాహనశకము ౧౧౭ వ

సంవత్సరప్రాంతమున నొకమాధవవర్మ యనురాజు కలఁడనియు, అతనికుమారుఁడు చింతగింజల నమ్ముకొని పొట్టపోసికొనెడి యొకస్త్రీయొక్క బిడ్డను సంహరించినందున రాజు విచారించి తనకొడుకుమీఁద నేరము బుజువైనందున న్యాయపక్షము నేపూని కొడుకునకు నురిశిక్ష విధించె ననియు, అందుపైని మల్లేశ్వరస్వామి యాతని న్యాయబుద్ధికి సంతోషించి యాతనిపై సువర్ణవర్షమును గురిపించి యాతనిపుత్త్రుని బీదరాలగు నాస్త్రీయొక్క పుత్త్రుని మరల సజీవులను గావించెననియు, మల్లేశ్వరుఁడు మాధవవర్మయొక్క కీర్తిని భూమిపై స్థాపితముచేసె ననియు, నీమొదలు గాఁగలవిషయములు పేర్కొనఁబడినవి. 1 కాఁబట్టి మాధవవర్మఖ్యాతి యప్పటికే ప్రఖ్యాతమై యున్నది. ఈమాధవవర్మచరిత్రమునం గొంతకల్పన ముండినను మాధవవర్మ కల్పితపురుషుఁ డని మాత్రము చెప్ప వలనుగాదు. ఇయ్యవి భావిపరిశోధనమునం గాని తేటపడునట్టి విషయములు కావు.

మఱికొందఱు చంద్రవంశపురాజులు.

మాధవవర్మకు పిమ్మట బద్మసేనుఁడు రాజ్యభారమును వహించి శా. శ. ౪౬౮ సంవత్సరమువఱకు ననఁగా ౭౮ సంవత్సరములును, అటుపిమ్మట వానికొడుకు వెన్నమరాజు శా. శ. ౫౩౭ వఱకు ననఁగా ౭౮ సంవత్సరములును, అనంతరము వానికుమారుఁడు పోరంకివెన్నమరాజు శా. శ. ౬౧౦ వఱకు ననఁగా ౭౮ సంవత్సరములును, తదనంతరము వానిపుత్త్రుఁడు వెండిగుండమరాజు శా. శ. ౬౮౦ వఱకు ననఁగా ౭౦ సంవత్సరములును, వానివెనుక వానితనయుఁడెలుకుదేవరాజు బాలుఁడైనందున వానిపక్షముగా వానితల్లి కుంతలదేవి శా. శ. ౬౯౯ వఱకు ననఁగా ౧౯ సంవత్సరములును, ఆమెతరువాత నెలుకుదేవరాజు శా. శ. ౭౬౭ వఱకుననఁగా ౭౦ సంవత్సరములును, ఎలుకుదేవరాజునకుఁ దరువాత భువనైకమల్లుఁడు శా.శ. ౮౩౫ వఱకు ననఁగా

1. Report on Epigraphy No. 665, Public, 28th July, 1810, Part II, Pages 81- 82, Paras 8 and 9.

౬౮. సంవత్సరములును బరిపాలనముచేసిరని చెప్పఁబడియున్నది. ఈరాజులను గూర్చి విశేషచరిత్రాంశము లేవియు స్థానికచరిత్రమునం జెప్పఁబడి యుండలేదు. ఈరాజులపరిపాలన సంవత్సరము లంతగా విశ్వసింపఁదగినవి కావు. ఈరాజులు కటకపురాధీశ్వరునితోఁ బోరాడుచుండినటుల స్థానికచరిత్రమునందు వ్రాయఁబడి యున్నది. ఈమహారాజులలో భువనైకమల్లుఁడు ప్రఖ్యాతుఁడుగఁ గన్పట్టుచున్నాఁడు. ఇతఁడు విజయనగరపురాజయిన నరసింహదేవరాయలతో యుద్ధముచేసినటులఁ జెప్పఁబడియెనుగాని యాకాలమునకు విజయనగరము నిర్మింపఁబడకుండుటయు, నరసింహదేవరాయ లాకాలమువాఁడు గాకుండుటయు వాస్తవములయిన చరిత్రాంశములు గావునఁ బైగాథలలోని విషయముల నెంతమాత్రమును విశ్వసింపరాదు.

నిజమైన చరిత్రము.

క్రీస్తుశకము ౫౩౦ మొదలుకొని క్రీ. శ. ౧౦౬౭ వఱకు నిజమైన చరిత్రము వివరముగాఁ దెలియుసాధనములు లేవుగాని కొన్ని శాసనములనుబట్టి యీదేశము ౫ వ శతాబ్దమునఁ బశ్చిమచాళుక్యులకును, తరువాత రాష్ట్రకూటులకును, అటుపిమ్మట మరలఁ బశ్చిమచాళుక్యులకును వశమై పరిపాలింపఁబడియెనని తేటపడుచున్నది. పశ్చిమచాళుక్యచక్రవర్తియైన పృథ్వీవల్లభమహారాజు ౭ వ శతాబ్దప్రారంభమున నీదేశమును జయించెను. శ్రీపృథ్వీవల్లభమహారాజాధిరాజపరమేశ్వరపరమభట్టారకపాదపద్మోపజీవి నని చెప్పుకొన్న భీమరాజను నొకరాజుయొక్క యసంపూర్ణశాసన మొకటి యోరుఁగంటియందుఁ గానంబడుచున్నదిగావున మఱికొన్ని శాసనములనుబట్టియు నీదేశము ౫ వ శతాబ్దమునుండి ౮ వ శతాబ్దమధ్యమువఱకు పశ్చిమచాళుక్యులును, ౧౦ దవ శతాబ్దాంతమువఱకు రాష్ట్రకూటులును, తరువాతఁ బదునొకొండవ శతాబ్దమధ్యమువఱకు మరలఁ బశ్చిమచాళుక్యులును, అటుపిమ్మటఁ గాకతీయులు నీదేశమును బరిపాలించినటులఁ జరిత్రమునుబట్టి తెలియుచున్నది.

అయిదవ ప్రకరణము.

కాకతీయాంధ్రులు.

త్రైలింగ్య సామ్రాజ్యనిర్మాణము.

పశ్చిమచాళుక్యచక్రవర్తులు త్రిలింగదేశముయొక్క పశ్చిమ భాగమును జయించి పరిపాలించుచుండినది మొదలుకొని మాధవవర్మవంశస్థులయిన వారు చాళుక్యచక్రవర్తులకు సామంతమండలేశ్వరులుగ నుండి పరిపాలనము సేయుచుండి రని యూహింపవలయునేగాని వారలు స్వతంత్ర పరిపాలనము సేయుచుండి రని యెంతమాత్రమును దలంప నాధారము గానిపింపదు. ఏది యెట్లు లున్నను పదునొకండవశతాబ్దమునందు త్రిలింగదేశములోని పశ్చిమభాగము పశ్చిమచాళుక్యచక్రవర్తుల స్వాధీనమున నుండె ననుటకు లేశమాత్రమును సందియము లేదు. పశ్చిమచాళుక్యచక్రవర్తి యగు త్రిభువనమల్లవిక్రమాదిత్యుఁడు శాలివాహనశకము ౯౯౮ నళ సంవత్సరమం దనఁగా క్రీ. శ. ౧౦౭౬ వ సంవత్సరమునఁ బట్టాభిషిక్తుఁడై శా. శ. ౧౦౪౮ పరాభవసంవత్సరము వఱకు ననఁగా క్రీ. శ. ౧౧౨౬ వఱకు అవక్రపరాక్రముఁడై ప్రజాపరిపాలనము చేసెను. ఈ త్రిభువనమల్లవిక్రమాదిత్యుని కర్ణాటభాషాశాసనములు త్రిలింగదేశముయొక్క పశ్చిమభాగమునం దనేకములు గానంబడుచున్నవి. అప్పు డీభాగమంతయు వివిధభాగములుగ నేర్పడి వేర్వేఱు మండలాధిపతులచేఁ బరిపాలనము సేయంబడుచుండెను. ఆమండలాధిపతులలోఁ గాకతీయు లొకరుగా నుండిరి. వీరు మొట్టమొదట వీరులుగానుండి మహారాజులకడ నధికార పదవులను సంపాదించి మండలాధిపతులై చాళుక్యచక్రవర్తులకు సేనాధిపతులు మంత్రులునై వారలకుఁ గప్పములు చెల్లించుచుఁ గొంతకాలము గడపి క్రమక్రమముగా

బలవంతులై వారల యధికారమును బోఁద్రోచి త్రైలింగ్యసామ్రాజ్యసంస్థాపకులై వన్నెయు వాసియుఁ గాంచి యించుమించుగా మూఁడుశతాబ్దములు పరిపాలనముచేసి శాశ్వతయశంబు గాంచిరి. ఈప్రభువులు కాకతి యను దేవతను గొల్చుచుండువారు గావున వీరికిఁ గాకతీయు లనుపేరు గలిగినట్లు గానంబడుచున్నది. కాకతి యను నామము దుర్గయొక్క నామాంతర మని మహామహోపాధ్యాయ కోలచల మల్లినాథసూరిగారిపుత్త్రుం డగు కుమారస్వామిసోమయాజిగారిచేఁ జెప్పంబడియెనుగాని కాకతీయులపూర్వులు జైనమతావలంబకు లగుటచేతఁ గాకతి యనునది జైనదేవతలలో నొకదాని నామముగా నూహింపవలయును.

కాకతీయులు సూర్యవంశజులు.

కాకతీయులు చంద్రవంశజులనియు మాధవవర్మసంతతివారనియు స్థానికచరిత్రమునందును, కాసె సర్వప్పప్రణీత మగు సిద్ధేశ్వరచరిత్ర మను నామాంతరముగల ప్రతాపచరిత్రమునందును, దీనిని బట్టి కూచిమంచి జగ్గకవిచే వ్రాయఁబడిన సోమదేవరాజీయమునందును వ్రాయఁబడియెనుగాని కాకతీయులు సూర్యవంశజులయినట్లుఁ గాకతీయుల శాసనములంబట్టియే దెలియుచున్నది. కాకతిప్రోలరాజు శాసనములందుఁగాని, మొదటి ప్రతాపరుద్రుని శాసనములందుఁగాని సూర్య చంద్ర వంశముల ప్రశంస లేకపోయినను గణపతిదేవునికాలమునాఁటి శాసనములయందుఁ గాకతీయులు సూర్యవంశజులని చెప్పఁబడిరి. వారి పూర్వులలో ఇక్ష్వాకువు, రఘువు, రాముఁడు మొదలగు వారి నామములు పేర్కొనంబడినవి. ప్రతాపరుద్రీయ మనునలంకారశాస్త్రమును రచించినవిద్యానాథమహాకవి సూర్యవంశమనికాని చంద్రవంశమనికాని చెప్పక "అస్త్యర్కేందుకులప్రశస్తిమసృణవ్యం కాకతీయాన్వయమ్" అని రెంటి నతిశయించిన కాకతీయాన్వయ మని చెప్పియున్నాఁడు. శ్రీదౌర్వాసదేవీపురాణ మనియెడు కమ్మనాయకుల చరిత్రమునఁ జంద్రవంశమునఁ గమ్మరాజు జనించెననియు, అతని సంతతియే కమ్మవారయిరనియు, ఆకమ్మరాజవంశమున నే

కాకతీయప్రతాపరుద్రుఁడు జనించెననియు నత్యద్భుతముగా వ్రాయంబడినను గాని, యది కల్పితగ్రంథమగుటచేత విశ్వసింపఁదగినది కాదు. గణపతిదేవ చక్రవర్తి శాసనములలో సూర్యవంశపురాజులను బేర్కొనుచు వారల వంశమునందు కరికాలచోడుఁడును, దానివంశమునందుఁ గాకతీయులును జనించిరని స్పష్టముగాఁ దెలుపఁబడియుండఁగా క్రమనాయకుల చరిత్రములోని గాథ లెట్లు విశ్వసింపఁదగినవో యెంతమాత్రమును బోధపడకున్నది.

దుర్జయ కులము.

ఆగణపతిదేవరాయని శాసనములయందే సూర్యవంశమున మనువు, అతని వంశమున నిక్ష్వాకువు, అతని వంశమున రఘువు, అతని వంశమున దాశరథి, అతని వంశమునఁ గరికాలచోడుఁడు అతని వంశమున దుర్జయుఁడు, అతని వంశమునఁ ద్రిభువనమల్ల కాకతిబేతరాజును జనించెననియును; దుర్జయుఁడు కాకతీయులకుఁ బూర్వుఁడనియును జెప్పఁబడియున్నది. కొంతకాలము చాళుక్యచోడచక్రవర్తులకును, మఱికొంతకాలము కాకతీయాంధ్రచక్రవర్తులకును సామంతమండలేశ్వరులుగ నుండి గుంటూరు, కృష్ణా మండలములలోఁ బరిపాలనము సేయుచుండిన రాజులు కొందఱు తాము దుర్జయవంశస్థుల మని వ్యవహరించిరి. బుద్ధవర్మ సంతతివాఁడై శూద్రులయిన వెలనాటి చోడులతోఁ సంబంధ బాంధవ్యములు గలిగియుండిన కొండపడమటి బుద్ధరాజు దుర్జయ కులస్థుఁడు. కులోత్తుంగచోడచక్రవర్తికిని విక్రమచోడునకును సామంతుఁడు [illegible]ండిన మహామండలేశ్వర నంబయరాజు దుర్జయకులస్థుఁడు. కాకతీయ చక్రవర్తులకు సామంతులుగనుండి గుడిమెట్ట రాజధానిగా నతవాటిసీమను బరిపాలించిన చాగిపోతరాజు దుర్జయకులస్థుఁడు. మఱియు దుర్జయకులస్థుల మని చెప్పుకొన్నవా రనేకులు గలరు.

కాకతీయులు మొదట రెడ్లు, తరువాత కమ్మవారు.

కాకతీయులు కేవలము బాహుబలమువలన రాజ్యాధిపత్యము వహించి జనరంజకముగాఁ బరిపాలనముచేసి మహారాజు లనిపించుకొన్న రెడ్డి కమ్మ

[illegible]గలోని నామమాత్రక్షత్రియులుగాని క్షత్రియజాత్యుచిత యజ్ఞోపవీతాదిచిహ్నములు ధరియించి వేదాధ్యయన వైదికకర్మాచరణాదు లొనరించు నార్యక్షత్రియులుగాఁ గనుపట్టరు. దుర్జయకులస్థులు తాము విష్ణుపాదోద్భవులమనియుఁ జతుర్థాన్వయులమనియుఁ దమ తమ శాసనములయందు స్పష్టముగఁ జెప్పుకొనియున్నారు. కాకతీయులును దుర్జయవంశజు లని గణపతిదేవచక్రవర్తికాలము నాఁటి శాసనములందు జెప్పఁబడియుండుటంజేసి వీరును విష్ణుపాదోద్భవులనియుఁ జతుర్థాన్వయులనియు నూహింపవలసివచ్చుచున్నది. ఈయూహను బలపఱచునట్టి సహేతుకములైన ప్రబలప్రమాణము లనేకములు చూపట్టుచున్నవి. విష్ణుపాదసంభవుల మనియును జతుర్థాన్వయులమనియును జెప్పుకొన్న కమ్మనాటిరాజుల (కమ్మవారి)తో సంబంధబాంధవ్యములు నెఱపియుండిరి. కాకతీయమహాదేవరాజు పుత్రికయు, గణపతిదేవచక్రవర్తి తోఁబుట్టువు నగు మేళాంబిక యను మైలమ్మను, చతుర్థవంశసంజాతుఁడును నతవాటివిషయాధీశ్వరుండును నగు బుద్ధరాజు కొడుకు శ్రీమన్మహామండలేశ్వర రుద్రదేవరాజున కిచ్చి వివాహము చేయఁబడియెను.[1] ఈమహామండలేశ్వర రుద్రదేవరాజు కొమార్తె యగు బయ్యమాంబ యను బయ్యలమహాదేవిని చతుర్థవంశసంభూతుఁడును, ధనంజయగోత్రుఁడును, శ్రీధాన్యవతీపురాధీశ్వరుండును, రెండవ భీమరాజుపుత్రుఁడును మహామండలేశ్వరుఁడు నగు కేతరాజున కిచ్చి వివాహము చేయఁబడియెను.[2] మఱియు నీకేతరాజుతల్లి యైన సబ్బమదేవి చతుర్థాన్వయసంభవుఁ డయిన వెలనాటి వీరరాజేంద్రచోడరాజపుత్రికయు, మూఁడవగొంకరాజునకుఁ దోఁబుట్టువునై యుండెను.[3] ఈసబ్బమదేవితండ్రి యైన వెలనాటివీరరాజేంద్రచోడమహారాజు బుద్ధవర్మవంశోద్ధారకుఁడును, దుర్జయకులాభరణుఁడును, చతుర్థాన్వయసంజాతుఁడు నగు కొండ

1. The Annual Report on Epigraphy for 1905, No. 204; Epigraphica Indica Vol. VI. p. 159, line 8.
2. Ibid, Inscription of Bayyamamba.
3. Ibid, Vol. III, page 148.

పడమటిబుద్ధరాజు తోఁబుట్టువయిన యక్కాంబికను వివాహ మయ్యెను. ఈ యక్కాంబిక పుత్త్రుఁ డగు వెలనాటిమల్లోత్తుంగచోడగాంగేయగొంకరాజు పైఁజెప్పిన బుద్ధరాజువంశమున జనించిన జయాంబికను వివాహ మయ్యెను.[1] శ్రీమన్మహామండలేశ్వరకాకతీయగణపతిదేవచక్రవర్తి తన ద్వితీయపుత్త్రిక యైన గణపాంబను శ్రీధాన్యవతీపురాధీశ్వరుండును ధనంజయగోత్రుఁడును చతుర్థకులజుండును మహామండలేశ్వర కోటకేతరాజు మనుమఁడును మహామండలేశ్వర రుద్రరాజుకుమారుండును నైన మహామండలేశ్వర కోటబేతరాజున కిచ్చి మహావైభవముతో వివాహమును జేసెను.[2] కాకతీయు లిట్లు చతుర్థాన్వయసంభవు లయిన కమ్మవారితో సంబంధబాంధవ్యములు నెఱపి యుండుటచేత వీరును చతుర్థాన్వయసంభవులే యని నిశ్చయింపక తప్పదు. మఱియును ప్రతాపరుద్రచక్రవర్తికొడుకులలో నొక్కఁడు క్రీ. శ. ౧౩౧౩వ సంవత్సరమునఁ గడపమండలములోని చెన్నూరిగ్రామమునను దక్షిణపాదు నాగనాథుని దేవాలయముకడ వ్రాయించిన యొకదానశాసనములో నతని నామమునకు "రెడ్డి"యనుపదము చేర్పఁబడియుండుటచేత వీరు మొట్టమొదట రెడ్డితెగలోనివారుగానే యుండి కమ్మవారితో సంబంధములుచేసి కమ్మవారయి రని యూహింపవలసివచ్చుచున్నది. ఇప్పటివలెఁ గాక యాకాలమునందు శూద్రులలో భేదము లంతగాఁ బాటింపఁబడకుండెను గాని కాకతీయులపరిపాలనమునందును తరువాతను నీభేదము లభివృద్ధినొందుటయే గాక కాకతీయసామ్రాజ్య మస్తమించుటకుఁ గారణములుగూడ నయ్యెను. ఈ విషయము లన్నియు సవిస్తరముగ రాఁబోవు ప్రకరణములలో వివరింపఁబడును.

త్రిభువనమల్ల కాకతి బేతరాజు.

కాకతీయులు సూర్యవంశపురాజు లని యొక్క గణపతిదేవచక్రవర్తి శాసనములయందుమాత్రము పేర్కొనఁబడియెను గాని యంతకుఁ బూర్వము

1. No. 26 T.Sandavolu Inscription of Buddharaja.
2. Epigraphia Indica Vol. III, page 94.

నేశాసనమునందును గాకతీయులు తాము సూర్యవంశజులమని కాని చంద్రవంశజులమని కాని వ్రాసికొని యుండలేదు. ఇంతియ గాక గణపతిదేవునికిఁ బూర్వపు శాసనములలో దుర్జయుఁడు వారి పూర్వులలోనివాఁడుగాఁ జెప్పఁబడియుండ లేదు. మఱియును గణపతిదేవరాయనికాలమునాఁటి పాఖాలశాసనములోఁ గలికాలచోడుఁ డీకాకతీయులకుఁ బూర్వుఁ డని చెప్పఁబడినదిగాని యీశాసనము కేవలము గణపతిదేవునిశాసనముగాక యతనిసేనాధిపతి యగు బయ్యననాయకునిపుత్త్రుఁ డగు జగదాళిముమ్మడినాయకునిశాసన మగుటవలన నందలి సంబంధము లంతగాఁ బాటింపఁబడఁదగినవి కావు. కాకతీయగణపతిరాజు చక్రవర్తిపదమును వహించినతరువాత నాతని ఘనత నిరూపించుటకై యతఁడు సూర్యవంశజుం డని కల్పింపఁబడి శ్లాఘింపఁబడినది. విద్యానాథమహాకవి తన ప్రతాపరుద్రీయమునఁ గాకతీయులను సూర్యవంశపురాజులనికాని చంద్రవంశపురాజులనికాని వర్ణింపక రెంటి నతిశయించినవారని వర్ణించుటయు, తనది సూర్యవంశ మని చెప్పుకొనిన గణపతిచక్రవర్తి చతుర్థాన్వయులతోడ సంబంధము చేసియుండుటయు, నైవర్ణనలన్నియు నతిశయోక్తులని వేనోళ్లఁ జాటుచున్నవి. కాకతీయులచరిత్రమునందు మొట్టమొదటఁ బేర్కొనఁబడఁదగినవాఁడు త్రిభువనమల్లకాకతిబేతరాజు. గుంటూరుమండలములోని చేబ్రోలుశాసనమునం దొకదానిలో బేతరాజు దుర్జయుని తరువాతఁ బేర్కొనఁబడియెను. నైజామురాష్ట్రములోని పాఖాలశాసనములో దుర్జయుఁడు ప్రోలరాజుతండ్రి యని వ్రాయఁబడినది. కాకతీయవంశవృక్షమందలి చిక్కును విడదీయుట కొకసాధనము గలదు. కాకతీయగణపతిదేవునియొక్క గుంటూరుమండలములోని మోటుపల్లి శాసనములోఁ గాకతీయవంశవృక్షము నీయఁబడినది. అందు సూర్యుఁడు మొదలుకొని గణపతిదేవునివఱకును గల రాజులు పేర్కొనఁబడి దుర్జయునకును త్రిభువనమల్లబేతరాజునకును నడుమ మొదటిప్రోలరాజని యొక క్రొత్తనామముగూడ నీయఁబడినది. పాఖాలశాసనమునందీప్రోలరాజు దుర్జయునికొడుకని చెప్పి యతనివంశమున రుద్రదేవుఁడు జనించె నని వక్కాణించుచున్నదిగాని రుద్రదేవుఁడు ప్రోలరాజుకొడు కని నుడివి

యుండలేదు. చేబ్రోలుశాసనములో దుర్జయుని తరువాత బేతరాజు పేర్కొనఁబడి యుండెను. వీనినన్నిటిని పరిశీలించిచూడఁగా నీక్రిందివిధమునఁ గాకతీయవంశావళిని జేర్కొనవచ్చును. దుర్జయుని తరువాత కాకతీయవంశమునందు మొదటిప్రోలరాజు జనించెను. ఇతఁడు కేసరి యనునొకగొప్ప చెఱువును త్రవ్వించెను. ఇతనికిఁ ద్రిభువనమల్ల బేతరాజు జనించెను. త్రిభువనమల్లుఁడనునది బేతరాజునకు బిరుదనామము. ఈబేతరాజు మొదట నాంధ్రదేశమునందొక చిన్న భాగమున కధిపతియై యుండి చాళుక్యాభరణుండును, సత్యాశ్రయకులతిలకుండును, సమస్త భువనాశ్రయ శ్రీపృథ్వీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వరపరమభట్టారక బిరుదాంకితుండును నైన యాఱవవిక్రమాదిత్యచక్రవర్తికి సామంతుఁడై త్రిభువనమల్లదేవుఁడను విక్రమాదిత్యుని బిరుదనామము నే తానును వహించెను. ఈబేతరాజునకు వ్యోజదండాధినాథుఁడు మంత్రిగ నుండెను. ఈదండనాథుని కీమంత్రిపదవి వంశక్రమానుగతముగా లభించినది. ఈమహాప్రధాని తన ప్రభు వయిన మాండలికకాకతిబేతరాజును గొనిపోయి శ్రీత్రిభువనమల్లదేవవిక్రమాదిత్యచక్రవర్తికి మ్రొక్కించి యాచక్రవర్తికి సామంతమండలేశ్వరుఁడుగ నుండి సబ్బిసాయిరమండలమును బరిపాలించునట్లుగ నియోగింపఁజేసెను.[1] అనుమకొండ రాజధానిగఁజేసికొని మహామండలేశ్వరకాకతిబేతరాజు వ్యోజదండాధినాథుఁడు మహాప్రధానిగ సబ్బిసాయిరమండలమును బరిపాలనముచేసి ప్రసిద్ధిగాంచెను.

పశ్చిమచాళుక్యచక్రవర్తి యైనయాఱవవిక్రమాదిత్యుఁడు క్రీస్తుశకము ౧౦౭౬ మొదలుకొని ౧౧౨౬ వఱకు రాజ్యభారమును నిర్వహించినవాఁడు గావున నతని సామంతమాండలికుఁ డయిన బేతరాజు పదునొకండవశతాబ్దాంతమునందు నాంధ్రదేశములోని సబ్బిసాయిరమండలమును బరిపాలించెను. ఇతఁడు జైనమతాభిమానియై జైనులను బోషించెను. మఱియు నితఁడు కాకతి

1. క్రీ. శ. ౯౭౧ వ సంవత్సరమునఁ బశ్చిమగాంగుఁ డయిన పాంచాలదేవునిచేఁ బాలింపఁబడిన సెబ్బిమండల మిదిగాదని తోఁచుచున్నది. అది ధార్వాడమండలములోని హుబ్లీతాలూకాలోని చబ్బి యనుగ్రామమునుబట్టి యేర్పడి యుండవచ్చును.

యను జైనదేవతను బూజించుటచే నీతని సంతతివారికెల్లరకును కాకతీయులను పేరు గలిగినది. ఇంతకంటె నీతనిగూర్చి చెప్పఁగలిగినది మఱియేమియును గానరాదు.

మహామండలేశ్వర కాకతి ప్రోలరాజు

మహామండలేశ్వర కాకతి బేతరాజునకుఁ బిమ్మట రాజ్యభారమును వహించినవాఁ డతనికుమారుఁ డైనప్రోలరాజు. ఇతఁడు రాజ్యతంత్రజ్ఞుఁడయిన మహాయోధుఁడు. ఈమహాయోధుఁడు తండ్రిమరణానంతరము రాజ్యభారమును బూని పశ్చిమచాళుక్యచక్రవర్తి యగు నాఱవవిక్రమాదిత్యునికి సామంతమాండలికుఁడై యాతనిమహాప్రధానులలో నొకఁడుగానుండి యాచక్రవర్తి లోకాంతరగతుఁ డైన పిమ్మట స్వతంత్రుఁడై త్రైలింగ్యసామ్రాజ్యము నిర్మించుటకై పునాదు లేర్పఱుపఁ బ్రయత్నించుచుండెను. ఇతని శాసనమొకటి యనుమకొండలోని పద్మాక్షీదేవాలయమునఁ గానంబడుచున్నది. ఈశాసనమునుబట్టి శ్రీమన్మహామండలేశ్వర కాకతి ప్రోలరాజుచరిత్రము కొంతవఱకుఁ దెలియుచున్నది. ఈకాకతిప్రోలరాజుశాసనమునందు మొదట త్రిమూర్తు లయిన బ్రహ్మవిష్ణుమహేశ్వరులలో నెవ్వరిని స్తుతింపక శ్రీమజ్జినేంద్రుని మాత్రమే స్తుతించియుండుటచేత నితఁడు జైనమతావలంబి యని స్పష్టముగఁ బోధపడుచున్నది. ఇతఁడుమాత్రమే గాక యీప్రోలరాజు మంత్రి యైన బేతనప్రెగ్గడయు నతని భార్యయు జైనమతావలంబకులనికూడ తేటపడుచున్నది. ఈబేతనప్రెగ్గడ కాకతిబేతరాజుమంత్రి యైన వ్యోజదండాధినాథునకు యాకమాంబికయందు జనించినవాఁడు.

పద్మాక్షీదేవి యాలయము

నైజాము రాష్ట్రములోని హనుమకొండకు దక్షిణభాగమునం దున్న యొకచిన్నకొండపైని పద్మాక్షీదేవియాలయము నిర్మింపఁబడినది. ఈకొండప్రక్కను ఈదేవతాలయమునకెదుటను జైనవిగ్రహములు గలవు. ఈయాలయ

1· Epigraphia Indica, Vol ix. Page 256. No. 35

స్తంభముమీఁదనే పైనిజెప్పఁబడిన ప్రోలరాజుశాసనము గలదు. వీనినన్నిటిని బట్టిచూడ నిది మొదట జైనులచేత నే ప్రతిష్ఠింపఁబడినదిగాఁ దోఁచుచున్నది. ఈయాలయములోఁ బ్రతిష్ఠింపఁబ్బడిన పద్మాక్షీదేవి జైనపురాణగాథలలోఁ వక్కాణింపఁబడిన యిరువదినల్వురు శాసనమహాదేవులలో నొక్కతెయై యుండవలయును. ఇరువదిరెండవతీర్థంకరుని శాసనదేవియైన యంబిక దుర్గ యొక్క యొకప్రతిరూపమని భావింపఁబడుచున్నది. అట్లే పద్మాక్షి పార్శ్వ నాథునియొక్క శాసనదేవిగ నున్నది[1]. కాఁబట్టి ప్రోలరాజుమంత్రి యైన బేతనప్రెగ్గడభార్య యగు మైలమ్మ యాకొఁడపైని యాలయమునఁ గన్నడములో "కడలాలయ" మనియెడి యంబికనో పద్మావతినో ప్రతిష్ఠించియుండ వచ్చునని యూహింపవచ్చును. తనకు జైనమతమునం దుండెడి ప్రేమచేతను భక్తిచేతను బుణ్యముకొఱకు కొండపైని కడలాలయబస్తిని(వసతిని) బేతనప్రెగ్గడభార్య యగు మైలమ్మనిర్మించె నని పైశాసనమునందే చెప్పఁబడినది. మైలమ్మ తండ్రి యగు బేతనప్రెగ్గడ తనస్వగ్రామమునందుఁ బదిదేవాలయములను నిర్మించె ననికూడ వ్రాయఁబడినది. ఈమైలమ్మచే నిర్మింపఁబడిన కడలాలయమునకు చాళుక్యవిక్రమసంవత్సరము ౪౨ హేవిలంబిసంవత్సర పుష్యబహుళ ౩౦ సోమవారమున అనఁగా క్రీ. శ. ౧౧౧౭వ సంవత్సరము డిసెంబరు ౨౪గవ తేదిని శ్రీమన్మహామండలేశ్వర కాకతిప్రోలరాజు మైలమ్మపేరిట నామెభర్తయైన బేతనప్రెగ్గడ త్రవ్వించిన చెఱువుక్రిందను బాడువపొలము రెండుమత్తరులను ఆచెఱువునకుఁ బడమటిప్రక్కను నల్లరేవడిపొలము నాలుగుమత్తరులను బీటిపొల మాఱుమత్తరులను ధారాపూర్వకముగా దానముచేసి పైశాసనమును వ్రాయించెను. మఱియు నీశాసనమునందే శ్రీమన్మహామండలేశ్వర మేళరాజు కూచికెఱెచెఱువుకట్టక్రింద నొక మత్తరు బాడువపొలమును దానికి సామీప్యమునఁ బదిమత్తరుల సామాన్యభూమిని దానముచేసినటుల వ్రాయఁబడినది. ఈమండలేశ్వరుఁ డయిన మేళరాజు మాధవవర్మవంశమున

1. Dr. Burgess Archeological Survey of Western India Vol. V. Page 45 F and Page 46, note 2.

జనించినవాఁడని వ్రాయఁబడినది. మాధవవర్మగాథ పండ్రెండవశతాబ్దప్రారంభమునకే ప్రచారమునం దుండెనని యీశాసనముంబట్టి దెలియుచున్నది. ఇట్లు భూదానములనుబొందిన యీజైనాలయమును అనుమకొండబ్రాహ్మణులు స్వాధీనముచేసికొని దుర్గయొక్క నామాంతర మని నమ్మి పద్మాక్షీదేవి యనుపేరితో నర్చనాదికమును జరుపుచున్నారు. ఈయాలయము జైనులనుండి బ్రాహ్మణులస్వాధీన మెప్పుడయ్యెనో దెలియరాదు. ఇయ్యది మొదటి ప్రతాపరుద్రునికాలముననో గణపతిదేవచక్రవర్తికాలముననో బ్రాహ్మణుల యధీనమై యుండును. ఈశాసనమునుబట్టి యీపద్మాక్షియాలయము మాధవవర్మకాలమునుండియు శైవబ్రాహ్మణుల యధీనమునం దుండెననిగాని, ఈపద్మాక్షీదేవి వరప్రసాదముననే సోమదేవరాజు మాధవవర్మ మొదలుగాఁగల చంద్రవంశపు రాజులు పరరాజులను జయించి రాజ్యమేలినారనిగాని విశ్వసింపరాదు.

ప్రోలరాజు తైలపదేవుని బంధించి విడుచుట.

కాకతిప్రోలరాజు పుత్త్రుఁడైన మొదటి ప్రతాపరుద్రుని యనుమకొండశాసనములో చాళుక్యచూడామణి యైన తైలపదేవునితో యుద్ధముచేసి క్షణములో బంధించి భక్తునియందుండెడి యనురాగముచేత విడిచిపుచ్చె నని యీక్రిందిశ్లోకములోఁ జెప్పఁబడినది.

"హస్త్యారోహణకర్మకర్మఠగతిం చాళుక్యచూడామణిం
శశ్వద్యుద్ధనిబద్ధగర్వారమతిం యుద్ధే బబంధక్షణాత్
శ్రీమత్తైలపదేవ మంబుదనిభ స్తంబేరమస్థం క్షణాత్
ప్రఖ్యాతోరిపుకంఠఖండనవిధా భక్తానురాగా జ్జహౌ."

ఈశ్లోకమునం జెప్పఁబడిన తైలపదేవుఁడు రాజ్యాధిపత్యమును వహించి కుంతలదేశమును బరిపాలించిన తైలపదేవచక్రవర్తిగాక యాపశ్చిమచాళుక్య కుటుంబమున జనించిన మఱియొక తైలపదేవుఁడై యుండవలయును. ఎందుచేతననఁ దైలపదేవచక్రవర్తి క్రీ. శ. ౧౧౬౨ వఱకుఁ బరిపాలనము చేసినట్లుగా శాసనాదిదృష్టాంతములు గనంబడుచున్నవి. క్రీ. శ. ౧౧౬౩వ సంవత్సరములో

వ్రాయఁబడిన యీ యనుమకొండశాసనములోనే రుద్రదేవునియెడం గల భీతిచేత మరణము నొందె నని చెప్పఁబడియెను. కాఁబట్టి ప్రోలరాజుచే జయింపఁబడినట్టియుఁ రుద్రదేవునిచేఁ జంపఁబడినట్టియుఁ దైలపదేవుఁడు పశ్చిమచాళుక్యచక్రవర్తి యైన మూఁడవతైలపదేవుఁడు కాఁడనుట స్పష్టము. ఈ తైలపదేవుఁడు చాళుక్యచక్రవర్తులకు సేనాధిపతియై బనవాసిమండలమున కధిపతి యైన తైలపదేవుఁడై యుండు నని కొందఱు తలంచుచున్నారు గాని పై శ్లోకమునందు తైలపదేవుఁడు చాళుక్యచూడామణి యని పేర్కొనంబడి యుండుటచేతను సేనాపతియైన తైలపదేవుఁడు కదంబరాయఁ డగుటచేతను వారివాద మంతగా విశ్వసింపఁ దగినదిగాఁ గనుపట్టదు. ఇతఁడు తప్పక చాళుక్యచక్రవర్తులకు సమీపబంధువై సామంతమాండలికుఁ డైనవాఁడుగ నుండవలయును. ఇత్యాది భావపరిశోధనమునం దేటపడవచ్చును.[1]

ప్రోలరాజు గోవిందరాజును జయించుట.

ప్రోలరాజు పశ్చిమచాళుక్యచక్రవర్తుల సేనాధిపతి యైన గోవిందరాజును జయించెనని యనుమకొండలోని రుద్రదేవునిశాసనములోనే యీక్రింది శ్లోకమునఁ జెప్పఁబడినది.

"యో కంఠోరిపతేరకుంఠపరశు శ్లక్ష్ణాగ్రధారోల్లస
ద్ధారాపాత నిపాతనైకచతురం గోవిందరాజాహ్వయం
బద్ధ్వోన్ముచ్య తదోదయక్షితిభృతే రాజ్యం దదౌ లీలయా
లుంఠాకో విషయస్య తస్య సమరే సద్వీరదీక్షాగురుః."

ఇందుఁ బేర్కొనఁబడిన గోవిందరాజు గణపతిదేవచక్రవర్తి గణపేశ్వరశాసనమునందు గోవిందదండేశుఁ డని వక్కాణింపఁబడియెను. ఇతఁడు పశ్చిమచాళుక్యచక్రవర్తి యగు యాఱవవిక్రమాదిత్యుని సేనాధిపతి యైన

1. ఈ తైలపదేవుఁడు త్రిభువనమల్లునికుమారుఁడనియు, అతనిశాసనములం దొకదానిలో ప్రోలరాజును జయించెనని చెప్పఁబడి యున్నదనియు, అతఁడు రాజ్యాధిపత్యమును వహింప లేదనియుఁ గొందఱు చెప్పుచున్నారు.

యనంతపాలుని సోదరపుత్త్రుఁ డని అబ్బలూరుశాసనములవలనఁ దెలియుచున్నది. ఈగోవిందదండనాయకుఁడు క్రీ. శ. ౧౧౨౬-౨౭ సంవత్సరప్రాంతమున నాంధ్రదేశములోని కొండపల్లిసీమకు బరిపాలకుఁడుగ నున్నటులఁ గందనోలి (కర్నూలు) మండలములోని త్రిపురాంతకశాసనములలో నొకదాని వలనఁ జక్కఁగాఁ దేటపడుచున్నది. అందితఁడు వేంగీపురమును దగ్ధముగావించి గోంకరాజును జయించినటులఁ జెప్పఁబడినది. ఈగొంకరాజు వేంగీదేశమునకు రాజప్రతినిధియై ధనదుపురము (గుంటూరుమండలములోని చందవోలు) రాజధానిగఁ బరిపాలనముచేసిన వెలనాటికులోత్తుంగ రాజేంద్రచోడుని కుఁ బుత్త్రుఁడు. వెలనాడునకు రాజధానిగనున్న ధనదుపురమును నాకాలమున వేంగీపుర మనిగూడఁ జెప్పుచుండిరి కాఁబోలు. వెలనాటిరాజులు వేంగీరాజప్రతినిధులై పరిపాలనముఁ జేసినవా రగుటవలన వారు నివసించు ముఖ్యపట్టణ మయిన ధనదుపురము వేంగీపుర మని పరరాజులచేఁ బేర్కొనంబడుట యొకవిశేషవిషయము గాదు. ఈగోవిందరాజును జయించి యితనిరాజ్యమును ఉదయరాజున కిప్పించె నని చెప్పఁబడి యున్నది. ఇందుఁ బేర్కొనఁబడిన యుదయరా జెవ్వఁడైనదియు నిర్ధారించుట కష్టసాధ్యముగ నుండును. కందూరోదయచోడుఁడే యుదయరాజని కొందఱును, వెలనాటిగొంకరాజే చోడోదయుండని మఱికొందఱును తలంచుచున్నారు. పైనిజెప్పఁబడిన యనుమకొండ రుద్రదేవునిశాసనములోని శ్లోకమునకు మఱియొకపాఠము గలదని గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారిగ్రంథమున నాశ్లోక మీక్రిందివిధమునఁ బేర్కొనఁబడినది.[1]

"యోలుంఠాకపతేరకుంఠపరశు స్తీక్ష్ణాగ్రధారోల్లస
ద్ధారాపాతనిపాతనైకచతురం గోవిందరాజాన్వయం
బద్ధ్వోన్ముచ్య త మైడయక్షితిపతే రాజ్యందదౌ లీలయా
లుంఠాకో విషయస్య తస్య సమరే తద్వీరదీక్షాగురుః."

1. Notes by G. Sreeramamurty on the Ganapaties of Orangal, page, 31.

అనఁగా * గోవిందరాజ వంశమునందు జనించినట్టియు, లుంఠాకవిషయాధీశ్వరుఁ డైనట్టియు, పరశువుతో యుద్ధముఁ జేయు నైపుణ్యము గలట్టియు, ఈడప్ప యనువాఁ డొకఁడు బంధింపఁబడి ప్రోలరాజు నెదుటకుఁ దేఁబడె ననియు, వీరదీక్షాగురుం డైన ప్రోలరాజు పశ్చాత్తప్తుఁడై యున్న యాతని బంధవిముక్తుని గావించి యతని రాజ్యము మరల నాతనికి నొప్పగించె ననియు, తాత్పర్యము.

ప్రోలరాజు గుండరాజును జంపుట

కాకతిప్రోలరాజు మంత్రకూటపట్టణాధిపతి యైనగుండరాజుపై దండెత్తిపోయి యతనితో యుద్ధముఁజేసి జయించి యంతటితోఁ బోవక యాగ్రహముహోదగ్రుఁడై యతనిం బట్టికొని శిరమును గొఱిగింపించి వక్షఃస్థలంబున వరాహముద్రనుబొడిచి చంపె నని రుద్రదేవుని యనుమకొండశాసనమునందే యీ క్రిందిశ్లోకమునఁ జెప్పఁబడినది.

"క్రుద్ధేనోద్ధుర మంత్రకూటనగరీనాథోదయో నిస్త్రపో
గుండః ఖండిత ఏవ ముండితశిరాః క్రోడాంకవక్షఃస్థలః
ఏషోడింభకవత్పలాయనపరో జ్ఞాతో గతః స్వాం పురీం
ఆహూతోపి నరేశ్వరస్య పురతః ప్రోలేన యుద్ధాయయత్."

మంత్రకూట మనునది నైజాము రాష్ట్రములో గోదావరీతీరమున నున్న మంథని యను గ్రామ మని కొందఱును, కృష్ణామండలములో నూజివీడుతాలూకా

* ఇందుఁ జెప్పఁబడిన గోవిందరాజు కుంతలదేశమును బరిపాలించిన రాష్ట్రకూటరాజులలోనివాఁ డని శ్రీరామమూర్తిపంతులుగారు వ్రాసియున్నారుగాని యాకాలమునాఁటికి రాష్ట్రకూట సామ్రాజ్య మంతరించి యుండుటచేత నది యంతగా విశ్వాసపాత్రము గాదు. పై శ్లోకముయొక్క పాఠాంతరముగూడ సరియైనదిగాఁ గనుపట్టదు. నేను వ్రాయించి తెప్పించిన యనుమకొండ శాసనముయొక్క ప్రతికూడ డాక్టరు ఫ్లీటుదొరగారు ప్రకటించిన పాఠముతో సరిపోవుచున్నదిగాని పంతులవారిపాఠాంతరముతో సరిపోవుచుండ లేదు.

లోని మంతెనగ్రామ మని మఱికొందఱును తలంచుచున్నారు. కొండపల్లిసీమకుఁ బరిపాలకుఁ డయిన గోవిందరాజు మొదలగువారితో యుద్ధముఁ జేసి జయించినవాఁ డగుటచేతఁ బ్రోలరాజు కృష్ణామండలములోని మాండలిక ప్రభువులను జయించుటకై ప్రయత్నించియుండును గావున, మంత్రకూట మనునది మంతెనగ్రామమే యైయుండు నని నిర్ధారింపవచ్చును.

ప్రోలరాజు జగద్దేవునిఁ బాఱఁద్రోలుట.

అనుమకొండశాసనమునందే జగద్దేవుఁ డను రాజు ప్రోలరాజుపై దండెత్తివచ్చి యనుమకొండను ముట్టడింపఁగా నాతనిజయించి తఱిమె నని యీ క్రిందిశ్లోకమునఁ జెప్పఁబడినది.

"అన్యచ్చానుమకొండనామనగరీం సంవేష్ట్యయోయం స్థితో
నానామండలికాన్వితో భువి జగద్దేవస్యదేవప్రభుః
స్తబ్ధస్తంభిత ఏవ కార్యకరణే శక్తః క్షణా న్నిర్గతః
శ్రీమత్ప్రోలనృపస్యతిస్య జయినః కింబ్రూమహే గౌరవమ్."

ఈ పైశ్లోకమునం బేర్కొనంబడిన జగద్దేవుఁడు పట్టిపొంబుచ్చపురాధీశులయిన సంతారరాజులలో నొకఁ డగు మహామండలేశ్వర త్రిభువనమల్ల జగద్దేవుఁడేకాని యన్యుఁడు గాఁడు. పట్టిపొంబుచ్చపురము నేఁడు మైసూరు రాష్ట్రములో నగరమండలములోని హుంచ యనుపేరం బరఁగుచున్నది. ఈ జగద్దేవునితల్లి బిజ్జలదేవి; బిజ్జలదేవి చెల్లెలగు చట్టలదేవి గోవాకదంబులలో మొదటి విజయాదిత్యున కిచ్చి వివాహము చేయఁబడియెను. (శా. శ. ౧౦౨౦) ఇతఁడు వయస్సుమీఱక యున్నకాలమున బల్లాలరాజులచే నదిమిపెట్టఁబడి యుండెను. మొదటిబల్లాలరాజు జగద్దేవునిరాష్ట్రమును బాడుచేసె నని గడగుశాసనమువలనఁ దెలియుచున్నది.[1] శా. శ. ౧౦౩౬ దవ సంవత్సరములో నేర్పడిన బేలూరుశాసనములలో నొకదానిలో జగద్దేవునిబలమును హరించుటయందు భైరవునివంటివాఁ డని హొయిసలబల్లాల

1. Indian Antiquary, Vol. II. pape 301.

రాజయిన విష్ణువర్ధనుఁ డభినందింపఁ బడియెను. అయినను జగద్దేవుఁడు శా. శ. ౧౦౭౧ (క్రీ. శ. ౧౧౪౯) వ సంవత్సరమున "సేతు" అనెడి ప్రదేశమునఁ బరిపాలనము సేయుచు బల్లిగావె గ్రామమునను విచ్చేసి కొండనాటిలోని కం ,దూరు గ్రామమును దానముచేసియున్నాఁడు. పశ్చిమచాళుక్యచక్రవర్తి యైన రెండవజగదేకమల్లుని పరిపాలనసంవత్సరములలో ౧౩ వదియగు శుక్లసంవత్సరమునఁ బైశాసనము పుట్టియుండుటచేతను, చాళుక్యచక్రవర్తులచే వహింపబడుచుండిన త్రిభువనమల్ల యనుబిరుదనామమును వహించియుండుటచేతను, ఇతఁడు మొదట త్రిభువనమల్లవిక్రమాదిత్యచక్రవర్తికిని, అటుపిమ్మట రెండవ జగదేకమల్లునకును, సామంతుఁడుగ నుండె నని వేద్యమగుచున్నది. అందుచేతనే యితఁడు తైలపదేవుఁడు కాకతిప్రోలరాజుచేఁ బట్టుబడి పరిభవింపఁబడి విడిచిపెట్టఁబడిన తరువాత ప్రభుపక్షమునుబూని ప్రోలరాజును శిక్షించుటకై అనుమకొండపై దాడి వెడలివచ్చి యుద్ధముచేసి యోడిపోఁగాఁ బ్రోలరాజుచేఁ దఱుమఁగొట్టఁబడియుండు నని సులభముగా బోధపడుచున్నది.

కాకతిప్రోలరాజు మతము.

శ్రీరుద్రదేవుని యనుమకొండశాసనమునందు ప్రోలరాజు "శివపాదపద్మయుగళ ధ్యానామృతానందుఁ డ"ని యీక్రిందిశ్లోకమునఁ జెప్పబడినది.

"తత్పుత్త్రః శివపాదపద్మయుగళధ్యానామృతానంద భూ
ర్లుంఠాకోరిపుసుందరీజనమహా సౌభాగ్యసంపచ్ఛ్రియః
ప్రోలీరాజ ఇతి ప్రసిద్ధిమగమ ద్వైరీంద్రదర్పాపహో
నిశ్శంకప్రథనప్రబంధనమహోహంకారలంకేశ్వరః."

ఈ పైశ్లోకమున ప్రోలరాజు శివభక్తుఁ డని తెలుపఁబడియున్నను, పద్మాక్షీదేవాలయమున ప్రోలరాజుచే నెలకొలుపఁబడిన శాసనములో మొట్టమొదట నీక్రిందిశ్లోకముచే జినేంద్రుఁడు గీర్తింపఁబడియెను.

శ్రీమజ్జినేంద్రపదపద్మమశేష భవ్యం
సత్వత్రిలోకి నృపతీంద్రమునీంద్రవంద్యం

నిశ్శేషదోషపరిఖండనచండకాండ్రా
రత్నత్రయాప్రభవమద్యగుణైకతానం"

ఈ పైశ్లోకమున నీతఁడు జినేంద్రునిఁ బ్రస్తుతించియుండుటచేత నీతఁడు జైనమతావలంబకుఁ డని స్పష్టముగా బోధపడుచున్నది. ప్రోలరాజుకొడుకయిన రుద్రదేవుఁడు వీరశైవమతావలంబకుఁ డయినందునఁ దనతండ్రినిగూడ శివపాదపద్మయుగళధ్యానామృతానందుఁ డని వక్కాణించియుండునుగాని వేఱొండు గాదు. ఒకవేళ ప్రోలరాజు వార్ధకదశయందు శైవుఁడైన నైయుండవచ్చును.

ప్రోలరాజు సంతానము.

ప్రోలరాజునకు ముప్పమ యనుభార్య గలదు. ఆమె యనుమకొండశాసనమునం దీక్రిందివిధమున నభివర్ణింపఁబడినది.

"దేవీముప్పమనామధేయసహితా యస్యా గుణాస్తారకాః
కీర్తిశ్శారదచంద్రికేవ విలస త్కాంతేస్తు నైవోపమా
కౌసల్యేవ చ జానకీవ చ సతీ కుంతీవ పద్మా చ సా
పౌలోమీవ చ చండికేవ చ తథా తస్యాభవద్భామినీ."

ఈ పైశ్లోకమునందు ముప్పమదేవి సుగుణంబులు నక్షత్రంబులవలెను, కీర్తిశరత్కాలచంద్రికవలెను బ్రకాశించుచున్నవనియు, మఱియు నామె కౌసల్య, జానకి, కుంతి, పద్మ, పౌలోమి, చండికా మొదలగువారిం బోలియున్నదని మాత్రము వర్ణింపఁబడియెనే గాని యామె యేవంశమునం దేరాజునకు జనియించెనో తెలుపఁబడియుండనందున ముప్పమదేవియొక్క తలిదండ్రులను గూర్చి మనకేమియుఁ దెలియరాకున్నది. ఈమెకు ప్రోలరాజువలన రుద్రదేవుఁడు, మహాదేవుఁడు మొదలగు నైదుగురుపుత్త్రులు జనించి యశస్వంతులైరి. ఈప్రకారము కాకతిప్రోలరాజు సంతానమును ప్రాభవమును బడసి అవక్రపరాక్రముఁడై చాళుక్యచక్రవర్తుల సైన్యాధిపతులను పెక్కండ్రను మాండలికరాజులను జయించి రాజ్యమును విస్తరింపఁజేసి మొట్టమొదట త్రైలింగ్యసామ్రాజ్యనిర్మాణభవనమునకుఁ బునాదు లేర్పరించెను.

ప్రోలరాజు కొడుకుచేఁ జంపఁబడుట

ఇట్లువక్రపరాక్రమలీల శత్రురాజులను నిర్జించి త్రైలింగ్యసామ్రాజ్యనిర్మాణభవనమునకుఁ బునాదు లేర్పఱచి జగతికేసరి యను బిరుదనామమును వహించి బహుకాలము పరిపాలనముచేసిన కాకతిప్రోలరాజు తుదకవసానకాలము సమీపింప దురదృష్టవశమున నాకస్మికముగాఁ దన ప్రియకుమారుండగు శ్రీరుద్రదేవనృపునిచేఁ బొడువంబడి చంపఁబడియెను. ఇట్టి విషాదకరమైన హత్య కేవలము భ్రమప్రమాదవశమునఁ దటస్థమైనదిగాని తండ్రియెడఁ బ్రతాపరుద్రునకుం గల ద్వేషముచేత సంభవించినది కాదు. ఒకనాఁడు దేవాలయంబునఁ బ్రతాపరుద్రదేవుఁడు గాఢనిద్ర నున్నకాలమునఁ దండ్రి యైన ప్రోలరాజు అతనిప్రక్కనుండిపోవుచు నతనిని స్పృశించెను. అంతట నతఁడు మేల్కొని శత్రు వెవ్వఁడో తన్ను ముట్టుకొనవచ్చె నని యాగ్రహమహోదగ్రుఁడై లేచి మొలలోనున్న కైజాఱు వెలికి యొక్కపోటుపొడిచెను. అంతట తండ్రి నేలంబడఁజూచి తెలివిగాంచి చేసినహత్యకుఁ బశ్చాత్తప్తుఁడై దుఃఖింపసాగెను. ఇది భ్రమప్రమాదవశమునఁ దటస్థమైనదని యెఱింగినవాఁడు గావునఁ బ్రోలరాజు కుమారునిశిక్షింపక యోదార్చి రాజముద్రిక నొసంగి రాజ్యము నొప్పగించి పరిపాలనముచేయ నాజ్ఞచేసి ప్రాణంబులను విడిచెను.

ఆఱవ ప్రకరణము.

కాకతీయాంధ్రులు.

శ్రీ రుద్రదేవమహారాజు.

(క్రీ. శ. ౧౧౪౦ మొదలుకొని ౧౧౯౬ వఱకు)

కాకతిప్రోలరాజునకుఁ బిమ్మట నతని పెద్దకుమారుఁడైన రుద్రదేవుఁడు పట్టాభిషిక్తుఁ డయ్యెనుగాని యెప్పటినుండి యాతని పరిపాలనము ప్రారంభమయ్యెనో స్పష్టముగాఁ దెలిసికొనుట కాధారము గానిపింపలేదు. భావిపరిశోధనమున సత్యము తేటపడునంతదనుక క్రీ. శ. ౧౧౪౦ దవసంవత్సరమునకుఁ గొంచె మీవలఁగాని యావలఁగాని రుద్రదేవుని పరిపాలనము ప్రారంభమైయుండు నని చెప్పవచ్చును. ఈరుద్రదేవుఁడే చరిత్రమున మొదటిప్రతాపరుద్రుఁ డని పేర్కొనఁబడుచున్నాఁడు. ఇతఁడు పరాక్రమమునందు తండ్రినిసయితము మించినవాఁడై అధికసామర్థ్యముతో నతఁ డేర్పఱించిన పునాదులపైఁ దైలింగ్యసామ్రాజ్యభవననిర్మాణమును గావించి సుస్థిరమైన యశమును సంపాదించెను. ఇతని చరిత్రమును సంపూర్ణముగాఁ దెలిసికొనుటకుఁ జాలినన్ని సాధనములు గానరావు గాని కొంత చరిత్రమును దెలిసికొనుటకు నతని శాసనములు రెండుమూఁడుమాత్రము తోడ్పడుచున్నవి. అందనుమకొండశాసనము ప్రధానమైనది. ఇయ్యది. శా. శ. ౧౦౮౪ వ సంవత్సరమునం దనఁగా క్రీ. శ. ౧౧౬౨వ సంవత్సరమున రుద్రదేవునిచేత నే వ్రాయింపఁబడిన ప్రధానశాసనముగా నున్నది. ఈశాసనమునందు రుద్రదేవుఁడు తన తాతయైన త్రిభువనమల్లునకుఁ బూర్వమునందుండిన తన వంశపురుషుల నెవ్వరినిం బేర్కొని యుండలేదు. తనతండ్రియుఁ దాను జయించిన రాజులను గొంద

అను పేర్కొనియుండుటచేతఁ గొంతవఱకు చరిత్రము బోధపడుచున్నది. ఈశాసనములో:—

"శృఙ్గక్షుఙ్గతురఙ్గపుఙ్గవచయారోహక్రమే కర్మఠం
దోమ్మంచారుపరాక్రమక్రమభరం భఙ్క్త్వా సకృల్లీలయా
కర్ణంపార్థఇవామలైః శరశతై ర్విద్రావ్యవిద్రావ్యమో
లేభే సర్వవిశేషయుక్తనగరగ్రామం స రుద్రోనృపః." అని యున్న

తములైనట్టియు, ప్రఖ్యాతములైనట్టియు, నశ్వంబుల నారోహించుట యందు నేర్పరియు, చారుపరాక్రముండు నగు దొమ్మ (దామనాయఁడు, లేక దామ రాజు) అనువానిని పార్థుఁడు కర్ణుని వందలకొలఁది తీక్ష్ణములైన బాణములచేతఁ బలుమాఱు తఱుమఁగొట్టినట్లుగా రుద్రదేవుఁడు తఱిమి విశేషవస్తు సంపన్నంబు లయిన పట్టణంబులను గైకొనియె నని చెప్పఁబడి యున్నది. ఇందుఁ బేర్కొనఁబడిన రుద్రదేవుని శత్రు వెవ్వఁడో నిర్ధారించుటకు నాధారము గానిపింపకున్నది.

"ఈడే మేడవిడమ్బడమ్బరభరక్షోదక్షమం క్ష్మాభృతాం
దుర్వారోద్ధుర వీరమన్త్రిసమయాదానైక దీక్షాగురుం
శ్రీమన్మైళగిదేవసఙ్గ సమయప్రోద్భూతదర్పాపహం
ప్రాప్తశ్రీపోలవాసదేశవిభవం శ్రీరుద్రదేవంసదా."

ఈశ్లోకమునందుఁ బేర్కొనఁబడిన రుద్రదేవుని ప్రతివీరులనుగూర్చిన చరిత్ర వివర మెంతమాత్రము దెలియ రాకున్నది. కులోత్తుంగరాజేంద్రచక్రవర్తి కుమారుఁడును, క్రీ. శ. ౧౦౭౮ మొదలుకొని ౧౦౮౪ వఱకును, ౧౦౮౮-౮౯ మొదలుకొని ౧౦౯౨-౯౩ వఱకును, రాజప్రతినిధిగనుండి వేంగీదేశమును బరిపాలించిన వీరచోడభూపాలుని ముఖ్యసేనాధిపతిగ నున్న మేడమార్యుఁడే పైశ్లోకమునందు బేర్కొనఁబడిన మేడప్రభు వని నమ్మి యాంధ్రులచరిత్రము లోని ప్రథమభాగమున "ఈమేడమార్యుఁడు కాకతీయాంధ్రప్రభు వైన మొదటిప్రతాపరుద్రునితో యుద్ధముచేసి యోడిపోయినట్టు గన్పట్టుచున్న" [illegible]న్నాఁడను గాని యీ మొదటిప్రతాపరుద్రుఁడు క్రీ. శ. ౧౧౯౬

వఱకుఁ బరిపాలనముచేసి యుండుటంబట్టి నూఱేండ్లక్రిందట నున్న మేడమార్యుని జయించుట యసంభవ మని బోధపడుచున్నది గావున నితఁడు వేఱొకఁ డని యూహింపవలసియున్నది.

ఈప్రతాపరుద్రదేవుఁడు మైళగిదేవుని జయించి పోలవాసదేశమును గైకొనియె నని పైశ్లోకమునఁ జెప్పఁబడినది. శోణదేశమును బరిపాలించుచుండిన సింగనరాజుకొడుకు మల్లగి యనువాఁడే మైళగిదేవుఁడై యుండవచ్చును. ఈమల్లగి యాదవవంశసంజాతుఁడు. ఇతఁడు పర్ణఖేట మను పట్టణమును తనశత్రువులనుండి స్వాధీనపఱుచుకొని యాపర్ణఖేతముననే నివసించు కాలమున నుత్కలరాజుయొక్క గజసేనను బరాక్రమముతో నెగనెత్తుకొని పోయెను. ఇతఁడు దేవగిరియాదవులయొక్క పూర్వికుఁడు. ఇతఁడు గాక పోయిన నీతని రెండవకుమారుఁ డైన 'అమరమల్లగి' యైనఁ గావచ్చును. పోలవాసదేశ మెచ్చటిదో గుర్తింప నలవిగాక యున్నది.

ప్రతాపరుద్రుఁడు వర్ధమానపుర చోడులను జయించుట.

ఎనిమిదవశతాబ్దములో రేనాటిని బరిపాలించిన ప్రాచీనాంధ్రచోడులలో నొకశాఖవారు వర్ధమానపురముననుండి ప్రజాపరిపాలనము సేయుచుండిరి. వీరిచారిత్రము సమగ్రముగాఁ దెలియకుండుటచేతఁ బెక్కండ్రు వీరి యుదంతమును దెలిసికొనఁజాలకున్నారు. వర్ధమానపురము నైజాము రాష్ట్రములోని వనపర్తిసంస్థానమునకు సమీపమున శిథిలమైయున్న వడ్డమాని యను గ్రామముగా నున్నది. ఇయ్యది పూర్వము మహాపట్టణమై యుండి యనేక దేవాలయములతో నొప్పుచుండెను. దీనిని పదునొకండవశతాబ్దాంతమునందుఁ గరికాలచోడాన్వయుఁడును, కాశ్యపగోత్రుఁడును నైన భీమచోడనృపాలుఁడు పశ్చిమచాళుక్యచక్రవర్తులకు సామంతమాండలికుఁడై పరిపాలనము సేయుచుండెను. ఇతనికి గోకర్ణచోడుఁడు జనియించెను. ఇతనిసోదరుఁడు భీమరాజు. ఉదయాదిత్యచోడుఁడు నితని వంశములోనివాఁడే యగును గాని గోకర్ణనృపాలునకెట్టిసంబంధము గలవాఁడో విచారింపవలసియున్నది. శ్రీ మానల్లి రామకృష్ణయ్య, ఎం. ఏ గారు గోకర్ణునిమనుమఁడని చెప్పి[illegible]

అయ్యది భావిపరిశోధనమునఁగాని స్థిరపడునది కాదు. ఇతనినే కాకతీయ రుద్రదేవనృపాలుఁడు జయించెను.

గోకర్ణనృపాలుఁడు.

భీమన సోదరుఁ డైన గోకర్ణుఁడు వాగీంద్రచూడామణి యనుజైనసమయాచార్యుని శిష్యుఁడు. వర్ధమానపురాధీశ్వరుండు. ఇతఁడు భీమకవికిఁ గర్తృత్వ మారోపింపఁబడిన కవిజనాశ్రయ మను ఛందోగ్రంథమును రచించి కళ్యాణపురాధీశ్వరుం డైన చాళుక్యజగదేకమల్లునకు సేనాపతి యగు రేచభూపాలున కంకితము చేసెను. ఈరేచనికిఁ గవిజనాశ్రయుఁ డనియు, గోకర్ణునకు శ్రావకాభరణాంకుఁ డనియు బిరుదనామములు గలవు. కవిజనాశ్రయములో నాలుగాశ్వాసములును జైనకావ్యధర్మముల ననుసరించి వాగ్దేవతాస్తుతితోఁ బ్రారంభింపఁబడినవి. వేములవాడభీమకవి రచించినది నృసింహపురాణముకాని కవిజనాశ్రయము కాదు. గోకర్ణుఁ డనేకాగ్రహారములను బ్రాహ్మణోత్తములకు ధారవోసి శాసనములను వ్రాయించి యున్నాఁడు. ఈ గోకర్ణుని గురు వయిన వాగీంద్రచూడామణి తనపేరిటి లక్షణగ్రంథమును, ఆదిపురాణమును ఆంధ్రభాషలో విరచించినటులఁ దెలియుచున్నది.

భీముఁడు - గోకర్ణుఁడు.

ప్రతాపరుద్రుని కాలమున వర్ధమానపురమును భీమచోడుఁడు తన సోదరుఁ డైన గోకర్ణచోడునితోఁ గలిసి పరిపాలనము సేయుచున్నటులఁ దెలియుచున్నది. ఈభీమచోడనృపాలుఁడు పరమదుర్మార్గుఁ డైనటుల రుద్రదేవునిశాసనమున వాకొనఁబడియెను. భోజనకాలమునందు తన సోదరుని జంపెను. తన సవతితల్లికిఁ బతియయ్యెను. పశ్చిమచాళుక్యుఁ డనువిక్రమాదిత్యచక్రవర్తికుమారుఁ డను తైలపదేవుఁడు వర్ధమానపురమున కిరువదిమైళ్ల దూరమునం దున్న కందూరునఁ బరిపాలనము సేయుచునుండి రుద్రదేవుని పరాక్రమమునకు వెఱచి మరణమునొందఁగా భీమచోడుఁ డారాజ్యము నాక్రమించుకొని కొలఁదికాలము పరిపాలనముచేసి రుద్రదేవునితో వైరము

గల్పించుకొని నిరంకుశాధికారమును నెఱపుచుండఁగా రుద్రదేవుఁ డీనృపాలాధముని శిక్షించుటకై వానిపైకి దండెత్తి పోయెను. రుద్రదేవుని వీక్షించిన మాత్రముననే భయంపడి భ్రాతృమాతృవనితా సహితముగా భీముఁడు పర్వతారణ్యభూములకుఁ బాఱిపోయె నని అలంకారయుక్తము లయిన యీక్రింది శ్లోకములలో వ్యక్తరింపఁబడియెను.

"భీమేన భీమనకులేన కులేనహీనో
గ్రస్తో మమార గృహమూషకవత్ క్షణేన
మార్జారడిమ్భకవరేణ మహాన్ధకారే
గోకర్ణనామ భుజగో భువి శూరమానీ."

... ...

"యాతేపి తైలపనృపే దివ మస్య భీత్యా
సర్వాతిసార కబళీకృతగాత్రయష్టౌ
శ్రీరుద్రదేవనృపతేః పృథు విక్రమస్య
భీమోపి రాజ్యపదవీం క్షణికాం స లేభే."

"ఏకో జమ్బుకడిమ్భకో లఘుతరై స్సంవేష్టితో జమ్బుకైః
రాజాహాంకృతి ధిక్కృతక్షితితల స్సింహేన సంస్పర్ధతే
ఘూత్కారాకులగర్జితై ర్ముఖరయ న్సర్వాదిశో విహ్వలో
యాతః క్వాపి సఏవ ధూననభరైః కణ్ఠీరవ స్యాతురః."

"తద్వద్భీమనృపాధమో నరపశు ర్మాతుఃసపత్నీపతిః
హన్తా భ్రాతృవరస్య భోజనవిధా భీమేన సంస్పర్ధతే
ఆకాశగ్రసన ప్రయాసనిరతః శ్రీరుద్రదేవేన య
త్సర్ధావర్ధితగర్వపర్వతమహాశృఙ్గాగ్ర మారోహతి."

... ...

"యస్యాక్షివీక్షణ భయాచ్చకితస్య భీమో
దుర్యోధనస్య నృపతే రివ విహ్వలాఙ్గః
స్వభ్రాతృమాతృవనితాసహిత స్సమగ్రే
లక్ష్మీం విహాయ వనమేవ యయౌ విలజ్జః."

ఉదయచోడుని జంపి పద్మావతిని పెండ్లియాడుట.

ఆటుపిమ్మట రుద్రదేవుఁడు వానిని వెంబడించి తటిమి యాంజనేయుఁడు లంకాపురమును దహించినటులఁ జోడోదయరాజుయొక్క నగరమును దగ్ధముగావించి యానగరము మధ్య నొకమహాద్భుతమైన తటాకమును ద్రవ్వించెను. అంతకుఁ బూర్వమే చోడోదయుఁడు రుద్రదేవుని తన పరాక్రమమును విని భయకంపితుఁడై మతిపోయి పిచ్చియెత్తి దయ్యమువోలె మృతినొందె నని యీక్రింది శ్లోకమునఁ జెప్పఁబడి యున్నది.

"శ్రీమద్రుద్రపరాక్రమోద్భవభవవ్యామోహనాభ్యుల్లస
చ్ఛస్త్రత్రస్తసమస్తగాత్ర విలసచ్చోడోదయక్ష్మాపతేః
ఉన్మత్తాఇవ విస్మృతాఇవ మహాభూతాభిభూతాఇవ
ప్రోద్భ్రాన్తాఇవ సంకులాఇవ తదా ప్రాణాః ప్రయాతా దివమ్"

పైని జెప్పిన ట్లాచోడోదయుని నగరమును దగ్ధము గావించుటయే కాక యాతని కొమార్తను పద్మావతి యనుదానిని వివాహమైనటుల నాశాసనము నందలి యీక్రిందిశ్లోకమువలనఁ దెలియుచున్నది.

"కన్దారోదయచోడవంశవిలసత్ క్షీరాబ్ధిగర్భోద్భవ
త్పద్మైకాశ్రయరుద్రదేవ నృపతేః కిం వర్ణ్యతే విక్రమః
క్షుద్రక్షత్త్రియలోన్నతిక్షయకృత స్సర్వావనీశ్రీభృతో
రామస్యేవ కుఠారఖణ్డిత రిపువ్రాతస్య పృథ్వీపతేః."

ఈ పైశ్లోకము ద్వంద్వార్థమును సూచించుచున్నది. అయినను రుద్రదేవుఁడు పద్మావతిని వివాహముఁజేసికొనె ననుటయే యొప్పియున్నది గాని మఱియొక శాసనమును బట్టి సందేహము కలుగుచున్నది.[1] ఉదయచోడుని జట్చర్లశాసనమునకును రుద్రదేవుని యనుమకొండశాసనమునకును నడుమ ౨౬ దినములు మాత్రమే వ్యవధి కలదు. ఇందలి సత్యమును భావిపరిశోధనమునఁ దెలిసికొన

1. See the Lithic Records in Hyderabad prepared by M. Ramakrishna Kavi M. A.

వలయును. ఉదయచోడునియొక్క కుల్యాధికారు లయిన కిబ్బట మేల్పట్టి దండనాయక నలసిద్ధమయ్య సిద్ధమార్యులు శకసంవత్సరములు ౧౦౭౮ అగు చిత్రభానుసంవత్సర పౌష్యబ ౨ మంగళవారమున నుత్తరాయణ సంక్రాంతి నిమిత్తమై కోడూరి శ్రీస్వయంభుసోమనాథదేవునికి సుంకములు మొదలగు వానిని గల్పించి యుండిరి. ఇందు శాలివాహనశక మనుటకు బదులుగా శ్రీమచ్చాళుక్యశకవర్షంబు లని తప్పుగా వ్రాయఁబడినది.

ఈజట్చర్లగ్రామము కందనోలి (కర్నూలు) నుండి హైదరబాదునకుఁ బోవుమార్గమున హైదరబాదునకు దక్షిణమున ౪౮ గవ మైలురాయికడ నున్నది. దీనికి దిగువను ౨౨ మైళ్లదూరమున కందూరు కలదు. ఇయ్యది కర్ణాటకచోడులకు రాజధానిగ నుండెను. వర్ధమానపురము మఱియొకచోడవంశమువారికి రాజధానిగ నుండెను. ఈరెండు చోడవంశములకు నెట్టిసంబంధము గలదో యింతవఱకును స్థిరపడలేదు. ఉదయాదిత్యాలంకార మనియెడి గ్రంథమొకటి కర్ణాటభాషలో వ్రాయఁబడి యున్నది. దానికర్తృత్వము చోడోదయుని కారోపింపఁబడుచున్నది. ఆగ్రంథమునందు చోడోదయుని తండ్రి సోమనాథుఁ డని చెప్పఁ బడియున్నది. సరకులపై సుంకమును విధించు నాచారము మాకాలమునందును గలదు. బద్దెనకవి (భద్రభూపాల) ప్రణీత మైన నీతిశాస్త్రముక్తావళి యనుగ్రంథమున పలువిధము లయిన సుంకములయొక్క వర్ణన మీక్రిందిపద్యమునఁ జేయఁబడినది.

" చ. గనులు కృషి. ప్రపంచ మరిగప్పము సుంకము గోకులంబు నం
దనవనముల్ జల స్థల పథస్థ వణిక్క్రియ దుర్గరక్షణం
బనఁగల యన్నిమార్గముల నర్థమురాఁ యక కేవలంబ కాఁ
పున పాలియించు రాజు సిరిఁ బొందునె రాజమనోజభూభుజా.

ఒరయూరు పురవరాధీశ్వరుల మని తెలుఁగుచోడులును, అయోధ్యాపురవరాధీశ్వరుల మని చాళుక్యాదులును, కాలంజరపురవరాధీశ్వరుల మని కాలచుర్యులును, మాహిష్మతీపురవరాధీశ్వరుల మని హైహయులును చెప్పుకొన్నట్లుగానే యీకర్ణాటకచోడులును కోడూరుపురవరేశ్వరుల మని చెప్పు

కొనుచుండెడివారు. మఱియు నీజట్చర్లశాసనమునందు గోకర్ణసింగరూక లని సింహాముద్రికలుగల గోకర్ణుని నాణెములు పేర్కొనఁబడినవి. ఈ గోకర్ణచోడునిశాసనములు హైదరబాదు రాజ్యమునం దచ్చటచ్చట కల వని తెలియుచున్నది. ఆశాసనము లన్నియుఁ బ్రకటింపఁబడినమీఁదట గాని కందూరు వర్ధమానపురచోడులయొక్క చరిత్రముఁ దెలిసికొన సాధ్యము గాదు.

రుద్రదేవుని రాజ్యవిస్తారము.

ఇట్లు రుద్రదేవుఁడు చాళుక్యసైన్యపాలుఁ డయిన తైలపదేవుని, కర్ణాటకచోడు లయిన భీమచోడోదయచోడులను, మంత్రకూటాధీశుఁ డైన గుండమనాయని, తక్కఁగల శత్రురాజవర్గమును జయించి యాంధ్రదేశమునందు పశ్చిమచాళుక్యచక్రవర్తుల పరిపాలనమునకు లోఁబడి యున్న భూభాగముల నన్నిటిని స్వాధీనము చేసికొని మహామండలేశ్వరుఁ డై రాజాధిరాజై పొగడ్త కెక్కెను. ఇతని రాజ్యముయొక్క విస్తీర్ణ మనుమకొండశాసనములో నీక్రిందిశ్లోకమున వివరముగాఁ జెప్పఁబడినది.

"రాజ్యం ప్రాచ్యాం లవణజలధే స్తీరపర్యన్త మస్య
శ్రీశైలాన్తం ప్రచరతి సదా దక్షిణస్యాం సమగ్రం
ప్రాతీచ్యాన్తా కటకనికటస్థాయినీ రాజ్యలక్ష్మీః
కౌబేర్యాశాతటవిలసితా మాల్యవన్తం ప్రపేదే."

అనఁగా క్రీస్తుశకము ౧౧౬౨ వ సంవత్సరమునాఁటికి కాకతిరుద్రదేవుని రాజ్యము తూర్పున సముద్రమువఱకును, దక్షిణమున శ్రీశైలమువఱకును, పడమర కటకము (పశ్చిమ చాళుక్యరాజధానియగు కళ్యాణపురి) వఱకును, ఉత్తరమున మాల్యవంతము (మధ్యమాగాణములలోని పర్వతముల) వఱకును, విస్తరించి యున్నదని పైశ్లోకముయొక్క భావము.

ఈపైశ్లోకమునం జెప్పంబడిన కాకతిరాజ్యముయొక్క హద్దులు సరియైన వయినయెడలఁ దూర్పున నుండు నిప్పటి గోదావరీ, కృష్ణా, గుంటూరు మండలములు పైరాజ్యములోఁ జేరి యుండవలయును. క్రీస్తుశకము ౧౧౬౨వ సంవత్సరమునకుఁ బూర్వము ప్రతాపరుద్రునిశాసనము లామండలములలో

నెచ్చటను గానరావు. అంతియగాక చాళుక్యచోడులకు ప్రతినిధులుగఁ బరిపాలనము సేయుచున్న మాండలికసామంతులయొక్క శాసనములే పెక్కులు గన్పట్టుచుండుటచేత మొదటికాకతిప్రతాపరుద్రుఁడు వారిపై దండెత్తి యుద్ధముచేసి జయించియుండవచ్చును గాని యాభాగములను దన రాజ్యములోఁ గలుపుకొని పరిపాలనము చేసియుండు నని యూహింపరాదు. ౧౧౬౨వ సంవత్సరమునకుఁ దరువాత ప్రతాపరుద్రదేవుని శాసనములు దక్షారామమునందును, నరసారావుపేటతాలూకాలోని కుంకలగుంట గ్రామమునందును, కందనోలిమండలములోని త్రిపురాంతకమునందును గానవచ్చుటచేత నప్పటి కాభాగములను జయించె నని స్పష్ట మగుచున్నది. దాక్షారామశాసనములో త్రిభువనచక్రవర్తి విష్ణువర్ధనమహారాజుయొక్క ప్రవర్ధమానసంవత్సరములు పేర్కొనంబడుటయేగాక 'పెనుగొండపురవరాధీశ్వర' యని కూడఁ బేర్కొనంబడియెను. ఈశాసనము క్రీ. శ. ౧౧౭౯ దవసంవత్సరమున వ్రాయఁబడినది. ఈతఁ డీశాసనమున విష్ణువర్ధనమహారాజుయొక్క విజయరాజ్యసంవత్సరము లుదాహరించుటకుఁ గారణము గానరాదు.

దీనింబట్టి యితఁడు చాళుక్యచోడచక్రవర్తులకు సామంతుఁ డని యెంతమాత్రము నూహింపరాదు. నరసారావుపేటతాలూకాలోని కుంకలగుంట గ్రామములో శ్రీభోగేశ్వరస్వామివారిదేవళములో ప్రతాపరుద్రునియొక్కయు అతని మంత్రి యైన బొల్లయ్య (మల్లయ్య) ప్రెగ్గడయొక్కయు నామములు మాత్రము గానంబడుచున్నవి గాని తక్కినయక్షరములు తెలియంబడుచుండ లేదు. ఈశాసనము శా. శ. ౧౧౧౯ దవ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౧౯౭ వ సంవత్సరమున వ్రాయఁబడినది. కాఁబట్టి యిది మొదటిప్రతాపరుద్రుని కాలమునాఁటి దని స్పష్ట మగుచున్నది.1 'పతిహితచరిత' యని యితని శాసనములలోఁ గన్పట్టినను, ఇతఁడు పశ్చిమచాళుక్యచక్రవర్తులకుఁగాని, ప్రాచ్యచాళుక్యచోడచక్రవర్తులకుఁగాని, సామంతుఁ డైన మహామండలేశ్వ

I. Lists of Autiquorian Remains by R. Sewell Vol I. h. 71

రుఁడు గాక త్రిలింగదేశమును స్వతంత్రుఁడై యవక్రపరాక్రమంబునం బరిపాలించిన మహారాజాధిరాజని చెప్పుటకు సంశయింపం బనిలేదు. ఈమహావీరుని పరిపాలనకాలమునఁ బశ్చిమచాళుక్యసామ్రాజ్యమును, ప్రాచ్యచాళుక్యచోడసామ్రాజ్యమును, అంతరించినవి. త్రైలింగ్యసామ్రాజ్యము విస్తరింప నారంభించినది.

శైవమతాభినివేశము.

పాపవిమోచనమార్గములు.

పండ్రెండవశతాబ్దమునందలి వీరశైవమతవిజృంభణమునుగూర్చిన చరిత్రమును సంగ్రహముగాఁ గొంతవఱకీగ్రంథముయొక్క ప్రథమప్రకరణంబునఁ దెలిపియున్నాఁడను. పశ్చిమచాళుక్యరాజధాని యగు కళ్యాణపురమున వీరబసవేశ్వరునిచే నుద్ధరింపఁబడిన శైవమతముతోఁగూడ జనించి మహావిప్లవములనుగూర్చి మరల నిందు చర్విత చర్వణముగా నుదాహరింపం బనిలేదు. విద్వత్కవి పండితప్రకాండు లయిన యారాధ్యబ్రాహ్మణులచేతను, వీరశైవమతాభినివేశపరవశు లయిన జంగమగురుదేవరలచేతను, తదీయాభిమాను లైన ప్రభువరులచేతను, కర్ణాటకాంధ్రదేశములయందు వీరశైవమతము మాఱుమూలల సహితము విజృంభించి పరమతభయంకరంబై సహన మనుమాట లేశమును లేక వర్ధిల్లుచుండెను. ఎట్టి వీరాగ్రణి కైనను వీరఘంటానినాదంబులు చెవినిబడినప్పు డొడలు కంపమెత్తి వడంకుపుట్టించునట్టిదిగ నుండెను. అనేక క్షుద్రవర్ణముల వారు వీరవైష్ణవముబలె వీరశైవము స్వీకరించిరి. ఒకప్రక్కనుండి వీరవైష్ణవము మఱియొకప్రక్కనుండి వీరశైవము ప్రబలుచుండుటచేత జైనబౌద్ధమతములు పేరు పెంపులేక వసివాళ్లువాడుటకుఁ బ్రారంభ మయ్యెను. అట్టి సందర్భమున రుద్రదేవుఁడు త్రైలింగ్యసామ్రాజ్యమును విస్తరింపఁజేయుచు ననుమకొండ రాజధానిగఁ బ్రజారంజకముగఁ బరిపాలనము సేయుచుండెను. అందఱకుంబోలెనే రుద్రదేవునకును మతాభిప్రాయములు మార్పుఁజెందఁ బ్రారంభించినవి. ఎందఱు శత్రురాజుల నోడించి యెంతభూమి నాక్రమించినను ఎన్ని

దిగ్విజయయాత్రలు గావించినను, మనస్సున కానందము కలుగనీయక యెద్దియో పిశాచమువలె బాధించుచుండెను. అతఁడు వృద్ధుఁడైన తనతండ్రిని నిర్నిమిత్తముగాఁ జంపి పితృహత్యాదోషమును ముడివెట్టుకొంటినిగదా యాపాపమెట్లు పరిహార మగు నని నిరంతరమును బశ్చాత్తాపమును బొందుచు నొకనాఁడు బ్రాహ్మణోత్తముల నాస్థానమునకు రప్పించి వారలతో నిట్లనియె. 'ధర్మజ్ఞులైన భూసురోత్తములార! పితృహత్యాదోషమునుండి నన్ను విముక్తుని గావించుమార్గం బెద్దియైన నున్న యెడల ననుగ్రహించి తెలుపుఁడు' అని మిక్కిలి పశ్చాత్తప్తచిత్తంబుతో వేఁడికొనియెను. అందునకు వారలు 'మహాప్రభూ! ఎట్టివానికిని గర్మానుభవ మనుభవింపక తీఱదు. ఈ దేహంబునకుఁ గర్మయే కారణం బైనయెడల నద్దానిం దొలఁగార్చుటకు నొక్కయుపాయంబు గలదు. అయ్యది కర్మసంహారకుం డయిన శివుని నారాధించుట.' అని ప్రత్యుత్తర మీయ నతం డామార్గమును దెలుపుం డని యడుగఁగా వారలు మరల నిట్లనిరి. 'మహాప్రభూ! దేశాటనము సలిపి దివ్యనదులం గ్రుంకి దివ్యతీర్థముల సేవించి దివ్యలింగములఁ బ్రతిష్ఠింపించి పంచామృతములతోఁ బరమేశ్వరుం డైన శివుని కభిషేకము గావించి భక్తితో సేవించినఁ బాపపరిహారం బగు' నని చెప్పిరి. అంతట రుద్రదేవుఁడు బ్రాహ్మణులకు స్వర్ణమును దానముచేసి పంపించెను. తర్వాత రుద్రదేవుఁడు నూఱుగురు బ్రాహ్మణోత్తములను విశ్వేశ్వరున కభిషేకంబుఁ జేయ నియమించి విశేషధనంబు లొసంగి గాశికిం బంపించి వారలచేఁ బితృతర్పణంబులను దనకుఁగాఁ జేయించెను. అచ్చట ననేక ధర్మకార్యంబు లాచరింపఁజేసెను. ఓరుఁగంటికి ఆఱు క్రోసులదూరమున నున్న అయినవోలు గ్రామమునందు మైలారదేవున కాలయమునుగట్టించి చిత్రవిచిత్రము లయిన నాలుగు శిలాద్వారములను నిర్మింపం జేసెను. మఱియు ననుమకొండకు రెండు క్రోసులదూరమున ఒద్దిపల్లెనాలయమును నిర్మింపించి బుద్ధగణపతిని బ్రతిష్ఠింపించుటయే గాక మొగలిచెర్లగ్రామంబునఁగూడ నొక మహాశక్తిని బ్రతిష్ఠింపించి యొక యాలయమును గట్టించి యేఁటేట నుత్సవాదులు జరుప నేర్పాటు గావించెను. శ్రీశైలమునకుఁబోయి మల్లికార్జునదేవుని సందర్శించి తులాపురుష

మును దూగి బ్రాహ్మణకుటుంబములకు ధారవోసి యేకశిలానగరంబునకు విచ్చేసి లక్షలకొలఁది ద్రవ్యమును వెచ్చించి యనేకశివాలయములను నిర్మింపించి మఱియు నెంతెంతో ద్రవ్యమును వెచ్చించి చతుర్ముఖేశ్వరుని దేవళమును సహస్రస్తంభములమండపమును గట్టించెను. ఇవిగాక గణపతీశ్వరుని యాలయమును రుద్రేశ్వర మను గ్రామమున రుద్రేశ్వరాలయమును గట్టించి కోనేరు త్రవ్వించి ప్రాకారములు వినిర్మించి యాదేవతల నిత్యోత్సవమునకై ౧౨ గ్రామముల నొసంగెను.

రుద్రదేవుఁడు విద్యావిభూషణుఁడు.

ఇతఁడు సంస్కృతాంధ్రకర్ణాటభాషలయం దభిమానము గలిగి పండితజనంబుల రావించి యాదరించుచుఁ బండితపక్షపాతియై తానును బండితుండు కవియు నై బహుగ్రంథములం బఠించుటయేగాక గ్రంథరచనమునకుం గూడ దొరకొనినటులఁ గానంబడుచున్నది. ఈతనికి 'విద్యావిభూషణుఁ' డను బిరుదనామ మున్నటుల శా. శ. ౧౧౦౧ వత్సరమున దాక్షారామభీమేశ్వరుని యాలయమున లిఖింపంబడిన శాసనముంబట్టి దెలియుచున్నది. మఱియు నితఁ డాంధ్రభాషలో 'నీతిసార' మను గ్రంథమును రచించినటులఁ గన్పట్టుచున్నది. ఆత్మకూరుసంస్థానమున సంపాదించిన ప్రతిలో నీక్రిందిపద్యము గలదని తాము ప్రకటించిన బద్దెనకవిప్రణీత నీతిశాస్త్రముక్తావళీ గ్రంథమున శ్రీరామకృష్ణయ్యగారు నుడివి యున్నారు.

"చం. పరువడి నాంధ్రభాషగల బద్దెననీతియు సంస్కృతంబుతోఁ
బరఁగఁ బ్రతాపరుద్రనరపాలునిచే రచియింపఁబడ్డ యా
నరవరునీతిసారము వినం జదువం గడు మంచి దంచుఁ జె
చ్చెరఁ గవి నీతిపద్ధతులుచేసె వినోదము బాలబోధకున్."

నీతిశాస్త్రముక్తావళిని రచించిన బద్దెనకవినే భద్రభూపాలుఁ డని యీ చరిత్రముయొక్క ప్రథమప్రకరణమునఁ దెలిపియున్నాఁడను. ఈభద్రభూపాలునకు నన్నెచోడుఁ డను నామముగూడ గలదు. కుమారసంభవ మను

మహాకావ్యమును రచించిన నన్నెచోడుఁడు నితఁడు నొక్కరో భిన్నులో చెప్పుట కాధారము గానిపింపదు. కుమారసంభవకావ్యరచనకును నీతిశాస్త్రముక్తావళి గ్రంథరచనకును విశేషతారతమ్యము గన్పట్టుచున్నది. నీతిశాస్త్రముక్తావళి గ్రంథరచన కోమలమై యున్నది.[1] నీతిశాస్త్రముక్తావళిలోని కొన్ని ధర్మములు నీతిసారములోని ధర్మములను బోలియున్నవని పోలికపద్యములు గొన్ని ముద్రితగ్రంథమునందు నుదాహరింపఁబడినవి. నీతిసారముయొక్క శైలి దెలియుటకై వానిం గొన్ని నే నిట నుదాహరించుచున్నాఁడను.

"కం. దండము లేకున్నను బ్రజ
లొండొరువుల నాక్రమింతు రుచితస్థితిమై
నుండవు వర్ణాశ్రమములు
దండింపనిభూమిపతికి ధర యేర్పడునే."

"కం. ఆజ్ఞ లేనివృపుఁడు నరయఁ జిత్తరువులో
నున్న రాజుఁ జూడ నొక్కరూప
యానఁ ద్రోయుసుతుని నైనను దండింప
కున్న రాజ్య మేల నుండుఁ జెడక."

"కం. ఆపదలఁ జెందు ప్రజలను
భూపతి మొద లిచ్చి మగుడఁ బ్రోవఁగఁ జనుఁ దాఁ
జేపట్టి విడువవలవదు
భూపతికిఁ గుటుంబ మనఁగ భూమియ కాదే."

"ఆ. కీడుసేయువానికిని మేలుసేయుట
మునులగుణము గాక జనుల నెల్లఁ
బ్రోచువాఁడు కల్లరుల నాజ్ఞవెట్టుట
యాగపశువిధంబు నట్లకాదె."

---

[1] నేను మొదటిప్రకరణము వ్రాయునప్పటికి నీతిశాస్త్రముక్తావళి యనుగ్రంథమును జూచియుండలేదు. కనుక భద్రభూపాలునికాలము భావిపరిశోధనమునంగాని నిర్ణయింప సాధ్యము గాదు.

"గీ. ఎంత వారలియున్న నేరంపములు జీలు
గాలును దారకృత్యములకు నగునె
యితరు లెందరైన నేలిక కధికులై
చేయుపనులు పూని చేయఁగలరె."

"కం. జూదమును బన్నిదంబును
వాదును బలిశోడఁ దేఁడవలవదు కడుఁ బో
రాదయ్యె నేని భృత్యులు
భేదము గావింతు గెలుపు పెనుపఁగ వలయున్."

"కం. ధనమును భ్రాతశ్ఛాయయు
వనితాజనయౌవనంబు వండినయన్నం
బును గడుమూర్ఖస్నేహం
బును నిల నివి యల్పకాలభోగ్యము లరయన్."

"కం. దూరము వ్యవసాయులకు
భారంబు సమర్థులకును భాసురవిద్యా
పారగులకును విదేశము
వైరము ప్రియవాదులకును వసుమతిఁ గలదే."

"తే. విమతు లావెఱింగి వెలిపేసి తోడరుట
మిడుత లగ్గిమీఁదఁ బడినయట్లు
తోడులేక యధికుఁ దొడరుట యంబుధిఁ
గలము లేక యీఁదఁ గడఁగినట్లు."

"ఉ. కొందఱు మేలమాడుటలుఁ గొందఱు వావులుదెచ్చి పిల్చుటల్
కొందఱుముద్దుసేయుటయుఁ గొందఱునెయ్యపుఁజూపుసూచుటల్
కొందఱునాత్మభావమునఁ గొందఱునున్న భృత్యులందు ని
ట్లొందఱు నన్నిభంగుల నృపాగ్రణి వశ్యులఁజేయఁగా దగున్."

గురుమల్లికార్జున పండితారాధ్యుఁడు.

ఈయన పశ్చిమచాళుక్యచక్రవర్తులకడ దండనాథుఁడుగా నుండి సన్న్యసించి శ్రీశైలక్షేత్రమున మల్లికార్జునదేవుని సమ్ముఖంబున నివసించుచు ననేక శిష్యులకు వీరశైవమతమును బోధించి మతవ్యాపనమునకై వారిని దేశదేశములకుఁ బంపెను. ఆకాలమునం దీయనశిష్యవర్గమే కర్ణాటాంధ్రదేశములందు వీరశైవమతమును విజృంభింపఁ జేసిరి. బసవేశ్వరుఁడు మొదలగువా రీయన ప్రబోధమువలననే వీరశైవమతాభినివేశపరవశులై మెలంగిరని తేటపడఁ గలదు. ఈమహాత్మునింగూర్చియు, ఈయన శిష్యవర్గమునుగూర్చియు, వేనవేలు కథలు కల్పింపఁబడి వీరశైవులచే సంకీర్తనము సలుపఁబడుచున్నవి. పాటలుఁ బద్యములుఁ గీర్తనలు నెల్లెడల నల్లుకొని యున్నవి. ఈయనకు శిష్యులయెడం గల వాత్సల్యము నీయనయెడల శిష్యవర్గమునకుం గల భక్తియు నిరుపమానములుగ నున్నవి. ఈయన శిష్యులలో నొక్కఁడైన పాల్కురికి సోమనారాధ్యుఁ డితనియాజ్ఞను శిరసావహించి పండితారాధ్యచరిత్రమును విరచించెను. ఇందు శైవమతగురువులైన యారాధ్యులయొక్క కథ లత్యద్భుతముగా వర్ణింపఁబడినవి.

పాల్కురికి సోమనాథకవి.

పాల్కురికి సోమనారాధ్యుఁడు తన పండితారాధ్యచరిత్రమునందు వీరపోచేశ్వరుని పుత్త్రుఁడ నని చెప్పుకొనియున్నాఁడు. అనుభవసారములోఁ దాను గురులింగపుత్త్రుఁడ నని యీక్రింది—

"క. భృంగిరిటి గోత్రుఁడను గురు
లింగతనూజుండ శివకులీనుఁడ దుర్వ్యా
సంగవివర్జితచరితుఁడ
జంగమలింగప్రసాద సత్పాత్రుండన్."

అను పద్యములోఁ జెప్పుకొని యున్నాఁడు. వీరపోచేశ్వరునకు గురులింగదేవర యను నామాంతరము గలిగి యుండవచ్చును. ఇతఁడు గురుమల్లి

కార్జునపండితారాధ్యులవారి శిష్యుఁడగుటచేత నితఁడు మొదటిప్రతాపరుద్రుని కాలముననే యున్నవాఁడని నిశ్చయింపఁదగి యున్నది. ఆంధ్రకవులచరిత్రమునందు శ్రీవీరేశలింగముపంతులవాఁరితఁడు రెండవప్రతాపరుద్రునికాలమున నున్నవాఁడని పదునాలవశతాబ్దమునం దున్న పిడుగు సోమనారాధ్యుని వాక్యములం బురస్కరించుకొని వ్రాసియున్నారు. ఈగ్రంథముయొక్క మొదటి ప్రకరణమునం దట్టియభిప్రాయమును దెలిపితినిగాని యనేక హేతువులచేత నితఁడు మొదటిప్రతాపరుద్రుని కాలమువాఁడనియే యూహింపఁదగి యున్నది. ఈ పాల్కురికి సోమనాథకవి గొప్పపండితుఁడును, వేదాంతవేత్తయుఁ గవియుఁగూడ నైయున్నాఁడు. ఇతఁడు బసవపురాణము, పండితారాధ్యచరితము, అనుభవసారము, చతుర్వేదసారసూక్తులు, సోమనాథభాష్యము, రుద్రభాష్యము, బసవరగడ, గంగోత్పత్తిరగడ, సద్గురురగడ, చెన్నమల్లుసీసములు, నమస్కారగద్యము, వృషాధిపశతకము మొదలయిన గ్రంథములు రచించి యున్నాఁడు. వీనిలో బసవపురాణమును, పండితారాధ్యచరిత్రమును, ద్విపదకావ్యములనుగా వ్రాసియున్నాఁడు. ఇతని కవితాశైలి మనోహరమై యున్నది. ఇతఁడు స్మార్తవైష్ణవబ్రాహ్మణులకు వ్యతిరేకమైన మతమును బోధించినవాఁడగుచేత నితనిగ్రంథములు శైవులలోనే గాని ఇతరబ్రాహ్మణులలో విశేషముగాఁ బఠింపంబడుట లేదు. పరమతదూషణభాగములను విడిచి తక్కిన భాగములను జదివినయెడల నెట్టివారి కైన నాహ్లాదకరములుగానుండక మానవు.

“ జినసమయస్థుల శిరములు దునిమి
మును విష్ణుసమయుల ముక్కులు గోసి
యద్వైతులను హతహతముగావించి
విద్వేషబౌద్ధుల వి[..]తటమాడి
చార్వాకవాదుల గర్వంబు లణఁచి”

అనునిట్టివాక్యము[..] బసవపురాణమునం దుండుటచేతనే కాఁబోలును స్మార్తులును వైష్ణవులును [..]ని ముట్ట నొల్లకున్నారు. అయిన నాకాలమునందలి మత

చరిత్రములను దెలిసికొనఁగోరువారికిని సంఘసంస్కరణపరాయణచిత్తులగు వారికిని ముఖ్యముగా బసవపురాణమును, పండితారాధ్యచరిత్రమును బఠింపయోగ్యములుగా నుండుననుటకు సందియము లేదు.

కాకతిమహాదేవరాజు.

ఇతఁడు కాకతిరుద్రదేవుని తమ్ములలో జ్యేష్ఠుఁడు. కాకతిప్రోలరాజు ద్వితీయపుత్త్రుఁడు. తన యన్న యగు కాకతిరుద్రదేవుఁడు క్రీస్తుశకము ౧౧౯౬ వ సంవత్సరము వఱకు రాజ్యపరిపాలనము చేసి మృతినొందఁగాఁ గాకతిమహాదేవరాజు రత్నసింహాసనారూఢుఁడై మూఁడు సంవత్సరములు మాత్రమే పరిపాలనము చేసెను. ఇతఁడు తనయన్నగారయిన రుద్రదేవరాజు తండ్రిని జంపి రాజ్యము నేలుచున్నాఁడను ద్వేషముచేత నతనిం జంపి రాజ్య మాక్రమించుకొనవలయు నని పలుమాఱు ప్రయత్నించెను గాని యట్టి వైపరీత్యము గలుగకుండ మంత్రులు మొదలగువారు వారించుచుండిరి. తన్నుఁ జంపుటకై తమ్ముఁడు చేయుచుండఁగ పుంబనుల నన్నిఁటిని సైఁచి రుద్రదేవుఁడు వానిని క్షమించుచు వచ్చెను. అట్లు సైఁచుట యుక్తము గాదని మంత్రిపురోహితాదిజనంబు లెంత నొక్కిచెప్పినను రుద్రదేవుఁడు వారిమాటలను జెడచెవినిబెట్టి తమ్ముని నాదరించుచు వచ్చెను. తుదకు రుద్రదేవుని యనంతరము మహాదేవరాజు రాజ్యభారమును వహించి మూఁడుసంవత్సరములు మాత్రమే పరిపాలనముచేయుట సంభవించెను.

శౌణదేశాధీశ్వరుం డైన జైత్రపాలుఁ డను యాదవరాజు తనతండ్రి సింగభూపతికిఁ బిమ్మట క్రీ. శ. ౧౧౯౯ టవ సంవత్సరమున రాజ్యభారమును వహించి త్రిలింగదేశముపై దండెత్తి వచ్చెను. అప్పుడు కాకతిమహాదేవరాజునకును జైత్రపాలునకును ఘోరయుద్ధము జరిగెను. ఆ యుద్ధమునందు కాకతిమహాదేవరాజు వీరమరణము నొందెను. కాఁబట్టి కాకతిరుద్రదేవుఁడు క్రీ. శ. ౧౧౯౬ వ సంవత్సరమువఱకును, రాజ్యపరిపాలనముచేసెననుట వాస్తవము. రుద్రదేవమహారాజుకాలమునఁ గాని మహాదేవరాజుకాలమునఁ గాని, యాంధ్రదేశరాజధాని యగు ననుమకొండ నలంకరించియున్న సేనాధిపతులలో

నొక్క బేతిరెడ్డి, నామము అతనిసోదరుఁడైన నామిరెడ్డి నామమును దక్క మఱి యెవ్వరి పేరులును వినంబడక యున్నవి. రుద్రదేవరాజునకు సంతానము లేకపోవుటచేతనో మఱియేకారణముచేతనో యతని తరువాత మహాదేవరాజును అతనికుమారుఁడైన గణపతిదేవరాజును రాజ్యభారమును వహించిరి. గణపతిదేవరాజు తనతండ్రికిని యాదవరాజయిన జైత్రపాలునకును జరిగిన యుద్ధములోఁ దనతండ్రి మరణమునొందుటయేగాక తానుగూడ యుద్ధములో శత్రువులచేఁ జెఱఁబెట్టఁబడి తరువాత జైత్రపాలునిచే విడిచిపెట్టఁబడినట్లు జైత్రపాలునిశాసనమువలనఁ దెలియుచున్నది.

రేచెర్ల బేతిరెడ్డి - రేచెర్ల నామిరెడ్డి.

ఈమహావీరపురుషు లిరువురును మొదటిప్రతాపరుద్రదేవమహారాజునకు భృత్యులై భక్తితో నాతని సేవించుచు నామనగల్లుదుర్గమున కధిపతులై యుద్ధముల నజయ్యులై ప్రఖ్యాతిఁ గాంచినవారు. వీర లిరువురును సోదరులు. అయిన నిందెవఁడు పెద్దయో ఎవఁడు పిన్నయో నిశ్చయింప నాకరము గానరాక యున్నది. వీరి గృహనామము రేచెర్లవారని నామిరెడ్డి శాసనములవలనను, బేతిరెడ్డి భార్యయైన యెఱుకసానమ్మ శాసనమువలనను దెలియుచున్నది. వీరిశాసనములు నైజాము రాజ్యములోని నల్లగొండజిల్లాలో సూర్యపేట తాలూకాలో నున్న పిల్లలమఱ్ఱిగ్రామమునఁ గానంబడుచున్నవి. రేచెర్ల నామిరెడ్డి క్రీ. శ. ౧౧౯౫ దవ సంవత్సరమునఁ బిల్లలమఱ్ఱిగ్రామమునఁ దనతండ్రి కామయపేరిటఁ గామేశ్వరదేవుని, తనతల్లి కాచాంబపేరిటఁ గాచేశ్వరదేవుని తనపేరిట నామేశ్వరదేవునిఁ బ్రతిష్ఠాపనము చేసి గుళ్లుకట్టించి శాసనము వ్రాయించెను. ఆశాసనమునందు,

“శ్లో. నానావనీనాథ కిరీటకోటి రత్నాంశుభిశ్చుమ్బితపాదపీఠే
నిద్రుష్టమమ్భోనిధివేష్టితాం తాం విశ్వమ్భరాం శాసతి రుద్రదేవే.”

అని నానాదేశరాజుల కిరీటాగ్రఖచితములగు రత్నములకిరణములచే స్పృశింపఁబడిన పాదపీఠము గల రుద్రదేవుఁడు సముద్రవేష్టితమైనభూమిని బరి

పాలించుచున్నట్లు చెప్పఁబడియెను. ఈశాసనమందుఁ దనతల్లిదండ్రుల నామములనుమాత్రము పేర్కొనియెనుగాని తనవంశమును వర్ణించి యుండలేదు. తానెచ్చటివాఁడో తనకుంగలబిరుదావళు లెట్టివో వానిని సయితముఁ బేర్కొని యుండలేదు. అయినను క్రీ. శ. ౧౨౦౭ వ సంవత్సరమునందు బిల్లలమఱ్ఱిగ్రామమున నామేశ్వరదేవునికి భూదానము చేసి మఱియొక శాసనము వ్రాయించెను. ఈశాసనములోఁ దనవంశమును, తనకుం గల బిరుదావళులను పేర్కొనెను. ఇతనివంశవర్ణనమునందు మొదట నీక్రిందిశ్లోకము గనఁబడుచున్నది.

“శ్లో. శ్రీమత్పద్మజపాదపద్మయుగళా ల్లోకత్రయాభ్యర్చితా
దుద్భూతే విపులే కులే నరవరో భీమాభిధానోఽభవత్
యః కాఞ్చీనగరీకవాటహరణం కృత్వా ప్రచణ్డాహవ
క్రీడశ్చోడనరాధిపస్య కృతవా న్స్థానచ్యుతోన్మూలనమ్.”

శ్రీమత్కమలాసనుపాదపద్మమునుండి యుదయించిన జాతి(శూద్రవంశము)లో భీముం డనునరవరుఁ డుదయించి కాంచీనగరకవాటము భేదించి చోడనరాధిపునితో గొప్పయుద్ధముఁ జేసి విజయము గాంచినవాఁడని తాత్పర్యము. ఈశ్లోకమునుబట్టి యితనిపూర్వులు రాజకీయాధికారపదవులయందుండి యుద్ధములను జేసి ప్రసిద్ధికెక్కిన వారనియే తలంపవలసి యున్నది. ఈభీమరాజువంశమున ముంజరాజును, అతనికిఁ గాటరాజును, అతనికిఁ గామరాజును, అతనికిఁ గాచాంబయందు నామిరెడ్డియు జనించెను. ఇతనిశాసనములలో నెచ్చటను బేతిరెడ్డినామము గానంబడదు. “సకలగుణగణాలంకార, ఆమనగంటిపురవరేశ్వర, వీరలక్ష్మీనిజేశ్వర, దోర్బలభీమ, రణరంగరామ, వితరణకర్ణ, శౌర్యసంపన్న, పతిహితాంజనేయ, శౌచగాంగేయ, సత్యరత్నాకర, దుష్టజనభీకర, మనుమకులాదిత్య, సుభటసంస్తుత్య,” అనుబిరుదు లితనికిఁ గలిగియున్నట్లుగా నీశాసనమునం బేర్కొనఁబడియెను. మఱియు నీశాసనమునందు.—

“శ్లో. రాజ్యే నుతే గణపతే ర్నృపతే స్సుజాతే
విద్వద్గణప్రణుత సద్గుణరత్నవార్ధేః

కాన్తిప్రతాపవిభవాద్దదతః ప్రభావం
వ్యక్తం జనే శిశిరధామ సహస్రధామ్నోః. ''

అని గణపతిదేవరాజును బేర్కొనియుండుటచేత నితఁడు గణపతిదేవుని రాజ్యప్రారంభకాలమునఁగూడ నున్నవాఁడని వేద్యమగుచున్నది. క్రీ. శ. ౧౨౦౮దవసంవత్సరములో బేతిరెడ్డిభార్య ఎఱ్ఱకసానమ్మశాసనములో నామిరెడ్డిశాసనములోని వంశావళియే సరిగాఁ జెప్పఁబడినదిగాని తుదను గామిరెడ్డికిని, కాచమ్మకును ఆమెభర్త యైనబేతిరెడ్డిజనించె నని చెప్పఁబడినది. నామిరెడ్డిపేరైనలేదు. మఱియును నామిరెడ్డిశాసనములో నామిరెడ్డికింగల బిరుదావళులే బేతిరెడ్డికిని జెప్పఁబడియెను. ఇంతియగాక యెఱ్ఱకసానమ్మశాసనమునాఁటికి బేతిరెడ్డి బ్రతికియున్నట్టు గన్పట్టదు. అదియునుంగాక యామెశాసనములో ఎఱ్ఱకసానికి బేతిరెడ్డివలన మల్లారెడ్డి యనుకుమారుఁడు జనించె నని చెప్పఁబడుటయేగాక యాతని గుణవిశేషాదులును, పౌరుషపరాక్రమములును వర్ణింపఁబడినవి. ఈశాసనములు మూఁడింటిని బరిశీలింపఁగా నీక్రిందివిధమున దోఁచుచున్నది. క్రీస్తుశకము ౧౧౯౫దవ సంవత్సరమున బేతిరెడ్డి యామనగల్లుదుర్గమున కధిపతియై పరిపాలనముఁ జేయుచు ఎఱ్ఱకసానిశాసనములో నుదాహరింపఁబడిన బిరుదావళులను వహించియుండె ననియు, ఆకారణముచేత నతని తమ్ముఁడైన నామిరెడ్డి యప్పటి కాబిరుదములను వహించి యుండలే దనియు, ౧౨౦౩వసంవత్సరము నాఁటికి నామిరెడ్డి యాబిరుదములను వహించియుండుటచేత నప్పటికి బేతిరెడ్డి మృతినొందియుండె ననియు, అతని మరణానంతరము తమ్ముఁడాబిరుదములనే వహించి యామనగల్లుదుర్గమున కధిపతియై యుండె ననియుఁ దేటపడుచున్నది. ఎఱ్ఱకశాసనమునాఁటికి అనఁగా ౧౨౦౮దవ సంవత్సరమువఱకు బేతిరెడ్డి బ్రదికియే యున్నయెడల ౧౨౦౩వసంవత్సరమున నతనితమ్ముఁడైన నామిరెడ్డి యన్నగారిబిరుదములను వహింపఁజాలఁడు. తనకును దనసోదరునకు నట్టిభేదభావమే లేనియెడల ౧౧౯౫దవ సంవత్సరమున నట్టిబిరుదావళులు ధరింపకుండుట తటస్థింపదు. కాఁబట్టి రేచెర్లబేతిరెడ్డి మొదటిప్రతాపరుద్రునికాలములోనే యుండెను గాని గణపతిదేవచక్రవర్తికాలములో

లేఁడని చెప్పవలసివచ్చుచున్నది. ఎఱ్ఱకసాని పిల్లలమఱ్ఱిగ్రామములో ఎఱకేశ్వరునిబ్రతిష్ఠించి భూదానములను జేసెను. రేచెర్లబేతిరెడ్డికి ఎఱ్ఱకసానియందు జనించిన మల్లారెడ్డినిగూర్చి ఎఱ్ఱకసానిశాసనములో నిట్లభివర్ణింపఁబడియెను.

"శ్లో. యస్యాః పుత్త్రః పవిత్రోన్నతనుతచరితోద్భూతసుఖ్యాతకీర్తి
స్స్వస్సః ప్రోల్లాసితశ్రీ ర్వితతవితరణ శ్శస్త్రశాస్త్ర ప్రగల్భః
స్వేనోర్వీలూనయుద్ధోద్భటపటుచటులాఖర్వగర్వారివీర
వ్రాతాస్యాంభోజరాజిప్రవిహితవిజయ శ్శ్రీపదాంభోజపూజః."

ఎఱ్ఱకసానికొడుకైన మల్లారెడ్డి పరిశుద్ధమైన యుత్తమచరిత్రముచేత విశేషయశస్సును మహాసంపదలను బొంది దాతయై శస్త్రశాస్త్రములయందుఁ బ్రగల్భుఁడై రణరంగమునందుఁ దనచే ఖండింపఁబడిన శత్రువీరుల ముఖకమలములచే విజయలక్ష్మీపాదముల నర్చించినాఁడని యీశ్లోకమునకుఁ దాత్పర్యము. ఇట్టి గుణవిశేషములచే నొప్పుచున్న పుత్త్రుఁడప్పటికి యౌవనవయస్కుండై యుండవలయును గాని కేవలము బాలుఁడై యుండఁజాలఁడు. ఇతఁడుగాక మఱికొందఱు పుత్త్రు లుండినయెడల వారలు పేర్కొనఁబడియేయుందురు. అట్టివారిపేరు లెవ్వరివియుఁ బేర్కొనఁబడియుండకపోవుటచేతను వారలకు మల్లారెడ్డి యనుపుత్త్రుఁ డొక్కఁడే కలఁడని నిశ్చయింపవలసి వచ్చుచున్నది. రేచెర్లబేతిరెడ్డినిగూర్చి శాసనములవలన గ్రహింపందగిన చరిత్ర మింతయే. బేతిరెడ్డి ౧౧౯౫వ సంవత్సరమునకుఁ దరువాత మృతినొంది యుండవలయును. ౧౧౯౬వ సంవత్సరము మొదలుకొని మొదటి ప్రతాపరుద్రుని సోదరుఁడగు మహాదేవరాజు ౧౧౯౯దవ సంవత్సరమువఱకుఁ బరిపాలనముచేసి యాసంవత్సరమున దేవగిరిరాజయిన జైత్రపాలునితో జరిగిన యుద్ధమునందు మృతినొందెను. ఆమనగంటిప్రభువయిన బేతిరెడ్డికూడ మహాదేవరాజుతో యుద్ధమునకుఁబోయి మరణమునొంది యుండవలయును. ఈ రేచెర్లబేతిరెడ్డినిగూర్చి యనేకగాథలు చిత్రవిచిత్రములుగా బట్టులచేఁ గల్పింపఁబడి పాటలు పద్యము లల్లఁబడి బేతాళనాయనివంశీయుల మని చెప్పుకొను

వారిచే గ్రంథస్థములు గావింపఁబడి సర్వత్ర వ్యాప్తి చేయఁబడి సత్యమైన చరిత్రాంశములను గప్పిపెట్టుచున్నవి.

శ్రీ వెలుగోటివారి వంశచరిత్రము.[1]

ఈ బేతిరెడ్డినిగూర్చి శ్రీ వెలుగోటివారివంశచరిత్రమునం దీక్రిందివిధముగా వ్రాయఁబడి యున్నది.

"వీరికి మూలపురుషుఁడు బేతాళనాయఁ డనిప్రఖ్యాతి గాంచిన చెవ్విరెడ్డి అనురాజు. ఈరాజు ఘనతఁ గాంచిన కాకతిగణపతి దేవుని రాజ్యకాలమున శౌర్యధైర్యాదిలోకోత్తరగుణగణపరిపూర్ణుఁడై యామహారాజువలన మిగుల మన్ననఁగాంచుటయే గాక యనేకబిరుదములను మఱికొంత రాజ్యమును గాంచినవాఁడు. ఈఘనుఁడు వర్తమాన వేంకటగిరిసంస్థానాధిపతు లగు శ్రీశ్రీ రాజ గోపాలకృష్ణయాచేంద్రబహాదుర్ కె. సి. ఐ. ఇ. వారికి నిరువదియెనిమిదవ తరమువాఁడు. ఈరాజశిఖామణి యీ వెలుగోటిశాఖకుమాత్రమే గాక జటప్రోలు, బొబ్బిలి, పిఠాపురము, మైలవరము, మొదలగు సంస్థానాధిపతులకు మూలపురుషుఁడు."

ఇయ్యది బట్టులుఁ వ్రాసిన వ్రాఁతలను నమ్మి యవిచారపూర్వకముగా వ్రాయఁబడిన వ్రాఁతవలెఁ గాన్పించుచున్నదిగాని సహేతుకమైన ప్రమాణముతోఁ గూడినదిగఁ గానంబడదు. సోమదేవరాజీయమునందును, పద్మనాయక చరిత్రమునందును, వేంకటగిరివారివంశావళి గ్రంథమునందును, రావువంశీయులచరిత్రమునందును, వీని నన్నిటిని బరిశీలించి సంస్కరణముగావించి నూతనముగాఁ బ్రకటింపించిన వేంకటగిరి రాజులవంశచరిత్రమునందును, పిల్లలమఱ్ఱి శాసనములో నుదాహరింపఁబడిన బేతిరెడ్డియే వైసంస్థానాధిపతుల మూలపురుషుఁడైన బేతాళనాయఁడనిచూపించిన హేతువులు పరస్పరవిరుద్ధములై

1. ఈగ్రంథము పద్మనాయకచరిత్రము, పద్మనాయకచరిత్రమునుబట్టి వ్రాయింపఁబడిన వేంకటగిరి వారివంశావళి, ఆరెంటి ననుసరించి వ్రాయఁబడిన రావువంశీయులచరిత్రము మొదలగు గ్రంథములలోఁ దమవంశమునుగూర్చి యసందర్భము లయిన విషయములు గలవని యూహించి శ్రీవేంకటగిరిమహారాజు గారు శ్రీ వెల్లాల సదాశివశాస్త్రులవారిచేతను, శ్రీ అవధానము శేషశాస్త్రులవారిచేతను నూతనముగా వ్రాయించినది.

యుక్తికిని సత్యమునకును దూరములై యున్నవి మఱియు నీగ్రంథముల లో నసత్యము లైనట్టియు, నసందర్భము లైనట్టియు, విషయము లెన్నో యవిమర్శనపూర్వకముగాఁ జొప్పింపఁబడినవి. వానిని జక్కఁగా విమర్శించి యాథార్థ్య మిట్టిదని లోకమునకు వెల్లడిచేయకుండిన యెడల జనసామాన్య మా గ్రంథములలోని గాథలనే పరమప్రమాణములుగా శిరమునహింతురు. అందువలన సత్యమైనచరిత్రవ్యాపనకుఁ బ్రతిబంధకము గలుగును. కాఁబట్టి యీ బేతిరెడ్డికిఁ జెవిరెడ్డి యనునామము లేదనియు, బేతిరెడ్డి వేంకటగిరి, మైలవరము, పిఠాపురము, బొబ్బిలి సంస్థానాధిపతులకు మూలపురుషుఁ డని చెప్పఁబడు బేతాళనాయఁడు కాఁ డనియు, సహేతుకముగా నిరూపింపఁబోవుచున్నాను.

చెవిరెడ్డి గాథ.

(1) ఈరేచెర్ల బేతిరెడ్డికి బేతిరెడ్డియనియే జన్మనామముండెనుగాని చెవిరెడ్డి యను జన్మనామము లేదని బేతిరెడ్డి భార్యయైన యెఱ్ఱకసానమ్మశాసనములో—

"శ్లో. తస్మాత్తస్యాం సమజని మహాదేవపాదాబ్జభక్తః
ఖ్యాతో బేత స్తతవితరణప్రీణిత ప్రాణివర్గః
ఆశాచక్రే ప్రవితత శరచ్చంద్రిసాంద్రాంశురమ్యా
యా స్యాత్యర్థం జనసుఖసముత్పాదినీ భాతి కీర్తిః."

అని సంస్కృతమునందును, 'శ్రీమతు రేచెర్ల పిల్లలమఱ్ఱి బేతిరెడ్డిపెండ్లము' అని తెలుఁగునందును, ప్రయోగింపఁబడిన బేతిశబ్దముచేతనే స్పష్టమగుచున్నది. కాఁబట్టి ప్రకృతము నైజాము రాజ్యమునకుఁ జెందియున్న నల్లగొండమండలములోని యామనగల్లు రాజధానిలోను, ఆమనగంటి కుత్తరభాగమున రెండుక్రోశములదూరములో నున్న పిల్లలమఱ్ఱి రాజధానిలోను వసించి యీ ప్రదేశమేలినవాఁడు బేతిరెడ్డియే కాని బేతాళనాయఁ డను నామాంతరముగల చెవిరెడ్డి మాత్రము కాఁడు.

(2) ఇతనికిఁ జెవ్విరెడ్డి యను జన్మనామము మాఱి బేతాళనాయఁడను బిరుదనామము గలుగుటకుఁ గారణ మత్యద్భుతముగా నీక్రిందివిధమున శ్రీ వెలుగోటివారివంశచరిత్రమునందుఁ దెలుపఁబడియున్నది. బేతిరెడ్డికిఁ బూర్వమునఁ బదవతరమువాఁ డగు హేమాద్రిరెడ్డి మహాభుజపరాక్రమము గలవాఁడై రాజ్యపరిపాలనము సేయుచుఁ గోట్లకొలఁది ధనము గడించి యామనగంటి కుత్తరభాగమున 2 మైళ్లదూరమున నొకచోట భూమిలోఁ బాతిపెట్టి వాని పై నొక వేదిక గట్టించి యందు నొకవటవృక్షమును వేసి దానిక్రింద నొక భైరవుని బ్రతిష్ఠించి 'ధనమును గాపాడి తనకులములో జనించినవారిలో సద్గుణగరిష్ఠుండును సత్కర్మనిష్ఠుండు నై కులదీపకుం డగువానికి సంఘటిల్లఁజేయవలయు నని ప్రార్థించి తనయభిప్రాయము దెలియునట్లు భూమిలో గుప్తముగ నొక శిలాశాసనమును స్థాపించెనఁట! అనంతరము కొంతకాలమునకు వానివంశమునఁ జెవ్విరెడ్డి యుదయించి లోకోత్తరవీర్యసంపన్నుఁడై చండమార్తాండుని చందమునఁ దేజరిల్లుచు రాజ్యముచేయుచుండి యొక్కనాఁడు మృగయావినోదార్థమై వెడలి పరిజనంబు వెనుకదిగంబడిన నొక్కఁడుగా హేమాద్రిరెడ్డి ధననిక్షేపముచేసినప్రాంతంబునకు దైవికంబుగఁ బోయెనఁట! అచట నీతని పోష్యవర్గములోఁ జేరిన రేచఁ డను నొకమాలవాఁడు భూమి దున్నుచుండి దైవాధీనముగ హేమాద్రిరెడ్డిస్థాపించిన శిలాశాసనము నాఁగేటికొనకుఁ దాఁకి బయల్పడఁగా వాఁడు తన యేలికపోవుచుండుటను జూచి యావృత్తాంతం బంతయు విన్నవించెనఁట! అంత చెవిరెడ్డి యచ్చటికిఁబోయి యాశిలాశాసనము నవలోకించి యావద్వృత్తాంతమును దెలిసికొని యాధనము గైకొనుటకై ప్రయత్నింపఁగా నాచెంత నున్న వటవృక్షము నాశ్రయించుకొని యున్న బేతాళుఁ డాయన ధైర్యమును బరీక్షించుటకై మాయాతిమిరమును మేఘములు నుఱుములు మెఱుములు వానయు గాలియుఁ గల్పించి పిడుగులుపడునటులఁ జేసెనఁట! అంతియగాక యా వటవృక్ష మాతనియెదుటఁ గూలఁద్రోచెనఁట! అప్పుడు రేచఁడు మూర్ఛిల్లెనఁటగాని చెవిరెడ్డి భీతిల్లక నిలువంబడఁగా బేతాళుఁడు ఘోరాకృతినిఁబూని చెవిరెడ్డిమీఁదికి రాఁగా నాతఁడు

జంకక సుస్థిరచిత్తుఁడై కోపోద్దీపితమానసుండై ప్రచండతరవేదండశుండాదండంబుపగిదిఁ దేజరిల్లు నిజభుజాదండంబున మృత్యుజిహ్వాగ్రంబు ననుకరించు నట్టి మండలాగ్రంబునెత్తి ఖండింప నుద్యమింపఁగా బేతాళుండు వాని శౌర్యధైర్యసాహసంబులకు మెచ్చుకొని నిజరూపముతోఁ బ్రత్యక్షుఁడై తనపేరు చెప్పి 'నీధైర్యంబునకు మెచ్చితి నీవుకోరినవరంబునిచ్చెద వేఁడు' మనియెనఁట! అంత చెవిరెడ్డి తనవంశమువారికి శాశ్వతైశ్వర్యము, రాజ్యభోగము, శౌర్యధైర్యాదిగుణసంపత్తి గలుగవలయు ననియు, వారు యుద్ధమునకుఁ బోవునపుడు వారికి సహకారముగా ముందు బేతాళుఁడు నడువవలయు ననియుఁ గోరఁగా నతం డావరములనొసంగి యంతర్ధాన మందెనఁట! పిమ్మటఁ జెవిరెడ్డి ధనము గైకొనుటకుఁ బ్రయత్నింపఁగాఁ దనపూర్వునిచేఁ బ్రతిష్ఠింపఁబడిన భైరవమూర్తి 'ఓయీ! ధనముగైకొన నీవర్హుండ వగుదువుగాని దీనిని కొన్నిభూతము లాశ్రయించుకొని యున్నవిగాన నరబలియిచ్చి గైకొనుట శ్రేయోదాయకమని చెప్పి యంతర్హితుం డయ్యెనఁట! అంతట నారాజు నరహత్యకుఁ జింతించుచుండఁగా భైరవునిపల్కులు విన్నవాఁడుగావున రేచఁ డనుమాలవాఁడు తన్ను బలియిచ్చి ధనము గైకొనుమని ప్రార్థించెనఁట! ఇంతకాలము నిన్నుఁ బెంచిన నే నాత్మసుఖమునకై నిన్నెట్లు బలియిత్తు నని చెప్పఁగా రాజుల ధనము లోకహితమునకైనదిగాని కేవల మాత్మసుఖమునకైనదికాదుగాన ధర్మజ్ఞుల రయిన మీరు నాకోరినవరంబు లొసంగి నన్ను బలియిచ్చిన మీకెంత మాత్రము దోషము ప్రసక్తింపదని రేచఁడు ప్రత్యుత్తర మొసంగెనఁట! అందులకాతఁ డొడంబడియెనఁట! తనవంశమువారిని చెవిరెడ్డివంశమువారు పోషించుచు వారిగృహములలో వివాహములు జరుగునపుడు ముందుగాఁ దనవంశము వారికి వివాహములు జరుపవలయు నని రేచఁడు వర మడిగెనఁట! ఆవరము నొసంగి చెవిరెడ్డి వానిని బలియిచ్చి యాధనము గైకొనియెనఁట! పదంపడి యాతం డచ్చట సర్వపాపఘ్నముగా శివాలయంబు నిర్మింపించి శివప్రతిష్ఠ గావించెనఁట! ఈ వృత్తాంతము నంతయు విని యోరుఁగంటి నేలుచుండిన గణపతిదేవమహారాజు చెవిరెడ్డిని రప్పించి యతని యసహాయశూరత్వమునకు

మెచ్చుకొని యామనిగంటి రాజ్యముతోఁ జేరిన లక్కసీమను, గజహయాదులను, కల్కితురాయిని, కిరీటమును, కాలికి గండపెండేర మనెడు బిరుదాభరణమును, ఛత్త్రచామరములను, బంగారుపూఁతపని గలయొక చాకలికత్తిని బహుమతిగా నొసఁగి, పిల్లలమర్రి బేతాళనాయఁడను పౌరుషనామమిచ్చి పంపించెనఁట! ఆకత్తి యిప్పటికి సంస్థానములోఁ బూజింపఁబడుచున్నదఁట!

ఇది వేంకటగిరిరాజులవంశచరిత్రమును వ్రాసిన గ్రంథకర్తల యొక్క నవీనకల్పన మని ఘంటాపథముగఁ జెప్పవచ్చును. ఇదివఱకుఁ బద్మనాయకచరిత్రము నందును, వెలుగోటివారివంశావళి యందును, రావువంశీయుల చరిత్రమునందును వ్రాయఁబడిన గాథలకుఁ బ్రత్యక్షవిరుద్ధముగా నున్నది. ఆ గ్రంథములలోని యా సందర్భము లైనగాథలను జూచి వీరిట్టి నవీనకల్పనకు వెనుదీయరైరి. హేమాద్రిరెడ్డి ధనమును బాతిపెట్టి శిలాశాసనము వ్రాయించె ననునది వీరు కల్పించిరి. చెవిరెడ్డి బీదవాఁడై గూరుఁగంటిలో వీరభటుఁడై కొన్నిదినములు గడపె నని పూర్వగాథలలో నున్నది.

"ఉ. అంత నకించనాప్తిని మహాబలుఁ డప్పుడు బేరిసీములో
వింతగ నింపుసొంపెసగఁ వేములు నామునగంటిలోపలన్
పంతము మీఱఁ జౌదరులపాటిని నాడకుఁ బిన్నపెద్దయై
కొంతవహించె నచ్చటను గోరికఁ దా వ్యవసాయసాయతిన్."

అని వేంకటగిరివంశావళి గ్రంథమున వ్రాయఁబడినది. "అట్టి వ్యయసాయమునకుఁ బాలికాఁపుగా రేచఁ డనునొక పంచముని నిర్ణయించి యుంచెను. నిత్యమును వానికి నియోగింపవలసినపనులు నిర్ణయించి చెప్పుచుండును." అని రావువంశీయులచరిత్రమునందు వ్రాయంబడి యున్నది. చెవిరెడ్డి యానతిని రేచఁడు నాగభైరవునిగుడికడ నున్న యొకపొలమును దున్నుచుండఁగా నాగఁటికిఁ దగిలి యొకశాసనము గనుపట్టె ననిమాత్రమే చెప్పఁబడినది. చెవిరెడ్డి యాశాసనమును జదివి రేచనితో రెండులక్షల ధన మున్నదని చెప్పినట్లుగా పద్మనాయకచరిత్రములో నీక్రింది పద్యములో:—

"చ. కనుగొనివచ్చి రేచఁ డతికౌతుకమొప్పఁగ రెడ్డిసన్నిధిన్
వినుతవిధేయుఁడై యపుడు వేడుకమీఱఁగ విన్నవింపఁగా
ఘనుఁ డరుదెంచి చూచి కుతుకంబున సొంతముగాఁ బఠించి తా
ననియెను రెండులక్షలపదార్థము లుండెనటంచు వానితోన్."

అని వ్రాయఁబడినది. కాని వేంకటగిరివంశావళిలో:—

"గీ. కడురయంబున రేచనిఁ గాంచి యచట
గంటె నవలక్షవిత్తంబు గలదు నరుని
బలి యొసఁగి దీనిఁ గైకొనవలయు ననుచు
వ్రాసియున్నది నిక్క మీశాసనమున."

అని రేచనితోఁ జెవిరెడ్డి చెప్పినట్లు భేదముగా నున్నదిగాని హేమాద్రిరెడ్డి ప్రశంస నెవ్వ రెత్తియుండలేదు. రేచఁడు మూఁడువరములు గోరినట్లు పద్మనాయకచరిత్రమునందును, నాలుగు వరము లిచ్చినట్లు వేంకటగిరివంశావళి యందును జెప్పఁబడి యుండఁగా వేంకటగిరిరాజులవంశచరిత్ర మను నీ నూతనగ్రంథమున నొక్కవరమే పేర్కొనఁబడి యున్నది. తక్కినవరముల సంగతులు నామిరెడ్డి, ఎఱ్ఱక్కసానిశాసనములవలన నసత్యములుగ నేర్పడినవి గనుకను, వారియిండ్ల వివాహములు జరుగునప్పుడు మాలవాండ్రకుఁగూడ వివాహముచేయు నాచారము ఇప్పటికిఁగూడ జరుగుచున్నది గనుక నీవివాహవరమును మాత్రమే పేర్కొని రేచనిపేరిట రేచెర్లగోత్రముఁ బెట్టుకొనుట మొదలగునవి విడిచిపెట్టవలసి వచ్చినది. కాకతిగణపతిదేవరాజు చెవిరెడ్డిని సమ్మానించిన తరువాత,

"క. నాఁడాదిగ సుకవీంద్రులు
వేడుక బేతాళుఁ డనుచు వేమఱు దిశలన్
బోఁడిమి నుతింప విమతుల
గోడక యవ్విభుఁడు ధాత్రి నొగిఁ జెలువొందెన్."

అని చెప్పఁబడి యుండఁగా నూతనగ్రంథమునందు బేతాళనాయఁడని గణపతిదేవుఁడు పౌరుషనామ మొసంగె నని చెప్పఁబడియున్నది. ఇట్టి గ్రంథము

లందుఁ బరస్పరవిరుద్ధము లైన విషయము లనేకములు గలవు. ఇదివఱ కున్న వేంకటగిరివంశావళి మొదలగు గ్రంథములలోని గాథలు చరిత్రాంశములకు విరుద్ధములుగ నున్నప్పుడు విశ్వసింపకపోయిన భంగములేదుగాని యాగాథలను మార్చి వేఱువిధముగఁ జెప్పుటకుఁ గారణమేమి? పద్మనాయకచరిత్రములో మూలపురుషుఁ డాదిజగన్నాథరావని చెప్పఁబడియుండఁగా హేమాద్రిరెడ్డి యని నూత్నగ్రంథమునఁ జేర్కొనియున్నారు. చెవిరెడ్డి తండ్రి పోలిరెడ్డియని,

"క. ఆపరమపావనాన్వయ
దీపకుఁడై పోలిరెడ్డి ధృతి జనియించెన్
ఆపుణ్యగుణవరేణ్యుం
డేపునఁ జెవిరెడ్డిఁ గనియె నిల వినుతింపన్."

అని పద్మనాయక చరిత్రమునఁ గానంబడుచున్నది.

ఆదిజగన్నాథరావు పోలిరెడ్డి నామములుగాని, హేమాద్రిరెడ్డి నామముగాని, రేచెర్లనామిరెడ్డి ఎట్టకసాని శాసనములలోఁ గానరావు. ఇవన్నియు నటుండనిచ్చి యొక్క విషయమును విమర్శించి చూతము. చెవిరెడ్డికి బేతాళనాయఁ డను బౌరుషనామమును గణపతిదేవుఁ డెప్పు డొసంగెనో విమర్శించి తెలిసికొనుట త్యావశ్యకమై యున్నది. ఎట్టకసాని శాసనము నాఁటికి అనఁగా క్రీ. శ. ౧౨౦౯దవ సంవత్సరము నాఁటికి ఎట్టకభర్త బేతిరెడ్డి యనియే చెప్పంబడి యుండుటచేత నంతకుఁ బూర్వమే యీ వృత్తాంతమంతయు నడచి యుండవలయునుగదా. చెవిరెడ్డియొక్క యిట్టి ప్రసిద్ధకృత్యముల నేనిని ఎట్టక తన భర్తను వర్ణించు సందర్భమున వర్ణింపకుండుటకుఁ గారణ మేమి? మఱియు వితరణకర్ణ, శౌచగాంగేయ, సత్యరత్నాకర, దుష్టజనభీకర, వీరలక్ష్మీనివేశ్వర యను బిరుదములను బేతిరెడ్డి వహించియుండె నని యామె శాసనముంబట్టి దెలియుచున్నది గదా! ఇట్టి వితరణకర్ణుఁడు, శౌచగాంగేయుఁడు, దోర్బలభీముఁడు, రణరంగరాముఁడు, శౌర్యసంపన్నుఁడు నైన బేతనదండనాథుఁడు తా నైశ్వర్యసంపన్నుఁడై యుండియు, ప్రభువై యుండియు, తుచ్ఛధనమునకై తనయందు భక్తి విశ్వాసములు

గలిగి యనేక సంవత్సరములుగాఁ దనచేఁ బోషింపఁబడుచున్న బలియిచ్చి ధనము గైకొను మని చెప్పునంతటి విశ్వాసపాత్రుని రేచఁ డనువానిని క్షుద్రదేవతల ప్రీతికై సంహరించె ననుమాట విశ్వసించుట కెంతమాత్రము నొప్పి యుండలేదు. ఎట్టకసానిశాసనము నాఁటికి గణపతిదేవుని పరిపాలనము ప్రారంభమై పది సంవత్సరము లయ్యెను. ఈలోపలనే బేతిరెడ్డి యను బేతాళనాయనికి గణపతిదేవునివలన సమ్మానములు గలిగి పైబిరుదములు వహించుట తటస్థమయ్యె నని చెప్పవత్తురేమో? అదియు విమర్శింతము. ౧౨౦౯దవ సంవత్సరమున బేతిరెడ్డి కలంకరింపఁబడిన బిరుదములు ౧౨౦౨వ సంవత్సరమున నామిరెడ్డిగూడ వహించి యుండెను. వెలుగోటివంశచరిత్రకారులు నామిరెడ్డి బేతిరెడ్డి కన్న యని యూహించుచున్నారు. కాఁబట్టి పైకార్యములకు బిరుదములకు నెట్టిసంబంధము లేదు. నామిరెడ్డినామము బేతిరెడ్డికి నామాంతర మని చెప్పుటకు వలను గాదు. నామిరెడ్డి భార్య యైతాంబ యని చెప్పఁబడినదిగాని యెట్టక యని చెప్పఁబడి యుండలేదు. వాదముకొఱకు నామిరెడ్డి బేతిరెడ్డి కన్న యనియే యొప్పుకొందము. అతఁడు వహించిన బిరుదముల చేతను జ్యేష్ఠుఁ డగుటచేతను ౧౨౦౩ వ సంవత్సరమున నామనగల్లు ప్రాంతదేశము నతఁడే పరిపాలించుచుండె నని చెప్పక తప్పదు. అన్న పరిపాలనము చేయుచుండ తమ్మునికిఁ గిరీటమునిచ్చె ననుట యసందర్భము గాదా. వాస్తవముచేత నామనగంటిప్రభువులు కిరీటాధిపతులు గారు. కిరీటాధిపతు లని యొకవేళ నంగీకరించినను జ్యేష్ఠుఁడు పరిపాలనము సేయుచుండఁగాఁ గిరీట మొసంగె ననుట ధర్మవిరుద్ధము. అప్పటికి నామిరెడ్డిగూడ మృతి నొంది యుండవచ్చు నని చెప్ప సాహసింపవచ్చును. అట్లయినచో జ్యేష్ఠునిరాజ్యముతోఁగూడ కిరీటాదిరాజచిహ్నములు తమ్మునికి సంక్రమింపక మానవు. అట్టి కిరీటాది రాజచిహ్నములను వహించి యుండఁగా మరలఁ గిరీటము నొసంగ నవసరము లేదు. ఎట్టకసానిశాసనమున నామె భర్తయొక్క శౌర్యవితరణాదిగుణగణంబు లభివర్ణింపఁ బడియెనుగాని యతఁడు కిరీటాధిపతి యని యభివర్ణింపఁబడి యుండలేదు. మఱియు,

"శ్లో. రాజత్కీర్తేర్గణపతినృప స్యాఖిలోర్వీశచూడా
రత్నవ్రాతద్యుతితతిసముద్భాసితాఙ్ఘ్రిద్వయస్య
సన్మర్యాదానిరతనిఖిలక్ష్మాజనే వర్తమానే
రమ్యే రాజ్యే విపులసుఖదే ప్రోన్నతస్య ప్రహర్షైః."

సమస్తభూపతుల కిరీటరత్నకాంతులచేఁ బ్రకాశింపఁ జేయఁబడిన పాదయుగ్మము గలిగి ప్రహర్షముచే నిండియున్న గణపతిదేవుని రాజ్యకాలమున అని మాత్రము చెప్పిన తరువాత నామెదానధర్మమును గూర్చి ముచ్చటింపఁబడియెను. అంతియగాని తన భర్తయైన బేతిరెడ్డి గణపతిదేవచక్రవర్తివలన విశేషరాజ్యవైభవములను గిరీటమును దక్కుంగల యాయుధవిశేషంబులను బడసినట్లు చెప్పియుండలేదు. ఇంక నామిరెడ్డి శాసనమున గణపతిదేవచక్రవర్తి వర్ణింపఁబడిన పిమ్మట,

"శ్లో. తస్య ప్రసాదా త్పృథువైభవస్య
పృథుప్రదానస్య విభోః పృథుశ్రీః
నామః కృతి స్తుత్యగుణాభిరామః
కాచామ్బికాసూను రనూనసత్త్వః."

అని గణపతిదేవునియొక్క ప్రసాదముచేతనే యధికవైభవమును, అధికసంపదయును, మొదలగువానిం బడసినట్లు చెప్పఁబడి యున్నది. ఇట్లే మొదటిశాసనమునఁ బ్రతాపరుద్రునిప్రసాదముచేత నామిరెడ్డి యైశ్వర్యమును బొందెనని చెప్పఁబడి యున్నది. ఏతత్ప్రసాదవైభవముచేతనే నామిరెడ్డి పిల్లలమర్రి గ్రామంబునగట్టించిన కామేశ్వర కాచేశ్వర నామేశ్వర దేవాలయంబులేకశిలనగరంబునఁ బ్రతాపరుద్రుండు నిర్మింపించినయాలయత్రయంబుచందంబున నత్యున్నతములై లోకోత్తరశిల్పంబుతో గురువిందశిలామయములై వెలయుచున్నవి. ఎట్టకేలకు నీశాసనము నాఁటికి బేతిరెడ్డి మరణమునొందియుండుటచేతనే యామె తనయత్తింటివారియొక్కయుఁ బుట్టినింటివారియొక్కయు వంశాభివర్ణనముగావించి తన ధర్మములనుగూర్చి చెప్పుకొనుట తటస్థించినది. ఈవిషయము లన్నిటిని జూచి విమర్శించినప్పుడు బేతిరెడ్డిగాథ విశ్వాసపాత్ర మైనది గాదని నిష్పక్షపాతబుద్ధిగలవారికి బోధపడక మానదు.

ఈగాథల నన్నిటిని విడిచిపెట్టి వెలుగోటివారివంశవృక్షమునం జేర్పఁబడిన పురుషులయొక్క కాలనిర్ణయాదివిషయములనుబట్టి చూచినను, ఏతచ్చరిత్రములోని పురుషులనుగూర్చి వ్రాయంబడిన యసందర్భవాక్యములనుబట్టి చూచినను, బేతిరెడ్డి వేంకటగిరి, మైలవరము, పిఠాపురము, బొబ్బిలి, జటప్రోలు సంస్థానాధిపతులకు మూలపురుషుం డనుసిద్ధాంతము నిలువఁజాలదు.

బేతిరెడ్డి మూలపురుషుఁడు కాఁడు

వెలుగోటివారి వంశచరిత్రమునందుఁ బిల్లలమర్రి బేతాళనాయునికి "దామానాయఁడు, ప్రసాదాదిత్యనాయఁడు, రుద్రనాయఁడు," అను ముగ్గురుకొడుకులు గలరనియు, వారిలోఁ జ్యేష్ఠుఁడైన దామానాయనికి "౧ వెన్నమనాయఁడు, ౨ సబ్బినాయఁడు, 3 పెద్దన్న, ౪ బ్రహ్మనాయఁడు, ౫ పేర్నీఁడు, ౬ సూర్నీఁడు, ౭ మల్లినీఁడు" అను పుత్త్రులు గలరనియు నుదాహరింపఁబడియెను. శ్రీనాథకవిరాజప్రణీత మైన పల్నాటివీరచరిత్రమున బేతినాయనికి దొడ్డనాయఁడును, అతనికి "పెద్దన, బ్రహ్మనాయఁడు, పేర్నీఁడు, సూర్నీఁడు, మల్లినీఁడు" అను నేవురుపుత్త్రులు గలరనియు, వ్రాయంబడియున్నది. రేచెర్ల బేతినాయనినామమునుగాంచి భ్రమించిరో, పల్నాటివీరులలోఁ సుప్రసిద్ధుఁడైన బ్రహ్మనాయఁడు వెలుగోటివారివంశములోనివాఁడే యైయుండు నన్న సంపూర్ణవిశ్వాసముచేతనో, పల్నాటివీరులకాలముం దెలిపెడి చరిత్రాంశము తెలియఁగమిచేతనో, మఱి యేమికారణముచేతనో, పిల్లలమర్రిబేతాళనాయని వంశమును పల్నాటిబేతినాయనివంశమును నొక్కటిగఁజేసి బేతిరెడ్డియే బేతాళనాయఁ డని హేత్వాభాసములతో సిద్ధాంతము చేసియున్నారు.

బ్రహ్మనాయనితండ్రి దొడ్డనాయఁ డని పల్నాటివీరచరిత్రమునం జెప్పఁబడియుండుటచేతను, పిల్లలమర్రిబేతాళనాయనికొడుకులలో దొడ్డనాయఁ డనువాఁడు లేకుండుటచేతను, సంబంధమునకుఁ జిక్కుగలుగఁగా బేతాళనాయనిపుత్త్రులలో దామానాయఁడు జ్యేష్ఠుఁడగుటం జేసి దొడ్డనాయఁ

పిలువఁబడుచుండవచ్చునుగాన, నతనికి దొడ్డనాయఁ డని నామాంతర ముండ వచ్చు నని సమాధానముఁ జెప్పి సమర్థింపఁ జూచుచున్నారు. రేచెర్ల బేతిరెడ్డి బేతాళనాయఁడని చెప్పుటచేత మఱియొకచిక్కు తటస్థ మయ్యెను. బేతిరెడ్డికి మల్లారెడ్డి యనుపుత్త్రుఁడు కలఁడని బేతిరెడ్డి భార్యశాసనములోఁ జెప్పఁబడి యున్నది. అప్పుడు మల్లానాయనికి దామానాయఁ డని నామంతర ముండ వచ్చు నని సమర్థింపఁ జూచుచున్నారు. ఈ యంతలబొంతలమాఱిసంబంధము వలన బేతిరెడ్డికొడుకు మల్లారెడ్డి కొందఱకు మల్లానాయఁడు గాను, మఱికొందఱకు దామానాయఁడుగాను, ఇంకకొందఱకు దొడ్డనాయఁడుగాను, వెలుగోటివంశచరిత్రకారులకు "మల్లానాయఁడు, దామానాయఁడు, దొడ్డనాయఁడు' అను త్రిస్వరూపము లేకరూపముగాను గన్పడఁజేయునట్టి యవతారములఁగాంచి కడగండ్లపాలు గావలసి వచ్చినది. పోనిండు. ఆగ్రంథకర్తల యభీష్టానుసారముగానే మల్లానాయఁడే దామానాయఁ డనుకొందము. అట్లైయిన నెఱ్ఱక్కసానిశాసనమునాఁటికి మల్లానాయఁడు దామానాయఁడు అను దొడ్డనాయనికి సంతానము లేదని యెఱ్ఱక్కసానిశాసనమునుబట్టి స్పష్టమేగద! అనఁగా క్రీ. శ. ౧౨౦౮వసంవత్సరమునాఁటికి దొడ్డనాయునికి సంతానము జనింప లేదు. ఒకవేళఁ బుట్టినారని యూహించినను శిశువులై యుండవలయును గదా. బ్రహ్మనాయనికాలము మనము తెలిసికొన్నచో యథార్థస్థితి బయల్పడక మానదు. పల్నాటిప్రభు వయిన యలుగురాజుపుత్త్రులలో మలిదేవరాజుపక్షమునుబూనిన బ్రహ్మనాయనికిని నలగామరాజుపక్షమునుబూనిన నాగాంబ యనియెడు నాయకురాలికిని ఘోరయుద్ధముజరిగె ననుట పల్నాటి వీరచరిత్రమువలనఁ బ్రసిద్ధ మగుచున్నది. ఈయుద్ధము క్రీ. శ. ౧౧౬౯-౧౧౭౨ సంవత్సరముల నడుమ జరిగె నని యనేకచరిత్రాంశములను బట్టి నిర్ధారింపఁబడుచున్నది. పల్నాటివీరచరిత్రమునఁ బ్రతాపరుద్రుఁడు నలగామ రాజునకు యుద్ధకాలమున వేయిగుఱ్ఱముల నంపె ననియు, ధరణికోటరాజైన భీమరాజునకు వర్తమాన మంపెననియు, అతనికొడుకు రెండవకేతరాజు రాయబారము వహించె ననియు, నలగామరాజునకు సాగిపోతరాజు సాహాయ్యముఁ

జేసె ననియు, కళ్యాణపురిబిజ్జలునికొడుకు వీరసోమేశ్వరుని కూఁతును మలిదేవరాజునకిచ్చి పెండ్లిచేయఁబడెననియు చెప్పఁబడి యున్నది. హొసలరాజయిన రెండవ వీరబల్లాళుని నామమును, వెలనాటి చోడగొంకరాజు నామమును ఉదాహరింపఁబడినవి. వీరందఱును గొంచెమించుమించుగా సమకాలికులై యున్నారు. వీరిలోఁ గోటకేతరాజు ౧౧౭౨వ సంవత్సరమునఁ బరిపాలనమువహించినవాఁడు గావునఁ బల్నాటివీరులయుద్ధకాలమున నితనితండ్రి భీమరాజు ధరణికోటలోఁ బరిపాలనము సేయుచుండెను. కేతరాజు బ్రహ్మనాయనికడకు రాయబారము గొనిపోయెను. బిజ్జలునికొడుకు వీరసోమేశ్వరుఁడు మృతినొందినతరువాతనే పల్నాటియుద్ధము జరిగె నని చెప్పఁబడినందునను, వీరసోమేశ్వరుఁడు ౧౧౬౮వ సంవత్సరమువఱకుఁ బరిపాలనముఁ జేసినందునను, పల్నాటియుద్ధము ౧౧౬౯ - ౧౧౭౨ సంవత్సరములకు నడుమ జరిగె ననుటకేసందేహమును లేదు. ఇంత యేల? మొదటిప్రతాపరుద్రుఁడు నలగామరాజునకు సైన్యమునంపె నని చెప్పఁబడియుండుటచేత ౧౧౯౫ వఱకుఁ బరిపాలనము చేసిన ప్రతాపరుద్రునితో బ్రహ్మనాయఁడు సమకాలికుఁ డనుట స్పష్టముగదా. ౧౨౦౮ దవ సంవత్సరమునాఁటికి బ్రహ్మనాయనితండ్రి యగు దొడ్డనాయఁ డనెడు దామనాయఁ డను మల్లానాయనికి సంతానమే లేకయుండఁగాఁ బ్రతాపరుద్రునితో సమకాలికుఁ డగు తనతాత యైన బేతినాయనితో బ్రహ్మనాయఁ డెట్లు సమకాలికుఁ డయ్యెను? ఆయుద్ధమునాఁటికిఁ గోడలితోఁ గాఁపురముసేయుచున్నకొడుకుగూడ బ్రహ్మనాయనికిఁ గలఁడు. అనఁగాఁ బ్రపితామహుఁడు, పితామహుఁడు, మనుమఁడు, వయసువచ్చినమునిమనుమఁడు నేకకాలమున నున్నవారని చెప్పవలసి వచ్చును. ఇది యెంతయు నసందర్భముగా నున్నదికదా? బేతాళనాయఁడు గణపతిదేవునివలన సత్కారములను బొందకపూర్వమే బ్రహ్మనాయఁడు మొదటిప్రతాపరుద్రునికాలమున జరిగిన పల్నాటియుద్ధములో విజయము గాంచినట్లు బోధయగుచున్నదిగదా? పల్నాటివీరచరిత్రములో బ్రహ్మనాయనితండ్రి దొడ్డనాయఁడు యుద్ధమునాఁటికిఁ జనిపోయె నని చెప్పఁబడియున్నది. ౧౨౦౮ దవసంవత్సరములో నెఱ్ఱక్కసాని

శాసనములో నభివర్ణింపఁబడి బ్రదికియున్న యామెపుత్త్రుఁడు మల్లానాయఁడనెడు దొడ్డనాయఁడు ముప్పదిసంవత్సరములకుఁ బూర్వమే మృతినొందవలసినదురవస్థపట్టినదిగదా! ఆయాగ్రంథములలో నుండువిషయములను విచారింపక కల్పితగాథలను బట్టుపొగడ్తలను నమ్మి వంశవృక్షములను గూర్చినచోఁ జరిత్రకారులు తప్పక పరిహాసపాత్రులు గాక మానరు. కాఁబట్టి తేలినపర్యవసాన మేమనఁగా, వెలుగోటివారివంశచరిత్రమును, తద్వంశవృక్షమును చరిత్రమునకు విరుద్ధముగాఁ గూర్పఁబడియున్నవనియు, వానిని సంస్కరింపించుకోవలసియున్నదనియు స్పష్టమగుచున్నది. రేచెర్ల పిల్లలమఱ్ఱి బేతిరెడ్డి వేంకటగిరి, పిఠాపురము, మైలవరము, జటప్రోలు, బొబ్బిలి సంస్థానాధిపతులకు మూలపురుషుఁడు కాఁడనియు, పల్నాటివీరుఁ డైనబ్రహ్మనాయఁడీపిల్లలమఱ్ఱి బేతిరెడ్డికి మనుమఁడు గాఁడనియు, ఈబేతిరెడ్డికి మల్లారెడ్డి యనుకొడుకొక్కఁడే గలఁడనియు, సిద్ధాంత మగుచున్నది. వెలుగోటివారిపూర్వు లయిన యనపోతినాయఁడును, మాధవనాయఁడును, వారిశాసనములలో వెన్నమనాయని నుండియే తమపూర్వులను జెప్పుకొని యున్నారుగాని పిల్లలమఱ్ఱిబేతిరెడ్డిని మూలపురుషునిగాఁ జెప్పికొనియుండలేదు. సర్వజ్ఞసింగమనాయఁడు సయితము తన సింగభూపాలీయమున రగవతరములోని దాచినాయని మొదలుకొని వంశజులను వర్ణించెనుగాని సుప్రసిద్ధు లయిన బేతిరెడ్డిమొదలగువారి నెవ్వరిని బేర్కొనియుండలేదు. ఇప్పటివారికంటె వారు ప్రాచీనులుగనుక వారికీగాథల పూర్వోత్తరసందర్భములు చక్కఁగాఁ దెలిసియుండవలయునుగదా? వారేల తమశాసనములందును గ్రంథములందును సుప్రసిద్ధవంశజుల నభివర్ణింపక మౌనధారణము గలిగియుందురు?

ఏడవప్రకరణము.

పలనాటివీరచరిత్రము.

మొదటిప్రతాపరుద్రునకు సమకాలికు లయిన పల్నాటివీరులచరిత్రమును సంగ్రహముగా నీప్రకరణమున వివరింపఁబోవుచున్నాఁడను. పండ్రెండవశతాబ్ద ప్రారంభమునఁ బల్నాడు పశ్చిమచాళుక్యచక్రవర్తులకు సామంతులుగ నుండిన హైహయవంశజు లయిన గళచుతిరాజులచేఁ బరిపాలింపఁబడుచుండెను.[1] బిరుదాంకరుద్రుఁ డను నామాంతరముగల చాగిబేతరాజు పల్నాటికిఁ బ్రభువై భూలోకమల్లుఁ డను పశ్చిమచాళుక్యచక్రవర్తికిఁ గప్పము గట్టుచుండె నని మొదటిప్రకరణమునఁ జెప్పియున్నాఁడను.[2] ఇతఁడు కామనూరుగ్రామవాస్తవ్యుఁడు ఋగ్వేదపదపాఠియు నగు నొకబ్రాహ్మణునిచే మాధవిపట్టణమునఁ బ్రతిష్ఠింపఁబడిన త్రిమూర్తిదేవాలయమునకు శా. శ. ౧౦౫౧ సౌమ్యసంవత్సరము (క్రీ. శ. ౧౧౨౯-౩౦) దానశాసనమును వ్రాయించెను. ఇందుఁ జెప్పఁ

1. పల్నా డనునది గుంటూరుజిల్లాలో నొకతాలూకా యైయున్నది. ఇయ్యది కృష్ణానదీ దక్షిణతీరమున సముద్రమునకు నించుమించుగా ౧౨౦ మైళ్లదూరములో నున్నది. ఈసీమకు నుత్తరమునను బడమటను ౭౫ మైళ్లపొడవునఁ గృష్ణానది ప్రవహించుచున్నది. దీని దక్షిణభాగము కొండలచేతను దట్టములయిన యడవులచేతను నావరింపఁబడి యున్నదిగాని తూర్పునఁ జిట్టడవులు మాత్రమే వ్యాపించి యున్నవి. దీనియొక్క వైశాల్యము ౧౦౫౦ చదురపుమైళ్లుండును. నాగులేఱు, చంద్రవంక, యనునదులు దీనిగుండఁ బ్రవహించుచున్నవి. ఈభూప్రదేశము చరిత్రకాలమునకుఁ బూర్వమునుండియుఁ బ్రఖ్యాతి వహించి యున్నది. ఇది మొదట నాగులకు నివాసభూమిగ నుండి యాంధ్రభృత్యవంశపురాజుల పరిపాలనకాలమునఁ బల్లవులచే నాక్రమింపఁబడి పల్లవనా డనిపేరు పొందెను. తరువాత పలనా డనియు,పల్నా డనియు వ్యవహరింపఁబడుచున్నది. చరిత్రాంశముల నెఱుంగమి కొందఱాంధ్రకవులు పల్లెనాడని గ్రంథస్థము గావించిరి. తక్కిన వ్యుత్పత్తు లంతగాఁ బాటింపఁబని లేదు.

2. ఆంధ్రులచరిత్రము రెండవభాగము మొదటిప్రకరణము 14-15 పేజీలను చూడుఁడు.

బడిన మాధవిపట్టణము గురివిందస్థల మనియు గురిజాల యనియుఁ జెప్పఁబడుచున్నది. పల్నాటిలోని మాచెర్లగ్రామములోని చెన్నకేశవస్వామి దేవాలయములో నింకొకశాసనము పండ్రెండవశతాబ్దప్రారంభమునాఁటిది గలదు. పల్నాటికి రాజధాని యగు మహాదేవితటాకము (మాచెర్ల) లో నొకానొక యాదిత్యునిచే నాదిత్యేశ్వరదేవాలయము నిర్మింపఁబడినది. చంద్రకులమునందు జనించిన కార్తవీర్యార్జునుని వంశమునందుఁ బుట్టిన చాగిబేతరాజు నలుగురు కుమారులలోను రెండవవాఁడగు వీరకామునికుమారుఁడు బేతరాజు దీనికి భూదానము చేసియుండెను. హైహయవంశజు లయిన యీరాజులు పండ్రెండవశతాబ్దప్రారంభమునందుఁ బల్నాటికిఁ బ్రభువులై పరిపాలించుచున్న విషయము వాస్తవ మని పైశాసనములంబట్టి స్పష్ట మగుచున్నది. ఈరాజుల యొక్క చరిత్రమే పల్నాటివీరచరిత్ర మను పేరఁ బెక్కండ్రు తెలుఁగుకవులచే ద్విపదరూపమున వ్రాయఁబడి యాంధ్రదేశమునఁ బఠింపఁ బడుచున్నది. ఈగ్రంథమున కనేక పాఠాంతరములు గలవు.[1] ఈగ్రంథములన్నిటిలో శ్రీనాథకవి ప్రణీత మైనదని చెప్పఁబడు గ్రంథము మాత్రము ప్రాచీనమైనదిగఁ దోఁచుచున్నది. పాఠాంతర భేదములను విడిచి నేను గ్రహించిన కథాసారమును మాత్రమే యిందు వివరింపఁబోవుచున్నాఁడను. ఉత్తరహిందూస్థానమునఁ బాలమాచాపురి యనుపట్టణము గలదు. దానికి జంభనాపుర మని నామాంతరము గలదు. ఆపట్టణమును గార్తవీర్యార్జునునకు నేఁడవతరమువాఁడైన యనుగురాజేలుచుండెను. కార్తవీర్యార్జునుఁడు చేసిన పాపములు తన్ను బాధింపఁగా ననుగురాజు విదగ్ధులగు విప్రవర్యుల యాలోచనము గైకొని జీడినూనెగుడ్డలుధరించి తనసైన్యముతోను, తనమంత్రులతోను, తనధనముతోను, తనకుటుంబముతోను, తనకులదేవతలతోను, స్వరాష్ట్రమును విడిచి పాపపరిహారార్థమై తీర్థయాత్రలు సేయఁగోరి నానాక్షేత్రంబుల కరుగుచు పుణ్యనదులలో మునుంగుచు నాంధ్రదేశమునకు వచ్చి యమరావతి రేవునఁ గృష్ణానదిలో స్నానముచేయఁగా నల్లనిజీడినూనెగుడ్డలు తెల్లనివాయెనఁట! ఇట్లు తెల్లనగు నని బ్రాహ్మణోత్తములు చెప్పుటవలననే యనుఁగురాజు స్వదేశమును విడిచి యీదేశమునకు రాఁగలుగుట తటస్థమైనదఁట![1] ఈదేశమునకువచ్చి యనుఁగురాజు వెలనాటిరాజవంశములోఁ జేరిన యొకకన్యను వివాహముఁ జేసికొనియెనఁట! ఆమెపేరు మైలమదేవి. చందవోలురాజధానిగ వేంగీదేశమును రాజప్రతినిధిగనుండి పరిపాలనము సేయు మైలమదేవితండ్రి కూఁతునకుఁ బల్నాడరణముగా నొసంగినందున ననుగురాజు గురిజాల రాజధానిగఁ బల్నాటి కధిపతియై ప్రజాపరిపాలనము సేయుచుండెనఁట! ఇతనికి రేచెర్ల బేతినాయనికొడుకు దొడ్డనాయఁడు మంత్రిగ నుండెను. అనుగురాజునకు మైలమదేవి, వీరవిద్యాదేవి (విజ్జలదేవి,) భూరమాదేవి యను ముప్వురు భార్యలు గలరు.[2] వీరిలో మైలమదేవికి నలగామరాజును, వీరవిద్యాదేవికిఁ బెదమల్లదేవుఁడు, పినమల్లదేవుఁడు, బాలమల్లదేవుఁడును; భూరమాదేవికిఁ గామరాజు, నరసింగరాజు, ఝట్టిరాజు, పెరుమాళ్లరాజును జనించిరి. వెలనాటిరాజులు శూద్రుల మని చెప్పుకొన్నవారు. కార్తవీర్యార్జునుని సంతతివారయిన హైహయు లయిన గళచురిరాజులు క్షత్రియుల మని చెప్పుకొన్నారు. ఇట్టి వివాహము లాకాలమునం దనేకములు జరుగుచున్నందులకు దృష్టాంతము లనేకములు శాసనములలోఁ గానంబడుచున్నవి. చతుర్థాన్వయసంభవు లయిన

1. పల్నాటివీరచరిత్రమును శ్రీనాథకవి, కొండయ, మల్లన, బలరామసెట్టి, ముదిగొండవీరభద్రకవి, మొదలగువారు రచించియున్నారు. వీరిలో శ్రీనాథుని గ్రంథము ప్రాచీనము. ఈశ్రీనాథుఁడు శృంగారనైషధాదిమహాకావ్యములను రచించిన కవిసార్వభౌముఁడే యని చెప్పుచున్నారుగాని, యీగ్రంథములోని వ్యాకరణదోషములను వీక్షించినప్పుడీగ్రంథ మామహాకవివిరచితము కాదేమో యని సందియము కలుగుచున్నది. ముదిగొండవీరభద్రకవిగ్రంథము క్రీ. శ. ౧౮౬౯వ సంవత్సరమున రచింపఁబడినదిగావున నవీనము. ఇది పద్యకావ్యము. పాఠాంతరభేదము లనేకములు గలవు.

1. హైహయులు చేదిదేశమునుండి వచ్చినవారు. వీరిని గళచురిరాజు లందురు. వీరు చేదిదేశమునమాత్రమేగాక చాళుక్యులకాలమునఁ గొంకణదేశమునం దుండిరి. బుందేలుఖండములోనుండు కాలంజరుకోట హైహయులదే. పదునొకండవశతాబ్దమున గజనీమామూదును, పండ్రెండవశతాబ్దప్రారంభమున మహమ్మదుగోరియు, వీరిపై దండెత్తివచ్చుటచేత నుత్తరమున నున్న హైహయులు దక్షిణమునకు వచ్చిరి.

(2) మైలమదేవికి వీరవిద్యాదేవి యను నామాంతరము గలదని ముదిగొండవీరభద్రకవి యిరువురుభార్యలనే వక్కాణించెను.

వెలనాటిరాజులతోడి సంబంధముచేతనే హైహయరాజు లనేకులు వేంగిదేశములో (గుంటూరు, కృష్ణా, గోదావరి మండలములలో) సామంతపదవులనువహించి పంద్రెండవశతాబ్దప్రారంభమునఁ బ్రసిద్ధిగాంచిరి. కృష్ణా, గోదావరీ మండలములలోఁ బరిపాలనము చేసిన కోనసీమరాజు లెల్లరును హైహయరాజులే యనియు; పల్నాటిహైహయులును కోనసీమహైహయులును, చాళుక్యులు ఈదేశమునుజయించినప్పుడు వారితోఁగాని, గజనీమామూదు, మహమ్మదుగోరీల కాలములోఁగాని, యాంధ్రదేశమునకు వచ్చియుందురు. పల్నాటిలోని శాసనములలోఁ బేర్కొనంబడిన చాగిబేతరాజునకే యనుగురాజను నామాంతరము గలదేమో యని సందేహము కలుగుచున్నది. అయినను గాకపోయినను శాసనములోని చాగిరాజకుటుంబములోనివారే యీ యనుగురాజు మొదలగువా రని మనము నిస్సంశయముగా విశ్వసింప వచ్చును. అనుగురాజునకు మొదట సంతానము లేకపోయినదఁట. అంతట క్షత్త్రియుం డైన యనుగురాజు తన మంత్రి యైన దొడ్డనాయనిపుత్త్రుఁ డగు బాదన్నను బెంచుకొనియెనఁట![1]

పెద్దనాయనిఁ బెంచుకొన్న తరువాతనే మూవురు రాణులయందును రాజునకు సంతానము గలుగుట సంభవించెను. రేచెర్లదొడ్డనాయనికి శీలమ్మయందు పెద్దనాయఁడు, బ్రహ్మనాయఁడు, సూరినీఁడు, పేరినీఁడు, మల్లినీడు, అను నేవురుపుత్త్రులు జనించి పంచపాండవులవలెఁ బరాక్రమవంతులై తేజోధికులై యొప్పుచుండిరి. వారిలో బాదన్న గొప్పరౌతు; బ్రహ్మనాయఁడు రాజకార్యధురంధరుఁడును మహావీరుఁడునై యుండెను.

పెద్దనాయని కథ.

అనుగురాజు తన మంత్రి యైన రేచెర్లదొడ్డనాయనిపుత్త్రుఁ డగు పెద్దనాయనిఁ బెంచుకొని యాతనికి వివాహముఁ జేయ నిశ్చయింపఁగా నాతనికి క్షత్త్రియు లెవ్వరుఁ గన్యక నీయకపోయిరఁట. అనుగురాజు చే దేశదేశంబు

1. బాదన్నకే పెద్దన లేక పెద్దనాయఁ డని నామాంతరము గలదు. పెద్దనయనియే కొన్నిగ్రంథములందు వక్కాణింపఁబడెను.

లకుఁ బంపఁబడిన దూతలిట్లు క్షత్త్రియు లెవ్వరును శూద్రునకుఁ గన్యక నిచ్చుట కొడంబడకపోవుటచేత విసిగి వేసారి తుదకు నాంధ్రదేశములోని చందవోలునకు విచ్చేసిరి.[1] అచ్చట నొకబ్రాహ్మణుఁ డనుగ్రహించి వారలకు నొక్కయుపాయము చెప్పెను. క్షత్త్రియుం డైన కృష్ణగంధర్వుని కడకుఁ బోయి పెద్దనదత్తపుత్త్రుఁ డని చెప్పక మాటలాడి యతనికూఁతు రయిన ముక్తలవాంబ నిప్పించి వివాహకార్యము నెఱవేర్చు టుచిత మని యాతఁడు చెప్పెను. ఆయుపాయ మనుకూలముగ నున్నదని భావించి దూతకృత్యమును నెఱవేర్చెడి బ్రాహ్మణులు కంచెర్లనగరమునఁ గృష్ణగంధర్వుని సందర్శించి దత్తస్వీకారము సంగతి నెత్తకయే తమసందేశమును దెలిపిరి. అంతట కృష్ణగంధర్వుఁ డనుగురాజుతోడి బాంధవ్యమున కపరిమితానందమును బొంది పెద్దనకుఁ దన చిన్నకొమార్తె యయిన ముక్తలవాంబ నొసంగి వివాహముఁ జేయుటకు సమ్మతించెను. పిమ్మట బ్రాహ్మణులు గురిజాల కేతెంచి యాశుభవృత్తాంతము నంతయు ననుగురాజునకుఁ జెప్పి యాతనివలన విశేషబహుమానములను బొందిరి. అటుపిమ్మట ననుగురాజు దైవజ్ఞు లయిన పెద్దలవలన నొకశుభముహూర్తమును విచారించి బంధుపరివారసమేతముగాఁ గంచెర్లకుఁ దరలిపోయి యాశుభముహూర్తమునఁ బెద్దనకును ముక్తలవాంబకును వివాహమును గావించి పెద్దన నత్తవారింట విడిచి నిజరాజధానికి మగిలి వచ్చిరి. అత్తవారింట నున్నకాలమునఁ బెద్దన తనబావమఱఁదులతో వనవిహారాదిక్రీడావినోదంబులఁ బ్రొద్దుపుచ్చుచుఁ దన యశ్వవిద్యానైపుణ్యమును బరాక్రమమును జూపుచు వారలకుఁ దనపట్ల ననసూయ జనింపఁజేయుకార్యములను జేయుచుండెను. ఇట్లుండ వారలకు నితండు శూద్రుం డనియు ననుగురాజు దత్తపుత్త్రుం డనియుఁ దెలియవచ్చెను. ఇయ్యది విన్నతోడనే వారలాగ్రహించి పెద్దనాయనిఁ జంపఁ జూచిరికాని యెదుర్కొనుటకు సాహసింపఁజాలక యెట్లయిన నాతనిఁ బరిమార్చు నుపాయ మాలోచింపుచు తిడ్రినీ

1. చందవోలికి ధనదుపుర మని నామాంతరము గలదు. అనుగురాజును అలుగురాజనికూడ చెప్పిరి.

బ్రోత్సహింపసాగిరి. అతండును మాయోపాయంబున నాతని గడతేర్చి కుల గౌరవమును నిలుపుకొనవలయు నని యోజించెను. ఇంతవఱకు రౌతుల ననేకులం జంపి మఱించి యప్రఖ్యాతి గాంచియుండిన గంధర్వాశ్వమును బహుమానముఁ జేసిన నయ్యది వానిం దప్పక చంపు ననియు, అంతటం దనకొమార్త ముక్తలవాంబ వానితో సహగమనముఁ జేయు ననియు, అంతటితో వారివలనఁ గలుగఁ బోయెడు నగౌరవమంతయుఁ దొలంగు ననియు నూహించి యతం డాగుఱ్ఱము నల్లునకు బహుమానముఁ జేసెను. తానొకటితలంచిన దైవము వేఱొకటి తలంచు నను నట్లుగా నమ్మహాకార్యమువలనఁ బెద్దన చచ్చుటకు మాఱుగా వారలెల్లరుఁ జచ్చుట సంభవించినది. పెద్దన స్వారిచేయుటయందుఁ గడితేఱిన రౌతు గావున నతం డాగుఱ్ఱము నెక్కినతోడనే యది వానియొక్క సామర్థ్యమును దెలిసికొని వానిం గడతేర్చుట యసాధ్యమని భావించి వశవర్తియై వాయువేగమునఁ బఱువిడ సాగెను. అతనిరాక యెప్పటికిని గానరాకపోయి నందున నాయశ్వ మతనిం జంపియుండు నని యెల్లవారును నిశ్చయించిరి. తన భర్తమరణమునకు మిక్కిలి దుఃఖించి ముక్తలవాంబ బ్రదుకునం దాస విడిచి భర్తతో సహగమనముఁజేయఁ దలపోసి తన యభీష్టమును తల్లిదండ్రులకు సహోదరులకునుఁ జెప్పి చితిని పేర్పించి యగ్నినిదాకొల్పి యందులో దుముక సంసిద్ధురాలయి యున్నసమయమునఁ బెద్దన యాయశ్వంబుతో వాయు వేగమున వచ్చి యామెను బట్టికొని పోయి తనప్రక్క నుంచుకొని తన బావ మఱఁదులతోడఁ బోరాడి వారలనెల్లర నుక్కడించి యాపట్టణమును నాశనము గావించి మహాపౌరుషమును జూపి పిమ్మటఁ దనపుట్టినయింటికిఁ బోయి తన తల్లిదండ్రులకును బంధుజనంబులకు నమితానందమును గలుగఁజేసి హయారూఢరేవంతుఁ డను మహాబిరుదమునుగాంచి పల్నాటివీరులలో సుప్రసిద్ధుఁ డయ్యెను. వీరచరిత్రమునం దీతనిచర్య లత్యద్భుతముగా నభివర్ణింపఁబడినవి.

నర్లకొండ దండయాత్ర.

తరువాత దొడ్డనాయఁడు మంత్రిగ ననుగురాజు ప్రజారంజకముగఁ

బరిపాలనము సేయుచుండ నొకనాఁడు దానును తెప్పలినాయఁడు[1] అను వాఁడును, మృగయావినోదార్థము నరణ్యమునకుం జని నర్లకొండ సామీప్యమున బసచేసి యుండిరి. అక్కడ నొక వ్యవసాయదారుఁడు కొన్ని విత్తనములను దెచ్చి రాజునకు కానుకగా నర్పించెను. ప్రభువు వానిని స్వీకరించి యంతఃపురమున నుండు రాణులకుఁ బంపెను. వారలింక నట్టివిత్తనములు గావలయు నని కోరఁగాఁ దెప్పలినాయఁ డారైతులపొలములను దోఁచి విత్తనములను సంగ్రహించి తెచ్చెను. అట్టివిత్తనములతో వారెల్లరును గురిజాలకు వచ్చిరి. ఆవిత్తనములను గొల్లఁబోయిన పొలముకాపఱు లెల్లరును తమ దురవస్థనంతయు దమ యేలికకు విన్నవించుకొనిరి. అంతట నాయేలిక యాగ్రహాయత్తచిత్తుఁడై యలుగుభూపతికి భయంకరమైనసందేశమును బంపెను. దొడ్డనాయఁడు తెప్పలినాయనితోడ నర్లకొండపై దండయాత్ర వెడలెను. ఈదండయాత్ర వీరచరిత్రమున నత్యద్భుతముగా నభివర్ణింపఁబడినది. అప్పు డచ్చట నర్లకొండప్రభువునకును దొడ్డనాయనికిని భయంకరమైనయుద్ధము జరిగెను. ఆయుద్ధములో నర్లకొండనాయకుఁడు మృతి నొందెను. వానిసైన్యము పలాయనమయ్యెను; నర్లకొండ శత్రువులకుఁ జిక్కి దోఁచుకొనఁబడియెను. ఇట్లు దొడ్డనాయఁడు విజయముతో గురిజాలఁ బ్రవేశించెను.

నాయకురాలి వృత్తాంతము.

జిట్టగామాలపాడను నొకగ్రామమున చౌదరి రామిరెడ్డి యను పేరుగల యొకబీదరైతు పొలములో బనిచేసికొనుచుండఁగా నాసమీపమునం దున్న కంచెలో నొక యాఁడుశిశువు కాన్పించెను. ఆరైతు శిశువును గొనిపోయి పెంచుచుండెను. ఈశిశువుమాత్రమేగాక యాతని కాదినమున భూమిలోనుండి ధనముకూడ లభించెను. అతఁ డాధనముతో భాగ్యవంతుఁ డయ్యెను. అతఁడు ముప్పిరిగొన్న ప్రేమంబుతో నాశిశువునకు నాగమ్మ యని పేరుపెట్టి నిజపుత్త్రికనుంబోలెఁ బెంచి పెద్దదానిఁగఁ జేసెను. తరువాత రామిరెడ్డి యామె నొకధనికున కిచ్చి వివాహముం జేసెను కాని, యత్యంతశీఘ్రకాలములోనే

1. ఇతఁడు మాలవాఁడు.

తండ్రియు భర్తయుఁ గూడ మృతినొందుట సంభవించి వారల యైశ్వర్య మంతయు నీమెకే సంప్రాప్త మయ్యెను. తన యైశ్వర్యబలముచేత నీమె దేశమున నొక ప్రముఖురాలుగ నుండి యాత్మశక్తిచేత నెల్లెల్లో యనుగురాజు యొక్క అనుగ్రహమును సంపాదించి నాయకురాలను బిరుదునామమును వహించి ప్రఖ్యాతి గాంచెను. ఇట్లు తన నేర్పుచేత రాజును వశపఱుచుకొని మంత్రాంగముచేసి యెట్లయిననేమి యనుగురాజునకును దొడ్డనాయనికిని విరోధమును గల్పించెను. అంతట దొడ్డనాయఁ డీమె దుస్తంత్రమువలన మంత్రిపదవిని తన రెండవకుమారుఁడైన బ్రహ్మనాయనికి విడిచిపెట్టి తాను దొలంగెను. బ్రహ్మనాయఁడు స్వప్రయోజనపరుఁడై తన ప్రభువైన యలుగురాజును జంపించెను. తరువాత దొడ్డనాయఁడును మరణము నొందెను[1].

నాయకురాలి దుస్తంత్రములు.

అలుగురాజు స్వర్గస్థుఁ డైనవెనుక నలగామరాజు పట్టాభిషిక్తుఁ డయ్యెను. ఒకనాఁడు నలగామరాజు స్వపరివారముతో వేఁటాడ నరణ్యమునకుఁ బోయి యందందుఁ బెక్కుమెకంబుల వేఁటాడి భరింపరాని సూర్యాతపంబునకుఁ జిక్కి మిక్కిలి దప్పిగొని విశ్రమింపఁ దగినతావును వెదకికొనుచు వచ్చుచుండెను. నాయకురాలు రాజామార్గమున వచ్చునని ముందుగానే తన బుద్ధిచే నూహించి యామార్గమున నొక చల్లని ప్రదేశమునఁ జలువపందిరి వేయించి స్నానంబునకు నుష్ణోదకమును పానంబునకు శుద్ధోదకమును సమకూర్పించి షడ్రసోపేతమైన భోజనమున కనుకూలము లగుపదార్థములను సిద్ధము చేయించి తన ప్రభువునకై యెదురుచూచుచుండెనఁట! నలగామరాజా ప్రదేశమునకు విచ్చేసి నాయకురాలిచే నాహూతుఁడై యచట నిలిచి యామె యొక్క యాతిథ్యమును సంతోషపూర్వకముగాఁ గైకొనియెను. అతని కప్పు డాప్రదేశమంతయు భూతలస్వర్గముగా నుండెను. అతఁడు సంతోషసాగరమునఁ దేలుచున్న సమయమును గనిపెట్టి నాయకురాలు ప్రభువునకు మాఱుగాఁ దాను కొన్నిగడియలు ప్రభుత్వము చేయుట కనుగ్రహింపవలసిన దని

1. బ్రహ్మనాయఁడు తనతండ్రిని గూడ నలుగురాజులో స్వర్గమునకనుగమింపజేసె నని చెప్పఁబడియె.

వేఁడికొనఁగా నందుల కాతఁడు శంకింపక యట్లే యని వర మిచ్చెను. తరువాత వారలందఱును గురిజాలకు మరలివచ్చిరి. కొన్నిదినములు గడచినవెనుక నాయకురాలు వాగ్దానముప్రకారము ప్రభుత్వమును వశపఱుపవలసిన దని యడిగెను. అతఁ డట్లు కావించెను. అంతట నామె తనపరివారమున కుత్తరువిచ్చి గ్రామములను దోఁపించి విశేషధనమును దెప్పించి నలగామరాజు కాళ్లముంగటఁ గుమ్మరింపించి 'మహాప్రభూ! సత్పరిపాలనము చేయఁగోరినపక్షమున నిట్లే ప్రతిదినము ధనార్జనము చేయవలయు' నని హెచ్చరించుటయేగాక బ్రహ్మనాయఁడు విశ్వాసవిహీనుఁడును, మోసగాఁడు నైయున్నాఁడని యతనిపై కొండెములు చెప్పెను. అతఁడు దేశముయొక్క యైశ్వర్యము నంతయు జూఱఁగొన్నవాఁడనిగూడ నిందింపసాగెను. ఈమెవలలోఁ జిక్కుకొని నలగామరాజు బ్రహ్మనాయనిపట్ల మనఃస్పర్థను వహించెను. బ్రహ్మనాయఁడు ధనముగోలుపోయినవారికి ధనము నొసంగి యాదరించుచు వారలమన్ననకుఁ బాత్రుండగుచు నుండెను. ఏమయిననేమి? నలగామరాజాదు లీమెచేతిలోని కీలుబొమ్మలై యెట్లుద్రిప్పిన నటు దిరుగుచుండిరి. ఎట్లయిననేమి? సవతితల్లిబిడ్డలపై నలగామరాజునకుఁ గల ప్రేమ దొలఁగునటులఁ జేసెను. అంతటితో నూరకుండక వీరవిద్యాదేవిపుత్త్రు లయిన మల్లదేవాదులను జంపింపఁ దివిరెను. దొడ్డనాయనిభార్య యగు శీలమ్మ ఘోరమైన మరణమునుండి యాబాలురను దప్పించి గాపాడి వారలను బ్రహ్మనాయనివశము చేసెను. బ్రహ్మనాయఁడు వీరలను దగ్గఱకుఁ దీసి రాజ్యములోఁ గొంతభాగము నిప్పించి గురిజాల విడిచిపెట్టి మాచెర్ల యనుపట్టణమును గట్టించి వారల నచ్చటికిఁ గొనిపోయి వారు బాలురైనందున వారలకు బదులుగా తానే పరిపాలనము సేయుచుండెను. మాచెర్లపట్టణము చంద్రవంక యను నొకయేటియొడ్డునఁ గట్టఁబడియున్నది.

బ్రహ్మనాయని సంతానము.

దొడ్డనాయనిపుత్త్రులలోఁ బెద్దనాయఁడు కృష్ణగంధమ్మనికూఁతురగు ముక్తులఖాంబను బెండ్లాడె నని యిప్పటికే చెప్పియున్నాను. బ్రహ్మనాయని భార్య ఐతాంబ. ఈమెకు ఈడమ్మ యను నామాంతరము గలదు. పేర్నిని

భార్య గౌరమ్మ; నూర్మినిభార్య సీరమ్మ; మల్లినీనిభార్య మాచమ్మ. వీరిలో బ్రహ్మనాయనిభార్య యగు నైతాంబకు మాత్రము సంతానము గలదు. ఐతాంబకు విష్ణువరప్రసాదమున బాలనాయఁ డను పుత్త్రుఁడు మహాశూరుఁ డుద్భవించెను. మఱియు విష్ణువుయొక్క యనుగ్రహముచేతనే "యొక బ్రాహ్మణయువతికి జనించినట్టి అనపోతరాజు, ఒక వెలమస్త్రీకి జనించినట్టి దోర్నీఁడు, ఒక చాకలివనితకు జనించిన చందన్న, ఒక కుమ్మరకొమ్మకుజనించిన తేర్కుఁడు, ఒక కంసాలికలికికి జనించిన చందన్న, ఒక మంగలిభామకు జనించిన మంచన్న," అను నాల్గురుపుత్త్రులు బాలనాయనికి నుగ్గుపాలనాఁటినుండి మిత్త్రులై యాతనికిఁ దమ్ములవలె నుండి యట్లే వ్యవహరింపఁబడుచుండిరి. బాలనాయని జన్మనక్షత్రము మంచిది కాదని దైవజ్ఞు లయిన బ్రాహ్మణులు చెప్పినందున బ్రహ్మనాయఁడు వానిని జంపఁ దన ప్రియసేవకుని కనమదాసను కన్నమనాయని నియోగించెనుగాని యతఁ డట్లు వానిని జంపలేక బ్రహ్మనాయనితమ్ముఁ డగు పేరినాయనివశము గావించెను.[1] అప్పటినుండియు బాలనాయనిఁ బేర్నీడు పెంచుచుండె నని చెప్పఁబడియెను. పైనిజెప్పిన వరప్రసాదజనితులైన యాఱ్వురుబిడ్డలును పేర్నినిగృహముననే పెరుఁగుచుండిరఁట!

బాలనాయని వివాహము.

కొన్ని సంవత్సరములు గడచినవెనుక గండుకన్నమనాయఁ డనువాఁడు బ్రహ్మనాయనిసభలో నాతని కెదురుగఁ గూరుచుండి తనకొమార్తె మంచాలయను బాలికను దగ్గఱనుంచికొని యీమె యొక యుత్తమకులీనుఁ డైన యాధనవంతునకు వివాహముచేయ నభిలాషకలదని పలుకఁగా ఆలకించి పేరినీఁడు తనయింటఁ బెరుఁగుచున్న బ్రహ్మనాయనిపుత్త్రుని రప్పించి తనప్రక్కఁ గూరుచుండఁబెట్టుకొని యాతనికిచ్చి వివాహము చేయవలసినదని కన్నమనాయనితోఁ బలికెను. బ్రహ్మనాయఁడు తనకుమారుఁ డైన బాలనాయని గుర్తించి యతఁ డెట్లుమరల బ్రదికె నని యాశ్చర్యపడసాగెను. కనమదాసు జరిగినవృత్తాంతమును వెల్లడించెను.

1. ఇతఁడు మాలవాఁడైన తిప్పలినాయనికిని పెమ్మసానికిని బ్రహ్మనాయనివరమునఁ బుట్టినవాఁడు.

బ్రహ్మనాయఁడు మూఢభక్తియు, మూఢవిశ్వాసములుగలవాఁడుగావున దుష్టనక్షత్రమున జనించిన కుమారుఁడు బ్రదికియుండిన నేమికీడువాటిల్లునో యని బెంగగొని మనస్సును స్థిరపఱుచుకొనలేక బంధువులు, మిత్త్రులు, పరివారజనంబులు, సభ్యులు మొదలగువారందఱు గుండియ లవియునట్లు మరల తన కుమారుని వధ్యశిలపై వధింపవలసినదని తన ప్రియభృత్యుఁ డగు కనమదాసున కుత్తరువు గావించెను. అతఁడు ప్రభువునాజ్ఞ శిరమునఁదాల్చి బాలుని వధ్యస్థానమునకుఁ గొంపోయి చూపఱెల్ల హాహాకారములు సేయుచుండ భైరవఖడ్గముతో బాలనాయని శిరమున నొక్కదెబ్బతీసెనఁటగాని యేమిమాహాత్మ్యముచేతనో యాఖడ్గము ముక్కలైచెక్కలై పొడుమై క్రిందఁబడెను. బాలచంద్రునిశిరము నిర్భేద్యమై నొవ్వక యుండెనఁట! అంతట బాలనాయఁడు బ్రహ్మనాయనిసభకుఁ దేఁబడియెను. సభాసదులు బాలనాయని ప్రాణములను రక్షింపఁ బ్రార్థించిరి. బ్రహ్మనాయఁడు వారల ప్రార్థనల మన్నించి తుదకుఁ బుత్త్రుని స్వకుటుంబములోఁ జేర్చుకొనియెను. అటుపిమ్మటఁ దనకొడుకునకు మంచాలమ్మను ఇచ్చి పెండ్లిచేయుమని కన్నమనాయని అడిగెను. అతఁడు దురాశాపీడితుఁడై విశేషధన మీయవలసినదని కోరెనఁట! అందులకు బ్రహ్మనాయఁ డంగీకరించి యమితసువర్ణమును గానుకగా నంపించి క్రమముగా నొక్కశుభముహూర్తమున బాలనాయనికిని మంచాలమ్మకును మిక్కిలి వైభవముతో వివాహమును గావించెను.

నాయకురాలి మాత్సర్యము.

బ్రహ్మనాయని వైభవమునంతయుఁ జారులవలనఁ దెలిసికొని వారివిభవాభివృద్ధి తనప్రభువుపరిపాలనమునకు భంగముకలిగించు నని మాత్సర్యమును బూని నాయకురాలు మాచెర్లపట్టణమును దోఁచుకొనిరండని గడెకారులయిన దోఁపిడికాండ్రను, నాగరికములేని చెంచులు కోయలు మొదలగు నడవిజనంబులను బంపెను కాని, మహావీరుఁ డైన మాలకనమదాసు వారల నెదుర్కొని పోరాడి యోడించి వాగలవీపులపై ఇసుకబస్తాలనుగట్టించి పశువులను దోలుకొనివచ్చినట్లుగా వారిని వెంబడించివచ్చి గురిజాలఁ బ్రవేశించెను. నాయకు

రాలు స్వయముగా బయలువెడలివచ్చి కనమదాసును నానావిధము లయిన దుర్భాషలను బలికెను. అందుపై మహోగ్రుఁడై కనమదాసు నాయకురాలిని జంప నుద్యుక్తుఁడై పైఁబడ నామె తప్పించుకొని పాఱిపోయి సురక్షితముగా నంతఃపురముఁ బ్రవేశించెను. ఇంతలో బ్రహ్మనాయఁడు తన ప్రియభృత్యుఁడైన కనమనీఁడు గానరానందున దిగులుఁజెంది తనప్రభువయిన నలగామరాజును దర్శింపవలయునన్న మిషతో గురిజాలకు బైలుదేఱి వచ్చెను. నలగామరాజు, నరసింగభూపతి మొదలగు ప్రభువర్గమంతయు నాతని మిక్కిలి గౌరవముతో నాదరించిరి. అయినను నాయకురాలు అతనిని జంప నుపాయములు వెదకుచుండెను.

అతఁడు వచ్చుమార్గమున నగాధమైన గొయ్యిత్రవ్వించి కనఁబడకుండఁ బైన గసవుచేఁ గప్పించి మన్నుచల్లెను. ఆహారముతో విషమునుగూడఁ బెట్టించెను. ఎన్ని యపకృతులు గావించినను బ్రహ్మనాయఁడు బ్రదికియుండెను.

కోడి పందెములు.

విందు లారగించిన తరువాత ప్రభువు నాతనియతిథియు వెలుపలికి వచ్చినప్పుడు నాయకురాలు కోడిపందెము లాడించుచుండుటను వీక్షింపసాగిరి. అప్పుడు నాయకురాలు గెలిచినకోడిని రాజుకోడి యనియును, ఓడిపోయినకోడి బ్రహ్మనాయనికోడి యనియును హెచ్చరించుచు వచ్చెను. బ్రహ్మనాయఁడు దీనిని విని నాయకురాలివర్తనమును నిందింపఁ జొచ్చెను. ఇట్టి నాయకురాలివర్తనము వారని మనఃస్పర్థను గలిగింప బ్రహ్మనాయఁడు పగసాధింపఁ బూనెను. ఓడిన యొకకోడి బ్రహ్మనాయఁ డని పిలువంబడినతోడనే మరల జవసత్త్వములనుబొంది నాయకురాలను బిరుదును వహించిన కోడినిమాత్రమేగాక యెదిరించినవానినెల్ల జయించుచు వచ్చెను. దీనినంతయును జూచి నాయకురాలు సహింపఁజాలక కోపావేశపరవశురాలయి తనతోఁ గోడిపందెము వేయవలసినదని కయ్యమునకుఁ గాలుత్రవ్వెను. అందుల కతఁ డంగీకరింపఁగాఁ గోళ్లపోరాటమునకై సర్వసన్నాహములు చేసి ఇరుపక్షముల కోడిపుంజులను యుద్ధమునకు సంసిద్ధములు గావింపఁబడియెను.

ఎవ్వరికోళ్లు ఓడిపోవునో వారు పట్టణమును రాజ్యమును విడిచి కృష్ణదాఁటి వలసపోయి యేఁడుసంవత్సరముల వఱకుఁ బ్రవాసమునందుండి యనంతరము రావలసి యుండు నన్న ప్రతిజ్ఞాపత్త్రము పై నిరుపక్షముల వారును చేవ్రాళ్లు చేసిరి. బ్రహ్మనాయనిమిత్త్రుఁడైన బాలగోపన్న నాయఁడు మధ్యవర్తిగా నంగీకరింపఁ బడియెను.[1] అందఱు కత్యాశ్చర్యకరముగా బ్రహ్మనాయనికోడి నాయకురాలి పేరుగల పుంజులనెల్ల నొక్కొక్కదానిని నేలంగూల్చి మడియునటులఁ గొట్టుచుండెను. ఆపరాభవమును నాయకురాలు భరింపఁజాలక మాయోపాయమున మఱియొకపుంజుచే బ్రహ్మనాయని పుంజును జంపించెను. ఇంక బ్రహ్మనాయనికి పుంజులు లేకపోయెను. దీనినంతయు వీక్షించుచున్న మధ్యవర్తియైనబాలగోపన్న మహోదగ్రుఁడై లేచి యొక్కఁడే నాయకురాలి సైన్యముపైఁ బడి ఘోరయుద్ధము చేసి నాశనము గావించెను. ఇతఁడు మువ్వలభీమన్నచేఁ జంపఁబడఁగాఁ గనమనీఁడు వీని శిరమును గొనిపోయి బ్రహ్మనాయనిముందటఁ బెట్టె ననియు, అతఁడు మంత్రప్రభావముచేత నాతనిఁ బునర్జీవుని గావించి మాచెర్లపట్టణమును బరిపాలింప నియోగించి మలిదేవరాజాదులతో సబంధుసపరివారముగా సమయదీక్షనుబూని పట్టణమును విడిచిపెట్టి బయలుదేఱి యేలేశ్వరముకడఁ గృష్ణనుదాఁటి యరణ్యమున సంచరించుచు నచట మందాడి యనుపట్టణమును నిర్మింపించి, లంకన్న సేనాపతిగ నందు నివసించుచుండె ననియు, చెప్పఁబడియెను.

కనమనాయని యుద్ధము.

ఇట్లు బ్రహ్మనాయఁడు సమయబద్ధుఁడై దేశమువిడిచి ప్రవాసముపోయినను బ్రహ్మనాయఁడు బ్రదికియున్నంతవఱకుఁ దనకును దనప్రభువునకును క్షేమము కలుగదని నిరంతరమును దలపోయుచుండునది గావున నాయకురాలెట్లు ప్రతీకారము చింతింపక యూరకుండఁగలదు? అప్పుడు బ్రహ్మనాయఁడు మందాడిలో సురక్షితముగా విశేషప్రాభవముతో వఱలుచున్నాఁడని విని యోర్వఁజాలక యడవిచెంచులను గిరాతకులను రప్పించి బ్రహ్మనాయని పశు

1. బాలగోపన్ననాయఁడు గొల్లవాఁడు.

వులమందలను దూరముగాఁ దఱిమి చెదరఁగొట్టి రావలసినదని యుత్తరువు చేసి పంపించెను. అప్పుడా చెంచులును గిరాతకులును విశేష సైన్యములతో మందాడిపై దండెత్తివచ్చి నాయకురాలి యాజ్ఞాప్రకారము పసులమందలను జెదరఁగొట్టి యల్లరులు గావింప బ్రహ్మనాయని సేనాపతి యైన లంకన్నకును వారలకును భీమసంగ్రామంబు జరిగెను. ఆయుద్ధములో లంకన్న వీరస్వర్గమును జూఱఁగొనియెను గాని, బ్రహ్మనాయని పాదసేవకుఁడును మాలయు విష్ణుభక్తుఁడు నైన కన్నమనాయఁడు శత్రుసైన్యముల నెదుర్కొని భయంకరముగాఁ బోరాడి నాయకురాలిసైన్యములను మందాడినుండి పాఱిపోవునట్లుగాఁ దఱిమితఱిమి గొట్టెను. అటుపిమ్మట బ్రహ్మనాయఁ డాప్రదేశమున నుండిన దనకు క్షేమము గలుగదని యూహించి కృష్ణదాఁటి దక్షిణముగాఁ బోవలయునని నిశ్చయించెను.

బ్రహ్మనాయఁడు శ్రీశైలమునకుఁ బోవుట.

ఆప్రకారము బ్రహ్మనాయఁడు సబంధు పరివారముగా రాచబిడ్డలను వెంటనిడికొని మందాడినివిడిచిపెట్టి బయలువెడలి దొమ్మర్లరేవుకడఁ గృష్ణానదిని దాఁటి మహాప్రసిద్ధశివక్షేత్ర మగు శ్రీశైలమునకుఁబోయి శ్రీమల్లికార్జునస్వామిని సందర్శించి యర్చనాదికకృత్యముల నెఱవేర్చి యచటి రాజయిన మాకరాజునకుఁ దనచరిత్రమునంతయు వినిపించి తనఖడ్గమును గుదువబెట్టుకొని కోటిసువర్ణముల నప్పుగా నీయవలసిన దని యడిగెను. అతం డందుల కంగీకరింపక 13 గ్రామములను గుత్తకు నిచ్చెనఁట[1]! అంతట బ్రహ్మనాయఁడు త్రిపురాంతకక్షేత్రమునకుఁ బోయి కొంతకాల మక్కడ నివసించియుండి మార్కాపురమున 'చెన్నారాయని' పేరను విష్ణ్వాలయము నొకదాని నిర్మింపించి యటుపిమ్మట వీరమేడపి యనుపట్టణమునకుఁ బోయి యచట నివసించుచుండెను. ఇచ్చట నుండఁగానే యేడుసంవత్సరములగడువు గడచెను. అప్పుడు బ్రహ్మనాయఁడు

1. ఆగ్రామము లన్నియు కందనోలిమండలములో మార్కాపురముతాలూకాలోఁ దూర్పుభాగమున నున్నవి. దానిలో మార్కాపురము, దూపాడు, చేపలమడుగు, కోలకులము, అంబసముద్రము, గణపవరము, త్రిపురాంతకము, మేడపి ముఖ్యమైనవిగాఁ జెప్పఁబడియెను.

బంధు పుత్త్ర మిత్త్ర కళత్రాదిజనంబులతో విచారించి నలగామరాజు కడకు రాయబారమును బంప నిశ్చయించెను.

రాచమల్లుని రాయబారము.

రాచమల్లుఁ డనుబిరుదమును వహించిన అలరాజు కళ్యాణపురాధీశ్వరుం డైనవీరసోముని మనుమఁడు. పెదమల్లదేవుని బావమఱఁది యైనకొమ్మరాజుపుత్త్రుఁడు. పల్నాటిప్రభు వైన నలగామరాజున కల్లుఁడు. ఈతనిభార్య పేరు రత్నాలపేరమ్మ. అలరాచమల్లునకును పెద్దనాయనికిని వివాదము తటస్థింపఁగా బ్రహ్మనాయఁడు మధ్యవర్తియై తగవు దీర్చెను గాని, వారలకుం గల మనస్పర్ధలు విడిచిపోలేదు. నాయకురాలికడకు రాయబారముపంపుట యపాయకర మైనదిగావున నీతని బంపుట యుచిత మని సోదరులకుఁ దోఁచినది. వైష్ణవభక్తాగ్రేసరుఁ డైన బ్రహ్మనాయఁడు రాచమల్లునకుఁ బ్రాణాపాయము కలుగకుండఁ దులసిపే రిచ్చెను. ఈగాయబార మలరాజుతలిదండ్రుల కెంత మాత్రము నిష్టము లేదు. ఏలన రాచమల్లుఁడును వానితల్లిదండ్రులును వీరశైవులు. రాచమల్లు తల్లిదండ్రుల నొప్పించి రాయబారమునుబూని గురిజాలకు బయలు వెడలెను. తరువాత బ్రహ్మనాయఁడు దురాలోచనముచేసి తులసిమాలికను మాయోపాయముచేఁ గొనిరమ్మని కుమారుఁ డైనబాలనాయని వానివెనుకఁ బంపెను. బాలనాయఁడు మార్గములో రాచమల్లుని గలిసికొని యొకకాలువను దాఁటుటకై వానితోఁ బందెము వేసికొనియెను. రాచమల్లునిగుఱ్ఱము కాలువను దాఁటలేక యందులో దిగఁబడియెను.

బాలనాయఁ డెక్కివచ్చిన గొఱ్ఱెపొట్టేలు కాలువను దాఁటకలిగెను. పందెముప్రకారము రాచమల్లుఁడు తన మెడలోని తులసిమాల మొదలయిన యాభరణముల నిచ్చివేసెను. పిమ్మట అలరాజు గురిజాలను సురక్షితముగాఁ బ్రవేశించి మామగారిచే నర్హసత్కారములనుబొంది తన రాయబారమును నిండుపేరోలగమున నాతనికి విన్నవించెను. మల్లదేవులకు వారిభాగము నిచ్చి ప్రవాసమునకుఁబోయిన రాచవీరులు స్వదేశమునకు వచ్చుట కుత్తరువీయవల

సినదని ప్రార్థించెను. అందులకు నలగామరాజు సమ్మతింపక పరుషోక్తులాడెను. అతఁ డాగ్రహమును జెంది యచ్చోట నుండ నొల్లక చెర్లగుడిపాడునకు వచ్చెను. అచ్చటఁ గనమదాసును గలిసికొని తనకార్యము నెఱవేర్చుకొనిగాని బ్రహ్మనాయనికడకుఁ బో నని ప్రతిజ్ఞ చేసెను. ఇంతలో నాయకురాలొకబ్రాహ్మణునకు విశేషధనము నొసంగి వానిచే రాచమల్లునకు విషము పెట్టించి చంపించెను. వానిభార్య పేరమ్మ, తనతండ్రియైన నలగామరాజును దూషించి దుఃఖించుచు భర్తతో సహగమనము చేసెను. అంతట నిరుపక్షములవారును ఘోరావహమును సలుపుటకు సర్వప్రయత్నములను జేయుచుండిరి. వీరులు కొందఱు బ్రహ్మనాయనిప్రక్కను నిలిచి ప్రాణము లున్నంతదనుక నాతనికై పోరాడెద మని ప్రతిజ్ఞావాక్యములు పలికిరి.

బ్రహ్మనాయఁడు యుద్ధమునకు వెడలుట.

బ్రహ్మనాయఁడు యుద్ధముచేయుటయే విధికృతమైనధర్మ మని నిశ్చయించినవాఁ డగుటచేత బాలమల్లదేవుని వీరమేడపికిఁ బట్టముగట్టి తనపుత్త్రుఁడైనబాలచంద్రుని సచివకార్యమునందు నియోగించి కరణకార్యం బనపోతనకిచ్చి మాడచి యనువీరవనితను రాణివాసమునకు రక్షకురాలినిగఁ జేసి తన పక్షమును బూనివచ్చిన వీరనాయకులతో నొక్క శుభముహూర్తమున దాడి వెడలెను. బ్రహ్మనాయని దండయాత్రాప్రారంభము వీరచరిత్రమున నిట్లభివర్ణింపఁబడియెను.

“బ్రహ్మన్న గదలెను బాయని వేడ్కఁ
బట్టిరిగొడుగులు పాలకినెత్తి
సూర్యాతపంబు పై సోఁకనియట్లు
పాలకీలను నిరుపార్శ్వంబులందు
నందంబుగాఁబట్టి రరిగెలజోళ్లు
వింజామరంబులు వెలయఁగా నెమలి
కుంచెలవారును గూడివీరంగ

నాయఁడు రాజులు నయముతోఁ జనఁగ
ముందుడమాయీలు మురజసంఘంబు
బూరలు భేరీలు పోటుధారలును
గాహళవంకిణి కాలికొమ్ములును
శంఖసమూహంబు సన్నాయిజోళ్లు
మురళీచయంబును ముఖవీణె వితతి
నరగలుతప్పెటల్ నయమైన డోళ్లు
తమ్మటమ్ములు నెంచఁ దగు వీరణములు
ఘనమైనరుంజలు కనకతప్పెటలు
చేగంటలును మఱి చిఱుగంటచయము
ఘనమైనమ్రోఁతచే గగనంబు గప్పఁ
గుంభినివణఁకంగఁ గులగిరులెల్లఁ
బ్రతిమ్రోఁతలీయంగ భావ ముప్పొంగ
నావాలవారును నాణెమువారు
కొండ్లవిందులవారు గోవిందువారు
ముతసానివారును ముయ్యూరువారు
నర్వాలవారును నాయనివారు
పైడిచుక్కలపాలపర్తివారలును
బలుమూరివారును బాలెమువారు
కేవనూళులవారు రేచెర్లవారు
నట్లూరిముట్లూరి యాఖ్యలవారు
చెవులవారును మఱి చిల్లరవారు
గురియైననాయకుల్ గూడియేతేర
గండువా రేగురు గదిసినవేడ్కఁ
జనిరి బిరుదులతో సాహస మడర
నొప్పుగా నిందఱు నుఱువైనబంట్లు

ఘోటకంబులు మేటికుంజరావళులు
నుత్సాహమున హుటాహుటినడువంగ
బట్టువారలుమించి బహువిధంబులను
బిరుదుపద్యంబులు పెల్లుగాఁ జదువ
నుద్దండమాష్టీలు నొనర నిర్వంక
భైరవఖడ్గముల్ పట్టుకరాఁగ
శీలమ్మతనయుని సింహవిక్రముఁడు
కరమర్థికనుకులకన్నమనడిచె
సకలవీరచయంబు సంతతోత్సాహ
పౌరుషంబులుమీఱ బ్రహ్మ కిట్లనియె
"మముఁజూడునాయఁడా మాలావుకోలఁది
మముఁజూడుబ్రహ్మన్న మాశౌర్యపటిమ
సింధురంబులమీఁదఁ జెన్నుగాఁ దుమికి
కుంభస్థలంబులు క్రుంగఁజేసెదము
కొదమసింగంబులఁ గూలఁద్రోచెదము
గండభేరుండాల ఖండింతుములుక
వాయువుఁబోనీక వడినాపఁగలము
జాతవేదునిబట్టి చమిరివైచెదము
ఘనసముద్రముఁజొచ్చి కలఁగఁజేసెదము
కుంభినిఁగాళ్లతోఁ గ్రుంగఁదన్నెదము
కులగిరులైనను గొట్టివైచెదము
గురిజాలనేలెడు కువలయేశ్వరునిఁ
గొలపగకైపట్టి గ్రొవ్వణఁగించి
చలమునవిడువక చంపఁగాఁ గలము"
అని పెక్కుపంతంబులాడుచు నడువఁ

జూచినవారలు చోద్యంబుగాఁగఁ
బటువిక్రమాఢ్యులు పల్నాటివీర
వరులంచుఁ బొగడుచు వర్ణించి పలుక
మలిదేవభూపతి మంత్రిబ్రహ్మన్న
కంపింప భూస్థలి కదలి రావేళ"

ఇట్లు బ్రహ్మనాయఁడు విశేషసైన్యములతో బయలువెడలి కార్యముపూడికలనికి వచ్చుమార్గమునఁ ద్రిపురాంతకమున దండువిడిసి యచ్చటి త్రిపురాంతకేశ్వరుని సందర్శించి యచ్చోటనుండి మరల బయలుదేఱి కార్యముపూడికి దక్షిణమున నాలుమైళ్లదూరమున నున్న మేళ్లవాగుఁ జేరెను. అచ్చట నివసించి యుండి కార్యముపూడి రణరంగమును బరీక్షించుటకై బ్రహ్మనాయఁడు తన ప్రియసేవకుండును మాలయు నగు కనుకులకన్నమనాయని నార్ధరాత్రంబునఁ బంపెను. అతండును తన ప్రభువునాజ్ఞ శిరమునఁ దాల్చి బయలుదేఱినవిధ మీక్రింది తెలుంగున వీరచరిత్రమున వర్ణింపఁబడినది:—

"కరమున గుజ్జరికడియముల్ మెఱయ
నేలైనపిడిఘంట నెమలిసోగలును
నల్లనిధట్టిని నయమొప్ప గట్టి
యర్ధనారీఝుల్లకాదులు నమర
ఘోరభైరవగద కోరమీసములు
నెగుభుజంబులుమించు నెఱజేరుగడ్లు
ఘనమైనదేహంబు కాలిపెండెరము
వెరవైన భీకరవేషంబుతోడఁ
గదలెఁ గన్నమనీఁడు కదనభూమికిని"

ఇట్లు కన్నమనాయఁడు కార్యముపూడి రణరంగమునకుఁబోయి యచ్చటనున్న యొక యెఱుకలసానివలన నచ్చటి విశేషంబులనెల్ల నారసివచ్చి బ్రహ్మనాయనికి నివేదింపఁగా నతండు సంతోషించి నిజసైన్యములతో నక్కడ

నుండి బయలుదేఱి కార్యముపూడి ప్రవేశించి యుద్ధమున కాయత్తపడుచున్న వీరనాయకుల వేగము వలదని వారించుచుండెను.

నలగాముఁడును యుద్ధసన్నద్ధుఁడగుట.

అంతట గురిజాలలో నలగామరాజు నాయకురాలి ప్రేరణ వలన బ్రహ్మనాయనితో యుద్ధముచేయ నిశ్చయించి యుద్ధవార్తను నానా దేశరాజులకుఁ దెలియఁజేసి వారల సాహాయ్యమును బడయుటకై ప్రయత్నించెను. ఇంతలో బ్రహ్మనాయనియొద్దనుండి యొకబట్టువాఁడు రాయబారమును బూని నలగామరాజుసభకువచ్చి యతనిచే సగ్వాసత్కారములనుగాంచి మలిదేవరాజాదులు కార్యముపూడికి దాడివెడలివచ్చియున్నా రని తెలిపి సంధికార్యమునుగూర్చి యిట్లు పలికెను.

"రాజాధిరాజ విరాజితకీర్తి
రాజవేశ్యావిటప్రాభవప్రకట
గండరగండాంక ఘనదానచతుర
ధైర్యనిర్జితమేరుధరణీధరేంద్ర
శౌర్యవిక్రమకళాసంపూర్ణచంద్ర
భాస్కరసమతేజ ప్రౌఢగుణాఢ్య
మానదుర్యోధన మైలమసుతుఁడ
అనుఁగుభూపతిపుత్త్రి యంచితగాత్ర
వీరకామనరేంద్ర విభవదేవేంద్ర

* * * * *

పగ వృద్ధిఁబొందించు భ్రష్టులే కాని
యడఁగించునేర్పరు లవనిలో లేరు

* * * * *

పోరుమంచిదికాదు భూమినెక్కడను
బాడౌను దేశంబు పగ మించెనేని

ప్రజలెల్ల నశియించి పాటిపోవుదురు
బండారమునకును బైకంబు లేదు
రాణువయాఁదుచే రహిచెడియుండుఁ
జేజీతగాండ్రెల్లఁ జెలఁగి కోపించి
యీగలజీతంబు లిమ్మందు రపుడు
పతిబంటుమేరలు పరిహారమౌను
బంపినఁబనిసేయఁ బ్రాలుమాలుదురు
తెలిసినశాత్రవుల్ ధీరతతోడ
భూమినిగొనుటకు బుద్ధిపెట్టుదురు
పగవారివార్తలు పరికింపలేరు
మేకొనిమీలోన మీరుపోరాడఁ
జూచెడువానికిఁ జులకన యౌను
(కోరిశాత్రవులు మీగుట్టెఱుంగుదురు)
పలువలు మిముఁజేఱి పగఁజాఱనీక
చెప్పుచునుందురు చెనటివాక్యముల
నైకమత్యముచెడు నద్దానితోడఁ
జెడునుబలంబును జెడునుభాగ్యంబుఁ
జెడునుయశంబును జెడునుశౌర్యంబుఁ
జెడునురాజ్యమ్మును చెడ్డపిమ్మటను
దేశంబుపాడౌను నృపవరా సుమ్ము"

అని భట్టుమూర్తి సంధివాక్యములను బలుకఁగా నలగామరాజు వానిని దృణీకరించి సంధి పొసంగనేరదనియును, బ్రదుకఁదలంచినయెడల బాలరాజులను దిన్నఁగాఁబోఁద్రోకొని మరలిపొమ్మనియును, అట్లు పోకయుండిన రణభూమికి బలిగ నర్పింతుననియును, బ్రహ్మనాయనికిఁ జెప్పి బుద్ధి గఱప వలసినదనియును బలికెను.

అంతట భట్టుమూర్తి యాగ్రహమునుబొంది నలగాముని దూలనాడి బ్రహ్మనాయని ప్రతాపాదుల నభివర్ణించి భయపెట్టఁజూచెను గాని నాయకురాలు వానిమాటలను తృణీకరించి 'నీవెంత, నీబలమెంత, బట్టువాఁడవుగాన బ్రదికిపోతివి, పోపొమ్ము'' అని గంభీరవాక్యములు పలికి దూతను వచ్చినదారిని బంపివైచెను. అటుపిమ్మట నలగామరాజును నాయకురాలును మంతనముచేసి యుభయపక్షములలోని బలముల తారతమ్యమును విచారించి తమకు సాహాయ్యము చేయవలసినదిగా నానాదేశరాజులకును లేఖలను బంపించిరి. నాయకురాలు నిజబలంబులను యుద్ధమునకై సన్నద్ధపఱిచి నలగామునకుఁ బ్రోత్సాహముం గలిగించుచుండెను. నలగాముఁడును వీరపురుషోచితము లైన కర్మములనెల్ల నాచరించి గజారోహణం బొనర్చి నిజసైన్యంబులతోడ బయలుదేఱి కార్యముపూడికి వచ్చెను. మహారాజు లనేకు లసంఖ్యాకము లయిన సైన్యంబులతోడ వచ్చి యుద్ధభూమిని నలగామరాజును గలిసికొన్నట్లుగా వీరచరిత్రమున మిక్కిలి యతిశయోక్తులతోఁ గూడిన వర్ణనములతోఁ జెప్పఁబడియెను. ప్రతాపరుద్రుఁడు వేయియశ్వంబులనంపె ననిమాత్రము చెప్పఁబడినదిగాని యాతండు యుద్ధభూమికి వచ్చినట్లు చెప్పఁబడి యుండలేదు. అచ్చట వీరనాయకులు యుద్ధమున కాజ్ఞయిమ్మని బ్రహ్మనాయని తొందఱపఱుపసాగిరికాని నీతివాక్యములచే నాతఁడు వారల వారించుచుండెను.

బాలనాయని కథ.

ఇట్లుభయపక్షములవారును గార్యముపూడికిఁ జనుదెంచి యుద్ధసన్నద్ధులై యుండఁగా నచ్చట వీరమేడపిలో బ్రహ్మనాయనిపుత్త్రుఁ డైన బాలనాయఁడు తోడిబాలురతోఁగూడి తల్లి యైతాంబ వారించినను వినక పోయి బొంగరము లాడుచుండఁ, జూడవచ్చిన యమ్మలక్కలలోఁ గోమటియన్నమ్మ మీఁగాలికి బాలునిబొంగరము దాఁకి యామె మూర్ఛిల్లి పడిపోయెనఁట! పిమ్మట జుట్టును మూఁగినయువతులు శైత్యోపచారములుసేయఁగాఁ గొంతవడికిఁ దెలివిగాంచి యాకోమటియన్నమ్మ పోతుసింగమువలెఁ బొగరెక్కియున్నావుగాన యుద్ధభూమిలో నున్నమీయయ్యలను గలిసికొన్నచోఁ గండకావర

ముడిగెడు నని వానిని దిట్టి శపించెనఁట! ఆపలుకులు చెవిఁబడ్డతోడనే యొక్కనిమిషమైన నచ్చట నిలువనోపక యామెను మన్నింపవేడి వెంటనే తల్లియొద్దకుఁ బఱుగిడిపోయి యుద్ధసమాచారములు దెలుపవలసినదని యడిగెను. ఆమెవలన సకలసంగతులను దెలిసికొని తానుగూడ సమరస్థలికిఁ బోయి తండ్రులకుఁ దోడ్పడి స్వధర్మమును నెఱవేర్చుకొనుట కనుజ్ఞయిమ్మని తల్లిని బ్రార్థించెను. ఆమె తనయుని సాహసంబున కచ్చెరువందుచు బాలురకు యుద్ధము వలదనియు, యుద్ధముల వలనఁగలిగెడి యనర్థముల నెన్నింటినో బోధించియు, నామార్గమునుండి వాని చిత్తమును మరలింప నెంతయో ప్రయత్నించెనుగాని వాని మనంబు మరలకుండెను. అప్పు డాతఁడు వీరధర్మప్రభావంబు తల్లికి నీవిధముగా బోధించెను.

"కార్యమపురమందు ఘనపరాక్రమతఁ
దండ్రులునిలుచుండి దండుసేయంగ
నేనిటనుండుట నీతియే తల్లి?
యుండునంటకునీకు నొప్పునా మనసు
నీవెఱుంగనిధర్మ మేనెఱుంగుదునె
ప్రాకృతభామలపగిదిఁ బల్కెదవు
వెఱ్ఱితనంబేల వీరునిసతికిఁ
గాయ మనిత్యంబు కల్మిహుళక్కి
జలబుద్బుదవిధంబు క్షణభంగురములు
షట్చక్రవర్తులు సకలభూపతులు
చనిరి బ్రహ్మేంద్రాదిసర్వదేవతలు
భూతంబు లైదును బొలియుచు నుండు
శౌర్యసత్కీర్తులు సమయ వెన్నటికి
సకలపురాణముల్ సద్ధర్మకథలు
నీతిశాస్త్రంబులు నీవెఱుంగుదువు
పౌరుషాధికతచే బ్రదుకుట లెస్స

జననమరణములు జనులకు నిక్క-
మాలయంబున నున్న నడవిలో నున్నఁ
దప్పక దార్కొనుఁ దథ్యంబు గాను
బుణ్యలోకంబును బొందుమార్గముల
వినిపింతు నేఁదల్లి విశదంబు గాను
సజ్జనసంగతి సంసార మెడల
గురువుబోధించిన గుఱివీఁదమనసు
నిలిపిమరణ మొందు నిశ్చలుఁ డొకఁడు
ప్రాజ్యసామ్రాజ్యసంరక్షణమందు
ఘనరణమ్మునబొమ్ము గాయాలనొంద
మనసుచలింపక మరణంబునొందు
శౌర్యపరాక్రమసంపన్నుఁ డొకఁడు
వీరలిద్దఱు లెస్స వినువీథి కేఁగి
యాదిత్యమండలం బరుదారఁ జించి
పోయి పుణ్యంబుల భూమిఁ జెందుదురు
మొదటికార్యముఁబూను ముఖ్యత లేదు
శౌర్యంబుచే మాకు సంపాద్య మగును"

ఇట్లు వీరధర్మమును బోధించుటఁ జూచి తనకుమారుఁ డింక యుద్ధమునకుఁ బోయి మరణము నొందఁగలవాఁ డని నిశ్చయించి బెగ్గడిల్లుచు నెట్టెట్టి నీతులనో బోధించి యెట్టులయిన వానిచిత్తంబు మరలింపఁజూచెను. వాఁడు వినకుండుటఁ జూచి తల్లి "నాయనా! నాహితవచనంబులు నీచెవినాట కున్నవి; పోయినవాఁడవు పోవుచునే యున్నావు గానఁ బోవునపుడు నీభార్య మాంచాలను జూచి మఱి పొమ్ము" అని యనుజ్ఞ నిచ్చెను. అట్లే యని బాలుఁడు తన యాఱుగురు సోదరులతో బయలుదేఱి మార్గమధ్యమునఁ దన యుంపుడుకత్తెయైన సబ్బాయి యనువేశ్యయొక్క గృహంబునకుఁబోయి యామెతో సరససల్లాపములాడి యుద్ధవార్తను దెలిపి యామెకు విశేష

బహుమానము లొసంగె నని వీరచరిత్రము నందు నభివర్ణింపఁబడియున్నది.[1] అనపోతు బాలనాయని ప్రవర్తనమును దెగడుచు వేశ్యావృత్తిని గూడ నీక్రింది విధమున నిందించెను.

"కామాంధకారంబు కన్నుల దట్టి
క్రింది మీఁ దెఱుఁగక కేరుచున్నావు
కలధనమెల్ల భోగముదాని కిచ్చి
చేసితి పాపంబు చెడ్డ వెచ్చంబు
నిహపరదూరపు టీ నడ కేమి
సబ్బాయిపైఁ బ్రేమ సర్వనాశంబు
సోలిదానికి మ్రొక్కి సొమ్మెల్ల నిచ్చి
యిందఱ నడిగిన నేమి లాభంబు
వారకాంతల రీతి వర్ణింపరాదు
బిడ్డలకోసఁగక ప్రియురాలి కీక
చీమలుగూర్చిన చెలువునఁ గూర్చి
ధనవంతులగు వారి ధనమెల్లఁ దోచి
ముంజికాండ్రనుజేసి ముసిపెమడంప
వ్యర్థులై విటవృత్తి వసుమతి మీఁదఁ
బోయిరి బ్రతికెడు పొందిక లేక
యుర్విపై వేశ్యల కోలి యిచ్చుటలు
వినలేదు కనలేదు వేడబం బిద్ది"

అని యిట్లు తన బ్రాహ్మణసోదరుఁ డైన యనపోతరాజు చీవాట్లు పెట్టి మందలింపఁగా సిగ్గుచేఁ దలవాంచి ప్రత్యుత్తర మీయక తన యాభరణముల నెల్లను దీసి బీదలకు భిక్షుకులకు, బ్రాహ్మణులకు, భట్టులకు, దానము చేసి

1. ఏమి హేతువుచేతనో వీరచరిత్రము నందు శృంగారభూయిష్ఠ మైన వేశ్యాకథనమును జొప్పించి పదునాలుగేండ్ల బాలునకు వేశ్యాసంపర్కమును గలిగించుట కవికల్పన మని యూహింపవలయును; లేదా బాలనాయకుఁడు పదునాలుగేండ్లవాడు కాఁడని యూహింపవలయును.

తన మామగారయిన గండుకన్నమనాయనియింటి కేఁగెను. రాకరాక చాలకాలమునకు వచ్చిన యల్లుని నత్తవారు పరమసంతోషభావముతోఁ బూజించిరి. అతండును గొన్నిదినంబులు తన వచ్చినకార్యమును మఱచి మదనవ్యాపారపరతంత్రుఁడై యంతఃపురంబును విడువక నిజసఖి యైన మాంచాలతోఁ గ్రీడించుచుండెను. అపుడు పతివ్రతయు, సుగుణవతియు, సుందరియు నగునిట్టి భార్యను విడిచి, వేశ్యతోఁ గాలముఁ బుచ్చుచున్నందులకుఁ బశ్చాత్తాపమును బొంది తన్నుఁ దాను దూఱుకొనసాగెను. ఇట్లత్తవారియింట బాలచంద్రుండు మాంచాలతోడి వినోదంబులఁ బ్రొద్దులు పుచ్చుచుండ నొకనాఁడు మాంచాల తన భర్త తా వచ్చిన పనిని మఱచియున్నవాఁడని యెంచి యిట్లనియె.

"నాతోఁ బెనంగిన నయమేమి లేదు
కడువడిఁ గలనికిఁ గదలుఁడి మీరు
కులవైరముం దీర్చు గురుసాహసుండు
పరికించి చూడ నెవ్వరు మీరుదక్క"

ఇట్లు వచ్చిన కార్యమును దమ్మును మఱచి బాలనాయఁడు పిఱికిపందయై స్త్రీలోలుఁడై యంతఃపురంబునఁ గ్రీడించుచున్నవాఁడని యాతని తమ్ములాఱ్వురును మిక్కిలి రోషించి ఘనరౌద్రభావంబుతోడఁ గత్తులు దూసి వెడలిన కోపాగ్నిచే మాఱుంగక కేరునట్టి మదగజంబులరీతి గండువారింటిముంగల నిలిచి నగరు తల్లడమంద భీకరంబుగా నార్చి పెడబొబ్బ లిడిరి. అప్పు డతఁ డాగ్రహముతోఁ గటారి పెఱికి తమ్ములపై నుఱికె. అంత వారు బాలనాయఁడు తమపైఁ గవియ లజ్జాకరంబు లగు పోటుమాటలచే నొప్పించి సిగ్గుపడునటులఁ జేసిరి.

అప్పుడు బాలనాయఁడు తన తప్పును గ్రహించి యంతఃపురంబునకుఁ జని తన చేతి కటారిని భార్యచేతి కీయఁగా నామె నవ్వుచు భర్తను జూచి—

"రతిరాజ సౌందర్య రణరంగధీర
కమల బాంధవతేజ కరుణాలవాల

వినతాత్మజుని లావు వెసనీకుఁ గలుఁగు
సామీరిసమమైన సాహసం బబ్బుఁ
గృష్ణుని కనయమైనకీర్తి ఘటిల్లు
గవికాంతియుతుఁడవై రంజిల్లుచుండి
యలరాజుపగఁదీర్పు మనుజాలతోడఁ
బటుతర విక్రమ ప్రౌఢిమ మెఱయ
శ్రీగిరిలింగంబు చెన్నకేశవుఁడు
వరము లొసంగఁగ వర్ధిల్లఁ గలరు
శాత్రవ విజయంబు సమకూఱు మీకు
నీయాయుధము వడినిచ్చును జయము
కలియుగంబున మీకు ఘనపూజ లమరు"

అని ప్రాణనాథుని ఆశీర్వదించి యాకటారిని మరల నొసంగ నాతండు దానిం గైకొని యచటనుండి గదలి నిజగృహంబునకుం జని తల్లికిం జెప్పి యామెచే నాశీర్వాదములం బడసి మాయచే ననపోతరాజును వీరమేడపికిఁ బంపి తక్కిన సోదరు లార్గురతోడను రణభూమికి బయానమయ్యెను. ఇచ్చటఁ గార్యముపూడిలో నాయకురాలు యుద్ధము జరుగకుండ నెట్లయిన సంధిగావింపఁ బ్రయత్నించుచుండెను.

కోటకేతరాజు రాయబారము.

ఒకనాఁడు నలగాము కొలువులో నాయకురాలు గూరుచుండి చింతపల్లిరెడ్డి, మాడుగుల వీరారెడ్డి, కొండ అన్నమరాజు, కోటకేతరాజు మొదలగు ప్తవర్గమును రప్పించి సమభావమును వహించి,

"బాహుపరాక్రమప్రాభవు లయిన
వీరులు రాజులు వెలయఁ శోభిల్లు
కొలువులోనికిఁ బోయి కూరిమి మీఱ
సమరంబు గాకుండ సంధి యానట్లు

మాటాడి యటమీఁద మాచెర్లభాగ
మేలుకొమ్మని చెప్పు డింకొక మాట
నాయనివద్దకు నరసింగుఁ దెచ్చి
కులవైర మడఁతుము కోరి మీరంద
ఱొక్కటికమ్మని యొప్పించి రండు
మిగిడి పోవలయును మనదేశమునకు"

అని చెప్పి సంధికార్యము నెఱవేర్పఁ బంపించెను. కేతరాజు మొదలగు రాయబారులు పెదమలిదేవమహీపతి కొల్వునకు వచ్చి యొండొరుల క్షేమసమాచారములఁ దెల్పుకొన్న తరువాత నలగామరాజుచే మన్ననగాంచిన పిమ్మట కేతరాజు బ్రహ్మనాయని నిట్లని హెచ్చరించెను.

"వినవయ్య నాయఁడ విన్నపం బొకటి
అతివివేకులు మీర లఖిలరాజ్యముల
మీదృశు లయినట్టి మేటి విక్రములుం
నీతిమంతులు లేరు నిశ్చయం బిదియు
గొంతుగోయఁగ మీరు కోరినయట్టి
నరసింగరాజును నయమునఁ దెచ్చి
యిచ్చెద నామీఁద నేమైన లెస్స
సరవిరక్షించిన సంహరించినను
భారంబు మీపైనఁ బాదుకయుండు
మునుపటిరీతిని ముదమొప్ప మీరు
మాచెర్లభాగంబు మక్కువ నేలి
సంరక్షణముసేయు జనములనెల్ల
నుభయరాజులుమీర లొక్కటై యున్న
మావంటివారికి మానసం బలరు
నఖిలాధిపతులు మీయాజ్ఞ సేయుదురు
మీ రెఱింగిననీతి మే మెఱుంగుదుమె

ఉభయసంస్థానంబు లొక్కటి మాకు
ననుఁగు రాజేంద్రుఁడు హరిపురి కేఁగు
సమయంబునను బుత్త్రిచయమును దెచ్చి
మీకు సమర్పించి మేను త్యజించెఁ
దర్వాత నిర్వాహదశయెల్ల నీది
యొకయిల్లు రెండుగ నొప్పనొనర్చి
తగ్గు మాటాడెనే యెపు డెవరైన
మతిచెడి యీలోన మనసులు గలఁగ
నిందుచేఁ బగ హెచ్చె నీర్ష్య జనించెఁ
గోడిపోరాడుట కూడదటంచు
నిచ్చలోఁ జెప్పిన నెవ్వరు వినిరి?
గురిజాలపురికినిఁ గోడిపోరాడ
నెవ్వరు వచ్చిరి యిదియేమి మాయ
ఐనట్టికార్యంబు లన్నియు నీవు
దెలిసియే యున్నవి తేటతెల్లముగఁ
గతజలంబుల కడ్డుగట్టిన రీతి
జరిగిన దానికిఁ జర్చ లేమిటికి
నావలీవలివారి నరసి రక్షింప
భారంబు నీయది బ్రహ్మనాయండ!
కౌరవతతి నెల్లఁ గదనంబునందుఁ
గూకటివేళ్లతోఁ గూల్చి యామీఁద
బహుళాత్రినడవులపాలైరి గాక
పాండవు లేమేలుపడసిరి చెపుమ?
చేరి మీరొక నరసింగునికొఱకు
సకలభూపతులను సమయంగఁ జేసి
పాడైనరాజ్యంబు పైనఁబెట్టికొని

చివరకు ఫలమేమి చెందంగఁ గలరు?
పొందిక గలహంపు బుద్ధులు మాని
సవతిపుత్త్రులకిప్డు సంధి యొనర్చి
యనుకూలముననుంట నగ్వాంబు మీకు
నరయ నింతియకార్య మనుఁగురాజాన
నీయాన మేమింక నిల్వ మిచ్చటను”

అనియిట్లు ధరణికోటవిభుఁడు భీమరాజపుత్త్రుఁడైన యీరెండవకేత రాజు సామవాక్యముల కిష్టపడక బ్రహ్మనాయని సైన్యములోని వీరనాయకులు వీరలను జంప దుగాలోచనముచేయఁగా వారలను వారించి బ్రహ్మనాయని మఱఁదులు గన్నమనాయఁడు, కొమ్మరాజు, వారలవాక్యములను బూర్వ పక్షముజేసి వీరనాయకులను బ్రహ్మనాయని సంధికార్యమునకు సమ్మతించు నటులఁ జేసెను.1

బాలనాయఁడు కార్యముపూడి ప్రవేశించుట

అక్కడ బాలనాయఁడు నలగొండశిఖరమునుండి కార్యముపూడి రణ రంగంబు నవలోకించి దోర్న్నిని రప్పించి యాతని కాయుద్ధభూమిని జూపింప నాతఁ డంతయుం గలయఁజూచి యాయాదిశల నున్న శత్రుసేనాధిపతుల నీక్రిందివిధమున బాలనాయనికిఁ దెలిపెను.

“నరనాథుఁ డైనట్టి నలగామరాజు
గొల్లైనచుట్టును గూడికాపాడు
సేనాధిపతులను జెప్పెద వినుము
పడమటిదిక్కునఁ బౌజులబ్రహ్మ
సంకోజి గణపతి సరవితూర్పునను
నాయకురాల్ దక్షిణంపుదిక్కునను

1 కోటకేతరాజు క్రీ. శ. ౧౧౮౦-వ సంవత్సరమున ధరణికోటకుఁ బాలకుఁ డగుటకుఁ బూర్వమే [illegible]డ్రిశాలముననే యీరాయబారము నడపినాఁడు.

దంట లైయుండిరి దక్షుత మెఱయ
నందెలరాముండు నాగెమలిపురి
ముమ్మడిరెడ్డియు మొనతీర్చినట్టి
పొందుగలను నేలు భూరివిక్రముఁడు
వీరమ ల్లనునట్టి విఖ్యాతుఁ డొకఁడు
నుత్తరభాగాన నుండిరి వేడ్క
నిందఱనెల్లను హెచ్చరించుచును
దిరుగుచు నరసింగధీవరుఁ డుండె
విక్రమసింహంబు వీరకామేంద్రుఁ
డప్పభంగిసేనతో నచ్చట విడిసె.”

అంతట బాలనాయఁడు నలగొండ వదలి సోదరులతో బయలుదేఱి పోయి కార్యముపూడి కరిగి సభలోఁ బ్రవేశించి రాజదర్శనమునకు మార్గ మిమ్మని సభాస్తారులఁ ద్రోచుకొని రాజుసమ్ముఖమునకుఁబోయి మ్రొక్కెను. ఇతని రాక యెవ్వరికిని సంతోషము గలిగింపలేదు. రాజు భయముచేఁ బెడమొగము పెట్టెను. అప్పుడు కొలువులోఁ గూర్చుండిన బ్రహ్మనాయని ప్రియశిష్యుం డగుమాలకన్నమనాయఁడు బాలుని తుందుడుకుఁదనమును నిందించి తృణీక రించి పలికెను. బాలనాయఁడు సంధికార్యమున కొప్పుకొన్నందులకు మలిదేవ భూపతిని సమ్ముఖంబున దూషింప నారంభించెను. బాలనాయఁడు తన మామ యైన గండుకన్నమనాయనితోడఁ గొంతవడి చర్చించి యోధులకు రోషము వచ్చుమాటలాడి యుద్ధమునకుఁ బురికొల్పసాగెను. బాలనాయఁడు తనభార్య చెప్పినమాట విశ్వసించి తనతో యుద్ధభూమికి రానీయక శత్రువులతోఁ బోరాడి కీర్తిగడింపనీయక మిషపెట్టి వీరమేడపికిఁ బంపి మోసముచేసె నని దుఃఖించి అనపోతరాజు ప్రాణత్యాగము చేసిన సమాచారమును మాడచి యను యువతివచ్చి తెలుపఁగా బాలనాయఁడు మిక్కిలి చింతించి మహో గ్రుఁడై లేచి తానొక్కఁడుపోయి శత్రువులమూఁకని పోరాడి విజయంబు

గాంతు నని ప్రతిజ్ఞ చేసెను. బ్రహ్మనాయఁడు తనకుమారుని పౌరుషవిక్రమాదులకు మెచ్చుకొని యుద్ధమును జేయుటకు సమ్మతించి తనకడకు వచ్చిన రాయబారులను మరలఁ బంపి వైచెను. అటుపిమ్మట యుద్ధము ప్రారంభమయ్యెను.

బాలచంద్రనరసింహుల యుద్ధము.

మొట్టమొదట బాలనాయఁడు తనతండ్రివలన రణనీతి నుపదేశము నొంది బ్రహ్మనాయనికి నమస్కృతులు గావించి రణభేరు లధికమై మ్రోఁగుచుండఁగాఁ జంద్రాయుధము నొఱనుండితీసి జళిపించి యుగ్రుఁడై నిజసైన్యసమేతుఁడై శత్రుసైన్యముల నెదుర్కొన బయలుదేఱెను. ఇట్లు బయలుదేఱిన బాలచంద్రుని సైన్యమును నరసింహభూపతిసైన్యములు మార్కొనియెను. అప్పుడు బాలనాయని ధాకకు నిలువఁజాలక నరసింహుని సైన్యంబులు పలాయనంబు లగుచుండ నరసింగరాజు నిలువఁబడి పాఱిపోవుట వీరధర్మంబు గాదని ధైర్యవాక్యములం బలికి హెచ్చరించి పాఱిపోవుబంటులకు పౌరుష మెక్కించి మరల్చుకొని శత్రుసైన్యంబుల పయింబడిన నుభయపక్షములవారికిని సంకులసమరం బయ్యెను. అప్పు డెదురుగ నొక్కశూరవరుఁడు వెల్లనైన భద్రగజము నెక్కి రాఁగ నతండె నరసింహుఁ డని భ్రమించి బాలనాయఁడు సింగంపుఁగొదమమాడ్కి వానిపై దుమికి మదగజముయొక్క ఘనమైనమస్తకంబును ఖండించి ధరపైని గూల్చి మొలనున్నకటారితో వీరవరుని వక్షఃస్థలంబును బొడిచి వ్రక్కలుచేసి తమకంబుచే వాని తలఁ దెగవ్రేసి తనచేతఁ బట్టుకొని తండ్రికడకు విచ్చేసి యిదే నరసింహుని శిరం బని యాతని ముంగటం బడవైచెను. అంతట నయ్యది నరసింహుని శిరము కాదని బ్రహ్మనాయఁడు చెప్పఁగా సిగ్గుపడి మరల సమరభూమికిఁ జనుదెంచి యెప్పటియట్ల దలంపడి నరసింహభూపతితోడ ఘోరమైన యుద్ధముఁ జేసెను. ఆయుద్ధమునందు నిక్కముగా బాలనాయఁడు నరసింగుని సామంతరాగోలచే వక్షంబునం బొడుచుఁగా నతండు మత్తగజంబుపైఁ గూలెను.

నరసింహుని తలగోయుట.

అంతట బాలనాయఁడు పశ్చాత్తప్తుఁడై మిక్కిలి దుఃఖించి నరసింహుని చెయ్దములం దలపోసి తనవలన దోష మేమియు లేదని వక్కాణించుచుఁ గత్తితోఁ దలగోసి యద్దానిం గైకొని బ్రహ్మనాయని సభకుఁ బోయెను. బాలనాయఁడు చేసిన వీరకృత్యమున కద్భుతం బంది నరసింహుని మరణమునకెల్లవారును మిక్కిలి దుఃఖించిరి. తుదకు బ్రహ్మనాయఁడు సహితము బాలనాయని నిందించెను.

బ్రహ్మనాయని దోషము లెన్నుట.

అందులకు సహింపఁజాలక బాలనాయఁడు తండ్రి చేసిన దుష్కార్యముల నెన్ని యీక్రింది రీతిని దూషించెను.

“వెడవెడయేడ్పులు వేగచాలింపు
కొల్వులో మామను కొమ్మభూపతికి
నలగాజుపగకయి యప్పగించితివి
నీస్వభావం బింక నే వివరింతుఁ
బోఁగొట్టితివి కోడిపోరున భూమి
నిను నమ్మివచ్చిన నీమేనమఱఁది
ప్రాణంబు గొన్నట్టి పాపాత్ముఁడవు
చెలువుమాడఁగఁ బంపఁ జెవులరాయనను
జటులకర్మండవై చంపించితీవు
ఘను వేంకజోదును గలనికిఁ బంపి
మందలోఁ జంపితి మాయ యొనర్చి
యిటువంటి నీచేష్ట లెన్నివర్ణింతు”

ఇట్లు తండ్రిచేసిన దుష్కృత్యములను దూషించినఁ దండ్రియు ‘విమతులకు వెన్నిచ్చి వచ్చిన నీవంటి వీరుఁడను గాను’ అని యుల్లంబు నొవ్వనాడఁ బలికెను. ఆపలుకు చెవులకు శూలమైనాట నచట నిల్వఁజాలక బాలనాయఁ

దహంకారగరిమచేఁ గదనభూమికి వచ్చి శత్రుసైన్యములమార్కొని సోదరులతోఁగూడ మృతినొందెను.

మలిదేవరాజుల మరణము.

తమసోదరుఁడైన నరసింహభూపతి మరణమును విన్నతోడనే బాలమలిదేవరాజులు గుండెలడలి చచ్చిరని చెప్పఁబడినదిగాని యదియే నిక్కమైనయెడల వారలు మాయోపాయముచేఁ జంపఁబడియుందురు. వీరలకు రక్షకుఁడుగ నుండిన మాలకన్నమనాయఁడు వారలు మరణమునొందినతోడనే సైన్యములోనికి మరలివచ్చె నని చెప్పఁబడియుండుటచేత నతఁడే వారలఁ జంపియుండు నని సందేహింపవలసివచ్చుచున్నది.

మూఁడవ యుద్ధము.

బాలనాయఁడు మొదలగు మహావీరు లందఱు సంగ్రామస్థలంబునం బడుటకు సంతోషించి నాయకురాలు బ్రహ్మనాయని సమస్తసైన్యముల నాశనము చేయవచ్చు నని తలంచి నూత్నసైన్యమును గొంత మరల బ్రహ్మనాయనిపైకిఁ బంపెను. ఈ యుద్ధమునందు కొమ్మరాజు పెద్దనాయఁడు నాయకురాలి సైన్యముల నోడించిరి గాని, యుద్ధములోఁ గొమ్మరాజు ప్రాణంబుల విడిచెను.

నాయకురాలి యుద్ధము.

ఈ కడసారియుద్ధమున బ్రహ్మనాయని కిరుపోటిగా రాజ్యతంత్రము నడపినట్టి మహాసమర్థురాలును, మగబిరుదుగట్టి యశ్వారూఢయై యుద్ధావసానము వఱకు నించుకయుఁ జలింపక బ్రహ్మనాయనితోఁ బోర సమకట్టిన నిరుపమానశూరురాలును అగు నాయకురాలు తన సైన్యమునకంతకుఁ దానే యధ్యక్షురాలుగ నేర్పడి నాలుగుభాగములు గావించి నాలుగు ప్రక్కల శత్రువుల మార్కొనుటకై నిలిపి యుంచెను. బ్రహ్మనాయని పక్షమున రేచెర్ల పేరినీఁడు, గండుకన్నమనాయఁడు, సుంకరదామనాయఁడు, మాలకన్నమనాయఁడు, అను నల్వురు సేనాధిపతులును నాయకురాలి నాల్గుభాగములను

మార్కొని యతిభయంకర మైన యుద్ధముఁ జేసిరి. పేరినీఁడు శత్రుసైన్యము నోడించెనుగాని సన్నగండ్లకడ మరణము నొందెను. మాలకన్నమనాయని నల్వురు సోదరులు చింతపల్లికడ యుద్ధములోఁ జచ్చిరి. ఉభయపక్షము లందును వీరనాయకు లనేకులు వీరస్వర్గమును జూఱఁగొనిరి. తుదకు బ్రహ్మనాయని ప్రియశిష్యుఁ డగుమాలకన్నమనాయనితోడి పోరాటమున నాయకురాలపజయమును బొందుటయే గాక వానిచేతికిఁ జిక్కెను. అంతట కన్నమనాయఁడు నాయకురాలిని కాళ్లుసేతులు బంధించి బ్రహ్మనాయని కడకుఁ గొనివచ్చెను.

యుద్ధసమాప్తి.

నాయకురాలు బ్రహ్మనాయనిచేఁ జిక్కినతరువాత చేయునదిలేక నలగామరాజు బ్రహ్మనాయని శరణు సొచ్చెను. బ్రహ్మనాయఁడు దయార్ద్రహృదయుఁడై వీరనాయకు లెల్లరు మరణము గాంచినందువలనఁగల్గిన వైరాగ్యముచేత క్షమించి నాయకురాలికి బంధవిముక్తి గావించి నలగామరాజును బునరభిషిక్తునిఁ గావించి కీర్తి గాంచెను.

బ్రహ్మనాయఁడు సంఘసంస్కర్త.

వెలమకులంబున జన్మము గాంచిన రేచెర్లబ్రహ్మనాయఁడు శ్రీరామానుజులచే బోధింపఁబడిన శ్రీవైష్ణవమతమును స్వీకరించి తన్మతాభినివేశపరవశుఁడై యామతమును పల్నాటిలో వ్యాపింపఁజేసి ప్రసిద్ధుఁ డయ్యెను. ఇతఁడు కులభేదమును పాటింపక యగ్రవర్ణములవారిని క్షుద్రవర్ణములవారిని గూడ వైష్ణవులను గావించి తనతోడఁ గలుపుకొని సహపంక్తిభోజనములను గావించినట్లుగా వీరచరిత్రమునఁ బలుతావులఁ బేర్కొనంబడియెను. ఈకాలమున నంత్యజాలనియుఁ బంచములనియుఁ బెద్దకొలమువారనియుఁ జెప్పఁబడునట్టి మాలలకు సయితము మాకాలమున వైష్ణవమతమును బోధించి దాసులనుగఁ జేసికొని సభలలో గౌరవించుటయే గాక వారలకు తనతోడి సపంక్తిభోజనమును గూడఁ గలుగఁ జేసెను. బ్రహ్మనాయఁడు మాలయైన తెప్పలినాయనికిని పెమ్మ

సానికిని బుట్టినకన్నమనాయని వైష్ణవునిగఁజేసి జ్యేష్ఠపుత్త్రునిభావిఁ బెంచుకొన్నట్లుగ వీరచరిత్రమునఁ జెప్పఁబడినది. కార్యముపూడిరణరంగమును బరీక్షించుటకై బ్రహ్మనాయనిచేఁ బంపఁబడిన కన్నమనాయఁ డచ్చటి యెఱుకుల సానితో,

"మాలలకునుబుట్టి మాలనైపోక
విష్ణుపాదముఁబట్టి విశ్వంబు లోనఁ
దెప్పలినాయఁడు తెఱవ యైనట్టి
యంబుజలోచన పెమ్మసానికిని
శ్రీమించు మాచెర్లచెన్నుని మేనఁ
బెంపొందెడుతులసి పెదవనమాల
వరమునఁగన్నట్టి వరపుణ్యసుతుఁడఁ
గన్నమనాపేరు గమలాక్షి వినవె"

అని తన యుదంతమును జెప్పుకొని యున్నాఁడు. కారెముపూడియందు మలిదేవభూపతి బ్రహ్మనాయఁడు మొదలగువారు కోటకేతరాజు మొదలగు రాయబారులతో సంధికార్యమునుగూర్చి ప్రసంగించు సభలోఁ గన్నమనాయఁడు మొదలగు గోసంగులు కూర్చుండి యుండఁగా వీరమేడపినుండివచ్చి బాలనాయఁడు సభాస్తారులను ద్రోచుకొని రాజుసమ్ముఖమునకుఁ బోవునపుడు మాలకన్నమనాయఁ డడ్డుపడి వానితోఁ గొంత ప్రసంగముఁ జేసెను. అప్పుడు,

"బ్రహ్మనాయఁడు నీకు బాంధవుఁ డెట్లొ?
వినిపింపు కన్నమ వివరంబు గాఁగ"

అని బాలనాయఁడు ప్రశ్నింపఁగా నతఁడు,—

"నాయఁడు విష్ణువు నారాయణుండు
ప్రకటదయాంబుధి వరము లొసంగఁ
దగ జనించితి నేను దల్లిగర్భమునఁ
బరమపావనమూర్తి బ్రహ్మనాయనికిఁ

పాదసేవకుఁడ నై పరఁగినవాఁడ
భుజముల ముద్రలు పూనినవాఁడ
క్షుద్రమార్గుల సొప్పు నూడనివాఁడఁ
బ్రాసాదజీవినై ప్రబలినవాఁడ
జ్యేష్ఠపుత్త్రుఁ డనంగ జెలఁగినవాఁడఁ
బుట్టితీ వావెన్కఁ బురుషోత్తమునకు"

అని నిశ్శంకముగాఁ బ్రత్యుత్తర మిచ్చెను. ఈపైవాక్యములనుబట్టి యితఁడు మాలవాఁ డనియు, బ్రహ్మనాయనిచేత నుపదేశమును బొంది శంఖచక్రాంకధారియై బ్రహ్మనాయనికి భక్తుఁడును బాదసేవకుఁడు నై బాలనాయఁడు జనింపక పూర్వమే బ్రహ్మనాయనిచేతఁ బుత్త్రిభావమునఁ బెంపఁబడె ననియు స్పష్ట మగుచున్నది. మాడుగుల బ్రహ్మారెడ్డి రేచెర్లబ్రహ్మనాయఁడు మొదలగువారికి విందుచేసినపుడు గొల్లవారు మొదలగువారుమాత్రమే గాక కన్నమనాయఁడు మొదలగు గోసంగులుగూడఁ బోయిరి. కన్నమనాయఁ డావిందునకుఁబోయి తన యిచ్చవచ్చిన స్థలమునఁ గూరుచుండె నని

"గోసంగికన్నమ గుణములకుప్ప
తనయిచ్చ యగుచోటఁ దనరఁ గూర్చుండె"

అను వీరచరిత్రములోని వాక్యములవలన బోధపడుచున్నది. మఱియొక కాలమునందు ఆణెమువారియెదుట బ్రహ్మనాయఁడు గోసంగులనడుమ గూరుచుండి వారితోఁ గలసి భుజించె నని చెప్పఁబడినది. మాధవకులము పవిత్రమైనది గా

లము లెన్నిటికైన గుఱుతైనవారు
వగ పూసలలోని దారంబువలెను
లసి భేదములేక మలయుచుండుదురు
ఁగిలిచండాల మేమియు లేక
ంగశంబునబుట్టె మాధవకులము"

అని బ్రహ్మనాయఁడు నిశ్చయించి పలికె నని చెప్పఁబడినది.

వీరశైవము.

మఱియు బ్రహ్మనాయనిపక్షమున వీరశైవులుగూడఁ గొందఱు కలరు. అలరాజు, కొమ్మరాజు మొదలగు వారెల్లరును వీరశైవులు. బాలమలిదేవరాజు మొదలగువారు శైవమతావలంబకులే గాని వైష్ణవులు గారు. అనుఁగుభూపతి, నరసింగరాజు, నాయకురాలు మొదలగువారెల్లరును శైవమతావలంబకులు. పల్నాటి వీరయుద్ధమున వీరశైవులును వీరవైష్ణవులును మతభేదములను విడిచి బాలమలిదేవరాజుపక్షమున నిలిచి యుద్ధము చేసినది వింతగా నుండకమానదు.

వీరారాధనము.

పల్నాటివీరచరిత్రమున నభివర్ణింపఁబడిన వీరవరులను నాదేశమున నిప్పటికిని గొలుచుచున్నారు. బ్రహ్మనాయఁడు విష్ణువనియు, విష్ణ్వంశసంభూతుఁడనియు వ్రాయుటయేగాక, యాసీమలో నాబాలగోపాలము నందఱు నట్లే నమ్మి యిప్పటికిని గారెముపూఁడిసమీపమున నున్న గుత్తికొండబిలములోఁ జప మాచరించుచున్నవాఁ డని చెప్పెదరు. ప్రతిసంవత్సరము కార్తికమాసములో నాపల్నాటివీరుల యుద్ధరంగప్రదేశమున మహోత్సవమొక్కటి జరుగుచున్నది. ఆయుత్సవమునకు వేలకొలఁది దూరదేశస్థులు సయితముఁ బోవుచున్నారు. కార్తికశుద్ధపూర్ణిమనాఁడు యుద్ధరంగస్థలమున నెత్తుటిజెండా యెత్తుటయు, యుద్ధాహ్వానపత్రికలు చుట్టుపట్టులనుండు గ్రామములవారికిఁ బరివారాయుధాదిసామగ్రీసమేతులై రావలయు నని వ్రాయుటయు, నా బహుళామావాస్యనాఁడు రాచగావు, మఱుదినము రాయబారము, మూఁడవదినము మందపూడు, నాల్గవదినము కోడిపోరు, అయిదవదినము కల్లిపాడు, అను నివి వరుసగా జరుపుటయు, దానికి మూఁడవదిన మర్ధరాత్రమున యుద్ధరంగమున రక్తముతోఁ గలిపిన యన్నమును దిగంబరులై రణబలి యిచ్చుటయు మొదలుగాఁగలవి యిప్పటికిని జరుగుచున్నవి.[1] దీనినంతయును జరుపుటకు బ్రహ్మనాయని ముద్రకర్త యని యొక పీఠాధిపతి కలఁడు.

1. వెలుగోటివారివంశచరిత్రము పుట ౨౦.

ఎనిమిదవ ప్రకరణము.

శ్రీరుద్రదేవుని సమకాలికులు

కమ్మనాటిరెడ్లు, లేక, కమ్మవారు.

కృష్ణానది మొదలుకొని నెల్లూరిమండలమున కందుకూరు (స్కందపురము) వఱకుఁ గల దేశము కమ్మకరాతము(కర్మకరాష్ట్రము) అని యాంధ్రచక్రవర్తులకాలమున వ్యవహరింపఁబడినది. అటుపిమ్మటఁ బల్లవులకాలమునఁ గమ్మరాష్ట్రము (కర్మరాష్ట్రము) అని వ్యవహరింపఁబడినది. ఏడవశతాబ్దప్రారంభమున నీదేశము పశ్చిమచాళుక్యచక్రవర్తులచే జయింపఁబడినది. ఈదేశమును బరిపాలించిన చాళుక్యులలో మొదటివాఁడు కుబ్జవిష్ణువర్ధనుఁడు. ఈకుబ్జవిష్ణువర్ధనునితోఁ గుంతలదేశమునుండివచ్చిన బుద్ధవర్మ మొదలగు సేనాధిపతులు గొందఱు కమ్మరాష్ట్రమున నధికారములను బొందిరి. వీరలు చతుర్థాన్వయులైన శూద్రులనియు, దుర్జయవంశస్థులనియు శాసనములం బేర్కొనంబడిరి. పండ్రెండవశతాబ్దమువఱకు వీరల చరిత్రము దెలియరాకున్నది.

చాళుక్యులకాలమునఁ గమ్మరాష్ట్రములోని యుత్తరభాగము వెలనాడు లేక ఆఱువేలనాడు (పట్నహప్రదేశము) అనియు, దక్షిణభాగము కమ్మనాడు అనియు, వ్యవహరింపఁబడినవి. త్రినయనపల్లవునికాలమున మల్లవర్మయను వాతఁడు పట్నహప్రదేశమును సంపాదించెనఁట! పండ్రెండవశతాబ్దప్రారంభమున వేంగిదేశమును చోడదేశమును, రాజరాజనరేంద్రునిపుత్త్రుఁడును చాళుక్యచోడచక్రవర్తియు నైన మొదటికులోత్తుంగచోడునికాలమున నేక సామ్రాజ్యమునకు లోఁబఱుపఁబడినప్పుడు మల్లవర్మవంశజులే రాజప్రతినిధులై వేంగిదేశమును బరిపాలించిరి. అప్పుడు దుర్జయవంశస్థు లయిన

వీరిబంధువు లెల్లరును వీరికి సామంతులై కమ్మరాష్ట్రములోని యుత్తరభాగమును పాలించుచుండిరి. మున్నొకప్పు డాంధ్రసామ్రాజ్యములోఁ జేరి పశ్చిమభాగములుగా నేర్పడి యుండిన కుంతల కొంకణదేశములనుండి యేతెంచి కమ్మనాటియం దధికారమును వహించి ప్రఖ్యాతిఁగాంచిన యీప్రభువులే యాంధ్రదేశములోని యితర భాగములకుఁ బోయి యధికారము సలుపునపుడు మొదట కమ్మనాటిరెడ్లు లేక కమ్మవా రని వ్యవహరింపఁబడిరి కాని మఱి యన్యము గాదు. [1] వీరు మొదట జైనమతావలంబకులుగను తరువాత శైవులుగ నుండిరి.

కోటవంశము.

కోట యన ధరణికోట యనిభావము. ఈ ధరణికోట ప్రాచీనకాలమున నాంధ్రచక్రవర్తు లయిన శాలివాహనులకు రాజధానీనగరమై ధాన్యకటక మను పేరిట జగద్విఖ్యాతయశంబు గాంచి యున్నది. ఇయ్యది ధాన్యాంకపుర మనియు, ధాన్యవతీ పుర మనియు శాసనములం బేర్కొనఁబడినది. పంద్రెండవ పదుమూఁడవ శతాబ్దములలో దీనిని బరిపాలించిన రాజులను కోటవంశమువా రని వ్యవహరించుచుండిరి గాని కోట యనునది ధరణికోటనుండి కలిగిన సంజ్ఞ కాని మఱియొండు గాదు. వీరలు విష్ణుపాదోద్భవసంభవు లయిన చతుర్థాన్వయుల మని చెప్పుకొనియున్నారు. ఈ చతుర్థవంశమున మొదట ధనంజయుఁడు జనించినట్లుగా కోటభూతదేవిశాసనములోని యీ క్రింది పద్యమువలన బోధపడుచున్నది. [2]

"చ. అమలపయోధిఁ జంద్రుఁ డుదయంబగునట్లనెపోలె వారిజా
తమున విరించిపుట్టినవిధంబున గాంచనధారుణీధరేం
ద్రమున సురావనీజ ముదితంబయి యొప్పుగతిం జతుర్థవం
శమున జనించె నుగ్రరిపుసైన్యజయుండగు ధనంజయుం డిలన్."

1. ఇప్పటి కమ్మవారిలో నితరజాతివార లనేకులు కలిసి యున్నారు.

2. గుంటూరుజిల్లా పెదముక్కెనగ్రామమునకు తూర్పున నున్న శిలాస్తంభముమీఁది శాసనమును జూచుకొనఁదగును.

ఈధనంజయుని గోత్రంబున విఖ్యాతులైన నరపతు లనేకులు పుట్టినట్లు పైశాసనమునందే వ్రాయఁబడినది. క్రీస్తుశకము పంద్రెండవశతాబ్దము ప్రారంభమున ప్రోలనాయకుఁ డను నాతఁడు ధరణికోట కధ్యక్షుఁడై యుండెను.

ప్రోలనాయకుఁడు

ఇతఁడు చాళుక్యచోడచక్రవర్తి యైన కులోత్తుంగచోడునకు సామంతమండలేశ్వరుండై వెలనాటిని బరిపాలించుచున్న మొదటిగోంకరాజు మంత్రులలో నొక్కఁడుగా నుండెను. ఈగోంకరాజునకు ధనదుపురము రాజధానిగ నుండెను. [1] ఈపురమును ధనదుపుర మని మంచనకవి తన కేయూరబాహుచరిత్రమునందు వ్యవహరించి యున్నాఁడు. మఱియు నతఁ డీపురమును దన గ్రంథమున నిట్లభివర్ణించి యున్నాఁడు.

"సీ. పుష్పకనివహంబు భూమిపై నిలిచిన
యట్లందమైన దేవాలయములు
రూప్యాచలము బహురూపంబుల నటించు
రమణ శోభిల్లు సౌధముల పెల్లు
అలకాధిపతి నిధు లన్నియు వెలివీట
విడిసినక్రియఁ బణ్యవీథికలును
ధాత మేదిని మిన్నదఱిఁగివైచినమాడ్కిఁ
గనుపట్టు బహుతటాకముల సొంపు
గీ. నుపవనంబులు సరసులు నొప్పు చేయు
చెఱకుఁదోఁటలుఁ బ్రాసంగుచేలు మెఱయ
నఖిలవిభవంబులకు నెలవగుచు వెలయు
ధనదుపురమన కెనయన ధనదుపురము.

1. ఇదియే యిప్పటి గుంటూరుమండలములోని చందవోలుగ్రామముగా నున్నది. ఆంధ్రుల చరిత్రము ప్రథమభాగములో 330 పుటలో ధాన్యకటకము ధనదుపురము నొక్కటియే యని పొరఁబాటున వ్రాయఁబడినది.

మఱియు నీపట్టణములోని ప్రజలయొక్క వైభవమును నాకవి యాగ్రంథము నందే యిట్లభివర్ణించి యున్నాఁడు.

"గీ. మంటికడవ నులకమంచంబు పూరిల్లు
నూలిచీర రత్నకీలితంబు
గాని పైడితొడవు గలుగు లెఱుంగరు
ధనదుపురములోని జనము లెల్ల."

శ్రీవెలనాటి గోంకనరేంద్రునిమంత్రులలో నొక్కఁడైన మనప్రోలనాయకుఁడు శా. శ. ౧౦౩౧ సంవత్సరము (క్రీ. శ. ౧౧౦౯) లో ధరణికోటలోని అమరేశ్వరస్వామివారికిఁ జేసిన దానమునుగూర్చిన శాసన మొకటి యాదేవాలయములోని ముఖమండపమునకు నైరృతమూల నున్న స్తంభముమీఁద నున్నది. ఆశాసనమునందు:—

"క. శ్రీరాజప్రతిశాసనుఁ
డారాధితనీలకంఠుఁ డభినవమదనా
కారుఁడు ప్రోలఁడు విబుధా
ధారుఁడు (నంబెన్న రాంపి?)తనయుఁడు నెగడెన్."

ఈప్రోలనాయకునిభార్య కొమ్మసాని.

కోటగండభూపతిరాజు – భూతమదేవి.

క్రీస్తుశకము ౧౧౭౦వ సంవత్సరమున కోటగండభూపతిరాజు యొక్క భార్యయైన భూతమదేవి చేసినదానములనుగూర్చిన శాసనములు గుంటూరుమండలములో నున్నవి. ఆమె తన భర్తయొక్క వంశము నిట్లు చెప్పి యున్నది. ధనంజయగోత్రమున చోడరాజును, వానికి గండభూపతియును, వానికి ముమ్మడిభీమరాజును, వానికి గండభూపతిరాజును జనించినట్లు పెద మక్కెనశాసనమునఁ జెప్పియున్నదిగాని, ప్రోలనాయకునకు వీరలకు నెట్టి సంబంధము గలదో తేటపఱిచి యుండలేదు. ఈశాసనమునం జెప్పఁబడిన రాజుల వృత్తాంతము లేశమాత్రమును దెలియకున్నది.

కోటకేతరాజు.

క్రీస్తుశకము ౧౧౮౨వ సంవత్సరమున శ్రీమన్మహామండలేశ్వరుండైన కోటకేతరాజు ధాన్యకటకమునకుఁ బ్రభువయ్యెను. ధరణికోటరాజులలో నితఁడు సుప్రసిద్ధుఁడు. ఇతనిశాసనములు గుంటూరుమండలములో అమరావతి వేల్పూరు మొదలగు గ్రామములలో నున్నవి. ఇతఁ డమరావతీశాసనములోఁ దన్నుగూర్చి,

" స్వస్తిశ్రీచతుస్సముద్రముద్రిత నిఖిలవసుంధరా పరిపాలక, శ్రీమత్త్రినయనపల్లవప్రసాదాసాదిత కృష్ణవేణీనదీ దక్షిణ షట్సహస్రావనీవల్లభ, భయలోభ దుర్లభ, చోళ చాళుక్య సామంతమదానేకప మృగేంద్ర, విభవామరేంద్ర, శ్రీమదమరేశ్వరదేవదివ్య శ్రీపదపద్మారాధక, పరబలసాధక, శ్రీధాన్యకటకపురవరాధీశ్వర, ప్రతాపలంకేశ్వర, కలిగళ మోళదక్క, బెట్టరగవక్క, గండరగండ గండభేరుండ, జగమెచ్చుగండ, నన్నిమార్తాండనామాదిప్రశస్తిసహిత శ్రీమన్మహామండలేశ్వర కోటకేత మహారాజులు " అని చెప్పుకొని యుండుటచేత నితఁ డాకాలమున సుప్రసిద్ధుఁడై యుండవలయు ననుటకు సందియ ముండఁబోదు. ఇంత ప్రఖ్యాతి గలుగుటకుఁ గారణము లేకపోలేదు. వేంగిరాజప్రతినిధియై చాళుక్యరాజభవనమూలస్తంభమని ప్రసిద్ధిగాంచి రాజమహేంద్రవరము మొదలుకొని కాళహస్తివఱకుఁ గల యాంధ్రదేశమును బాలించిన గొంకరాజునకు కోటకేతరాజు మేనల్లుఁడుగ నుండెను. ఈగొంకరాజు వెలనాటి మొదటిగొంకరాజునకు మనుమఁడు. చాళుక్యచోడచక్రవర్తి యైనమొదటికులోత్తుంగునిచేఁ బెంచుకొనఁబడిన కులోత్తుంగరాజేంద్రచోడునికిఁ బుత్త్రిఁడు.[1] ఈరెండవ గొంకరాజు తనతోఁబుట్టువైన సబ్బమదేవిని కోటకేతరాజు తండ్రి యైన భీమరాజునకిచ్చి వివాహము చేసెను. అప్పటినుండియు నీవంశమున కధికప్రఖ్యాతి గలిగినది. ఈసంబంధమునుగూర్చి యమరావతిలోని కేతరాజుశాసనములలో నొకదానిలో,

1. ఆంధ్రులచరిత్రములోని ప్రథమభాగము 335, 336 పేజీలలోఁ జూచుకొనవలయును.

"శ్లో. గోంకక్షితీశశశినో భగినీ గుణాఢ్యా
సబ్బాహ్వయా కమలచారుతరా స్ఫుటశ్రీః
తస్యాఽభవత్ ప్రియతమా పురుషోత్తమస్య
... ...
తస్మాత్తస్యాం సమజనిసుధారశ్మికాంతి ర్ద్వివస్వ
త్తేజోరాజ ద్గుణగణనిధిః కేతుభూపోఽభిరూపః."

అని కేతరాజు తండ్రి భీమరాజు గోంకరాజుసోదరిని వివాహమాడినట్లును దెలుపఁబడినది. కాఁబట్టి కోటభీమరాజు క్రీ. శ. ౧౧౪౨వ సంవత్సరమునకుఁ బూర్వము ధరణికోటలోఁ బరిపాలనము సేయుచుండెను. వీర లుభయులును పల్నాటివీరచరిత్రమునఁ బేర్కొనఁబడిరి. కేతరాజు తనశాసనములోఁ దన పూర్వులను గొందఱను బేర్కొని యున్నాఁడు. భీమరాజునకు (మొదటి) కేతరాజు, కేతరాజునకు (మొదటి) భీమరాజు, భీమరాజునకు (రెండవ) సబ్బమదేవియందుఁ దాను జనించినట్లు చెప్పుకొని యుండుటచేత ధరణికోటరాజులలో కేతనామముగలవారిలో నితఁడు రెండవవాఁడుగా నుండెను. కోటభూతమదేవి భర్తయైన గండభూపతికిని కేతరాజుతండ్రియైన భీమరాజునకుఁ గల సంబంధము తేటపడకున్నయది. అయినను వీర లిరువురు నేకకుటుంబములోనివారే యైయుండవలయును. కేతరాజునకు చోడరాజను జ్యేష్ఠసోదరుఁ డొకఁడు గలఁడు.

బౌద్ధమతము - బుద్ధునిపూజలు.

కోటకేతరాజుకాలమున బౌద్ధమతమును బుద్ధునిపూజలు నాంధ్రదేశమునఁ బూర్తిగా నశింప లే దని కేతరాజుశాసనమువలనఁ దెలియుచున్నది. ఇతనికాలమునాఁటికి ధాన్యకటకములోని బుద్ధునిచైత్య మింకను సురక్షితముగానే యున్నట్లు గాన్పించుచున్నది. ఇతఁడు శా. శ. ౧౧౦౪ గవ సంవత్సర మాఘశుద్ధదశమీ గురువారమునాఁడు శ్రీమద్బుద్ధదేవునకు కంద్రవాటిలోని క్రంతేరు, కొండపడమటిసీమలోని మేడికొండూరు, డొంకిపఱ్ఱు, అనుగ్రామములను దానముచేసెను. బుద్ధదేవుని దీపారాధానమునకై నేతికొఱకు గొఱ్ఱెలను గొల్లబోయలకు దానము చేసెను. ఇతని యుంపుడుకత్తెలగు సూరమదేవియును, ప్రోలమదేవియును గూడ బుద్ధుని దీపారాధనముకై నేతికొఱకు బోయలకు గొఱ్ఱెలను దానము చేసిరి. కోటకేతరాజు శైవుఁడైయుండియు బుద్ధోపాసనముచేయు ప్రియురాండ్ర ప్రీతికై పైదానములను జేసియుండును.

కేతరాజుయొక్క బ్రాహ్మణాగ్రహారములు.

తనతల్లి సబ్బమదేవికిఁ బుణ్యముగా సబ్బాంబికాపుర మనిపేరు పెట్టి గొండనాతవాడిలోని కాకొల్లుగ్రామమును; తనతండ్రి భీమరాజునకుఁ బుణ్యముగాను భీమవర మని పేరుపెట్టి గొండనాతవాడిలో జింజిపాడు, చల్లగర, తాడువాయి అనుగ్రామములను; తనజ్యేష్ఠసోదరుఁడు చోడరాజునకుఁ బుణ్యముగాను చోడవర మని పేరుపెట్ట గొండనాతవాడిలోని యమ్మలపూడి గ్రామమును; తనకుఁ బుణ్యముగాను జగమెచ్చుగండాపుర మని పేరుపెట్టి గొండనాతవాడిలో కుంటిమడ్డి, ఉప్పలపాడును, కొండపడమటిసీమలో సత్తెనపల్లి, చింతపల్లి, కేతపల్లి, ఎఱ్ఱగుంట గ్రామములను, నాడికంద్రవాడిలో ఒంకదొనగ్రామమును, బ్రాహ్మణోత్తములకు దానము చేసెను.

కోటబయ్యాల మహాదేవి.

నతవాటిసీమకుఁ బరిపాలకుఁ డయిన శ్రీమన్మహామండలేశ్వర రుద్రదేవమహారాజునకుఁ గొమార్తయైన బయ్యాలమహాదేవి పై కేతరాజునకుఁ బట్టమహిషి యని గనుపట్టుచున్నది. ఈమె క్రీ. శ. ౧౨౩౪వ సంవత్సరము వఱకు జీవించియున్నట్లు కనంబడుచున్నది. ఆసంవత్సరమున నీమె ధాన్యకటకములోని బుద్ధదేవునిదీపమునకై నేతినిసమకూర్చుటకై గొఱ్ఱెలను బోయలకు దానముచేసి యున్నది. ఈమె పుట్టినింటివారుకూడ చతుర్థకులస్థుల మని చెప్పికొనియున్నారు. ఈమె కాకతీయగణపతిదేవచక్రవర్తి తోఁబుట్టువగు మేళాంబిక లేక మైలమ్మయొక్కకూఁతురు. ఈసంగతి మఱియొక తావున సవిస్తరముగాఁ దెలుపఁబడును.

కోట బేతరాజు - కోట గణపాంబ.

మహామండలేశ్వరుఁ డైనకోటకేతరాజునకు రుద్రరాజు జనించెను. ఈ కోటరుద్రరాజు కాలముననే కాకతీయగణపతిదేవచక్రవర్తి వెలనాటి భూపతులను జయించి సామంతులనుగఁ జేసికొనెను. ఈదండయాత్రకుఁ బూర్వముననే వెలనాటిపృథ్వీశనరేంద్రునకును, పాకనాటిదేశప్రభువును కాంచీపురచోడచక్రవర్తులకు సామంతుఁడుగనుండిన మనుమసిద్ధిరాజుతండ్రియగు తిక్కనృపాలునకును, ఘోరమైన యుద్ధము జరిగి యాయుద్ధమునందు పృథ్వీశనరేంద్రుని మస్తకము తునుమంబడియెను. తరువాత కాకతీయగణపతిదేవచక్రవర్తి యీదేశముపై దండెత్తివచ్చి వెలనాటిప్రభువులను జయించి దేశమునంతయుఁ దనరాజ్యమునఁ జేర్చుకొనియెను. అప్పుడు మఱియొక యుపద్రవము తటస్థింపకుండ నీప్రాంతమునఁ దనరాజ్యము బలపడుటకై తనరెండవ కొమార్తయైన గణపాంబాదేవిని ధరణికోటరాజును మహామండలేశ్వర రుద్రదేవరాజపుత్త్రుఁడు నైన మహామండలేశ్వర బేతరాజున కిచ్చి వివాహము గావించెను. రుద్రరాజునకుఁ బిమ్మట బేతరాజు రాజ్యమును బాలించెను. ఇతఁ డెంతకాలము పరిపాలనముచేసెనో తెలిసికొనుట కాధార మేమియును గానరాదు. ఇతఁడు గణపతిదేవచక్రవర్తి దండయాత్రలలోఁగూడ యుద్ధములు చేయుచుండి పయసుమీఱకమున్నె మరణముఁ జెందియుండవలయును. ఇతని మరణానంతరము కోటగణపాంబామహాదేవి చాలకాలము ధరణికోటయందుఁ బరిపాలనము చేసెను. ఈమె దానశాసనములు క్రీస్తుశకము ౧౨౭౪ గవ సంవత్సరములోఁ గనంబడుచుండుటచేత నీమె చాలకాలము బ్రదికియుండెనని చెప్పవచ్చును. తన యక్కగారైన రుద్రమహాదేవి పరిపాలనముతోఁగూడఁ దనపరిపాలనమును సాగించియుండవలయును. భర్తమరణానంతరము గణపాంబ ధర్మకార్యముల ననేకములను గావించెను. ఈమె తనభర్త స్వర్గస్థుఁ డైనతరువాత ధాన్యకటకములోని యమరేశ్వరాలయముయొక్క గోపురమున సువర్ణకలశములను నిర్మించెను. ఈమె యొకశివాలయమును నిర్మించి

అందు తనభర్త పేరిట బేతేశ్వరనామముతో లింగప్రతిష్ఠ గావించెను. ఈబేతేశ్వరాలయగోపురమునందుఁగూడ సువర్ణకలశములను బెట్టించెను. ఈశివాలయము సంరక్షణముకొఱకు ధాన్యసమృద్ధమైన బెనదేవి యనుగ్రామము నొసంగి దానశాసనము వ్రాయించెను. ఇంతియగాక బ్రాహ్మణుల కనేకదానములను గావించెను. మఱియును దనతండ్రి గణపతిదేవచక్రవర్తిపేరిట గణపేశ్వర శివాలయమును నిర్మింపించి దానిసంరక్షణమునకుఁగాను చింతపాడనుగ్రామమును దానము చేసెను. ఈమె మహేశ్వరధ్యానము చేయుచుఁ దనయవసానకాలమును గడపెనని చెప్పఁబడినది.[1]

బుద్ధవర్మవంశము-కొండపడమటి బుద్ధరాజు.

ఇతఁడు కొండపడమటిసీమకు ప్రభువు. కనుక నితనికి గిరిపశ్చిమశాసనుఁ డనుబిరుదము గలదు. ఇతఁడు చోడచక్రవర్తులకు సామంతుఁడుగ నుండెను. వెలనాటి ప్రభువులకు ముఖ్యబంధువు. ఇతఁడు బుద్ధవర్మవంశములోని వాఁడ ననియు, చతుర్థాభిజనుండ ననియుఁ జెప్పుకొని యున్నవాఁడు. ఇతఁడు కొండవీటికిఁ బశ్చిమభాగమున నున్న సీమను బరిపాలనముఁ జేయుచు వెలనాటిరాజులతోడి బాంధవ్యమువలనఁ బ్రఖ్యాతి గాంచెను. వెలనాటిరాజుల యొక్క రాణులందఱు నీబుద్ధరాజువంశమున జనించినవారు. ఇతనియొక్క శాసనములు నరసారావుపేటతాలూకాలోని నాదెండ్లలోను, గుంటూరు తాలూకాలోని చేబ్రోలులోను గలవు. ఇతనిశాసనములలో దుర్జయకులాభరణుఁ డనియు, ఏలాదయసింహుఁ డనియు, అనియాంకభీముఁ డనియు బిరుదము లీతనికిఁ గలవని చెప్పఁబడియెను. బుద్ధవర్మవంశమున మండరాజును, అతనికి గండమరాజును, అతనికి (రెండవ)మండరాజును, అతనికిఁ గుండాంబికయందు మల్లిరాజు, బుద్ధరాజు, అంకమ, లేక అక్కమ్మయు జనించెను. వీరిలో రెండవవాఁడే మనబుద్ధరాజు. ఇతనిచెల్లెలయిన అక్కమ్మను వెలనాటి ప్రభువైన రాజేంద్రచోడునకిచ్చి వివాహము చేయఁబడియెను. ఈ రాజేంద్ర

1. Epigraphia Indica, No. 16, Yanamadala Inscription.

చోడుఁడే వేంగీదేశరాజప్రతినిధియై యాంధ్రదేశములోని వేంగీభాగమును బరిపాలించెను. గుంటూరుమండలములోని సిరిపురశాసనమున నితనిఁగూర్చి యీ క్రిందిపద్యము చెప్పఁబడినది.

"చం. ఇల వెలనాటిగొంకవసుధీశతనూభవుఁ డైనచోడభూ
తలపతి చోడపట్నము ముదంబున గట్టి భుజాబలంబునం
గొలని జయించి యందు రిపుకుంజరు భీమునిఁ జంపె నాంధ్రభూ
తలము పదాఱువేలు సతతస్థితి నేలె సురేంద్రలీలలన్."

ఈ రాజేంద్రచోడుని మఱఁదియైన కొండపడమటిబుద్ధరాజు ధనదుపురము (చందవోలు) లోని పాండేశ్వరదేవాలయమునకు నాదెండ్లలోని కొంతభూమిని దానము చేసెను. మొదటికులోత్తుంగచోడచక్రవర్తియొక్క సైన్యాధిపతియు, మొదటిగొంకరాజుయొక్క సోదరుఁడునైన పండయరాజుచే నిర్మింపఁబడినదిగావున నాయాలయమునకు పాండేశ్వరాలయ మని పేరు కలిగెను. ఈకొండపడమటిరాజులు నాదెండ్లలోని మూలస్థానేశ్వరదేవాలయమునకుఁ గావించిన దానములను గూర్చిన శాసనము లాదేవాలయమున ననేకములు గలవు. వీరివంశమున జనించిన జయాంబిక వెలనాటిప్రభువైన మూఁడవకులోత్తుంగచోడగొంకరాజునకుఁ బట్టమహిషియై పృథ్వీశనరేంద్రునకుఁ దల్లియై పిఠాపురములోని కుంతీమాధవస్వామి యాలయమును నిర్మించి నవఖండవాడగ్రామమును దానముచేయుటయేగాక సింహాచలములోని నృసింహుని విగ్రహమునకు సువర్ణకవచమును సమర్పించెను.

నతవాటిసీమరాజులు.

హైదరాబాదు రాష్ట్రములోని మధిరెజిల్లా కాకతీయాంధ్రచక్రవర్తుల పరిపాలనకాలమున నతవాటిసీమ యని వ్యవహరింపఁబడుచుండెను. ఆకాలమున దీనికి మడపల్లెదుర్గము రాజధానిగ నుండెను.[1] ఇయ్యది చాళుక్యులకుఁ

1. మడపల్లె యనునది ఏలూరికి సమీపమున నున్న మాదేపల్లి యని యొకరు వ్రాసిరి కాని యది సరికాదు. మడపల్లె బెజవాడహైదరాబాదు రైలుమార్గమున నున్న మధిరస్టేషనునకు సమీపమున నుండు మడపల్లె యనునదియే.

బూర్వము నేత్రపాటివిషయ మను పేరితోఁ బరఁగుచుండి తూర్పున నేలూరునకు సమీపముగా నున్న దెందులూరువఱకును విస్తరించి యుండెను. విష్ణుకుండినవంశజుం డయిన విక్రమేంద్రవర్మశాసనములలో నొకదానియం దీసీమ యుదాహరింపఁబడినది.[1] దుర్జయవంశజుల మనియు, చతుర్థాన్వయుల మనియుఁ జెప్పుకొనిన రాజులీ నతవాటిసీమను మొదటిప్రతాపరుద్రునికాలమునఁ బరిపాలించుచుండిరి. అప్పు డీమండలమును బరిపాలించుచున్నవాఁడు కాకతీయులకు బంధు వగు దుగ్గరాజుకొడుకు బుద్ధరాజు. పంద్రెండవశతాబ్దాంతమున మహామండలేశ్వరుఁ డైన బుద్ధరాజుకుమారుఁడు రుద్రరాజు మడపల్లె రాజధానిగ నతవాటిసీమను బరిపాలనము సేయుచుండెను.

బుద్ధరాజుకొడుకు రుద్రరాజు.

శ్రీమన్మహామండలేశ్వర రుద్రదేవరాజు కాకతిప్రోలరాజుయొక్క పుత్త్రులలో నొక్కఁడును, మొదటిప్రతాపరుద్రుని తమ్ముఁడును, గణపతిదేవచక్రవర్తియొక్క తండ్రియు నగు మహాదేవరాజుయొక్క పుత్త్రిక యగు మేళమాంబికను (మైలమ్మ) వివాహముఁ జేసికొనియె నని త్రిపురాంతకములోని మేళమాంబికశాసనమువలనఁ దెలియుచున్నది.[2] రుద్రరాజునకు మేళాంబికవలన నెనమండ్రుకుమారులును బయ్యలమహాదేవి యను కొమార్తెయుఁ గలిగినట్లుగా ధాన్యకటకములో నమరేశ్వరదేవాలయములోని బయ్యలమహాదేవియొక్క దానశాసనములో స్పష్టముగాఁ జెప్పఁబడినది.[3] ఈమె బుద్ధదేవునికి దానముచేసిన ట్లిదివఱకే వ్రాసియున్నాను. బయ్యలదేవి తండ్రియైన యీరుద్రదేవరాజు బుద్ధరాజునకు ద్వితీయపుత్త్రుఁడని త్రిపురాంతకశాసనములోఁ జెప్పఁబడినది. ఈ నతవాటిసీమరాజులు మొదట చాళుక్యచోడచక్రవర్తులకు సామంతులుగానుండి తరువాత కాకతీయులతోడి సంబంధబాంధవ్యములచేత గణపతిదేవచక్రవర్తికాలమున నాతనికి సామంతులైరి. బందరుజిల్లా

(1) ఆంధ్రులచరిత్ర భా. ౧. పే. 363.
(2) No. 204 of the Epigraphical Collection for 1905.
(3) No. 15. B. Two Pillar Inscriptions at Amaravaty,

లోని ఉయ్యూరుపరగణాలోఁజేరిన ముదునూరు గ్రామములోని రామేశ్వర దేవాలయములో నున్న యొకశాసనములో నీక్రిందిశ్లోకమునందు కాకతీయ కుండాంబ యీరుద్రదేవరాజునకు భార్యయైనటులఁ గానంబడుచున్నది.

"శ్లో. బుద్ధారాధిపసూనురుద్రనృపతిః శ్రీనాథవాటీశ్వరో
యస్యా భూర్జ్జనకోస్య కాకతిమహాదేవక్షితీశాత్మజా
కుండాంబా జననీ ద్విషద్గజహరే శ్రీమాధవక్ష్మాపతే
ర్దేవీత్వం సముపేత్య సంప్రతి మహాదేవీప్రసూతే సుతాన్."

పై శ్లోకమునఁ జెప్పఁబడిన మహాదేవియొక్క భర్తయైన మాధవనృపతికి శ్రీనాథవాటీశ్వరుఁడైన బుద్ధరాజుకొడుకు రుద్రరాజు తండ్రియనియు, కాకతిమహాదేవరాజుయొక్క కొమార్తయైన కుండాంబ తల్లియనియు, బోధపడుచున్నది. ఇతర శాసనప్రమాణమునుబట్టి రుద్రదేవరాజునకు వివాహము చేయఁబడిన మహాదేవరాజుకొమార్త పేరు మైలమ్మ యని మన మెఱింగి యున్నాము. కుండాంబకు మైలమ్మ యనునామాంతరము గలదేమో భావిపరిశోధనమునం దెలిసికొనవలసి యున్నది. కాకతికుండాంబశాసనమునుబట్టి శ్రీమన్మహామండలేశ్వర రుద్రదేవరాజుయొక్క యేనమంద్రుకుమారులలో మాధవనృపతి యొక్కఁడని స్పష్టమగుచున్నది. కాకతీయరాజబంధువులైన యీమండలేశ్వరు లందఱును, పైవెలనాటి గణపతిదేవచక్రవర్తి దాడి వెడలి నప్పుడు జరిగిన యుద్ధములలో భాగస్వాములై యుండి యాచక్రవర్తికి జయము సమకూర్చించినవారుగా నుండు రనుటకు సందియము లేదు.

తొమ్మిదవప్రకరణము.

కాకతి గణపతిదేవచక్రవర్తి పాలనము.

(క్రీ. శ. ౧౧౯౯ మొదలుకొని క్రీ. శ. ౧౨౬౦ వఱకు.)

శౌణదేశాధీశ్వరుండయినజైత్రపాలుఁడనుయాదవరాజునకును ఆంధ్రదేశాధీశ్వరుండయినకాకతిమహాదేవరాజునకును జరిగిన మహాయుద్ధములో మహాదేవరాజు వీరమరణము నొందినవెనుక నతనికుమారుఁడైనగణపతి దేవుఁడు సింహాసనారూఢుఁడయ్యెను. ఇతఁడు మహాదేవరాజునకు బయ్యాంబికవలన జనియించినవాఁడు.[1] ఇతఁడు తన పెదతండ్రియైనప్రతాపరుద్రదేవునిచే స్థాపింపఁబడిన త్రైలింగ్యసామ్రాజ్యమును నల్గడల విస్తరింపఁజేసి చక్రవర్తిపదమునువహించి సప్తమచక్రవర్తి యని యాంధ్రభూస్థలినంతట వేనోళ్లఁ గొనియాడఁబడుచుండెను. పైనిజెప్పిన యుద్ధములో నితఁడు శాత్రవులచేఁ జిక్కువడి విడిచిపెట్టఁబడిన తరువాత ఆయవమానమును భరింపఁజాలక అసంఖ్యాకము లయిన సైన్యములంగూర్చుకొని యాదేశముపై దాడి వెడలి యాదవులతో యుద్ధముచేసి శౌణభూపతిని జయించి యతనివలన నమూల్యము లయిన రత్నరాసులను ధనమును బడసి నిజరాజధానికి మరలివచ్చెను. అప్పటినుండియు యాదవు లనేకపర్యాయము లాంధ్రదేశ మాక్రమించుకొనుటకై ప్రబలప్రయత్నములు చేయుచువచ్చిరిగాని తెలుంగువారు వారిని గోదావరినదినిదాఁటి దిగువకు రానీక నిలిపిరి. పశ్చిమచాళుక్యసామ్రాజ్య మంతరించినవెనుక కర్ణాటకదేశమున కధిపతులైన భల్లాణరాజులు సయితము త్రిలింగ

1. పూర్వగ్రంథములలో గణపతి మొదటిప్రతాపరుద్రునికొడు కని వ్రాయఁబడెనుగాని యది సరికాదు. శాసనములలో గణపతి మహాదేవరాజు కొడుకని స్పష్టముగాఁ జెప్పఁబడియెను.

దేశమును వశపఱుచుకొనవలయు నని భగీరథప్రయత్నములు గావించిరిగాని తెలుంగువారిపరాక్రమము ముందట నవియన్నియు భగ్నములై పోయినవి. గణపతిదేవుఁడు సింహాసన మెక్కినతోడనే మండలేశ్వరు లనేకులచేఁ బరిపాలింపఁబడుచున్న యాంధ్రదేశమునంతయు నేకచ్ఛత్రముక్రిందికిఁ దీసికొని రావలయు నని నిశ్చయించి తదనుగుణముగా సమగ్రు లయిన మంత్రులను సేనాధిపతులను నియమించుకొని వారలసాహాయ్యముతో విజయయాత్రలు ప్రారంభించి యొక్కొక్క మండలేశ్వరుని జయించి వశపఱుచుకొని సామంతునిగఁ జేసికొనుచుండెను. గణపతిదేవుఁడు రాజ్యతంత్రజ్ఞానముగలవాఁడు గావున నేపని ప్రారంభించినను ఆతనికి విజయమే సమకూఱుచుండెను. కృష్ణానది మొదలుకొని కాంచీపురమువఱకుఁ గల తూర్పుతీరమునంతయుఁ గమ్మనాటిరెడ్లు, పాకనాటిరెడ్లు, రేనాటిరెడ్లు, చోడు లను పేరితోఁ బరిపాలనము సేయుచుఁ బేరికిమాత్రము కాంచీపురచోడచక్రవర్తులకు సామంతుల మని చెప్పుకొనుచు నైకమత్యములేక తమలోఁదాము పోరాడుచుండఁగా గణపతిదేవమహారాజు వారల నందఱిను జయించి యేకసామ్రాజ్యమునకు లోఁబడినవారినిగఁజేసి దేశమున సద్ధర్మపరిపాలనము నెలకొల్పవలయు నని తన యావచ్ఛక్తిని వినియోగించి తుదకుఁ గృతార్థుఁడై శాశ్వతమైన కీర్తిని గడించెను.

వేంగిదేశములోని కల్లోలములు.

వెలనాటిభూపతులు పేరికిమాత్రము చాళుక్యచోడచక్రవర్తులకుఁ బ్రతినిధులై విక్రమసింహపుర మను నెల్లూరు మొదలుకొని యుత్తరమున సింహాచలపర్యంతమును గల వేంగిదేశమునంతయు ననేకమండలాధిపతుల సాహాయ్యముతో నిరంకుశముగాఁ బరిపాలనము సేయుచుండఁ బండ్రెండవశతాబ్దాంతమున గొప్పకలవరము జనించి చాళుక్యచోడచక్రవర్తుల యధికారమంతయు సంపూర్ణముగా క్షీణించుటయేగాక వెలనాటిరాజులలోఁ గడపటివాఁ డయిన పృథ్వీశ్వరునితోఁగూడ వెలనాటి సామ్రాజ్యలక్ష్మి కాకతీయులను శరణు చొచ్చెను. పండ్రెండవశతాబ్దాంతమున పృథ్వీశ్వరమహారాజునకును విక్రమసింహపురాధిపతి యైనతిక్కభూపాలునకును జరిగిన మహాఘోరయుద్ధములో పృథ్వీశ్వరరాజు వీరమరణము నొందెను. అంతట పూర్వచాళుక్యుఁ డయిన బేతవిజయాదిత్యునివంశమున జనించిన మల్లపదేవుఁ డనునాతఁడు విష్ణువర్ధన నామముతో క్రీ. శ. ౧౨౦౨వ సంవత్సరమునఁ బీఠికాపురమునఁ (పిఠాపురమున) బట్టాభిషిక్తుఁడై పదిసంవత్సరములకాలము పరిపాలనము చేసెను. ఇతనికి మల్లపదేవచక్రవర్తి యను బిరుదనామము గలదు.

తెలుఁగునాయకులు, లేక తెలఁగాలు

ఆకాలమున నిప్పటి కృష్ణామండలములోని యేలూరు, కొల్లేరుకోట, లేక, ఆకవీడు, గణపవరము, ముఖ్యపట్టణములుగ నుండి తెలుంగునాయకులచేఁ బరిపాలింపఁబడుచుండినటులఁ గనుపట్టుచున్నది. ఏలూరునకు కొలనుపుర మనియు, సారసిపుర మనియు, కమలాకరపుర మనియుఁ బేరులున్నట్టుగాఁ దెలుంగునాయకుల శాసనములం గనుపట్టుచున్నది. వీరు చాళుక్యులకాలమునను కాకతీయులకాలమునను సామంతమండలేశ్వరులుగ నుండి కమ్మసేనానాయకులవలెనే ప్రసిద్ధిగాంచి యుండిరి. గణపవరమునకు పద్మినీపుర మను నామ మున్నట్టు గణపవరములోని సువర్ణేశ్వరస్వామి వారిదేవాలయములోని యొకశాసనమువలనఁ దెలియుచున్నది. ఇక్కడ నొకగొప్పకోట యుండెను. ఇయ్యది కొంతకాలము కోనసీమరాజు లయిన రాచవారవశమునను, మఱికొంతకాలము కొలనురాజు లయిన తెలఁగాలవశమునను ఉండెను. ఈప్రాంతదేశ మంతయుఁ గొలనుపురాధిపతు లయిన తెలుఁగునాయకులచేతనే పరిపాలింపఁబడుచుండె ననుటకు లేశమాత్రమును సందియము లేదు. పైజెప్పిన కోట లన్నియును తెలుఁగునాయకులచేతనే కట్టఁబడినవి. వీరికిని వేంగిరాజప్రతినిధు లయిన వెలనాటి కమ్మవారికిని యుద్ధము లనేకములు జరిగినవి. తుదకు తెలుఁగునాయకులు వెలనాటిప్రభువులకు లోఁబడిన సామంతమండలాధిపతులుగనే యుండుచు వచ్చిరి. "భీమనాయకుఁడు, కాటయనాయకుఁడు" అను పేరులుగల తెలుఁగునాయకు లనేకులు పండ్రెండవశతా

ద్దమునందుఁ గృష్ణాగోదావరీ నదులకు నడుమనుండు దేశమును బరిపాలించిరి. కాకతిగణపతిదేవుని రాజ్యారంభకాలమున శ్రీమన్మహామాండలిక కేశవదేవ రాజు, వానిపుత్త్రుఁడు సామినాయకుఁడును, ఏలూరు (కొలనుపురము) రాజధానిగ నీమండలమును బరిపాలనము సేయుచుండిరి. కేశవనాయకుఁడును వానికుమారుఁడును, వెలనాటిప్రభువుల యధికారము క్షీణించుకాలమున స్వతంత్రులుగఁ బరిపాలనము చేసిరి. కేశవనాయకుని దానశాసనము లనేకములు కొలను (ఏలూరు) పురమునఁ గానంబడుచున్నవి. క్రీ. శ. ౧౨౨౮ దవ సంవత్సరమునాఁటికి నీమండలమంతయును కాకతీయగణపతిదేవచక్రవర్తిచే జయింపఁబడెను. తెలుఁగునాటిరెడ్లకు తెలఁగాలని పేరు గలిగినది. చాళుక్యులు తెలుఁగుదేశముపై దండెత్తివచ్చి జయించినప్పుడు వారితోవచ్చిన సేనలు సేనాధిపతులు మొదట కమ్మనాటిలో వసించుచుండి తరువాత నితరస్థలములకుఁబోవఁ బ్రజలు క్రొత్తవారికిని బ్రాఁతవారికిని భేదము దెలియుటకై కమ్మనాటినాయకులను కమ్మవారనియు, అటువలెనే తెలుఁగుదేశమున నున్న తెలుఁగు నాయకులను తెలఁగాలనియు వ్యవహరింపసాగిరి. నాఁటినుండియుఁ గమ్మవారును, తెలఁగాలును వేర్వేఱు తెగవారుగా నుండుట తటస్థమైనది. కాని క్రీస్తుశతాబ్దారంభమున నాంధ్రసామ్రాజ్యవిజృంభణకాలమున వీరును వారు నొక్కరుగనే యుండిరి.

ఈ మాండలికకేశవరాజునకును వానికుమారునకును, అనంతప్రెగ్గడయు, వానికుమారుఁడు మల్లాప్రెగ్గడయు మంత్రులుగా నుండిరి. ఈ మల్లాప్రెగ్గడ సుప్రసిద్ధుఁడగుటచేత నతనిసంతతివారికి మల్లాప్రెగడవారని యింటిపేరు కలిగినది.

గణపతిదేవుఁడు వెలనాటిని జయించుట.

కాకతిగణపతిదేవచక్రవర్తి క్రీ. శ. ౧౨౨౮దవ సంవత్సరమునాఁటికి వెలనాటిదేశమును సంపూర్ణముగా జయించెను. నతవాటిసీమరాజులు ధరణికోటరాజులు, క్రొన్నతవాటిరాజులు, గుడిమెట్టరాజులును, తల్లివంకచుట్టాలు,

తండ్రివంకచుట్టాలు, వియ్యాలవారు నగుటచేత గణపతిదేవమహారాజు వారల సాయముతో వెలనాటి నవలీలగా జయింపఁ గలిగెను. వెలనాటిని జయించుటతోమాత్రము తృప్తినొందక వెలనాటిసైన్యాధిపతులతో బాంధవ్యమును నెఱపి యాభాగమునఁ దనపాలనము దృఢముగ నాటుకొనునట్లు గావించెను. ఇతఁడు వెలనాటికి రాజధానియైన ధనదుపురమునందలి యైశ్వర్యమునంతను జూఱఁగొని యేకశిలానగరమునకుఁ జేర్చుటయేగాక ప్రఖ్యాతిగాంచిన వీరపురుషులకెల్లరకు నుద్యోగము లొసంగి యాదరించెను. శాత్రవులకుఁ దక్క మఱియెవ్వరికి నొత్తుడుకలుగనీయనందున నీతనిపరిపాలనము వెలనాటిప్రజల కనుకూలముగ నుండెను. వెలనాటిని జయించిన స్వల్పకాలములోనే యాభాగమునందంతట శాంతిని నెక్కొలిపి మఱియెన్నఁటికిని దిరుగఁబడకుండునట్లు చక్కని యేర్పాటులను గావించెను.

గజసాహిణి జయపనాయకుని సంబంధము.

అయ్యవంశమున జనించిన భీమయ్య యనుకమ్మనాయకుఁ డొకఁడు వెలనాటిలోని క్రొయ్యూరునందు నివసించి యుండెను. ఆభీమనాయకునకు రాజాంబికవలన జల్లయ, నారయ, సూరయ, అను మువ్వురుపుత్త్రులు జనించి వెలనాటిచోడమహారాజుకొలువున నుద్యోగములను వహించి యుండిరి. వారిలో జల్లయ యొకానొక కన్నరదేవుని యుద్ధములో జయించినందున సేనాధిపత్యమును బడసెను. రెండవవాఁ డయిన నాగపనాయకుఁడు (నారాయణ) చోడరాజుయొక్క ప్రేరణముచేతఁ గృష్ణానది సాగరగామి యగుచోట నేర్పడియున్న ద్వీపము నిర్జనభూమియై యుండ నందొక కోటను గట్టి ప్రాకారములు, రాజమందిరములు, విశాలభవనములు, మిద్దెలు, మేడలు నిర్మించి, తోఁటలను వేయించి, యొక మహాపట్టణముగఁ జేసి, తనప్రభువుపేర చోడసముద్ర మను నొక తటాకమును ద్రవ్వించి, చోడేశ్వరాలయమును నిర్మింపించి, జననివాసయోగ్యమైనపుణ్యభూమిగఁ జేసి ప్రసిద్ధిఁ గాంచెను. మఱియు నచ్చోట నొకవిష్ణ్వాలయమును, కరాళభైరవాలయమును నిర్మింపిం

చెను. వడ్లమూరుగ్రామమున భీమేశ్వరాలయము నిర్మింపించి భీమసముద్ర మనుతటాకమును త్రవ్వించెను. ఇతని ధైర్యసాహసపరాక్రమములను మెచ్చుకొని చోడమహారాజు తలగడదీవి మొదలగు గ్రామముల కాధిపత్యము నొసంగుటయే గాక యితని సామర్థ్య మెఱింగినవాఁ డగుటచేతఁ దనకు సైన్యాధ్యక్షునిగఁ జేసికొనియెను. ఈసైన్యాధ్యక్షుఁ డయిన నారపనాయకునకు చోడినాయకుఁడు, భీమనాయకుఁడు, పిన్నచోడినాయకుఁడు, బ్రహ్మనాయకుఁడు నను నలువురుపుత్త్రులు జనించి వెలనాటిచోడరాజునకు సేనాధిపతులై చతుస్సముద్రములవఱకుండి దేశమును శత్రుబాధనుండి సంరక్షించుచుండిరి. వీరిలో మూఁడవవాఁ డయిన పిన్నచోడునకు దామాంబ (దామమ్మ) వలన నారాంబ (నారమ్మ), పేరమాంబ (పేరమ్మ) యను కూఁతులును; పృథ్వీనాయఁడు, జాయపనాయఁడు, నారపనాయఁడు (నారాయణుఁడు), నను పుత్త్రులును జనించిరి. అంతఁ గొంతకాలమునకు గణపతిదేవమహారాజు సేవణ కర్ణాట లాట కళింగ చోళనగరాధిపులను జయించి వెలనాటిపై దండెత్తివచ్చి వెలనాటిని జయించి యాప్రసిద్ధమైన ద్వీపముతోఁగూడ నాక్రమించుకొనియెను. వెలనాటిలో దొరకిన దృఢకాయులను, ఏనుఁగులను, గుఱ్ఱములను నానావిధము లయిన రత్నములను ధనకనకవస్తువాహనాదులను జూఱగొనియెను. ఇంతియగాక పిన్నచోడుని కూఁతులయిన నారాంబను పేరమాంబను బెండ్లియాడి యాసుందరీమణుల ద్వితీయసోదరుఁ డైనజాయపనాయకుని బుద్ధివిశేషమును, ధైర్యసాహసములును, పౌరుషపరాక్రమములును, గుణసంపదయును తన్ను నాకర్షింపఁగా సంతోషించి తన గజసైన్యమున కధిపుని గావించి బిరుదముల నొసంగి యున్నతమైన పదవికిఁ గొనివచ్చెను. అందువలన జాయపనాయకుని యెదుట శత్రువులు తలయెత్తిచూచుటకు భయపడుచుండిరి. గణపతిదేవచక్రవర్తి బాహుదర్పముచేత నేగాక, రాజనీతివేత్తయైన ప్రతిభాశాలియునై యుండినందువలన, రాజ్యమును విస్తరింపఁజేసి చక్రవర్తియగుట తటస్థించెను. జాయపనాయకుఁడు శాత్రవులను నిర్జించుటచేత వైరిగోధూమ ఘరట్ట మనుబిరుదమును పొంది విఖ్యాతిఁ గాంచెను. ఇతఁడు

గణపతిదేవుని పేరిట గణపతీశ్వరాలయమును గట్టించి దానికి ననేకగ్రామములను దానము చేసెను. ఈదానశాసనము శా. శ. ౧౧౫౩ ఖరసంవత్సర వైశాఖశుద్ధతృతీయాదినమున వ్రాయఁబడినది. ఈ శివాలయముపోషణమునకై పడవయొక్కంటికి నొక్కపణము పన్నుగఁ గైకొనుటకు నియమింపఁబడియెను.[1] మఱియు నితఁడు శా. శ. ౧౧౫౭వ సంవత్సర వైశాఖశుద్ధతృతీయా శనివారమునాఁడు తామ్రపురము (చేఁబ్రోలు) లో తన తండ్రి పేరిట చోడేశ్వరలింగమును ప్రతిష్ఠాపించి యాశివాలయమున కెదుట దేవదాసీలు నివసించుటకై రెండేసియంతరువులుగల రెండువరుసలయిండ్లనుగట్టించి దేవుని యంగరంగభోగములకై మొంతపూరు (చేఁబ్రోలునకు ౬ మైళ్లదూరమున నున్న మోదుకూరు) గ్రామమును దానముచేసెను.[2]

విశ్వేశ్వరశివదేశికులు.

వేదవేదాంతార్థము లెఱింగిన జ్ఞానసంపన్నుఁ డని ఖ్యాతిఁగాంచిన యాశివయోగి శైవగురుపరంపరలోనివాఁడు. కాకతిగణపతిదేవచక్రవర్తికి గురువును మహాప్రధానియు నై రాజకీయార్థికసాంఘికవిషయంబులఁ దగు నాలోచనములం జెప్పుచు రాజ్యతంత్రమును నడపించుచు నాచక్రవర్తి యౌన్నత్యమున కంతకుఁ గారణభూతుఁ డయ్యెను. ఆంధ్రదేశములోఁ బ్రఖ్యాతిగాంచిన శ్రీగోసఁగి, శ్రీశైలము, శ్రీపుష్పగిరి మొదలగు శైవమఠముల కెల్ల నధికారిగ నుండి శ్రీకాకతిగణపతిదేవచక్రవర్తిచే శైవమతము నాంధ్రదేశమున వ్యాపింపఁజేసిన గురుమల్లికార్జునపండితారాధ్యులవారి తరువాత నితఁడు సుప్రసిద్ధిఁ గాంచెను. సోమదేవరాజీయాదిగ్రంథములలో గణపతిదేవుని సచివాగ్రణి యని పేరెన్నికగాంచిన శివదేవయ్య యను నాతఁడీ విశ్వేశ్వరశివదేశికులే యని చెప్పవచ్చును. ఇతఁడు గానియెడల నితనివలెఁ బ్రసిద్ధిగాంచినట్టి యితనికుమారుఁ డగు పరిపూర్ణశివమహామునియై యుండ

1 Epigraphia Indica Vol. III. P. 82 ff; No. 15, Ganapeswaram Inscription of the time of Ganapati.
2. Ibid No. 5, Chebrolu Inscription of Jaya.

వలయును గాని, యన్యులుమాత్రము గారు. విశ్వేశ్వరశివదేశికులే శివదేవయ్య యని నాయభిప్రాయము. వీర లిరువురి దానశాసనములు భట్టిప్రోలు త్రిపురాంతకము మొదలగు ప్రదేశములఁ గానంబడుచున్నవి. కాకతిగణపతిదేవ చక్రవర్తిని జూడవచ్చిన తిక్కనసోమయాజి,

"గీ. వసుమతీనాథ యీతఁ డీశ్వరుఁడు గాని
మనుజమాత్రుండు గాఁడు పల్మాఱు నితని
యనుమతంబున నీవు రాజ్యంబు నెమ్మి నేలు"

మనిచెప్పి కొనియాడిన దీవిశ్వేశ్వరశివదేశికుల నే యైయుండవలయును గాని యట్టివారు మఱియొక రాయాస్థానమునం గనుపట్టరు.

కాటచమూపతి - భాండసేనాధిపతి

వీర లిరువురును గణపతిదేవచక్రవర్తి సేనాధిపతులు. కాటచమూపతి కొడుకు భాండసేనాధిపతి. భాండసేనను జయించినవాఁ డగుటచేత నీకడపటి వానికి భాండసేనాధిపతి యని బిరుదు కలిగెను. ఈసేనాధిపతు లిరువురు నుత్తరదేశము నేలు రాజులతో గణపతిదేవుని పక్షముననుండి యుద్ధము చేయుచు మన్నన గాంచుచుండిరి. వీరి నివాసస్థలము నిర్మల యను పట్టణము. చతుర్థవంశమున దుర్జయుఁడు జనించెను. అతనివంశమున మల్లాలనాథుఁడు పుట్టి పెద్దముట్టిగండఁ డనువీరుని నతనిబంధువర్గమును నాశనము గావించెను. మల్లాలనాథునికొడుకు సబ్బిసేనాధిపతి. ఇతఁడును శత్రురాజుల నిర్జించెను. ఇతనికి అచ్చమ యనుభార్యయందుఁ గాటచమూపతి జనియించెను. ఈకాటచమూపతి మొట్టమొదట కాకతిరుద్రదేవరాజుకడను, అటు పిమ్మట గణపతిదేవచక్రవర్తికడను సేనాధిపతిగనుండి బొల్లమాంబవలన పోతనాయుఁడు, భాండసేనాధిపతి, అను నిరువురుకొమారులను గాంచెను. కాటచమూపతి శా. శ. ౧౧౬౩ శార్వరిసంవత్సర ఫాల్గునశుద్ధ ౧౧ స్థిరవారమునాఁడు కొండిపర్తి యను గ్రామమునందు త్రిమూర్తులను నొకటఁ బ్రతిష్ఠ గావించి దేవాలయమును గట్టించి బెల్లముచెఱువుగ్రామమును దేవుని కైంకర్యములకై

దానము చేసెను. భాండసేనాధిపతి భాండసేనను జయించినపిమ్మట కొండిపర్తికి భాండసముద్ర మనిపేరు పెట్టి భాండసముద్ర మను నొకతటాకమును ద్రవ్వించి భాండేశ్వరలింగమును బ్రతిష్ఠ గావించి యున్నతమైన దేవాలయమును బ్రాకారములను నిర్మింపించి సువర్ణకలశములను బెట్టించి యాదేవుని కైంకర్యమునకై అనవర్తియను గ్రామము నొసంగెను. వీరును దుర్జయ వంశజుల మని చెప్పుకొన్నవారు గావునఁ గమ్మనాటిరెడ్లలోనివారే యని చెప్పవచ్చును.

చాగిపోతరాజు - గుడిమెట్టరాజులు.

చాగివారు కాకతీయచక్రవర్తులకాలమున గుడిమెట్టరాజధానిగ నందిగామసీమను బరిపాలనముచేసిన సామంతమండలేశ్వరులుగ నుండిరి. చాగివారిలో వేఱొక కుటుంబమువారు పల్నాడు పరిపాలించుచుండిరని పల్నాటివీరచరిత్రమునఁ జదివియున్నాము. పల్నాటిచాగివారు హైహయవంశజుల మయిన క్షత్త్రియుల మని చెప్పుకొనియుండుట మన మెఱుంగుదుము. గుడిమెట్టచాగివారు దుర్జయవంశజుల మనియు, మనుకులసంభవుల మనియుఁ, జెప్పుకొనియున్నారు. దుర్జయవంశజు లయిన రాజు లనేకులు విష్ణుపాదోద్భవుల మైన చతుర్థాన్వయులమని బాహాటముగాఁ జెప్పుకొనియున్నారు. అదియును గాక వీరలు కాకతీయ రాజబంధువులుగఁ గనుపట్టుచున్నారు. వీరిశాసనములం దెచ్చటను కాకతీయులకు సామంతుల మని చెప్పికొని యుండలేదు. గుడిమెట్టచాగివారిలోఁ గొందఱు మనుకులసంభూతుల మని చెప్పుకొనియుండుటచేత వారిసంతతివారు తమది సూర్యవంశమనియు, వసిష్ఠ గోత్రమనియుఁ జెప్పుకొన నారంభించిరి. గణపతిదేవరాయలకాలమునం దుండిన చాగిపోతరాజు గోదావరిమండలములోని పెద్దాపురసంస్థానపు లయిన వత్సవాయవారికి మూలపురుషుఁ డని యేనుఁగులక్ష్మణకవిప్రణీత మైన రామవిలాస మనుప్రబంధమున వర్ణింపఁబడి యున్నది.

"గీ. సహ్యజాతీరమునకు భూషణ మనంగ
సిరులు కిరవగు గుడిమెట్టపురము దనరు

రాజధానిగ సత్కళాభోజరాజా
సాగిపోతక్షమాభర్త జగతి యేలె."

ఈ సాగివంశపురాజులయొక్క శాసనములు కృష్ణామండలములో నందిగామ సీమలో నున్న గుడిమెట్ట, ముక్త్యాల, అనుమంచిపల్లె, పెనుగంచిప్రోలు, నవాబుపేట, మొదలగు ప్రదేశములందును బెజవాడలోను గానంబడుచున్నవి. నందిగామతాలూకాలోని ముక్త్యాలగ్రామములో నున్న చెన్నకేశవస్వామి దేవాలయముయొక్క తూర్పుప్రాకారమునకు సామీప్యమునఁ బాఁతియున్న నాగులబండ అను స్తంభముమీఁద వ్రాయఁబడిన శాసనములో విష్ణువునాభి నుండి బ్రహ్మ జనించెననియు, వానినుండి దుర్జయుఁడు పుట్టెననియు, అతని వంశమున ముప్పరాజు జనించెననియు, అతనివంశమున గోంకదోరపరాజును, అతనికి పోతరాజును, ఆపోతరాజునకు రాజాంబికయందు త్యాగరాజు (చాగి రాజును), ఆతనికి దోరపరాజును, అతనికి చాగిపోతరాజును జనించి రని చెప్పఁబడినది. గుడిమెట్టలోని యొకశాసనములో చాగిదోరపరాజునకు చిమ్మాంబికయందు పోతరాజు జనించెననియు, అతనికి రాజాంబిక యను పతివ్రతయైనభార్య కలదనియు వ్రాయఁబడి యున్నది. ఏనుఁగులక్ష్మణకవిప్రణీత మైన రామవిలాసములో సూర్యాన్వయమున సాగిపోతరాజు జనించెననియు, అతనికి నరసింహరాజును, అతనికిపోతరాజును, మాచరాజును, వారిలో మాచ నృపతికి ఎఱపోతరాజును, అతనికి తెలుఁగురాజు, రామరాజు ననువారును బుట్టిరనియు, జెప్పఁబడి యున్నది. పైనిజెప్పినవారిలో నరసింహభూపతి కుమారుఁడైన పోతరాజును లక్ష్మణకవి తనగ్రంథమునం దీవిధముగా నభివర్ణించి యున్నాఁడు.

"మ. స్థిరభక్తిన్ గుడిమెట్టలోపలఁ బ్రతిష్ఠించె న్నృపాసింధుబం
ధురసౌధంబున విశ్వనాథుఁ బరమాత్ముని రాజనారాయణున్
సురవంద్యున్ బెజవాడయందు నిలిపెన్ సుశ్లోకధర్మైకత
త్పరశీలుం డగుచున్న పోతనృపుఁ డేతన్మాత్రుఁడే యెన్నఁగన్."

గుడిమెట్టశాసనములో దోరపరాజునకు చిమ్మాంబికయందు జనించిన పోతరాజు పరిపాలనమును వర్ణించుచో,

"శ్రీకృష్ణవేణ్యాస్తటభూమిభాగే
శ్రీపోతభూపో గుడిమెట్టనామ్ని
విశ్వేశ్వరాఖ్యం శివ మాదిదేవం
సంస్థాపయామాస పురే స్వకీయే."

అని గుడిమెట్టలో విశ్వేశ్వరస్వామిని బ్రతిష్ఠాపనముఁజేసె నని చెప్పఁబడి యుండుటచేత రామవిలాసములోని నరసింహుని పోతరాజును, ఈదోరప రాజు పోతరాజును నొక్కఁడే యని చెప్పఁదగును.

అట్లయినయెడల దోరపరాజునకు నరసింహరా జను నామాంతరము గల దని యూహింపవలయును. ఇంతియగాక బెజవాడ కనకదుర్గాంబయొక్క యాలయములో శ్రీనరసింహవర్ధనచాగిపోతరాజు పేరిటి శాసన మొకటిగలదు. అయ్యది నరసింహునికుమారుఁడైన చాగిపోతరాజుశాసన మని తెలుపు చున్నది. కాఁబట్టి ప్రస్తుతము దోరపరాజునకు నరసింహరా జను నామాంత రము కలదని విశ్వసింతము. ఈ పోతరాజు త్రిపురాంతక కాశ్మీరమల్లేశ్వర విశ్వనాథ చోడనారాయణ స్థానంబులఁ గనకకలశంబులను బెట్టించి సింహ గిరియందు నరసింహునకు సాగిపోతసముద్రం బను చెఱువుగట్టించి శ్రీపర్వతం బున (శ్రీశైలమున) మల్లికార్జునదేవునిముందట నందికేశ్వరునిం బ్రతిష్ఠించి దేవ భోగంబులకై కంభముపాడు, ముచ్చింతలు, బూదవాడ మొదలగు గ్రామ ముల నిచ్చి, బ్రాహ్మణోపభోగంబులుగా ననేకాగ్రహారంబు లొసంగె నని బెజవాడశాసనమునఁ జెప్పఁబడి యున్నది. ఈశాసనము కాకతిగణపతిదేవ చక్రవర్తి సింహాసన మధిష్ఠించిన క్రీ. శ. ౧౧౯౯దవ సంవత్సరమున వ్రాయఁ బడినది. ఈ కుటుంబములోనివాఁ డగుచాగిమనుమగణపతిదేవునిశాసనములు గూడ పెక్కులు నందిగామసీమలోఁ గానవచ్చుచున్నవి. అతఁడును, చాగి రాజును కాకతిగణపతిదేవునకు సమకాలికులు. వీరు నతవాటిసీమలో నధికార ములను వహించియుండిరి. వీరును నతవాటిసీమను బరిపాలనముచేసిన బుద్ధ

రాజు, రుద్రరాజు, మాధవరాజు మొదలగువారును నొక్క కుదురులోని వారుగాఁ గనుపట్టెదరు.

ఈసాగివంశపురాజులచరిత్రమును సంపూర్ణముగాఁ దెలిసికొనుటకు మఱి కొంతకాలము పట్టును. ప్రస్తుతము దొరకిన సాధనము లసమగ్రములుగ నున్నవి.

వేములవాడ భీమకవి

సాగిపోతరాజుగారు గుడిమెట్టలోఁ బరిపాలనము సేయుచుండఁగా వేములవాడభీమకవి విషమాక్షరప్రయోగముచేసి యిట్టి పద్యము చెప్పఁగా నతఁడు మృతినొందె నని యొకకథ చెప్పుదురు. సాగిపోతరాజు త్యాగశీలుఁ డని విని భీమకవి గుడిమెట్టకుఁ బోయినప్పుడు పోతరాజు తనగుఱ్ఱమును గట్టి పెట్టించి విడువనందున, ఈక్రింది పద్యముచే శపించెనని చెప్పుదురు.

"చ. హయము మది సీత, పోతవసుధాధిపుఁ డారయ రావణుండు, ని
శ్చయముగ నేను రాఘవుఁడ, సహ్యజ వారిధి, మారుఁ డంజనా
ప్రియతనయుండు, లచ్చన విభీషణుఁ, డాగుడిమెట్ట లంక, నా
జయమును బోతరక్కసునిచావును నేఁడెకనాఁడు చూడుఁడీ."

ఇది యథార్థమైనను గాకపోయినను భీమకవి యాకాలమున నున్నవాఁ డని చెప్పవచ్చును. ఈమహాకవినిగూర్చి విశ్వసింప నర్హములుగాని కథ లనేకములు కల్పింపఁబడి దేశమునందంతటఁ జెప్పుకొనఁబడుచున్నవి. ఇతఁడు నృసింహపురాణమును రచించె నని శ్రీమానవల్లిరామకృష్ణయ్యగారు వ్రాయుచు నీక్రింది పద్యము నృసింహపురాణములోని దని కుమారసంభవ కావ్య పీఠికలో నుదాహరించి యున్నారు.

"ఉ. వాఁడిమి నల్లసిద్ధిజనవల్లభుఁ డోర్చిన రాజు భీరుఁడై
యాంద్రను గాన కుండె వృషభాంకము పెట్టికొనంగఁ జూచితో
సెం డిదె యేమి నీ కనుచు నెచ్చెలు లెల్ల హసింప నంతలో
మూఁడవకంటితోడిదొర మూర్తి వహించిన ప్రోక్కు రంగనల్."

ఈపద్యమునందు నల్లసిద్ధిరాజుపేరు గనంబడుటచేత భీమకవికాలము కొంచె మించుమించుగా నిర్ధారిత మగుచున్నది. ఈ నల్లసిద్ధిరాజు పండ్రెండవ శతాబ్దమునంతమున ననఁగాఁ బైఁజెప్పఁబడిన సాగిపోతరాజుకాలమునఁ గడప మండలములోని వల్లూరుపట్టణము రాజధానిగఁ బొత్తపినాడు మొదలగు దేశములను బాలించెను. కవిజనాశ్రయము రచించినది గోకర్ణనృపాలుఁడుగాని యితఁడు గాఁడు. భీమకవి నివాసస్థలము గోదావరి మండలములో గోదావరీ తీరమున నున్న వేములవాఁడ యను పుణ్యక్షేత్రము.

గోపరాజు రామప్రధాని

ఇతఁడు గణపతిదేవచక్రవర్తియొక్క బ్రాహ్మణమంత్రులలో సుప్రసిద్ధుఁడు. గణపతిదేవునికాలమువఱకును విశ్వబ్రాహ్మణుల మని చెప్పుకొను కంసాలులును, శూద్రులును మాత్రమే గ్రామకరణములుగా నుండుచు వచ్చిరి. గణపతిచక్రవర్తి బ్రాహ్మణులయం దభిమానము గలిగియుండుటచేత నాయుద్యోగము లన్నియు నియోగిబ్రాహ్మణుల కిప్పింపవలసినదిగాఁ దన మంత్రులలో నొక్కఁడయిన యీగోపరాజు రామప్రధానిని నియమించె నని చెప్పుదురు. అప్పు డాతఁడు చక్రవర్తి యాజ్ఞాప్రకారము నియోగిబ్రాహ్మణులకు మిరాసీల నేర్పఱచి తెలుఁగురాజ్యమునం దంతట నియోగిబ్రాహ్మణులనే కరణములుగా నియోగించె నని ప్రతిగ్రామముయొక్క స్థానికచరిత్రమునందును వ్రాయఁబడియున్నదిగాని యీమంత్రిపేరు దెలుపునట్టి గణపతిదేవుని నాఁటిశాసన మొక్కటియైనను గానరాదు. ఇతని ప్రసిద్ధి యాంధ్రదేశమునందంతట వ్యాపించి యున్నదనుట వాస్తవము. ప్రమాణరహితములైన విషయముల నెత్తి వ్రాయుటకన్న భావిపరిశోధనముల నీతని చరిత్రము దెలియునంతవఱకు సంక్షేపించి మిన్నకుండుటయే యుక్తముగాఁ గన్పట్టుచున్నది.

గంగయసాహిణి.

ఈగంగయసాహిణి గణపతిదేవచక్రవర్తియొక్క మహాప్రధానులలో నొక్కఁడు. ఇతఁడు హైదరాబాదురాజ్యములో నల్లగొండజిల్లాలోని పాను

గల్లు మొదలుకొని మార్జవాడివఱకును గల తెలుఁగుదేశమునంతను బ్రతినిధిపరిపాలకుఁడై పరిపాలించెను. కడపమండలములోని పులివెందలతాలూకాలోని మోపూరు మొదలుకొని మైసూరురాజ్యములో చింతామణితాలూకాలోని మిండిగల్లువఱకుఁ గల ప్రదేశమునకు (7000 గ్రామములు గలది) మార్జవాడి లేక మహారాజపది యనునామము గలదు. మార్జవాడికి కైవారముకోట యని యొక శాసనమున నున్నది. ఈనాటికి వల్లూరుపట్టణము రాజధానిగ నుండెను. కాఁబట్టి రాజప్రతినిధిగ నుండిన గంగయసాహిణి కడప, కందనూలు, అనంతపురము, బళ్లారి, నెల్లూరు, గుంటూరు మండలములకు సర్వాధికారియై పరిపాలించె నని యనేకశాసనములంబట్టి నిర్ధారిత మగుచున్నది.

గంగయసాహిణి కాయస్థుఁడు.

మహారాజప్రతినిధియైన యీగంగయసాహిణి కాయస్థకులస్థుఁ డని కడప మండలములోని పుష్పగిరిలో నున్న యొక శాసనములో వ్రాయఁబడిన యీక్రిందిశ్లోకమువలనఁ దెలియుచున్నది.

“ గండ పెండేరక నామధేయః
కాయస్థవంశోద్భవకర్ణధారః
శ్రీగంగ సేనాపతి రస్య కాన్తా
కాన్తి ర్హిమాంశోరివ కాబలాయః”

గంగయసాహిణి పూర్వచరిత్రము.

గంగయసాహిణికిని మనుమసిద్ధి రాజునకును వైరము గలదని తిక్కన సోమయాజి విరచితమైన నిర్వచనోత్తరరామాయణములో

“ఉ. రంగదుదారకీర్తి యగు రిక్కసగంగని బెంజలంబుపై
భంగ మొనర్చి మన్మజనపాలుఁడు బల్విడి నాఁచికొన్న రా
జ్యాంగము లెల్ల నిచ్చి తన యాశ్రితవత్సల వృత్తి యేర్పడ
గంగయసాహిణిం బదము గైకొనఁ బంచెఁ బరాక్రమోన్నతిన్”

అనుపద్యమువలన బోధపడుచున్నది.

“ఇట్టి మహాపరాక్రమవంతుఁడైన గంగయసాహిణి నొకమండలాధిపతిగ నున్న మనుమసిద్ధి యెట్లు జయించి యతని రాజ్యాంగము లెల్ల నాఁచికొని యెనో, ఎట్లాతఁ డాశ్రితుఁడై యితనిం బ్రార్థించెనో, ఎట్లీతఁ డాశ్రితవత్సలవృత్తి యేర్పడునట్లుగా నాఁచికొన్న రాజ్యాంగము లెల్ల నిచ్చి పదము గైకొనఁ బంచెనో, ఎంతమాత్రమును బోధపడకున్నది.” అని యీచరిత్రము యొక్క రెండవ ప్రకరణములో మనుమసిద్ధిరాజుంగూర్చిన ఘట్టమున వ్రాసియున్నాను. ఇటీవల స్థానిక చరిత్రములఁ బరిశోధింపఁగా గంగయసాహిణి యొక్క పూర్వవృత్తాంతము గొంతవఱకుఁ దెలియవచ్చినది. గంగయసాహిణి మొట్టమొదట గణపతిదేవ చక్రవర్తి కొలువులో లేఁ డనియు మనుమసిద్ధిరాజు తండ్రియైన తిరుకాళచోడమహారాజునకు (తిక్కరాజు) అగ్రసేనాధిపతిగ నుండె ననియు, సిద్ధవటముసీమలోని మోగూరు స్థానిక చరిత్రమునందుఁ జెప్పబడుచున్నది. ఇతఁడు మొదట తిక్కభూపాలునకు సేనాధిపతిగ నుండి యతని యనంతరమున కలుకడపురవరాధీశ్వరుం డయిన శ్రీమన్మహామండలేశ్వర త్రైలోక్యమల్ల భుజబల వీరనారాయణ రాయ దేవమహారాయల సైన్యాధీశుఁడై మోదుకూరునందుండి ములికినాటిని బరిపాలనము సేయు నపుడు తిక్కరాజు కొడుకయిన మనుమసిద్ధిరాజునకును గంగయసాహిణికిని, యుద్ధము జరిగి యుండవచ్చును. ఆయుద్ధమునందు గంగయసాహిణి నోడించి యాతం డాశ్రయించుటచేతఁ దన యాశ్రితవత్సలవృత్తి యేర్పడినట్లుగా యథాస్థానమునకుం బంచె నని స్పష్ట మగుచున్నది. శా. శ. ౧౧౬౯ (క్రీ. శ. ౧౨౪౭) ప్లవంగసంవత్సర పుష్యశుద్ధ ౧౩ బుధవారమునాఁడు గంగయదేవమహారాజునకు భృత్యుఁడైన జొత్తిరామినాయకుఁడు ములికినాటిసీమలోని సిద్ధవటమునకుఁ బశ్చిమమున రెండుపరువుల దూరమునఁ బినాకినీనదీ తీరంబున నున్న జ్యోతిగ్రామములోని సిద్ధనాథుని గుడిగోపురము కట్టించి యగ్రహారము నొసంగి శాసనము వ్రాయించెను. కాఁబట్టి క్రీ. శ. ౧౨౪౭వ సంవత్సరమునఁ గాని తరువాతఁ గాని కాకతి గణపతిదేవచక్రవర్తి దక్షిణదేశమునకు దండెత్తివచ్చుట సంభవించియుండును.

గణపతి దక్షిణదేశముపై దండెత్తుట.

గణపతిచక్రవర్తి వెలనాటిరాజులను జయించిన తరువాత వెలనాటికి దక్షిణభాగమై యున్న కమ్మనాటిని బరిపాలించుచున్న చోడరాజులను గూడ జయించెను. కొట్యదొన (కోణిదెన) పురాధీశ్వరుండును, నన్నెచోడభూపాలుని, కుమారుండు నైన త్రిభువనమల్లచోడభూపాలుని, వాని యాప్తవర్గములోని మఱికొందఱు చోడరాజులను జయించి సామంతులనుగాఁ జేసికొనియెను. అటుపిమ్మట కందుకూరుసీమలోనియద్దంకిపై దండయాత్ర వెడలి యాపట్టణ మేలుచున్న సేవణదేశస్థుఁడైన మాధవరాజును జయించి యటనుండి ములికినాటి దేశముపై దండెత్తిపోయి ములికినాడు పొత్తపినాడు, రేనాడు, గండికోట సీమ మొదలగు ప్రదేశముల నెల్ల జయించి యటనుండి కాంచీపురమును ముట్టడించెను. ఈ దండయాత్రకుఁ గారణము పాండ్యులు మొదలగు దాక్షిణాత్యులు కాంచీపురమునుండి తెలుగుచోడులను దఱిమి యాపట్టణ మాక్రమించుకొని యుండుటచేతఁ దెలుగుచోడులు గణపతి చక్రవర్తి సాహాయ్యము నపేక్షించి యుందురు. అట్లు గాక కేవలము ద్రవిడదేశ విజిగీషామనీషం దండెత్తిపోయి యుండవచ్చును. ఎట్లయిన నేమి? గణపతిదేవచక్రవర్తి దక్షిణదేశముపై దండెత్తిపోయి కాంచీపురము వఱకును గల దేశము నంతయు జయించెను. ఆకాలమున గణపతిదేవ చక్రవర్తి గంగయదేవమహారాజును జయించి యాతనినే తనకు సైన్యాధ్యక్షునిగాఁ జేసికొని నటులు గాన్పించుచున్నది.

గణపతి పాండ్యులను జయించుట.

మనుమసిద్ధితండ్రి యగు తిక్కరాజు కాలమునఁ బాండ్యులు కాంచీపురముపై దండెత్తివచ్చి యారాజ్య మాక్రమింపఁగాఁ దిక్కరాజు పాండ్యులతో యుద్ధము చేసి వారలను దఱిమి మగల చోడునిసింహాసనమునఁ గూరుచుండఁబెట్టి చోళస్థాపనాచార్యబిరుదమును వహించెనని తిక్కరాజుంగూర్చి వ్రాసిన ప్రకరణమునఁ దెలిపి యున్నాఁడను. తిక్కరాజు మరణానంతరము పాండ్యరాజులు తమతొంటిపూనికను విడనాడక కాంచీపురము మొదలు

కొని యుత్తరభూమిని జయింపఁగోరి పలుమాఱు దాడి వెడలి వచ్చి నెల్లూరునకు దిగువ నున్న దేశమును గొల్లగొట్టుచుండిరి. వారిలో జటవర్మ సుందర పాండ్యమహారాజు ప్రముఖుఁడై క్రీ. శ. ౧౨౪౯వ సంవత్సరమునఁ గాంచీపుర మాక్రమించుకొని యుండఁ గాకతి గణపతిదేవుఁ డసంఖ్యాకము లగు నసైన్యములతో నేతెంచి సుందరపాండ్యమహారాజును కాంచీపురమునుండి పాఱఁద్రోలి యాపురము స్వాధీనపఱచుకొనియెను.

సామంత భోజమంత్రి.

ఇప్పటనే క్రీ. శ. ౧౨౪౯వ సంవత్సరమున గణపతిదేవచక్రవర్తి యాజ్ఞను శిరమున వహించి యాతనిసచివాగ్రణియు, సైన్యపాలుఁడును, చక్రధారియునై కాంచీపురపాలకుఁడుగా నియమింపఁబడిన సామంతభోజుఁడు కాంచీపురములోని యేకాంమ్రేశ్వరునకు కాలత్తూరనియెడు గ్రామమును దానము చేసి శాసనము వ్రాయించెను. ఈసామంతభోజుని యొక్క శాసనము మఱియొకటి కాళహస్తిలో మణికంఠేశ్వరుని గుడికి నెదుట నున్న ఱాతిపైని గనుపట్టుచున్నది. భోజమంత్రి కాశ్యపసగోత్ర జాతుఁడయిన దాచమంత్రికిని నారీరత్నమును సోమనాథునికి (శివునకు) భక్తురాలు నగువాచాంబకును కుమారుఁ డని చెప్పంబడియుండుటచేత నితఁడు నియోగి బ్రాహ్మణుఁడుగా నూహింపదగియుండెను. ఇతఁడు కాళహస్తీశ్వరనగరమునఁ బ్రతిదినకైంకర్యాదులను జరుపునట్లు చేసె నని గ్రంథలిపిలో వ్రాయఁబడిన యాశాసనము దెలుపుచున్నది.[1]

పాండ్యులు మరల నెల్లూరు నాక్రమించుట.

కాకతి గణపతిదేవచక్రవర్తి దక్షిణ దిగ్విజయ యాత్రను ముగించి

---

1. The Indian Antiquary, Ekamranatha inscription of Ganapati. Vol. XXI p. 197.; No. 15 Ganapeswaram Inscription of the Time of Ganapati.

స్వస్థలమైన యోరుఁగంటికిఁ జేరిన తరువాత జటవర్మ సుందరపాండ్యమహారాజు మఱుసటి వత్సరమున మరల దాడి వెడలి కాంచీపురమును, విక్రమసింహపురమును (నెల్లూరు) స్వాధీనపఱచుకొనియెను. ఇందులకుఁ గారణము విక్రమసింహపురాధిపత్యమునకై తెలుఁగు చోడరాజులు తమలోఁ దాము పోరాడి యొకపక్షమువారు పాండ్యుల సాహాయ్యమును గోరియుందురు. క్రీ. శ. ౧౨౫౦ దవ సంవత్సరమున జటవర్మ సుందరపాండ్య మహారాజు మనుమసిద్ధిరాజును నెల్లూరినుండి పాఱఁద్రోలి సిద్ధిరాజునకు శత్రువుల యిన వీరులను పట్టాభిషిక్తులను గావించి విక్రమసింహపురములోని పళ్లికొండ పెరుమాళ్ల దేవునకు సుందరపాండ్య సంధి యను భవమును గట్టించుటయే గాక యాదేవుని నిత్యకైంకర్యాదులకు మండనాటిలోని మావడిగుండ గ్రామమునుండి వచ్చెడి సమస్తము లయిన పన్నులను వినియోగించుటకై యాగ్రామమును కళింగరాజు (తెలుఁగురాజు) యొక్క ప్రేరణముచేత దానము చేసి శాసనము వ్రాయించెను.[1] అయినను గణపతిదేవచక్రవర్తియొక్క సైన్యాధిపతులతోడ్పాటుతో విజయగండ గోపాలదేవుఁడు మొదలగు తెలుఁగు చోడరాజులు పాండ్యుని వానిసైన్యములను నెల్లూరిమండలమునుండి పాఱఁద్రోలిరి.

గంగయ సాహిణి బాహాత్తరి నియోగాధిపతి.

కాకతి గణపతిదేవచక్రవర్తి గండికోట, ములికినాడు, రేనాడు, పెనదాడి, పెడకల్లు, సకిలినాడు, ఏరువనాడు, పొత్తపినాడు మొదలగు సీమల నెల్ల జయించి గంగదేవ మహారాజును తనకు సైన్యాధ్యక్షుఁగ నియమించి యాతఁడు తనకుఁ బ్రతినిధిగ నుండి పైసీమలను బరిపాలించునటు లనుజ్ఞ నొసంగెను. కాఁబట్టి యప్పటినుండియు గంగయ సర్వాధికారియై సైన్యాధ్యక్షుఁడై ప్రతినిధిపరిపాలకుఁడై మిగుల వాసి గాంచెను. గణపతిదేవచక్రవర్తికి లోఁబడిన సామంతరాజుల నెల్లరను శాసించి యదుపులోనుంచి ప్రఖ్యాతు

1. Nellore Inscriptions, Part II. page 830, No. 16.

డైనందున గంగయసాహిణికి మాండలిక బ్రహ్మరాక్షసుఁ డనియు, రక్కసగంగ యనియుఁ బేరులు వచ్చెను. ఆకాలమునం దాంధ్రచక్రవర్తియైన గణపతిదేవుని రాష్ట్రంబున డెబ్బదిరెండు వినియోగంబులవారు గలరు. వారి కెల్లగను నీతం డధిపతి గావున బాహాత్తరి నియోగాధిపతి యని బిరుదమును వహించెను. అయ్యలరాజు నారాయణామాత్య విరచితమైన హంసవింశతి యను ప్రబంధమునందు:—

"గురు మహాప్రధాన సామంత సేనాపతి ద్వారపాల కావసరిక ఘటికానిర్ధారక గణక లేఖక పౌరాణిక పురోహిత జ్యౌతిషిక కావ్యజవిద్వాంసక దేవతార్చక మాలాకారక పరిమళకారక చేష్టాధికార గజాధికా రాశ్వాధికార భాండాగారాధికార ధాన్యాధికా రాంగరక్షక సూత సూద బేతాళమత తాంబూలిక తాళవృంతక నరవాహన చ్ఛాత్రిక దామరిక కళాంచిక శరకారిక కీరమాలిక పాదుకాధార నర్తక గాయక వైణిక శాకునిక మాగధ వైతాళిక స్తుతిపాఠక పరిహాసక క్షౌరక రజక సౌచిక చర్మకారక ముద్రాధికార పురపాలక గజవైద్యాశ్వవైద్య పశువైద్య భేరీవాదక మురజవాదక కారక కుంభకారక చిత్రకారక వ్యావహారిక మృగయాది పక్షివాహక ఫణిహారి కోగ్రాణాధికార వైశ్యజనంబు" లాదిగా డెబ్బదిరెండు వినియోగంబుల వారిని పేర్కొనియున్నాఁడు.

గంగయ సాహిణి దానధర్మములు.

గంగయసాహిణి చేసిన దానధర్మములను గూర్చి శాసనము లనేకములు కడప కందనోలు మండలములలో ననేకములు గానవచ్చును. ఆకాలమునాటి ప్రభువులవలెనె దేవతా బ్రాహ్మణ భక్తిగలవాఁడగుటచేత నితఁ డనేక శివాలయములకును బ్రాహ్మణులకును దానధర్మములను గావించి ప్రఖ్యాతుఁడయ్యెను. ఇతఁడు శా. శ. ౧౧౭౭ (క్రీ. శ. ౧౨౫౫) రాక్షసనామసంవత్సర శ్రావణ శుద్ధ ౧౫ మంగళవారమునాఁడు చంద్రగ్రహణ పుణ్యకాలమున త్రిపురాంతకములోని త్రిపురాంతకేశ్వరునకు మోడివాడిగాడిలోని పూలచెరువు గ్రామ

మును ధారాపూర్వముగ దత్తముగావించెను. మఱియును మైదకూరుపట్టణమున శకవర్షము ౧౧౮౧ సిద్ధార్థిసంవత్సర పుష్య ౧౧ మకరసంక్రాంతిపుణ్యకాలమున బ్రాహ్మణులకు ౭౮ వృత్తులు గల శ్రోత్రియాగ్రహారమును జేసి ధారాపూర్వకముగ దత్తము గావించెను. ఇంతియగాక త్రిపురాంతములోని శ్రీమూలస్థానదేవునికి బోయపల్లి రెడ్లపల్లి గ్రామములలో భూదానములను చేసెను.

జన్నిగదేవ సిద్ధయదేవుల యుద్ధము.

గంగయసాహిణి ములికినాటి దేశమును బరిపాలనము చేయుచున్న కాలమునఁ గాంచీపురమునుండి భీమయదేవ మహారాజు కుమారుఁడు సిద్ధయదేవమహారాజు ములికినాటిని జయించి స్వాధీనపఱచుకొన వలయునని దండెత్తివచ్చి పట్టపురావిగ్రామమునకుఁ బూర్వభాగమునందు రెండుపర్వలమార్గమునఁ బినాకినీనదికి నుత్తరభాగమున నున్న సోమశిల పట్టణము కడ దండు దిగి యుండఁగా గంగయసాహిణితోఁ బుట్టువుకుమారుఁడైన మురారి నారాయణ చలమర్తిగండ గండపెండేర జన్నిగదేవమహారాజు సైన్యమును గూర్చుకొని వచ్చి గంగయసాహిణి పక్షమున సిద్ధయదేవుని సేనల నెదుర్కొని ఘోరయుద్ధము చేసెను. ఒకటి రెండు సారులు సిద్ధయదేవ మహారాజునకే జయము కలుగుటయు. సిద్ధయదేవుఁడు వీరమరణము నొందుటయుఁ దటస్థించెను. గణపతి దేవచక్రవర్తికిని గంగయసాహిణికిని పిమ్మట జన్నిగదేవమహారాజు కాకతీయ రుద్రదేవునికి సైన్యాధ్యక్షుఁ డయ్యెను.

గణపతిదేవచక్రవర్తి జైనబౌద్ధులను జంపించుట.

పండ్రెండవ శతాబ్దమున వీరశైవమతము త్రిలింగదేశమునఁ బ్రవర్ధమానమై వ్యాపించుచుండినను జైను లనేకులు సురక్షితులై యుండుచు వచ్చిరి కాని గణపతిదేవచక్రవర్తి కాలమున నతఁడు మొదట శైవమతాభిమానియు నద్వైతవాదియునై యుండి జైనులయెడఁ బ్రబలద్వేషమును జూపుచుండె నని యనేక గాథలవలనఁ దెలియుచున్నది. ఏకశిలానగరమున జైను లనేకులు నివసించుచుండఁగా సహింపఁ జాలక శైవులును బ్రాహ్మణులును చక్రవర్తిని

బ్రేరేపింప నతండు జైనుల ననేకులఁ జంపించెను. ముప్పదియాఱు జైనగ్రామములను నాశనము గావించెను. ఈఘోరకృత్యముల నన్నిటిని తిక్కనసోమయాజి ప్రేరేపణముచేతనే జరిగించె నని సోమదేవరాజీయాది గ్రంథములం జెప్పఁబడినది గాని యది యంతగా విశ్వసింపఁ దగినది గాఁ గనుపట్టదు. ఎందుకనఁ దిక్కన సోమయాజి గణపతిచక్రవర్తిని సందర్శించె నని చెప్పఁబడు విషయము పూర్వగాథలలోఁ గానంబడుచున్నది గాని శాసనాదివృత్తాంతములవలనఁ దెలియంబడ దని తిక్కన సోమయాజి మనుమసిద్ధి రాజులం గూర్చిన ప్రకరణమునం జర్చించియున్నాఁడను. ఒకవేళ నీ గాథయే నిజమైన జైనయెడల నిత్యాది క్రీ. శ. ౧౨౪౯ దవ సంవత్సరమున జరిగి, యుండవలయును.[1] గణపతి చక్రవర్తి యద్వైతవాది యని గణపతిచక్రవర్తి కూఁతురైన గణపాంబయొక్క యేనమదల శాసనములోఁ జెప్పఁబడినది. గణపతిదేవచక్రవర్తి కాలముననే జైను లయిన కంసాలులనుండియు, సెట్టిపెద్దలయిన తెలగాలనుండియు గ్రామ కరణోద్యోగములు దొలఁగింపఁబడి నియోగిబ్రాహ్మణుల కీయఁబడినవి. అంతకుఁ బూర్వము వీరలు బ్రాహ్మణులకుఁ బ్రతికూలముగ నుండుటచేత నిప్పాటు సంభవించినది. దీని నంతయును విచారించి చూడఁగా గణపతిదేవ చక్రవర్తి యితర విషయములం దెట్టి సుగుణాఢ్యుఁడైనను ఈమతవిషయమున సహనములేనివాఁ డని స్పష్టమగుచున్నది. కాఁబట్టి బౌద్ధదేవాలయంబులు జైనదేవాలయంబులు గూలం ద్రోయించె ననియు, జైనగ్రామముల నశింపఁజేసె ననియు, తిరుగఁబడిన జైనుల ననేకుల సంహరించి యనేకులను దేశమునుండి వెడలఁగొట్టించె ననియుఁ జెప్పెడి గాథలలోఁ జాల వఱకు సత్యము గల దని విశ్వసింపవచ్చును.

చెన్నాప్రెగడ గణపామాత్యుఁడు.

ఇతఁడు గణపతిదేవుని బ్రాహ్మణమంత్రులలో నొక్కఁడై సర్వాధికారియై ప్రసిద్ధిగాంచినవాఁడుగా నుండెను. ఈమంత్రిశిఖామణి శా. శ. ౧౧౬౭

1. ఆంధ్రులచరిత్రముయొక్క ద్వితీయభాగములో ౭౫-౭౮ పేజీలు చూడుఁడు.

విశ్వావసునామ సంవత్సర పుష్యశుద్ధషష్ఠి కుజ వాసరంబున మకరసంక్రాంతి నిమిత్తమునఁ గాకతి గణపతిదేవ మహారాజునకు ధర్మముగా త్రిపురాంతక దేవున కంగరంగభోగములకై నడిపింపఁబడుచున్న త్రిపురాంతక గ్రామములో సుంకము లేకుండ మున్నూరు నివేశనములను పెఱుకవాండ్రకు దానము చేసె నని మాత్రము త్రిపురాంతక శాసనములలో నొకదానింబట్టి దెలియుచున్నది.

మేచయ నాయకుఁడు.

ఈ మేచయనాయకుఁడు గణపతిదేవ చక్రవర్తి కాలమున నేకశిలానగరపాలకుండును ఆతని కనుంగుఁబలనరియు నై యొప్పుచుండె నన్నిమారన కవికృతమైన మార్కండేయ పురాణముయొక్క యవతారికలో నీక్రింది సీసపద్యములోఁ జెప్పఁబడియున్నది.

“ సీ. ఏరాజు రాజుల నెల్ల జయించి ము
న్వ్రేట్రికిఁ బట్టెఁ దోర్విక్రమమున
నేరాజు సేతునీహారాద్రి మధ్యోర్వి
నేకపట్టణలీల నేలి వ్రాలె
నేరాజు నిజకీర్తి నెలిమిని దిశల ను
ల్లాసంబు నొంద నలంకరించె
నేరాజు తన తేజ మీజగంబునకు న
ఖండైకవిభవంబుగా నొనర్చె
నట్టి కాకతి గణపతిక్ష్మాధినాథు
నమ్ముఁగుఁ దలవరి ధర్మాత్ము డధికపుణ్యుఁ
డయిన మేచయ నాయకు ప్రియతనూజ
నతులశుభలక్షణ స్ఫురితాంగి.”

ఈ మేచయనాయకుని కొమార్తయైన మల్లమాంబికను మల్లచమూవల్లభుని కుమారుఁడగు నాగయామాత్యుండు వివాహముఁ జేసికొనియెను. రుద్రమదేవిం గూర్చి వ్రాయుప్రకరణమున నీనాగయ చరిత్రము వివరింతును.

అద్దంకిప్రభువు మాధవ నాయకుఁడు.

చోడ చక్రవర్తుల పరిపాలనమునం దెప్పుడో మహారాష్ట్ర సేవణ దేశమునుండి వచ్చిన నాయకులు గొంద అద్దంకి సీమకు నధికారులుగ నేర్పడిరి. సేవణరాజులు యాదవులగుటం జేసి వీరిని గూడ యాదవులను గానే భావింపవలసియున్నది. ఈప్రభువుల శాసనములు క్రీ. శ. ౧౨౧౦ దవ సంవత్సరము మొదలుకొని క్రీ. శ. ౧౨౭౯ దవ సంవత్సరమువఱకు నద్దంకి సీమలోఁ గానంబడుచున్నవి. గణపతిదేవ చక్రవర్తి కాలమున నీసీమ కధిపతియై పరిపాలనము సేయుచున్నవాఁడు శ్రీమన్మహామండలేశ్వర మాధవమహారాజు గా నుండెను. అతివిషమహాయాదూఢ ప్రౌఢరేఖారేవంతుఁ డనియు, ప్రబలకృతాంతుఁ డనియు, శరణాగతవజ్రపంజరుఁ డనియు, మండలీకగవం దోలి యనియు, జీవరక్షచక్ర నారాయణుం డనియు బిరుదములను బొందినవాఁడుగా నుండెను. ఇతఁడు శా. శ. ౧౧౩౦ విభవసంవత్సర భాద్రపద శుక్లపక్ష దశమీ సోమవారమునాఁడు సంక్రాంతి సమయమున శ్రీమాండుకేశ్వర మహాదేవునకుఁ గుండ్లకమ్మకుఁ బడమట నున్న కొటికలపూడి గ్రామమున నలువది పుట్లపొలము దానము చేసె నని వంగవోలు తాలూకాలోని మణికేశ్వర గ్రామములోనున్న పాండుకేశ్వర దేవాలయమున కెదుట నున్న ఱాతిపై వ్రాయఁబడిన శాసనమును బట్టి దెలియుచున్నది.[1] కనుక నితఁడు క్రీ. శ. ౧౨౦౮ దవ సంవత్సర ప్రాంతమున నద్దంకిసీమను బరిపాలనము సేయుచుండె ననుట యథార్థమని స్పష్టపడుచున్నది.

ఇరువది ముప్పది సంవత్సరములకుఁ బిమ్మట వ్రాయఁబడిన శాసనములలో నీతఁడు కాకతి గణపతిదేవ చక్రవర్తికి సామంతుఁడై యున్నటుల వ్రాయఁబడియుండుటం జేసి యీనడుమకాలమున నెప్పుడో కాకతి గణపతిచే జయింపఁబడి యాతనికి సామంతుఁడై యుండె నని నిశ్చయింపక తప్పదు. కాఁబట్టి

1. Nellore Inscriptions. Vol. III. Ongole No. 76.

గణపతిదేవుఁడు వెలనాటిని జయించిన పిమ్మట క్రీ. శ. ౧౨౨౮ దవ సంవత్సర ప్రాంతముననే యీమాధవనాయకుని జయించి యుండును. ఈతనిది సాలంకాయన గోత్రము. ఇతఁడు క్రీ. శ. ౧౨౩౬-౪౧ దవ సంవత్సరము విషువ సంక్రాంతినాఁడు తనతల్లిదండ్రులకును గణపతిదేవ మహారాజునకును ధర్మార్థము నాగులుప్పలపాడు గ్రామములో మల్లికేశ్వరాలయమును గట్టించి యాశివాలయమునకును, పూజారులకును, వైదిక బ్రాహ్మణులకును, నియోగి బ్రాహ్మణులకును, దేవస్థానము నౌకరులయిన మంగలివాండ్రకును, బోగమువాండ్రకును వృత్తిక్షేత్రములను దానము చేసి ప్రఖ్యాతుఁ డయ్యెను. ఇతనిభార్య మాడబావి. ఈమెయందు నీతనికి సింగళదేవుఁడు, సారంగపాణి దేవుఁడు, గోపాలదేవుఁడు నను మూవురు పుత్త్రులు జనించిరి.

సింగళదేవ మహారాజు.

మాధవదేవరాజునకుఁ బిమ్మట సింగళదేవమహారాజు ప్రభు వయ్యెను. తండ్రివలెనే యీతఁడును చక్రనారాయణుఁడాదిగాఁ గల బిరుదముల నన్నిటిని వహించెను. ఇతనిశాసనములు క్రీ. శ. ౧౨౪౭ వ సంవత్సరము మొదలుకొని క్రీ. శ. ౧౨౫౪ గవ సంవత్సరమువఱకుఁ గానిపించుచున్నవి. ఈయనకు సోమరాజు ప్రధానిగ నుండెను. ఒంగోలులో నున్న శ్రీమల్లినాథ దేవుని నిత్యనైవేద్యమునకై భూదానముచేసి వ్రాయించిన యెండ్లూరు శాసనములో "సమస్తరాజ్య భరణ నిరూపిత మహామాత్యపద విరాజమాన మానోన్నత ప్రభుమంత్రోత్సాహ శక్తిత్రయగుణసంపన్నుఁడును, బాహాసప్తారి నియోగాధిపతియును, సకల లక్ష్మీపతియును, సమస్తసేనాధిపతియును, పతికార్య ధురంధరుండు" నని యీతనిం గూర్చి వ్రాయఁబడినది. సోమరాజునకు వెనుక మాయిదేవప్రెగ్గడ మహాప్రధాని యయ్యెను.

శ్రీసారంగపాణిదేవ మహారాజు.

ఇతఁడు సింగళదేవునకుఁ జ్యేష్ఠసోదరుఁడును మాధవదేవరాజునకు ద్వితీయపుత్త్రుఁడునై యుండి సింగళదేవునకుఁ బిమ్మట ప్రభుత్వపదవిని వహించెను. ఇతఁడు గణపతిదేవచక్రవర్తికి సామంతుఁడై అద్దంకిసీమను బరిపాలనము సేయుచు విక్రమసింహపురాధిపతియైన మనుమసిద్ధిరాజుతోడ యుద్ధములు సేయుచుండెను. ఒకయుద్ధములో నితని మనుమసిద్ధిరాజు జయించినట్లుగాఁ దిక్కన కవిసార్వభౌముఁడు తన నిర్వచనోత్తర రామాయణ పీఠికలో వ్రాసియున్న వివరమును రెండవ ప్రకరణమునఁ దెలిపియున్నాను. ఇతఁడును తనతండ్రియైన మాధవదేవరాజు వహించిన "అతివిషమహాయారూఢప్రౌఢరేఖారేవంతుఁడు, పరబల కృతాంతుఁడు, శరణాగత వజ్రపంజరుఁడు, మండలీకర వందోళియు, జీవరక్షచక్రనారాయణుఁడు నను బిరుదముల నన్నిటిని వహించెను. ఇతనికి గోవిందనాయకుఁడు మంత్రిగ నుండెను. ఈసారంగధరుఁడు బ్రాహ్మణపక్షపాతియు, బ్రాహ్మణభక్తుఁడునై యుండెను. ఇతఁడు సారంగపురమను నగ్రహారమును గల్పించి ౪౭ భాగములుగ విభాగించి వివిధగోత్రు లయిన బ్రాహ్మణులకు భక్తివిశ్వాసపూర్వకముగా ధారాదత్తముచేసి తామ్రశాసనము వ్రాయించి యిప్పించెను.

పదియవ ప్రకరణము.

వెలమవీరుల చరిత్రము.

కాకతి గణపతిదేవ చక్రవర్తికి భృత్యులుగ నుండి విక్రమాఢ్యు లని ప్రసిద్ధి గాంచిన వెలమవీరులు కొందఱు కాకతీయ చక్రవర్తుల ప్రాపునఁ బ్రబలి నాయకత్వములం బడసి బహుభూములను బరిపాలించినటులు గాథ లనేకములు చూపట్టుచున్నవి. వెలమవారు సంస్కారశూన్యులై శూద్రప్రాయు లయిన క్షత్రియసంతతివార మనియు, సచ్ఛూద్రుల మనియుఁ జెప్పుకొను తెగల వారలలో నొకరుగ నున్నారు. ఈ తెగవారిని గూర్చిన చరిత్రము సాంతముగా నిందు దెలుపుటకు సాధ్యపడక పోయినను గొంతవఱ కయినను వివరించుట యావశ్యకముగఁ గానంబడుచున్నది. వెలమ శబ్దము "వెళ్ళాళ్మ" అను శబ్దమునుండి పుట్టిన దని కొందఱు చెప్పుచున్నారు. "వెళ్ళాళ్మ" అనఁగా నీరును గట్టువారు (వ్యవసాయకులు) అని యర్థము. వర్మశబ్దభవము వెలమ యని చెన్నపురి రాజకీయ కళాశాలయందు సంస్కృతోపన్యాసకులుగా నుండి కీర్తిశేషులయిన ఎమ్. శేషగిరి శాస్త్రిలవారు "శబ్దశాస్త్ర" మను తమ గ్రంథమునందు వ్రాసియున్నారు. దక్షిణ హిందూస్థానములోని దేశములను బరిపాలించిన వారిలో వర్మశబ్దమును నామముల తుదను బెట్టుకొన్న వారు పల్లవులు, కదంబులు, చాళుక్యులు మొదలగువారుగా నున్నారు. పై కళాశాలయందు శేషగిరి శాస్త్రిలవారికిఁ బూర్వ మాపదవియందే యుండిన అప్పయ్యగారు పల్లవులే వెలమ లని వ్రాసియున్నారు. శబ్దముయొక్క వ్యుత్పత్తి యెట్టిదైనను వెలమలును కమ్మవారివలెనె మిశ్రజాతివా రయినటులు చరిత్రము

వేనోళ్లఁ జాటుచున్నది. చరిత్రమునందు రెడ్లకును కమ్మవారికిని వెలమవారికిని సంబంధములు గానంబడుచున్నవి. ఇంతమాత్రముచేత నీ మూఁడు తెగలవారు నొక్క తెగలోనుండి యేర్పడినవా రని చెప్పుటకును సాధ్యపడదు. ఈ మూఁడు తెగలకు జన్మస్థానములు గొల్లజాతులును పల్లెజాతులు నై యున్న వని చరిత్రమునందు దృష్టాంతము లనేకములు గానంబడుచున్నవి. * ఆంధ్ర సామ్రాజ్య విజృంభణకాలమున యదు వృష్ణి భోజాంధకు లనియెడు గొల్లజాతుల వారికిని యవనశకపహ్లవాదులకును గలిగిన సమ్మేళనమువలన నూత్నరక్త మీ జాతులయందుఁ బ్రవహింపఁగా వీరలు విజృంభించి గంగాతీరము మొదలుకొని కన్యాకుమారివఱకుఁ గల దేశములను వేర్వేఱు వంశనామములతో వేర్వేఱు కాలములందుఁ బరిపాలించుచు వచ్చి రని చరిత్రము సాక్ష్య మిచ్చుచున్నది. ఆంధ్రసామ్రాజ్యము భగ్నమైన వెనుక వల్లభవంశ మను పేరిట సురాష్ట్రదేశమును బరిపాలించినవారును, చాళుక్యవంశ మను పేరిటఁ గుంతలవేంగీదేశములను, కాకతీయ లను పేరిటఁ దెలుఁగుదేశమును బరిపాలించిన వార లీ వెలమ కమ్మ తెగలవారే గాని యన్యులుగాఁ గనుపట్టరు. ఈ రెండు తెగలలోని వారును వారివారి నామాంతములను రెడ్డి యను బిరుదవాచక పదమును జేర్చుకొని వ్యవహరింపఁబడుచు వచ్చినను రెడ్లకు ప్రతిస్పర్ధులుగ నుండుచు వచ్చిరి. రాష్ట్రకూటులకును (రెడ్లకు) చాళుక్యులకును కృష్ణా గోదావరీ మండలములలో కొండెసిగలు గలిగియుండిన కమ్మవారికి పంటమహాన్వయు లయిన కొండవీటి రెడ్లకును పద్మనాయక వెలమలకును జరిగిన యుద్ధములు చరిత్రమున సుప్రసిద్ధములుగ నున్నవి. దుర్జయవంశజుల మని చెప్పుకొన్న వారు పల్లవు లయినట్లు కృష్ణామండలములో నుయ్యూరు పరగణాలోఁ జేరినముదునూరు గ్రామములోఁ బ్రతిష్ఠింపఁబడిన రామేశ్వరస్వామివారి యాలయములోని యొకశిలాస్తంభముపై వ్రాయఁబడిన రాజరాజుయొక్క శాసనములో:—

* ఆంధ్రుల సాంఘికచరిత్రము ప్రత్యేకముగా విరచింపఁబడుచున్నది గావున నీవిషయమై యందు సవిస్తరముగాఁ జర్చింపఁబడును.

"ఆంధ్రేశ రాజ్య రక్షగుణ(రావగుది?) ర్విరోధివనదావః
రెడ్డికులకాలపల్లవరాయ ఇతి ప్రాపయశోఖ్యాః"

అని రెడ్డికులమునకు యమునివంటి వాఁ డయిన పల్లవరాయఁ డని చెప్పబడియుండుటచేత స్పష్ట మగుచున్నది. పూర్వప్రకరణమున దుర్జయవంశజు లయిన వారిని కమ్మనాఁటిరెడ్లనుగాఁ జేర్కొనియున్న విషయము పైశ్లోకములోని వాక్యములు పూర్వపక్షమును జేయుచున్న వని స్థూలదృష్టికిఁ గానంబడవచ్చును గాని విమర్శదృష్టితోఁ జూచిన పక్షమున నట్టిసందేహము గలుగ నేరదు. కమ్మనాటిలో పల్లవులు, కదంబులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, చోడులు, గాంగులు, మాతంగులు, మౌర్యులు మొదలగువారు కొన్ని శతాబ్దములు నివసించియుండుటచేత వారెల్లరును కమ్మవా రని వ్యవహరింపఁబడుచు వచ్చుటచేతను, వీరిలో రెడ్డికులమునకు సంబంధింపనివారలు రెడ్డి యను బిరుదువాచక పదమును నామాంతములఁ జేర్చుకొనుచు వచ్చుటచేతను, చదువరులకు సులభముగా బోధపడుటకై కమ్మనాటి రెడ్లని తెలుఁగునాటి రెడ్లని పూర్వప్రకరణములోఁ జేర్కొని యున్నాఁడను. వేర్వేఱు తెగలవారు రెడ్డి, వెలమ, కమ్మతెగలలోఁ జేరుటచేత నీమూఁడు తెగలలోను ననేకశాఖాభేదము లేర్పడుటకుఁ గారణ మయ్యెను. అట్టిభేదముల నన్నింటినిగూర్చి కేవలము సాంఘికచరిత్రమునఁ జర్చింపవలసినదే గాని యిచ్చటఁ జర్చింపసాధ్యపడదు. పయి నుదాహరింపఁబడిన రాజరాజు ముదునూరు శాసనములోనే:—

"చతుర్థవంశప్రభవాఽత్ర గౌధ
శ్శంభుం సమారాధ్య తపోఽభిరామః
ధాత్రీపతిత్వం (భువి?) దుర్జయత్వం
వర్ణాంతనామాపి నరేన్ద్రచిహ్నమ్."

అని నరేంద్రచిహ్నమైన వర్మబిరుదమును నామాంతమున వహించెడివాఁ రని చెప్పియుండుటచేతఁ బైని బేర్కొనంబడిన పండితుల యభిప్రాయములు సరియైన వేమో యని తోఁపకపోదు. మఱియు నామాంతముల వర్మశబ్దము గలవారు శూద్ర క్షత్త్రియు లని పైశ్లోకమువే నొక్కిఁ జాటుచున్నది. ప్రాచీన

శాసనముల వెలమశబ్ద మెచ్చటనైనఁ గలదా యని విచారింపఁగా మొదటి కులోత్తుంగ చోడచక్రవర్తి కుమారుఁడైన రాజరాజ చోడగంగుచే వ్రాయింపఁబడిన టేకిశాసనములో "వెలమనూళ్లు" అను నొక తెగవారు తెలికితెగవారిలోఁ గల రని గనుపట్టుచున్నది. తాము సహస్రశాఖాన్వయ గోత్రుల మనియు, మనుకులక్షత్రియుల మనియుఁ దమశాసనములఁ దెలికితెగవారు చెప్పుకొనియున్నారు. ఏది యెట్టు లున్నను వెలమవారెల్లరు నొక్క తెగలోనివారు కారు; అట్లే రెడ్లుగూడ నొక్క తెగలోనివారు కారు.

పద్మ నాయకులు.

వెలమలలో నొకశాఖవా రని చెప్పంబడెడి పద్మవెలమలే పద్మనాయకుల మని చెప్పుకొనుచున్నారు. సత్యైకదృష్టితోడను నిష్పక్షపాతబుద్ధితోడను విమర్శించి చూచిన పక్షమునఁ బద్మనాయకులు కేవలము వెలమలలోనుండి యేర్పడినవారుగాఁ గనుపట్టరు. పద్మనాయకు లన నెవ్వరో మనము తెలిసికొనుటకుఁ బూర్వము పద్మనాయకుల మని చెప్పుకొనువారిచేఁ బ్రకటింపఁబడినవారి గ్రంథములలో నేమి వ్రాయఁబడినదో విచారింపవలసియుండును. పద్మనాయకకులజు లయిన వెలుగోటివారి వంశచరిత్రమునందు "వీరు నాల్గవ వర్ణములో నత్యుత్తమమైన పద్మనాయక కులమువారు. ఇందుఁ బద్మనాయకుఁ డనఁగాఁ బద్మబాంధవుం డగు సూర్యుఁడు" అని వ్రాయబడియుండియు నేమికారణము చేతనో "లేదా, పద్మనాయకుం డనఁగాఁ బద్మపతి యను రాజు అతఁడు.

'శ్లో. మహాపద్మపతిః కశ్చి న్నందః క్షత్త్రవినాశకృత్' అని పురాణములయందుఁ జెప్పఁబడినవాఁడు; అతనివిషయము సంక్షేపముగ నిట్లుండఁ దగినయది:—

'మహానంది యను రాజునకు వివాహితశూద్రస్త్రీయందు మహాపద్మపతి యను వాఁ డుదయించె. అతఁడు సూర్యచంద్రవంశజు లగు రాజులను జనకు వందనాదు లాచరింపుఁ డని నిర్బంధించి వశపడనివారిని నిక్రమము

పేర్మి లోఁబఱుచుకొని కొన్ని సంవత్సరములు కారాగృహమున నుంచెను. అపుడు వారు జాత్యుచితసంస్కారవిహీనులై పెద్దకాలంబు కారాగృహంబున నుండ నోపక పద్మపతి కభివాదనాదుల నాచరింప నంగీకరించి తదనుగ్రహంబున వెడలి వింధ్యగిరిదక్షిణప్రాంతమున వంగకళింగాంధ్రాదిదేశములు చేరి యచ్చటచ్చట రాజ్యముల నాక్రమించుకొనిరి. ఇట్లు కాఁగా వారు పద్మపతివలన బహుకాలము జాత్యుచితసంస్కారహీనులై యొక తెగవారుగా నేర్పడి శూద్రప్రాయులై యున్నందున నేకులమువా రనియుఁ జెప్పుటకు వీలు లేక పద్మనాయక కులమువా రని వ్యవహరింపఁ బడుచు వచ్చిరి. అనఁగాఁ బద్మపతి యనువాఁడు నాయకుఁడుగాఁ గల కులమువా రని యభిప్రాయము' ఇట్లు బొబ్బిలివారి రావువంశీయ చరితము ౪౮ పేజిలో వ్రాయఁబడినది." అని వ్రాయించినారు. పద్మనాయఁ డను నాతఁ డెవ్వఁడో వీరికి బోధపడలే దని నైవాక్యములంబట్టి దెలియుచున్నది. అయిన నేతద్గ్రంథకర్తలు "బేతాళనాయఁడు రేచర్లవంశజులకు మూలపురుషుఁడుగా నుండినట్లు వెలమకులమువారి కందఱకుఁ బ్రప్రథమము పద్మనాయకుఁ డను నతఁడు మూలపురుషుఁడై మహాప్రసిద్ధుఁడుగా నుండి తన్మూలమునఁ గులమువా రందఱు పద్మనాయకకులమువా రని వ్యవహరింపఁబడుచున్నా రని చెప్పినం జెప్పవచ్చును గదా" యని వ్రాయుట వింతగ నున్నది. వెలమకులము వారి కందఱకుఁ బద్మనాయకుఁడు మూలపురుషుఁ డని చెప్పుటకుం గల యాధారమెయ్యదియుఁ గానం బడదు. పద్మనాయక కులముయొక్క యుదంతమెఱుంగకయె నాల్గవవర్ణములో నత్యుత్తమమైన దని వ్రాయుటయు వింతగ నున్నది. చతుర్థవర్ణములోఁ జేరిన తక్కిన శాఖలవారికంటె నెట్లుత్తమ మయినదో ప్రమాణములు చూపింపకపోవుట వలన నం దెద్దియో విశేషముండె నని బోధపడక పోదు. రావువంశీయచరిత్రమునందు "ఏకులమువా రనియుం జెప్పుటకు వీలు లేక పద్మనాయక కులమువా రని వ్యవహరింపఁబడుచు వచ్చి" రని తేటతెల్లము సేయుచుండ వేఱుగ వ్యాఖ్యాన మేల? పద్మనాయకు లొకప్పుడు క్షత్రియులుగ నుండి శూద్రప్రాయు లయి పోయి రని

తెలుపుచు అందులకుఁ బ్రమాణముగా ననేకక్షత్త్రియులు శూద్రులయిపోయి రని పురాణాదులలో నుండి కొన్ని వాక్యములను బ్రకటించి యుండిరి. అయ్యవి వీరినిగుఱించి వ్రాయఁబడినవి కావు.

" వసిష్ఠ కౌండిన్య ధనంజయానాం
గోత్రోద్భవా కాశ్యపగోత్రజాతాః
శూద్రా ఇ వాత్యంతగృహీతవేషాః
భూపా భవిష్యంతి కలౌ యుగే హి."

అని వసిష్ఠ కౌండిన్య ధనంజయ కాశ్యపగోత్రజాతు లయిన రాచవారిని గూర్చి చెప్పఁబడినవాక్యములు గాని పద్మనాయకులను గూర్చి చెప్పినవి కావు. రావువంశీయ చరిత్రకారునకుఁ గూడ సందియము తోఁచి స్పష్టముగఁ జెప్పఁ జాలక "అట్టివారు(శూద్రవేషధారు లగు క్షత్రియులు)ఆంధ్రాదిదేశములలో నే స్థిరపడిన ట్లుండుటం బట్టి వారీ పద్మనాయకు లను నామమున నుండిన శాఖవారుగా ననుమానింపఁబడుదురు." అని వ్రాసి యున్నారు. ఇటీవలి శూద్రులు క్షత్త్రియులై రనుటకుఁ గారణము వర్ణాశ్రమధర్మములోఁ జేరిన కులముచేత గాక క్షాత్త్రమును దాల్చి భూమిని జయించి పాలించుట యని చెప్పవచ్చును. అట్టివారు పదునెనిమిది జాతులలోను గూడ నుండి రనుటకు లేశమాత్రమును సందియము లేదు. కాఁబట్టి పద్మనాయకుల నిజస్థితి దెలిసికొనుటకుఁ బ్రయత్నింతము. ఈ వెలుగోటి వంశములోని వారి ప్రేరణముచేతనే వ్రాయింపఁబడిన పద్మనాయక చరిత్రమునందు నేమి వ్రాయఁబడినదో విచారింతము. అందు వెలమల జన్మవృత్తాంతమును గూర్చి యీక్రిందిరీతిని వ్రాయఁబడి యున్నది.

"క. శూరుల జన్మస్థానము
నారసి నియమింపఁ గూడ దది యెట్లన్నన్
వీరులు షణ్ముఖమారులు
నూరిజనులఁ బోల మిగులఁ జోద్యం బగుచున్"

ఉ. కొండఱు రెడ్డినాయకులు గోప్యము నందిరి మానుషంబునన్
గొండఱు లక్కనాయకులు కుంభిని క్షీరజలోక్తిఁ బొల్చిరా
కొండఱు కొంకణోద్భవులు ఘోరపరాక్రమలీలఁ గ్రాలఁగా
నందఱు నేకమై ధరను నద్భుతలీలఁ జెలంగి రెంతయున్."

అని శూరులజన్మస్థానము నియమింపఁ గూడ దనియు మానుషవంతులును పరాక్రమవంతులున్నైన కొండఱు రెడ్డినాయకులును, కొండఱు లక్కనాయకులును, కొండఱు కొంకణోద్భవులును, ఏకమై యద్భుతలీల విహరించిరని నుడివియున్నాఁడు. మఱియు నాగ్రంథముననే యనేక విధములుగా నాకాలమునాఁటి గాథలను బురస్కరించుకొని వచించియున్నాఁడు.

"గీ. కొంకణాదిక సేతువు కుంభినులను
నాంధ్రద్రవిడాదిదేశంబులందు వెలమ
పేరు ప్రఖ్యాతి నొంది విస్తార మగుచు
గరము బహుముఖవర్ణసంగతులఁ దనరి"

"క. లోహము తామ్రము సిద్ధుఁడు
సాహసమునఁ జేయు రజతస్వర్ణము భంగిన్
యూహతమైన కలంబున
నూహం బ్రబలించె నృపతి యుర్వీపు లెన్నన్."

"క. మధ్రుత జలకణ సంతతి
ముద్రిత వరశుక్తి పతిత మూర్తము భంగిన్
శూద్రాభావం బయ్యును
రుద్రక్షితిపాలు వాక్యరూఢిఁ జెలంగెన్"

"గీ. ఊరివాఁద నీరు నుదకసరయుఁ జేరి
తీర్థయోగ్య మైన తెరగు గాదె
కాలవోదిరిమునఁ గాక తీశ్వరుఁ గొల్చి
కాపు లెల్ల వెలమ కమ్మ లైరి."

పద్మనాయక చరిత్రములో నుదాహరింపఁబడిన పైపద్యములను బట్టి కొంకణాది దేశములనుండి వచ్చిన కుంభినులు మొదలగు వారిని తక్కిన తెగల వారలు వెలములుగ భావించి తమకన్నఁ దక్కువగఁ జూచుచున్నటులను వారలు శూద్రులు గాక పోయినను ప్రతాపరుద్రక్షితిపాలునిచే గౌరవింపఁబడి రనియు వెలమవారిలోను కమ్మవారిలోను గూడ నూత్నరక్తము ప్రవహించుచుండె ననియు భావము సూచింపఁబడుచున్నది గదా. అప్పటికి వాడుకలోనుండు గాథలను బురస్కరించుకొని పద్మనాయకచరిత్రకారుఁడట్లు వ్రాసియుండు ననుటకు సందియము లేదు. మఱియు నాతఁడు స్వవచనవ్యాఘాతముగా నాగ్రంథముననే మఱి యొక చోట

"క. తొలి కాల ముర్వి గొడవల
వెలిర్థి యాలములయందు విహరించుటచే
నిల కాపుజనులు గొండఱు
వెలమ లనన్ జగతిలోన విశ్రుతు లగుటన్."

అనియు వ్రాసియుండెను. అంతటితోఁ దృప్తినొందక,

"క. పద్మం బోలెడు సద్మకు
సద్మగతి న్నాయకాఖ్య సరణిదలిర్పన్
సద్మ రమాతరుణీ ముఖ
పద్మమునం బొలుచు లక్ష్మ్య భావ మనంగన్."

"గీ. దైత్యవిధ్వంసి పాదపద్మజా లటంచు
వేదములు వల్కుఁ గావున విదితముగను
శూద్రకులజాలు నాట సంసూచితముగఁ
బద్మజఖ్యాతి నియమించి పలికి రపుడు."

అని విష్ణువుయొక్క పాదపద్మమునందుఁ జనించుటచేతఁ బద్మజాలను సంజ్ఞ కలిగి నటుల నుడివెను. అదియునుం గాక తక్కిన వెలమతెగలవారిని గ్రిందపఱుచుచు పద్మనాయకుల నధికు లని చెప్పి

"గీ. తారకలలోన గ్రహరాజు వేఱె యైన
భాతి దశవిధ వెలమలఁ బాయఁ ద్రోచి
సప్తసప్తతి పద్మజసముదయంబు
పద్మనాయకు లనఁగను బ్రబలె జగతి."

అని పొగడి యున్నాఁడు. విష్ణువు పాదపద్మమునందు జనించుట చేతనే వీరికి పద్మజులను పేరు గలిగిన దనియు, అందువలననే పద్మనాయకు లనునామము వహించి రనియుఁ జెప్పుట సయుక్తికముగాఁ గనుపట్టదు. ఎందుకన విష్ణుపాదోద్భవసంభవుల మని పంటరెడ్లు, కమ్మవారు, మొదలగు తెగలవా రెల్లరును జెప్పుకొనియున్నవా రయినను వారలకు పద్మనాయకు లనుపేరు గ్రంథములను వినంబడదు. శ్రీనాథకవి తనభీమఖండమునందు వెలమలు గమ్మలు ఒంటరులు మొదలగు వారల నెల్లరను బద్మనాయకు లని చెప్పినట్లుగా నాకడ నున్న ముద్రితప్రతిలో నున్నది. అయినను రావువంశీయ చరిత్రములో కీర్తిశేషులయిన గురుజాడ శ్రీరామమూర్తిపంతులుగారు పద్మనాయకులను వెలమలను వేర్వేఱు తెగలవారినిగ శ్రీనాథకవి పేర్కొనియె నని వ్రాసియున్నారు. అట్లయిన యెడల పద్మవెలమలకు పద్మనాయకులను నామము గలుగుటకు వేఱు కారణ ముండవలయు నని గనుపట్టకమానదు. ఎంత మందబుద్ధులకైనను పద్మనాయకుల మన్నతోడనే పద్ముఁ డనువాఁడు నాయకుఁడుగాఁ గలిగినసమూహ మని యర్థము గాక మానదు. అందువలన వేర్వేఱు తెగలనుండి యేకారణముచేతనో వేఱుపడి వచ్చి ప్రత్యేకముగా నొక తెగవా రయి రని తెలుపుటకుఁ బద్మనాయకుల మనునదే సాక్ష్యముగ నున్నది. అందులకు గ్రంథముల నాధారము లేవైనఁ గలవా యని పరిశీలించిన నేఁ గొంతవఱకుఁ గన్పట్టక మానవు.

పద్మనాయకులయొక్క పూర్వు లెవ్వరును తాము క్షత్త్రియకులమువా రని చెప్పికొని యుండలేదు. పద్మనాయకులలో సుప్రసిద్ధ లయిన రేచెర్ల వారు చతుర్థవర్ణమునందు జనించినవార మని స్పష్టముగఁ దెలుపుకొనియుండ తద్వంశజులయిన వెలుగోటివారు ప్రకటింపించిన గ్రంథములందును రావువారు

ప్రకటింపించిన గ్రంథములందును పద్మనాయకు లొకప్పుడు క్షత్త్రియకులము వారుగానే యుండి తరువాత శూద్రు లయి పోయి రనియు తక్కిన శూద్రజాతులవారి కెవ్వరికి క్షత్త్రియనామము వర్తింప దనియు వ్రాయఁబడియున్నది. ఇది యెంతమాత్రమును విశ్వసింపఁ దగినది కాదు. ఆంధ్ర దేశములో క్షత్త్రియుల మనిపించుకొనుచున్న రాచవారి యొక్క పూర్వులు సయితము వారిశాసనములలో చతుర్థకులమువార మని చెప్పుకొనియుండఁగాఁ బెక్కుతెగలలో నుండి వచ్చి యేర్పడిన యీశాఖవారు తాము మాత్రము క్షత్త్రియసంతతివార మనియుఁ దక్కినవారు కా రని వ్రాయించుట వింతగా నుండకమానదు. అందునకు వీ రొక గొప్పకారణము దెలుపుచున్నారు.

సహపంక్తి భోజనము.

ఒకప్పుడు ఢిల్లీచక్రవర్తి దండెత్తివచ్చి విశేషసైన్యములతో నోరుఁగల్లు ముట్టడించినప్పుడు కమ్మసేనానులు చాలకాలము పోరాడి యోడిపోయి రనియు, తరువాత పద్మనాయకు లనంబడెడు నీ వెలమవారు ప్రతాపరుద్రునితో "స్వామీ మేము దేవరకుఁగా ప్రాణములు సమర్పింప సిద్ధముగా నున్నాము. మేము జీవించియుండఁగాఁ బరరాష్ట్రులు కోటలోఁ గాలిడరు. మేము విజయమునంది వచ్చితిమేని తమతో సహపంక్తియును సమానప్రతిపత్తియును నీయవేడెద" మని చెప్పఁగా నతఁ డందునకు సమ్మతించె నఁట! అప్పుడే వారలు ప్రాణముల కాసింపక కోటబురుజుల నాక్రమించి సంరక్షించుచు నుండుటచేత శత్రువులు చేయునది లేక విచ్చిపోయి రట.! అపుడు ప్రతాపరుద్రుఁడు వాగ్దానము ప్రకారము వెలమవారియెడ మిక్కిలి కృతజ్ఞుఁడై వారలకు సహపంక్తి యొసఁగి గౌరవించె నఁట! మొదట కాకతీయులు కులముచేత క్షత్త్రియు లయినప్పుడు గదా యీట్టికార్యముయొక్క ఘనత

కాకతీయులు చతుర్థకులజులు.

వెల్లడి యగుట కనువై యుండును? కాకతీయులు క్షత్త్రియకులమువారు కా రనియు, చతుర్థకులజులే యనియు నిటీవల దొరకిన రెండుశాసనములలో

స్పష్టముగాఁ గానంబడుచున్నది. అందొకటి మల్యాలగుండయ దండనాథుని భార్యయు, గోనబుద్ధారెడ్డిపుత్రుఁడు నగు కుప్పాంబయొక్క వర్ధమానపుర దానశాసనము. 1 దానిలో

"అసృజ చ్చతురో వర్ణాన్ ముఖబాహూరుపాదతః
అన్యా న్యప్యచరాదీని భూతాని స్థావరాణి చ.
"అథ స్వీకృతవర్ణోక్త ధర్మనిర్మలచేతసః
జాతాన్ ద్విజాతయః పశ్చా చ్చతుర్థకులముజ్జ్వలం."
"తత్రానేక నృపాల ఫాల లిఖితాం వీరాంకవర్ణావళిం
దర్పందర్ప మనర్గళం సమవర త్తీవ్రః ప్రతాపానలః
య స్యోదంచిత కాకతీశ్వరకుల క్షీరాబ్ధి సంవర్ధన
ప్రౌఢాహంకృతి చంద్రమా స్సమభవ త్పోలిలాభిధానో నృపః."

అనియు, మఱియు నామెయొక్క బూదపూరు (భూతపుర) శాసనములో

"తేషా మమేయమహిమా మహితే
వర్ణాశ్రయః ప్రసవభూమి రతిప్రవృద్ధః
శుద్ధోఽభవ త్సమధికం చ(తు) (ర) ×ర్థవానాం
దుగ్ధాబ్ధివ త్పురుషరత్నగుణై రు............
ప్రశస్త మస్తి తత్రాపి కాకతీయకులం..........."

అనియు వ్రాయఁబడియున్నది. ఇంతియ గాక కాకతీయరాజులు చతుర్థాన్వయులయిన కమ్మనాటి వెలనాటి రాజులతో సంబంధములు చేయుచుండెడి వారని పూర్వప్రకరణముల ననేకదృష్టాంతముల శాసనములనుండి యెత్తి చూపించియున్నాను. కాఁబట్టి కాకతీయులతోడి సహపంక్తిభోజనము దొరకినమాత్రముచేత వీరలు తక్కిన వెలమ కమ్మశాఖల వారికన్నఁ గులాధిక్యము గలవారని చెప్పుటకుఁ గారణ మగపడదు గదా! పద్మనాయకులు చెప్పుకొను పైగాథను బట్టి వీరలకుఁ బ్రతాపరుద్రునికిఁ బూర్వము వానితో సహ

1 ఈశాసనముయొక్క ప్రతియును దీనిక్రింది శాసనముయొక్క ప్రతియును శ్రీయుత మానవల్లి రామకృష్ణకవి ఎమ్. ఏ గారిచే నిటీవల నొసంగఁబడినవి.

పంక్తిభోజనము లేదని యర్థమగుచున్నది గదా. అందునకుఁ గారణ మెద్దియో యుండి యుండక మానదు. ఇంతకుఁ బూర్వము పద్మనాయకచరిత్రము నందలి వీరలజన్మాదికమును గూర్చి నిగూఢముగా దెలిపిన పద్యములను వివరించి యున్నాను. అవి గాక పద్మనాయకచరిత్రములోని వని మఱికొన్ని పద్యములు రావువంశీయులచరిత్రమునందు నుదాహరింపఁబడియున్నవి. అయ్యవి సత్యాన్వేషణపరులైన వారిని గమ్యస్థానమునకుం గొనిపోవుటకుం జాలియున్నవి.

"సీ. రెడ్డిసంతతికి మాఱోడ్డిభేదం బైన
కుల ముద్ధరించి రీవెలమవారు
పద్మనాయకమానభంగంబు గాకుండ
బలియురై నెగడి రీవెలమవారు
గడిదేరి కాకతిగణపతి గొలిచియు
నిల నేలు ప్రభువు లీవెలమవారు
కాపులమాటకై కడగి వెలమలందు
నిలిచినశూరు లీవెలమవారు
సమరగాంగేయపటిమచే జరుపువారు
మిగుల మానంబునకుఁ బ్రాణ మిచ్చువారు
వినయఘను లైన నెరమన్నె వెలమవారు
పద్మజఖ్యాతిచే భువిఁ బరఁగువారు."

అని పద్మనాయకచరిత్రమునం దొక పద్యము గానంబడుచున్నది. దీనిలోని "రెడ్డిసంతతికి మాఱోడ్డిభేదం బైన కుల ముద్ధరించి రీవెలమవారు" అను మొదటిచరణముయొక్క భావమును దెలిసికొనవలసియున్నది. రెడ్లను బ్రతిఘటించి వేఱుపడిన కులము నుద్ధారణము చేసి రని భావ మేర్పడుచున్నది. ఇందలి భావమును దృఢపఱచునట్టి గాథ యెద్దియైన గలదా యని మనము దెలిసికొనవలసియున్నది. అయ్యది పల్నాటి వీరచరిత్రమునం గానంబడుచున్నది. అందు బ్రహ్మనాయుఁడు నాయకురాలితోఁ జేసిన యుద్ధము కులము పోరని పలుతావులఁ జేర్కొనఁ బడియున్నది. అందు కులవిచక్షణము లేక

బ్రహ్మనాయఁడు మాలలు, మాదిగలు, గొల్లలు, కంసాలులు, కమ్మరులు, కుమ్మరులు, రజకులు, రెడ్లు, మొదలగు తెగవారితోఁగలిసి చాపకూడుకుడిచె నని చెప్పఁబడియున్నది. ఇట్టి చాపకూడుకుడుమట కూడ పల్నాటి యుద్ధమునకుఁ బ్రథమకారణములలో నొక్కటిగా నున్న దని వల్లభామాత్య ప్రణీత మైన క్రీడాభిరామ మనుగ్రంథమునందు.

"గీ. ఆరువల్లి నాయివారి దుర్మంత్రంబు
కోడిపోరు చాపకూటికుడుపు
ప్రథమకారణములు పల్నాటి యేకాంగ
వీరపురుషసంప్రహారమునకు"

అని స్పష్టముగఁ జెప్పఁబడినది. "కోడిపందెములో సంభవించిన కలహమీయుద్ధమునకు మూలకారణము" అని విల్సను గారు వ్రాసియుండఁగా వారు పల్నాటి వీరచరిత్రమును సరిగా గ్రహింపలే దని పల్నాటి వీరచరిత్రములోని బాలచంద్రయుద్ధభాగమును ప్రకటించిన శ్రీఉమాకాంతము గారు తమభావమును వెల్లడించినారు. పైనుదాహరింపఁబడిన క్రీడాభిరామములోని పద్యమును బట్టి కోడిపోరు గూడ పల్నాటి యేకాంగవీరపురుషసంప్రహారమునకు ప్రథమకారణములలో నొక్కటిగా నున్న దని బోధపడకమానదు. ఈపల్నాటివీరయుద్ధమున మాలలు గోసంగులు కూడ నాయకులుగ నుండి యుద్ధము చేసి రని పల్నాటివీరచరిత్రమునుండి కొన్ని దృష్టాంతముల నింతకుఁ బూర్వము చూపించి యున్నాను. కాఁబట్టి పల్నాటి వీరులలో సుప్రసిద్ధుఁడైన రేచెర్ల బ్రహ్మనాయఁడు రెడ్డికులమునకు మాల్కొడ్డి నానాజాతులలోనుండి నాయకుల [illegible]ని జాతిభేదములను బాటింపక పైని జెప్పిన కులములవా రందఱను గలిసి భ్రాతృభావమును బలపఱుచుకొనుటకై చాఁపకూడు భుజించి ప్రతిపక్షులను జయించి కులము నుద్ధరించి గౌరవము దెచ్చినవాఁ డగుటం జేసి పద్మనాయక చరిత్రములో "రెడ్డిసంతతికి మాల్కొడ్డి భేదంబైన కుల ముద్ధరించి [illegible]" అని వ్రాయుట సంభవించినది. బ్రాహ్మణులు సయితము పద్మ[illegible]లోఁ జేరి రని యూహించుటకు గూడ పల్నాటి వీరచరిత్రమునఁ గొన్ని వాక్యములు గానంబడుచున్నవి. బ్రహ్మనాయనికొడుకైన బాలచంద్రుఁడు తనమిత్త్రుఁడైన అనపోతు అనెడి బ్రాహ్మణుని తనతోఁ గూడ యుద్ధమునకుఁ గొనిపోక మర్మము పెట్టి యాతని నింటికిఁ బంపినప్పు డాతఁడు బాలచంద్రుని కార్యమును గ్రహించి యీక్రిందిరీతిని జింతింపుచు పౌరుషముచే నాత్మహత్య గావించుకొని ప్రాణంబుల విడిచెను.

" వెంగలినైతిని వెలమలవద్దఁ
గలిమి కోసము వచ్చి కలియుట లేమ
కులమునఁ గొద వని కూడుట లేదు
తల్లిని తండ్రిని దాయాదిజనుల
నెడఁ బాసి నీ పొందు నే నమ్మియుంటిఁ
బగవాఁడ నైతిని బాంధవతతికిఁ
బాసి పోఁదగు నయ్య బ్రహ్మన్నతనయ"

పల్నాటి భూమిపతులు గూడ గొల్ల సవతి తల్లుల బిడ్డ లని స్పష్టముగ "క్రీడాభిరామ" మను గ్రంథమున నీ క్రింది పద్యములో వాకొనఁబడియున్నది.

"సీ॥ ఇచ్చోట భుజియించి రేకకార్యస్థులై
సామంతనృపతులు చాపకూడు
ఇచ్చోటఁ జింతించె నిచ్చ నుపాయంబు
నలినాక్షి యార్వెల్లి నాయిగాలు
నిజ మను శుద్ధికై నిప్పుల యేటిలో
నోలాడె నిచ్చోట బీలసాని
యిచ్చోటఁ బోరిరి యిల పణంబుగ గొల్ల
సవతితల్లులబిడ్డ లవనిపతులు
ధీరులగు వార లేవురు వీరపురుషు
లై మహోద్ధతి నిచ్చోట నాజిఁ బడిరి

యనుచుఁ జెప్పుదు రైతిహ్య మనట నచట
జనపపెద్దలు పల్లెదేశములయందు."

హైహయవంశజులు మయిన క్షత్త్రియుల మని చెప్పుకొనెడి రాచవారునయితము "గొల్ల సవతి తల్లుల బిడ్డలని" పేర్కొనఁబడుచుండఁగాఁ బద్మనాయకులు కులమునఁ దక్కువవారలకన్న నెట్లధికు లగుదురో యూహింప నలవిగాక యున్నది. గొల్లలు ధర్మశాస్త్రమునందు సచ్ఛూద్రులని పరిగణింపఁబడినవా రగుటచేత వెలమలకు, రెడ్లకు, కమ్మవారికి గృహసేవకులుగ నుండి వంట మొదలగు పనులు చేయుచుందురు. వల్లవుఁడనఁగా గొల్లవాఁడని మాత్రమె గాక వంటలవాఁ డని యర్థము గలదు. పద్మనాయకులలో "వల్లవాదిత్య వల్లభత్రినేత్రా వల్లవచక్రవర్తి" యను బిరుదములు గలవారు వల్లవులనియు, వారు 22 గోత్రములలోని వారనియు రావువంశీయుల చరిత్రమున మొదట నుదాహరింపఁబడిన గోత్రవివరణమును గూర్చిన పట్టికవలనఁ దెలియుచున్నది. పద్మనాయకులలోఁ గొందఱు "గోసంగి వైరి తలగుండు గండా" యను బిరుదును వహించినవారు గోసంగులనియె యూహింపవలసియుండును. ఎన్నివిధములుగా నాలోచించినను బ్రహ్మనాయఁడే నానాజాతినాయకుల నొక్కచోటికిఁ జేర్చి రెడ్లతో బ్రతిఘటించి పోరాడినవాఁడు. వాని తరువాతనే పద్మనాయకులు కాకతీయులను గొల్చుచు గణపతిచక్రవర్తి రుద్రమదేవి ప్రతాపరుద్ర చక్రవర్తి మొదలగువారి పాలనములో గొప్ప పదవులను వహించి కాకతీయ రాజ్య సంరక్షకులై యొప్పిరి. ఈపద్మనాయకులలోఁ గొందఱు "బిరుదు నాయకురాలి గణరంగ రాఘవ త్రాణ సహస్రబాహు!" యను బిరుదును వహించినవా రుండుటచేత వీరలు బ్రహ్మనాయని కాలములో నాయకత్వమును బొందినవా రనుటకు సందియము కలుగదు. పద్మనాయకులలోఁ గొందఱు "వాలు చెవులును క్రేలుగడ్డమును కుమరకుం గొండనారికి గల రెడ్డినాయకచ్ఛాళ్లా, గుండిచెర్వుకట్టయొక్క చెడ్డమూర్గంచు గవిని దూరే రెడ్డినాయకచ్ఛాళ్లా" మొదలగు బిరుదులను వహించినవా రగుటచేత రెడ్లకుఁ బ్రబలవైరులుగ నుండి రని వేద్య మగుచున్నది. బ్రహ్మనాయని యన్న

బాదన్న యని పల్నాటి వీరచరిత్రమున వ్యవహరింపఁబడినది. బాదన్న యనునది పద్మన్న యను పేరికి వాచకగా వ్యవహరింపఁబడిన నామము. కాఁబట్టి బ్రహ్మనాయనియన్న యగు పద్మఁడు నాయకుఁడుగాఁ గల కుల మని చెప్పవచ్చును. కాని మహాప్యుఁడయిన పద్మఁడు నాయకుఁ డని చెప్పినచోఁ బొసఁగనేరదు. ఆపద్మఁడు పద్మసాలెకులమునకు సంబంధించినవాఁడుగఁ గన్పట్టుచున్నాఁడు. ఎట్లయిన నేమి? పద్మనాయకులు బ్రహ్మనాయని కాలముననే ప్రఖ్యాతిని గాంచి యుండిరి. పద్మనాయకులలో ననేకులు మొట్టమొదట రాష్ట్రకూటులకు రాజధానిగ నుండిన మాన్యఖేటమున (మన్నెఖేడము) నుండుచు వచ్చి యారాజ్య మంతరించిన వెనుక ననేకులు పల్నాటికి వచ్చి చేరిరి. కొందఱు గిరిదుర్గముల కధిపతులై మన్నెలను పేరితో వ్యవహరింపఁబడుచు వచ్చిరి. వీరిలో ననేకులు మాతంగులు, గోసంగులునై యుండి రనియు, వీరలకు నెలమన్నెలు, సురమన్నెలు నను నామములు గల వనియుఁ జెప్పుటకుఁ గూడ గొన్ని దృష్టాంతములవలన నవకాశము కలుగుచున్నది. పద్మనాయకుల జన్మకథన మెట్టిదైనను, ఉత్తరహిందూస్థానమున రాజపుత్త్రులనెడు మహావీరు లెట్టిపౌరుషపరాక్రమంబులు నెఱపిరో అట్లే యీదక్షిణహిందూస్థానమున వెలమవీరులు అత్యద్భుతము లయిన పౌరుషపరాక్రమములం జూపి వాసికెక్కిరి. ఈవెలమవారు, కమ్మవారు, రెడ్లు, రాచవారు, తమలోఁ దాము పోరాడక కేవలము దేశాభిమానమే విధ్యుక్త ధర్మమని యైకమత్యముతో నుండినయెడల దక్షిణహిందూదేశమున ముసల్మానుల కడుగుపెట్ట సాధ్యము గాకయుండెడిది. ఉత్తరహిందూస్థానమున రాజపుత్త్రులం బోలె ఈతెగలవారు దక్షిణహిందూస్థానమున బహుశతాబ్దములు మహమ్మదీయులతోఁ బోరాడి వాసికెక్కి విద్యానగరసామ్రాజ్య మస్తమించిన వెనుక దమస్వాతంత్ర్యములఁ గోలుపోయిరి.

దామానాయఁడు.

చెవ్విరెడ్డి యను నామాంతరము గల పిల్లలమఱ్ఱిబేతాళనాయనికి 'దామానాయఁడు ప్రసాదిత్యనాయఁడు రుద్రమనాయఁడు' అను మువ్వురు పుత్త్రు

ఉండి నట్లుగా వేంకటగిరివారి వంశావళిలో నుదాహరింపఁబడిన యీక్రింది పద్యములో దెలుపఁబడినది.

"శా. తారుణ్యప్రథమానధైర్యుఁ డగు బేతాళావనీభర్తకున్
ధీరుల్ పుత్త్రులు దామభూపతి ప్రసాదిత్యుండు రుద్రక్షమా
ధారుండున్ జనియించి గంటఁ ద్రిజగద్ధర్మప్రతీపాలనన్
శ్రీ రాజిల్లఁగ శౌరి మువ్వు రయి ధాత్రి న్మించినా రెన్నఁగన్."

పిల్లలమఱ్ఱి రేచెర్లబేతరెడ్డియు పల్నాటి వీరుఁడైన రేచెర్ల బ్రహ్మనాయని తాత యగు బేతినాయఁడును, చెవ్విరెడ్డి యను నామాంతరము గల పిల్లల మఱ్ఱి బేతాళనాయఁడే యని శ్రీ వెలుగోటివారి వంశచరిత్రమునందు వక్కాణింపఁబడిన హేతువులు పరస్పర విరుద్ధములై పొందిక లేక యున్నవని యీయుపప్రకరణమున సవిస్తరముగాఁ జర్చించి యున్నాను. కాఁబట్టి యీ బేతాళనాయఁడు రేచెర్లవారి కుటుంబములోఁ జేరిన మఱియొక నాయకుఁడో లేక వెలుగోటివారి పూర్వులు భ్రమచేత రేచెర్ల బేతినాయనినే యీతఁ డని తమవంశమునకు మూలపురుషునిగాఁ జేసికొనిరో యేమో నిర్ధారించుటకును పాలు పోక యున్నది గావున భావి పరిశోధనమునఁ గాని యిందలి సత్యము బోధపడఁ జాలదు. అయినను వీరిని రేచెర్ల బ్రహ్మనాయని జ్ఞాతికోటిలోని వారిఁగా నంగీకరింపవచ్చును. బేతాళనాయని మూవురు పుత్త్రులయొక్క చరిత్రము కూడ సందర్భానుసారముగ రచింపఁబడి యుండలేదు. వీరిని గూర్చిన శాసనమొక్కటియు నింతవఱకుఁ గానిపింపలేదు. వీరి చరిత్రమున కాధార మంతయు పైవారు ప్రకటించిన గ్రంథములే యై యున్నవి. ఆ గ్రంథములలోని చరిత్ర మెంతవఱకు విశ్వసింపఁదగినదో అంతవఱకే మనము గ్రహింపవలసి యుండును.

"సీ. చటుల ఖడ్గా ఖడ్గి సమరప్రవీణుఁడై
ఖడ్గనారాయణ ఖ్యాతి నొందె
రణ పరాఙ్ముఖ రాజరమను జేకొని రాయ
గాయ గోవాళాంక కలితుఁ డయ్యెఁ

ఆజిబలాధికుఁ డౌటచే నెంతయు
బలభీమ విశ్రుతిఁ బొలుపు మీఱె
బ్రథితారి రాజన్య భయద విక్రమమునఁ
బ్రతిగండభైరవ ప్రథ వహించె
మఱియుఁ బెక్కైన బిరుద నామములఁ దనరి
బాహువిక్రమ దాన సంపదలతోడఁ
దనరుచుండె సముంచితోద్దామయశుఁడు
భువనహితకారి యగు దామభూవిభుండు."

ఈ పైపద్యములోఁ జెప్పఁబడిన బిరుదావళులన నేకులు వహించుట యాకాలమునం దాచారమై యుండెను. ఇంతకన్న నీతని చరిత్ర మేమియును జెప్పఁబడి యుండలేదు.

ప్రసాదాదిత్యనాయఁడు.

బేతాళనాయని పుత్త్రులలో నీతఁడు సుప్రసిద్ధుఁడైనవాఁడుగఁ జెప్పఁబడియెను. ఇతనింగూర్చి రావువంశీయులచరిత్రమునం దొకరీతిగను వెలుగోటివారి వంశచరిత్రమునందు మఱియొకరీతిగను వ్రాయఁబడి యున్నది. "రెండవ కుమారుఁడైన ప్రసాదాదిత్యనాయఁడును దక్కిన ౭౬ గోత్రముల నాయకులును గాకతీయ గణపతిరాయలవారి కొలువుకూటములో నుండఁగా నొకప్పుడు గణపతిరాయలవారి పట్టణమును శత్రురాజులు ముట్టడివేసిరి. అపుడు గణపతిరాయల వారు తమకొల్వులో నుండు ౭౭ గోత్రముల నాయకులను జూచి మీలోపల నెవ్వ రీశత్రువులను జయింతురో వానిని నేను గొల్వుకూటములో లేచి యెదురుసని తెచ్చి నాసింహాసనముపైఁ గూర్చుండఁ బెట్టుకొందు" ననియు మిగత ౭౬ గోత్రముల నాయకులచే నతనికి మ్రొక్కులు వేయింతు ననియుఁ జెప్పెను; ఆమాట విని యందఱూరకుండఁగా నీప్రసాదాదిత్యనాయఁడు లేచి నే జయించెద నని విన్నవించి గణపతిదేవునివలన సెలవు నొంది శత్రువులమీఁద యుద్ధమునకు

వెడలి వారలతోఁ గఠినమైన యుద్ధముఁ జేసి వారల జయించి వచ్చి గణపతి రాయలవారివలనఁ బ్రత్యర్ధా సర్ధాసనాది సత్కారములను, ఇతరు లగు ౭౭గోత్రముల నాయకులచేఁ బ్రణామము పెట్టించుకొనునట్టి మర్యాదను, గాలిపెండేర మను బిరుదాభరణమును 'కాకతిరాజపూజిత' అనెడు బిరుదును శ్వేతచ్ఛత్రిధ్వజములను బొందెను;" అని వ్రాయఁబడి యున్నది గాని శత్రువు లెవ్వరో ఎవ్వరితో వీరు పోరాడిరో దెలిపి యుండ లేదు. ఇతని పరాక్రమమును మెచ్చుకొని యా గణపతిచక్రవర్తి గౌరవించి యుండును గాని యితనివంటి మహాశూరు లనేకు లాతని కొల్వుకూటములో నాతని సేవించి యుండఁగా నెల్లరకు నవమానకరముగా నర్ధాసన మిచ్చి వారలచేఁ బ్రమొక్కింపఁ జేసె ననుట నిరాధారమై పరిహాసాస్పదముగ నున్నది. ఇతని ప్రతాపమును వర్ణించుచు నొకపద్య మీక్రింది రీతిని వెలుగోటివారి వంశచరిత్రమునందును, రావువంశీయుల చరిత్రమునందును బ్రకటింపఁబడినది.

"సీ. ధరణిపై డెబ్బదేగ్గురు నాయకులలోనఁ
బలు ప్రతాపస్ఫూర్తిఁ బరఁగినాఁడు
చండ భుజా దండ మండి తారాతుల
భండనంబులఁ జాలఁ జెండినాఁడు
ఏపున నొగ్గల్లు నేలు రుద్రునిచేత
నందెయుఁ బెండెంబు నందినాఁడు
విక్రమంబున ధరాచక్రంబులోఁ గల
బిరుదులు తనవిగాఁ దిరిగినాఁడు
వాఁడు రిపురాజ పన్నగ వైనతేయు
రాజితంబైన కేరళరాజ ఘనుఁడు
భాసురుం డగు రేచెర్లశాసనుండు
సత్యసంధుండు సబ్బిసాహిణ్యఘనుఁడు."

ఈ పైఁ జెప్పఁబడిన రుద్రుఁడు మొదటి ప్రతాపరుద్రుఁ డనుట సరిపడదు. కడపటి ప్రతాపరుద్రుఁ డనుటయు సరిపడదు. ఇందలి రుద్రుఁ డెవ్వఁడు? కాకతి గణపతి చక్రవర్తి కూతురగు రుద్రమదేవి కావలయును. ఈమె రుద్రదేవుఁ డని వ్యవహరింపంబడి యుండుటచేత రుద్రుఁ డనఁగా రుద్రమదేవి యనియే యర్థము చేసికొందము. అందెయుఁ బెండెంబు గణపతిదేవునివలన బొందె నని పైని చెప్పినదానికి విరుద్ధముగా రుద్రమదేవివలనఁ బొందె నని చెప్పఁబడియున్నది. వెలుగోటివారి వంశచరిత్రమునందు గణపతిచక్రవర్తిచేత నర్ధాసనమును బొంది ౭౭ పద్మనాయకులచేతఁ బ్రణామంబులు పొందెనని చెప్పఁబడి యుండఁగా రావువంశీయుల చరిత్రములో నుదాహరింపఁబడిన యొక సీసమాలికలో

"భూరి జయుం డయి యోరుగంటికి రాఁగ
రుద్రమూర్తి ప్రతాపరుద్ర విభుఁడు
ఎదురుగా వచ్చియు హితుఁ డవు నీ వంచు
ఘనతఁ బ్రసాదిత్యుఁ గౌఁగలించి
హెచ్చైన కాల్పెండె మిచ్చి దోడ్కొని వచ్చి
ముందఱఁ గూర్చుండ మొదల నిల్పి
విడిది కంపెడు వేళ వేడ్కతో లేచియుఁ
గౌఁగలించి జయంబు గాఁగఁ బనిచి
మఱునాఁడు డెబ్బదేడ్గురు నాయకులు గొల్వ
తన సముఖాన కలిందు రాఁగఁ
దా లేచి యపుడు సంతస మంది యాతనిఁ
బ్రియముతోఁ గూర్చుండఁ బెట్టికొనుచు
డెబ్బదేడ్గురిచేత మ్రొక్కులు వేయించి
మించఁ బ్రతిజ్ఞ చెల్లించె విభుఁడు"

అని చెప్పఁబడి యుండుటచేత రుద్రవిభుఁ డనఁగా రుద్రమదేవి యని యర్థము చేసికొనవలసిన పక్షమున రుద్రమదేవి యంతటి చక్రవర్తిని యెదు

రుగా వచ్చి ప్రసాదాదిత్యుని కౌఁగిలించుకొన్న దని చెప్పవలసి వచ్చును గదా? అది యెంత యసహ్యాకరముగా నుండఁగలదో వేఱుగఁ జెప్ప నక్కఱ లేదు. పూర్వకవులయుద్దేశ్యము రుద్రవిభుఁ డనఁగా రుద్రమదేవి గాక మొదటి ప్రతాపరుద్రుఁ డని. అనఁగాఁ బ్రసాదాదిత్యనాయఁడు మొదటిప్రతాపరుద్రుని కాలమున నున్నవాఁ డని వారియభిప్రాయము. అది కాలనిర్ణయమున కడ్డము వచ్చు నన్న భావముతో వెలుగోటివంశచరిత్రకారు లాప్రతాపరుద్రునికి బదులు గణపతిదేవుఁ డని మార్చిరి. ఇట్టి మార్పు చేసినందులకుఁ బ్రమాణము నేమియుఁ జూపినవారు కారు. కనుకఁ బ్రసాదాదిత్యనాయఁడు మొదటి ప్రతాపరుద్రుని కాలమున నుండెనో రుద్రమదేవికాలమున నుండెనో యెవ్వరికిని దెలియదు. నాకుఁ దెలిసి నంతవఱకు శాసనములలో నెచ్చటను వీరినామములు గాన్పింప లేదు. భావిపరిశోధనమునఁ గాని వీరియుదంతము దెలియంబడదు. అంత వఱకు నీతఁడు గణపతిదేవుని తుదికాలమున నున్నవాఁ డని యూహింతము. గణపతిదేవుఁడు పాండ్యరాజులతోడఁ జేసిన యుద్ధములలో నితఁడును నీతని సహోదరుఁ డగు రుద్రమనాయఁడును గూడ నుండి రని యూహించుటకు మాత్రము గొంచె మవకాశము గలదు. ఎట్లయినను కాకతీయచక్రవర్తు లర్ధాసన మిచ్చి రనియు తక్కిన ౭౬ పద్మనాయకు లీతనికి మ్రొక్కి రనుటయు నేయాధారమును లేక యెంతమాత్రము విశ్వసింప రాదు. ఇది యిట్లుండఁగా మఱియొక వింత యే మనః—

"గీ. ధరణి ఘనమైన రాయపితామహాంక
బిరుదు డెబ్బదియేడ్గురు వరుస నాయ
కులుగఁ జేసియు భైరవువలన పచ్చ
దృఢవరంబుగఁ గానెఁ బ్రసాదిత్యవిభుఁడు"

అని వెలుగోటివారి వంశావళియందు వరుసగ డెబ్బదియేడ్గురను నాయకులనుగఁ జేసి భైరవువలన రాయపితామహాంకబిరుదమును బొందె నఁట! ఈపద్యమును బట్టి ౭౭ నాయకులు ప్రసాదాదిత్యునివలన నేర్పడి రను భావము పైపద్యమున ద్యోతక మగుచున్నది. పరస్పరవిరుద్ధములైన విషయము

లెన్నియో గలవు. గ్రంథవిస్తరభీతిచేత వాని నన్నింటిని జర్చించుట విడిచి పెట్టుచున్నాఁడను.

రుద్రమనాయఁడు.

ప్రసాదాదిత్య నాయని తమ్ముఁ డగు రుద్రనాయఁడును ప్రసిద్ధుఁ డైన వీరశిఖామణియై యుండవలయును. ఇతనికిని రాయపితామహాంక మను బిరుదము గల దని యీక్రింది పద్యములోఁ జెప్పఁబడినది.

"మ. ఒగి నుక్కుంబొడిరాల రాయుదురు మున్నుద్గ్రీవులై యిప్పుడున్
దగ నీయందియ యందునుండి తలక్రిందై వైరిభూపాలకుల్
జగతీభారమునన్ పసిండి పొడి నిచ్చల్ రాయుచున్నా రదే
తగదే రాయపితామహాంక జయ భద్రా రుద్ర నిన్ జెందినన్"

మఱియును "పాండ్యగజకేసరి కాకతిరాజ్య ప్రతిష్ఠాపనాచార్య" బిరుదులు గలవని యీక్రింది పద్యములోఁ జెప్పఁబడినది.

"ఉ. వాలని విక్రమస్ఫురణ వారలు పాండ్యబలంబు దంతులన్
గేళి జయించి పాండ్యగజకేసరినామము దాల్చి రెంతయున్
జాలినవారుగా నెగడి సన్నుతి కాకతిరాయరాజ్య ల
క్ష్మీ లలనా ప్రతిష్ఠతగఁ జేసిరి భూజను లెల్ల మెచ్చఁగన్"

కాకతిరాజ్యప్రతిష్ఠాపనాచార్యు లయినవా రొక్క రుద్రనాయఁడు మాత్రమే గాక యనేకులు గలరు. ఈరేచెర్ల రుద్రనాయఁడు రుద్రదేవి కాలమున నధిక ప్రఖ్యాతికి వచ్చినటులు గానంబడుచున్నది గావున నీతని విషయ మిక్కడ సంక్షేపించి రుద్రమదేవిం గూర్చి వ్రాయు ప్రకరణమున మగల వక్కాణింతును. పద్మనాయకవీరు లనేకులు గణపతిదేవ చక్రవర్తికి విశ్వాసపాత్రు లయిన భృత్యులుగ నుండి యుద్ధములం దాఱితేఱిన రణశూరులై కాకతిరాజ్యప్రతిష్ఠాపకు లన్న ఖ్యాతిని సంపాదించి రనుటకు సందియము లేదు గాని తక్కిన శాఖలలోని మహావీరులైన సైన్యాధిపతులకంటె వీరే యగ్రగణ్యు లని కాకతీయ చక్రవర్తు లందఱను విడిచిపెట్టి వీరలకే యర్ధాసనము లిచ్చి సమ్మానించి రనుట మాత్రము విశ్వసింపఁ దగినది కాదు.

పదునొకండవ ప్రకరణము.

గణపతిదేవుని పరిపాలనము.

కాకతిగణపతిదేవుఁడు సింహాసనారూఢుఁడైనవెనుక నాంధ్రభాష మాతృభాషగాఁ జేసికొన్న మహాజనుల నెల్లర నాంధ్రసామ్రాజ్యముక్రిందికిఁ దీసికొని రాఁగోరి యెట్టి ప్రయత్నములకుఁ గడంగెనో అట్టి ప్రయత్నములన్నియు నీశ్వరానుగ్రహమువలనఁ గొనసాగి జయప్రదము లయినవి. మండూకము నొకదాని ద్రింగ నోరప్పలించుకొని వచ్చి పైఁబడెడు భుజగేంద్రంబుల నొక్కొక్కదాని నదిమిపట్టి పెట్టెలోఁ బెట్టి వశపఱుచుకొనునట్టి ప్రజ్ఞాధురంధరుం డయిన యొక గారడివాని పగిది సమరగాంగేయుఁ డని వీరాగ్రగణ్యులచేత ననేకభంగులఁ గొనియాడంబడెడు మన యీ కాకతి గణపతిదేవ చక్రవర్తి తనకాలంబున నాంధ్రసామ్రాజ్యము నాక్రమింప నెదుర్కొను మహామండలేశ్వరుల నొక్కొక్కనినే జయించి గర్వభంగము గావించి యదిమిపట్టి కప్పములు గైకొనుచు సామ్రాజ్యమునకు వన్నెయు వాసియుం గలుగఁజేసి సర్వవిధములఁ బ్రజల నైశ్వర్యాభివృద్ధికై ప్రయత్నించి చాలవఱకు సఫలీకృతమనోరథుఁ డయ్యెను. అతఁడు మతాభినిరతి కలవాఁ డగుటంజేసి ఘనకార్యనిర్వాహణమున నెట్టి యంతరాయములు సంఘటిల్లుచు వచ్చినను నిరుత్సాహుఁడు గాక మరలమరలఁ బ్రయత్నించుచు వచ్చినందున విజయము నొందుచు వచ్చెను. అతని మంత్రివర్గములోఁ బ్రముఖుఁ డైన శివదేవయ్య రాజ్యతంత్రజ్ఞుఁ డగుటవలన నాతనిమాట జవదాటక నేర్పుతో రాజ్యపరిపాలనము సేయుచు వచ్చినందున దక్షిణహిందూస్థానమును బరిపాలించిన చక్రవర్తులలో నధికప్రఖ్యాతిని గాంచెను. ఆంధ్రభూమి సంత

నేకచ్ఛత్రముక్రిందికిఁ గొనివచ్చిన తరువాత నీతఁడు రాజ్యాంగమును, రాజధానీనగరమును, దుర్గమును, సైన్యమును బలపఱచుటకై భగీరథప్రయత్నములు గావించెను. ఆకాలమున నాంధ్రసామ్రాజ్యము ఢిల్లీచక్రవర్తులకు మోహామును గలిగించుచుండెను. చంద్రధ్వజు లయిన తురుష్కులకు భయంకరముగ వర్ధిల్లుచు వారలను మత్సరపూరితులను గావించుచుండెను. దుర్గము లోపలి రాజభవనమునకుఁ జుట్టును నున్నతమైన శిలాప్రాకారమును, దానిచుట్టును మిక్కిలి యగాధమై జలపూరితమైన యగడ్తను నిర్మింపించుటయే గాక ప్రాకారమునకు లోపల రాజవీథుల నేర్పఱచి యచ్చటచ్చట నశ్వ రథ గజ పదాతి వర్గంబులఁ బెట్టించి, అహోరాత్రములు వీరభటులశ్వారూఢులై రాజధానీరక్షణతత్పరులై విహరించునటుల నియమించి, ఉన్నతములై సుందరములైన రాజభవనములను గోపురములను బెక్కింటిని గట్టించి గోపురములఁ బసిండికుండలతో నలంకరింపఁజేసి, ఏకశిలానగరమున కెంతో శోభను గల్పించెను. ఇతఁడు తనరాజ్యమునందంతట నూర్లకొలఁది శివాలయములను సంస్థాపించెను. గణపవరంబు లని తనపేరిట నూర్లకొలఁది గ్రామంబులను నెలకొల్పుటయె గాక త్రాగ శుద్ధజలము లభింపక ప్రజలు కష్టపడుచున్న ప్రదేశముల ననేక తటాకములను ద్రవ్వించెను. దుర్గమంబు లైన యరణ్యప్రదేశంబుల మంచిబాటలను వేయించుటయే గాక యక్కడక్కడ సత్రములను చలిపందిరులను గట్టించుచు వచ్చెను. తనరాజ్యములోని ప్రజలకు దేవభక్తియును పాపభీతియుఁ గలుగునటుల బోధింపించుచు వచ్చెను. ప్రజల మానధనంబులకు భంగమును గలిగించునట్టి జార చోరాది క్రూర జనంబుల శిక్షింపించుచు మిక్కిలి జాగరూకుఁడై పరిపాలనము సేయుచు వచ్చెను. ఈ యాంధ్రచక్రవర్తికాలమున విదేశములతోడి వాణిజ్యమును సముద్రయానమును విశేషముగా సాగుచు వచ్చెను.

వేలానగరము ప్రసిద్ధమైన రేవుపట్టణము.

ప్రాచీనకాలమునుండియు గుంటూరుమండలములో బాపట్లతాలూకాలో బాపట్లకు సమీపమున సముద్రతీరమునందున్న మోటుపల్లి యను

గ్రామము, ప్రసిద్ధమైన రేవుపట్టణముగా నుండి చీనా, బర్మా, పారసీకము మొదలగు విదేశములతో వాణిజ్యము నెఱపుటకు నాంధ్రదేశములో నొక ప్రధానస్థాన మయ్యె నని యాంధ్రులచరిత్రము ప్రథమభాగమున సవిస్తరముగా వ్రాసియున్నాను. ఈ మోటుపల్లికే వేలానగర మని నామాంతరము గలదు. ఈ వేలానగరము ఆంధ్రభృత్యుల కాలమునను, ఆంధ్రపల్లవుల కాలమునను, ఆంధ్రచాళుక్యుల కాలమునను, ఆంధ్రచోడుల కాలమునను ప్రసిద్ధి కెక్కిన పట్టణముగ నున్నను క్రమముగా చాళుక్యుల పరిపాలనానంతరము వాణిజ్యము క్షీణింప నంతఁగా గణనకు రాక యుండెను. మోటుపల్లికడ మెట్టపట్టిన యోడలలోని సరకులను ఆసమీపమునందలి మండలేశ్వరులు కొల్లగొను చుండుటచేత నావికు లారేవునకుఁ జేరుటకే భయపడు చుండిరి. అందువలనఁ బ్రసిద్ధి గాంచిన వర్తకు లెవ్వరు నాపట్టణమున నివాసముగా నుండక పోయిరి. కాకతి గణపతిదేవచక్రవర్తికిఁ బూర్వము కొంతకాలమునుండి విదేశవ్యాపారము నడుపునట్టి వర్తకులకు నభయశాసన మీఁగల చక్రవర్తి గాని మహారాజు గాని లేనందువలననే యా ప్రసిద్ధమైన రేవుపట్టణమున కా గతి పట్టెను. గణపతిచక్రవర్తి తాను సింహాసనారూఢుఁడై వెలనాటిని జయించిన పిమ్మట నీ వేలానగరము నుద్ధరించి విదేశవ్యాపారమును పెంపు నొందింపవలయు నన్న సంకల్పము మనస్సున నంకురించిన వెంటనే యుపేక్షింపక మంత్రులతో నాలోచించి యందులకుం దగిన ప్రయత్నములను గావించెను. అప్పు డా గణపతిచక్రవర్తి వర్తకులకు నభయశాసన మొసంగెను. "నా జీవితముకన్నను నా ప్రజలసంరక్షణమే నాకు నెక్కువ ప్రీతికరమైన విషయ" మని యా యభయశాసనమున వ్రాయించెను. మఱియు నాశాసనమువలన సత్ప్రభుత్వముయొక్క ధర్మములను గాపాడుటకును, కీర్తికొఱకై యధికాభినివేశముతో సముద్రయానము చేసి విదేశములతో వ్యాపారము చేయునట్టి వర్తకులయందలి ప్రేమచేత నెక్కు కూపశుల్కముమాత్రము గాక తక్కిన సుంకముల నన్నిటిని వదలివేసితి మని లిఖింపఁ బడియెను. ఉత్తరమునుండి దక్షిణమునకుఁ గాని, దక్షిణమునుండి యుత్తరమునకుఁ గాని పోవునట్టి

యోడలు వాయువశమున నీ రేవున మెఱక పట్టి పోయిన యెడల నా సరకుల నోడదొంగలు కొల్లగొనకుండఁ గట్టడచేయుటయె గాక వర్తకులు నిర్భయముగా రాకపోకలు జరుపుటకుం దగిన మార్గముల నేర్పఱచెను. ఎగుమతి దిగుమతి సరకుల పై శుల్కపరిమాణము ముప్పదింట నొక్కటిగ నిర్ణయించెను. శ్రీగంధము ౧ కి x ౧, పచ్చకర్పూరమునకు, చీనికర్పూరమునకు, ముత్యాలకు వెల x ౧ కి ౬౦।।౩_, పన్నీరు దంతము, జవ్వాది, కర్పూరతైలము, రాగి, తగరము, సీసము, పట్టునూలు, పవడము, గంధద్రవ్యములకు వెల x ౧-కి ౬౧।–, మిర్యాలు వెల x కి ౬।।।–, పట్టుస్వరూపము ౧-కి x ౧కి ౬।।।౦,

ఈ రీతిగ సుంకము విధింపఁ బడియెను. ఈసరకుల నామమును బట్టియే యాకాలము నం దా రేవుపట్టణ మెంతప్రసిద్ధమైనదిగ నుండెనో, ఏయే దేశములతోడ వ్యాపారము చేయుచుండెనో వేఱుగఁ జెప్ప నక్కఱలేకయె బోధపడక మానదు. కాకతిగణపతిదేవచక్రవర్తియొక్క కృపావిశేషము చేతనే యారేవుపట్టణము పునరుద్ధారణము గావింపఁ బడుటయు, అతని కొమార్తయైన రుద్రమదేవికాలమున వెనీసువర్తకుం డైన "మార్కోపోలో" అనువానిచేత శ్లాఘింపఁ బడుటయు సంభవించినది. కాకతిగణపతి సిద్ధయదేవ మహారాజును మోటుపల్లికిఁ బాలకునిగ నియమించెను.

ధర్మపరిపాలనము.

ఈ యాంధ్రచక్రవర్తిప్రభుత్వకాలమున ధర్మము వర్ధిల్లె ననియు, ద్విజులలోఁ బ్రముఖులైన వార లున్నతపదవులకు వచ్చి రనియు, వృద్ధులయెడ గౌరవము, ప్రేమ, మొదలగువానిని ప్రజలు కలిగి యుండి రనియు, శాస్త్రజ్ఞానము, కళలు వికసింపఁ జేయఁబడిన వనియు, పల్నాటిలోని దుర్గిపట్టణమున గంగయసాహిణిచే లిఖియింపఁబడిన దానశాసనములో నుదాహరింపఁబడియెను. ఈ గంగయసాహిణికి మంత్రిగ నుండిన నామయపండితుఁడు దుగ్గయపట్టణమున తన తండ్రికిఁ బుణ్యము ప్రాప్తించుకొఱకు వంకేశ్వరాలయమును నిర్మింపించె నని తెలియుచున్నది. కాకతి గణపతిదేవచక్రవర్తి ప్రజారంజకముగఁ బరిపాలనముసేసి సత్కీర్తి వడయుటకుఁ గారణ

భూతుఁడైనవాఁడు శివదేవయ్య యనువానిని ప్రధానమంత్రియె గాని యన్యుఁడు గాఁడని యిదివఱకె దెలిపియున్నాను. ఈ శివదేవయ్య యను నైయోగి కారాధ్య బ్రాహ్మణుఁడు రాజ్యతంత్రజ్ఞుఁడు మాత్రముగాక పండిత కవియుం గూడనై యుండెను. అతఁడాంధ్రమున "పురుషార్థసార"[*] మను నీతిగ్రంథమును రచించెను. ఇందలి కవనము మృదుమధుర పదఘటిత మై యొప్పుచున్న దని దెలుపుటకై రెండు పద్యములను మాత్ర మీదిగున నుదాహరించుచున్నాను.

"క. ప్రజఁ జెఱిచి కూడఁ బెట్టిన
నిజధన మది వలయు వ్యయము నిచ్చలుఁ జేయున్
బ్రజయును ధనమును బొలిసిన
భుజబలమున నిలువఁ దలమె భూపతి కందున్."

క. జనలక్ష్మికి ధనలక్ష్మికి
ననుపమ మగుధర్మలక్ష్మి కాత్మయ మూలం
బని యాత్మరక్ష మఱవక
జననాథుఁడు సేయవలయు సతతము ప్రీతిన్."

కాకతి గణపతిదేవ చక్రవర్తికిఁ బుత్రికా సంతానమె గాని పుత్రసంతానము లేకయుండెను. ఈయనకు గణపాంబ రుద్రాంబ యను నిరువురు కొమార్తలు గల రని యింతకుఁ బూర్వమె దెలిపియున్నాను. ఇతఁడు తన పెద్దకొమార్త యయిన రుద్రాంబను కుమారునిగ భావించుకొని యామెకు విద్యాబుద్ధులు గఱపించి రాజ్యతంత్రజ్ఞానమును గలిగించి తనకుఁ బిమ్మట నామెయె సింహాసనారూఢయై యాంధ్రసామ్రాజ్యమును బరిపాలింప నియమించి యిరువదిరెండు సంవత్సరములు ప్రజారంజకముగ నిరంకుశపాలనము చేసి మిక్కిలి వృద్ధుఁడై క్రీ. శ. ౧౨౬౦ వ సంవత్సరమున స్వర్గస్థుఁడై కీర్తిశేషుఁ డయ్యెను.

[*] పురుషార్థసార మనుగ్రంథము శివదేవయ్యచే రచింపఁబడిన దని శ్రీయుత మానవల్లి రామకృష్ణకవి ఎమ్.ఏ గారిచేఁ బ్రకటింపఁ బడిననీతిశాస్త్రముక్తావళిగ్రంథ పీఠికలో వ్రాయఁబడినది.

పండ్రెండవ ప్రకరణము.

శ్రీరుద్రమదేవిపరిపాలన చరిత్రము.

(క్రీ. శ. ౧౨౬౧ మొదలుకొని క్రీ. శ. ౧౨౯౧)

రుద్రాంబ గణపతికూఁతురు గాని భార్య కాదు.

కాకతి గణపతిదేవ చక్రవర్తి కీర్తిశేషుఁడై చన్న వెనుక నతనిపుత్రికారత్నము శ్రీరుద్రమదేవి వజ్రసింహాసనము నధిష్ఠించి యాంధ్రసామ్రాజ్య పరిపాలనభారమును వహించెను. పూర్వగ్రంథములలోను నూత్న గ్రంథములలోను గూడ రుద్రాంబ గణపతిదేవచక్రవర్తిభార్య యని వక్కాణింపఁబడి యుండుటం జేసి యాంధ్రప్రపంచ మట్లే యవిచారపూర్వకముగా విశ్వసించి యున్నది కాని నిక్కము విచారింప నామె యాతనికొమార్తగాని భార్య కాదని విస్పష్టము కాఁగలదు. రుద్రాంబాదేవి గణపతిపుత్రిక యై యుండఁగా భార్య యని వాడుకలోనికి వచ్చి విశ్వసింపఁబడుటకు హేతు వేమో యెంతమాత్రమును బోధపడ కున్నది. రుద్రమదేవి పరిపాలనము చేయుచున్న కాలమున హిందూదేశమును జూడవచ్చిన "మార్కోపోలో" అను వెనీసు వర్తకుఁ డొకఁడు "కాకతి గణపతి యనంతర మతనిభార్య రుద్రమదేవి యతనికంటెను మిక్కిలి వైభవముతో రాజ్యము చేయుచున్నది." అని నుడివి యున్నాఁడు. విదేశీయుఁడగుటఁ జేసి యతఁడట్లు వ్రాసియుండునని యూహింతమన్నను, స్థానిక వృత్తాంతములలో సయితము భార్య యనియే చెప్పఁబడినది. స్థానిక చరిత్రములోని విషయము లన్నియుఁ బరమసత్యములను గా మన మెంతమాత్రమును భావింపరాదు. అయ్యవి యవిమర్శపూర్వకముగాఁ బ్రజ

లచేఁ జెప్పుకొనఁబడునట్టి గాథలను బురస్కరించుకొని వ్రాయఁబడినవి. ఈగాథలను వినియుండుటచేతనే కాఁబోలు మహామహోపాధ్యాయ కోలచల మల్లినాథసూరిగారి పుత్త్రుండగు కుమారస్వామి సోమయాజిగారు సంస్కృత ప్రతాపరుద్రీయమునకు వ్రాసినవ్యాఖ్యలో నొకచోట

"పురా కిల కాకతికులసంభూతే గణపతినామ్ని మహారాజే, దుహితృమాత్రసంతానే, కదాచి ద్దైవయోగేన కాలపరిపాక ముపేయుషి, తన్మహిషీ రుద్రదేవీనామ రాజ్ఞీ, బహూని వర్షాణి తద్రాజ్య మకంటకం పరిపాల్య, పరిణతా సతీ దౌహిత్రే ప్రతాపరుద్రే రాజ్యధురాం నిదధే. తా మిమాం కథాం మనసి నిధా యాహ యో రుద్ర ఇతి" అని వ్రాసియున్నారు.

పూర్వము కాకతికులసంభూతుఁడగు గణపతిమహారాజు పుత్త్రికాసంతానము మాత్రముకలవాఁడై దైవయోగముచేతఁ గాలగతిని జెందఁగా నతని భార్యయగు రుద్రాంబిక రాజ్యభారమును వహించి అనేక సంవత్సరములు నిష్కంటకముగాఁ బరిపాలనముచేసి తాను వృద్ధురా లగుటయును, తన దౌహిత్రుఁడు వయస్సు వచ్చిన వాఁడగుటయును తలపోసి రాజ్యభార మాతనికి నొప్పగించె నని తాత్పర్యము. ఈ మహావ్యాఖ్యాత ఇట్టి భ్రమ నొందుటకు కారణము ప్రతాపరుద్రీయములో

"శ్లో॥ యో రుద్రో రజతాచలే స్థితి మగా దర్ధాంగనారీః పురా
సోఽయం సంప్రతి కాకతీశ్వరకులే సర్వాఙ్గనారీః స్థితః
స్థానే యద్విషమాక్షలోకనకళామాత్రేణ భస్మీకృతా
న్యాస న్వైరిపురాణి చిత్ర మధునా ఖడ్గే విషం ధార్యతే".

అని మొదలుగాఁగల చోటులఁ బుంలింగమే ప్రయోగింపఁబడి యుండుటయె గాని యన్యముగాఁ గనుపట్టదు. అర్ధాంగనారియై కైలాసమందున్న రుద్రుఁడు కాకతివంశమందుఁ బూర్ణముగ స్త్రీ శరీరమునే ధరించియున్న

వాఁడని పై శ్లోకమునందుఁ జెప్పఁబడి యుండుటచేత వ్యాఖ్యాత పాఠకులకు దానిని బోధపఱచుటకై పైని వ్యాఖ్యానములో వివరించినవిధముగా రుద్రమదేవి గణపతిభార్య యని సంబంధమును దెలిపియుండెను.

రుద్రమహాదేవి గణపతిభార్య యని గ్రంథకర్తలనేకులు వారికిం దోఁచినట్లుగ వ్రాయుట వింతగా నుండక మానదు. వచనసోమదేవరాజీయమునందు "గణపతి సకలసేనాసమేతుండై మహాదేవరాజసమేతముగ దేవగిరిమీఁదికి దండు వెడలి వారితో మాసత్రయంబు యుద్ధము చేసి యందు గదాయుద్ధమున మహాదేవరాజు సమసిన నది గని గణపతిమహారాజు క్రోధాన్వితుండై జగడంబు చేసి దేవగిరిరాజును జంపిన వారు శరణాగతులై తమ కూఁతు రగు రుద్రమహాదేవిని గానుకఁగాఁ బెట్టిన నాపడుచును గైకొని యేకశిలానగరమునకు వచ్చెను." అని రుద్రమదేవి దేవగిరి యాదవరాజకుటుంబమున జనించిన దని కూడ చెప్పిరి. ఇది పద్యకావ్యము ననుసరించి వ్రాయఁబడిన వచనకావ్యము గావున నక్కడఁగూడ ఇదే రీతిగఁ జెప్పఁబడియుండును. ఇట్లే స్థానికచరిత్రములందును వ్రాయఁబడినది. మార్కొపోలో వ్రాఁతను బట్టి పాశ్చాత్యులు కూడ కొందఱు భార్య యని వ్రాసిరి. వీని నన్నిటిని జూచి ఆంధ్రకవుల చరిత్రములో శ్రీ వీరేశలింగముగారు రుద్రమదేవి గణపతిభార్య యని వక్కాణించియున్నారు. కీర్తిశేషు లయిన శ్రీ రామమూర్తిగారును కవిజీవితములయందు మొదట గణపతిభార్య రుద్రమదేవి యని యుదాహరించినారు గాని డాక్టరుహల్ట్జుగారు "ఇండియన్ అంటిక్వెరీ" లో వ్రాసిన లేఖనమును జూచిన తరువాత వెనుకటి యభిప్రాయమును మార్చుకొనిరి. హిందూదేశకథాసంగ్రహములో ప్రథమభాగమున శ్రీ కొమఱరాజు లక్ష్మణరావు ఎం ఏ. గారు కూడ రుద్రమదేవి గణపతిభార్య యనియె చెప్పియున్నారు. ఇంతియు గాక క్రిందటి సంవత్సరము ప్రకటింపఁబడిన శ్రీ వెలుగోటివారి వంశచరిత్రమునందు సయితము రుద్రాంబిక గణపతిదేవుని కూఁతురను వాదము గలదని యెఱింగియు విమర్శింపక దానిని విస్మరించి రుద్రమదేవి గణపతిభార్య యని కంఠోక్తిగాఁ జెప్పఁబడియెను. ఇట్లుండఁగ

గ్రంథకర్తలు పరమవిశ్వాసభావముతో నంగీకరించిన సిద్ధాంతమును ద్రోచి పుచ్చుటకు హేతువు లేవి యని చదువరులు ప్రశ్నింపవచ్చును. రుద్రాంబిక గణపతికూఁతు రని చెప్పుటకు బలవత్తర మయిన ప్రమాణముగలదు. వానిం దెలుపుటకుఁ బూర్వము పై నుదాహరించిన యభిప్రాయములను గూర్చి యొకింత విమర్శ చేయవలసి యున్నది. ఆ యభిప్రాయములలో నొక్క ప్రతాప రుద్రీయ వ్యాఖ్యాత యభిప్రాయమును విమర్శించిన పక్షమునఁ దక్కినవన్నియు విమర్శింప నక్కఱలేకయె మనకు సత్యము గోచరముకాఁగలదు. ఏకారణము చేతనట్లు వ్రాసినను ఈ సందర్భమున వ్యాఖ్యాతవిభ్రాంతి నొందె ననుటకు సందియము లేదు.

విద్యానాథమహాకవిప్రణీత మైన ప్రతాపరుద్రీయమును బరిశోధించి రుద్రాంబిక గణపతిదేవుని కొమార్త యని మొదట కనిపెట్టినవాఁడు శాసన పరిశోధకుఁ డైన "హుల్ట్జు" అను జర్మనీ దేశపండితుఁడు. ఈయన క్రీ. శ. ౧౮౯౨ వ సంవత్సరము జూలై నెల సంచిక "ఇండియన్ ఆంటిక్వెరీ" అను గ్రంథములో ౧౯౭ వ పేజిలో కాంచీపురములో గణపతిదేవుని కాలమున వ్రాయఁబడిన దానశాసనము నొకదానిం బ్రకటించుచు, అందు గణపతికి వెనుక రాజ్యమునకు వచ్చిన వారిని నిర్ధారణసేయుచు, ఈక్రిందిరీతిని వ్రాసి యున్నాఁడు.

"ఆమెతండ్రి గణపతి పుత్త్రసంతానము లేనివాఁడయినందున నామెను (రుద్రాంబిక) కుమారునిగానే పేర్కొని రుద్రుఁ డని పురుషనామమును బెట్టెను. అతని మరణానంతరము ఆమె సింహాసన మెక్కినట్టు గాన్పించుచున్నది. ఆమె "రాజా రుద్రమహారాజు" అని మూలగ్రంథములోఁ బేర్కొనఁబడి యుండఁగా వ్యాఖ్యానములో రుద్రాంబిక యని పేర్కొనఁ బడియెను."

ప్రతాపరుద్రీయములో నాటకప్రకరణములో నొకచోట. —

"శ్లో. సైషా సోమా చేతి నిర్దిష్టా సోమా చేతి ప్రథా మగాత్
తవ మాతా శివా సాక్షా ద్దేవో గణపతిః పితా."

అని పురోహితుఁడు రుద్రాంబికతల్లి సోమాంబను ఉమాదేవి యనియు, తండ్రి యైన గణపతిని శివుఁ డనియు రుద్రాంబికతో పలికినట్లుగాఁ జెప్పఁ బడినది.

ఇదివఱకే వ్యాఖ్యాత రుద్రాంబిక గణపతిదేవుని భార్య యని చెప్పి యున్నవాఁ డగుటచేత

"వ్యా. రుద్రాంబాయాః పితరౌ సోమాంబాగణపతిదేవౌ తయో రుమామహేశ్వరాత్మకత్వం లోకవిదితం। తతః స్వయంభూమహారాజయోః పితాపుత్త్రభావోఽస్తి."

అని వ్రాసి యీసోమాంబయు గణపతియు కాకతీయులు గాక వేఱు కుటుంబములోని వారని భావించెను. ఈవిషయమునుగూర్చి ప్రతాపరుద్రీయములో నాటకప్రకరణములో అంకారంభమునపురుషనామమును దాల్చి పురుషవేషముతో నున్న రుద్రాంబికతో పురోహితునకును మంత్రికిని జరిగినసంభాషణములను గూర్చిన శ్లోకముల నుదాహరించిన యెడల నందలినిజము చదువరులకు విస్పష్టము కాఁగల దను భావముతో వాని నిట నుదాహరించుచున్నాను.

" తత్ర ప్రవిశతి యథానిర్దిష్ట వేషో రాజా చామరగ్రాహిణీచ

రాజా. — సహర్షాతిశయం। అయే ప్రసాదాతిశయః పరమేశ్వరస్య

శ్లో. సోమార్కాభిజనం శ మద్య జయతి శ్రీకాకతీయాన్వయం,
పాతివ్రత్య ముపైతి సాంప్రత మియ మ్యస్మాసు విశ్వంభరా
ఆస్మాభి ర్నిజదోఃప్రసూతి మధునా ధన్యా మజో మన్యతే
య త్కర్తవ్య ముపాదిశ త్కులపతి ర్దేవ స్స్వయంభూ స్స్వయమ్॥

పురోధసః. — మహారాజ భవాదృశా ఏవ పర మర్హంతి తాదృశీ మహిమ్నా దేవస్యహితోపదేశాన్॥ అథవా కి మత్రాభినవం। పుత్త్రాణాం హితోపదేశాధికారః పితు రేవ య థేష్టం కథయంతి తద్విదః ॥

శ్లో. సైషా సోమా చేతి నిర్దిష్టా సోమాచేతి ప్రథా మగాత్
తవ మాతా శివా సాక్షా ద్దేవో గణపతిః పితా."

మంత్రిణః—ఏవ మే వైతత్, అన్యథా కథ మీశ్వరస్య ప్రసాదాదృతే నిరంకుశం స్త్రీవ్యక్తివిశేషస్య లోకాధిపత్యం। ఏవం మానుషశంభునా గణపతిమహారాజేన అభ్యంతర స్స్వానుభవమహిమ్నః సదృశ మ్మత్రి పుత్త్రి ఇతి వ్యవహారః కృతః। తదనుగుణా చ రుద్ర ఇతి వ్యవహారః కృతః। తదనుగుణాచ రుద్రఇ త్యాఖ్యా"

"రాజు (పురుష వేషముతో నున్న రుద్రాంబిక) రంగస్థలమునకు నేతెంచి కాకతీయులకు కులదేవుఁ డయిన స్వయంభూదేవుఁడు భవిష్యత్కాలమున నెట్లు రాజ్యపరిపాలనము నిర్వహింపవలయునో ఉపదేశ మిచ్చుటకై తనస్వప్నములో సాక్షాత్కరించె నని చెప్పెను.

అంతట పురోహితుఁడు "నీవంటిప్రజలుమాత్రమే స్వయంభూదేవుని సాక్షాత్కారమును ఉపదేశమును బొందుటకు నర్హులనియు, అట్టిది కుమారునకు తండ్రి చేయవలసిన విధ్యుక్తధర్మములలో నొక్కటి గావున నందు' నూత్న విశేష మేమియును లే దనియును, నీతల్లికి సోమాంబ యనియు, నీతండ్రికి గణపతి యనియు నామము లుండుటచేత స్వయంభూదేవుని (అర్ధనారీశ్వరుని యొక్క యొక యాకృతి) సంతాన మనిపించుకొనుటకు నీకు సత్త్వము గల దనియు" ప్రత్యుత్తరము చెప్పెను.

అటుపిమ్మట మంత్రి "అట్లు కాదేని నిరంకుశాధికారముగల యొకమహారాజువలె నొక స్త్రీ దేశమును బరిపాలించుట యెట్లు సాధ్య మగును కనుక నే ఈశ్వరాంశసంభూతుఁడైన గణపతిమహారాజు తనదివ్యజ్ఞానముచేత తనకు జనించియుండిన బిడ్డ దేశపాలనము చేయుటకుం దగిన గుణవిశేషములు గలిగియున్న దని తెలిసికొని లోకవ్యవహారముకొఱకు కుమారుం డనియే ప్రకటించి రుద్రదేవుఁ డని నామకరణముచేసె" నని చెప్పి పై పురోహితుని యభిప్రాయమును బలపఱిచెను.

ఈ భావమె పైన నుదాహరించిన శ్లోకములలోను వాక్యములలోను స్పష్టముగాఁ గనుపట్టుచున్నది. దీనిం బట్టి వ్యాఖ్యాత చెప్పిన విధముగా రుద్రాంబికతండ్రి కాకతి గణపతిచక్రవర్తి గాక మఱియొక గణపతి యని యూహించుటకు నవుపడునా? అట్లయినయెడల కాకతి సామ్రాజ్యము భర్తయైన కాకతి గణపతిచక్రవర్తివలనఁ గాక తండ్రియైన గణపతివలన రుద్రాంబికను సంక్రమించిన దని చెప్పవలసి వచ్చును. అది చరిత్రాంశమునకు విరుద్ధ మని యెఱుంగుదుము. కనుక పైసంభాషణముల యందలి భావమువలన కాకతి గణపతిచక్రవర్తికి రుద్రాంబిక కూఁతురనియును, పుత్త్రులు లేని కారణమున నామెను పుత్త్రినిగాఁ జూచుకొనుచు నామెకు రుద్రదేవుఁ డనియె పురుష నామ ముంచె నని విస్పష్ట మగుచున్నది శ్రీరామమూర్తిగారు కవిజీవితములయందు మొదట తక్కినవారివలెనె భ్రమపడి భార్య యని వక్కాణించి యున్నమాట వాస్తవమెగాని తరువాత పైనిజెప్పిన విధముగాఁ గనఁబఱిచి పుత్త్రికయని సిద్ధాంతము చేసియున్నారు. ఇట్లని యెఱుంగక వెలుగోటివారి వంశచరిత్రమునందు భార్య యని కవిజీవితములయందు వ్రాసిన వాక్యములు ప్రమాణములు గానెత్తి చూపఁబడినవి గావున నయ్యవి నిష్ప్రయోజనములు. డాక్టరు హల్ట్జుగారు గాని శ్రీరామమూర్తిగారు గాని శాసన ప్రమాణ మేమియుఁ జూపినవారు కారు. రాబర్టు స్యూయల్ గారు మాత్రము గుంటూరుమండలములో కాకాని గ్రామములో నొక శాసనము గల దని నుడివి యందును గూర్చి యిట్లు వ్రాసియున్నారు.[1]

"ఓరుగంటి రుద్రమహాదేవి రాజ్య పరిపాలన కాలమున శా. శ ౧౧౯౨ క్రీ. శ. ౧౨౭౦ సంవత్సరములో కృష్ణామండలములోని (ప్రస్తుతము గుంటూరు) కాకాని (కుక్కకాకాని) గ్రామములో గోపాలస్వామి గుడికి నెదుట నొక శిలాశాసనము గలదు. కాకతి గణపతి దేవుని కూఁతు రని చెప్పఁబడినది కావున నీ శాసనము మిక్కిలి ముఖ్య మయినదిగా నున్నది.

1. Lists of Antiquities Vol. I, Pp. 74 and 75.

అని వ్రాసియున్నారు. కాని శాసనమును జక్కఁగాఁ బరిశీలించి దాని ప్రతి నెత్తికొని వివరముగా వ్రాయుట కాయన శ్రద్ధతీసికొని యుండ లేదు కనుక నందేమి కలదో యింతవఱకు నెవ్వరును జెప్పియుండలేదు.

వెలుగోటివారివంశచరిత్రము ప్రాఁతగ్రంథమునందు

"గీ. ఘనత నాప్రసాదిత్యుండు కాకతిగణ
పతి చనిన నతని సుతకుఁ బట్టణంబు
రమణతోఁ గట్టి కాకతి రాయరాజ్య
స్థాపనాచార్య బిరుదు దాఁ దనరఁ గాంచె"

అని కొమార్తగాఁ జెప్పఁబడినది. అయినను నూత్నగ్రంథ మగు వెలుగోటివారి వంశచరిత్రమునందు ద్వైవిధముగా వ్రాయుట లేఖకప్రమాదమనియు, అతని సుతకు బదులుగా "అతని పతికి" అని యుండినను నుండ వచ్చునని సెలవిచ్చియున్నారు. పైని జూపిన ప్రమాణములను బట్టియు ఈ క్రిందఁ జూపఁబోవు శాసనప్రమాణమును బట్టియు, పూర్వగ్రంథమునం జెప్పఁబడిన ప్రకారము కొమార్త యని యే సిద్ధాంత మగుచున్నది.

కూఁతు రనుటకు బలవత్తర మైన ప్రమాణము.

ఇంతవఱకు ఏచరిత్రకారులును ఏశాసనపరిశోధకులును చూపింపని బలవత్తరమైన శాసన ప్రమాణమును గనఁబఱిచి రుద్రాంబిక గణపతిచక్రవర్తి కొమార్త యని నిశ్శంకముగా సిద్ధాంతము చేయుచున్నాను. గుంటూరు జిల్లాలో మంగళగిరితాలూకాలో చేరిన శ్రోత్రియాగ్రహార మైన మల్కాపుర మను గ్రామమునకుఁ బడమట విశ్వేశ్వరస్వామివారి యాలయమునకు ముందర నున్న శిలాస్తంభము మీఁది శాసనము. ఈశాసనము కాకతి రుద్రాంబకాలము నను రెండవప్రతాపరుద్రునికాలమునను నున్న కాకతీయ గురుపరంపరలోని వాఁడగు శివమహాముని దానశాసనమై యున్నది. ఇందు కాకతీయవంశ మభివర్ణింపఁబడినది. ఇందు శాసనమును వ్రాసినకవి గణపతిచక్రవర్తిని వర్ణించుచు కడపట,—

" కతి కతిన సంతి భూపాః కతి కతి వా గుణగణాభరణాః
గణపతినృపతి స్త్వేకో నరపతిశతపోషకః క్షోణ్యాం॥
నిస్సాణరేవసంత్రస్తాః తుణాద్గణపతేర్నృపాః
అపి త్యజంతి దుర్గాణి నధరామైవకేవలం॥

అని చెప్పిన తరువాత రుద్రదేవిని గూర్చి (ప్రారంభించి

" రుద్రదేవీ సముదభూ త్కారుణ్యాత్సర్వభూభృతాం
గంభీరా న్మహత స్తస్మా ల్లక్ష్మీ రత్నాకరాదివ॥
సర్వోర్వీశకిరీటకుట్టిమతటీవిన్యస్తపాదాంబుజా
శాస్త్యేషా చతురంబురాశిరసనాం శ్రీరుద్రదేవీ భువం।
యస్యా జన్మమహోత్సవో గణపతేః క్ష్మాపాలచూడామణేః
విస్ఫూర్జత్కవికాలకల్మషకథాధ్వాంతౌఘ తేజోనిధిః॥
సామ్రాజ్యేఽఖిలవర్జితం విరచితే శ్రీరుద్రదేవ్యా స్వయం
చాతుర్వర్ణ్యనిజస్థితి ర్వ్యజయ తే విద్రాతి కాలః కవిః।
ధర్మోఽసౌ భగవా న్విభాతి దురితం దూరేద్విజానాంద్విషః
తన్నామగ్రహభీషితా నిజపురాన్ని ర్యాంతి పర్యాకులాః॥
ఆక్రామంతి తరత్తరంగవిగళద్దుగ్ధాబ్ధిఫేనావలీ
రాచామంతిశరచ్ఛశాంకవిసరజ్జ్యోత్స్నాప్రవాళామృతమ్
ఆకర్షంతి సురేంద్రదంతిదశనప్రాకారలగ్నాం శ్రియం
ముక్తాహారలతాయితాః ప్రతిదిశం రుద్రాంబికాకీర్తయః."

అని రత్నాకరమునందు లక్ష్మి యుదయించినట్లు గానే గణపతిదేవునికి రుద్రదేవి జనించెనని చెప్పి యామెను విశేషముగా నభివర్ణించియున్నాఁడు. ఇందువలన రుద్రదేవి గణపతిదేవచక్రవర్తి కూఁతు రనుట నిర్వివాదాంశ మని చరిత్రమూలన స్థాపిత మగును.

రుద్రాంబ రాజ్యభారమును పూనుట.

కాఁబట్టి కాకతి గణపతిదేవ చక్రవర్తి తనకు పురుషసంతానము లేని కారణమున తనకొమార్తలలో నొకతెయగు రుద్రదేవిని కుమారునిగా భావించుకొని యామెకు రుద్రదేవుండనియె నామమును పెట్టి పెంచె నని ప్రతాపరుద్రీయమను గ్రంథమును బట్టి మనము తెలిసికొని యున్నాము. కాకతి గణపతి చక్రవర్తి మరణానంతరము రుద్రదేవి రత్నసింహాసన మధిష్ఠించి యాంధ్రసామ్రాజ్యభారమును వహించి మిక్కిలి ప్రజారంజకముగాఁ బరిపాలనము సేయ నారంభించెను.

ఈమె శా. శ. ౧౧౮౨వ సంవత్సర మనఁగా క్రీ. శ. ౧౨౬౦ దవ [illegible]రములో సింహాసన మెక్కె నని త్రిపురాంతకశాసనములలో నొక [illegible]ని బోధపడుచున్నది. [1]

ఈమె "రుద్రదేవమహారాజు" అను నామమునఁ వ్యవహరింపఁబడుచు వచ్చెను. ఈమె యెప్పుడును పురుషవేషముతోనే కొలువుకూటమునకు నేతెంచి మంత్రులతో రాజ్యాంగ విషయములను గూర్చి ముచ్చటించుచుండెనని తెలియుచున్నది. ఈమె చక్రవర్తి పుత్త్రికయగుటం జేసి యీమె కీర్తియె లోకమున వ్యాపించెను గాని యీమె భర్త యెవ్వరో యాయన చరిత్ర మెట్టిదో యాంధ్ర ప్రపంచమింతవఱకు నెఱుంగదు. భర్త సామాన్యుఁడగుటచేతనో అకాలమృత్యువు వాతంబడుటచేతనో యాతని నామము ప్రసిద్ధమై యుండకపోయెను. ఇంతియగాక గణపతి చక్రవర్తికిఁ బిమ్మట రాజ్యభారమును వహించినదగుటచేత నతనిభార్యయని యాంధ్రప్రపంచము భ్రాంతిం జెందెను.

రుద్రాంబిక భర్త.

గోదావరీమండలములో దక్షారామ మను గ్రామంబున నుండు శ్రీభీమేశ్వరస్వామి వారి యాలయములో నొకశాసనములో "కాకతి గణపతి రుద్రదేవరు మహారాజుల యల్లుఁడు మల్లదేవులుం" అని వ్రాయంబడి యుండుటను జూచి చాళుక్యచేతవిజయాదిత్యుని వంశములోనివాఁడై "మల్లపదేవ చక్రవర్తి" "మల్లవిష్ణువర్ధన మహారాజు" అను నామములతో వ్యవహరింపఁబడుచు క్రీ. శ. ౧౨౦౨వ సంవత్సరము మొదలుకొని ౧౨౧౨వ సంవత్సరాంతమువఱకు వేంగీదేశమును బరిపాలించిన మల్లపరాజే మల్లదేవులని యభిప్రాయపడి శ్రీరామమూర్తిపంతులుగారు "ఓరుగంటి గణపతిరాజుల చరిత్ర" మను పేరిట నాంగ్లేయభాషలో వ్రాసిన యొక చిన్నగ్రంథములో కాకతిరుద్రదేవిభర్త చాళుక్యమల్లప దేవచక్రవర్తియని నుడివియున్నారు. ఆశాసనములో నుదాహరింపఁబడిన సంవత్సరము వారి సిద్ధాంతమునకు ప్రతిబంధకముగా నున్నది.

శా. శ. ౧౦౯౭వ సంవత్సరమనఁగా క్రీ. శ. ౧౧౭౫ దవ సంవత్సరమునం దాదానశాసనము పుట్టినదగుటచేత, అప్పటికి మల్లదేవుని భార్యయగు రుద్రదేవికి కనీసము ౧౫ సంవత్సరములు వయస్సుండవలయును. రుద్రదేవి క్రీ. శ. ౧౨౬౦ దవ సంవత్సరమున రాజ్యభారమును వహించి ౧౨౯౫ వఱకుఁ బరిపాలనము చేసినందున మరణకాలము నాఁటికి ౧౩౫ సంవత్సరములును, గణపతిదేవ చక్రవర్తి ౧౨౫ సంవత్సరములును బ్రదికి యుండెనని చెప్పవలసి వచ్చును. అట్లు చెప్పుట సరియైన పద్ధతి కాదు. కాకతిగణపతి రుద్రుని యల్లుఁడని చెప్పినంతమాత్రమున నాతఁడు రుద్రాంబిక భర్త యని యెట్లు నిర్ధారింపనగును? గణపతి చక్రవర్తికి రుద్రాంబిక యను నొక్కకూఁతురు మాత్రమె గలదని చెప్పుటకును సాధ్యపడదు. గణపాంబ యను కొమార్త మఱియొకతె గలదని ధాన్యకటక శాసనమునఁ జెప్పఁబడి యుండలేదా! ఇంకను కూఁతులు లేరని యెట్లు సిద్ధాంతీకరింప వచ్చును? ఇంతియగాక గణపతి రుద్రదేవుఁడని చెప్పుటచేత నతఁడు గణపతి యని చెప్పఁదగునా? లేక గణపతికొడుకగు రుద్రదేవుఁ డని చెప్పఁదగునా? గణపతికి రుద్రదేవుఁ డను నామము గలదని మఱియెక్కడను గానంబడలేదు. మొదటి ప్రతాపరుద్రుఁడని యర్థము చేసికొంద మన్నను అప్రతాపరుద్రుని తండ్రి ప్రోలరాజు గాని గణపతి కాఁడు.

1. Epigraphical Report for 1905-6.

ప్రోలరాజునకు గణపతి యనునామాంతర మొండు గలదని యెక్కడను చెప్పఁబడియుండలేదు. ఈశాసనములోని నామమే సందిగ్ధముగా నున్నది. కనుక గణపతిరుద్రుఁడనఁగా గణపతియనియె భావించుకొనవలసిన పక్షమున నందలి సంవత్సరము తప్పని స్పష్టముగాఁ జెప్పవచ్చును. ఇంతసందిగ్ధముగా నున్న యీశాసనము నాధారపఱుచుకొని కాకతిగణపతిదేవ చక్రవర్తి పుత్త్రికయైన రుద్రాంబభర్త చాళుక్య మల్ల విష్ణువర్ధనుఁ డని యూహించుట యొప్పిదముగాఁ గనుపట్టదు. భావిపరిశోధనమువలన నింతకన్నను ప్రబల సాక్ష్యము గాన్పించువఱకు రుద్రాంబికభర్త యితఁడే యని నిర్ధారించుట ప్రమాద హేతువగును. అంతవఱకు రుద్రాంబికభర్త యితఁడే యనిపేరు పెట్టక యతఁ డొక మండలేశ్వరుఁడనియు, రాజబంధువులలోనివాఁడై యిల్లఱికముండె ననియు యౌవనవయస్కుఁడై యున్నకాలముననే మృతిం జెంది యుండు ననియు విశ్వసించి యట్లువ్రాసినందువలన ప్రమాద మెద్దియు నుండఁబోదు. ఈమె రాజ్యభారము వహించుటకుఁ బూర్వమె, 'ఉమ్మక్క, రుయ్యమ్మ' అను నిరువురు పుత్త్రికలను గనెనని తెలియుచున్నది.

రుద్రాంబిక మహాదేవరాజును జయించుట.

గణపతి చక్రవర్తి యవసానకాలమునఁ జెప్పినరీతిగా శివదేవయ మొదలుగాఁ గలమంత్రివర్గమును, జన్నిగదేవ మహారాజు మొదలుగాఁ గల సేనాధిపతులును, ప్రసాదాదిత్యనాయఁడు మొదలుగాఁ గల భృత్యవర్గమును ధైర్యసాహసములను జూపి రుద్రదేవిని పట్టాభిషిక్తురాలినిఁగఁ జేయుట వీరవరులయిన మాండలిక రాజులకుఁ గొందఱకు నవమానకరముగఁ గన్పట్టెను. ఆంధ్రసామ్రాజ్య పీఠము నధిష్ఠించిన యొక్క యాఁడుదాని పాదపద్మములకు మ్రొక్కుట వీరపురు షాగ్రగణ్యులకుఁ దలవంపులుగఁ గన్పట్టెను. ఇట్లు మాండలికరాజులు గొందఱు చక్రవర్తిని యెడఁగలభయముచే మిన్నకుండిరను రాజద్రోహులై దేవగిరి ప్రభువు లయిన యాదవులతోడఁ గుట్రలుచేసి తుదకు యాదవులు దండెత్తి వచ్చునటులఁ జేసిరి. ఇక్కడ యోరుగంటిలో

గణపతిచక్రవర్తి మరణముఁ జెందిన సంవత్సరముననే యక్కడ దేవగిరిలో యాదవప్రభు వయిన కృష్ణభూపతి కూడ మరణముఁ జెందెను. అతని సోదరుఁడగు మహాదేవరాజు పట్టాభిషిక్తుఁడయ్యెను.

ఈ మహాదేవరాజు స్త్రీలను శిశువులను ఎప్పుడును జంపినవాఁడు కాఁడు గావున నీతఁడు పట్టాభిషిక్తుఁడయిన తోడనే యీతనిపరాక్రమమునకు భయపడి యాంధ్రు లొక్క యాఁడుదానిని మాళవు లొక్క శిశువును సింహాసన మెక్కించిరని శాసనములలోఁ గవులు గొనియాడియుండిరి. ఆస్తోత్ర పాఠముల నుబ్బి ప్రతాపవంతుఁ డైనమహాదేవరాజు త్రిలింగదేశముపై దండెత్తిరాఁ బ్రయత్నించెను. ఇంతలో రుద్రాంబాదేవి యూరకొనక తన తండ్రివలన నీ రాజ్యతంత్రజ్ఞానమును చక్కఁగా గ్రహించినది గావున నిసుమంతయుఁగొంకక యెంతమాత్రము నుపేక్షింపక శిథిలము లయిన దుర్గభాగముల నన్నిటిని బాగుచేయించి విశ్వాసపాత్రు లయిన మంత్రి సేనాపతి సామంతభటవర్గమును రప్పించుకొని కోటల నన్నిటిని సురక్షితములుగఁ గావించెను. ఏకశిలానగరమునకుఁ జుట్టును గాపకోటను గట్టించెను. దీనికి లోతట్టున మట్టికోటను గట్టించెను. దీని చుట్టును గొప్పయగడ్తను ద్రవ్వించెను. భూమికోటకు గవనులు ౮ దియును, దడ్లు ౧౬ ను, పుట్టకోటకు గవనులు ౪ను, దిడ్డులు ౮ దియును, రాతికోటకు గవనులు ౪ను దిడ్డులు ౮ దియును, రాతికోటకు లోతట్టున రాతిసోపానములును పెట్టించి అలంగముమీఁద తనబంధువర్గములోని వీరభటుల నుండనియమించి తక్కిన బంధువర్గము నంతయు రాతికోటకు లోతట్టున నున్న యిటుకకోటలో నుండ విధియించెను. కొమ్మ ౧కి ఇద్దఱును, బురుజు ౧కి ఏఁబదుండ్రును, దిడ్డి ౧కి నూఱుగ్వురును, గవను ౧కి ఏనూఱుగ్వురును వీరభటులను గాపువెట్టెను. తన కొమార్తయైన ఉమ్మక్కకు పుత్త్రిసంతానము లభించుటకయి బుద్ధగణపతి నారాధింపఁ గోరి వడ్డపల్లెకును అటనుండి ఏకవీరామహాదేవిని గొలుచుటకై మొగలిచెర్లకును బోయి అయిదుదినము లచ్చట నున్న కాలమున హరిహరదేవుఁడును మురారిదేవుఁడును ఆమెను బట్టుకొనఁ బ్రయత్నించిరి. అప్పు డెద్దియో యొక యుపాయమును బన్ని తన కొమార్తయైన యుమ్మక్కతోఁ గూడఁ దప్పించు

కొని వచ్చి యేకశిలానగరమునం బ్రవేశించి కొంత సైన్యమును బంపించి వారల నిరువురను జంపించి వారల యైశ్వర్యమునంతయుఁ జూఱఁగొని యాధనముతో పద్మాక్షీదేవికి మహోత్సవములు గావించెను. అప్పుడు దేవగిరినుండి మహాశూరుఁడైన మహాదేవరాజు అసంఖ్యాకము లయిన సైన్యములతో దండెత్తి వచ్చి యేకశిలానగరమును ముట్టడివేసెను. ఇట్లు మూఁడులక్షుల సైన్యముతో వచ్చి మహాదేవరాజు ముట్టడించినను భీతినొందక రుద్రమదేవి వెలమ సేనాని యగు రుద్రమనాయని నగరపాలకుండును కమ్మసేనానియు నగు నాగచమూపతిని హెచ్చరించి యా సేనానుల సాహాయ్యముతో పదునేను దినములు ఘోర యుద్ధము సేయఁగా యాదవసైన్యంబులు వెలమకమ్మవీరులధాటికి నిలువంజాలక పలాయనంబు లయ్యెను. రుద్రమదేవి యంతటితోఁ దృప్తినొందక యాగకుండక తానె నాయకత్వమును వహించి యాదవసైన్యంబులను వెంటాడించి నురుమాడుచు దేవగిరివఱకుఁ దఱిమి తఱిమి గొట్టఁగా మహాదేవరాజు తాను జేసిన యవివేకకృత్యమునకుఁ బశ్చాత్తప్తుఁడై రుద్రమదేవిని శరణువేడి కోటి ద్రవ్యంబు లపరాధముగ నిచ్చుకొని సంధి గావించుకొని నిజరాజధానికిఁ బోయెను. అప్పుడు రుద్రమదేవి తనదేశమునకును మహాదేవరాజు దేశమునకును సరిహద్దున జయస్తంభములను పాతించి వానిపై శాసనములను వ్రాయించి యేఁబదిలక్షుల హొన్నులను తనసైన్యములకుఁ బంచిపెట్టెను.

జన్నిగదేవసాహిణి.

కాయస్థకులసంజాతుండైన యీజన్నిగదేవసాహిణి రాజభక్తి గలిగి తనమేనమామ యైనగంగయసాహిణికిఁ దరువాత సైన్యాధ్యక్షుఁడును, ఆప్తమంత్రులలో నొక్కఁడునై దక్షిణభాగమున ననఁగా మార్జవాడి మొదలుకొని పానుగంటివఱకుఁ గల దేశమును బరిపాలించుచుండెను. ఇతఁడు బ్రదికియున్నంతవఱకు రుద్రమదేవికి దక్షిణభుజంబుగ నుండి యామెకు శత్రువులై రాజద్రోహమును జేయఁ బూనిన సేనానులను మాండలికరాజులను శిక్షించుచు వచ్చి అరాజకమగు నెడి యుపద్రవమునుండి దేశమును రక్షించెను. ఇతనికి బ్రహ్మరాక్షు

సుఁడు మొదలుగాఁ గలబిరుదము లనేకములు గలవు. ఇతఁడు శా. శ. ౧౧౮౨ రౌద్రిసంవత్సర చైత్ర శు ౧౧ గురువారమునాఁడు పొత్తపినాటి సీమలో బాహునదికి దక్షిణభాగమున నున్న పురందలూ రనియెడు పొందలూరు గ్రామమును శ్రీపర్వతాముల బసవగోళకమఠమునకు సంబంధించిన నిజగురుశాంతపూర్వ శివదేశికులకు బ్రాహ్మణాతిథ్యభ్యాగతపూజార్థము సమర్పణము చేసినట్లుగ పొందలూరు గ్రామములోని యీశ్వర దేవాలయములో రంగమండపమున కెదుటనున్న ఱాతిపైఁగల శాసనమువలనఁ దెలియుచున్నది. జన్నిగదేవమహారాజు పరిపాలనకాలములో పల్నాటిసీమలోని కారెముపూడి గ్రామమునఁ బ్రతిష్ఠచేయఁబడిన సురేశ్వరాలయమునకుఁ బ్రాకారములును గోపురమును నిర్మింపఁబడినవి. నామయ యనుకరణముచే దుర్గిలేక దుర్గయపట్టణమున గోపీనాథుని యాలయము శా. శ. ౧౧౯౧ అనఁగా క్రీ. శ. ౧౨౬౯వ సంవత్సరమునఁ గట్టఁబడినది. ఈ సంవత్సరమువరకుఁ దరువాత నీతనినామము మఱియెచ్చటను వినంబడనందున నీతఁడు క్రీ. శ. ౧౨౭౦ వఱకుమాత్రము జీవించెనని యూహింపఁదగినది.

త్రిపురాంతక దేవమహారాజు

కాయస్థకులార్ణవచంద్రు లయిన గంగయసాహిణియు అతని మేనల్లుఁడైన జన్నిగదేవ సాహిణియు స్వర్గస్థు లయిన పిమ్మట త్రిపురాంతక దేవమహారాజు రుద్రమదేవికిఁ బ్రధానియు సైన్యాధ్యక్షుఁడునై కమ్మనాడు, ములికినాడు, పొత్తపినాడు, ఏరువనాడు, గండికోట మొదలగు సీమలను నధికారియై ప్రతినిధిపాలకుండై పరిపాలించి వాసికెక్కెను. మఱియు నితఁడు తన శాసనములలో "శ్రీమన్మహామండలేశ్వర బాహత్తరనియోగాధిపతి, అనేక దేశాధిపతి చాతుర్వర్ణ్యసముద్ధరణ, పశ్చిమరాయదామోదర దిశాపట్ట, ఏకాంగవీర, వీరావతార, అతివిషమహాయారూఢ ప్రౌఢరేఖారేవంత, విజయలక్ష్మీకాంత నాయక, నారాయణ, కదనప్రచండ స్తంభ స్తంభితసకలక్షితిపాల శౌర్య యశస్తోమతిలకితదిగంగనాముఖ, వితరణ గుణవినిర్జిత కామధేను కల్పద్రుమ

ప్రణతసకలనరపతి మణిమకుట కోటిమకరికాచుంబ్యమాన చరణనఖకిరణ కందళ కాకతికులతిలక రుద్రదేవ మహారాజ చరణనళినయుగళ సమారాధన, సమధిగతసకలరాజ్యాధిపత్యమహావిభవ, చలమర్తిగండ, మూరురాయ జగదళ మండలీక బ్రహ్మరాక్షస, గండపెండారు, త్రిపురాంతక దేవ మహారాజులు" అను విశేషణములతోఁ బేర్కొనఁబడి యుండుటచేతనే రుద్రమదేవి చక్రవర్తినీకాలమున నప్రతిమానప్రతాపవంతుఁడై యుండెనని వేద్యము గాక మానదు. ఈబిరుదావళి నంతయుఁ గణపతిదేవచక్రవర్తి సైన్యాధ్యక్షుఁడైన గంగయ సాహిణియు వహించి యుండుటచేత నితఁడాతనికి కుమారుఁడో సోదరుఁడో యై యుండవలయు నని యూహించుచున్నాఁడను. అంబదేవ మహారాజు కుమారుఁడు త్రిపురాంతకదేవుఁడని సిద్ధవటము సీమలోని వరికుంటగ్రామములో నొక శిలాశాసనమునం గలదని యొకస్థానిక చరిత్రమునం జెప్పఁబడినది గాని దొరతనమువారి శాసనపరిశోధకులు "అంబయదేవ మహారాజును" త్రిపురాంతకదేవుని కనిష్ఠ సోదరునిగాఁ బేర్కొని యున్నారు[1]. వీరి సిద్ధాంతమే సరియైనది కావచ్చును. అంబయదేవుఁడు త్రిపురాంతకదేవుఁడు వీర లుభయులును గూడ కడప మఠాధిపతి యైన అఘోరశివాచార్యులవారి శిష్యులయిన వీరశైవులుగా నుండి యనేకదానములను జేసి ప్రఖ్యాతి వహించియుండిరి. త్రిపురాంతకదేవుఁడు మొదట దువ్వూరును తరువాత ములికినాటి సీమలోని వల్లూరుపట్టణమును రాజధానులుగఁ జేసికొని పరిపాలనము చేసెను. రుద్రమదేవి పరిపాలన ప్రారంభకాలమున స్వతంత్రులగుటకుఁ బ్రయత్నించి దేశముయొక్క శాంతికి భంగము కలిగించిన విజయగండగోపాలుఁడు, ఎరుకమానుమిలిదేవరాజు, సిద్ధయదేవ చోడరాజు, మొదలగు చోడులను జయించి దేశమున శాంతిని నెలకొలిపె నని తెలియుచున్నది. ఇతఁడు వీరశైవుఁడైనందున శైవగురువులకును శైవమఠములకును, త్రిపురాంతకములోని శ్రీత్రిపురాంతక దేవునకును శ్రీశైల మల్లికార్జున దేవునకును

1. Annual Report on Epigraphy for 1906. No. 492. Public 2nd July 1906.

అనేక భూదానములను జేసి యుండెనని త్రిపురాంతకము మొదలయిన ప్రదేశములలోఁ గలయనేకశిలాశాసనములవలన వ్యక్తమగుచున్నది.

అంబయదేవమహారాజు

త్రిపురాంతకుని కనిష్ఠసోదరుఁడుగాఁ జెప్పఁబడిన యంబయదేవమహారాజు గండికోట మనోరథపురము రాజధానిగ గండికోట, ములికినాడు, రేనాడు, పెనాదాడి, పెడకల్లు, సకిలియెరువ, పొత్తపినాడు, మొదలుగాఁగల సీమలనేలుచు త్రిపురాంతక దేవునకు సహాయుఁడై యుండెను. ఇతనికి ఘోడెరాయగంగిదేవయ్య సేనాపతిగ నుండెను. అంబదేవుఁడు శ్రీపతి గణపతి యను వానిని జయించి "రాయసహస్రమల్లుఁడు" అను బిరుదమును వహించెను. మఱియు నితఁడు దోర్గర్వమున నెల్లశత్రురాజుల యుద్ధరంగమున నెదుర్కొని యెరువమల్లిదేవుని, కేశవదేవుని, సోమిదేవుని, అల్లుగంగుని, దేవబ్రాహ్మణులకు గర్భశత్రువైన మల్లికార్జునిని, కదంబరాజయిన దామోదరుని జయించెను. రాజ్యభ్రష్టుఁడైన మనుమగండగోపాలుని విక్రమసింహపురంబున సింహాసన మెక్కించెను. కడవరాయని నాశనము గావించెను. ఇతఁడును త్రిపురాంతకదేవునివలెనే బ్రాహ్మణులకు దేవ మత గురువులకు దేవమతములకు శివాలయములకు ననేక భూదానములను గావించెను. ఊటుకూరునం దొకగొప్ప చెఱువు త్రవ్వించి అంబసముద్రమని పేరు పెట్టించెను. ఇతని మంత్రి అత్తిరేల యనుగ్రామములోని పరశురామేశ్వరుని యాలయమునకు మాన్యము లొసంగి యారామముల నిర్మించి సత్రములను గట్టించెను. కొన్ని గ్రామములలో చెఱువులు కాలువలు త్రవ్వించెను. పొత్తపినాటి సీమనంతయు గొలిపించి కొల యేర్పరించెను. మఱియు ననేక సత్కార్యము లాచరించినట్లు తెలియుచున్నది. త్రిపురాంతక దేవుఁడును, అంబయదేవమహారాజును రుద్రమదేవి కాలమున మాత్రమె గాక రెండవ ప్రతాపరుద్ర చక్రవర్తి కాలమునఁ గూడనుండి రుద్రమదేవి యనంతరము స్వతంత్రులగుటకుఁ బ్రయత్నించియు సాధ్యముగాక యతనివలనఁ బరాజితులై తమ తొంటి యధికారములను గోల్పోయినట్లు గన్పట్టుచున్నది.

గోనగన్నారెడ్డిసాహిణి

కాకతి రుద్రమదేవి సైన్యాధిపతులలో నొక్కఁడగు గోనగన్నయ సాహిణి వర్ధమానపురము రాజధానిగా నాంధ్రసామ్రాజ్యముయొక్క పశ్చిమ భాగమున కంతయు నధికారియై పరిపాలనము సేయుచు నామెకు దక్షిణ భుజమై యొప్పియుండెను. ఈగోనగన్నారెడ్డికి విఠలనాథుఁడు సేనాపతిగా నుండెను. ఇతఁడు సర్వరాష్ట్రసమస్తప్రజారక్షణార్థమై రాయచూరుదుర్గమును శా. శ. ౧౨౧౬ (౧౨౯౪) సంవత్సర మార్గశీర్ష శుద్ధ సప్తమినాఁడు నిర్మించె నని యాదుర్గముపై నొకగోడమీఁద లిఖింపఁబడిన శాసనమువలనఁ దెలియుచున్నది. ఆశాసనములో గోనగన్నయ్యరెడ్డి సమస్త గుణగణాకరుం డనియు సత్యరత్నాకరుం డనియు సౌజన్యగౌరవుం డనియు, అరిగండ భైరవుం డనియు సాహసోత్తుంగుఁ డనియు, కాకతీయ కటక సన్నాహుఁ డనియు, వీరవితరణోత్సాహుఁ డనియు, వడుపులూరి పురవరాధీశ్వరుం డనియు, వీరలక్ష్మీనిజేశ్వరుండనియు, మనుమకుల కమల మార్తాండుఁ డనియు, కదనప్రచండుఁడనియు, మీసరగండఁడనియు, ఉభయబలగండఁడనియు, గండరగండఁడనియు, అభంగ గండభేరుండుఁ డనియు, హన్నిబ్బరగండఁడనియు, హదిమువ్వరగండఁ డనియు, లాడకువర పెండారుఁ డనియు, చోళజగజాళవీరకాంతికాయుఁ డనియు, గళవాళియనియు, సంతతార్చిత శశివాళి యనియు, కామినీజయంతుం డనియు, దుష్టతురగరేఖారేవంతుఁ డనియు, సమరసమయుం డనియు, దుర్వారవీరావతారుం డనియు, కోసఁగిమైలి తలగొండుగం డనియు, ఉప్పలసోమని తలగొండుగం డనియు, పండిభూపాలునితలగొండు గండనియు, అక్కినాయకుని తలగొండుగం డనియు, మేడిపలికాచయనాకురిశిరఖండనుఁడనియు, కందూరికేశినాయని తలగొండుగం డనియు, చాపాకభీమనిర్ధూమధాముం డనియు, నిరుపమసంగ్రామరాముండనియు, తెత్తాలకాటకిశాపట్టనియు ఏఱుకతొండగోధూమఘట్టనఘరట్టనియు, బేడ చెలుకినాయని నిస్సాహణాపహరణుండనియు, సహజకార్యభరణుం డనియు, కోటపెర్మాడిరాయ కంఠాభరణ చూఱకాఱుం డనియు, చోడోదయ పట్టసూత్ర తురంగాపహారుం డనియు, రుద్రదేవ దక్షిణ భుజ

దండుఁ డనియు, నిజకీర్తిపూరిత బ్రహ్మాండకరండుం డనియు, పరబలోద్దండుఁ డనియు, శ్రీసోమనాథదేవ దివ్యశ్రీపాదపద్మారాధకుం డనియు, పరబలసాధకుండనియు, అనేకబిరుదునామములతో నభివర్ణింపఁబడి యుండెను. ఇతఁడు సంతతార్చిత శశివాళి యని పేర్కొనఁబడుటచేతనే శివభక్తుఁ డని తెల్లమగుచున్నది. ఇతఁడు వర్ధమానపురమునందుండి ప్రభుత్వము సేయుచుండఁగా తద్రాజ్యరక్షామణియైన విఠలనాథుఁడు శ్రీనారాయణదేవదివ్య శ్రీపాదపద్మారాధకుం డని పేర్కొనంబడి యుండుటచేత నాతఁడు విష్ణుభక్తుఁ డని వేద్య మగుచున్నది. ఈవిఠలనాథుఁడు ఆదవని, తుంబుళము, మానువ, హాలువ, దుర్గములు సాధించినట్లుగా రాయచూరుశాసనమున లిఖియింపఁ బడినది. పైని గన్నయ్యరెడ్డికిఁ జెప్పఁబడిన విశేషణములలోఁ బేర్కొనంబడిన పట్టణము లన్నియును రాయచూరుమండలములోనివిగ నున్నవి. ఆపట్టముల యొక్కయు వాని నాయకులయొక్కయు చరిత్రమును దెలుపునట్టి శాసన ప్రమాణము లేవియు దొరకియుండనందునఁ జెప్పుటకు సాధ్యపడదు.

గోనబుద్ధారెడ్డి రంగనాథరామాయణము.

ఈగోనగన్నారెడ్డి రంగనాథరామాయణమును రచించిన గోనబుద్ధారెడ్డి తండ్రి యగునేమో కొంచెము విచారింపవలసి యున్నది. రంగనాథుఁడను నాతఁడు రామాయణమును ద్విపదకావ్యముగా రచియించెను. కనుకనే యాగ్రంథమునకు రంగనాథరామాయణ మను పేరు గలిగిన దని చెప్పుదురుగాని గ్రంథమునందు గోనబుద్ధరాజు రచించినట్లు గానంబడుచున్నది. మనుమూరి సంస్థానాధిపతి యగు బుద్ధరాజున కాశ్రితుఁ డయిన రంగనాథుఁ డనుకవి తన ప్రభువుపేరిట రచించెనేకాని బుద్ధరాజురచింపలేదనియు బుద్ధరాజు రచించి యుండునేని బుద్ధరాజ రామాయణ మను పేరే నిలిచి యుండునుగాని రంగనాథరామాయణ మను పేరు నిలిచియుండుటకుఁ గారణము గానరాదనియును, గొందఱు చెప్పుదురు. మఱికొందఱు రంగనాథుఁడు బుద్ధరాజునకు బంధుఁడనియు దూపాడుపరగణా కధికారిగ నుండె ననియుఁ జెప్పుదురు. ఈగ్రంథము

నకు మొదట బుద్ధరాజునకుఁ 'కవిలోకభోజుండు' అని విశేషణము చెప్పఁబడినది. నిజముగా బుద్ధారెడ్డియే యీ గ్రంథమును రచించి యుండినయెడలఁ దాను కవిలోకభోజుండని యాత్మస్తుతి చేసికొనునా యని కొందఱు శంకించుచున్నారు. ఈ యుత్కృష్టమనోహరమైన కావ్యమును ఎవరు రచించినను ఇందలి కాండాంతమునందలి

"ద్వి అని యాంధ్రభాష భాషాధీశనిభుఁడు
వినుతకావ్యాగమ విమల మానసుఁడు
పాలితాచారుఁ డపారధీశరధి
భూలోకనిధికోన బుద్ధభూవిభుఁడు
తమతండ్రి విఠ్ఠలధరణీశు పేరఁ
గమనీయగుణధైర్యకనకాద్రి పేరఁ
బనిపూని యరిగండ భైరవు పేర
నాచంద్రతారార్కమై యొప్పమీఱ
భూచక్రమున నతిపూజ్యమై వెలయ
నసమానలలితశబ్దార్థసంగతుల
రసికమై చెలువొందు రామాయణంబు
పరఁగ నలంకారభావన ల్నిండఁ
గరమర్థి......కాండంబు సెప్పె."

అనువాక్యములవలన గోనబుద్ధరాజు తనతండ్రివిఠ్ఠల ధరణీశు పేర రచియించినట్టే వ్రాయఁబడియున్నది. దీనింబట్టి బుద్ధరాజు తండ్రి విఠ్ఠలనాథుఁడని స్పష్టమగుచున్నది. కాని ఉత్తరరామాయణమును ద్విపదగా రచియించిన కాచవిభుఁడును పినవిఠ్ఠలభూపతియును తమతండ్రి బుద్ధరాజనియును బుద్ధరాజు గోనకోట గన్నక్షితీంద్రునకును అన్నమాంబికకును దనయుండనియును తద్గ్రంథ పీఠికలో

"ద్వి. గోనకులార్ణవసకలమేశుండు
వానొప్పుకోట గన్నక్షితీంద్రునకు

ననఘాత్మయగుచున్న యన్నమాంబికకుఁ
దనయుండు బుద్ధాభిధానుండు పనుప
నారయ మత్స్యకూర్మాది దివ్యావ
తారంబులం దెల్లఁ దలఁచి చూడంగ
రామావతారంబు రమణీయ మగుట
రాముపావనచరిత్రము దివ్యభాష
లోకానురంజన శ్లోకబంధములఁ
జేకొని వాల్మీకి చెప్పినజాడ
మాతండ్రి బుద్ధక్షమానాథు పేర
నాతతనృపకైరవాప్తుని పేర
ఘనుఁడు మీసరగండ కాచవిభుండు
వినుతశీలుఁడు పినవిఠల భూపతియు
నని జనుల్ మముఁ గొనియాడఁగ మేము
వినుత నూతన పద ద్విపదరూపమునఁ
బ్రాకటంబుగ నాంధ్రభాషను జెప్పఁ
గైకొన్నయుత్తరకథ యెట్టి దనిన"

అని వ్రాసియున్నారు. రంగనాథరామాయణములో బుద్ధభూవిభుని తండ్రి విఠలధరణీశుఁ డనియు,' ఉత్తరరామాయణములో బుద్ధారెడ్డి తండ్రి గన్నారెడ్డి యనియుఁ జెప్పఁబడియుండుటచేత నొండొరులకుఁ గలసంబంధమును దెలిసికొనుటలోఁ గష్ట మెక్కువ యగుచున్నది. పై రాచూరు శాసనములోఁ జేర్కొనంబడిన గోనగన్నారెడ్డియును, విఠలనాథుఁడును రంగనాథ రామాయణములోను ఉత్తరరామాయణములోను జేర్కొనంబడిన విఠలధరణీశుఁడును గన్నక్షితీంద్రుఁడును ఒక్కరే యని చెప్పవచ్చును గాని బుద్ధరాజుతండ్రి గన్నక్షితీంద్రుఁడా విఠలనాథుఁడా యనునది సందిగ్ధముగా నున్నది. రాచూరు శాసనమును బ్రకటించిన శ్రీమానవల్లి రామకృష్ణయ్య. ఎం ఏ. గారు గోనగన్నయ్యారెడ్డియు, విఠలనాథుడును సోదరు లనియు, పినతండ్రి పెదతండ్రులను గూడ

తండ్రి లని చెప్పు నాచారము కలదు గావున గన్నయ్యరెడ్డి కుమారుఁడైన బుద్ధారెడ్డి పినతండ్రియైన విఠలధరణీశునికిఁ గృతి నొసంగుచు తండ్రి యని పేర్కొని యుండు నని యూహించుచున్నారు. 1

బుద్ధారెడ్డి కూఁతురు కుప్పమాంబ శాసనము.

గోనబుద్ధారెడ్డికి కుప్పమాంబ లేక కుప్పసానమ్మ యను నొక కొమార్త గలదు. ఈమె శాసనములు బూదపూరు, వర్ధమానపురములలో రెండు మూఁడు గలవు. ఈమె తనబూతుపూరి శాసనములో నీక్రిందివిధముగా ఈశ్వర భట్టోపాధ్యాయుల వారిచే నభివర్ణింపఁబడినది.

"శ్రీగోనవంశనిజశేఖగబుద్ధయాఖ్యపుత్రీ పవిత్రచరితా భరితాగుణౌఘైః
శృంగారసారకరణిః కరణీయదక్షా కుప్పాంబి కాజని చ తస్య సతీ కళత్రమ్"

బుద్ధారెడ్డి యింటిపేరు గోనవారుకాని కోనవారు కాదని గనంబడుచున్నది. రంగనాథరామాయణముద్రణకర్తలు గోనశబ్దమును కోనశబ్దముగ మార్చినట్లు గన్పట్టుచున్నది. అయినను తెలుఁగుభాషలో క[illegible]రము గకారముగా నుచ్చరింపఁబడు పదము లనేకములు వాడుకలోఁ గలవు. ఈ గోనబుద్ధారెడ్డి కూఁతు రయిన యీ కుప్పమాంబ కాకతి మహాదేవరాజు వంశమునందు జనించి కాకతి రుద్రదేవీ ప్రసాదాసాదిత రాజ్యలక్ష్మీ నివాసుండైన శ్రీమల్యాల గుండదండాధీశ్వరుని కిచ్చి వివాహము చేయఁబడియెను. ఈమె శా. శ. ౧౧౫౮ ధాతుసంవత్సర మాఘశుద్ధ దశమీ గురువారమునాడు స్వర్గస్థుఁడైన తనభర్త గుండయపేరను లింగప్రతిష్ఠ గావించి బూదుపూరను పొతుముదుగున భూదానముల ననేకములను గావించెను. ఈ శాసనమును బట్టి క్రీ. శ. ౧౨౭౬ వ సంవత్సరము నాఁటికి నీమె భర్తృమృతి నొందె ననియు, ఈమెకు బాబయ, బొప్పండు, గణపతిదేవుఁడు, పర్వతము మల్లయ యను కొడుకులును, మల్లయ, బుద్ధయ, విఠ్ఠయ, కాటయ, పిడుగుగుండయ యను తమ్ములును

1. The Lithic Records in Hyderabad by M. Ramakrishna Kavi M. A. The Rachur Inscription of Gona Gannayya Reddi.

గల గనియును తెలియుచున్నది. కుప్పమాంబ సోదరులలో నొకఁడగు కాటయకు కాచయ యను నామాంతరము గలదేమో తెలియరాదు. అప్పుడు కాచవిభుఁడును విఠలభూపతియు కుప్పమాంబసోదరు లగుటచేత రంగనాథ రామాయణమును రచించిన బుద్ధారెడ్డియు, కుప్పమాంబ తండ్రి యగు గోన బుద్ధారెడ్డియు నొక్కరే యని చెప్పుటకు సంశయింపం బని లేదు.

నాగదేవమహారాజు.

కాకతి రుద్రదేవి సైన్యాధ్యక్షులలో నొక్కఁడగు నాగదేవ మహారాజు విక్రమసింహపురము రాజధానిగా పాకనాటిని బరిపాలనము సేయుచుండెను. ఇతనికి పోతయసాహిణి మంత్రిగ నుండెను. ఈ మహామండలేశ్వరుని గూర్చి నెల్లూరి చరిత్రమునందు వివరించి యున్నాను. మార్కండేయ పురాణమును గృతి నొందిన గన్నమంత్రి తండ్రియగు నాగచమూపతియు నై నాగదేవ మహారాజు నొక్కరేయని యూహింపవచ్చును. అట్లయినయెడల నాగదేవ చమూపతి చతుర్థవంశమున జనించిన మల్లసైన్యవిభునకును పోలాంబకును బుట్టె నని మార్కండేయపురాణములోని:—

"ఉ. ఆరమణీయ దంపతుల కన్వయరత్నము బంధులోకమం
దారము ధైర్యమందర ముదాత్త దయానిధి దానధర్మ వి
ద్యారసికుండు నాగవిభుఁ డంచితభాగ్యపరుండు పుట్టెఁ బెం
పార శచీపురందరుల కర్థిజయంతుఁడు పుట్టినట్లుగన్."

అను పద్యమువలనఁ దేటపడఁ గలదు. ఇతఁడు గణపతిదేవ చక్రవర్తి తలవరియైన మేచయనాయకుని కూఁతురగు మల్లమాంబికను వివాహ మయ్యెను. ఈ దంపతులకు జనించి ప్రతాపరుద్రచక్రవర్తికడ సైన్యాధిపతులుగ నుండి ప్రఖ్యాతి కెక్కిన గన్నయాదులు మార్కండేయ పురాణమున నిట్లభివర్ణింపఁబడిరి.

"శా. ఆమల్లాంబకు నాగశౌరికి విశిష్టాచారు లుద్యద్గుణ
స్తోమాకల్పు లనల్పకీర్తిపరు లస్తోకస్థిరశ్రీయుతుల్

దీమంతు ల్సరు లుద్భవించి రాగి, గాంతేయ ప్రభావోన్నతుల్
గామప్రఖ్యులు వహ్నితేజులు జగత్ప్రఖ్యాత శౌర్యోదయుల్."

ప్రతాపరుద్ర చక్రవర్తి జననము.

కాకతి రుద్రదేవికి ముమ్మక్క లేక ముమ్మడమ్మ, రుయ్యమ్మ అను నిరువురు కూఁతులు గలరు. ముమ్మడమ్మ చాళుక్యవంశోద్భవుం డైన వీరభద్రరాజున కిచ్చి వివాహము చేయఁబడియె నని స్థానిక చరిత్రమునం బట్టి దెలియుచున్నది గాని ముమ్మడమ్మభర్తయొక్క చరిత్రము లేశమాత్రము దెలియరాకున్నది. రెండవకొమార్తె యగు రుయ్యమ్మను ఇందులూరి అన్నదేవభూపాలుని కిచ్చి వివాహము చెసినట్లు, ఇందులూరి వారి వంశచరిత్రమును బట్టి దెలియుచున్నది. ఈ రాజకుమారు లిరువురును రుద్రదేవి చక్రవర్తినికి లోఁబడిన సామంతమాండలిక ప్రభువు లయి యుండవలయును. ముమ్మడమ్మకు నిరువురు పుత్త్రులు జనించిరి. మొదటి పుత్త్రుని నామము ప్రతాపరుద్రదేవుఁడు. రెండవ పుత్త్రుని పేరు అన్నమదేవుఁడు. రుయ్యమ్మకు సంతానము లేదు. ప్రతాపరుద్రుఁ డెప్పుడు జనించెనో మనకు సరిగాఁ దెలియదు. శా. శ. ౧౧౭౭ వది యగు నందన సంవత్సర చైత్రశుద్ధ పంచమీ గురువారమునాఁడు రోహిణీనక్షత్రమున బ్రాహ్మణీముహూర్తమున సూర్యాంగారకబృహస్పతు లుచ్చస్థానగతులై శని నిజస్థానంబున నుండ ముమ్మడమ్మ గర్భమునుండి ప్రతాపరుద్రుఁడు జనించె నని స్థానిక చరిత్రమునందుఁ జెప్పఁబడినదిగాని యది సరియైనదిగాఁ గన్పట్టదు. కాకతి గణపతి చక్రవర్తి క్రీ. శ. ౧౨౬౦ వఱకు జీవించియుండి పరిపాలనము చెసినట్లు శాసనములు వేనోళ్లఁ జాటుచున్నవి. ప్రతాపరుద్రుఁడు స్థానికచరిత్రమునం జెప్పఁబడినట్లు క్రీ. శ. ౧౨౪౪ గవ సంవత్సరమున జనన మందినది సత్యమగునేని గణపతి చక్రవర్తి మరణకాలము నాఁటికి ౧౬ సంవత్సరములు వయస్సుగలవాఁడై యుండవలయును కదా! అట్టి సందర్భమునఁ దన రాజ్యమునకు ప్రతాపరుద్రునికిఁ దానే పట్టము గట్టియుండును. అతఁడు పట్టము గట్టకయున్నను రుద్రమదేవి యైనను ప్రతాపరుద్రుని అభిషిక్తుని గావించి యుండును. అట్లు జరుగక రుద్రమదేవి పరిపాలనము సేయుట సంభవింపదు. ప్రతాపరుద్రుఁడు క్రీ. శ. ౧౩౨౩ వఱకుఁ బరిపాలనము చేసియుండెను గనుక నెనుబది సంవత్సరములు జీవించి యున్నవాఁడని చెప్పవలసివచ్చును. విద్యానాథ మహాకవికృతమైన ప్రతాపరుద్రయశోభూషణ మను నలంకారశాస్త్రగ్రంథమునందు రుద్రమదేవి రాజ్యపరిపాలనము చేసినట్లు స్పష్టముగాఁ జెప్పఁబడియున్నందునను "మార్కోపోలో" అను వెనీసువర్తకుఁ డామెపరిపాలనమును శ్లాఘించి నలువది సంవత్సరముల నుండి పరిపాలనము సేయుచున్న దని చెప్పియున్నందునను రుద్రమదేవి పరిపాలనము చేసిన దను మాట నిరాకరింపఁదగినది కాదు. కాఁబట్టి భావిపరిశోధనములవలనఁ బ్రతాపరుద్రుఁ డెప్పుడు జనించెనో ఎప్పుడు పట్టాభిషిక్తుఁడయ్యెనో తెలియు పర్యంతము రుద్రమదేవి క్రీ. శ. ౧౨౯౫ వఱకును బరిపాలనము చేసి తరువాత రాజ్యభారమును మనుమనిపైఁ బెట్టెనని యూహింతము. మనుమఁ డయిన ప్రతాపరుద్రుని రుద్రమదేవి కుమారునిగాఁ బెంచుకొన్నట్టు గానిపించుచున్నది. ఏశాసనమునందు రుద్రమదేవి గణపతికూఁతు రని చెప్పఁబడినదో ఆశాసనమునందు రుద్రమదేవికి రుద్రదేవుఁ డను కుమారుఁడు గలఁ డని యీ క్రింది శ్లోకములోఁ జెప్పఁబడినది.

" శ్రీవిశ్వేశ్వరదేశికేంద్రశివహస్తోద్భాసివోర్విక్రమ
స్త్రీక్షోణీశజగద్దశఃప్రతిబలప్రధ్వంసిజన్మోత్సవః
యస్యాః కాకతివంశమౌక్తికమణిః శ్రీరుద్రదేవ స్సుత
స్తస్యాః కిం కథయామ వైభవ మతః శ్రీరుద్రదేవ్యాః పరం "

శ్రీరుద్రదేవి తన మనుమనికి వయస్సు వచ్చినదని తెల్సికొన్న తరువాతనే రాజ్యభారము నొప్పగించె నని ప్రతాపరుద్రయశోభూషణమందుఁ జెప్పఁబడినది.

అన్నమదేవ భూపాలుఁడు.

రుద్రమదేవి రెండవయల్లుఁడైన అన్నమదేవ భూపాలుఁడు అనుమకొండకుఁ దూర్పున సింహాచలమువఱకు నుండు దేశమును తనయన్నయగు కొలని రుద్రమనాయని సాహాయ్యముతో జయించి రుద్రమదేవికి దక్షిణభుజమై యొప్పుచుండినవాఁడు. ఇతఁడు సూర్యవంశజుఁడని చెప్పఁబడియెను. ఇతని పూర్వులగు మైలము భీమన, మొదలగువారు ధరణికోట, కొలిపాక, కేతవరము, విజయవాడ మొదలగు ప్రదేశములం బరిపాలనము చేసి ప్రతిష్ఠగాంచినారు. వారిశాసనములు గణపతిచక్రవర్తి కాలమునాఁటి వఱకు కొలిపాక, కేతవరము, ధరణికోట మొదలగు ప్రదేశములఁ గానంబడుచున్నవి. మఱియు నావటుంబము వారియొక్క శాసనము లప్పటినుండి క్రీ. శ. ౧౩౧౭ వఱకు విజయవాటికయందుఁ గానంబడుచున్నవి. శా. శ. ౧౨౨౦ దవ సంవత్సరములో విజయవాటికయందు లిఖియింపఁబడిన యొక శాసనములో నొక అన్నలరాజు పేర్కొనంబడియెను. అం దతఁడు గోదావరికి వంతెన గట్టించె నని చెప్పఁబడినది. ఆభాగ మీ క్రింద నుదాహరించుచున్నాఁడను.

"ఆసీ త్కాంతమరాజేంద్ర స్సాసీ రిపువిజిత్వరః ।
ఆసీ న్మ్రదరణ శ్చక్రశాసీ తస్య తనూభవః ॥
ఆసీ దన్నలదేవేంద్రో దాసీకృతధరాపతిః ।
భాగీరథీపాథోధే స్సాగీతచరితాం బుధైః ॥
ఆర్యా నృపస్య త స్యాసీ ద్భార్యా కేశవనామకా ।
యాతుం యశాంసి యోజంతోః పాతుం చాంభసి మజ్జతః ॥
సేతుం బబంధ గోదాయా యా తుంగజలవీచికా । "

అన్నమదేవ భూపాలుఁడు రాజమహేంద్రవర ప్రాంతప్రదేశమును ముప్పది సంవత్సరములు పరిపాలనము చేసెనని స్థానికచరిత్రములందుఁ జెప్పఁ

బడినది. కాఁబట్టి పైశాసనములోఁ బేర్కొనంబడిన యన్నలరాజును స్థానికచరిత్రములం జెప్పఁబడిన యన్నమదేవ భూపాలుఁడును భిన్నులు గాక యొక్కరే యనియు, ఆయన, రెండవప్రతాపరుద్రచక్రవర్తికిఁ బినతల్లియగు రుయ్యాంబ పెనిమిటి యగు ఇందులూరి యన్నమదేవ భూపాలుఁ డనియు విశ్వసింప వచ్చును. ఇతనికి సంతానము లేనందున నితనియనుమతి గైకొనియే రుద్రమదేవి తనపెద్ద కొమార్త పుత్త్రుఁ డగు శ్రీ వీరప్రతాపరుద్రదేవునకుఁ బట్టము గట్టెను.

చెన్నపురి ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారములో వెలుగోటివారి వంశచరిత్రం బను పేరితో నున్న యొక పుస్తకములో గణపతిదేవునకు పుత్త్రసంతతి లేక రుద్రాంబిక యను కొమార్త యుండె ననియు, గణపతికిఁ బిమ్మట రేచెర్ల ప్రసాదాదిత్యుం డామె పురుషుండని ప్రకటించి సింహాసనంబునం గూరుచుండఁబెట్టి రాజ్యంబును దానె నిర్వహించుచు నామె కొకకన్యకను దెచ్చి పెండ్లి చేసె ననియు, ఆకన్యక కాపురమునకు వచ్చిన తరువాత, తనభర్తను స్త్రీనిగా నెఱింగి విషణ్ణహృదయయై యుండునంత నీ ప్రసాదాదిత్యుండు తెలిసికొని యొక మహాపురుషుని యనుగ్రహమున నారామాతిలకము పుత్త్రరత్నమును గాంచునట్లుగాఁ జేసి రుద్రదేవిని జంపి యాచిన్నవానిని రాజ్యాధిపతిని గావించె నని యున్నది. ఇది అవిశ్వసనీయమైనట్టి కథగా నున్నది.

రుద్రమదేవి పరిపాలనము.

ఇంకను రుద్రమదేవి పరిపాలనకాలమున దాదిసోమయసాహిణి మొదలగు ప్రసిద్ధులైన సైన్యాధిపతు లెందఱో గలరు గాని వారల చరిత్రము వివరముగాఁ దెలియరాదు. ఈమె ఇట్టి యవక్రపరాక్రమవంతు లయిన శూరవరుల సాహాయ్యముతో శత్రురాజులను ప్రతిపక్షుల నోడించి చిరకాలము నిష్కంటకముగా నాంధ్రసామ్రాజ్యమును బరిపాలనము చేసి తనయశస్సును లోకమున

వ్యాపింపఁజేసెను. ఈమె తన పూర్వులవలెనే ధర్మమును నీతిని గాపాడి దేశమునకు శాంతిని గలిగించి తనప్రజలచే మిక్కిలి భక్తిపూర్వకముగాఁ గొలువఁబడి ప్రేమింపఁబడుచు చిరకాలము పరిపాలనము చేసె నని "మార్కోపోలో" అను వెనీసువర్తకుఁడు శ్లాఘించి వ్రాయుటయె యీమెప్రతిభావిశేషమును వేనోళ్లఁ జాటుచున్నది.

పదుమూడవ ప్రకరణము.

శ్రీవీరప్రతాపరుద్ర దేవచక్రవర్తి పాలనము.

(క్రీ. శ. ౧౨౯౫ మొదలుకొని క్రీ. శ. ౧౩౨౧ వఱకు)

ఇట్లు పదుమూఁడవశతాబ్దము నంతమున రుద్రదేవికి దౌహిత్రుఁడును దత్తకుమారుఁడు నైన శ్రీకాకతివీరప్రతాపరుద్రదేవ మహారాజు త్రైలింగ్య సామ్రాజ్యభారమును వహించి అధ్యాసిత వజ్రసింహాసనుండై శిష్టరక్షణమును దుష్టశిక్షణమును గావింపుచు ప్రజాపరిపాలనము చేయ నారంభించెను. ఇతఁడు యౌవనవంతుఁ డైన వెనుక రుద్రదేవికాలమున దేశమునకు బాధ కలిగించు చుండిన సామంతనృపతులను జయించి యాంధ్రసామ్రాజ్యము దినక్రమ ప్రవర్ధమానమై వెలుంగునట్లు ప్రయత్నించి సఫలీకృత మనోరథుఁ డయ్యెను. ఆంధ్రభాషను మాటలాడిన ప్రజలనెల్ల నేకచ్ఛత్రము క్రిందికిఁ గొనివచ్చెను. ఈరెండవ ప్రతాపరుద్ర చక్రవర్తికాలంబున నాంధ్రసామ్రాజ్యము నవలక్ష ధనుర్ధరులతో నొప్పుచుండెను.

ఏకశిలానగరము.

ఆకాలమున నుత్తరహిందూదేశంబునం దురుష్కులకు రాజధానీనగరమై ప్రసిద్ధి వహించియున్న ఢిల్లీ నగరమునకన్న నైశ్వర్యప్రభావమున మిన్నయై దక్షిణహిందూస్థానంబునం గల పురంబులలో నెల్ల మేటి యై, శత్రుజన

భయంకరమై, ఏకశిలానగరము వన్నెకెక్కి యుండెను. ఎక్కడఁ జూచినను దేవాలయ గోపురంబులును, ఎక్కడ వీక్షించినను రాజభవనంబులును రమణీయంబులై ప్రకాశించుచుండెను. ఏకశిలానగరములోని సౌధాగ్రములు మణిహేమకుంభములతో నలంకరింపఁబడి యున్నవని యొకకవి వర్ణించి యున్నాఁడు. మంచనగోవిందశర్మయను బ్రాహ్మణుఁడు టిట్టిభసెట్టి యను వైశ్యమిత్త్రునితోడ నేకశిలానగరమును బ్రవేశించిన విధానమును వల్లభామాత్యకవి క్రీడాభిరామ మను గ్రంథమున నిట్లభివర్ణించి యున్నాఁడు.

"సీ. సప్తపాతాళ విష్టప మహాప్రస్థాన
ఘంటాపథం బైన ఘనసుపరిఖ
తారకామండల స్తబకావతంసమై
కనుచూపు గొనని ప్రాకారరేఖ
పుంజీభవించినభువన గోళము భంగి
సంకులాంగణ మైన వంకదార
మెఱుఁగు టెక్కలతోడి మేరుశైలముఁబోలు
పెనువైఁడి తలుపుల పెద్దగవిని
గీ. చూచిచేరెఁ బ్రవేశించెఁ జొచ్చెఁ బ్రీతి
సఖుఁడు దానును రథఘోట శకటకరటి
యూథసంబాధముల కొయ్యనొసరిలుచు
మందగతి నోరుగల్లు గోవిందశర్మ."

మఱియు :—

"రాజమార్గంబు వారణఘటా ఘోటక
శకటికాభటకోటీ సంకులంబు
ధరణీస్థలీరజ స్త్రసరేణు బహుళంబు"

అతిశయోక్తులను విడిచిపెట్టిన పక్షమున కోటచుట్టును గల యగడ్త మిక్కిలి లోఁతు గల దనియు, ప్రాకారములు మిక్కిలి యెత్తు గలవనియు, భావ మేర్పడుచున్నది.

నని యభివర్ణించి యున్నాఁడు. ఏకశిలానగర దుర్గప్రాకారములకు వెలుపలను లోపలను గూడ వాటిక లనియు వాడ లనియు వ్యవహరింపఁ బడెడు పేటలు విస్తరిల్లి యుండెను.

నాగయగన్నమంత్రి.

ఇమ్మహానగరమున కంతకును ప్రతాపరుద్రుని మంత్రులలో విశ్రుతుండగు "గన్నమనాయఁడు" అను కష్మసేనాని రక్షఃపాలుఁడై క్రమశిక్షణము నెఱపుచుండెను. ఈగన్నయమంత్రి మడికిసింగనకవి విరచిత మైన పద్మపురాణకృతికి భర్త యైన కందనమంత్రికి పిన్నతాత యని (అనఁగా గన్నయమంత్రి జ్యేష్ఠభ్రాత యైన గణపతికి కందనమంత్రి మనుమఁడని) శ్రీవీరేశలింగము పంతులుగా రాంధ్రకవులచరిత్రములో మడికిసింగనకవిం గూర్చి వ్రాయు సందర్భమునఁ దెలుపుటచేత నీగన్నయమంత్రిని వారు నియోగిబ్రాహ్మణుఁడని యభిప్రాయపడినట్లు విదిత మగుచున్నది. ఆయభిప్రాయము సరియైనది కాదు. గన్నయమంత్రి చతుర్థకుల భూషణుఁడని మారనకవికృత మైన మార్కండేయపురాణములో విస్పష్టముగాఁ దెలుపఁబడి యున్నది. గన్నయమంత్రికి నాయకత్వము ప్రతాపరుద్రునివలననే యనుగ్రహింపఁబడినట్లుగా మార్కండేయపురాణమున నీక్రింది పద్యములోఁ జెప్పఁబడినది.

"చం. ఎలమిఁ బ్రతాపరుద్ర మనుజేంద్రునిచేఁ బడసెం బ్రవీణుఁడై
కొలిచియు శౌర్యలీల రిపుకోటి రణావనిఁ గీటడంచియు
న్బలరిపుతుల్యవిక్రముఁడు నాగయగన్నవిభుండు తేజము
న్విలసితరాజ్యచిహ్నములు విశ్రుతలక్ష్మియు నాయకత్వమున్."

ఈగన్నమంత్రి కాకతిక్ష్మాతలాధీశకటకపాలుఁ డని మార్కండేయపురాణమునం బలుతావులఁ జేర్కొనఁబడి యుండుటయే గాక యీక్రింది పద్యములోఁ బ్రత్యేకముగా నభివర్ణింపఁబడియెను.

"సీ. తన సుందరాకృతిఁ గని వెఱఁ గందిన
వనిత లంగజా సొప్పఁ దనువుఁ జేయఁ
దన కళాచతురత్వమున కద్భుతం బందు
బుధులు భోజుని నేర్పు పొల్లు సేయఁ
దననయాభిజ్ఞత వినినప్రాజ్ఞులు దివి
జీవుని తజ్జ్ఞత యేపు డింపఁ
దనయాశ్రయంబున మను బంధు మిత్త్రి వ
ర్గము కల్పతరువు నాశ్రయముఁ దెగడ
గీ. తెగడి జగమున నెంతయుఁ బొగడువడసెఁ
గాకతిక్ష్మాతలాధీశకటకపాలుఁ
డమలసితకీర్తి ధనలోలుఁ డన్వయాబ్జ
షండ దినవల్లభుఁడు గన్న సైన్యవిభుఁడు."

ఇతఁడు ప్రతాపరుద్రకటాక్షవీక్షాపేక్షుపరాక్రమప్రకారుం డగుటయ గాక విద్యావిభూషణుం డగుటవలన శ్రుతి స్మృతి సంపన్ను లయిన భూసురోత్తములును, సమస్తశాస్త్రవిదు లయిన విద్వాంసులును, అఖిలపురాణ ప్రవీణు లయిన పౌరాణికులును, సరససాహిత్య విద్యావిశారదు లయిన కవివతంసులును, తన్నుఁ బరివేష్టింప నప్పటప్పట రమ్యహర్మ్యతలంబుల సుఖోపవిష్టుం డై సరసకథా వినోదంబులఁ గాలంబు గడపుచుండెను. ఇట్లు విద్వజ్జనానుగ్రహంబుఁ బడసిన యీగన్నమంత్రి తిక్కనసోమయాజి శిష్యుం డయిన మారయాకవివర్యునిచే మార్కండేయపురాణమును దెనిఁగింపఁ జేసి యేతత్కృతికి నాయకుం డయ్యెను. ఈనాగయ గన్నవిభుఁడు ప్రతాపరుద్ర దేవసామ్రాజ్యవర్ధనస్థిరవినీతికరణకుశలుండని మారనకవి యీక్రిందిపద్యములోఁ జెప్పుటయె యీ మంత్రిశిఖామణియొక్క ప్రతిభావిశేషమును వేనోళ్లఁ జాటుచున్నది.

"సీ. ఘనసముజ్జ్వలమూర్తి జనలోచనాంభోజ
ములకు మార్తాండుని మూర్తిగాఁగఁ
దననరోపార్జిత ధనమున కర్థిహ
స్తములు నిక్షేపణస్థలులు గాఁగఁ
దనభూరితరతేజ మనుపమ నిజవంశ
భవనంబునకుఁ బ్రదీపంబు గాఁగఁ
దనవినిర్మలయశంబునకు దిశాతటం
బులు దృఢశాసనశిలలు గాఁగఁ
గీ. బ్రకట గుణగణసంపదఁ బరఁగుచున్న
ధన్యుఁ డధికపుణ్యుండు ప్రతాపరుద్ర
దేవసామ్రాజ్యవర్ధనస్థిరవినీతి
కరణకుశలుండు నాగయగన్నవిభుఁడు."

ఎల్లయనాయకుఁడు - మేచయనాయకుఁడు.

ఇట్టి ప్రసిద్ధిగాంచిన నాగయగన్నవిభునకు నిరువురు సోదరులు గలరు. వార లిరువురును గూడ ప్రతాపరుద్రుని సేనానులుగ నుండిరి. వారిలో ఎల్లయ సైన్యనాథుఁడు గన్నమంత్రికిఁ బెద్దతమ్ముఁడు. ఉన్మదపరిపంథిసింధురసమాజ విదారణసింహ మని కవు లితనిం గొనియాడుచుండిరి. ఇతనికంటెను మూఁడవ సోదరుఁ డైన మేచయనాయకుఁడు సుప్రసిద్ధుఁడు. ఆకాలమునం దితఁ డెట్టి ప్రఖ్యాతి వహించి యుండినదియు నీక్రింది పద్యములవలన బోధపడకమానదు.

"చ. నయవినయాభిరాముఁ డగు నాగయ గన్నని కూర్మితమ్ముఁడ
న్వయనవరత్న దీపము దివాకర తేజుఁడు రాజనీతి ని
శ్చయనిపుణుండు నిర్మలవిచార వివేక పరాయణుండు మే
చయరథినీశుఁ డుజ్జ్వలయశస్స్ఫురణం బొగడొందె నిద్ధరన్.

"సీ. ఆశాగజేంద్ర కర్ణానిలంబునఁ దన
ప్రకటప్రతాపాగ్ని ప్రజ్వరిల్ల
దిగ్వధూదరహాస దీప్తులతోఁ దన
సితకీర్తిచంద్రికల్ చెలిమి సేయ
సకలమహీపాలసరసిజాకరములఁ
దనజయశ్రీవినోదంబు సలుపఁ
దతరిపుమకుట రత్నప్రభాబాలాత
పంబునఁ దనపదాబ్జంబు లలరఁ
గీ. దనరుఁ జలమర్త్యగండప్రతాపరుద్ర
మనుజవిభునకు సేనానియును మహాధి
కారియును నాప్తుఁడును నైపొగడ్తకెక్కు
మేరు ధీరుఁడు నాగయ మేచశౌరి."

ఇందులూరి రుద్రరాజు.

ఈ యిందులూరి రుద్రరాజు కాకతిప్రతాపరుద్రుని మాతామహి యగు ద్రమహాదేవికి ద్వితీయపుత్త్రిక యైన రుయ్యాంబకు భర్త యైన యన్నమ నకు సోదరుఁడై యుండెను. ఇతఁడు ప్రతాపరుద్రుని సైన్యాధ్యక్షులలో కఁడుగా నుండి యోరుగంటియొక్క తూర్పుగవని మొదలుకొని తూర్పున హాచలపర్యంతముగల భూభాగమునకంతకు రాజప్రతినిధియై పరిపాలనము సినట్టు గనంబడుచున్నది. ఇందులూరి వారివంశావళి యను గ్రంథమున నిం గూర్చి వ్రాయంబడియుండెను. ఇతనియొద్దఁ బ్రతాపరుద్రునకుం గల రవాధిక్యమును, ఇతని పరాక్రమాదులను జాటుపద్యము లనేకము లందు యఁబడినది. ఇతఁడు అన్నమదేవుని కన్న యనియును, ఏకశిలానగరము దలుకొని సింహాచలమునకుఁ గల భూభాగమును బరిపాలించె నని యీ ది పద్యములలోఁ జెప్పఁబడినది.

"క. ఘనుఁ డిందులూరి యన్నయ
జనకాగ్రిమ పుత్త్రుఁ డమల చారిత్రుం డిం
పునఁ గొలని రుద్రదేవుని
యనుపమగుణముల నుతింప నశక్యము మహిలో.
గీ. అనఘచరితుఁడు కొలని రుద్రావనీశుఁ
డఖిల జనులును వినుతింప నమలమహిమఁ
జెలఁగి యేకశిలాపురి సింహనగధర
పరిమితాంతరభూభాగభరము దాల్చె.
"క. అనుపమ చరితుం డగు రు
ద్రనరేంద్రు కరాళవారిధారలచేతన్
దునియని భూపతి సుతులును
తనియని ధరణీసురులును ధరణిం గలరే."

ప్రతాపరుద్రుని మహామాత్యులలో నొకఁడగు నీరుద్రరాజు నే కొలను ప్రతాపరుద్రుఁ డందురు. కొలననునది కృష్ణామండలములోని యేలూరు పట్టణమునకు నామాంతరము. ఇతఁ డాపట్టణమును నివాసస్థలముగాఁ జేసికొని యుండుటచేతను గాఁబోలు నీతనికి కొలను ప్రతాపరుద్రుఁ డని ప్రసిద్ధి గలిగెను!

బెండపూడి అన్నామాత్యుఁడు

కాశ్యపగోత్ర జాతుఁడైన పోలయామాత్యునకు ద్వితీయపుత్త్రుఁడైన అన్నయమంత్రి శ్రీవీరప్రతాపరుద్రచక్రవర్తియొక్క రాజ్యభారధురంధరులలో నొకఁడుగా నుండెను. శ్రీనాథమహాకవి తనభీమఖండమును ఈయన్నమంత్రిమనుమఁడును అల్లయవీరభద్రారెడ్డిమంత్రియు నగు అన్నమంత్రికి నంకితము సేయుచు పీఠికలో నీయన్నమంత్రి నీక్రిందిపద్యములో నీవిధముగా నభినుతించియున్నాఁడు.

“సీ. కాకతిక్ష్మాపాల గంధ దంతావళ
ధ్వజినీమహీధురంధరుఁ డనంగ
నవలక్ష కోదండనాథరాజ్యాంబోధి
సద్వర్ణపూర్ణిమా చంద్రుఁ డనఁగ
నాంధ్రభూమండలాధ్యక్ష సింహాసన
సంప్రతిష్ఠాపనాచార్యుఁ డనఁగ
వీరరుద్రాశేషవిశ్వంభరాధీశ
పృథుల దక్షిణభుజా పీఠ మనఁగ
గీ. యవనసంహారవిలయకాలాగ్ని యనఁగ
ధాటి విఘటిత కుమ్మటోద్యానుఁ డనఁగ
విశ్వలోక ప్రశస్తుఁడై వినుతి కెక్క
నతుల బలలీల పోలయయన్న శౌరి.”

ఈతఁడు ప్రతాపరుద్రుని గజఘటసేనల కధ్యక్షుఁ డనియు, నవలక్షధనుర్ధరులు గల రాజ్యాధిపతి సేనాసముద్రమునకుఁ జంద్రునివంటి వాఁ డనియు, ఆంధ్రభూమండలాధ్యక్ష సింహాసనప్రతిష్ఠాపకుం డనియు, వీరరుద్రమహారాజు యొక్క సమస్తరాజ్యభారధురంధరుఁ డనియు, యవనుల (తురుష్కుల) సంహరించుటలోఁ గాలాగ్నిరుద్రకల్పుఁ డనియు, కుమ్మట యను ప్రదేశమును జయించె ననియు, పైపద్యమునఁ జెప్పఁబడియుండెను. మఱియు నితనికి కొలని ప్రతాపరుద్రుఁడు విభాకరగ్రహణకాలమున నొక యగ్రహారమును దానము చేసె నని పైభీమఖండములోని యీక్రింది పద్యములోఁ జెప్పఁబడియున్నది.

“చ. కొలని ప్రతాప రుద్రనృపకుంజరుచేత నరేందుసారణీ
సలిలవివర్ధమాన బహుసస్యసమాకుల మగ్రహారమై
వెలయ విభాకరగ్రహణవేళఁ దగంగఁ బరిగ్రహించి బం
ధుల భరియించె నన్నవిభుతో సరి యెట్లు ప్రధాను లెవ్వరున్.

ఈ యన్నమంత్రి పరమమాహేశ్వరాచారతత్పరుఁ డైన నియోగి బ్రాహ్మణుండు. ఇతని దానశాసనములు కృష్ణామండలములోని శ్రీకాకుళమునం గలవు.

సాహిణిమారుఁడు-భాస్కరరామాయణము.

భాస్కరరామాయణకృతికిఁ బతి యైన సాహిణిమారుఁడు (మారయసాహిణి) ప్రతాపరుద్రుని యశ్వసైన్యంబున కధ్యక్షుఁడుగ నుండెను. అయోధ్యాకాండాది పద్యములో “బుద్ధయ కుమారసాహిణి మారా” అనియు, కాండాంతపద్యములో “కాచమాంబా కుమారా” యని కుమార రుద్రదేవుఁడు సంబోధించి యుండుటచేత సాహిణిమారుఁడు బుద్ధయకును కాచమాంబకును జనించె నని స్పష్ట మగుచున్నది. ఈబుద్ధయ రంగనాథరామాయణమును రచించిన గోనబుద్ధారెడ్డి యని కవులచరిత్రము దెలుపుచున్నది. “కోనకాట భూపతికుమారుఁడు రుద్రరాజు; రుద్రరాజు కుమారుఁడు బుద్ధరాజు; బుద్ధరాజు కుమారుఁడు విఠ్ఠలరాజు; విఠ్ఠలరాజు కుమారుఁడు బుద్ధరాజు; బుద్ధరాజకుమారుఁడు మారయ” అని కవులచరిత్రములో వంశక్రమము చెప్పఁబడినది కాని యిది యెక్కడనుండి గైకొనఁబడినదో దెలియరాదు. “రంగనాథరామాయణము బుద్ధరాజు రచియించినట్లుండుటచేతను, భాస్కరరామాయణ మారాజుపుత్త్రుఁడైన మారని కంకితము చేయఁబడుటచేతను సాహిణిమారుఁడా బుద్ధరాజు కొడుకే యైన పక్షమున” అని సందేహించి వ్రాయుటచేత పైని జెప్పిన వంశక్రమము సరి యైనది కా దని మన మూహింపవచ్చును. రంగనాథరామాయణమును రచించిన గోనబుద్ధారెడ్డికుమారుఁడు మారయ యని యనేకులు నిశ్శంకముగాఁ జెప్పియున్నారు. సాహిణిమారునితండ్రి గోనబుద్ధారెడ్డి క్రీ. శ. ౧౨౭౬లో నుండెను. బూదపూరి శాసనములో “శ్రీగోనవంశనిజశేఖర బుద్ధయాఖ్య పుత్త్రీ పవిత్రచరితా భరితాగుణౌఘైః” అనియు, “శాకాబ్దే వసునందశంకరమితే శ్రీధాతృసంవత్సరే’ అనియు నున్నవి” అని ప్ర

బంధమణిభూషణముయొక్క పీఠికలో శ్రీమానవల్లి రామకృష్ణయ్యగారు వక్కాణించి యుండుటయే గాక వారు ప్రకటించిన యాబూదుపూరి శాసన వ్యాఖ్యానములోనే సాహిణిమారుని తండ్రియు రామాయణకృతికి కర్తయు నగు బుద్ధయయు నొక్కరే యని నిరూపించుటకుఁ జాలినంత ప్రమాణము గానరాదని వ్రాసియున్నారు. కాఁబట్టి రంగనాథరామాయణమును రచించిన బుద్ధారెడ్డి సాహిణిమారుని తండ్రి యగునా కాదా యని శంకింపలేదు. అట్లయిన పక్షమున బుద్ధరాజు పుత్త్రులు కాచవిభుఁడును విఠ్ఠలరాజును ద్విపదగా రచించిన యుత్తర రామాయణ పీఠికలో సుప్రసిద్ధుఁడైన సాహిణిమారుఁడు తమ సోదరుఁడని చెప్పికొనియుండకపోవుటకుఁ గారణ మేమి? తండ్రియును సోదరులును మహాకవులై సలక్షణమైన శైలితో నొప్పుచున్న కావ్యమును రచియించి లేక రచియింపించి యుండఁగా మారయ సాహిణి మరల రామాయణమును రచియింపం జేయుటకుఁ గారణ మేమి? ఆ రామాయణము మల్లికార్జున భట్టు, కుమార రుద్రదేవుఁడు, భాస్కరుండు, అయ్యలార్యుఁడు నను నల్వురు కవులచే రచియింపఁబడి యుండఁగా దానికి భాస్కరరామాయణ మని పేరు గలుగుటకుఁ గారణ మేమి? ఈనల్వురు కవులకుం గల సంబంధమెట్టిది? ఈవిషయంబుల నన్నింటిని పర్యాలోచించినం గాని సత్యము తేటపడఁ జాలదు. తిక్కనసోమయాజిపితామహుఁడైన మంత్రిభాస్కరుఁడు రామాయణమును రచింప, నేమి కారణముచేతనో యారణ్యకాండము దక్క తక్కినకాండము లన్నియు నశించిపోఁగా వానిని మారయసాహిణియాస్థానకవి యగు హుళక్కి లేక హుళిక్కి భాస్కరుఁడును అతని పుత్త్రుఁడైన మల్లికార్జునుఁడును, శిష్యుఁడైన కుమారరుద్రదేవుఁడును, మిత్త్రుఁడైన అయ్యలార్యుఁడును మరల రచించి రనియు పూర్వపక్షవాదమై యున్నది. ఇట్టి యభిప్రాయమునకుం గలకారణము లాంధ్రకవుల చరిత్రమున వివరముగా వ్రాయఁబడినవి. శ్రీమద్రామాయణమును దెనిఁగించినది హుళక్కి భాస్కరమహాకవి కాని మంత్రి

భాస్కరుఁడు కాఁడనియు, హుళక్కి భాస్కరుఁ డరణ్యకాండమును యుద్ధకాండములోఁ గొంతభాగమును రచించె ననియు, బాల, కిష్కింధా, సుందరకాండములను దత్పుత్త్రుఁ డగు మల్లికార్జున భట్టును, అయోధ్యాకాండమును శిష్యుఁ డగు కుమారరుద్రదేవుఁడును, యుద్ధకాండ శేషమును మిత్త్రుఁ డగు నయ్యలార్యుఁడును విరచించి రనియును, ఇందఱు కవు లీగ్రంథమును విరచించుటకుఁ గల కారణము తనచే శిక్షితు లగు శిష్యవర్గముతోఁడఁ గూడ నీగ్రంథమున నుండుటకు భాస్కరుఁడు తలఁచెననుట సమంజసమనియు ప్రతిపక్షుల వాదమై యున్నది. మంత్రిభాస్కరుఁడైనను హుళక్కి లేక హుళిక్కి భాస్కరుఁడైనను రామాయణ మంతయుఁ గాక కొంచెము భాగమును మాత్రమె రచించిన వారుగా నున్నారు. మంత్రిభాస్కరుండు సాహిణిమారుని కాలము వాఁడు కాఁ డనుట నిశ్చయము. దశగతులను గ్రంథమును భాషాంతరీకరించి సాహిణిమారుని కంకితము చేయుటచేత భాస్కరుండను మహాకవి యొకఁడు సాహిణిమారుని కాలమున నున్నవాఁ డనుట నిశ్చయము, సాహిణిమారుఁడు రెండవ ప్రతాపరుద్రచక్రవర్తి సైన్యాధిపతులలో నొక్కఁ డనుటయు నిశ్చయము. క్రీ-శ-౧౩౧౧ వ సంవత్సరమున గురిజాల పింగళిస్థలములు చేరియున్న పల్నాటి సీమ కధికారిగ నియమింపఁబడిన మాచయ సాహిణింగారు ప్రతాపరుద్రునిగజసాహిణియైన గుండయనాయనింగారికిని మారయసాహిణింగారికిని పుణ్యముకొఱకు దానశాసనము వ్రాయించియుండెను[1]. కనుక భాస్కరరామాయణము సాహిణిమారుని కంకితము చేయఁబడుటచేతను, దశగతులను దెనిఁగించిన భాస్కరమహాకవి తదాస్థానకవిగ నుండుటచేతను, అంతకుఁ బూర్వము రంగనాథరామాయణమును తరువాతను ఎఱ్ఱాప్రెగ్గడ రామాయణము నుండుటచేతను, ఈ రామాయణమును భాస్కరరామాయణ మని యిటీవలివారు వ్యవహరించుచున్నారు. సాహిణిమారుఁడు గోనబుద్ధారెడ్డి పుత్త్రుఁడే యైనపక్ష

1. Annual Report on Epigraphy for 1910. para 48.

మునఁ దండ్రియు సోదరులును రామాయణమును సలక్షణముగా భాషాంతరీకరించియుండ నీవిధముగా నిందలచేత రామాయణమును వ్రాయించి తాను కృతినాయకుం డగునా యని యొకగొప్పశంక కలుగక మానదు. కృతినాయకుని వంశ మైనను భాస్కరరామాయణమున వర్ణింపఁబడియుండలేదు.

మల్లికార్జునభట్టు కాండాంతగద్యములలో "శ్రీమదష్టభాషాకవిమిత్త్ర కులపవిత్త్రభాస్కరసత్కవిపుత్త్ర మల్లికార్జునభట్ట ప్రణీతం" బని వ్రాసికొని యుండుటచేత నతఁడు మారయసాహిణియాస్థానకవి యగు భాస్కరునిపుత్త్రుఁ డని యుభయపక్షములవారును జెప్పుచున్నారు.

ఇతఁడు సాహిణిమారునియాస్థానకవి యగు భాస్కరుని పుత్త్రుఁడే యైన వారియాజ్ఞప్రకారము రామాయణమును రచింపఁ బూనినవాఁడే యైన యెడల బాలకాండము మొదట కృతినాయకుని సంబోధింపక కాండాంతమున శివుని సంబోధించి ప్రభువుయొక్కయు, తండ్రియొక్కయు నాజ్ఞల నుల్లంఘించునా? కిష్కింధాకాండాది నున్న పద్యము సాహిణిమారుని గూర్చిన సంబోధనము కలది కాదు. కాండాంతమునందలి పద్యములు రెంటిలో నొకటి సాహిణిమారునిఁ గూర్చిన సంబోధనము గలదియు, మఱియొకటి శివునిం గూర్చిన సంబోధనము గలదియు నై యున్నవి. సుందరకాండము మొదట సాహిణిమారుని సంబోధించుచున్న పద్యము గలదు గాని కాండాంతమునందలి పద్యములు రెండును శివుని సంబోధించునవిగా నున్నవి. కాఁబట్టి మల్లికార్జునభట్టు రచించిన భాగములు శివుని కంకితము చేయఁబడినవి గాని సాహిణిమారుని కంకితము చేయఁబడినవి కావనియు, సాహిణిమారునిఁ గూర్చిన రెండుపద్యముల నెవ్వరో చాటువులుగాఁ జెప్పిన నిటీవలిలేఖకులు వానిని దెచ్చి వీనికి ముడిపెట్టి రనియు, మల్లికార్జునభట్టు సాహిణిమారునికాలమువాఁడు కాఁడనియు నూహింపవలసి వచ్చుచున్నది.

అయోధ్యాకాండమును రచించిన కుమారరుద్రదేవుఁడు తనభాగమును సాహిణిమారుని కంకితము చేసినది వాస్తవ మనుటకు సందియము లేదు. కాని యతఁడు భాస్కరుని శిష్యుఁ డను మాట విశ్వసింపఁదగినదిగాఁ గనుపట్టదు. ఇతఁడు సాహిణిమారుని తల్లిదండ్రుల నామములను దెలిపియున్నాఁడు. "ఇది సకలకలావిశారద శారదాముఖ ముకురాయమాణ సారస్వతభట్టబాణ నిశ్శంక వీరమారయకుమార కుమారరుద్రదేవ ప్రణీతం" బని గద్యములో వ్రాసికొని యుండుటచేత నితఁడు సాహిణిమారుని కుమారుఁ డని నిశ్చయించుచున్నారు. ఇట్టి అభినవభట్టబాణ బిరుదాంకితుఁడు సకలకలావిశారదుఁడు భాస్కరుని శిష్యుఁడై భాస్కరుని యాజ్ఞప్రకారము దీనిని రచించి యున్నయెడల తనగురువును జేర్కొనక యిట్టిబిరుదములు చెప్పుకొని గురుధిక్కారమును గావించునా? ఇంత విద్యావంతుఁడైన కుమారుఁడు కలిగియుండియు సాహిణిమారుఁడు రామాయణము నంతయు నీతనిచేత నే వ్రాయింపకుండుటకుఁ గారణం బేమి? అరణ్యకాండము సాహిణిమారుని కంకితము చేయఁబడియున్నది గాని రచనావిధాన మంతయు నన్నెచోడ తిక్కనాదికవివరుల రచనావిధానక్రమమును బోలియున్నది. ఈకాండమున నాశ్వాసవిభాగము చేయఁబడినది. అంతియ గాక యీకాండమునందలి ప్రథమద్వితీయాశ్వాసాంత పద్యములు కృతిపతిని గూర్చిన సంబోధనములు గాక ప్రథమద్వితీయాంతములుగా నున్నవి. ఇట్టి మార్గమును తదితర కాండములను రచించిన కవు లెవ్వరు నవలంబించి యుండలేదు. ఈకాండముయొక్క గద్యములో "ఇది సకలసుకవిజనవినుత యశస్కర భాస్కర ప్రణీతం" బని యున్నది. ఈభాస్కరమహాకవియొక్క ప్రతిభావిశేషము వేఱుగ గద్యములోఁ జెప్పుకొన నక్కఱలేకయె యారణ్యకాండరచనమే వేనోళ్లఁ జాటుచున్నది. యుద్ధకాండము తుదను :—

"చ. అమరఁ హుళక్కిభాస్కరమహాకవి చెప్పఁగ నున్న యుద్ధకాం
డము తరువాయి చెప్పె వికటప్రతిభాషణుఁ డప్పలార్య స
త్తమసుతుఁ డయ్యలార్యుఁడు కృతిస్థితి నార్యులు మెచ్చునట్లుగా
హిమకర తార భాస్కర మహీవలయ స్థిరలక్ష్మి చేకుఱన్."

అని చెప్పియుండుటచేత యుద్ధకాండములోఁ గొంతభాగము (౧౧౩౮ పద్యములు) హుళక్కిభాస్కరుఁడు చెప్పె నని చెప్పెనే గాని హుళక్కిభాస్కరుఁడు తనకు మిత్త్రుఁ డని యెక్కడను జెప్పి యుండలేదు. మఱియు యుద్ధకాండాంతమునందలి పద్యములు శివుని సంబోధించునవిగా నున్నవి గనుక నితఁడు సాహిణిమారునికాలములోనివాఁడు కాఁ డనుట నిశ్చయము. తేదగిరివాయనింగారి ప్రేరణముచేత నీగ్రంథభాగము నయ్యలార్యుఁడు వ్రాసె నని ప్రాచీనతాళపత్త్రసంపుటములలోఁ గొన్నిట వ్రాయంబడియుండుటంజేసి యితఁడు క్రీ-శ-౧౩౭౦-౯౦ నడుమకాలమున నున్నవాఁ డనుట నిశ్చయము. కాఁబట్టి రామాయణములోని విశేషభాగము సాహిణిమారుని మరణానంతరమే రచింపఁబడి యుండవలయును. అట్లు గాకయున్న శివునిం గూర్చిన సంబోధనములు గల పద్యము లీ రామాయణమున నుండుటకే ప్రమేయముం గానరాదు. ఎన్నివిధములుగాఁ బరిశీలించి చూచినను అరణ్యకాండము తక్కినకాండములకంటెఁ బూర్వము రచింపఁబడి యుండు నని విదిత మగుచున్నది. అట్లయినయెడల రంగనాథరామాయణమును రచియించిన బుద్ధరాజునకుఁ బుత్త్రుఁ డని చెప్పఁబడెడి సాహిణిమారుఁడు రామాయణము నంతయు విడిచి ముందుగా భాస్కరమహాకవిచే నారణ్యకాండము నంకితము బొందుట కేమి హేతువో దెలియరాదు? భాస్కరరామాయణముం గూర్చిన యథార్థకథన మింకను మఱుంగుననే యున్నది. అయ్యది భావిపరిశోధనముల మూలమునం దెలిసికొనవలసి యున్నది. సాహిణిమారుఁడు రంగనాథరామాయణమును రచించిన గోనబుద్ధరాజు

(బుద్ధారెడ్డి) కుమారుఁడు కాఁ డని తోఁచుచున్నది. అతనిదాయాదియై యుండవలయును.

ప్రతాపరుద్రుఁడు త్రిపురాంతకాంబదేవుల జయించుట.

కాకతిరుద్రమదేవి మరణానంతరము ములికినాటిసీమలోనే వల్లూరు పట్టణము రాజధానిగ ములికినాటిని బరిపాలించుచున్న త్రిపురాంతకదేవ మహారాజును గండికోటదుర్గము రాజధానిగ గండికోటసీమ మొదలగు ప్రదేశములను బరిపాలించుచున్న యంబయదేవమహారాజును స్వామిద్రోహులై సామ్రాజ్యాధికారమును ధిక్కరించి స్వతంత్రులై వర్తింప, వారలను శిక్షింపఁ, బ్రతాపరుద్రుఁడు తనసైన్యాధిపతులలో గజసాహిణి గుండయనాయనింగారిని, గజసాహిణి మాచానాయనింగారిని బంపించెను. వీరలు త్రిపురాంతకాంబదేవులను జయించి సామ్రాజ్యాధికారమును దిరుగ నెలకొల్పి స్వామిద్రోహరగండ, స్వామివాచకరగండ, ఇమ్మడినిశ్శంకవీర, పరమమాహేశ్వరసమయచక్రవర్తి, కలియుగవీరభద్ర, కీర్తిసముద్ర, జములికభోగలింగ, మొదలుగా గల బిరుదముల నెన్నింటినో పడసిరి. ప్రతాపరుద్రచక్రవర్తి సకలసేనాధిపతి మహారాయపట్ట సాహిణి సోమయనాయనింగారిని గండికోటసీమకుఁ బరిపాలకునిగ నియమించెను. ఇందులకు నిదర్శనములు త్రిపురాంతకాంబదేవులు తమగురువు పుష్పగిరిమఠాధిపతి యైన అఘోరశివాచార్యులు మొదలగువారికిఁ జేసిన దానశాసనములు క్రీ. శ. ౧౩౦౮ గవ సంవత్సరమున [illegible] గానంబడుచున్నవి. తరువాత మహారాయపట్ట సాహిణి సోమయనాయనింగారు పరిపాలించుచున్నందులకు వారికాలమున నాగరాజు అయ్యపరాజు కొడుకులు బయ్యన, చిన్నయ అనువారలు శుల్కాధికారులుగ నుండి మార్గశుల్కములను గైకొనుచుండి యాసుంకమునుండి తలకంటిదేవికి అఖండదీపారాధనకై నెల ౧-కి ౨ రూకలు ధారాపూర్వకముగ దత్తము గావించి

శా. శ. ౧౨౩౧ (క్రీ. శ. ౧౩౦౯) సౌమ్యసంవత్సర ఫాల్గున శు ౭ గురువారమున తలకంటిదేవి గర్భాలయమునకు నుత్తరభాగమున శిలాశాసనము వ్రాయించి రని జమ్ములమడుగు స్థానికచరిత్రమువలనఁ దెలియుచున్నది.

శైవమతప్రాబల్యము—జైనమతనిర్మూలనము.

తనమాతామహితండ్రి యగు గణపతిదేవచక్రవర్తివలెనే ప్రతాపరుద్రుఁడు శైవమతాభినిరతి గలవాఁ డగుటం జేసి శైవమతగురువు లనేకు లాంధ్రదేశమునకు రాఁదొడంగిరి. శైవమఠములు పెక్కులు గలవు. వానిలో శ్రీశైలము, పుష్పగిరి, కోసఁగి, కోటిఫలిమఠములు ప్రధానములు. ఆంధ్రదేశంబున దక్షారామము త్రిపురాంతకము మొదలగు శైవక్షేత్రము లయిన పుణ్యక్షేత్రము లనేకము లున్నను శ్రీశైలము పురాతనకాలమునుండి ప్రధానక్షేత్రముగా నుండెను. జన్మమెత్తినందున కొక్కసారి యైనను శ్రీశైల మల్లికార్జునదేవుని సందర్శింపకున్న ముక్తి కలుగనేర దని యాకాలపు శైవుల విశ్వాసమై యుండెను. మండలేశ్వరు లయిన మహారాజులకు సామంతనృపతులకు, గురువు లారాధ్యబ్రాహ్మణులును శివయోగు లయినబ్రహ్మచారులును; మంత్రులు లింగధారు లయిన నియోగిబ్రాహ్మణులు; మహావీరు లయిన సేనాధిపతులు మొదలగువారికి గురువులు జంగమదేవరలు. ఈవీరశైవులకు వీరశాక్తేయము నందుఁ గూడ నభిరతి మెండుగ నుండెను. ఇంక మైలారు వీరభటులం గూర్చి చెప్పనేల? వీరశైవభక్త్యావేశపరవశులై యున్నప్పుడు శివుఁడు ప్రమథగణంబులతోఁ గూడి తమతో నృత్యము సలుపు చుండె నని భావించి భయంకరకృత్యములను చేయుటకు వెనుదీయకుండిరి. ఏకశిలానగరవీథులలో విహరించుచు మైలారదేవుని యుత్సవమునాఁడు మైలారువీరభటులు చేయు వీరకృత్యములను జూచి వర్ణించినవిధమును వల్లభామాత్యుఁడు తనక్రీడాభిరామములో నీక్రిందిపద్యములలోఁ జూపియున్నాఁడు.

“సీ. అవటవమందు నెట్టని చంద్రమల్లెలఁ
జోద్యంపు గుండాలు చొచ్చువారు
కరవాడి యలుగుల కనరుపాతరలలో
నుట్టిచేరులు గోసి యురుకువారు
గాలంపు గొంకిఁ గంకాళచర్మము గ్రుచ్చి
యుడువీధి నుయ్యెల లూగువారు
కటికి యొగ్గాళంపు గండగత్తెర వట్టి
మిసిమింతులును గాక మ్రింగువారు
గీ. సందులను నారసంబులు సలుపువారు
యెడమగుడిచేత నారతు లిచ్చువారు
సాహసము మూర్తిగైకొన్న సరణివారు
ధీరహృదయులు మైలారు వీరభటులు.”

గీ. వీరమైలారు దేవరవీరభటులు
గొండ్లి యాడించుచున్నారు గొరగపడుచు
నాడుచున్నది చూడు మర్థాభినయము
తాను నెట్టిగసీ లంత గాని లేదు.

చ. వెనుకకు మొగ్గవ్రాలి కడు విన్నను వొప్పుఁగఁ దొట్టి నీళ్లలో
మునిఁగి తదంతరస్థ మగు ముంగర ముక్కున గ్రుచ్చికొంచు లే
చెను రసనాప్రవాళమున శీఘ్రము గ్రుచ్చెను నల్లపూసపే
రనుపమలీల నిప్పుడు చుపాయము లిట్టివి యెట్లు నేర్చెనో.”

జైనమతావలంబకులును స్మార్తమతావలంబకు లయిన బ్రాహ్మణులును గాక తక్కినయగ్రవర్ణములవారిలో మూడింట రెండుపాళ్లు శైవులుగ నొకపాలు వైష్ణవులుగ నుండిరి. వీరిలో వీరశైవులు రాజ్యాధికారప్రాబల్యము గలవా రగుటచేత బ్రాహ్మణులు వీరితోడ మైత్రి గలిగి యుండవలసినవా

లైరి. అందువలన వీర లుభయులకు జైనపండితులు శత్రువులుగ నుండిరి. మొదటిప్రతాపరుద్రుని కాలము మొదలుకొని కాకతీయాంధ్రచక్రవర్తులు జైనమతాచార్యులపట్ల నిరాదరమును శైవులపట్ట ప్రేమను జూపుచుండిరి. జైనమతమునం దాదరము తగ్గినతోడనే జైనమతావలంబకు లైనసామాన్యజనులు శైవమత మవలంబింపఁగా జైనమతాచార్యు లనేకులు త్రిలింగదేశమునువిడిచిపెట్టి కర్ణాటమహారాష్ట్రదేశములకు వలసపోయిరి. ఇఁకను మఱికొందఱు జైనమతాచార్యులు ధాన్యకటకము (ధరణికోట) ఏకశిలానగరము మొదలగు ప్రదేశముల నివసించియుండఁగా వారలకును బ్రాహ్మణులకును మతవివాదములును శాస్త్రచర్చలును జరుగుచు వచ్చెను. ఆవివాదములను గూర్చినగాథ లనేకములు గలవు గాని యవి యంతగా విశ్వాసార్హములుగా గన్పట్టవు. అయినను బ్రాహ్మణు లనేక మాయోపాయములను గల్పించి ప్రతాపరుద్రుని తమ కనుకూలునిగఁ జేసికొని జైనమతాచార్యుల బాధించుచు వచ్చి రని జైనులు చెప్పెడిగాథలవలనఁ దెలియుచున్నది. అందువలన జైనమతము త్రిలింగదేశమున నాశన మైనది. మహావిద్వాంసు లయిన జైనమతాచార్యు లనేకులు వైష్ణవమతాచార్యు లయినట్లుగాఁ గన్పట్టుచున్నది.

జైనులు బ్రాహ్మణులను శపించుట.

మంత్రవాదులసాహాయ్యముతో మాయోపాయములు గల్పించి తమ్ము జయించినందులకుఁ గనలుచు దుఃఖమును భరింపఁ జాలక రోషమును బెంచి జైనమతాచార్యులు బ్రాహ్మణుల నీవిధముగా శపించిరట!

ఈప్రతాపరుద్రుఁడు బ్రాహ్మణులు గావించిన మాయతంత్రము నెఱుంగఁజాలక మూర్ఖుఁడై మనకంటె బ్రాహ్మణులు మంత్రశక్తి కలవారనియు నధికులనియు విశ్వసించి బ్రాహ్మణప్రేరితుఁడై జైనుల మైన మనమతగ్రంథములను దగ్ధము గావించి మనమఠములు మాన్యము లాక్రమించుకొని మనశత్రువులకు ధారవోయుచుండెను; ఇంక మనము బ్రదికి యుండినను జచ్చినవారితో

సమానులము గదా; మనము నేటిదినము జీవించియున్నను రేపటిదినము మరణము నొందవలసినవారమె; మన మందఱము నొక్కసారిగఁ బ్రాణములం ద్యజింతము; ఓబ్రాహ్మణులారా! మీరు మాగ్రంథములతోఁ బాటు దగ్ధము చేయక నిలుపుకొన్న మా యమరకోశము దక్క తక్కిన మీవేదశాస్త్రగ్రంథములు తొంటిప్రఖ్యాతిని విడిచి నిరుపయోగములై పోవును గాక! మాభూములలో నెవ్వరు నివసింతురో వారలకు జయము కలుగకుండును గాక! అన్యాయముగా బ్రాహ్మణులను గెలిపించుటకై మాయతంత్రమును గావించిన మంత్రవాదులును వారిసంతతివారును బిచ్చగాండ్రై తిరిపెమెత్తుకొని బ్రదుకుదురు గాక! (వీరె విప్రవినోదు లనంబడువారు.) చక్రవర్తి సరియైన విమర్శ చేసి సత్యమును గ్రహింపఁజాలక బ్రాహ్మణులు కల్పించిన మాయలోఁ జిక్కుకొని వారల కనుకూలుఁడై మానాశనమునకుఁ గారకుఁ డయ్యెను గావున నీతఁడు శీఘ్రకాలములోనే పరరాష్ట్రాధిపతిచేతఁ జెఱఁగొనఁబడు గాక! అంతటితో నీతనిసామ్రాజ్యము భగ్న మగును గాక!

అని శపించి యనేకులు ప్రాణత్యాగము చేసికొని రఁట! ప్రాణత్యాగము చేయనొల్లని మతాచార్యు లనేకులు విష్ణుభక్తిపరాయణులై వైష్ణవాచార్యు లైరి. తరువాత వీరలు ప్రతాపరుద్రునకు గర్భశత్రువులుగ నుండి యుత్కలరాజుతోఁ గుట్రలు గావించి ఢిల్లీచక్రవర్తు లగు తురుష్కులను దాడి వెడలి వచ్చునట్లుగఁ జేసి కాకతీయాంధ్రసామ్రాజ్యమును భగ్నముఁ జేయు కార్యమునం దోడ్పడిన వారైరి. ప్రతాపరుద్రచక్రవర్తి యెంతటిసమర్థుఁడైనను జైనులకుఁ గావించిన యపకృతివలనఁ దాను శత్రువులచేఁ జిక్కి పరిభవము నొందుటయు సామ్రాజ్యమును గోలుపోవుటయు సంభవించెను. ఇంటిగుట్టు లంకకుఁ జేటని తనరాజ్యములో మిత్త్రిరూపమున నున్న యీ జైనశాత్రవులే పరరాష్ట్రాధిపతు లయిన తురుష్కులకు రాజ్యమర్మములను దెలిపి తనదేశమునకు రాజ్యమునకు మహాపకారమును గావించిరి. ప్రతాప

రుద్రుఁడు తన పరిపాలనములోఁ గావించిన యీమహాపరాధమె యిన్నూఱు సంవత్సరములనుండి వర్ధిల్లిన సామ్రాజ్యమున కాతనితోడనే వినాశము గలిగించినది.

ఏకశిలానగరములోని ప్రసిద్ధదేవాలయములు.

ఏకశిలానగరములో నున్న ప్రసిద్ధదేవాలయములను క్రీడాభిరామమనుగ్రంథమున వల్లభామాత్యకవి యీక్రింది సీసపద్యములోఁ జక్కఁగాఁ జేర్కొని యున్నాఁడు.

"సీ. అదె భైరవస్థాన మట మీఁద నల్ల దె
చముడేశ్వరీ మహాశక్తి నగరు
వీరభద్రేశ్వరాగారమంటప మదె
యదె బౌద్ధదేవు విహారభూమి
అదె ముద్దరా లుమ్మసానమ్మ నివాసంబు
నల్లదె కొమరుసామయ్యనగరు
అదె పాండవుల గుడి యట దక్షిణంబున
గర్తారుఁ డుండు తుర్కల మసీదు
గీ. కొంతదవ్వుల నదె మహాగోపురముల
వైఁడికుండలు రవిదీప్తిఁ బ్రజ్వలించి
కాన నయ్యెను మేరుశృంగములఁ బోలెఁ
గేశవశ్రీస్వయంభూనికేతనములు."

క్రీడాభిరామమును రచించిన కవి ప్రతాపరుద్రుని యనంతరకాలమున నున్నవాఁడు గావునఁ దనకాలమున నున్నతురకల మసీదు గూడనిందుఁ జేర్కొనినాఁడు గాని ప్రతాపరుద్రుని యనంతరమె తురక లేకశిలానగరమున నివసించినవా రగుటచేత నయ్యది ప్రతాపరుద్రునికాలమున లే దని తెలిసికొనవలయును. పైని జెప్పినవానిలో కేశవాలయమును శ్రీస్వయంభూ

దేవాలయమును మిక్కిలి గొప్పవైనటులఁ గానంబడుచున్నవి. శివుని యవతారముగాఁ బరిగణింపఁబడెడు భైరవునియొక్క పూజ లాకాలమున బాహాటముగా జరుగుచుండెను. భైరవుని యాకృతి వీరభయానకరసముల నుట్టిపడఁ జేయుచుండెను.

భైరవార్చనము.

ఈకాలమున భైరవార్చనము శ్రేష్ఠమైనదిగా నెంచఁబడక పోయినను ఆకాలమున నధికవిశ్వాసముతో భైరవారాధనము సలుపఁబడుచుండెను. అప్పటి భైరవార్చనముకన్న నంతకుఁ బూర్వ ముండిన భైరవార్చనము దుర్నీతితోఁ గూడుకొని యుండెను. అయిన నీమతము బ్రాహ్మణాద్యగ్రవర్ణముల వారిలో నంతగా వ్యాపించియుండలేదు. భక్తులు భక్తిపారవశ్యముచేత ప్రాణము లర్పించుకొని ముక్తిఁ బొందుటయు నప్పటప్పట కలుగుచుండెను. గోవిందమంచనశర్మ భైరవాలయంబును బొడఁగని నమస్కరించి భైరవుని నీక్రిందివిధముగా సంబోధించినట్లు క్రీడాభిరామమునఁ జెప్పఁబడియెను.

"మ. అమితోత్సాహముతోడ నీవు పటుబాహాఢక్క యొక్కొక్క మా
టు మనఃకంపము నొందఁ జేయఁ దొలుకాడుక్ వార్ధి వేలాలుఠ
త్కమఠంబై వలమానమీనమయి యుద్యన్నక్రమై యుత్తర
త్తిమిమై యుల్లలదంబు మగ్నధులియై ధీరా మహాభైరవా.

మైలారదేవుఁడు

బ్రాహ్మణేతరజాతులలో భైరవార్చనముతో పాటు మైలారుదేవుని పూజ కూడ ముఖ్యమైనదిగఁ బరిగణింపఁ బడుచుండెను. ఏకశిలానగరమున మైలారుదేవుని యుత్సవములు మహావైభవముతో జరుగుచుండినవి. ఆకాలమునందలి కవివర్యులచే నీమైలారుదేవుఁ డేవిధముగాఁ బ్రశంసింపఁ బడుచుండెనో క్రీడాభిరామములోని యీక్రింది పద్యమువలన బోధపడఁగలదు.

"సీ. శనివారసిద్ధి సజ్జనపారిజాతంబు
వసనాత యాదిత్యవారభోగి
మాధవీరమణుండు మాయావినోదుండు
మాళవీప్రియభర్త మహితయశుఁడు
పల్లెంబవాయకుం డెల్లవేల్పులరాజు
కనపవేఁటల వేడ్కకాండ్ర భర్త
కత్రశాలాస్వామి కరుణాపయోరాశి
పుణ్యకీర్తనుఁ డైన ప్రోలియయ్య
తే. గీ. మంచు కుంచాల గొలువంగ మాయలేళ్లఁ
బట్టి కట్టంగ నేర్చిన బాసవెల్లి
భైరవునితోడి జోడు మైలారుదేవు
డోరుగంటినివాసి మేలొసఁగు గాత."

ఇట్లు భైరవుఁడు మొదలగు దేవతల మహోత్సవములు గాక యేకశిలానగరమున నాంధ్రదేశమునను జరుగు దేవతామహోత్సవములలో ఏకవీరా మహాదేవియొక్క మహోత్సవము మిక్కిలి ప్రశంసనీయమైనది. జమదగ్ని మహాముని భార్యయు పరశురాముని తల్లియు నగు రేణుకాదేవియె ఏకవీరా మహాదేవి యనుపేర నాంధ్రులచేఁ గొలువఁబడుచుండెను. ఏకవీరామహాదేవి యాదిశక్తియొక్క యపరావతార మని యాకాలమున భక్త్యావేశముతో సమస్తజనులచే నారాధింపఁబడుచుండెను. ఉత్సవదినములలో ఏకవీరామహాదేవి యెదుట బవినీలు పరశురామునికథలు పాడుచుండిరి.

వీరపురుషారాధనము.

మఱియు నాకాలమున వీరపురుషుల నారాధించు నాచారము గలదు. యుద్ధములయందు మహాశూరులై పోరాడి ప్రాణములం గోల్పోయినవారిని

జనసామాన్యము వీరు లను పేరితో గుళ్లు కట్టి యారాధించుచుండెను. ఇట్లారాధింపఁబడు వీరపురుషులయొక్క విగ్రహము లాంధ్రదేశమునం దంతటను గలవు. అందును ముఖ్యముగా పల్నాటివీరుల యాలయము లాయేకశిలానగరమునందు ప్రసిద్ధ మైనవిగ నుండెను. అప్పటికే పల్నాటివీరుల చరిత్రము ద్విపద ప్రబంధముగ రచింపఁబడి దేశమునం దంతటఁ బఠింపఁబడుచుండెను. ఈప్రబంధమును పాడునపుడు వీరపురుషుల శౌర్యప్రతాపములం బ్రకటించు నభినయాదికృత్యము లీక్రిందివిధముగా క్రీడాభిరామమున నభివర్ణింపఁబడియెను.

" మ. ద్రుతతాళంబున వీరగుంభితకథం దుంధుంకిటాత్కారసం
గతి వాయింపుచు నాంతరాలికయతిగ్రామాభిరామంబుగా
యతిగూడం ద్విపదప్రబంధమున వీరానీకముం బాడె నొ
క్కత ప్రత్యేకముగాఁ గుమారకులు ఫీట్కారంబునం దూలఁగన్.

సీ. గజ్జించి యరసి జంఘాకాండయుగళంబు
వీరసంబెట కోల వ్రేయు నొకఁడు
ఆలీఢపాదవిన్యాస మొప్పఁగ వ్రాలి
కుంతాభినయముఁ గైకొను నొకండు
బిగువుఁ గన్నుల నుబ్బు బెదరుచూపులతోడ
ఫీట్కార మొనరించుఁ బెలుచ నొకఁడు
పటుభుజాస్తంభ పరిపాటి ఘటియిల్ల
ధరణి యాస్ఫోటించి దాఁటు నొకఁడు
తే. ఉద్ది ప్రకటింప నొక్కరుఁ డోలవాడు
బయల గుఱ్ఱంబు ఛంజళిఁ బఱపు నొకఁడు
కుఱుచు దాటించుచును బెద్దకొలువులోనఁ
బడతి పల్నాటివీరులఁ బాడు నపుడు.''

మఱియు నామహాకవి వారు ధరించికొన్న యలంకారములతోఁ గూడ వీరకుమారకోటి నిట్లభివర్ణించియున్నాఁడు.

“ ఉ. పచ్చని పిండిగందమును బాలము సేసయు జెజ్జిపూవులం
గ్రుచ్చిన కంఠమాల్యములు గుప్పఁగఁ జల్గిన వేణిబంధముల్
కుచ్చుల వీరసంబెటయుఁ గ్రొత్తమణుం గగు కాసెపుట్టమున్
బచ్చలు చెక్కినట్టిగవణంబులు వీరకుమారకోటికిన్.”

ఘటికాయంత్రము, పూఁటకూళ్లు.

కాకతీయప్రతాపరుద్రుఁడు పరిపాలనము చేయునప్పుడు కాలపరిమాణముం దెలుపునట్టి ఘటికాయంత్రములు గలవనియు వానిం బట్టి గంటలు కొట్టఁబడుచుండు ననియు క్రీడాభిరామములోఁ గల యీక్రిందిపద్యమువలన దెలియుచున్నది.

“ మ. ఉడువీథిన్ శిఖరావలంబియగు నంధ్రోర్వీశు మోసాలపై
గడియారంబున మ్రోసె రెండెనిమిదుల్ ఘంటాఘణాత్కారముల్
సడలెన్ భానుఁడు పశ్చిమంబునకు వైశ్యా పూఁటకూటింటికిన్
గుడువం బోదమె లెక్క యిచ్చి కడునాకొన్నార మిప్పట్టునన్.”

అని మంచనగోవిందశర్మ యను బ్రాహ్మణుఁడు తనచెలికాఁడగు కోమటిటిట్టిభసెట్టితోఁ బలికినట్లు వ్రాయఁబడియుండుటం జేసి యాకాలమునం గూడ కాలపరిమాణముం దెలిపెడు గడియారములు గలవని తెల్లమగుచున్నది గాని యాగడియారములు ఇప్పటి గడియారమువంటివి గాక మఱియొకవిధమైనవిగా మనము గ్రహింపవలయును. అప్పుడు గడియలను బట్టి గంటలు కొట్టఁబడుచుండెను. అట్లగుటచేతనే యాంధ్రోర్వీశు మోసాల రెండెనిమిదులు (౧౬) మ్రోగెనని చెప్పఁబడియెను. ఈకాలమునందలి నగరములలో బలెనే యాకాలమునందును సొమ్ముతీసికొని భోజనము పెట్టునట్టి

పూఁటకూళ్లయిండ్లు గలవని కూడ పైపద్యమువలన బోధపడుచున్నది. ఆకాలమున నొక్కరూకకు వడ్డించు భోజనపదార్థములను గూడ కవి యీవిధముగా నభివర్ణించియున్నాఁడు.

“ ఉ. కప్పురభోగివంటకము కమ్మని గోధుమపిండివంటయున్
గుప్పెడు పంచదారయును గ్రొత్తగఁ గాఁచిన యాలనేయుఁ బెస
ర్పప్పును గొమ్మునల్లనఁటిపండ్లును నాలుగునైదు నంజులున్
లప్పలతోడఁ గ్రొంబెరుగు లక్ష్మణ యొజ్జల యింటిరూకకున్.”

పూఁటకూళ్లు పెట్టు నిప్పటియిండ్లవలెనే యాకాలమునాఁటి పూఁటకూటియిండ్లును దుర్నీతికిఁ బట్టుకొమ్మలై యుండెననియే కవి చెప్పియున్నాఁడు.

“ గీ. సంధివిగ్రహయానాది సంఘటనల
బంధకీజారులకు రాయబారి యగుచు
పట్టణంబున నిత్యంబు పగలురేయు
పూఁటకూటింట వర్తించుఁ బుష్పశరుఁడు.”

మాచల్దేవివారాంగన.

అగ్నిసాక్షికముగా వివాహముఁజేసికొన్న దేవులు గాక పూర్వరాజులు భోగకాంతల నుంపుడుకత్తెలనుగాఁ బెట్టుకొనెడు నాచారమొకండు గలదు. ఆయాచారమును ప్రతాపరుద్రచక్రవర్తి కూడ నవలంబించి యుండెను. అతని యుంపుడుకత్తెలలో మాచల్దేవి యను వారాంగన విశేషప్రసిద్ధి కలది. ఈమె మందిరమును గాంచి యాశ్చర్య మందుచు మంచన గోవిందశర్మ ప్రక్కనున్న వారిని ప్రశ్నించినప్పుడు వారలీక్రిందివిధముగాఁ బ్రత్యుత్తర మిచ్చిరని క్రీడాభిరామమునఁ జెప్పంబడియెను.

“ శా. ద్వీపాంతంబున నుండి వచ్చితివె భూదేవా, ప్రశాంతం మహా
పాపం, సర్వజగత్ప్రసిద్ధ సుమనోబాణాసనామ్నాయ వి

దోశ్యపాధ్యాయి ప్రతాపరుద్రధరణీశోపాత్త గోష్ఠి ప్రతి
ష్ఠాపారీణ తెలుంగ వయ్యేదవు మాచల్దేవి వారాంగనన్.

ఆకాలమునం దరువాతికాలమునను మాచల్దేవిచరిత్రమును గూర్చి నాటక మాడుచుండి రని యాగ్రంథమునందే తెలుపఁబడినది. మఱియు విటకాఁడగు నా గోవిందశర్మ మాచల్దేవిని

"గీ. కల్ల చెప్పము విను నీకుఁ గలప్రసిద్ధి
ఢిల్లి సురతాణికిని లేదు పల్లవోష్ఠి
యాదిలక్ష్మికి నీకును భేద మేమి
యుదధి జనియింపకుండుట యొకటి దక్క."

అని యామెను శ్లాఘించినట్లు చెప్పియున్నాఁడు.

పదునాలుగవ ప్రకరణము.

శ్రీవీరప్రతాపరుద్ర దేవచక్రవర్తి పాలనము.

మహమ్మదీయుల దండయాత్ర.

ప్రతాపరుద్రునకు సమకాలికుఁడైనరామచంద్రదేవుఁడు దేవగిరిరాజధానిగ మహారాష్ట్ర కుంతల దేశములను బరిపాలనము సేయుచుండెను. దక్షిణ దేశమును బరిపాలనము సేయుచుండిన స్వతంత్రరాజులలో ప్రతాపరుద్రునకుఁ దరువాత నీతఁడు మిక్కిలి బలాఢ్యుఁడని చెప్పఁదగినవాఁడుగ నుండెను. ఈతఁడు క్రీ. శ. ౧౨౭౧ మొదలుకొని క్రీ. శ. ౧౩౧౦ దవ సంవత్సరమువఱకుఁ బరిపాలనము చేసెను. ఈయాదవరాజునకును ప్రతాపరుద్రునకును మనస్స్పర్థలు గలిగియుండియు నుభయులు బలాఢ్యు లగుటచేత నొండొరులను జయించుకొనుప్రయత్నమును విడిచి మౌనము వహించి యున్నకుండిరి. ఇట్లుండ, నుత్తరహిందూస్థానమున ననేకము లైనమార్పులు రాజ్యాంగమున జరుగుచుండెను. అదివఱకు నూఱుసంవత్సరముల క్రిందట ఢిల్లీసామ్రాజ్యమును విస్తరింపఁ జేయుచుండిరి. రాజపుత్త్రు లనేకులు బహుసంవత్సరములు మహమ్మదీయులతోఁ బోరాడి పోయినవారు పోఁగా హతశేషు లయినవారు పర్వతప్రాంతభూములకు నెడారులకుఁ బోయి వేఱ్వేఱుసంస్థానములను స్థాపించి మహమ్మదీయులకు వశ్యులు గాక పౌరుషపరాక్రమములు నెఱపు

చుండిరి. అయినను మహమ్మదీయులలో నొకవంశమునకుఁ బిమ్మట మఱియొక వంశమువారు రాజ్యమునకు వచ్చి క్రూరము లైనదండోపాయములచే సాధువు లయిన హిందూప్రజల హింసించుచు ఢిల్లీనగరమునఁ బరిపాలనము సేయుచు సామ్రాజ్యమును విస్తరింపఁ బ్రయత్నించుచుండిరి. బలవంతు లయిన యిట్టి శాత్రవులను గూర్చి యించుకయుఁ దలపోయక శాస్త్రవ్యాసంగములతోడను విద్వత్పండితగోష్ఠులతోడను కాలమును వెళ్లఁబుచ్చుచు రామదేవుఁడు స్వరాజ్యసంరక్షణమునం దేమఱి యుండెను. ఈతని రాజ్యమునకు దిగువను ప్రతాపరుద్రునిరాజ్య ముండుటచేత నీతఁడును ఉత్తరహిందూస్థానమునందు జరగుచున్నచర్యలను పరికింపక మౌనధారణము వహించి తన్నుఁ గట్టుకొనఁ ద్రాళ్లు తానే తెచ్చుకొన్నవాఁ డయ్యెను. మహమ్మదీయులవలన తనకు నపకృతి కలుగు నన్నతలంపు లేనివాఁ డగుటచేత సరిహద్దున నుండు దుర్గములను బలపఱుచుకొనుటకుఁ బ్రయత్నింపక రాజధానీదుర్గమును మాత్రమె బలపఱుచుకొని యుండెను. అధికప్రఖ్యాతిఁ గాంచిన వీరు లయిన సేనానాయకు లనేకు లీతనిరాజ్యమునం దుండిరి. అప్పుడు జలాలుద్దీ నను ఖిల్జీవంశస్థుఁడు ఢిల్లీసింహాసన మాక్రమించుకొని పరిపాలనము సేయుచుండెను. ఈతఁడు వృద్ధుఁ డగుటవలన రక్తమును బ్రసరింపఁ జేయుటయందు వాంఛలేనివాఁడుగ నుండెను. అయినను నిరక్షరకుక్షియు, క్రూరుఁడు నైన యీతని సోదరపుత్రుఁడు అల్లాఉద్దీను సైన్యాధ్యక్షుఁడుగ నుండెను. ఇతఁడు బుందేలుఖండు (Bundelkhand) మాళవదేశములపై దండయాత్ర వెడలి వానిని జయించి యింకను మహాయుద్ధములను జేయ నభిలాష కలిగియుండెను.

అల్లాఉద్దీను దక్కను దండయాత్ర.

ఇతఁ డెనుబదివేల యాశ్వికసైన్యముతో గంగాతీరమునందలి కరా యను ప్రదేశమునుండి బయలుదేఱి విదర్భదేశము మీఁదుగా వచ్చి యాకస్మికముగా దేవగిరిని సమీపించెను. అప్పుడు రామదేవుని సైన్యము రాజధానీ

నగరమున బహుస్వల్పసంఖ్య కలదిగ నుండెను. సైన్యమును సమకూర్చుకొని యెదుర్కొనుటకు నైన నవకాశము చిక్కదయ్యెను. మఱికొంద ఱీతఁడు రాజధానీనగరమున లేఁ డని చెప్పెదరు. ఏది నిజ మైనను అల్లాఉద్దీను దండెత్తి వచ్చె నన్నమాట విన్నతోడనే యెట్లెటో నాలుగువేలసైన్యమును ప్రోగుచేసికొని మహమ్మదీయసైన్యాధిపతికిని దేవగిరి దుర్గమునకును నడుమ నిలిచి శత్రువుల నడ్డగింప బ్రయత్నించెను గాని విశేషకాల మట్లెదుర్కొని పోరాడుటవలనఁ బ్రమాదము గల దని యెఱింగి యిప్పటికి భోజనపదార్థములచే దుర్గము నింపఁబడియె నని తెలిసికొన్నవాఁ డగుటవలన వెంటనే వెనుకకు మరలి దేవగిరిదుర్గములోఁ బ్రవేశించెను. అంతట మహమ్మదీయులు పట్టణము నంతయు దోఁచుకొని కోటను ముట్టడించిరి. ఇంతియ గాక అల్లాఉద్దీను చక్రవర్తిసైన్య మింకను వెనుకనే యున్న దనియు, ఈ వచ్చిన సైన్యము దానిలో నొకభాగ మనియు వదంతి కలుగఁజేసెను. రామదేవుఁడు మూర్ఖముగా నెదుర్కొనుటవలన లేశమాత్రమును బ్రయోజనము లే దని యూహించి సంధికై ప్రయత్నము చేసెను. అల్లాఉద్దీను తనసైన్యముయొక్క బలహీనతను దాను బాగుగా నెఱింగినవాఁడు గావున విశేషముగా సువర్ణము నొసంగినయెడ ముట్టడిని విడిచిపెట్టి పోదు నని తెలియఁజేసెను. ఇంతలో రామచంద్రదేవుని కొడుకు శంకరదేవుఁడు కొంతసైన్యమును గూర్చుకొని తండ్రికి సహాయపడుటకై వచ్చుచుండెను. దానిం గనిపట్టి వేయిసైనికుల దుర్గముకడ నుంచి అల్లాఉద్దీను తక్కినసైన్యముతో శంకరదేవుని నెదుర్కొనెను గాని హిందువులసంఖ్య యధికముగా నుండుటచేత మహమ్మదీయులు నిలువ లేక వెనుకకు మరలుచుండిరి. ఇంతలో కోటను ముట్టడించి యున్న సైనికులు వచ్చి కలిసికొనిరి. ఈసైన్యమును జూచి హిందువులు ఢిల్లీనగరమునుండి క్రొత్తగ సైన్యము వచ్చిన దని భయపడి పలాయను లైరి. రామచంద్రదేవుఁడు సంధి చేసికొనఁగోరఁగా మహమ్మదీయసేనాపతి యెక్కువధనమును

గోరెను. ప్రతాపరుద్రుఁడు మొదలగు హిందూరాజులు పంపిన సైన్యములు దేవగిరికి వచ్చుచుండెను కాని యింతలోఁ నదివఱకు కోటలోఁ ద్రోయఁబడిన బస్తాలు ధాన్యపుబస్తాలు గాక ఉప్పుబస్తా లని తెలిసికొనఁబడియెను. భోజన పదార్థములు గూడ చాలకయుండెను. ఈ హేతువుచేత రామదేవుఁడు సంధి చేసికొనుట తప్ప దయ్యెను. అప్పుడు ౬౦౦ మణుగుల ముత్యములను వేయి వెండినాణెములును రెండువిలువగల నగలును ౪౦౦౦ పట్టుపీతాంబరములును బహుమానముగ నిచ్చుటయే గాక కొంతదేశము నొసంగి ప్రతిసంవత్సరము కప్పము చెల్లించుటకు నొడంబడినందున నా మహమ్మదీయసేనాపతి ముట్టడి విడిచిపెట్టి ఢిల్లీనగరమునకు మరలి పోయెను.

అల్లాఉద్దీను చక్రవర్తి యగుట.

అల్లాఉద్దీను ఢిల్లీకి మరలిపోయిన తరువాత వృద్ధుడై డెబ్బదియేండ్లు వయస్సు నిండిన పెద్దతండ్రిని జంపించి క్రీ. శ. ౧౨౯౬ వ సంవత్సరములో సింహాసన మెక్కెను. ముల్తానునకు సైన్యమును బంపి జిలాలుద్దీనుకొడుకులను జయించెను. సింధుదేశమునుండి మంగోలియాజాతివారిని దఱుమఁగొట్టెను. అధికసైన్యములను బంపి సురాష్ట్రము లేక ఘూర్జరమును కైవశముఁ జేసికొనియెను. ఇచ్చటనే మలిక్‌కాఫూర్ అనువానిని బానిసగఁ బట్టుకొని పోయెను. ఇతఁడే తరువాత అల్లాఉద్దీను సైన్యమున కధ్యక్షుఁడై ప్రసిద్ధుఁడయ్యెను. మంగోలియాజాతివార లనేకులు దాడివెడలివచ్చి ఢిల్లీనగరమును సమీపింపఁగా వారలతో ఘోరయుద్ధముచేసి వారిని పాఱఁద్రోలెను. ఈవిజయములో నుప్పొంగినవాఁడై భరతఖండమున నేకమతము నేకసామ్రాజ్యము నెలకొలుపవలయు నని యూహించెను గానిహిందూదేశమున మతముతోఁ బ్రసక్తి కలుగఁజేసికొనుట ధారుణీశ్వరుల కపాయకర మని తెలిసికొని యేకమతస్థాపన మనుదానిని విడిచిపెట్టెను. మంగోలియాజాతివారివలన నింక నపాయము లే దని తెలిసికొన్న తరువాత తనదృష్టిప్రసారమును దక్షిణహిందూస్థానము

వైపునకుఁ బఱపెను. అల్లాఉద్దీను విద్యావిహీనుండును క్రూరుఁడును విషయాసక్తుఁడు నైనను మంచిసమర్థుఁడు గనుక నేర్పరు లయిన చారులను బంపి త్రిలింగదేశము నేలుచున్న ప్రతాపరుద్రుని రాజ్యాంగబలముయొక్క శక్తిని రాజ్యతంత్రరహస్యములను దెలిసికొని త్రైలింగ్యసామ్రాజ్యమును ఢిల్లీసామ్రాజ్యమును గలుపుకొనవలయు నని సంకల్పించెను. ఇట్టి సంకల్పమును నెఱవేర్పఁగల సమర్థుఁడు తన కడ నున్న బానిసవాఁ డగు మలిక్‌కాఫూర్ కన్నమఱి యొక్కఁడు లేఁడని యాతని సైన్యాధ్యక్షుని గావించి త్రిలింగసామ్రాజ్యమును జయింపఁ బంపి రాజపుత్రసింహమును చితోడ్‌గడమున కధిపతియు నగు భీమసింహునిరాణి పద్మిని నపహరింపఁ గోరి తమకంబుతోఁ దాను చితోడ్‌గడముపైకి దండెత్తి పోయెను.

మలిక్‌కాఫూర్ ప్రథమదండయాత్ర.

బానిసవాఁడయ్యును మలిక్‌కాఫూర్ శౌర్యసాహసాది గుణవిశేషంబులచే మేటియోధుఁ డనిపించుకొని ఢిల్లీచక్రవర్తి యనుగ్రహమునకుఁ బాత్రుఁడై సైన్యాధ్యక్షపదవిని వహించి ప్రచండశాసనుఁడై యాసేతుహిమాలయ మేకచ్ఛత్రాధిపత్యముగా రాజ్య మేలవలయు నని యువ్విళ్లూరుచున్నవాఁ డగుటచేత పదివేలగుఱ్ఱపుదళముతోడను నలువదివేల పదాతివర్గముతోడను త్రిలింగదేశముపై దండెత్తి వచ్చెను. ఇయ్యది క్రీ. శ. ౧౩౦౩ వ సంవత్సరాంతమున జరిగెను. క్రీ. శ. ౧౨౯౪ గవ సంవత్సరమున జయింపఁబడినది మొదలుకొని దేవగిరి నేలు రామచంద్రదేవుఁడు ఢిల్లీచక్రవర్తితో మైత్రి కలిగియుండెను గావునఁ దురుష్కసైన్యము లాతని రాజ్యమునకు నేవిధమైన నష్టమును గలిగింపవందున రామదేవుఁడు తురుష్క సైన్యమునకుఁ దోడ్పడియెను. మహమ్మదీయులు తనదేశముపై దండెత్తి వచ్చుచున్నారనెడు భయంకరమైన వార్త చారులవలన విని ప్రతాపరుద్రచక్రవర్తి భయకంపితుఁడు గాక మంత్రిసామంతవర్గముతోడ నాలోచించి యా శాత్రవ

సైన్యము నెదుర్కొనుటకై లక్షసైన్యమును బంపెను. ఈ సైన్యమున కంతకును ప్రతాపరుద్రచక్రవర్తి సోదరుఁడగు అన్నమదేవుఁ డధ్యక్షుఁడుగ నుండెను. అశ్వసైన్యమున కధిపతి యైన మానయసాహిణియు గజసాహిణిమేచయు నాయఁడు నీతనికిఁ దోడుగా నుండిరి. ఇంకను కమ్మసేనానులు వెలమసేనానులు పెక్కండ్ర సాహాయ్యముతో అన్నమదేవుఁడు మలిక్ కాఫుర్ నెదుర్కొనఁ గోదావరీతీరమువఱకుఁ బోయి రేవుల నన్నిటిని గాచుకొని యుండెను. మలిక్ కాఫుర్ ఆంధ్రదేశమును బ్రవేశించినతోడనే దేవాలయంబులఁ గూలం ద్రోయుచు, పల్లెలను పట్టణములను దోఁచుకొని తగులంబెట్టుచు భూమియు నాకాశము నొక్కటే జ్వాలఁగా నగ్నిఁ బ్రవహింపఁజేయుచు వచ్చుచుండఁ బ్రజలు భీతావహులై స్వస్థలములను విడనాడి యరణ్యప్రాంతములకుఁ బాఱిపోవుచుండిరి. ఇట్లు సాధువులు నిరపరాధులు నగు ప్రజలను సంక్షోభపెట్టుచు మలిక్ కాఫుర్ గోదావరీనదివఱకు వచ్చెను. అప్పు డుభయసైన్యములకును ఘోరమైన యుద్ధము ప్రారంభ మయ్యెను. మహమ్మదీయ సైనికులు గోదావరిని దాటి రావలయు నని యెన్నెన్నో ప్రయత్నములను గావించి భగ్నమనోరథు లైరి. అనన్యసామాన్య క్షాత్త్రతేజంబు వహించి విక్రమసింహంబులవలె విజృంభించి మొక్కవోని పౌరుషముతోడ శాత్రవవీరుల మార్కొని హిందూవీరవరాగ్రణులు పోరాడి శాత్రవులచే సయితము పలుప్రకారంబులఁ గొనియాడఁబడుచుండిరి. ఉభయపక్షములలోను వేలకొలది సైనికులు రణభూమికిఁ దమ ప్రాణంబు లర్పించి స్వామిభక్తిని బ్రకటించిరి. మహమ్మదీయులు గోదావరీనదిని దాటి రాలేకపోవుటయే గాక తమస్థానంబుల సుస్థిరచిత్తులై నిలువం జాలక పోయిరి. హిందువులు గోదావరీనదిని దాటివచ్చి పైఁబడఁగా శత్రువులయొక్క మధ్యభాగము విచ్చిపోయెను. అంతట హిందూరాహుత్తులు శత్రువులం దఱిమిరి. ఒకభాగ మిట్లు పాఱినతోడనే తక్కిన మహమ్మదీయసేనానులు కూడ సుస్థిరచిత్తులై నిలువంబడి పోరాడఁ

జాలక వెనుదీసిరి. హిందూసైనికులు వారిని సరిహద్దులను దాటువఱకుఁ దఱుముచునే యుండిరి. ఈదండయాత్రయందు మహమ్మదీయసైన్యము విశేషముగా నష్ట మయ్యెను. మలిక్ కాఫుర్ సంపూర్ణముగా పరాభూతుఁడై ఢిల్లీకిఁ బాఱిపోవలసినవాఁ డయ్యెను. హిందువులవలన గలిగిన పరభవమె మలిక్ కాఫుర్ హృదయమునకు శూలమై నాటి యెప్పటికైనను బగతీర్చుకొనవలయునన్న సంకల్ప మాతనికి బుట్టించెను. అట్టియదనుకై మలిక్ కాఫుర్ నిరీక్షించుచుండెను.

మలిక్ కాఫుర్ ద్వితీయదండయాత్ర.

ఇట్లాంధ్రులు విజయము గాంచుటయును, మహమ్మదీయులు పరాజితులగుటయును నత్యాశ్చర్యమును జెంది సేవణదేశమును బాలించు రామచంద్రదేవుఁడు ఢిల్లీచక్రవర్తికిఁ గప్పముగట్టుట మానుకొనియెను. ఇయ్యది ఢిల్లీచక్రవర్తి యాగ్రహమునకుఁ బాత్రుని గావించెను. మహారాష్ట్ర త్రిలింగదేశముల నుజయించుటకై అల్లాఉద్దీను చక్రవర్తి ముప్పదివేల గుఱ్ఱపుదళమును లక్షకాల్బలము నిచ్చి మలిక్ కాఫురును క్రీ. శ. ౧౩౦౭ వ సంవత్సరము మార్చినెలలో మరలఁ బంపెను. ఇట్టి మహాసైన్యముతోడ మలిక్ కాఫుర్ దేవగిరికి వచ్చి దేవగిరిదుర్గమును ముట్టడింపఁగానే యామహాసైన్యము నెదిరించుట కష్ట మని రామచంద్రదేవుఁడు వానికి లోఁబడియెను. అంతట మలిక్ కాఫుర్ సంతోషితస్వాంతుఁడై రామచంద్రదేవుని ఢిల్లీకిఁ బంపించి తా నాదేశమును విడిచి యేకశిలానగరముపై దండెత్తివచ్చెను. ఈరెండవసారియు మహమ్మదీయులకు నాంధ్రులకు మహాఘోరాహవము వాటిల్లెను. ఈయుద్ధమునందు ఆంధ్రభటులు వేనవేలు హతమైరి. కాని విజయము మరల నాంధ్రులకే సంప్రాప్త మయ్యెను. మలిక్ కాఫుర్ పరాభూతుఁడై ఢిల్లీకిఁ బాఱిపోయెను. ఆఱుమాసములకుఁ బిమ్మట రామచంద్రదేవుఁడు ఢిల్లీచక్రవర్తిచే సర్వసత్కారములను బొంది చెఱనుండి విముక్తిఁ గాంచెను. నాటనుండి ఢిల్లీచక్రవర్తికి విశ్వాసపూ

ర్వకముగాఁ గప్పము చెల్లించుచుండెను. ఇట్లు తాను తురుష్కులచే జయింపఁబడి ఢిల్లీచక్రవర్తికిఁ గప్పము గట్టుచుండఁగాఁ దన ప్రతిపక్షియైన ప్రతాపరుద్రుఁడు స్వతంత్రుఁడై యుంట రామదేవునకు మనం బెరియించుచుండెను. అసూయాతత్పరుఁడై రామదేవుఁడట్లు మహమ్మదీయులతోడఁ గుట్రలు చేసి వారాంధ్రదేశముపై దండెత్తి వచ్చునటులఁ బ్రోత్సహించెను. రెండు తడవలాంధ్రులతోఁ బోరాడి యోడిపోయినవాఁడగుటచేత మలిక్ కాఫర్ చక్రవర్తి యానుజ్ఞ గైకొని నలువదివేల గుఱ్ఱపుదళము తోడను లక్షకాల్బలముతోడను బుందేలుఖండము మార్గము మీఁదుగా బయలుదేరి వచ్చి దేవగిరిలోఁ గొంతకాలము నివసించి రామచంద్రదేవుఁడొనరించిన యాతిథ్యము నంగీకరించి తనసైన్యమునకుఁ గావలసిన పదార్థముల నన్నిటిని నతఁడే సమకూర్పఁగాఁ గృతజ్ఞతావందనపూర్వకముగ గ్రహించి యచ్చటనుండి బయలువెడలి యాంధ్రదేశమును బ్రవేశించెను. ఈ తృతీయదండయాత్ర క్రీ. శ. ౧౩౦౯ వ సంవత్సరాంతమున సలుపఁబడినది.

మహమ్మదీయుల తృతీయదండయాత్ర.

మరల మలిక్ కాఫర్ మహాసైన్యముతో దండెత్తి వచ్చుచున్నాఁడను వార్త వ్యాపించినతోడనే దేశమున నొక మహాసంక్షోభము జనించెను. మహమ్మదీయులు తమ పూన్కిని విడువక యిట్లు పలుమాఱు దాడివెడలి వచ్చుటవలన హిందువుల ధైర్యకంచుకము సడలుచుండెను. అయినను ప్రతాపరుద్రుని సేనానులు రణశూరు లగుటచేత నించుకయుం జలింపక చక్రవర్తి యాజ్ఞను విశ్వాసపూర్వకముగాఁ దల నిడికొని తమతమ నియమిత స్థానంబులను విడువక ప్రాణంబులర్పింపవలసినను వెనుదీయక శౌర్యాగ్నిఁ బ్రజ్వలింపఁ జేయుచు శత్రువుల నెదుర్కొని భయంకరముగాఁ బోరాడిరి. మహమ్మదీయులకు గుఱ్ఱపుదళ మధికముగా నుండుటచేతను సరిహద్దుల మార్గములందు హిందువులు సుస్థిరచిత్తులై నిలువంబడి పోరాడఁజాలక దారి యిచ్చుటచేతను మహమ్మ

దీయ సేనాధిపతికి మార్గము సులభసాధ్య మయ్యెను. శాత్రవసైన్యంబులు సరిహద్దుకోటల నాక్రమించుకొని గోదావరివఱకు రాఁగ హిందువుల కాందోళన మెక్కువయ్యెను. ప్రసిద్ధులయిన సేనాను లందఱును రాజధానీదుర్గమును బ్రవేశించిరి. వేలకొలఁది రాచవారు, కమ్మవారు, వెలమవారు, రెడ్లు, వంటరులు మానమును గోలుపోవుటకన్నఁ బ్రాణమును గోల్పోవుటయే శ్రేష్ఠమని రణభూమికిఁ దమ ప్రాణంబు లర్పించి శాశ్వతమైన యశంబును సంపాదించిరి. శత్రువులు మార్గమధ్యమున వాణీకవిదేవునిచే సంరక్షింపఁబడుచున్న సర్బరదుర్గమును ముట్టడించి యగ్నిహోత్రమును దాకొలిపి ప్రజ్వలింపఁజేసిరి. వాణీకవిదేవుని వీరభటులు స్త్రీశిశుసమేతముగా నా యగ్నిహోత్రము నెదుర్కొని వీరస్వర్గమును జూఱఁగొనిరి. అగ్నిహోత్రము పాల్పడక బ్రదికి బైలపడిన వీరభటులు ప్రాణ మున్నంత దనుక శత్రువీరులతో ఖడ్గయుద్ధములు చేసి నేలఁగూలిరి. సర్బరదుర్గము మహమ్మదీయుల యాధీన మాయెనని అమీరుఖుస్రూ యను చరిత్రకారుఁడు వ్రాయుచున్నాఁడు. ఇట్లు మహమ్మదీయులు హిందువులతో బాహుయుద్ధము జేయుచుఁ ద్రోచుకొని వచ్చుచుండ హిందూసేనాను లెల్లరును మరలి యేకశిలానగరదుర్గములోఁ బ్రవేశించిరి. శాత్రవు లోరుగంటి దుర్గమును ముట్టడించిరి. తురుష్కసైన్యము లోరుగంటి కోట చుట్టును నివాసస్థానము లేర్పఱచుకొనిరి. మట్టికోట వెలుపలి ప్రాకారము యొక్క చుట్టుకొలత పండ్రెండువేల యైదువందల నలువదియాఱు గజము లుండె నని మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియున్నారు.

ఈయోరుగంటి కోటగోడ మట్టితోఁ జేయఁబడి ఉక్కుబల్లెముతోఁ బొడిచినప్పటికైన నొక్క బెల్లయినను రాలకుండునట్టిదిగా నుండె నని యా చరిత్రకారులే వ్రాసియున్నారు. తురుష్కసైన్యము లనేకభాగములుగ విభాగింపఁబడి యొక్కొక్కభాగము పండ్రెండువందల గజముల స్థలము చొప్పున నాక్రమించుకొని ప్రాకారము చుట్టును విడిసియుండిరి. ఈప్రకారముగా

నేకశిలానగరదుర్గము చుట్టును నెంతమాత్రమును తెఱపి లేక యుండ మహమ్మదీయభటు లాక్రమించుకొని యుండిరి. "ఖ్వాజానసీరుల్ ముల్కుసీ రాజిద్దౌలత్" అనువాని నధికారము క్రింద నీసైన్య ముంపఁబడియెను. ఒకనాటి రాత్రి కోటలోనుండి వినాయకదేవుఁ డనెడు సేనాపతి యొకఁడు మూఁడువేల గుఱ్ఱపుదళముతో వచ్చి కత్తాబేగ అను మహమ్మదీయ సైన్యాధిపతి పైఁబడియెను. ఉభయసైన్యముల కప్పుడు ఘోరయుద్ధము జరిగెను. హిందువుల మూఁడువేల గుఱ్ఱపుదళమును సైన్యాధిపతితోఁగూడ నాశన మయ్యెను. మహమ్మదీయభటులు పిశాచములవలె సుస్థిర చిత్తులై నిలువంబడి యుద్ధముచేసిరి. ఇట్లు కొన్నిదినములు జరుగునప్పటికి మహమ్మదీయసేనానులు విజృంభించి శత్రువులు తమపై గురిపించు నగ్నిహోత్రములోఁ బడు మిడుతలవలె బ్రగ్గుచున్నను భీతచిత్తులు గాక అప్రతిమానప్రతాపముతో వీరరసము మూర్తీభవించినదో యన నాయగ్నిహోత్రము నెదుర్కొని "హుజ్జాహుజ్, ఖుజ్జాఖుజ్" అను ధ్వనులు మిన్నుముట్టుచుండఁ డెంపరులై పోయి కోటకు వెలుపలి ప్రాకారముగా నున్న మట్టిగోడ నాక్రమించుకొనిరి. అక్కడినుండి చూడ వారలకు ఱాతికోట గానిపించుచుండెను. ఇంతవఱకు వచ్చిన తరువాత సంధిచేసికొనకుండుట నీతి కా దనియు నపాయకర మనియు నిశ్చయించి మంత్రివర్గముతో నాలోచించి ప్రతాపరుద్రుండు రహస్యముగా మలిక్ కాఫురునకు సందేశమును బంపెను. ఎట్లయినను ప్రతాపరుద్రుఁడు లోఁబడినదే చాలు నని మలిక్ కాఫుర్ సంతోషించెను. తాను లోఁబడినందునకు గుర్తుగాఁ దన సువర్ణప్రతిమను వారికిఁ బంపి యనేకరత్నాభరణములను ధనము నొసంగె నఁట! అంతట మలిక్ కాఫుర్ ముట్టడి మాని ధనభారమును వహించిన వేయియొంటెలతోడ క్రీ. శ. ౧౩౧౦ దవ సంవత్సరము మార్చినెల ౧౦వ తేదిని ఢిల్లీకిఁ బయనమై పోయె నని అతిశయోక్తిగా అమీరుఖుస్రూ యను మహమ్మదీయ చరిత్రకారుఁడు వ్రాసి యున్నాఁడు.

ప్రతాపరుద్రుఁడు

శ్రీశైలమునకుఁ బోవుట.

ప్రతాపరుద్రుఁడు మహమ్మదీయులతో నైన యుద్ధమువలన నధికనష్టమును బొందినవాఁడు గావున మరలధనమును సంపాదించి రాజ్యమును బాగుపఱచుకొనవలసి యుండెను. అదియునుగాక తనరాజ్యమునకు దక్షిణపుసరిహద్దులలో నుండుమండలేశ్వరులు స్వతంత్రు లగుటకుఁ బ్రయత్నములు సలుపుచుండుటవలన వారలను శిక్షించి సరిహద్దులను గాపాడవలసియుండెను. మఱియును మతాభినిరతి కలవాఁడు గావున మార్గమధ్యమున నుండు శ్రీశైలక్షేత్రమునకుఁ బోయి మల్లికార్జునస్వామిని సందర్శింపఁ గోరి ప్రతాపరుద్రుఁడు ముందుగాఁ ద్రిపురాంతకమునకును పిమ్మట శ్రీశైలమునకును బోయి యాక్షేత్రములకు ననేకభూదానములను గావించెను. అచ్చటనుండి ప్రతాపరుద్రుఁడు బత్తులుదేటి కొచ్చెర్లకోటదుర్గమునకుఁ బోయి యచ్చట కొంతకాలము నివసించెను. ఆకాలములోఁ దన వేటకాండ్రగు ఇరికప్ప, కేతినాయకుఁ డను వారికి నచ్చట నొకప్రదేశమున నడవి నఱికి గ్రామమును గట్టవలసిన దని యుత్తరువు చేసెను. దీనినే దుప్పిపాడు లేక దూపాడు అని జనులు వ్యవహరించుచున్నారు. దీని చుట్టునుండు దేశమును దూపాడుసీమ యని పేరు పెట్టి అనుమకొండ నివాసియైన శ్రీనాథరాజున కిచ్చెను. అతఁ డొకభవనమును గట్టుకొని యాసీమను బరిపాలించుచుండెను. కళ్యాణపురమునుండి సిరిసింగళమహాదేవుఁ డను నతఁడు తనమేనమామ కూఁతురైన సింగళదేవితోఁగూడ లేచివచ్చి ప్రతాపరుద్రుని నాశ్రయించినందువలన నతనికి నందికోటకూరుసీమ నొసంగెను. అతఁ డాయరణ్యప్రాంతమును జక్కపఱచి గ్రామములను గట్టించి తనచరిత్రముతో సంబంధించిన నామములనే వానికిఁ బెట్టె నఁట! అతఁడు పాలుత్రాఁగిన ప్రదేశమునకుఁ బాలమూఱి యనియు, అతఁడు శత్రువుల

తోడఁ బోరాడునపుడు కంఠహారమును విడిచిపెట్టిన స్థలమునకు వనమాలపాడనియు, అలుగులతోఁ దాను పోరాడిన స్థలమునకు అలుగులూరనియు నామములు కలిగె నని జనులు చెప్పుకొందురు. ప్రతాపరుద్రచక్రవర్తి యాకాలముననే కందనోలిసీమను విడెముకొమ్మరాజునకు నొసంగెను. ఈమండలేశ్వరునకు నాగరాజు అను నియోగిబ్రాహ్మణుఁడు మంత్రిగ నుండి యనేకగ్రామములను నిర్మించి దానధర్మములను గావించి ప్రఖ్యాతిఁగాంచెను. శా. శ. ౧౨౩౨వ సంవత్సరములో (౧౩౧౦) నీతని పేరిటిదానశాసనములు ముద్దనూరు, కాల్వ, దామగట్ల, మల్యాల, అనుప్రదేశములందు గానఁబడుచున్నవి.

జుట్టయలంక గొంకారెడ్డి.

ములికినాఁడు, పొత్తపినాడు, గండికోటసీమలలో నివసించియున్న త్రిపురాంతకాంబదేవుల బంధువయిన మల్లరాజు మొదలగువారు కొందఱు వడ్డెరాజులతోఁ గలిసి తిరుగఁబడి స్వతంత్రు లగుటకుఁ బ్రయత్నింపఁగాఁ బ్రతాపరుద్రుఁడు చతురంగబలసమేతుఁడై పోయి వారిని నోడించి యాదేశములకుఁ దనపుత్త్రుఁ డయిన జుట్టయలంక గొంకారెడ్డిగారిని నధిపతిని గావించెను. ఇతని శాసనములు కొన్ని ములికినాటి సీమలోఁ గానవచ్చుచున్నవి. అందు చెరనూరి శాసనములో నిట్లున్నది.

"స్వస్తిశక వర్షంబులు ౧౨౩౫ (౧౩౧౩) అగునేటి ప్రమాదీచ సంవత్సరశ్రావణ శు ౧౨ బుధవారమునాడు స్వస్తిశ్రీమన్మహామండలేశ్వర కాకతీయ ప్రతాపరుద్రదేవమహారాజు కుమారుఁడు మూర్లోకగండమూర్తి మురుగద కంఠ తీర్ణ త్రిప్రతిజ్ఞ పరశుబిరుదాంక రుద్రబిరుద బ్రహ్మరాక్షస గండికోట దుర్గవిభాళ మల్లదేవర గొండుగండ స్వయంభూనాథ దేవ దివ్యశ్రీపాదపద్మారాధక మహారాయ కంఠశాలనాయకుండైన జుట్టయలంక గారు" జుట్టయ ప్రతాపరుద్రుని కుమారుఁ డని యాశాసనములోని సంస్కృతశ్లోకములలోఁ గూడఁ

జెప్పఁబడినది. ఈజుట్టయ గొంకారెడ్డి ప్రతాపరుద్రున కౌరసపుత్త్రుఁడై నదియు, మఱియొక పుత్త్రుఁడైనదియు, భావిపరిశోధనమువలనఁ దెలిసికొనవలసియున్నది. ఎట్టిపుత్త్రుఁడైనను క్రీస్తుశకము ౧౩౧౩ వ సంవత్సరప్రాంతమున ములికినాడు గండికోటసీమలను బరిపాలనము సేయుచుండె నని యాప్రదేశములోని వాని శాసనములే వేనోళ్లఁ జాటుచున్నవి.

ప్రతాపరుద్రుఁడు పాండ్యరాజులను జయించుట.

మహమ్మదీయులు ప్రతాపరుద్రునిపై దండెత్తి వచ్చినా రనియు, ప్రతాపరుద్రుఁడు శత్రువులతోఁ బోరాడలేక సంధిచేసికొన్నాఁ డనియు విన్నతోడనే పూర్వవైరమును మనస్సునందుంచుకొన్న వీరపాండ్య విక్రమపాండ్యసుందరపాండ్య కులశేఖరపాండ్య పరాక్రమపాండ్యులను నీయైదుగురు పాండ్యరాజులు కాంచీపురమును ముట్టడించి చోడరాజైన మనుమగండ గోపాలుని నచటి నుండి పాఱఁద్రోలి యాపట్టణ మాక్రమించుకొనిరి. మనుమగండగోపాలుఁడు ప్రతాపరుద్రచక్రవర్తికిఁ గప్పము చెల్లించు సామంతప్రభువు గావున ప్రతాపరుద్రచక్రవర్తి పక్షమున నతని మహామంత్రులలో నొక్కఁడును, ప్రతినిధి పాలకుఁడును సైన్యాధ్యక్షుఁడు నగు ముప్పిడి నాయకుఁడను కమ్మసేనాని పద్మనాయక వీరుఁడైన రేచెర్ల యెఱ్ఱదాచానాయని పాండ్యులమీఁదికిఁ బంపించెను. ఎఱ్ఱదాచానాయఁడు కాంచీపురసామీప్యమునఁ బాండ్యులతో ఘోరయుద్ధముచేసి వారలను జయించి గజతురగచ్ఛత్రచామరాందోలికాదులు పెక్కులు గ్రహించుటయుగాక శిరోభూషణ మగు నఱచేతి వెడల్పుగల యొకగొప్పపచ్చను ఒకస్వర్ణమయసింహాసనమును దీసికొని వచ్చి తాను దెచ్చిన ధనకనకవస్తువాహనాదులు నమూల్యరత్నాదులును ప్రతాపరుద్రునకు సమర్పించెను. ప్రతాపరుద్రుఁడు మెచ్చి వానికి "పంచ

పాండ్యదళవిభాళ" "కంచికవాటచూరకార" అనుబిరుదముల నొసంగె నంట! ఇతఁడు పాండ్యరాజును జయించినట్లు సింగభూపాలీయ మను గ్రంథమునందలి యీక్రింది శ్లోకమువలనం గూడ దెలియుచున్నది.

శ్లో. యా స్వాసిధారామార్గేణ దుర్గేణాపి రణాఙ్గణే
పాండ్యరాజగజానీకా జ్జయలక్ష్మీ రుపాగతా.
ఖడ్గనారాయణే తస్మిన్ భవతి శ్రీ రతిస్థిరా
భూ రభూ త్కారిణీ వశ్యా దుష్టరాజగజాంకుశా."

మఱియు శ్రీ వేంకటగిరివారి వంశావళియందు.

"చ. వెలయఁ బ్రతాపరుద్రవిభు వీరభటావళి చూడ వాజిలో
బలమునఁ గుంత మందుకొని చయ్యన వచ్చి గజంబు నూర్చి దో
ర్బల మధికంబుగా నెగడఁ బైకొని తా జయలక్ష్మి చేకొనన్
గలిచెను బాండ్యరాజగజకేసరి దాచయశౌరి పాండ్యులన్."

అని వ్రాయఁబడిన పద్యమువలనను రేచెర్లదాచానాయఁడు పాండ్యులను జయించె ననుట ధ్రువపడుచున్నది. ప్రతాపరుద్రుని పేరిటిశాసన మొకటి తిరుచునాపల్లెలో జంబుకేశ్వరాలయములో నుండుటచేత నీదండయాత్రలోఁ బ్రతాపరుద్రుఁడు కూడ నుండె నేమో యని సందియము కలుగుచున్నది. ప్రతాపరుద్రుఁడు స్వయముగా దక్షిణదిగ్విజయయాత్ర చేసినను చేయక పోయినను ఇతఁడు సైన్యముల నంపి పాండ్యులను జయించినది వాస్తవమను టకు సందియము లేదు.

ముప్పిడినాయకుఁడు రవివర్మను జయించుట.

విక్రమసింహపురాధిపతి యైన నల్లసిద్ధిరాజునకు జ్యేష్ఠకుమారుఁ డైన మనుమగండ గోపాలదేవ చోడ మహారాజు కాకతీయ సైన్యాధిపతుల సాహాయ్యముతోఁ గాంచీపురమును మరల స్వాధీనముచేసికొని పరిపాలనము

సేయుచుండఁగాఁ బరాభూతు లయిన పాండ్యరాజకుమారులను దోడుచేసి కొని కేరళదేశాధీశ్వరుం డైన రవివర్మ క్రీ. శ. ౧౩౧౩-౧౪-వ సంవత్సరమునఁ గాంచీపురమును రెండవమాఱు ముట్టడించి మనుమగండగోపాలునిఁ బాఱఁద్రోలి రాజ్య మాక్రమించుకొని కాంచీపురమునఁ బట్టాభిషిక్తుఁ డయ్యెను. ఈవృత్తాంతమును విని ప్రతాపరుద్రుని మహాప్రధానులలో నొక్కఁ డగు ముప్పిడినాయకుఁడు దాక్షిణాత్యులను కాంచీపురమునుండి తఱుమగొట్టుటకై నియోగింపఁబడియెను. ఈముప్పిడినాయకుని తండ్రి నాగినాయఁ డనియు, తల్లి గంగసానమ్మ యనియు, కందుకూరు సీమలోని గుడ్లూరు నీలకంఠేశ్వర స్వామివారి యాలయసమీపమునం బడి యున్న యొక శిలాశాసనముం బట్టి దెలియుచున్నది. ఈసీనుయం దితని దానశాసనము లనేకములు గలవు. ఈకమ్మసేనాధిపతి యైన ముప్పిడినాయకుఁడు కాంచీపురమును ముట్టడించి పాండ్యకేరళులతోడ ఘోరయుద్ధము చేసి రవివర్మ యాదిగాఁ గల రాజకుమారవర్గమును బాఱఁద్రోలి కాంచీపురమునం బ్రవేశించి మానవీరుని పట్టాభిషిక్తుని గావించెను. శ్రీమన్మహామండలేశ్వర మనుమగండ గోపాలదేవ చోడమహారాజే మానవీరుఁ డని పేర్కొనం బడియె నని తోచుచున్నది. కాంచీపురము కొంతకాలమునుండి విక్రమసింహ (నెల్లూరు) పురాధిపతు లయిన తెలుఁగుచోడులచేఁ బరిపాలింపఁ బడుచుండుటచేత మానవీరుఁడు తెలుఁగు చోడులలోని వాఁడుగానే పరిగణింపఁ బడవలయును. ముప్పిడినాయకుఁడు క్రీ. శ. ౧౩౧౬ వ సంవత్సరము జూను నెల ౧౧వ తేదిని మానవీరునికి పట్టబంధమును గావించి సింహాసన మెక్కించి ౧౮ వ తేదిని కాంచీపురములో నున్నట్టి అరుళాల పెరుమాళ్ల దేవాలయమునకు దానధర్మములను గావించి శాసనము వ్రాయించెను. పెయ్యూరు కొట్టమునాటిలో "అయిగచేరి" గుమ్మడిపూఁడి పాలెములతో పెయ్యూరు గ్రామమువలనను, కచ్చియూరు నాటిలోని పాంప్తైనాక మను గ్రామమువలనను వచ్చెడి

సంవత్సరపాదాయము ౧౦౦౨ గొడ్డగోపాల మాడలలోను ౨౪౦ మాడలు వేగవతీనదికి దక్షిణపుటొడ్డున నొక పుష్పోద్యానవనమును నిర్మించి నానావిధ ఫలపుష్పజాతి వృక్షములను నాటుటకును, దాని సంరక్షణముచేసెడి నౌకరుల జీతముకొఱకును, ౩౬౦ మాడలు దేవుని నిత్యకైంకర్యాదులకొఱకును, ౩౮౨ మండపము లాదిగాఁ గట్టడములకొఱకును వినియోగించు నిమిత్తము దానశాసనమును లిఖించెను. ఈ శాసనమునుబట్టి కాంచీపురము గూడ నాంధ్రసామ్రాజ్యమునఁ జేరియున్నదని విస్పష్టమగుచున్నది. 1

అల్లా ఉద్దీను మరణము, ఢిల్లీలో అల్లకల్లోలములు,

ప్రతాపరుద్ర చక్రవర్తి దక్షిణ దిగ్విజయ యాత్రలు ముగించి దేశమున శాంతి నెలకొలిపి రామరాజ్యముగ నాంధ్రసామ్రాజ్యమును బరిపాలనము సేయుచుండెను. అల్లాఉద్దీను చక్రవర్తి సైన్యాధ్యక్షుఁడైన మలిక్ కాఫురెడ పక్షపాతమును జూపుచు మిక్కిలి యనురాగము గలిగి యుండుటచేత నీతనియెడ ననేకుల కసూయ జనించెను. చక్రవర్తికిని వాని భార్యాపుత్త్రిదులకును బలవద్విరోధ మేర్పడియెను. మలిక్ కాఫుర్ వారలనుబట్టి చెఱలోఁ బెట్టెను. ఘూర్జరము చక్రవర్తియధికారమును దిరస్కరించెను. చిత్తోడ్ గడ మను రాజపుత్త్రసంస్థానము స్వాతంత్ర్యము నొందెను. దేవగిరిలో రామచంద్రదేవుఁడు వాని కుమారుఁడు శంకరదేవుఁడు మరణమునొందిన తరువాత రామదేవుని యల్లుఁడగు హరిపాలదేవుఁడు మహారాష్ట్రమునుండి తురుష్కులను దఱిమెను. ప్రతాపరుద్రచక్రవర్తి మరలఁ బుంజుకొని బలవంతుఁడై తనతో సమానుఁడై యొప్పుచుండెను. ఈసమాచారములను విని ఢిల్లీచక్రవర్తి దుఃఖముతోఁ గ్రుంగి చేయునది లేక వ్యాధిగ్రస్తుఁడై యుండ విషప్రయోగ

1. Epigraphia Indica, Vol. VII. No. 18. Arulala perumal Inscription of the Time of Prataparudra.

మును జేసి మలిక్ కాఫుర్ తనప్రభువును జంపించె నని చెప్పుదురు. అల్లా ఉద్దీను క్రీ. శ. ౧౩౧౬ లో జనిపోయెను. అల్లాఉద్దీను చనిపోయినతోడనే యతని పెద్దకుమారుని కన్నుల నూడఁబెఱికి వానిఁ జెఱ నుంచి యాతని తమ్ముఁడై చేడ్డవాఁడొకఁడుండఁగా వానికిఁ బట్టము గట్టి తానే పరిపాలనము సేయఁ బ్రారంభించెను. కాని వాని పరిపాలన మొల్లక వాని సేవకులే వానిని మట్టుపెట్టిరి. అల్లాఉద్దీనుని నాలుగవకుమారుఁడు ముబారిక్ అనువాఁడు క్రూరుఁడై తనసోదరుల నందఱను జంపి పట్టాభిషిక్తుఁ డయ్యెను. ఇతఁడు ౧౩౧౮ వ సంవత్సరమున మహారాష్ట్రదేశముపై దండెత్తివచ్చి దేవగిరిదుర్గమును ముట్టడించి హరిపాలదేవునిఁ బట్టికొని మహాక్రూరుఁడై బ్రదికియుండఁగానే వాని చర్మమొలిపించి చంపించి యారాజ్యమును దనసామ్రాజ్యములోఁ గలుపుకొనియెను. ఢిల్లీనగరమునఁ బ్రవేశింపఁగానే ఖుస్రూ యను వానిసేనాధిపతి యానీచునిఁ దల నఱికివైచి తాను రాజ్యారూఢుఁ డయ్యెను. ఈ ఖుస్రూ యనువాఁడు ప్రచ్ఛన్నవేషముతోఁ నున్న హిందు వగుటచేతఁ దురుష్కుల ద్వేషింప నారంభించెను.

అతని యనుయాయు లందఱును ఢిల్లీనగరములోని మసీదులలో విగ్రహములను బ్రతిష్ఠింపసాగిరి. ఢిల్లీనగర మంతయు నల్లకల్లోలముగా నుండెను. ఆసమయమునఁ బంజాబుదేశమునకు సుబాదారుగా నున్న గజీబేగుతుఘ్లఖ్ అనువాఁడు వచ్చి ఖుస్రూను జంపి ఢిల్లీస్వాధీనముఁ జేసికొని గ్యాసుద్దీను అను పేరు పెట్టుకొని రాజ్యపరిపాలనముచేయఁ బ్రారంభించెను.

భాషాభివృద్ధి.

ప్రతాపరుద్రచక్రవర్తి యాబాల్యకవితార సజ్ఞుఁడును, విద్వద్గోష్ఠీప్రియుండును నగుటచేతఁ దనయాస్థానమున విద్వన్మహాకవుల ననేకులను నిలిపి పోషింపుచువచ్చెను. అట్టివారిలో విద్యానాథ మహాకవి యగ్రగణ్యుండని చెప్పందగును. అమ్మహాకవి ప్రతాపరుద్ర యశోభూషణం బను నలంకార

శాస్త్రమును రచించి యాచక్రవర్తి కంకితము చేసెను. రుద్రభట్టను మఱియొక విద్వత్కవి సంస్కృత కర్ణాటభాషలయందుఁ బెక్కుగ్రంథములను రచించెను. త్రిపురాంతకకవి సంస్కృతాంధ్రముల ననేకగ్రంథములను రచించెను. ఇతఁడు ప్రేమాభిరామ మను వీధినాటకమును సంస్కృతమున రచింప దానిని శ్రీనాథ మహాకవి వల్లభామాత్యునిపేరితోఁ దెనిఁగించి క్రీడాభిరామ మని పేరు పెట్టెను. ఈగ్రంథమునుండి యనేకపద్యముల నుదాహరించియే యున్నాను. ఇతనికాలమున మారనకవి మార్కండేయపురాణమును రచించి యితని మంత్రులలో నొక్కఁడగు గన్నమంత్రికి నంకితము చేసెను. భాస్కరకవి దశగతులను రామాయణమును రచించి యితని సైన్యాధిపతులలో నొక్కఁడగు సాహిణిమారుని కంకితము చేసెను. మంచనకవి కేయూరబాహుచరిత్రమును రచించి నండూరిగుండనామాత్యుని కంకితము చేసెను. శివదేవయ్య యను ప్రధాని మంత్రి శివతత్త్వరసాయన మను గ్రంథమును రచించెను. ఇంకను శైవు లనేకులు శైవగ్రంథములను రచించి యుండిరి. కావున నీచక్రవర్తి పరిపాలనకాలమున సంస్కృతాంధ్రభాషలు రెండును వర్ధిల్లిన వని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

పరిపాలన వివరణము.

ఈతని ప్రభుత్వకాలమున నాంధ్రసామ్రాజ్యము రాష్ట్రములుగను, విషయములుగను, నాడులుగను, సీమలుగను విభాగింపఁబడి నియమితాధికారులచేఁ బరిపాలింపఁ బడుచుండెను. ఆకాలమున డెబ్బదిరెండు నియోగములు (Departments.) గల వనియు, వానిని విచారించు నధికారులు గలరనియు గంగయ సాహిణింగూర్చి వ్రాయు ప్రకరణమునఁ దెలిపియున్నాఁడను. దానింబట్టియే పరిపాలనము పగడుగా నుండె నని తేటపడఁగలదుఁ. రాజప్రతినిధులు, మండలాధికారులు, సైన్యాధిపతు లొకచోటనుండి మఱియొక చోటికి మార్పఁబడుచుండి రని వారిశాసనములు వేర్వేఱుకాలముల

వేఱు వేఱు దేశములందు గానంబడుటయె యిందునకు నిదర్శనముగాఁ జెప్పవచ్చును. రాజకీయాధికారు లెల్లరును శాఖాభేదములచేతను మతభేదముల చేతను వేఱుపడియున్నను చక్రవర్తియాజ్ఞ సుగ్రీవాజ్ఞగా శిరమున వహింపఁ బడుచుండెను. చక్కనిబాట లేర్పడియెను. వాణిజ్యము విదేశములతోడ దినదినప్రవర్ధమానమై యతిశయించుచుండెను. వేయు నేల? ఈతనిపాలనమున నాంధ్రుల ప్రతిభావిశేషము విదేశములందు వేనోళ్లఁ గొనియాడఁబడుచు ఢిల్లీ చక్రవర్తులను పక్కలోని బల్లెమై నిదుర పట్టనీయక భయంకరమై యొప్పుచుండెను.

ఇతరప్రసిద్ధ సేనానాయకులు.

కలియుగవీరభద్రుఁ డని బిరుదుగాంచిన దేవరినాయనింగారు పల్నాటియందును, సోమయ వెంకయసాహిణింగారు వెలనాటియందును, కామయ బొప్పనింగారు కమ్మనాటియందును, పోతయసాహిణింగారు పాకనాటియందును ప్రతాపరుద్రుని కడపటికాలమున నధికారపదవులను వహించి ప్రసిద్ధికెక్కియుండిరి. వీరిశాసనము లా యా నాడులలోఁ గనుపట్టుచున్నది.

రాజ్యవిస్తారము.

తూర్పున సముద్రముహద్దుగా దక్షిణమునఁ గాంచీపురముఁ జేర్చుకొని యుత్తరమునఁ గళింగదేశములోని సింహాచలపర్యంతమును పశ్చిమంబునఁ గల్యాణకటకమువఱకును ప్రతాపరుద్రుని సామ్రాజ్యము విస్తరించియుండెనని చెప్పవచ్చును. అనఁగా నిప్పటి నిజామురాజ్యములోఁ బదింటఁ దొమ్మిదిభాగములును, విశాఖపట్టణముజిల్లాలోని సింహాచలమునకు దిగువభాగమును, గోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, చెంగలుపట్టు, చిత్తూరు, కడప, అనంతపురము జిల్లాలోని యుత్తరభాగము, బళ్లారిజిల్లాలోని పశ్చిమభాగము, కందనూలుజిల్లాయును చేరియున్నవని నిస్సంశయముగాఁ జెప్పఁదగును.

ఆంధ్రులు మహమ్మదీయుల నోడించుట.

గ్యాస్ ఉద్దీన్ తుఘ్లక్ ఢిల్లీనగరమునఁ బట్టాభిషిక్తుఁడైన వెనుక మంగోలియాజాతివా రయిన మోగలులవలననే యుపద్రవముఁ గలుగకుండ సరిహద్దుప్రాంతముల సైన్యములను నిలిపి చక్కనికట్టుబాటుల నేర్పఱచి తన దృష్టినంతయు దక్షిణాపథము వంకకుఁ ద్రిప్పెను. తనకుఁ బ్రక్కలో బల్లెముగా నుండిన ప్రతాపరుద్రచక్రవర్తియొక్క పరాక్రమమును గూర్చినకథలు ఢిల్లీచక్రవర్తికి వినవచ్చుచుండెను. ఎందఱెందఱో రాజు లా యాంధ్రచక్రవర్తియెడ నసూయామాత్సర్యగ్రస్తులై యున్నారని గూడ నాతఁడు దెలిసికొనియెను. ప్రతాపరుద్రుని యాస్థానమున నుండు సేనాపతులలో పద్మనాయకులకును దక్కిన శాఖలవారలకును వైషమ్యములు వెలసియున్నవనియు నిది దండయాత్రకు ననుకూలసమయ మనియు నేకశిలానగరమునుండియు, దేవగిరినుండియు ప్రతాపరుద్రుని శత్రువులవలన సమాచారము లంపఁబడెనని కూడ వదంతులు గలవు. ఇంతకన్న మంచిసమయము దొరకదని ఢిల్లీచక్రవర్తి క్రీ. శ. ౧౩౨౨ వ సంవత్సరమున తన జ్యేష్ఠకుమారుఁడైన అలూఫ్ఖానుని బదివేల గుఱ్ఱపుదళమును లక్షకాల్బలము నిచ్చి యాంధ్రదేశము మీఁదికిఁ బంపెను. ఈయలూఫ్ఖానునియొక్క నిజమైన నామము మలిక్ ఫకీరుద్దీన్ జూనా యని. ఈదండయాత్రలో అలూఫ్ఖానుని వెంబడించి వచ్చిన సైన్యములు చెందేరి, బుదావూన్, మాల్వా యను ప్రదేశములం బ్రసిద్ధికెక్కినవై యున్నవి. ఇట్టి ప్రసిద్ధిగాంచిన సైన్యముతోడ శత్రుదేశములఁ గొల్లగొనుచు నాంధ్రదేశముఁ బ్రవేశించినతోడనే ప్రతాపరుద్రచక్రవర్తి యించుకయుఁ జలింపక యాంధ్రసామ్రాజ్యమున మిక్కిలి పేరుపోసిన సేనానులవీరుల నెదుర్కొనఁ బంపెను. అప్పు డుభయపక్షములవారికిని ఘోరసంగ్రామము జరిగెను. ఆంధ్రుల గుఱ్ఱపుదళముకంటెను దురుష్కుల గుఱ్ఱపుదళము బలాఢ్యమైనదియు నధికసంఖ్య కలదియు నగుటచేత తుట్టతుదకు నాంధ్రులు బట్ట

బయలు శత్రువరుల నెదుర్కొనుటకంటె దుర్గములోనుండి యెదిరించుట యుక్తమని తలంచి వెనుకకు మరలి యేకశిలానగరదుర్గములోఁ బ్రవేశించిరి. మహమ్మదీయు లుత్సాహపూరితులై యేకశిలానగరదుర్గమును ముట్టడించిరి. ఇట్లు మాసములకొలఁది ముట్టడి సాగించిమహమ్మదీయులు తెంపఱులై పోరాడ నాంధ్రపురుషసింహులును ప్రాణంబులు తృణప్రాయంబులుగా నెంచి శాత్రవులు సయితము వేనోళ్లఁ గీర్తించునటుల నద్భుతపరాక్రమమును జూపి యుద్ధము సేయుచుండిరి. ఉభయపక్షములయందును వేలకొలఁది సైనికులు నాశనమైరి. ఉభయపక్షములను సేనాపతు లనేకులు వీరస్వర్గమును జూఱఁగొనిరి. దుర్గముమాత్రము శత్రువులయాధీనము కాలేదు. మహమ్మదీయ సైనికుల కుత్సాహము తగ్గెను. వేలకొలఁదిసైన్యము నాశనమైనను కోటగోడ రవంతి బెల్లయిన నూడిపడక దృఢముగానుండెను. అక్కాలము మండువేసవికాలమగుటచేత ప్రచండములయిన వేడిగాడ్పులు వీవఁదొడంగెను. అనేకులు వడగొట్టువడి ప్రాణములఁ గోల్పోవుచుండిరి. కలరా మున్నగు వ్యాధులు శత్రువులఁ బీడింపఁ దొడంగెను. మహమ్మదీయ సైనికులకుఁ బిఱికితనము హెచ్చి ముట్టడిమాని స్వదేశమునకు మరలిపోవఁ దలంపుగలిగెను. తురుష్కస్కంధావారమున భీత్యావహము లగు వదంతులు వ్యాపింపఁ జేయబడుచుండెను. అదివఱకు నెలనుండి ఢిల్లీసమాచారములు తెలియకుండుటచేత అలూఫ్ఖాను మిత్రులును, డెమాస్కస్ పురవాసియైన షెకుజడా యను నాతఁడును, ఓబీ దను ప్రసిద్ధకవిశిఖామణియును, ఢిల్లీచక్రవర్తియైన గ్యాస్ఉద్దీనుతుఘ్లక్ మరణముఁ జెందెననియు, ఢిల్లీనగరమున విప్లవము సంభవించెననియు వదంతులు పుట్టించిరి. అంతటితోఁ దృప్తినొందక ముద్రాధికారియైన మలిక్ కాఫుర్, మఱియొక యధికారియైన మలిక్ తుగ్గే యనువారల కడకుఁబోయి ఢిల్లీ సమాచారములఁ జెప్పిరి. మఱియు సింహాసనముకై తనకుంగల హక్కును వారు నిరాకరింపవచ్చునని సంశయించుచు అలూఫ్ఖాను తమ్మును విడిచిపోవ నిశ్చ

యించివాఁడని చెప్పిరి. ఈయసత్యవాక్యములను విశ్వసించి యాసేనాధిపతులు తమతమ యనుచరులతో నారాత్రియే స్కంధావారమును విడిచి తొలఁగి పోయిరి. ఇట్లు తనవారు కొందఱు తన్ను విడిచిపోవుటచేత అలూఫ్ ఖాను ముట్టడి మానుకొని దేవగిరికిఁ బాఱిపోయెను. ఆంధ్రుల గుఱ్ఱపుదళము వెంబడించివచ్చి పైఁబడి వేలకొలఁది శత్రుసైన్యంబును నఱికివైచెను. అలూఫ్ ఖాను దేవగిరి చేరిన తరువాత ఢిల్లీసమాచారములను గూర్చిన వదంతులు వట్టివని తెలిసికొని మిక్కిలి దుఃఖించెను. చెదరిపోయిన సైనికులఁ జేర్చుకొనుటకుఁ బ్రయత్నించుచుండెను. అలూఫుఖాను విడిచిపోయిన మహమ్మదీయ సేనాధిపతులు మార్గమధ్యమున నాంధ్రులచే మార్కొనఁబడి యనేకులు సంహరింపఁబడిరి. ఆంధ్రసైనికులు శత్రువులయొక్క యేనుఁగులను గుఱ్ఱములను, ఒంటెలను సర్వస్వమును సంగ్రహించుకొని పోయిరి. మలిక్ తైమూరు తుగ్గీను అను మహమ్మదీయ సేనాపతు లిరువురు ప్రాణములం గోల్పోయిరి. మొదటివాఁడొక యాంధ్రసైన్యాధిపతిచేఁ జెఱఁబెట్టఁబడి యాచెఱలోనే మృతినొందెను. రెండవవాఁడు నఱికివేయఁబడియెను. "మల్లిక్ గుల్ అఫ్ఘన్, మల్లిక్ కాఫుర్" అను వారలనిరువురను తమ సైనికులే చెఱఁగొని, దేవగిరికిఁ దీసికొని పోయిరి. అప్పుడు వీరలదుష్ట ప్రవర్తననుగూర్చి విచారణజరిగి నేరము చేసిన వారిని కనిపట్టి వారిని ఢిల్లీనగరమునకుఁ బంపించిరి. ఈయధికారులు ఢిల్లీనగరము ప్రవేశించినతోడనే బాదుషా "పరిహాసమునకై బ్రదికియుండఁగానే నన్ను పాతిపెట్టినారు గనుక బ్రదికియుండఁగానే వీరిని నేను పాతిపెట్టించుచున్నా"నని చెప్పి యాయధికారుల నందఱను ప్రాణములతోఁ బాతిపెట్టించెను.

అలూఫుఖాను దేవగిరినుండి ఢిల్లీనగరమును జేరునప్పటికి నతనితోఁ గూడ నున్నది మూఁడువేల గుఱ్ఱపుదళముమాత్రమే. ఇట్టి మహాపరాభవమునకుఁ జక్రవర్తియు, వానితోపాటు మహమ్మదీయ ప్రపంచమును మిక్కిలిగ

దుఃఖించిరి. ఇట్టి పరిభవమును దురుష్కులంతకుఁ బూర్వమెన్నఁ డనుభవించి యుండలేదు.

తురుష్కుల కడపటిదండయాత్ర.

ఇట్టి పరిభవమును భరియింపఁజాలక చక్రవర్తి యాగ్రహ మహోదగ్రుఁడై యెట్లయినఁ బగదీర్చుకోవలయునని సంకల్పించి రెండుమాసములలో సైన్యమును సమకూర్పించి అలూఫుఖానునే మరల నాంధ్రదేశముమీఁదికిఁ నంపించెను. ఇంతత్వరలో తురుష్కులు మరలదాడివెడలివత్తురని యాంధ్రులు తలంచి సిద్ధముగనుండలేదు. ప్రసిద్ధ సేనానాయకులు కొందఱింతవఱకే యుద్ధమున మరణమునొంది యుండుటచేత సైన్యములోఁ గ్రొత్తమార్పులను జేయవలసి యుండెను. అట్టిమార్పులు చేసికొనుట కవకాశము లేకపోయినది. కాలము మీఱివచ్చినప్పు డెవ్వరును జేయునది యుండదు. కాకతీయ సామ్రాజ్యము భగ్నమగుకాలము సంభవించెను. ఈశ్వరాజ్ఞ నెవ్వరు గడవ నేర్తురు? కమ్మవారికిని పద్మనాయక వెలమలకును అంతః కలహములు మెండయ్యెను. అయినను నెల్లశాఖలవారును స్వామిభక్తి పరాయణులై యొప్పియుండిరి. మొఱకులగు తురకలు ధైర్యసాహసములు ముప్పిరిగొన బీదరు (విదర్భాపురము) దుర్గమును ముట్టడించి కైవశము చేసికొని క్రమముగా రాజధానీనగరమును ముట్టడించిరి. పూర్వమువలెనే యాంధ్రులు మొక్కవోని పౌరుషముతోఁ దురుష్కులను మార్కొని ఘోరసంగ్రామమును గావించిరి. మహమ్మదీయులు పెక్కుదినములు ముట్టడివేసి చలముపట్టి సాధించి గోడ బ్రద్దలుచేసికొనిపోయి 'హుజ్జాహుజ్ ఖుజ్జాఖుజ్' అను భీకరధ్వని సెలంగ నాంధ్రవీరులతోఁ బిశాచములరీతి హోరాహోరిఁ బోరాడి యొట్టకేలకు సంకుల సమరంబునఁ బ్రతాపరుద్రునిం బట్టుకొనిరి. అతని విడిపింప పద్మనాయకులు, కమ్మవారు, రెడ్డినాయకులు, రాచవారు ప్రయత్నించి

యెంద ఱెందఱో పోరాడిరి గాని యందఱును రణభూమికి దేహములర్పించు కొని వీరస్వర్గమును జూఱఁగొనవలసినవారయిరి. రాజ్యలక్ష్మి కాకతీయులను విడనాడిపోయెను. దైవబలము లేని వట్టిపౌరుషముతో నేమి ప్రయోజనము. శత్రువులు ప్రతాపరుద్రుని కుటుంబ సహితముగా కదర్ ఖాన్, ఖ్వాజాహాజీ అను వారివెంట ఢిల్లీనగరమునకుఁ బంపెననియు, అచ్చటివారు పరమానంద మగ్నులై మహోత్సవము గావించిరనియు మహమ్మదీయ చరిత్రకారులు కొందఱు వ్రాసియున్నారు. కాని యదియంతగా విశ్వసింపఁదగినదిగాఁ గనఁ బడదు. ఏకశిలానగరము మహమ్మదీయుల వశమయ్యెను. అమ్మహానగరము నకు సులతానుపురమని అలూఘఖాను పేరుపెట్టెను. ప్రతాపరుద్రుని చెఱ నుండి ఢిల్లీచక్రవర్తి విడిపించెనని మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియుండ లేదు. గాని హిందువులగాథలుమాత్రము ప్రతాపరుద్రుఁడు కారాగృహ విముక్తుఁడై వచ్చి గోదావరీతీరమునఁ దపస్సు చేసికొనుచుండి మరణముఁ జెందెనని చెప్పుచున్నవి. ఈతని కారావిమోచనమును గూర్చి యొకచిత్రమైన కథ కలదు. ప్రతాపరుద్రుని బ్రాహ్మణ మంత్రియగు యుగంధరుఁడను వాఁడు పిచ్చివాని వేషమును ధరించి ఢిల్లీనగరమున విహరించుచు చక్రవర్తిని మాయఁ జేసి ప్రతాపరుద్రుని విడిపించుకొని వచ్చెనని చెప్పుదురు. కాని యిదియును విశ్వాసపాత్రమైనది కాదు. ఎందులకన మారనకవి తన మార్కండేయపురా ణమునఁ గృతిపతియైన నాగయగన్నమంత్రిని నీతికి యుగంధరునివంటి వాఁడని యభివర్ణించి యుండెను. కనుక యుగంధరుఁడనువాఁ డెవ్వఁడో ప్రతాపరుద్రునకుఁ బూర్వమునందే ప్రసిద్ధికలిగి యుండవలయును. కాఁబట్టి యీకథ కవికల్పనమై యుండును. ప్రతాపరుద్రుని సేనానాయకులలో నొక్కఁడగు రేచెర్లసింగమనాయని పుత్రుఁడు అనపోతానాయఁడు క్రి. శ [illegible] భవ సంవత్సరములో అయ్యనవోలు దేవస్థానములో వ్రాయించిన శాసనములో “రాయబందీవిమోచక” యను బిరుదము వహించినటులు

చెప్పఁబడి యున్నది. ఇతఁడు రాయబందీవిమోచకుఁడని చెప్పుట కాధార మేమియును లేదు. ఆకాలమునను నీతఁడు రాయనిరాజ్య మాక్రమించుకొని పరిపాలించుచున్నవాఁడు. కనుక నితఁడు తన తండ్రియైన సింగమనాయఁడు వహించిన “రాయబందీవిమోచక” యను బిరుదమును అనపోతానాయఁడు వహించియుండును. కాఁబట్టి రేచెర్లసింగమనాయఁడు, అతని సోదరులగు పద్మనాయక వీరులు ప్రతాపరుద్రుని ఢిల్లీకిఁ బంపుటకుఁ బూర్వమె శత్రువు లను జయించి చెఱనుండి విడిపించి యుండవచ్చును. అట్లు కాదేని ఢిల్లీచక్ర వర్తిచేతఁ బడినప్రతాపరుద్రుఁడు బ్రతికి యెట్లు వచ్చును? ప్రతాపరుద్రుని యంతటి వాని చెఱనుండి విడిపించునంతటి యుదారచిత్తుఁడగునేని ఢిల్లీచక్ర వర్తి ప్రతాపరుద్రుని మరల రాజ్యమున కభిషిక్తునిఁ గావించియే యుండును. అట్లు జరిగియుండలేదు. కనుక మేము వ్రాసినదే నిజమైయుండవలయును. ప్రతాపరుద్రుఁడు రేచెర్లసింగమనాయఁడు మొదలగు వారివలన చెఱనుండి విముక్తుఁడైనను ఏకశిలానగరము తురుష్కులయధీనమగుటచేత గోదావరీ తీరమున నెక్కడనో నివసించియుండి యత్యల్పకాలములోనే స్వర్గస్థుఁడై యుండునని మేము తలంచుచున్నాము.

ప్రతాపరుద్రుఁడు మరణము నొందిన వెనుక నాంధ్రసామ్రాజ్యము భగ్నమై యేసైన్యాధిపుని స్వాధీనమం దుండినభాగమున కాసైన్యాధిపుఁడే ప్రభు వని ప్రకటించి యాభాగమును బరిపాలనము జేయుట సంభవించెను. ప్రతాపరుద్రుని ధనాగారాధ్యక్షులగు హరియప్ప, బుక్కప్ప, (హరిహర రాజు, బుక్కరాజు) అనువారు లానెగొందికిఁబోయి తరువాత విజయ నగర సామ్రాజ్యస్థాపకులైరి. రేచెర్లవారయిన పద్మనాయకులు మహమ్మ దీయులతో నేకశిలానగర ప్రాంతదేశమునఁ బెనఁగులాడు చుండిరి. కందుకూరు మొదలుకొని రాజమహేంద్రవరమువఱకును గలదేశమును పంటమహాన్వయు

లైన రెడ్లవశముచేసికొని పరిపాలింపసాగిరి. ఆంధ్రకర్ణాటను లేకమై క్రీ. శ. ౧౩౪౪ వ సంవత్సరమున మహమ్మదీయులను దఱిమి యేకశిలానగర ప్రాంత ప్రదేశమాక్రమించుకొనువఱకు స్వల్పకాల మాదేశము మహమ్మదీయులచేతనే పరిపాలింపఁబడుచుండెనని తేటపడుచున్నది.

ఇటుతరువాతి వృత్తాంత మాంధ్రులచరిత్రములోని మూఁడవభాగమున సవిస్తరముగాఁ దెలుపఁబడును.

రెండవ భాగము

సమాప్తము.

ప్రకటనలు.

ప్రకటననియమములు.

1. మాకు 3000 మంది చందాదారులు కలరు. ప్రతి గ్రంథముయొక్క 4000 ల ప్రతులు అచ్చువేయించుచున్నాము. మాగ్రంథములు స్త్రీలు, పురుషులు చదువుదురు. మాపుస్తకములు కొన్ని యూనివర్సిటీ పరీక్షలకు నియమించియున్నారు. కొన్ని పాఠశాలలలో పఠనీయములుగా ఏర్పరచి చదివించుచున్నారు. ఈగ్రంథమాలకుగల వ్యాపకము మరియే గ్రంథమునకును, ఏగ్రంథమాలకును లేదు. కావున దీనియందు ప్రకటనలు వేయువారికి అత్యంతలాభకారియని మేము వేరుగ వ్రాయనక్కరలేదు.

2. ప్రతిగ్రంథముయొక్క చివర కొన్ని ప్రకటనలు వేయుదురు. ఈప్రకటనలు కేవలము భాషావిషయకములు మాత్రమే యయియుండును. మందులు మొదలగునవి మేము ప్రకటించము. ఆంధ్రభాషలోని స్మృతులు, కావ్యములు, నాటకములు, నవలలు, ప్రహసనములు, దేశచరిత్రలు, వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు మొదలగు వానినిగురించి ఏమి తెలిసికోవలసి వచ్చినను, ఒక్కచోట చప్పున గనుపడునటుల చేయఁదలచినారము. కావున గ్రంథకర్తలు, పత్రికాధిపతులు తమ తమ గ్రంథములును, పత్రికలును, ఇందు ప్రకటించి ఎక్కువలాభమును బడయుదురని నమ్ముచున్నాము.

3. మాప్రకటనల తమ పత్రికలో వేయు పత్రికాధిపతుల ప్రకటనలు మా పుస్తకముల చివర నుచితముగా వేయఁగలవారము.

4. ఇతరులు ఒకసారి ఒకపుట ప్రకటన వేయుటకు రు. 10-0-0లు ఈయవలెను. అరపుటకు 6-0-0 లు. ఒక్కసారి నాలుగుపుటలు వేయువారికి రేటు తగ్గించఁబడును. అరపుటకన్న తక్కువ ప్రకటన తీసికొనఁబడదు.

5. మాకు ప్రతిదినము క్రొత్తక్రొత్త చందాదారులు వచ్చుచున్నందునను, మాగ్రంథములు ఆంధ్రభాషలో శాశ్వతముగ నుండునవి గనుకను ఇందొక సారి ప్రకటన వచ్చినయెడల అది భాషలో శాశ్వతముగనుండును. వారపత్రికల, మాసపత్రికలవలె అప్పుడు మాత్రము చదివి అవల, బారవేయునట్టివి మాగ్రంథములుకావు. గనుక వీనియందు ప్రకటనలు వేయువారికి మిక్కిలి లాభముండునని చెప్పవచ్చును.

మేనేజరు, విజ్ఞానచంద్రిక,
చింతాద్రిపేట-మద్రాసు

సావిత్రి.

హిందూదేశ స్త్రీలకు మహోపయోగకరమగునట్లుగా కాకినాడయందు శ్రీమతి పులుగుర్త లక్ష్మీనరసమాంబగారిచే ప్రకటింపఁబడుచున్న మాసపత్రిక. ఇందు దేశాభివృద్ధికొఱకుఁ బాటుపడు విద్యావతుల జీవితములు, పటములు, పాతివ్రత్యము, సతీధర్మములు, గృహనిర్వాహకత్వము, శిశుపోషణము, చరిత్రాత్మకమైన స్త్రీలజీవితములు, పద్యగ్రంథములు, ప్రహసనములు, ఉపన్యాసములు, పాటలు మున్నగు పలువిషయము లిందుఁ బ్రచురింపఁబడుచుండును. విద్యాధికులగు స్త్రీలు, పురుషులుగూడ నీపత్రికకుపవిలేఖకులుగనున్నారు. విద్య నేర్చుకొనుచున్న చిన్నబాలికలకును, విద్యావతులగు స్త్రీలకును తక్కినవారెల్లరకును, నుపయోగించువిషయము లిందనేకములుండును. దీనిని ప్రతివారు చదువగోరి స్వల్పమగు చందా యేర్పరుపఁబడినది.

సంవత్సరమునకు పోస్టుఖర్చులతో రు. 1-0-0 మాత్రమే.

స్వయంసాహాయ్యము.

(ద్వితీయముద్రణము.)

యంత్రనిర్మాణమునందేమి, శాస్త్రశోధనమునందేమి, మఱియితర ఘనకార్యమునందు నేమి బాల్యమునుండి విసుగువిరామములులేక పడరాని ఇడుములఁబడి స్వయంసాహాయ్యముననే మహోన్నతికివచ్చి ఆచంద్రార్కముగ కీర్తి సంపాదించిన సుప్రసిద్ధులగు పాశ్చాత్య మహాపురుషుల జీవితములిందు క్రోడీకరింపఁబడి యున్నవి.

స్వయంసాహాయ్యమనెట్టిదో నెఱుంగక పరుల ననవరతముఁ బీడించు మన కీగ్రంథమువలన నెన్నియో నూతన విషయములు బోధపడి ఆదర్శములుగా గలవు. ఈగ్రంథపఠనమువలన స్వతంత్రజీవనోపాయము లెన్నింటినో తెలిసికొని స్వకాయకష్టమువలన సుఖింపఁగలము.

ఇయ్యది 'సెల్ఫ్ హెల్ఫ్' అను నాంగ్లేయ గ్రంథమననుసరించి సుప్రసిద్ధులగు శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారిచే మృదుమధురమై మనోహరముగ రచింపఁబడినది. వెలతపాఖర్చులుగాక రు. 0-

వలయువారీక్రింది చిరునామాకు వ్రాయవచ్చును.

మేనేజరు. విజ్ఞానచంద్రికా బుక్కుడిపో
చింతాద్రిపేట మద్రాసు

అపూర్వము! అచ్చులోనున్నది!! హాస్యరసప్రధానము!!!

చంద్రరేఖావిలాపము.

కూచిమంచి జగ్గకవిప్రణీతము.

సుప్రసిద్ధమై, సలక్షణమై, చరిత్రాత్మకమై, నీతిబోధకమై, శృంగార రసప్రధానమై విలసిల్లునిట్టి కావ్యప్రబంధమాంధ్రమున లేదు. "ఈకృతికి సమముగాఁ గృతి నేనరులును జెప్పఁజాలరిది బిరుదము' అని కవియే దీనిని గూర్చి వ్రాసికొని యున్నాఁడు. కనుక వేఱే ప్రశంసింపఁబనిలేదు. గ్రంథకర్త సుభద్రాపరిణయాద్యనేక కావ్యములు రచించిన సుప్రసిద్ధుఁడు; విశేషించి జగత్ప్రఖ్యాతుఁడగు తిమ్మకవిసార్వభౌముని తమ్ముఁడు. ఇందుయసభ్యభాగములు భంగము కాకుండ సవరించి సీ. పీ. బ్రౌన్ దొరగారి యమూల్యపీఠికతోఁగూడ దీని నీజూలై నెలలో ప్రచురించెదము. అంచెకూలిగాక ప్రతికి దీని వెల రు 1-0-0. పది ప్రతులను కొనువారికొకటి యుచితముగా నీయఁబడును. కావలసినవారు ముందే రిజస్టరు చేయించుకొనుట మంచిది.

మాయొద్ద నీ క్రింది గ్రంథములుకూడ వెలకు దొరకును.

1.	నీతికథాసంగ్రహము	రు. 0-4-0
2.	అపూర్వసంఘసంస్కరణము. (అచ్చులోనున్నది.)	0-2-0
3.	కవిత్వోపాయము.	0-1-0

గ్రంథసంపాదకుఁడు: కాళ్లకూరి గోపాలరావు 4 ఆచారప్పన్ లేన్ జార్జిటౌన్, మద్రాసు.

598

598

END OF
TITLE